ప్రహసనములు

గ్రంథకర్త:

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహము

4808

పబ్లిషర్సు

కొండపల్లి వీరవెంకయ్యా అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో

రాజమండ్రి.

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రాజమండ్రి.

S.V.C College
Library,
TIRUPATI.
Acc. No. 8088
Date 5/3/68

విషయ సూచిక

పుట

కనక శునక ప్రహసనము	...	1
మహారసిక ప్రహసనము	...	10
గయ్యాళిగంగమ్మ ప్రహసనము	...	27
ఆత్మగౌరవ ప్రహసనము	...	36
వరదక్షిణ ప్రహసనము	...	51
బధిర తుష్టయ ప్రహసనము	...	64
బలవంత బ్రాహ్మణార్థ ప్రహసనము	...	75
అద్భుతశ్రాద్ధ ప్రహసనము	...	85
కైలాసదూత ప్రహసనము	...	94
ఔషధ ప్రకటనలు	...	105
ధర్మసందేహములు	...	113
కొన్నిపట్టణములలో దొరకునట్టి శ్రేష్ఠమైనవస్తువులు	...	115
కలియుగ యక్షప్రశ్నలు	...	118
సాధారణసంవత్సర పంచాంగశ్రవణము	...	121
సాధారణసంవత్సరములో వృద్ధిక్షయములు	...	123
చామాలమ్మ దర్బారు	...	125
శ్రీరామనవమి పందిరి	...	129
కావలెను కావలెను	...	134

ఆనందసమాజము	...	1
ప్లీడరుతమాషా	...	1
విజ్ఞాపనము	...	15
తోకచుక్క మహిమలు	...	16
విచిత్రమైన మరణశాసనము	...	16
పెండ్లికొడుకుల ధరలు	...	16
వోట్లకై తిరుగుట	...	16
యమధర్మరాజు కచ్చేరి	...	17
దంభసన్యాసి ప్రహసనము	...	18
ముష్టిప్రహసనము	...	19
శవ వహనము	...	19
కాండూరి జానకిరామయ్యగారి పెండ్లి	...	20
చిత్ర సంభాషణ	...	22
సప్తగ్రహ కూటము	...	227
గొప్పవైద్యుడు	...	229
మహాజరు	...	232
ఆకాశ విశ్వవిద్యాలయము	...	235
పెండ్లికొడుకుల లక్షణములు	...	237
జనాభానాటకము	...	241
గ్రంథప్రకటనము	...	262
గొట్టాలమ్మ తాఖీదు	...	266
బ్రహ్మదేవునికి పూజ్యత ఎందుకు లేకపోయెను?	...	271
దంపతుల ముచ్చటలు	...	275

అపూర్వయాచకుడు	...	278
అపూర్వ స్వయంవరము	...	282
నీరాట రేవు	...	295
స్వగౌరవరక్షణము	...	298
దివాలా దేవి వ్రతకల్పము	...	307
చమత్కార సంభాషణ	...	311
గోసాయి చిట్కాలు	...	315
చిత్రమైన తంతివార్త	...	322
ధర్మ పరిపాలనసభ	...	327
తీరుమానములు	...	334
యమలోక వర్ణనము	...	342
అపూర్వ నరకము	...	347
విచిత్ర గోదాన ప్రహసనము	...	357
కనకయ్యపంతులు కంతి	...	368
లండను సంకల్పము	...	389
అద్భుత సంతర్పణ ప్రహసనము	...	391
వింతవింద	...	402
పిశాచవిలాసము	...	407
తుంబుర నారద సంవాదము	...	417
మెట్టవేదాంతము	...	420
పితృదేవతల మహజరు	...	431
మార్కండేయస్వామివారి మనవి	...	434
జీవన్మృతోపాఖ్యానము	...	437

ఆకాశరామన్నోపాఖ్యానము	...	44
పంద్రెండు పండ్లు	...	45
ప్రమాదీచ సంవత్సరఫలము	...	45
నాగరికతా ప్రహసనము	...	45
మహామంత్ర కేసరి	...	46
అపూర్వ యజ్ఞము	...	46
చాకలి పురాణం	...	48
మారీచస్మృతి	...	48
వినాయక విషాదము	...	5(
అపూర్వవేదాంతము	...	5
నారదవిలాపము	...	5
బ్రహ్మదేవుని యజ్ఞానము	...	5
లోభి పిశాచనము	...	5
ప్రశ్నలు	...	5
దశమగ్రహము	...	5
కటుకుల గంగయ్య	...	5
కలిగీత	...	5
అద్భుత కవిత్వము	...	5
రాక్షస సంవత్సర పంచాంగము	...	6
షడకగది ముచ్చటలు	...	6

శ్రీ ర స్తు.

చిలకమర్తి లక్ష్మీనరసింహకవి జీవితసంగ్రహము.

బాల్యదశ - విద్యాభ్యాసము.

బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు క్రీ॥ శ 1867 సం॥రము సెప్టెంబరు నెల 26 తేదీకి సరియైన ప్రభవసంవత్సర భాద్రపద బ ౧౪ నాఁటిరాత్రి ప్రస్తుతము పడమటిగోదావరీ మండలమునందలి తణుకుతాలూకాలోనున్న ఖండవల్లిగ్రామమున, మాతామహగృహమున జన్మించిరి. ఈయన యారామద్రావిడశాఖలోఁ జేరిన వైదికబ్రాహ్మణుఁడు. ఋగ్వేది, ఆశ్వలాయనసూత్రుఁడు, కాశ్యపగోత్రుఁడు. ఈయనతాతగారిపేరు పేరుభట్టు. వ్యవహారములో నీయన పేరయ్యయని చెప్పఁబడుచు వచ్చెను. తండ్రిగారిపేరు వెంకన్నగారు. తల్లిగారిపేరు రత్నమ్మగారు. లక్ష్మీనరసింహంగారి పితామహుఁడు పేరుభట్టుగారు మొదట గుంటూరుమండలమందలి యద్దంకిసీమలో నేదోయొకగ్రామమున నివసించుచు 1830 సం॥ర ప్రాంతమున నచ్చట గొప్పకాటకము రాఁగాఁ దనకుటుంబముతోఁ గూడ గోదావరీప్రాంతమున వసింపఁదలఁచి మొట్టమొదట మొగలితుర్రుగ్రామమునఁ గొంతకాలముండి, పిమ్మట వీరవాసరగ్రామముఁ జేరిరి. కాఁబట్టి లక్ష్మీనరసింహముగారిది ప్రస్తుతము పడమటి గోదావరీమండలములోభీమవరముతాలూకాలోనున్న వీరవాసరము నివాసస్థానము.

ఈయన పితామహుఁడు వైదికవృత్తిచేత జీవించెను. తండ్రి వెంకన్నగారు వైదికవృత్తి నవలంబింపక మొదటినుండియుఁ జక్కఁగా వ్రాయుట, చదువుట, లెక్కఁకట్టుట నేర్చుకొని, యచ్చటి తాలూకాకచ్చేరిలోఁ గొంతకాల ముద్యోగము చేసి, వేషభాషలచేతను వృత్తిచేతను లౌకికుఁడై జీవయాత్ర గడపెను. లక్ష్మీనరసింహముగారి తల్లి రత్నమ్మగారు, ఖండవల్లిగ్రామీణుఁడును సంస్కృతాంధ్ర సారస్వతపారీణుఁడును, నుభయభాషాకవితావిశారదుఁడును నగు పురాణపండ భద్రయ్యశాస్త్రిగారి రెండవకూఁతురు. ఆంధ్రగీర్వాణవాఙ్మయ ధురంధరుఁడై యమలాపురము, తణుకు మొదలగు తావులయందె గాక పిఠాపురమునందును జాలకాలమున్నతపాఠశాలలో నాంధ్రోపాధ్యాయుఁడుగానుండి శ్రీపిఠాపురముమహారాజాగారగు శ్రీరాజారావువేంకటకుమారమహీపతిసూర్యారావుబహద్దూర్ వారి యాస్థాన

పండితులై యనేకాంధ్రప్రబంధములకు వ్యాఖ్యానములు రచించి, యాంధ్ర బ్రహ్మసూత్రభాష్యకర్తయై వాక్చాతుర్యమునకు సౌజన్యతకుఁ బేరుపడి యాంధ్ర మండలమునందు విశేషకీర్తిని గాంచిన శ్రీపురాణపండ మల్లయ్యశాస్త్రిగారు లక్ష్మీనరసింహముగారికి మేనమామ.

చిలకమర్తి వెంకన్నగారి పురుషసంతానములో లక్ష్మీనరసింహముగారే జ్యేష్ఠులు. ఈయన చిన్ననాఁడు వీరవాసరములో మొదటి నాలుగుతరగతులు చదివి యప్పటిపరీక్షాధికారియగు నల్జ్గాండర్ మన్రోదొరగారివల్ల మంచియింగ్లీషు నిఘంటువును బహుమానముగఁబడసి మిడిల్‌స్కూలుపరీక్షకు జదువుటకై నరసాపురమునకుఁబోయి యచ్చట మిషనువారి పాఠశాలలో 1882 సంవత్సరప్రారంభమునఁ జేరెను. ఆసంవత్సరమే మిడిల్‌స్కూలుపరీక్షయందుఁ గృతార్థుఁడై పైతరగతిలో 1883 సం॥రమునఁ జేరి చదివెను. అచ్చట బ్రహ్మశ్రీ యేలేశ్వరపు వెంకటప్పయ్యశాస్త్రిగారు వీరికాంధ్రభాషాగురువులైరి. కవిత్వము చెప్పవలెనను నభిలాష 1883 సం॥రమున జనించెను. అందుచే ఛందశ్శాస్త్రము నేర్చుకొనవలెనని ఛందోవిషయసారసంగ్రహమను లక్షణగ్రంథమును జదివిరి. 1884 సం॥రమున మేనమామగారైన బ్ర॥శ్రీ॥ పురాణపండ మల్లయ్యశాస్త్రిగారు రాజమహేంద్రవరములోనున్న యిన్నీసుపేట పాఠశాలలో నాంధ్రోపాధ్యాయులై, మేనల్లుని దమ వెంటఁ బెట్టుకొని వచ్చిరి. 1885 సం॥రమున లక్ష్మీనరసింహముగారు దొరతనమువారి కళాశాలలో మెట్రిక్యులేషను తరగతిలోఁ జేరిరి. అట్లుచేయుట చేత మహనీయులైన రావ్‌బహద్దూర్ కందుకూరి వీరేశలింగము పంతులుగారి యొద్దను, వావిలాల వాసుదేవశాస్త్రిగారియొద్దను, ప్రకృతిశాస్త్ర పండితులైన శ్రీరంగాచార్యులుగారి యొద్దను శిష్యుఁడై విద్యాభ్యాసము చేయుట కవకాశము గలిగెను.

కాని యా సంవత్సరాంతమున గవర్నమెంటువారి కళాశాలలో మెట్రిక్యులేషను తరగతి దీసివేయఁబడుటచే మఱియొక పాఠశాలలోఁ జేరి చదివిరి. ఆ పాఠశాలకు బ్ర॥శ్రీ వేదం వెంకటాచలంపంతులుగారు ప్రధానోపాధ్యాయులై యుండిరి. మేనమామగారైన మల్లయ్యశాస్త్రులుగారే యక్కడ నాంధ్రోపాధ్యాయులు. అందుచే మల్లయ్యశాస్త్రిగారి కాయన మేనల్లుఁడగుటయేగాక శిష్యుఁడుగూడ నయ్యెను. 1887 సంవత్సరమునఁ బ్రవేశపరీక్షయం దాయన కృతార్థుఁడయ్యెను. కళాశాలలో ప్రథమశాస్త్రపరీక్షకుఁ బట్టపరీక్షకుఁ జదువవలెనని కుతూహల మాయనకు మెండుగ నుండెనుగాని, ప్రధానమగు గణితశాస్త్రమునం దభిరుచి లేకపోవుటయు, నేత్రబాధ యప్పటికే జనించుటయు నాయన నీ సంకల్పమునుండి మరల్చెను.

ఉద్యోగము

1889 సంవత్సరమున మేనమామగారికి జబ్బుచేయుటచేత, లక్ష్మీనరసింహముగా రదివఱకే తెలుగులోఁ గొంతపాండిత్యము సంపాదించియున్న కతన వారి స్థానమున నాంధ్రోపాధ్యాయులుగా నిన్నిసుపేటలో నియమింపఁబడిరి.

1889 సం॥రము ప్రారంభమున రాజమహేంద్రవరము నందలి కొందఱు మిత్రులు ప్రాతయూరునందొక యున్నతపాఠశాల స్థాపింపఁదలంచి "ఆర్యన్ హైస్కూల్" అను పేర నొకదానిని నెలకొల్పిరి. లక్ష్మీనరసింహముగా రందులో నాంధ్రోపాధ్యాయుఁడుగా నియమింపఁబడి చిన్నతరగతుల కాంగ్లేయభాషయుఁ బెద్దతరగతులకు నాంధ్రభాషయు నేర్పుచుండిరి. కాని యీ పాఠశాల వేసవి కాలపు సెలవులనాటి కంతరించెను. 1892 సం॥రము జూలై నెలలో నిన్నిసుపేట స్కూలులో నీయన సహాయోపాధ్యాయుఁడుగా నియమింపఁబడి 1893 సంవత్సరాంతమువఱకు నందుఁ బనిచేసెను.

1894 సంవత్సర ప్రారంభమున గవర్నమెంటువారు రాజమహేంద్రవరమున ట్రెయినింగు కాలేజిని స్థాపించిరి. ఈ పట్టణములోనున్న పాఠశాలలన్నియుఁ దానిలోఁ గలుపఁబడుటచే వీరియుద్యోగము పోయెను. అప్పుడు మరల నాలుమాసములవఱ కేయుద్యోగము లేక, యీ సంవత్సరము జూలయినెలలో ట్రెయినింగు కాలేజిలో సెకండరీగ్రేడు ట్రెయినింగుతరగతిలోఁ జేరిరి. 1895 సంవత్సరము ఏప్రెలునెలతో నచ్చటివిద్య సమాప్తముకాఁగా, నూతనముగ స్థాపితమైన మ్యునిసిపల్ స్కూలులో వీరు మూఁడవయుపాధ్యాయులుగా నియమింపఁబడిరి. ట్రెయినింగయినతరువాత జరిగెడు వ్రాతపరీక్షలో లక్ష్మీనరసింహముగారు కృతార్థులైరి. కాని నేత్రావరోధముచేత రెండవదియగు ప్రాక్టికలుపరీక్షలోఁ గృతకృత్యులగుట కష్టమని దానివిషయమై ప్రయత్నము చేయులేదు. ఆ పరీక్షకుఁ గూడ వెళ్లవలసినదని పరీక్షాధికారులు నిర్బంధించిరి. అందుచే మ్యునిసిపల్ మిడిల్‌స్కూలులో 1898 సం॥రము ఆగష్టువఱకు నరఁగా మూఁడుసంవత్సరములు మూఁడుమాసములు పనిచేసి యీ యుద్యోగము నాయన వదలుకొనిరి.

కీ॥ శే॥ శ్రీ పోలవరము జమీందారు గారును, లక్ష్మీనరసింహము గారును బాల్యమిత్రులగుటచే వారు సరస్వతియను మాసపత్రికను నెలకొల్పి దాని కుపసంపాదకుఁడుగా లక్ష్మీనరసింహముగారి నేర్పఱచిరి. కాని జమీందారు గారికిని వీరికి నభిప్రాయభేదములు గలుగుటచేత 1899 సంవత్సరములో వీరు సరస్వతీపత్రికతో సంబంధముగూడ వదలుకొనిరి.

బోసి కొంతకాలము రెండుపత్రికలను నడపిరి. గణపతి, రాజరత్న మనునవల రఘువంశమున కనువాదమగు రఘుకులచరిత్ర మనువచన ప్రబంధమును, సి చరిత్రయు, భాసమహాకవికృతనాటకములలో నైదింటి యాంధ్రీకరణములును డవటూరి వెలువడిన మనోరమలోఁ బ్రకటింపఁబడెను. ఇంతకుపూర్వమె మధ్ వ్యాయోగమును స్వప్నవాసవదత్తయు నాంధ్రీకరింపఁబడినవి. ప్రచ్ఛన్నపాం మను వచనప్రబంధమును, రామకృష్ణపరమహంసచరిత్రయు, కాళిదాసచరిత్ర పత్రికాముఖమునఁగాక ప్రత్యేకగ్రంథరూపమున వెలువడినవి భాగవతకథామం ప్రహ్లాదచరిత్ర, కర్పూరమంజరియొక్క రెండవభాగము నముద్రితములు ప్రత్యేకించి షష్టిపూర్తిముద్రణమునకై వ్రాసిరి.

నాటకములు నవలలు మాత్రమే గాక లక్ష్మీనరసింహముగారు కొన్నిప కావ్యముల రచించిరి. కాని యవి పూర్తికాలేదు. 1895 సం॥రమున పృథివీరాజీ మను ప్రబంధమును వ్రాయ నారంభించిరికాని పూర్తిచేయలేదు. ఇట్లే హరిశ్చం నాటకమున నొకయంకము మాత్రము వ్రాసి చాలించిరి. దీనకల్పద్రుమ మనుభ రసప్రధానమగు శతకమున నలువదిపద్యములవఱకు వ్రాసి మనోరమలోఁ బ్రకట చిరి. ఇవిగాక వీరుసమయస్ఫూర్తిగా చాటుధారగఁ జెప్పినపద్యములు గూడగల అందు ప్రథమగోదావరీమండలసభలోఁ జదివిన పన్నులపద్యములును, పకోడీ పైనఁ జెప్పినపద్యములును స్వదేశోద్యమము నూతనముగఁ దలయెత్తినప్పుడు జెప్పి "భరతవర్షంబు చక్కని పాడికావు" మన్నగు పద్యములును నాంధ్రదేశము నెక్కుడు ప్రచారములోనున్నవి. వీరి పద్యకావ్యములలో న్యాపతి సుబ్బారా గారి ప్రోత్సాహమువలన వ్రాసిన వాల్మీకిరామాయణసంగ్రహ మొకటియె సమ ముగ నిలిచి యున్నది.

చిన్నవి పెద్దవి గలిసి రమారమి యేబది గ్రంథములకు లక్ష్మీనరసింహముగా కర్త. వీనిలోఁ జాలభాగ మాంధ్రమహాజనుల నాకర్షించి వారి గౌరవప్రేమా శయములకు బాత్రములైనవి. గయోపాఖ్యానము సుమారు లక్షప్రతులు చెల్లినవి నవలలలో హేమలత పెక్కుముద్రణముల నందుటయేగాక ఇంగ్లీషు, కన్నడము ఓఢ్రభాషలలోనికిఁ బరివర్తనము చేయఁబడినది. తెలుఁగువాఙ్మయమున గద్యకావ్య ములు సకృతుగ నున్నకాలములో నాబాలగోపాలము నాకర్షించి మనోహరముగ సులభశైలిలో వ్రాసిన లక్ష్మీనరసింహకవికృతు లాంధ్రసారస్వతమునకు మహోప కారముఁ జేసినవనుట యతిశయోక్తి కాదు.

వి ద్యా వ్యా ప క ము

దానములలో నన్నదానమువలె విద్యాదానము గూడ సర్వోత్కృష్టమయినదని లక్ష్మీనరసింహముగారి నమ్మకము. తమ గ్రంథముల వలననే గాక పాఠశాలలను స్థాపించి విద్యావ్యాప్తి చేయుటకుఁ బ్రయత్నించిరి. 1899 సంవత్సరారంభమున "హిందూ లోవర్ సెకండరీస్కూల్" అను పేర నొక పాఠశాలను స్థాపించి తొమ్మిదిసంవత్సరములు దాని నవిచ్ఛిన్నముగ నిర్వహించిరి. ఈ పాఠశాలలో నూటికి నలుబదిమంది బాలురుచితముగ విద్యాభ్యాసముఁ జేయుచుండిరి. ఈ పాఠశాలను నిర్వహించుటలో లక్ష్మీనరసింహముగారికిఁ గొందఱు మిత్రులు తోడ్పడిరి. అందు ముఖ్యముగఁ దక్కువజీతమున నుపాధ్యాయత్వము నంగీకరించిన కుందూరు వెంకటరత్నముగారికిని, ఆగర్భశ్రీమంతు లయ్యును శ్రమయనక వేతనముఁ బుచ్చుకొనకయె యేడుసంవత్సరములు ప్రధానోపాధ్యాయులుగ నుండి పాఠశాలను మిక్కిలి యభివృద్ధిలోనికిఁ దెచ్చిన కీర్తిశేషులగు సత్యవోలు లక్ష్మీపతి గారికిని వారు యావజ్జీవము కృతజ్ఞులుగా నుండఁగలరు.

1906 సంవత్సరములో కీ॥ శే॥ వీరేశలింగము పంతులుగా రొక యాస్తిక పాఠశాలను స్థాపింపనుద్యుక్తులై లక్ష్మీనరసింహముగారి స్కూలు నీయవలసినదని కోరిరి. అందుకని 1907 సం॥ సెప్టెంబరు 16 తేది పరికరములతో సహా తమపాఠశాల నుచితముగ వీరేశలింగముగారి వశముచేసిరి. అది కొంతకాలము హితకారిణీ హైస్కూలను పేర వర్ధిల్లి యిప్పుడు శ్రీపిఠాపురము మహారాజావారి యౌదార్యము రూపముదాల్చినట్లు వెలయుచున్న దివ్యభవనమున వీరేశలింగము హైస్కూలను పేరుతో దినదినాభివృద్ధిఁ గాంచుచున్నది.

ప్ర జా హి త జీ వ న ము.

లక్ష్మీనరసింహముగారి కెప్పుడు వైదికమతకర్మలయం దాసక్తి యున్నట్లు తోఁచదు. శ్రోత్రియవంశములోఁ బుట్టినందున గర్భాష్టకాలు దాటకమునుపె యుపనయనము జేసిరి. కాని తనస్నేహితుఁడగు నొక యంబష్టసూనునకు గాయత్రీమంత్రోపదేశము చేయుట జూచి గురువుగారు లక్ష్మీనరసింహము గారికి సంధ్యావందనము జెప్పుటమానిరి. వేదమంత్రార్థము సర్వజనగ్రాహ్యముఁ గావలెనని వారి యూహ. అందుకనె వృద్ధాప్యములో వేదముల నాంధ్రీకరించుటకు గమకట్టిరి. కాని యా ప్రయత్నము కొనసాగలేదు.

పాశ్చాత్యనాగరకతానుగుణ్యముగ సంఘసంస్కరణమన్నను మతసంస్కరణమన్నను నిమ్నజాత్యుద్ధరణమన్నను వీరి కభిమానము మెండు. వీరేశలింగము గారితోను రఘుపతి వెంకటరత్నమునాయుడు గారితోను వీరికిఁ గలిగిన సాంగత్యమిందుకుఁ గారణమైయుండును. 1895 సంవత్సరమున లక్ష్మీనరసింహముగారు బ్రార్థనసమాజములోఁ జేరిరి. వీరేశలింగము గారికి వీరియెడఁగల విశ్వాసమునుబట్టి వారు స్థాపించిన హితకారిణీ సమాజములో వీరిని యావజ్జీవసభ్యులుగ నియమించిరి. ఇప్పుడా సమాజమునకు వీ రుపాధ్యక్షులు.

నిమ్నజాత్యుద్ధరణమునకై వీరు పలువిధములఁ బాటుపడిరి. వారికై ప్రత్యేకమొక పాఠశాలను 1909 సం॥రమున స్థాపించి 13 సంవత్సరములు జయప్రదముగ నడిపిరి. దొరతనమువారి గ్రాంటులకుఁదోడుగ శ్రీపిఠాపురముమహారాజావారీ పాఠశాల నిమిత్తము విరివిగ ధనసహాయ్యముఁ జేసిరి. ఇట్టియుపపత్తు లుండినను బోషించుట దుర్భరమగుటచేతఁ బాఠశాలను 1922 సం॥రములో నిలిపిరి. కాని యీ పాఠశాలలోఁ జదివిన పలువురు నిమ్నజాతియువకులు గౌరవముగ జీవనము జేయుచున్నారు.

సంఘసంస్కరణమే గాక రాజకీయ సమస్యలయందు వీరి కభిరుచిగలదు. దేశీయమహాజనసభయం దభిమానము గౌరవము గలదు. నాలుగైదు సభలకుఁ బ్రతినిధిగ వెళ్ళిరి. 1914 సం॥రమున మద్రాసులో జరిగినసభలో దక్షిణాఫ్రికాసమస్యపై నాంధ్రమున మాట్లాడిరి. అప్పుడే మనరాజధానికి గవర్నరుగ నుండిన పెంట్లెండుప్రభువు వీరికిదర్శనమిచ్చి జ్ఞాపకార్థము "ఆప్టిమిజమ్" అను నింగ్లీషు పుస్తకము నొసంగిరి.

ముగింపు

ఒకటిరెండు చిల్లరవిషయములతో నీ జీవితసంగ్రహమును ముగింపవచ్చును. "గతిలేని దేవుఁడు మతియిచ్చె" ననుకీతిని దృష్టిలోపమును గూడదీయుటకో యనునట్లు మొదటినుండియు లక్ష్మీనరసింహము గారికి జ్ఞాపకశక్తి విశేషముగఁ గలదు. చిన్ననాఁటి సమాచారము లిప్పుడు పూసగ్రుచ్చినట్లు తేదీవారిగాఁ జెప్పఁగలరు. క్రొత్తపద్యముల నొకపర్యాయము విని యప్పచెప్పెడి యలవాటు గలదు. ఈయేకసంతగ్రాహిత్వమునకు మెచ్చి వడ్డాది సుబ్బారాయకవి వీరికి ఫోటోగ్రాపని పేరు బెట్టిరి. వీరికి విద్యార్థిదశలోనే నేత్రముల కవరోధము గలిగినను, పగలు మాత్రము వ్రాయుటయుఁ జదువుటయుఁ గొంతకాలమువఱకు నుండెడిది. కాని 1905 సంవత్సరమునుండియు వీరిగ్రంథములు గుమాస్తాలను బెట్టి వ్రాయింపవలసి వచ్చెను.

17 / 1867 / 36

ప్రహసనములు

కనకశునక ప్రహసనము

[అంతట కామశాస్త్రిలు ప్రవేశించుచున్నాడు]

కామ—(తనలో) రామదీక్షితులు చాలపొగరుపట్టియున్నాడు తని పొగరణచుటకు నా కుపాయము కనబడకున్నది. ఈ గ్రామ ంతకు నేనే ధర్మశాస్త్రములు తెలిసినవాడనని పేరుబడుటచేత ంద రుద్యోగస్థులు, వర్తకులు, బ్రాహ్మణులు, మైలవచ్చినను, రుకు వచ్చినను, తిథిప్రయోజనముల విషయమై సందేహము దోచి ను నన్నేవచ్చి యడుగుచుందురు. రామదీక్షితులుమాత్రము నన్ను చ్చి చూడడు. నన్నొకపెద్దగా అంగీకరింపడు నన్ను చూచి ప్పుడు పలుకరింపడు. ప్రజలకందరకు ఆతడు మంచివాడని, పెద్ద నుష్యుడని గౌరవము. అతనిని వంచనచేయవలయునంటే వీలు నబడకున్నది. ఊరుకుందామంటే వీడు క్రమక్రమముగా గ్రామ ములో నాగోష్యము చెడగొట్టి తానే మొనగాడయి కూర్చుంటా మోనని భయముకలుగుచున్నది. కానీ సమయము దొరుకక వునా, వీడిజుట్టు నాచేతిలో చిక్కకపోవునా, దొరకినాడంటే ముక్కు నేలబెట్టి రాసివేసి దుంప తెంపివేస్తాను.

[అప్పుడు రామదీక్షితులు ప్రవేశించుచున్నాడు]

రామ—(తనలో) ఈవిషయములో కామశాస్త్రి ధర్మశాస్త్ర లాగున చెప్పునో చూడవలయునని యున్నది. ఈయనగారి పాండి

త్యము యీయనగారి నిష్పక్షపాతము యీదెబ్బతో గ్రామ మంద రికి తెలియవలయును. అదుగో స్నానము చేసివిభూతిపెండికట్లు పెట్టు కొని శాలువ గప్పుకొని బకధ్యానము చేయుచు కామశాస్త్రి చాప మీద కూర్చున్నాడు. ఎవరి కొంప తీయవలయుననియో ఆలోచించు చున్నాడు. (ప్రకాశముగా) కామశాస్త్రిగారూ! నమస్కారము.

కామ——ఓహోహో రామదీక్షితులుగారా! ఇదేమిటియెన్నడు లేనిది మాయింటికి దయచేసినారు? ఊరక రారు మహాత్ములు. ఏదో పనియుంటేనేగాని, మాగృహపావనము చేయరు. దయచేయండి.

రామ——కొంచెము పనిమీదనే వచ్చినాను. మీదర్శనం చేయకుండా గ్రామములో గడచునా? చిన్న సందేహ మొకటివచ్చి మీ ముఖతః తెలుసుకో వలయునని వచ్చినాను సెలవైతే మనవి చేస్తాను.

కామ——అబ్బబ్బ! మీకు సందేహము తోచడము, నేను తీర్చ డమునా! నేనెంతవాడను! తీర్చుటకు అన్నింటికి మీరేయున్నారు. నాగోస్యము నాపాండిత్యము మీకు లక్ష్యమా! ఊరందరకు మీరే గురువులై యున్నారు. నాకు సందేహములు తోచినపుడు నేను మిమ్ములనే అడుగవలసియున్నది. నాలుగురోజుల క్రిందట పేరిశెట్టితో కామశాస్త్రిగారి కేమి తెలుసునని మీరన్నారటగాదూ, తెలియని వారి వద్దకు మీరెందుకు వచ్చినారు.

రామ——అయ్యా! మీరు మంత్రసాని దెప్పలు దెప్పుతారని నే నెరుగుదును. కాని సందేహము వచ్చినపుడు అడుగకమానరాదు. పేరిశెట్టితో కామశాస్త్రిగారి కేమి తెలుసునని నేనన లేదు. నేను అట్లన్నట్లు మీరు ఋజువుచేసినట్టయితే మీరుకోరిన గునహాయిస్తాను.

కామ——సరే దానికేమి; అంది తేజుట్టు లేకపోతే కాళ్ళుగదా; మీకవసరంవుంటే మీరువచ్చి నచ్చికలు మచ్చికలువేసి మాట్లాడు

తారు; లేకపోతే మొగమే చూడరు. ఇంతకు మీసందేహమేమిటో చెప్పండి.

రామ—చెప్పతానుగాని ఆవిషయమయిమీతో మనవిచేయుటకే సిగ్గుగానున్నది. అయినప్పటికి చల్లకువచ్చి ముంతదాచడ మెందుకు! మాఅబ్బాయి మరికొందరు పిల్లలుకలసి నిన్నసాయంకాల మాడకుక్కనొకదానిని తీసుకొనివచ్చి దానిపాలు పితికి తాగినారు. రాత్రి నేను తిరిగితిరిగి యింటికి వచ్చినతరువాత మావాళ్ళు నాతో ఈసంగతి చెప్పినారు. విన్నప్పటినుండి నాకెంతో విచారముగా నున్నది. దీనికేదయినా ప్రాయశ్చిత్తమున్న దేమోచూచి మీరు చెప్పవలయును.

కామ—(తనలో) వహవా! ఆడబోయిన తీర్థ మెదురయినది. ఇప్పుడేవీడు నాచేత జిక్కినాడు. వీనినిముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించెదను. నాశక్తి యెటువంటిదో వీనికిప్పుడు చూపించి తీర్తాను. వీడిపెద్దలు దిగివచ్చినా యిక వీడు తప్పించుకో లేడు (ప్రకాశముగా) దీక్షితులుగారు! ఎంతపని జరిగిందండి! మీవిషయమయి నాకుచాలా విచారముగానున్నది. మీవాడు ముక్కిలి కుఱ్ఱవాడు కాబోలు.

రామ—అవునండి బొత్తిగా కుఱ్ఱవాడు ఎనిమిదవయేడు.

కామ—అందుకనే నాకు చాలా విచారముగానున్నది. ఈపాపమునకు ప్రాయశ్చిత్తములు చాలాగొప్పవియున్నవి. ధర్మశాస్త్రమునకు పిల్లవాడు పెద్దవాడు అనేభేదంలేదు. శాస్త్రములకు జాలియుండదు.

రామ—శాస్త్రములో నున్నదానికి మీరేమి చేయగలరు. ఉద్దదేమిటో చెప్పండి.

కామ—చెప్పటకు నాకు నోరేరావడం లేదండి; ధర్మశాస్త్రకర్తలు బొత్తిగా లౌక్యమెరుగరు. వారికి పైదృష్టేగానిలోదృష్టి లేదు

రామ—ఎందుకయినా మేము సిద్ధముగానే యున్నాము. కాబట్టి శెలవియ్యండి.

కామ—(తనలో) వీడు కూర్చున్నపళముగా కుంగిపోయ్యేటట్టు చెప్తాను. పిడుగుమొత్తినట్లు చెప్పితేనేగాని వీడిరోగము చప్పగా కుదరదు. ఈదెబ్బతో వీని తెగనీలుగణిగి కాళ్ళబేరమునకురావలయును (ప్రకాశముగా) కుక్కపాలు త్రాగినవాని నాలుక మొదలంట కోసివేయవలెనని ధర్మశాస్త్రకర్త లందరిలో శిఖామణియని చెప్పదగిన శాకటాయనులవారు చెప్పినారు ఎఱ్ఱగాకాలిన యినుపముక్కతో నాలుక కాల్చివేయవలసినదని భాండాయనుల వారు చెప్పినారు. ఈ రెండిటిలో మీయిష్టము యేదిచేసినాసరే. లేకపోతే ఆపిల్లవాడు మాలవాళ్ళలో కలసిపోవలసినదేగాని మనకు పనికి రాడు.

రాము—హరిహరి ఎంతమాటండి చంటిపిల్లవాడు. ముక్కుపచ్చలారనివాడు వాడినాలుక చూచి చూచి కోసివేయగలమా. ఇనప ముక్కతో కాల్చగలమా పెద్దవాళ్ళకయినా అటువంటి పని చేయలేము చిన్నపిల్లలకా అటువంటిశిక్ష; ఏదయినాప్రాయశ్చిత్తము మనకు శక్యమయింది యుండవలెను. అసాధ్యాలు యెవరు చేయగలరు.

కాము—(కోపముతో) ఏమిటి! అసాధ్యాలా ? కొడుకుచేసిన పనులు బాగున్నాయి. పిల్లలను వెధవపెంపులు పెంచి శూద్రసహవాసాలు జేయించి మాలకుంకలులాగతిరగనిచ్చి కుక్కపాలు పందిపాలు తాగించి పైగా మెట్టపంచాంగాలు చెపుతారేమిటి. ధర్మశాస్త్రమా మజాఖా, శాస్త్రమంటే మనరేవులో స్నానంచేసే బోడిముండలకు సంకల్పము చెప్పడమనుకున్నారాయేమిటి; ఓలంటేధంరాని పీనుగులందరుకృత్తనాలు వహించబట్టేగ్రామము యీలాగు తగులడుతూవుంది. లేకపోతె యేవాడయినా కుక్కపాలు త్రాగడమెరుగుదుమా? కలిధర్మము మండిపోతూ వున్నది. ఈలాగు పూర్వము మాతాతగారు

శూద్రదానిచేత పాలిప్పించిన బ్రాహ్మణులందరిని వెలివేయించినారు. ఆరోజులే పోయినాయి. ఆసదాచారాలు చట్టుబండలయిపోయినాయి. శాస్త్రిలలో నున్నమాటజెప్పితే నీకంతపుస్సెందుకు? మీకిష్టమయితే ఆలాగు చెయ్యండి. లేకపోతే మానెయ్యండి.

రామ—కామశాస్త్రిగారు! మీరింత కోపపడడానికి నేనేమ న్నానండి ధర్మశాస్త్రం చాలాకఠినముగా నున్నదన్నాను. ఆ మాట మీరుకూడా ముందే సెలవిచ్చారు. గర్భవాసమవుటచేత చూచిచూచి కుఱ్ఱవాడినాలుక తెగ్గొయ్యలేక పామరత్వంచేతను అలాగన్నాను. అందులో ఏమయినా తప్పంటే క్షమించి యింతకంటె తక్కువ ప్రాయశ్చిత్త మేమన్నాయుంటే శెలవివ్వండి. పసిపిల్లవాడు గనుక కొంచెము కరుణించండి.

కామ—ఓహోహో కరుణించేటందుకు నా శెలవటయ్యా యిది నాచిత్తముగనుకనా నేనేదో విధముగా జెప్పనా; ధర్మము లంటే కత్తిమీదసాములు. ఋషిముండా కొడుకులు వ్రాసిపెట్టిన మాటలు చెప్పినానుగాని నా స్వంతకవిత్వం చెప్పడములేదు. కరుణించేటందుకు నేనెవడని.

రామ—తమరు కరుణించి యింకా యితరగ్రంథాలు చూడ వలసినదని నేను కోరినాను. దీనికి రెండవపక్షం యేదయినా యుండక పోదు. తమరు కష్టపడి వెతకండి.

కామ—వెతకడమెందుకు శాస్త్రిలన్ని నాకు హృత్కవిలిగా రానేవచ్చును. ఈమాత్రపు మహద్భాగ్యానికి పుస్తకాలు వెతుక వలయునా.

రామ—ఇటువంటిశాస్త్రార్థములుమీనాలుకచివర వుంటాయి అని నే నెరుగుదును. అందుకే పక్షాంతరము చెప్పచున్నాను. ఆశక్తుల విషయాల్లో శాస్త్రిల్లో మినహాయింపు యుండకపోవు.

రామ.—ఉండకపోవు. ఋషులు గూడా తెలివైన ముండా కొడుకులు గాని చచ్చుఘటాలుగారు. సూత్రమేర్పరచేటప్పుడు దేశ కాలపాత్రాలు చూచేవేస్తారు వాళ్ళు. దీనికొక పక్షాంతరమున్నది. కుక్కపాలు తాగినవాడు యిరవయితులాల బంగారం తెచ్చి బంగారపు కుక్కను జేయించి ధర్మశాస్త్రిలు తెలిసిన బ్రాహ్మడికి దాన మిచ్చి శివాలయములోకి వెళ్ళి అభిషేకం జేసి నూటయెనమండుగురు బ్రాహ్మణులకు సంతర్పణచేయవలయును. అంతపనిచేస్తే యీ పాపం పోతుందన్నాడు. లేకపోతే అటు యేడుతరాలు యిటు యేడుతరాలు పద్నాలుగు తరాలు పట్టి పీడిస్తుందన్నాడు. పాపమా మరొకటియా యీలాగున పాపపరిహారం చేసుకోకపోతె యింక నీకు గతుల్లేవు.

రామ.—శాస్త్రిగారు! దానికంటె యిది నయమేగాని నాకున్న ఆస్తిఅంతాపోగుజేస్తె పదితులాలుబంగారం కిమ్మతుచెయ్యదు. మాకున్న భూములు రుద్రభూములే. దొప్పెడుయిల్లుమాత్రమున్నది. అది తాటాకుది. అమ్మితే రెండువందల రూపాయలకన్న యెక్కువ రాదు. పాత్రసామాగ్రి అంతా పోగుజేస్తే యాభయిరూపాయలుండదు. నా భార్య ఒంటిమీద నగ లేమున్నవో మీకే తెలుసు. అరుంధతీ దేవిలాగ బొందితోనున్నదని నేను చెప్పనక్కర లేదు. యిటువంటి స్థితిలో యిరవయితులాల బంగారము యెక్కడ తేగలను. నూటయెనిమిదిమంది బ్రాహ్మణులకు అన్నమెక్కడ బెట్టగలను. యిది నా తరమా నా అబ్బతరమా.

శామ.—మీపనంతా ఆటగానుంది. దానికది వల్ల గాదంటివి. దీనికిదివల్ల కాదంటివి. యెక్కడికక్కడే విరుపులా కొడుకుచేత కుక్కపాలు తాగించి ప్రాయశ్చిత్తం లేకుండా కులుకుతూ కూచోవాలనుకున్నా వేమి? చూడు స్వాములవారిపేర వ్రాసి మూడవనాటికి నీకు అంతఃపత్రిక దెప్పించెదను. నీ యింటిమీద కాకి అయినా వాలదు.

బ్రాహ్మణుడెవడు నీ గుమ్మం తొక్కి చూడడు. నీవు ఆడిందిఆట పాడింది పాటానా! బ్రాహ్మణ్యం మట్టిగొట్టుకుపోతుందనుకున్నావా యేమిటి.

రామ—బ్రాహ్మణ్యంనిలుపుకోవాలనేగాదూమీదగ్గరకొచ్చి మిమ్మల్నింత ఆశ్రయిస్తూవుంటా. నామాటనరేగానిమాపిల్లవానితో పాటు మరికొందరుపిల్లలుకూడా తాగినారు. వాళగతేమిటి ?

కామ—వాళ్ళగతి వేరూ మీగతి వేరూనా? అందరిగతివొకటే చెప్పండి వాళ్ళపేళ్ళేమిటో అందరిని పిలిపించి యేటివొడ్డున రావిచెట్టుక్రింద గూరుచోబెట్టి మంగలిగంగన్నచేత బుర్రలుగొరిగించి బంగారపుకుక్కలను దానాలిప్పిస్తాను. ఇవ్వలేకపోతే కొంప గోడి అమ్మియిచ్చుకుంటారు. అంతేగాని వదిలేస్తానా. ధర్మశాస్త్రం దగ్ధపటలం జేస్తానా. కామశాస్త్రి కంఠంలో ప్రాణముండగా ధర్మాలు ధ్వంసం చెయ్యడు.

రామ—చిత్తము తమరలాటివారే నే నెరుగుదును. తమను పక్షపాతమన్నమాటే లేదు.

కామ—పక్షపాతముంటే మన గౌరవాలు దక్కుతాయటయ్యా.

రామ—అందుచేతనే తమతో ఒక్కసంగతి మనవి చేయదలంచుకొన్నాను. తమరు సావధానంగా చిత్తగించవలయును.

కామ—చెప్పండి కావలసినంత సావధానముగ వింటాను.

రామ—కుక్కపాలు తాగినవాళ్ళల్లో మీ వాడు కూడా వున్నాడు.

కామ—(కోపముతోలేచి)ఆ! ఆ! ఎంతమాట యెంతమాట ! మాపిల్లవాడెంతో బుద్ధిమంతుడు! నాకుమీకునున్న విరోధాలనుబట్టి మీపిల్లవాడు చెడిపోయినాడుగదాయని మాపిల్లవాడుగూడా చెడిపో

యినాడనిపించేటందుకు గ్రామంలో పూజ్యం చెడగొట్టి అప్రతిష్ఠ తేవాలన్న దురుద్దేశ్యముతో మాపిల్లవాడి నెత్తిమీదఅక్షింతల గింజలువేస్తున్నారా. మాపిల్లవాడేమి అలాచేయడమేమి వాడల్లరచిల్లరవాడుకాడు. మీపిల్లలవలె తుంటరివెధవకాడు. ఈలాటిపాపాలాణ్ణిందుకు మీ జిహ్వాలు పుచ్చిపోతాయి. అగ్నిహోత్రంవంటి వాణ్ణి నిష్కారణంగా వుసురు బెట్టుతున్నావు. మా వుసురుదగిలి పోతారు మీరందరు జాగ్రత్త.

రామ— నేను అబద్ధమాడుతున్నానని మీ అభిప్రాయం శాబోలు కొంచెం శాతించండి యిక్కడ పదిమంది పెద్దమనుష్యులు చేరినారు. పేరుశెట్టి వెంకటరెడ్డి గంగినీడుభద్రాచలంగారునున్నారు వారినడగండి నిజస్థితి తెలుస్తుంది.

పేరుశెట్టి— కామశాస్త్రులుగారు! మీపిల్లోడు కులాసాగా కుడుచుకున్నాడండి. తక్కినపిల్లలు పితుక్కొని తాగినారు.

భద్రాచలం— శాస్త్రిగారు! ఆమాటనిజమేనండి. నేనుకూడా అక్కడున్నాను.

కామ — (తెల్లబోయి) మావాడే మావాడే! అంతపనిచెయ్యడమే! చెడ్డపిల్లల సహవాసముచేసి చెడిపోయినాడు నాకొంపదీశాడు. ఇది మావాడికిపుట్టిన బుద్ధికాదు. నామీద కక్షచేత నాపరువు తీసివేయించవలెనని ఎవరో వాడిచేత యీపని చేయించారు (అని చతికిలబడుచున్నాడు.)

రాము— విచారించిన కార్యమేమిటి. అందరికిగలిసియేదోఒక ప్రాయశ్చిత్తం నిర్ణయించండి తమరు పక్షపాతంలేనివారు బ్రాహ్మణ్యం నిలబెట్టేవారుగదా. కంసాలివీరయ్యను బిలచి యిద్దరము చేరి యొక బంగారముకుక్కనుచేయించుతామురండి. మనయిద్దరంగలిసి ధవళేశ్వరములోవుండే బ్రాహ్మణసోమయాజులుగార్కి దానమిత్తాము

కామ—(తనలో) ఈముండాకొడుకు గడుసుబుర్ర. ముందుగా నాకొడుకుమాట చెప్పక నాచేత అడ్డమయిన పేలాపన పేలించి చివరకు నా గుట్టు బయలుపెట్టినాడు. యిప్పుడేమిపాయము. ఈనిర్భాగ్యులకెవళ్ళకీ ధర్మశాస్త్రాలు తెలియవు. అందుచేత సమయస్ఫూర్తిగా మాట్లాడి ఒక్కదాటు దాటుతాను. నాయుపాయమువల్ల రామదీక్షితులుగాడు దాటిపోతాడు అదే విచారము. అయితేమితే యింకొకమాటు దొరక్కపోతాడా కానీ.

రామ—ఏమంటారు శాస్త్రుల్లుగారు. కంసాలి వీరయ్యను పిలిపించనా.

కామ—ఉండవయ్యా నీతొందర కూలిపోను. బంగారం మూలుగుతోందా ఏమిటి యింట్లో? ధర్మశాస్త్రాలు మళ్ళీ తిరగేస్తూన్నానుండండి. నిన్న ఆదివారముకాదూ; నాల్గుగడియల ప్రొద్దువేళగాదూ యీపని జరిగినది. మాపిల్లవాని కెనిమిదోయేడు మీపిల్లవానికి అంతేకాదూ వయస్సు.

రామ—చిత్తము ఆలాగేనండి

కామ—అయితే చెప్పుతున్నానువినండి. ఆదివారంనాడు నాల్గుగడియల ప్రొద్దువేళ యెనిమిదేండ్లపిల్లవాళ్ళు నల్లకుక్కపాలు త్రాగినట్టయితే అదితప్పుగాదని గండాయనస్మృతిలోనున్నది. అందుచేత మనపిల్లలు కనకశునకదానములు యివ్వనక్కరలేదు.

అందరు—(పక్కనవవ్వి) ధర్మశాస్త్రం చాలా బాగానున్నది.

రామ—మీామాటే ధర్మశాస్త్రం; మాకు యిదివరకు మనుస్మృతి పరాశరస్మృతి విన్నాముగాని శాకటాయన భాండాయన గండాయనస్మృతులు వినలేదు. ఇవన్ని తమ హృదయంలోనే యున్నవి. ఏమయిన మాపిల్లవానికి ఆపత్తుతప్పింది. మనమందరము నేటిదినము కనకశునకప్రహసన మాడినాము "ఇన్ని కంతులు

కోసినానుగాని నాకంతియంతనొప్పి మరేది లేదన్నాడట ఒకఁ ఆలాగే మీపిల్లవాడు దోషికాగానే ధర్మశాస్త్రాలు తల్లక్రిందులఁ పోయినాయి. బంగారుకుక్కలతో పనిలేకపోయింది. నోరుంటే త గాస్తుంది. ఏమయితేనేమి. మాఆపత్తు తప్పిపోయినది. శెలవు పుచ కుంటాము.

(అందరు నిష్క్రమించుచున్నారు)

—౯—

మహారసిక ప్రహసనము

రంగము 1

[రుక్మిణీబాయమ్మయు సుందరమ్మయుఁ బ్రవేశించుచున్నారు.]

సుంద—(కన్నీరు పెట్టుకొనుచు) రుక్మిణీబాయమ్మగారూ చూచారా యీఅన్యాయము. ఇంతంత ఘాతలు చేయదలచుకొంటె మావంటివాళ్ళు బ్రతకడమేలాగు. నావంటివాళ్ళు మీకు లేరా కూటికి పేదవాళ్ళమైతే కులముకు పేదవాళ్ళమా? ఏమైనా నోరెత్తి మీరు గొప్పవాళ్ళు. ఎంతో కోప మొస్తుంది.

రుక్మి—(తెల్లబోయి) సుందరమ్మగారు! మీగోడ వేమిటొ నాకు తెలియదు. సంగ తేమిటో చెప్పకుండా వూరికే కేకలువే ప్రయోజనమేమిటి? మిమ్మల్ని నేనేమైనా అన్నానా? అనవసరంగ కేకలు వేస్తా రెందుకు?

సుంద—అనవసరంగా వేస్తున్నానా కేకలు. నన్నింతమాట లాడవచ్చునా? ఈసంగతుంటే మావాళ్లువింటే నన్ను బ్రతకనిస్తారా మీయందరికి మల్లేనే నేనుకూడా పెనిమిటితో కాపురము చేస్తున్నదా న్నేగదా! భోగముదాన్నిగాను! గుడిశేటిదాన్నికాను. పేదవాళ్ళమై

మీయింటికి ముత్తైదువుగా వచ్చినందుచేత యిల్లా పరాభవంచేయుట న్యాయమా!

రుక్మి—సుందరమ్మగారు! ఇదేమిపాపమండి మిమ్మల్ని యెవర న్నారో యేమన్నారో చెప్పకుండా నామీద అలా గగిరిపడతారేమి నేనేమైనా మిమ్మల్నంటే నామీద కోపపడవచ్చును. ఏవిధమైన అప రాధము చేయనిదాన్ని నన్నుపట్టుకొని మీయిష్టమొచ్చినట్లు దులిపి వేస్తే నేనేమిచేయగలను.

సుంద—మీదుమిక్కిలి నేనుదులిపివేసినానంటున్నారా! మీ చేష్టలు బాగున్నవా?

రుక్మి—నాచేష్ట లేమిబాగున్నవికావో చెప్పరాదటమ్మా!

సుంద—మీ చేష్టలంటే కేవలం నీచేష్టలేనా?

రుక్మి—మరెవరి చేష్టలు?

సుంద—మీపంతులుగారిచేష్టలు యెంతమాత్రం బాగున్నవి కావు.

రుక్మి—ఏమి! మాపంతులుగా రేమిచేసినారు?

సుంద—ఏమిచేసినారని అడుగుచున్నారా మెల్లిగా. నేనేమని చెప్పకోను. మీదాసీదాన్ని గంగినడగండి తెలుస్తుంది. మీరుగొప్ప వారైతే మీగొప్పతనము మీ రేయుంచుకోవలె. మీకైశ్వర్యముంటే మేడమిద్దెలు కట్టుకుంటారు. నగలునాణెములు పెట్టు కొంటారు. పరువు మీకుమాకు సమానము. దాసీముండ గంగిచేత మదనగోపాల రావుపంతులుగారు నాకు కాసులు పేరిస్తామనివ ర్తమానమంపించినారు. ఇంతకంటె ఘోరమున్నదా? పదిమందిలోను నేనింత పరువుగలిగి బతుకుచున్నానుగదా! నన్నిట్లవమానము చేయవచ్చునా! నే నెవరిత ననుకున్నాడో ఆయన. ఈసంగతి నేనింకామావారితో చెప్పలేదు. చెప్పినానంటే కొంప లంటుకొంటాయి ముందుగా మీతో చెప్పి

కూకలువేయిందామని నేనూరుకొన్నాను. ఇన్నాళ్ళనుంచి నేనీవూళ్ళోయున్నాను. ఎంతమందియిండ్లకోవెళ్ళుతుంటానువస్తుంటాను. ఇల్లాంటి దెప్పుడైనావుందా! ఈబుద్ధులు మీవారికి తప్ప మరెవరికి పుట్టలేదు.

రుక్మి—అయ్యయ్యో! ఎంతమాట సుందరమ్మగారు! ఆమాట నేనెరుగను. మాపంతులుగారు చేసినది చాలాతప్పు. మీరు క్షమించవలెను. ఇవి చేతులుకావు కాళ్ళు. (అని చేతులుపట్టుకొనును.)

సుంద—అయ్యయ్యో రుక్మిణిబాయమ్మగారు! అంతమాట సెలవియ్యవద్దు. మీరొకతల్లి నేనొకబిడ్డను. మీరు చేతులుకాళ్ళు పట్టుకోనక్కరలేదు. నాకిటువంటి పరాభవం మళ్ళీ జరగకుండామాత్రం చేయించవలెను. గంగినికూడా మీరుగట్టిగా చీవాట్లు పెట్టవలెను.

రుక్మి—అయ్యయ్యో చీవాట్లుపెట్టనా ? మీరీసంగతెక్కడా చెప్పవద్దు. అందరిని తగినట్టుమందలిస్తాను.

సుంద—అమ్మా! నేను సెలవు పుచ్చుకొని వెళ్ళుతాను. నేనిల్లా అన్నానని తమరు మనస్సులో నుంచుకొనవద్దు.

రుక్మి—నా కెంతమాత్రం కోపంలేదు. సంగతి చెప్పడంవల్ల నాకెంతో మేలుచేసినారు. ఇంక మీరువెళ్ళండి.

సుంద—చిత్తము (అని వెళ్ళుచున్నది.)

రుక్మి—(తనలో) అబ్బబ్బ! ఈయనతో నేనువేగలేకుండావున్నాను. ఈయనకిప్పటికి నలభైసంవత్సరములు దాటినవి. యాభైయేళ్ళుసమీపించుచున్నవి. ఇప్పటికీపాడుబుద్ధివదలలేదు. ఈయనచిన్నతనపు చేష్టలు తలుచుకొంటే నాకెంతో సిగ్గుగుచున్నది. చీవాట్లు పెడుదామంటే మొండితన మొస్తుందేమోయని భయంగావున్నది. మెత్తమెత్తగామిక్కిలిచమత్కారంగా మందలించవలెగాని మోటతనంగా మందలించగూడదు. అయినా గంగినిబిలిచిసంగతేమిటో కనుక్కొంటాను. (ప్రకాశముగా) ఓసీ! గంగీ! యేమి చేస్తున్నావు ?

గంగి—(ప్రవేశించి) అమ్మా! యెందుకండి. అంట్లుతోమడాని కెల్తావున్నాను.

రుక్మి—ఓసీ ! పంతులుగారికి నీమీద దయ యెక్కువైనట్లున్నది.

గంగి—అదేం టమ్మా అలాగంటారు ?

రుక్మి—కాదు లే! నీ మొగము చూస్తే నాకాలాగు తోస్తోంది. పంతులుగారు నీతో తరుచు గుసగుస లాడుచున్నారు. నీకథంతా నాకు తెలిసిందిలే.

గంగి—ఏమున్నదండి నాకథ తెలిసేటందుకు. పంతులుగారు నాతో యెప్పుడు గుసగుస లాడ లేదండి.

రుక్మి—లేదంటే పోతుందా! సుందరమ్మవచ్చి నాతో నీగుట్టు మీాపంతులుగారిగుట్టు బయటపెట్టింది. పంతులుగారు కాసులపేరిస్తారని సుందరమ్మతో చెప్పినావట కాదూ ! అబ్బో ! కొత్తవుద్యోగం సంపాదించినావే నీవు తారుపుకత్తెవై నావు కాంబోలు ! దాసీపనిలో నీకంతగా డబ్బు దొరక లేదు గాని కొత్త వుద్యోగంలో డబ్బు దొరుకుతుందిలే.

గంగి—అమ్మగా రమ్మగారు, లేదండి లేదండి నే నెరగనండి.

రుక్మి—యెరగవా; సరే! సుందరమ్మ పెనిమిటి యీా సంగతి విన్నాడులే నిన్ను చెప్పుదెబ్బలు కొట్టి యీాడ్పించదలచుకొన్నాడు. అప్పుడు పంతులుగారుఅడ్డమొస్తారో యెవరడ్డమువస్తారో చూాస్తుగాని.

గంగి—అమ్మగారు ! రక్షించండి. రక్షించండి. బుద్ధినేరక తెలివితక్కువపని చేశానండి.

రుక్మి—సరే! ఆజారిన రా! బాగున్నది. జరిగినపని యేమిటో చెప్పు నీకు ప్రమాదము లేకుండ చేస్తాను.

గంగి—అమ్మా! అబద్ధం చెప్పను. నిజం మనియి శేస్తావినండి నిన్న మద్దినాల నేను పేడ చేసుకుంటావుంటె అయ్యగారు నాకాడి

కొచ్చి రూపాయ నాచేతిలో పెట్టి ''గంగీ! నేనొకమాట చెప్తాను వోరితో చెప్పవుగదా''అన్నారు. పేదముండాదాన్నిగనుక రూపాయ కాశపడి యెవరితో జెప్పనుబాబయ్యా అన్నాను. ''ఓసీ! మనింటికి పేరంటకానికి వచ్చేసుందరమ్మగారిని నేను పిలిచినానని పిలు. కాసులు పేరిస్తా'' నని అయ్యగారన్నారు. చిత్తం బాబయ్యా అని నేనెల్లి ఆయమ్మగారితో జెప్పాను. చెప్పగానె అయ్యమ్మ కళ్ళెఱ్ఱజేసి దుమ్మెత్తిపోసింది. నేను దడిసి పారిపోయొచ్చాను.

రుక్మి—ఈమాట పంతులుగారితో జెప్పావా?

గంగి—చెప్పలేదు. అయ్యగారు నాకింకా కాపడలేదు.

రుక్మి—సరె! నేను చెప్పినట్టు వింటావా?

గంగి—వింటానండి.

రుక్మి—ఇక ముందెప్పుడు యీలాంటిపనులు చేయకు. బుద్ధితెచ్చుకో. నేనొక రహస్యము చెప్తానురా. (అని చెవిలో రహస్యము చెప్పును)

గంగి—ఆలాగే చేస్తానండమ్మ. ఈమాట తప్పితే చెప్పుతో గొట్టండి. బుద్ధి గడ్డితిని కానిపని చేశాను.

రుక్మి—అదిగో, పంతులుగారొస్తున్నారు. నేను లోపల పనిచేసికొనుటకు వెళ్ళుతున్నాను.

(అప్పుడు మదనగోపాలరావుపంతులుగారు ప్రవేశించుచున్నారు.)

మదన—(తనలో) గంగి తెలివిగలముండ. ఎటువంటివాళ్ళనైనా టోపీ పెట్టగలదు. అది కార్యసాధన చేసేవుంటుంది. దీనిమొఖం కలకలలాడుతోంది. అందుచేత తప్పకుండా కార్యమయ్యేవుంటుంది.

(అని గంగిని చేతితో రమ్మని సంజ్ఞ చేయును.)

గంగి—(నవ్వుచు వెళ్ళి) ఎందుకండి బాబయ్యా!

మద:—గట్టిగా మాటలాడకే మీ అమ్మగారు వింటారు.

గంగి — అమ్మగారు లోపల మడిగట్టుకొని పని చేసుకుంటున్నారండి. బయం లేదు.

మద—సరె, సుందరమ్మ కనపడిందా ?

గంగి—కనపడిందండి.

మద—నే చెప్పుమన్నమాట చెప్పావా ?

గంగి—చెప్పానండి.

మద—ఏమన్నది. కోపపడలేదుగదా ?

గంగి—కోప్పడలేదండి, సరేనన్నదండి.

మద—నిజంగానె నిజంగానే సరేఅన్నదా, అవును మూడు వందలరూపాయల కాసులపే రొస్తాంటే చేదా యేమి. అందులో నీవు వెళ్ళితే కార్యము చెడిపోతుందా ? బాగుంది అయితే యెప్పుడొస్తానన్నది ?

గంగి— తమరు కాసులపే రెప్పుడు సిద్ధంచేస్తే అప్పుడు.

మద—కాసులపే రెంత సేపు కంసాలిశీతన్నదగ్గర కాసులపేరొకటి అమ్మకమునకు సిద్ధముగానున్నది. అది కొని పట్టుకొస్తాను. ఈ వేళ రాత్రికే రమ్మని చెప్పు. రాత్రి పదిగంటలైనతరువాత మన యింటివెనుక తోటలోనున్న బంగాళాలోనికి తీసికొనిరా.

గంగి—చిత్తము. కాసులపేరుమాత్రం రాత్రి జేబులో వేసికొని తీసుకురండి.

మద—సరే నీవు వెళ్ళు. ఇదిగో ఈరూపాయకూడా తీసికో. రేపుఉదయం యింకా రెండురూపాయ లిస్తాను.

గంగి—మీాయనుగ్రహము బాబయ్యా ?

(అని నిష్క్రమించుచున్నది)

మద—(తనలో) నాచిరకాల మనోరథము నెఱవేరినది. ఇప్పుడే కాసులపేరు కొని పట్టు కొస్తాను. (అని లోపలికివెళ్ళి) ఏంజే

స్తున్నావు ఇల్లారా, నాకీరాత్రి పెందరాళే వంటచెయ్యాలి, ఎనిమిది గంటలకు భోజనంచేసి వెళ్ళిపోవాలి. పనుందినాకు.

రుక్మి—ఎక్కడికి వెళ్ళుతారు?

మద—ఛీ! నోరుముయ్యి పనున్నది వెళ్ళవలెనంటే యెక్కడికి వెళ్ళుతారని అడుగుతావా? ఎప్పుడువస్తుంది నీకు జ్ఞానము, నలభై యేళ్ళు నెత్తిమీదకొచ్చాయి నీకు. యిప్పటికింకా బుద్ధిలేదు నీకు ఎక్కడికని యడుగుతావా? అడుగగూడదన్నమాట చిన్నపిల్లకుగూడ తెలుసునే. ఇంత బుద్ధిమాలినదాన వన్నమాట యెఱుగను. మగ వాళ్ళకు నూరుపను లుంటవి.

రుక్మి—ఔనౌను. పొరబాటే చేశాను. అడుగగూడదు. బుద్ధి తక్కువవాళ్ళకు వయస్సుతో పనేమున్నది. బుద్ధిమాలినపనులు చేసే వాళ్ళకు నలభైయేళ్లున్నా వక్కటె యాభైయేళ్ళున్నా వక్కటే. సరే యెనిమిదిగంటల లోపుగానే వంటచేస్తాను. వెనుక మీరుదుద్దుల జత వకటి మంచిదుంటే తెమ్మని షరాబు పేరిశెట్టితో చెప్పినారు. మంచిజతవొకటి అమ్మకమునకు వచ్చినదని చెప్పాడు మీరు నాకది కొంటారా!

మద—సింగినాదం జీలకఱ్ఱకొంటాను. చేతిలోడబ్బులేక నేను చిక్కుపడుతుంటే నీకు దుద్దులజతలు తోడాలు జతలు కావాలేమి?

రుక్మి—డబ్బులేకేమి? నిన్ననేగాదూ బోడసకుఱ్ఱుతోట తాలూకు వెయ్యిరూపాయిలొచ్చింది

మద—అదింకా వుందనుకున్నావా యేమిటి? ఇవ్వవలసిన వాళ్ళకప్పుడేయిచ్చివేసినాను.

రుక్మి—మనకే వొకరియ్యవలెనుగాని వొకరికి మన మియ్య సక్కర లేదు.

మదన — అట్లే అధిక ప్రసంగాలు చేయక వెళ్ళి వంటచేసికో. ఆడుదానికి చనువియ్యకూడదని యిందుకే అన్నారు పెద్దలు నీ కంత కంతకు పెంకితనము ముదిరిపోతున్నది. తగినట్లు బుద్ధిచెప్పవలె నొకసారి.

రుక్మి — బుద్ధిలేక నే యీలాగున్నాను. (అని వెళ్ళిపోవును.)

మదన — ఓసీ గంగీ! నేను తలంటిపోసికోవాలి. నీళ్ళుపెట్టు, మంగలి మాచిగాడిని పిలిచికొనిరా!

గంగి — చిత్తము బాబయ్యా.

(అని నిష్క్రమించును.)

—*—

రంగము 2

[చావడిలో కుర్చీమీఁదఁ గూర్చుండి మదనగోపాలరావు ప్రవేశించుచున్నాఁడు]

మదన:—(తనలో) అబ్బబ్బ! ఈ దిక్కుమాలిన గడియారం యెంతసేపటికి పదికొట్టదేమి? యిప్పుడెన్ని గంట లయినదో? ఓహో! యెనిమిదిన్నరైంది. పదిగంటలైన తర్వాతకదా సుందరమ్మ వస్తానని కబురంపినది. ఇంకా గంటన్నరసేపు కూర్చోవాలి కాఁబోలు. అబ్బ! నిమిషమొక యుగములాగున్నది. ఈ గంటన్నరకాల మేలా గడుపగలను. పోనీ నిద్రపోదునా? నిద్రపట్టనేపట్టదు పట్టినా సమయానికి మెలకువ రాదు. అందుచేత నిద్రపోవుటకు ప్రయత్నముచేయనే కూడదు. పోనీ చదువుకుందునా? మనస్సు పుస్తకంమీఁది కెళ్ళడం లేదు. పోనీ యేదైనా పాట పాడుకుంటాను. ''తత్తరపడనేల తాళు తాళురసామి'' (అని పాడుచుండును.)

[అప్పుడు గంగి ప్రవేశించుచున్నది.]

మదన — గంగీ! యిప్పుడు తొమ్మిది గంటలైనది, ఈపాటికి నీవు వెళ్ళి ఆబిడను తీసికొనిరా?

గంగి—ఇప్పు డప్పుడే కాదండి! వారింట్లో యీపాటికి నాం తేదాను.

మదన—కాసులపేరు కొని తెచ్చినానని చెప్పుసుమా. పడుకొని రాకపోవునేమో!

గంగి—అలాగే చెప్తానండి! ఆబిడ పదిగంటలు దాటితే రాదు. అందాక తమరిక్కడే కూర్చోండి. నేనొచ్చి మిమ్మల్ని కెల్తాను. నేను పిలువందేమాత్రము మీరు తొందరపడి రాకండి.

మదన—సరే! నేను తొందరపడిరాను. ఇక్కడ మేలు యేదో పాడుకుంటూ కూర్చుంటాను. ఐతే మీయమ్మగా స్తుంది.

గంగి—ఇప్పుడే పనయింది. తాంబూలము వేసికొంటున్నా

మదన—త్వరగా పడుకోమని చెప్పు.

గంగి—పంతులుగారు పనున్నది యెక్కడికో వెళ్ళ భోజనంచేసి వెళ్ళుతా నన్నారు. వెళ్ళ లేదేమని అమ్మగారనా

మదన—తీరా భోజనము చేసినతర్వాత నే నెవరిదగ్గ వెళ్ళాలనుకున్నానో ఆయన వూళ్ళోలేరు. అందుచేత వెళ్ళనక లేకపోయింది. అయితే ఆబిడకేమైనా అనుమానపడుతుందా యే నేను తలంటుకోనడం, భోజనంచేయడంవల్ల ఆబిడకేదైనా సందే తోస్తుందా యేమిటి?

గంగి—అమ్మగారికి సందేహ మేమి తోచలేదు కాన దుద్దులజత చేయించారు కారని కోపంగా వుందండి.

మదన—దుద్దులజతకేమి యెప్పుడో వకప్పుడు చేయిస్తా

గంగి—సుందరమ్మగారికంటే మూడువందల రూపా కాసులపేరు కొన్నారు. అమ్మగారికంటే నూటరూపాయలు మీ లేకపోయినవి. ఇదిబాగుందా?

మదన—ఆమాటకేమిలే. నీవు వెళ్ళి ఆ పనిచూడు!

(ఇద్దరు నిష్క్రమించుచున్నా

—✻—

రంగము 3

తోటలో బంగాళా.

[అప్పుడు మంచముమీఁద పండుకొని యొక స్త్రీయు గంగియు ప్రవేశించుచున్నారు.]

స్త్రీ—ఓసి గంగి! పదిగంటలు దాటిపోయిందే! పాపము పంతులుగారు నిద్దరపోకుండా మేలుకొన్నారుగాబోలు. త్వరగా వెళ్లి తీసుకొనిరా?

గంగి—పంతులుగారిమీఁద మీకు జాలి యెక్కువగావుందే.

స్త్రీ—ఏడ్చినావులే. వెళ్ళితీసుకొని రా.

గంగి—యిదిగో యెల్తావున్నాను. (అని కొంతదూరము వెళ్ళి) వోవరావచ్చేవాడు!

(మదనగోపాలరావు ప్రవేశించుచున్నాఁడు.)

మదన—నేను గోపాలరావును ఎవరు వారు?

గంగి—నేను బాబయ్యా! గంగిని. తమరే వస్తున్నారా?

మదన—నీ వెంతసేపటికి వచ్చావుకావని నేనే బయలుదేరి వచ్చాను. ఆబిడ వచ్చిందా?

గంగి—వచ్చిందండి! కాసులపేరు తెచ్చారా అని మాటి మాటి కడుగుతూందండి!

మదన—కొన్నానని చెప్పకపోయినావా?

గంగి—సెప్పానండి! అరికి నామాట నమ్మకము.

మదన—తెచ్చానని యిప్పుడు చెప్పు.

గంగి—ఇదిగో యెల్లివస్తాను (అని లోనకు వెళ్లుచున్నది)

మదన—(లోపల ప్రవేశించి) గంగి! దీపములేకుండా చేశావటే. ఇంటికివెళ్ళి దీపము పట్టుకురా.

గంగి—దీపము పెట్టితే అమ్మగారనుమానపడి తోటఃగా ఉంచుకున్నదని అడుగుతారు. అందుచేత పెట్టలేదు. తః తెమ్మంటె తెస్తాను.

మదన—తీసికొనిరావే. చీకటింట్లో మొకం కనపడకుం పని మేమిటి? ఏది యెక్కడుంది సుందరమ్మ!

గంగి—దచ్చినపుగోడదగ్గిర మంచముందండి ఆమంచమువి తొంగున్నారు.

మదన—సుందరమ్మా! సుందరమ్మా!

స్త్రీ—(తనలో) నేను పలుకక యీయనను కొంతసేపువ దవను.

మదన—పలుకదేమే.

గంగి—కొత్తగనుక సిగ్గండి!

మదన—(మంచముదగ్గఱగా వెళ్ళబోయి స్తంభముమీద అబ్బబ్బ! మొఖము బద్దలైంది. దిక్కుమాలిన ముండా! దీప తెమ్మంటే తెచ్చావుకావు. అప్పుడే యుసిరికకాయంత బొప్పి కట్టి

స్త్రీ—(తనలో) ఈలాటివి రెండుమూడు బొప్పిలు క కాని యీజాడ్యము వదలదు.

గంగి—కొంచెము సున్నం బెల్లం తీసకరానాండి పట్టేస నేంచుకు.

మదన—ఏడ్చినట్టేవుంది నీ సలహా. పట్టువేసికొని యిం వెళ్ళగానే ఆవిడగారనుమానపడి బాధపెట్టేందుకా? అసలే శం ముండ నా పెళ్లాము. ఆవలిస్తే పేగులు లెక్కపెడుతుంది.

స్త్రీ—(తనలో) పెండ్లాము శంఖిణీయుండా, యీలాటిపన చేసే మహానుభావుండు పెద్దమనిషి కాంబోలు! పోనీ, పెళ్లాము చెప్తే యీమాత్రము భయముంటే చాలు.

గంగి—అమ్మగారు దగ్గఱలేరుక దాయని మీాయిష్టమొచ్చి నట్లు తిడుతున్నారా!

మదన—నేను తిట్టానా? అది పెంకిభడవలలో మొదటిరకం.

గంగి—సరె నొప్పి కొంచెం సద్దుకున్న దాండి. నెత్తురు రాలేదుక దాండి.

మదన—నెత్తురు రాలేదు. నొప్పికొంచెము సర్దుకున్నది. ఏదీ మంచము.

గంగి—తిన్నగా వెళ్ళండి.

మదన—(వెళ్ళి) అబ్బ! మంచముకోడు మోకాలికి తగిలిందే నీయమ్మ కడుపుకాల. దీపం తెమ్మంటే తేవేమి?

గంగి—తిట్టకండి తెస్తాను.

స్త్రీ—(తనలో) ఇక్కడికి రెండుబొప్పిలు కట్టినవి.

గంగి—కొంచెము తమాయించుకొని మంచంమీాద కూర్చొని పిలవండి.

మదన—నొప్పి తమాయించింది. కూచున్నానుమంచంమీాద. సుందరమ్మా! సుందరమ్మా! పలుక వేమి?

గంగి—నిద్రపట్టిం దేమోనండి.

మదన—అయితే మళ్ళీపిలుస్తాను సుందరమ్మా! (అని మీాద చేయివైచి లేపును) ఇదేమిటే సుందరమ్మ సన్నంగా వుంటుందిగదా! చెయ్యి లావుగావున్న దేమి?

గంగి—తమరు దూరంనుంచి చూచి సన్నంగా వున్నదనుకొన్నారుగాని ఆబిడ లావేనండి.

మదన—ఏమిటే లావంటావు?

గంగి—మీాకు తెలియదండి! లావేనండి!

మదన—సుందరమ్మా! యింతలో నిద్రపట్టిందా?

గంగి — నిద్రకాదేమోనండి! బెట్టుసరేమో.

మదన — బెట్టుసరెందుకు? చల్లకువచ్చి ముంత దాచవచ్చునా?

గంగి — కాసులపేరు చేతిలో పడిందికాదని బెట్టుసరి. సమయం దాటిపోతే తర్వాత మీరిస్తారో యివ్వరో.

మదన — ఇదా నీసందేహము. నేనేమిమాటదబ్బరమనిషినను కొన్నావాయేమి! ఇదిగో కాసులపేరు. ఇదిఅరకాసులపేరు నల్లపూసలకు అరకాసులున్నాయి. మూడువందల యాభై రూపాయలు కిమ్మతు. ఇదిగో! యీకాసులపేరు వేసికో! (అని చేతికిచ్చును)

స్త్రీ — (తనలో) ఎంతదక్కితే అంతేలాభం. (అని పుచ్చుకొని మెడలో వైచుకొనును)

మదన — సుందరమ్మా! బాగున్నదా కాసులపేరు?

స్త్రీ — ఊఁ!

మదన — ముందు నెలలో కంటె చేయించిపెడతాను. ఆపై నెలలో త్రోడాగొలుసులు చేయిస్తాను.

స్త్రీ — (తనలో) అబ్బ! సుందరమ్మంటె యీయనకు శరీరం పరవశమైపోతూంది. కొంపంతా దోచిపెట్టేటట్టు కనబడుతున్నాడు.

మదన — ఇప్పటికైనా మనసిచ్చి మాట్లాడవేమి? సిగ్గా బెట్టా సరా భయమా యేమిటి?

గంగి — భయమే నండి. అమ్మగారంటేఆబిడకు గడగడ. అమ్మగారి కీసంగతేలాగైనా తెలుస్తుందేమో అని, తెలిస్తే ప్రాణాలు వుండనీయకుండా కొడుతుందని యెంతో అంత భయపడుతున్నారండి.

మదన — ఏలా తెలుస్తుంది మీఅమ్మగారికి? నే జెప్పనుకదా! నాగొంతుకకు నే వురేసుకొంటానా యేమిటి? సుందరమ్మ వెళ్ళి చెప్పుకోదుగదా! అంతవిరుద్ధం లోకంలో వుంటుందా? ఇకెటువచ్చినా నీవు చెప్పాలి నోట్లో నూవుగింజ దాగనిముండవు అంతేనా సుందరమ్మా

స్త్రీ—ఊఁ!

మదన—ఇది బయలుపడిందంటే నీవే బయలుపెట్టావన్న మాట. ఇది మీయమ్మగారితోగాని, మరెవ్వరితోగాని అన్నావంటే నిన్ను చీమలచింతకు గట్టించి చిట్లనాకకమ్మచీతపట్లు చీతి సీకొప్పు గొరిగించి యీవూరునుంచి సాగతోలేస్తాను.

గంగి—అమ్మనాయనో! నేనెందుకు బయలు పెడతానండీ! తమ అనుగ్రహం వుంటే రూపాయలిస్తారు. చీరలిస్తారు. మెన్నో యిదాల పేదముండా దాన్ని నన్ను కనిపెడతారు యిమన్నీ చెడ గొట్టుకొంటానా? నాకూట్లో నేనే మన్నేసుకుంటానా?

మదన—చెప్పకుండా దాచి యిలాగే సుందరమ్మను తీసు కొస్తూ పోతున్నావంటే సాలు కేలాగైనా పాతికరూపాయల సొమ్ము నీకు ముట్ట చెప్తాను.

గంగి—చిత్తము బాబయ్యా! అలాగే వుంటాను.

మదన—అయితే యింకే మీయమ్మగారివల్ల భయమేఅక్కఱ లేదు. ఒకవేళ అనుమానపడి మీయమ్మగారు సుందరమ్మ నేమన్నా అంటుందనుకో, అంటే తక్షణం నాతో చెప్పండి.

గంగి—చెపితే యేం జేస్తారు?

మదన—ఏం జేస్తానా, నాకోపము నీ వెరుగుదువుకదా! వీపు బద్దలకొట్టేస్తాను, నగలన్నీ లాక్కుంటాను, తలవెంట్రుకల వెధవ లాగున యింట్లో మూల కూర్చోపెడతాను. లేదా, పుట్టినింటికి తోలేస్తాను, నాకు కానివాళ్ళు నాకు లేనివాళ్లే.

స్త్రీ—(తనలో) ఆహా! యేమిసాహసము. ఏమిపౌరుషము. ఇవతలవాళ్లే అంత చాతకానివాళ్ళు కాబోలు.

గంగి—తమ కోపము నే నెఱుఁగుదును.

మదన–నేను దాన్ని వదలివేసేసి కావలిస్తే మళ్లీ పెళ్ళాడతాను. అది కట్టుపోగరుబోతన్న మాట నాకు తెలుసును. దానిగర్వము చేతనే నేనీలాగున పైవాళ్ళ స్నేహము చేస్తున్నాను. అది గయ్యాళి గంపయై ఉన్నగోడు చెడగొట్టుకుంటూంది. అందుకే దానికీమధ్య నేను నగలు చేయించడం మానివేశాను. ఇంకా నీకుభయమెందుకు?

గంగి—ఈ పర్యాయము భయపడనక్కరలేదమ్మా.

మదన—సుందరమ్మ! విన్నావా నాప్రతిజ్ఞ.

స్త్రీ—ఊఁ!

మదన—లేచి కూర్చో!

గంగి ఆబిడ కింకొక్క అనుమాన మున్నదండి.

మదన—అదేమిటో చెప్పు! ఉన్న అనుమానాలన్నీ యిపుడే తీర్చుకోవాలి.

గంగి—రెండు నెల్లో మూడు నెల్లో స్నేహితము చేసి వదలివేస్తారేమో, రెండువిధాలా చెడిపోయినదాన్నే అవుదును. శాశ్వతంగా వుంటారో లేదో తెలిసికోవాలని ఆబిడకుందండి.

మదన—ఆలాగున తెగేసి చెప్పరాదూ! అభిప్రాయ మేమిటో, నేను స్నేహంచేస్తే యావజ్జీవము చేసేవాడనే కాని రెండు నెలలు మూడు నెలలు చేసేవాడను గాను. నామాటంటే వేదాక్షరం. నేను నీ కోసం చిరకాలాన్నుంచి తపస్సు ధారపోస్తున్నాను. నిజంగా అన్నం తినడంలేదు. నీరు తాగడంలేదు. నిద్రపోవడంలేదు. కచ్చేరీపనితోచడం లేదు. సుందరమ్మంటే రంభ ఊర్వశీ మేనకల మించింది.

గంగి—అంత అన్నం దినకండా నిద్ర పోకుండా వుండడమెందుకండీ! సుందరమ్మగారు మాఅమ్మగారికంటె యెక్కువ చక్కనివారా యేమిటి?

మదన-మీయమ్మగారా! దాసీదానవగుటచేత లేనిపోనిదురభిమానం పెట్టుకొని పూసుకొని వస్తున్నావు. మీ యమ్మగారికిచక్కదనంకూడానా? ఆబిడకూ చక్కదనానికీ నూరామడదూరం. చిన్నతనంలో నేనెఱుఁగనపుడు నాకొక్క మద్దిగోలు తీసికొచ్చి కట్టిపెట్టినారు. మెంటాలమ్మలాగు వొడ్డూ పొడుగుంటేసరా! అందంచందం అక్కఱలేదూ, ఆమొఖంచూస్తేనే అసహ్యం నాకు. పగలు చూస్తే రాత్రి కల్లోకి వస్తూంటుంది. పేడబొమ్మకు తగిలించినట్లు యిన్ని నగలు తగిలించుకోగానే సరా? సుందరమ్మనిలుచున్నచోట నిలుచునేందుకైనా పనికిరాదు. సుందరమ్మ బంగారపుబొమ్మ. అందానికిదోడు గుణాలు కూడ దక్కనూలినవికదా. దాన్ని చూస్తేఅంతకంతకు నాకు డోకొస్తుంది. నేను యింతకూ మంచివాడనుకనుక ఆదౌర్భాగ్యురాలితో యింతవఱకు కాలక్షేపం చేసుకొస్తున్నాను మరొకడైతే యీపాటికి దాన్ని లేవగొట్టి యింకొక దాన్ని పెళ్ళిచేసికొని యుండును.

గంగి-ఈమాటలు మాఅమ్మగారువింటే యేమనుకొంటుందో?

మదన—మీఅమ్మగారు వింటుండగానే అంటాను. నాకేం భయమైందా యేమి? అట్టే పెంకితనం చేసిందంటే నెలకు నాలుగు రూపాయలు మనవర్తి యిచ్చి సాగనంపుతాను. సందేహాలుతీరిపోయినవా నీవి?

గంగి — అన్నీ తీరిపోయినాయండి!

మదన—గంగీ! దీపం తీసుకరావే. కాసులపేరు వేసుకుంటే సుందరమ్మ మొగ మెంత కలకలలాడుతుందో చూస్తాను.

గంగి - యిప్పుడే పట్టుకొస్తా నుండండి. (అని వెళ్ళుచున్నది)

మదన—సుందరమ్మా! నీవెంత పిరికిదానవు. మాయాబిడ నిన్నేదో చేస్తుందని పిరికితనం పెట్టుకొన్నావా? అలాంటిభయమేమి

పడకు. నేనుండగా నీకేం భయములేదు. నీవే నాభార్యవు, నేనే నీ భర్తను. కావలిస్తే చేతిలో చేయి వేస్తాను. ఏదీ నీచెయ్యి యిల్లాయిలా (అని చేతిలో చేయి వైచును) నీవేదో యుత్తరీయం కప్పుకొని పడుకున్నా వేమి. చలిగానున్నదా?

[అప్పుడు గంగి దీపము పట్టుకొని ప్రవేశించును]

మదన—ఏమే మీాయమ్మగారు నిద్రపోతున్నారా?

గంగి—బాగా గుబ్బుపట్టి నిద్రపోతున్నారండి!

మదన—ఈబిడ మునుకు బిగతన్ని పడుకొన్న దేమే?

గంగి—యేమోనండి.

మదన—సుందరమ్మా! మునుగుతీయి (అని యుత్తరీయముప లాగును.

స్త్రీ (లేచి కూర్చుండును)

మదన—(ఉలిక్కిపడి మంచముమీాదనుండి లేచి క్రిందనిలు బడి తొట్రుపాటుతో) గంగీ! గంగీ! యిదేమిటే?

గంగి—నేనెఱుగనండి బాబూ!

రుక్మి—ఇదేమిటని కంగారు పడకండి పాపము మీాకు ప్రాణములో ప్రాణము సుందరమ్మ రాలేదు. కట్టుపోగరుబోతు, మెంటలమ్మ, తుంటరి, మద్దిగోలు, అయిన రుక్మిణీబాయమ్మే మీాయెదుట వుండవలసి వచ్చింది. పుట్టింటికి పంపినానసరే, నెలకు నాలుగురూపాయలు మనవర్తి యిచ్చినానసరె, వీపుబద్దలు కొట్టినానసరె,మీాచిత్తమువచ్చినట్లు చేయండి! పాపము; పగలు చూస్తె రాత్రి కలలోకి వచ్చే భార్య విరగడై పోయింది కాదుకాబోలు.

మదన—చూడు! నావల్ల బుద్ధిపొరబాటొచ్చింది. నన్ను నలగురిలో అల్లరిచేయవదు. నాపరువు కాపాడవలె.

రుక్మి—సుందరమ్మను రాకుండాజేసినందుకు నన్నే మీారు క్షమింపవలె. మిమ్మలిని క్షమించడానికి నే నెంతదాన్ని. మీారు మాగ

వాళ్ళు. సర్వాధికారులు భార్యను చానగొట్టగలరు. వదలివేసి తిరిగి పెళ్ళాడగలరు. మనవర్తి యియ్యగలరు. పనికిమాలిన ఆడదాన్ని నే నెంతదాన్ని.

మదన—ఈ గంగిముండ నాకొంపదీసింది. అయిందేమిటో అయింది. గతం నాస్తి. కాసులుపేరు నీకే దక్కిందికదా! సొమ్ము సొమ్ములో వుంది.

రుక్మి—మొండివాళ్ళతో జవాబెవరు చెప్పగలరు? గంగీ రావే వెళ్ళుదాము.

(అని పోవుచున్నారు.)

మదన—నేనుకూడా వస్తానుండండి! అమ్మ! యెంతపని చేసినారురా? ఆడవాళ్ళిద్దఱూ కలిసి నాకు చక్కగా బుద్ధి చెప్పినారు)

(అని నిష్క్రమించును.)

—○—

గయ్యాళి గంగమ్మ ప్రహసనము

రంగము 1

(అప్పుడు శోభనాద్రియు, జగన్నాథమున్ను ప్రవేశించుచున్నారు.)

శోభ— ఎంతకాలమయినదోయి నిన్నుఁ జూచి! నిజముగా నాప్రాణములు లేచివచ్చినవంటే నమ్ము. ఈరోజున నాకు పండుగగా ఉన్నది. నీవు మాయింట మూఁడుదినము లయినా ఉంటేనేగాని వీలు లేదు. మనమిద్దరము కలుసుకొని పదిసంవత్సరము లయినది. నాఁడు పుష్కరాలకు కోటిలింగాలదగ్గర కలుసుకొని ఒక అరగడియసేపు మాటాడి విడిపోయినాము. రెండుమూఁడుదినములుమనము కలిసియుండి

చిన్నప్పటి గొడవలు చెప్పుకొని కులాసాగా కాలము గడుపుదామని నాకున్నది, అది నేఁడు సమకూరినది.

జగ—. నిజముగా నాకుకూడా అలాగేయున్నది. ఎన్నిసారులు రావలె ననుకున్నా తీరుబడి లేదు. ఎప్పటికప్పుడే యేదోయొకపని. సంసారములో బడ్డతరువాత గిజగిజ తన్నుకొని కాలక్షేపముచేయవల సినదేకాని తీరుబడి యుండదు. పైగా మునుపటిరోజులు మునుపటి స్థితులు కావు.

శోభ—సరే! దైవానుగ్రహమువల్ల మనయిద్దరి సంకల్పము నేఁటి కీడేరినది. అయితే నీవేమి పనిమీఁద వచ్చావు!

జగ—మా పెద్దనాన్నాయికి వివాహసంబంధము వెతకడముకోస మొచ్చాను. మీగ్రామములో ఎవరోపిల్లవాఁడున్నాఁడని తెలిసినది. ఆపిల్లవాడిని చూచిపోదామని అతని స్థితిగతు లేమో కనుక్కొందా మని వచ్చాను. ఈరోజులలో మనము వివాహములు చేయలేమోయి! కట్నాలు పెరిగిపోయినాయి. ఒక్క వివాహముతో నేకొంప గుండమై పోతుంది. పిల్లలు లేనివాళ్ళే అదృష్టవంతులు.

శోభ—పిల్లలు లేనందుకు నేను దుఃఖపడుచుంటే ఉన్నందుకు నీవు దుఃఖపడుచున్నావు. బాగున్నదిలే.

జగ—ఏమిచేయనయ్యా! పిల్లలను చూచిచూచి యిల్లువాకిలి లేని నిర్భాగ్యుల కియ్యలేను. కొంచె మాస్తియున్నవాడి కియ్యవలె నంటే వాడు కొండెక్కి కూర్చుంటున్నాఁడు. తలిదండ్రులకు బాధ యింతా అంతా కాదు.

శోభ—సరె. సంబంధము విషయమై భోజనమైన తరువాత మాట్లాడుదాము. ఇప్పుడే బజారుకు వెళ్ళి వస్తాను.

జగ—సరె త్వరగా రా! (అని చావడిలో కూర్చుండును.)

శోభ—ఒసే! ఏమిచేస్తున్నావే?

[అప్పుడు గంగమ్మ ప్రవేశించుచున్నది.]

గంగమ్మ—ఇదిగో! ఇప్పుడే లేచాను. ఇల్లలుక్కుంటున్నాను.

శోభ—నాలుగుగడియలు ప్రొద్దెక్కింది. ఇప్పుడు లేవడ మేమిటి, ఇల్లలుక్కోవడ మేమిటి.

గంగ—మాబాగుంది. నేను మీకుమల్లె తెల్లవారుజామునే లేవలేను. నాకు పెందలాడె మెలకువరాదు. ఒకవేళ బలవంతాన పెందలాడె లేచినా నావొళ్ళు బారకింపుగా వుంటుంది. ఆరోజంతా తలనొప్పివస్తుంది. ఒంటికి త్రైను. చాకిరిచేయలేక చస్తున్నాను. పైగా దిక్కుమాలినవాళ్ళు చుట్టాలు, పక్కాలు, వాళ్ళసొమ్మంతా దాచ బెట్టినట్లు వస్తారు తినడానికి! మీరు డబ్బు తేగలరేమో కాని నేను చాకిరీ చేయలేనుసుమండి!

శోభ—సరె సరె, గట్టిగా అరవకు. ఈరోజున నాస్నేహి తుడొకాయనవచ్చాడు. అతడు నాకు ప్రాణస్నేహితుఁడు. అతఁడు నేను చిన్నప్పుడొక కంచములోనే భుజించి పండుకున్నాము ఒక కంచములో తిన్నాము. అతనిని చూచి పదేళ్ళయినది. అతఁడు చాలా స్థితిపరుఁడు. మనము వెయ్యివిధాల ప్రార్థించినా వచ్చేవాఁడుకాఁడు. రాక రాక వచ్చినందుకు అతనిని మనము చాలా గౌరవము చేసి పంపాలి.

గంగ—ఏమిగౌరవము చేయవలెనంటారు! ప్రొద్దున్నే లేవగానే దిక్కుమాలినపిల్లి నా కెదురుగుండావచ్చింది. అప్పుడేఅను కున్నాను. నాకేదో యీవాళ కష్టముందని. అనుకొన్నట్లే జరిగినది.

శోభ—నీ కేమికష్ట ముంది. ఈపూటకు మామూలుగానే వంట చెయ్యి. రాత్రి కేదయినా పిండివంట చేదాము. ఏమిపిండి వంటచేస్తే బాగా వుంటుంది?

గంగ—ఏమో—ఏమిచేస్తే బాగుంటుందో మీరే ఆలోచించు కోండి. నేను పిండివంట చేయలేను. నాకీవేళ తల పోటుగానున్నది.

శోభ—సరే పోనీ మామూలువంట చేయి. రాత్రికి మాబంగారమ్మను తీసుకొనివచ్చి పిండివంటచేయిస్తాను. నావినతల్లి కూతురైనందుకు నా కీమాత్రము సాయము చేయకపోదు. ఇతడు మూడు రోజులుంటాడు. ఈ మూడురోజులు నీమామూలు కోపము, చిరాకు మాని కొంచెము మెల్లిగా మాట్లాడి అతనిని గౌరవము చేసి నామాట దక్కించు. ఉత్తప్పుడెన్నను కొన్న బాధ లేదు. క్రొత్తవాళ్ళు వచ్చినప్పుడు కొంచెము జాగ్రత్తగా వుండాలి.

గంగ—నాకెందుకు. నేను నోరెత్తను. చచ్చినపీనుగులా గుంటాను. నేను బ్రతికుండడమే మీకు బాధలాగుంది. ఆ దేముడికి నా మీద దయ రాలేదు.

శోభ—నిన్నేమన్నానని నీవు విసుకుంటావు. నీ కెప్పటికి తెలవిరాలేదు. ఇదిగో నేను బజారుకు వెళ్ళుచున్నాను. రాత్రికి క్షీరాన్నము పూరీలు చేయించవలెను. సగ్గుబియ్యము గోధుమపిండి జీడిపప్పు ద్రాక్షపండ్లు తెస్తాను. ఈలోపుగా నీవు మడికట్టుకొని త్వరగా వంట చేయి పాపము అతడికి రాత్రికూడా భోజనము లేదట ఇదిగో నేను వెళ్ళుచున్నాను. (అని నిష్క్రమించును).

గంగ—(తనలో) పిండివంటగాదు పిడకవంటచేస్తా. ఈసింగన్నపచ్చాడట, మూడుదినములుంటాడట, ఈయనకుపిండివంటలు పరమాన్నము కావాలట. ఎవరుచేయగలరు వెట్టిచాకిరి. ఈమధ్య మావినతల్లి దానికుగడు ... చుట్టరికానికివస్తే పిండివంట చేయమని నేనెన్నివిధాలో పోరినా చేయొద్దన్నారు. పునిస్త్రీపడుచుకి ఒకరూపాయచీర పెట్టమంటె పెట్టినారు కారు. నావాళ్ళకంటె ఈయనకు గౌరవము లేనప్పుడు ఈయనవాళ్ళంటె నా కెందుకుండాలిగౌరవము? ఈయన బజారునుంచి వచ్చేలోపుగా ఈకొత్తన్నెతుని జేద్దేవరాయని లేవగొట్టుతాను. అదుగో! పండుకోతిలాగ చావట్లో కూరుచున్నాడు.

తివాసిదగ్గిర. చేసిపెట్టితే పిండివంటలు పొట్ట బ్రద్దలయ్యేటట్టు తినాలనుకొన్నాడుకాబోలు. ఈయన్ను లేవకొట్టేందుకేమియుపాయము? (అని ఆలోచించుచున్నది) సరే! ఈపన్నాగము పన్ని చూస్తాను. ఇదిపనిచేయకపోతే మరొకటి చేయవచ్చును. ఇప్పుడు నాకు తోచిన ఉపాయము సాగినట్లయినా వీడేకాడు. మరెవడైనా జన్మజన్మాలకు నాకొంప కెక్కడు. నూకాలమ్మా తల్లీ! నాకోరికె తీర్చితివా నీకుచద్ది నైవేద్యము పెడతాను. ఇంకా చేతిలోడబ్బుంటే చిన్నకోడెల్లనుకూడా యిస్తాను. (అని దండము పెట్టి సన్నికల్లుపాత్రము తెచ్చి వడమటింటి గుమ్మముప్రక్క గూర్చుండి పాటపాడుచు వాటికి పసుపు కుంకుమ పెట్టుచుండును.)

(జగన్నాథము వచ్చిచూచి)

జగ—(తనలో) ఏమిటిది! ఇప్పుడురమారమి జాముప్రొద్దెక్కినది. ఈబిడ వంటచేయకుండా సన్నికంటికిపాత్రమునకు పసుపుకుంకాలద్దుచు కూర్చున్నది. వంటచేయుటకు వీరింటిలోయెవరైనాడున్నారా యేమి? అదట్లుండగా ఈబిడ నాకెదురుగాగూర్చున్నది. నేనుకొత్తవాడను. ఇదివరకు పరిచయములేదు. అటువంటప్పుడు సందేహము లేకుండా ఈబిడ నాకెదురుగా కూర్చోవడం చాలాఆశ్చర్యముగా నున్నది. ఈబిడేమైనా పూజచేయునాయేమిటి; ఆపూజేమిటో అడిగి తెలిసికొందునా? పరిచయములేనివారినే పలుకరించుట బాగుండదు. అందులోఆడువారినిపలుకరించుట బొత్తిగాబాగుండదు. అయినప్పటికి అదేమో తెలుసుకొందామని నాకు మిక్కిలి యాత్రముగా నున్నది. అడిగిచూచెదను.

గంగ—నారాయణ నారాయణ ఏమిచేతును దైవమా! నామాట సాగదు.

జగ—(తనలో) ఈబిడేదో విచారపడుచున్నట్లున్నది. ఈమాటలవల్ల నాయాత్రము మరింత హెచ్చిపోతున్నది. ఇక అడగకమానను (ప్రకాశముగా) ఏమిటమ్మా! మీరేదో విచారపడుచున్నట్లున్నారు పైగా సన్నికల్లు పాత్రమునకుకుంకుమ పసపురాచి అలంకరిస్తున్నారు. అదెందుకు? ఏదైనా పూజాఏమిటి మీయింట్లో,

గంగ—నాయనా! ఈసంగతి మీరడుగగూడదు. నేను చెప్పగూడదు.

జగ—(తనలో) ఏమిది! అడుగగూడదు. చెప్పగూడదంటున్నది. ఈ పరమరహస్య మేమిటో చెపుమా? ఇది తెలుసుకోని తీరవలెను. (ప్రకాశముగా) అమ్మా! నేనెంతోఆత్రముతో అడిగినానని మీరు కోపగించుకొనక ఇదెందుకో చెప్పవలెనని కోరుచున్నాను.

గంగ—నామాటవిని నన్ను క్షమించి వదలిపెట్టండి. నా పాపము ఈలాగున బద్ధలైపోయింది. మనసులో ఇష్టము లేకపోయినా చేతితో చేయిస్తున్నది.

జగ—(భయముతో తనలో) ఈ మాటలు మరీచిత్రముగానున్నవి. నాకెంతమాత్రము తోచడము లేదు. మనస్సు పరిపరివిధాల పోతున్నది. (ప్రకాశముగా) గంగమ్మగారూ! ఈసంగతేమిటో నాకు చెప్పకపోతే పిచ్చెత్తిపోతుంది. కాబట్టి నన్ను క్షమించి చెప్పవలెను.

గంగ—నాయనా! చెప్పవలెననే నాకూ మనస్సులోనున్నది ఈరహస్యము చెప్పితే పెనిమిటికి ద్రోహముచేసినదాననౌతాను. చెప్పకపోతేబ్రహ్మహత్యాదోష మొస్తుంది. అనేతటపటాయిస్తున్నాను. ఈ రెంటిలో చెప్పడమే మంచిదని నాకుతోచినది. గనుక చెప్పుచున్నాను. వినండి! మావారు అమ్మవారిపూజ చేస్తారు. అది చాలా కాలమునుంచిచేస్తున్నారు. ఆఅమ్మవారునరబలిమ్మని కోరినదిఏలాంటి మనిషి కావాలంటె పచ్చగాదబ్బపండులా గుండచలె నలభైయేండ్ల

లోపుగా నుండవలె. మంచి బ్రాహ్మడై యుండవలె. వేదము చదువు కొన్న వాడై యుండవలె. ఆలాటి బ్రాహ్మడు ఎంత వెదకినా దొరక లేదు. నేటి కాలానికి అటువంటి లక్షణాలు కలవారు మీరు దొరికినారు. అందు చేత మిమ్ములను దేవతకు మావారు బలివేయ దలచుకొన్నారు. ఈ పొత్తరంతో తలకాయ పగలగొట్టి చంపి అమ్మవారికి నైవేద్యం పెట్టుతారు. ఆయన పిండివంటవస్తువులకై బజారుకు వెళ్ళినారు. ఈలోపుగా పాత్రా నికి సన్నికల్లుకు పసుపుకుంకుమ పెట్టుమని చెప్పి వెళ్ళినారు. మీవంటి మహానుభావుని ఈలాగు చేస్తారని నేను మనస్సులో ఎంతో దుఃఖ పడుతూ పెనిమిటి ఆజ్ఞ మీరకూడదని విధిలేక యీపని చేస్తున్నాను. నిజము చెప్పినాను. నే నేగతికి పోయినా సరే.

జగ—(భయముతో వడికి) అన్నా! అన్నా! వీడెంత దుర్మా ర్గుడు. కల్లబొల్లి ప్రేమచూపించి తీయనిమాటలు చెప్పి నా ప్రాణాలు పుచ్చుకో దలచుకొన్నాడా? అందుకా పిండివంటలు. మాతల్లీ! నీవు భూదేవతవు మహాపతివ్రతవు, నీ వుండబట్టి వానలు కురుస్తున్నవి. పంటలు పండుతున్నవి. పెనిమిటియాజ్ఞ మీరినందుకు నరకమువచ్చినను సరే యని నిజము చెప్పిన తల్లివి నీవు. నా ప్రాణము రక్షించు. త్వరగా దారిచూపించు పారిపోయెదను. నాకు కూతురుపుట్టితే నీపేరు పెట్టు కుంటాను. ఇంకొకజన్మానికి నీకడుపున కొడుకునై పుడుతాను. నా చర్మము కోసి చెప్పులు కుట్టించినా నీఋణము తీరదు మాతల్లీ! మాతల్లీ! దారిచూపించు వెళుతాను.

గంగ—నాయనా! దొడ్డిదారిని వెళ్ళు. అదిగో! దొడ్డితలుపు. వీధిదారిని మీరు వెళ్ళితే ఆయన త్రోవలో కనుపడి వెళ్ళనియ్యక తిరిగి లాక్కొని వస్తారు.

జగ—మంచిదమ్మా! ఆలాగే చేస్తాను. (అని పరుగెత్తును.

గంగ—(తనలో) దిట్టమైన పిరికిమందు పెట్టినాను. వే
హ్నాడు తిరిగిచూడకుండా పరుగెత్తుచున్నాడు. నాఉపాయము
పారినది. మా కాలమ్మతల్లికి నామీద చాలదయ. నే నేం తల
యీలాగే ఆతల్లి చల్లనిచూపులు చూచి నెరవేర్చుతూంది.
నుంచి సగ్గుబియ్యము ద్రాక్షపండ్లు గోధుమపిండి జీడిపప్పు
హాయిగాపూటకొక్క పిండివంట చొప్పున చేసికొని నేనేతింటాను
మావారొస్తున్నారు. రెండుమూడు బుట్టలుకూలి దానినెత్తిమీ
పాపము సరకులు తెప్పిస్తున్నారు స్నేహితుడు వెళ్లాడనగా
యనగుండెలలో రాయి పడుతుంది.

[అప్పుడు శోభనాద్రి ప్రవేశించును.]

శోభ—ఒసే! ఇవిగో సరకులు తెచ్చినాను. ఇంకా
న్నావేమిటె మడికట్టుకోకుండాను? పొద్దెక్కింది. లే. ఏడీమా స్నే
డేడీ? ఎవరితోనైనామాట్లాడడానికి వూళ్లోకి వెళ్లాడా యే

గంగ—(బుగ్గని చెయిబెట్టుకొని) శహబాసు. మీ స్నే
డేమిస్నేహితుడండి. ఇంతవిపరీతపు చాదస్తపుమనిషిని నే నె
చూడ లేదు.

శోభ—ఏమి! ఏమి! చేసిన దేమిటి? అతడుచాలామంచి

గంగ—మంచివాడే పాపము. చాదస్తము. నేను ఈ
టికి పసుపు కుంకుమ పెట్టుకుంటుంటే నాదగ్గరకువచ్చి ఈ రెం
కిమన్నాడు. ఏమిటో పిండివంటలు చేసుకుంటున్నాముగదా అ
ర్కి నైవేద్యము పెట్టుకుందామని యీపని మొదలుపెట్టాను. ఆం
వచ్చి నన్నడిగాడు. పరాయిమగవాడువచ్చినన్ను పలుకరించిన
నావొళ్ళు తందరెత్తింది భయపడుతూ ఇదిఅమ్మవారండి కుల
పుట్టింటివా రిచ్చారు. ఇది యివ్వడానికి వీలు లేదన్నాను. దా
నామీదకోపమువచ్చింది. వచ్చి ఛీ! మీయింట్లో! భోజనము చే

ఇటువంటి పాడుకొంపన్న మాట నాకు తెలియలేదు. అని పారిపోయి నాడండి. పాపము పట్టెడన్న మైనా మనయింట్లో తినకుండా బ్రాహ్మడు రెండుజాములవేళ వెళ్ళిపోతున్నాడని నాకెంతో విచారముగా నున్నది. ఎంతబతిమాలుకొన్నాను. చివరకీ రాళ్ళిస్తానన్నాను. ఎన్ని అన్నా తిక్క తిరిగింది కాదు. మీ రేమంటారో యని నా ప్రాణం చచ్చిపోయినట్టుంది.

శోభ — అయ్యయ్యో! ఎంత వెఱ్ఱివాడవురా నాయనా నన్నడిగితే నేను యిప్పించకపోదునా యీరాళ్ళు ? నీ వెంత తెలివితక్కువ దానవే! రాకరాక నా స్నేహితుడు వచ్చి వెఖవరాళ్ళు రెండురాళ్ళడిగితే అంతమాత్ర మివ్వకూడదు. ఇంతలోకియివ్వ ననాలనా. నీ తెలివి అలాగే తెల్లవారింది. ఇంతకు ఆ పాత్రమీలాగియ్యి. ఇది పట్టుకొని వాడివెనకాలె పరుగెత్తుకొనివెళ్ళి యిదిచ్చి బ్రతిమాలి తీసికొని వస్తాను. (అని పాత్రముపుచ్చుకొని పరుగెత్తుకొని వెళ్ళుచు) ''ఓయి జగన్నాధం జగన్నాధం ఇదిగో పాత్రము. ఇదిగో ఇదిగో రా రా పారిపోకు పారిపోకు.''

జగ — (తిరిగిచూచి గుండె బాదుకొని) ఆ దుర్మార్గుడా ఆ యిల్లాలిధర్మమూ యని నే నేలాగో యొకలాగు ప్రాణాలు దక్కించుకొని బయటపడి పోతుంటే దారిలో పట్టుకొని నన్ను కడతేర్చవలె నని పాత్రముపుచ్చుకొని తరుముకువస్తున్నావా ? నేను నీకు దొరికే వాడనుకాను. పిక్కబలములో నా ప్రజ్ఞ నీకు లేదు. చచ్చిన గేదె దూడవలె నీవు లావుగా నున్నావుగనుక నీవు పరుగెత్తలేవు. నేను సలాకు లాగున్నానుగనుక నేను పరుగెత్తిపోగలను. (అనిపరుగెత్తును)

శోభ — (తనలో) అమ్మయ్య . నా కాయాసము వస్తున్నది. ఇంక నే పరుగెత్తలేను. పాత్తర మిస్తానురా బాబూ అని నేను బతిమాలుతూ పరుగెత్తుతున్నా మొదట యివ్వలేదనే కోపముతో వద్దని

పరుగెత్తుచున్నాడు. నే నేమిచెయ్యను. ఇంతకు నా భార్య తెలివి తక్కువమనిషి కనుక వచ్చిన స్నేహితుడు వెళ్ళిపోయినాడు. కాక పోయిన పాత్రమిమ్మని అడిగిన నిర్భాగ్యుడు వీడేమి తెలివిగలవాడు. ఇటువంటి నిర్భాగ్యపు స్నేహితుల నింటికి రానియ్యడము నాదే లోపము. పోనీ! పోతేపోయినాడు. (అని నిష్క్రమించును.)

—౯—

ఆత్మగౌరవ ప్రహసనము

[భోగరాజుగారు సుందరమ్మ ప్రవేశించుచున్నారు]

భోగ—ఒసే ఈరోజునరాత్రి మనయింటికి మురళీధర రావుగారు విందుకు వస్తారు.

సుంద—మురళీధర రావుగా రెవరు?

భోగ—మురళీధర రావుగారినే యెఱుగవు. చాలాఆశ్చర్యంగా నున్నదే. ఆయన హైదరాబాదులో మన్సబుదారు.

సుంద—మునసబుదా రేమిటి, ఠాణాదారు, మిరాశీదారు అని విన్నాను. కాని మనసబుదా రని యెన్నడు వినలేదు.

భోగ—వంటయింట్లో పొయ్యిదగ్గర కూర్చుండుదానికి నీ కేమి తెలుస్తాయి యిటువంటి సంగతులు హైదరాబాదు నవాబుగారు ఎవరియందైన దయగలిగి యున్నట్టయితే, వారికి నూరు, రెండువందలు, మూఁడువందలు వెయ్యి యీలాగున సొమ్మిస్తారు, వారుద్యోగము చేయనక్కఱలేదు. ఇల్లు కదలనక్కఱలేదు. ఊరికే జీతం యింటికి పంపిస్తారు. ఈ మురళీధర రావుగారికి నెలకు నాలుగువందలు మన్సబు వస్తుంది.

సుంద—ఆలాగా! అయితే యీయనను మీరెక్కడ యెఱుగుదురు?

భోగ — నేను చెన్నపట్నంలో ప్లీడరీకి చదువుచున్న కాలములో ఆయనకూడ అక్కడకు వచ్చి ప్లీడరీ చదివినారు. అప్పుడు మాయిద్దరికి స్నేహమైనది, పాపమాయనకు కొన్ని చిక్కులు సంభవించుటచేత ప్లీడరీపరీక్ష ప్యాసు గాలేకపోయినాడు. ఆయనయిప్పుడు గోదావరిస్నానమునకు వచ్చుచున్నాఁడు. నాపేర వ్రాసినారు.

సుంద — అయితే వారెందఱు వస్తారు ఎన్నాళ్ళుంటారు ?

భోగ — వారు కుటుంబముతో నౌకర్లతో చాకర్లతోవస్తారు. వారు సత్రములో బస చేస్తారు. రేపురాత్రియట్టుకు మనయింటికి వారి దంపతులను విందుకు పిలుద్దాము.

సుంద వారు బాగా సంపన్నులు కాబోలు.

భోగ — సంపన్న లని మెల్లగా నంటున్నావా? వాళ్ళ గొప్పైశ్వర్యము వాళ్ళమేడ లంకంతున్నది. ఆవిడకుపాతికవేలరూపాయల నగ లున్నాయి. మనము కాపుర మున్న యీ యద్దెకొంప వాళ్ళగుఱ్ఱాలసాలంత లేదు.

సుంద — అలాగై తే పెద్దప్లీడరుగారిభార్యనంటూ యేమివస్తువులు లేకుండా మూసివాయనపు పేరంటాలులాగ ఆవిడయెదుర నుంచోనా! ఆవిడ మొగముచూడడానికే నాకు సిగ్గు వేస్తూంది.

భోగ — సి గ్గేమిటి; సింగినాదం. మనకున్నవస్తువు లేమిటో పెట్టుకుంటాము.

సుంద — ఉన్న వేమున్నాయి తడపలాగ మెళ్ళో కంఠిఉంది. నానుపో చోకటుంది. ఎటువచ్చీ పట్టెడోక టుంది.

భోగ — వడ్డాణముమాట మఱచిపోయినావా ?

సుంద — సరి యేనాడో నేను కాపరానికివచ్చినకొత్తలో యిరవయికాసులుపెట్టిచేయించినారు. ఈనాటివడ్డాణాలలాగ పటకాలా, మువ్వలా.

భోగ—ఏదో వొక టున్నదికదా, కాలముగడుపుకొందుకు. ఆమెయెదుట దీపపుస్తంభములాగున నిన్ను నుంచోపెట్టలేదు. ఉన్నంతలో డబ్బు కర్చుపెట్టినీకునగలుచేయించేను. నీకు నగలుచేయించడంకోసమేకాదూ మాచెల్లెళ్ళను పురుళ్ళకైనా తీసుకొనిరావడం లేదు. మాఅమ్మా మానాన్నా కాశీయాత్ర వెడతానంటే డబ్బు లేదూ పొమ్మని నీకు కంఠి చేయించాను. ఈ నగలుచాలు. చీరలు నీకు మంచివే ఉన్నాయి. దక్షిణాదిచీరలు రెండున్నాయి. పట్టుచీ రొకటుంది.

సుంద—ఎన్నినగలు లేస్తురూ. చెప్పుకుంటే సిగ్గు.

భోగ— అయితే యేమంటావు యిప్పుడు నీవు.

సుంద—బంగారువారింటికి వెళ్ళి కట్టుకాసులపేరు మొహాగీలాపేరు తెచ్చుకుంటాను. ఆవిడ వజ్రాలదుద్దులుగూడ తెచ్చుకుంటాను ఆవిడమువ్వలవడ్డాణము తెచ్చుకుంటాను. కట్టువంకీలుకూడ పెట్టుకుంటాను. అప్పుడు మనగౌరవానికి తగ్గట్టుంటుంది.

భోగ—సరే నీయిష్టమువచ్చినది తెచ్చుకో. పారేయడము మాత్రము పారేయకు.

సుంద— పారేయను కాని వంటేమి చెయ్యమన్నారు

భోగ—పూరీ లాడు పేణీ దూదిపేడా చేయాలి. అన్నమాట్టే తినరువారు. గోధుమరొట్టెలు తింటారు.

సుంద—ఈపేణీలు పేడలు ఎవరు చెయ్యగలరు. మన మామూలుకూరలు తింటారా.

భోగ—మామూలుకూర లంటే తోటకూర బచ్చలికూరా వండాలనుకుంటున్నావా యేమిటి? నీపెసరపచ్చళ్లు కందిపచ్చళ్ళూ వారు తినేవారుకారు. వారంతా తీపి గోధుమ తింటారు.

సుంద—ఆరొట్టెలు పిట్టులు నేను చెయ్యలేను, ఎవరినైనా వంటబ్రాహ్మణునిపిలిపించండి కావలసినకూరలునారలు వాడొండుతాడు

మన దేశపువాళ్ళైతే నేనెల్లాగైనా తంటాలు పడి యే బెండకాయో వండి పెడుదును. మన దేశం మన గొడవా కాదైను.

భోగ — వారి తిండి యేలా గుంటుందనుకున్నా వేమిటి. మన తిండి చచ్చుతిండి, వారింటికి భోజనానికివెళ్ళితే వి స్తరి వరహా చేస్తుంది. వాళ్ళల్లా తింటారు. ఒకరి కాలా పెడతారు. సరే నీవు చేయలే నన్నావు కనుక గణేశంగాణ్ణి పిలిపిస్తాను.

సుంద — సరే పిలిపించండి కాని మన చాకలాణ్ణి పంపించి ఆవీధి నెక్కడో అత్తరుసాహేబు లున్నారట పది పది హేనుతులాలు సంపంగినూనైనా సగే అగరునూనైనాసరే తెప్పించండి. ఒక పది అగరువత్తులకట్టలు తెప్పించండి ఒక పది అగరువుండలు తెప్పించండి.

భోగ — ఇవన్నీ యెందుకు.

సుంద — ఎందు కంటా రేమిటి. అటువంటివాళ్ళొచ్చేటప్పటికి గుమగుమలాడుతూవుండక మెతక్కంపుకొట్టుకుంటూ వుండమన్నారా యేమిటి.

భోగ — సరే నీ యిష్టము. కావలసిన వేమిటో తెప్పించుకో రూపాయ లిస్తాను. ఇల్లువాకిలి శుభ్రముగా తుడిపించు. బూజు దులిపించు. పంతులుగారింటికి పంపించి రెండు మంచిలాంపులు తెప్పించు.

సుంద — ఆలాగే తెప్పిస్తాను. కాని మీతో ఒకసంగతి చెప్పాలి మన యింటికి దిష్టిపిడత ల్లాగ మీ యమ్మా మీ నాన్నా వున్నారు. లక్ష్మీదేవిలాగా విష్ణుమూర్తిలాగా ఆ దంపతు లిద్దరు మన యింటికి వస్తే కొరివి దయ్యాలులాగ వీళ్ళిద్దఱు సిద్ధము. అత్తగారు మామగారు అని చెప్పుకుంటే నాకుసిగ్గు అమ్మా నాయనా అని చెప్పుకుంటే మీకు సిగ్గు. వారున్న కాస్సేపూ వీరిద్దఱు కనబడకుండావుంటే బాగుండును. కోడలుదాన్ని గనుక నేను గిట్టక చెప్పాననుకుంటా రేమో కాని మీ యమ్మ మాట లన్నీ లేకి మాటలు. పనులన్నీ లేకి పనులు. మూసి వాయనము ముత్తైదులాగ వాకిట్లోనుంచుంటే యేం బాగుంటుందా విడ.

ఇక మీనాన్నగారుచూస్తే వంటినిండా బూడిదపూసికొని అంగోస్త్రం మొకటికట్టుకొని కొల్లాయిగుడ్డొకటి మీదవేసికొని పొడుముపీలుస్తూ పీనుగుల మల్లయ్యలాగ వీథరుగుమీద కూర్చుంటారు. మీ రెంతో మంచివారుగనుక ఈలాటి నిర్భాగ్యపుతలిదండ్రులనుభరిస్తూవున్నారు కాని మరొకరైతే ఈపాటికి వెళ్ళగొట్టుదురు. మీయమ్మ పగలు చూస్తే రాత్రికల్లోకొస్తుంది. అమ్మవారు శివాడేదానిలాగ మొగము నిండాపసుపురాసికొనిఅర్ధణాకాసెడుకుంకముబొట్టుపెట్టుకొని కూర్చుంటే దయ్యమో భూతమో అని పిల్లలు జడుసుకుంటున్నారు రోజూను. చూస్తే అమ్మతల్లిని చూచినట్లుంటుంది. అబ్బా ? యీపీడ వొదిలింది కాదమ్మా.

భోగ—నిజమే యేమిచేయను. ఈ దిక్కుమాలినముండా యీ దిక్కుమాలిన ముండాకొడుకు అందరాయువు బోసికొని బ్రతికున్నారు వీళ్ళు చచ్చిపోవరుగదా! చచ్చిపోతే సెళ్ళమంటూ దినవారాలు చేద్దును వాడిమొగం మండా బ్రహ్మదేవుడు మరచిపోయినాడు కాబోలు వీళ్ళని. ఇంతమందికి కలరావస్తుంది. వీళ్ళకైనా కలరారాదు. నువ్వుచెప్పినట్లు వీళ్ళు యింటికి దిష్టిపిడతలే. వీళ్ళెక్కడుంటే అక్కడ దరిద్రము. వీళ్ళమ్మకడుపుకాలా వీళ్ళమూలాన్నే నాకు నెలకు నందరూపాయలకంటె యెక్కువ దొరకవు. మా ముసిలిముండాకొడుకు నోరిప్పి మాట్లాడితే తుంపర లెదటివాడి మొగంనిండా పడతాయి. అస్తమానం నోటమ్మట చొంగ. నల్లమందుకు డబ్బులు తెమ్మని జామిపళ్ళు తెమ్మని సీతాఫలంపండ్లు తెమ్మని కొజ్జాముండాకొడుకు లాగ పీక్కు తింటాడు.

సుంద—సరి మీ రాయనమాటే చూశారు. మీ యమ్మమాటెరుగరు. అస్తమానం అరిసె లొండుకుందామని, మినపరొట్టె కాల్చిపెట్టుమని పిండిచేయుమని అట్లొండుమని పీల్చి పిండెడుతుంది. ఏదోవొకట స్తమానంనోట్లోఆడుతూవుండాలి. ముసిలిదదవునా! అదేమి

తిండో అదేమిరోగమో కాని యెంత పెట్టినా చాలదు. అమ్మవారికి కుంభము తోడినట్లు తోడాలి విస్తరినిండా కడుపునకు తింటే ఆక్షేపించకూడదు. కాని పట్టెడుకూర. పట్టెడుపప్పు, నెయ్యి, జుర్రుకోవడమే. కంచంనిండా చిక్కని మజ్జిగ పోయించుకొని గడగడ తాగేస్తుంది. అది కడుపో కాలవో నుయ్యిగో నాకు తెలియదు అంత బాకాకరముంటే అసహ్యముసుమా.

భోగ——అరిసెలు చేసి అట్లాండి యీ ముసలిముండకు పెట్టి నా కొంపంతా గుల్ల చేస్తూన్నావు నీవు. అడిగినవల్లా పెడతారా. ఎన్ని పెట్టినా ఆ జిహ్వాచాపల మణగదు.

సుంద——పెట్టకపోతే నా పరువుంటుందా గుడ్లుపీకుతుంది ఊరందరితోను చెప్పివస్తుంది. ఎంతమందున్నా సరే మర్యాద లేకుండా మాట్లాడుతుంది పదిమందిలోను యీకూతకాదు ఆకూతగాదు. తనకుకట్టుకుందుకుగుడ్డలివ్వలేదట. ఏమైనా చేసిపెట్టడము లేదట. తానుకష్టపడి నీళ్ళబిందెలుమోసి అందరియిండ్లలోను చాకిరీలుచేసి మీకుచదువు చెప్పించిందట మీరెప్పుడో వారాలుచేసుకున్నారట. ఆ మాటలు విన్నప్పుడునాకు శిరచ్ఛేదమైనట్లున్నది. నేను కలకల్లాడుతూ మహాలక్ష్మిలాగ నగలు పెట్టుకొని పేరంటానికి వెడితే పింగళారిపేకిలాగ నాతోగూడా తాను సిద్ధమవుచున్నది, వచ్చింది నోరు మూసికొని వూరుకోవచ్చునా ఊరుకోదు. ఊరుకోక అక్కడమ్మలక్కలకు నన్ను చూపించి యిదిగోనమ్మ నాకోడలు మీరంతా చద్దన్న మెట్టి వేడన్న మెట్టి బట్టిచ్చి పాతిచ్చి జీతం చందాయిచ్చి చదువుచెప్పించి బాగుచేశారు గనుక మావాడింతబాగుపడ్డాడమ్మా నెలకు నూరురూపాయిలు తెచ్చుకుంటూన్నాడని కూస్తుంది అల్లాటప్పాడు నాకు చచ్చిపోయినట్లుంటుంది. అప్పుడు బండకత్తిపెట్టి

నాలిక తెగ్గొయ్యాలని వుంటుంది. నాకుఅత్తగారైతే అయింది కాని తనకి తోచకపోతే వాళ్ళరు చెప్పితే వినవద్దు. అంత మొండితనమేమి టమ్మా అంతదిక్కుమాలినబుద్ధులా.

భోగ—నిజంగా అలాగంటూంచా ప్రతి-చోటూను. ఈముండ చచ్చిపోతేనేగాని మనకీవూళ్ళో మర్యాదదక్కదు. వారాలుచేసి కొన్నాను నేను ఈ పరువుతక్కువ వెధవమూలాన్నే నాకీవారా లొచ్చాయి ఎప్పుడో చిన్నప్పుడు జరిగిన సంగతులు ఊరంతా మరచిపోతుంటే యీ యవకతవక ముండ వెళ్ళి మళ్లీ కెలుకు తూంటుంది ఈ పర్యాయము పదిమందిలో యిటువంటిమాటలంటే యింటికి వచ్చిన తరువాత గరిటెకాల్చి వాతలుపెట్టు. పాతవాళ్ళ మాట యెల్లాగున్నామా కొత్తకారు ప్లీడర్లు వుద్యోగస్తులు నాకోట్లు నాబూట్లు నాజరీ కండువాలు నాగుఱ్ఱపుబండిచూచి నేనాగర్భశ్రీమం తుడ ననుకుంటున్నారు ఈముండ నన్ను యేలి నాటిశనిలాగ పట్టు కొని వదలడంలేదు సరే యిప్పుడేమిచేదామంటావు!

సుంద—చేసేదేముంది ఈవేళరాత్రివాళ్ళువచ్చినప్పుడు వీరిద్ద రిని కనబడవద్దని గట్టిగా చెప్పండి వారు భోజనముచేసి వెళ్ళినతరు వాత భోజనము చెయ్యమనండి.

భోగ—సరే ఆ ముసలిముండతో నీవు చెప్పు ఈ ముస లాడితో నేను చెపుతాను ఏడీ చాకలి కుఱ్ఱాడు?

ఓరీ పేరిగా. ఆ ముసలాయనిల్లాపిలూ

[అప్పుడు తండ్రియైన నారపరాజు ప్రవేశించుచున్నాడు]

నార—(తనలో) ఎందుకునాయనా మావాడింత దయతో కబురంపించాడు? మొన్నకప్పుకొందుకు పక్కకు బట్టలు లేవని చెప్పి నాను అవి తెప్పించాడా యేమిటి చెప్పుమా.

భోగ—ఏమయ్యోయి ఒక్కమాట చెబుతున్నానువిను. ఈ రోజున రాత్రి మనయింటికి గొప్పవారు భోజనానికి వస్తారు.

నార—సరే రానియ్యి నాయనా సంతోషమే.

భోగ—చెప్పేమాట పూర్తిగా వినక తొందరపడి చస్తావెందుకు. నీ సంతోషమునడకి కావాలి నీ దుఃఖ మొచడికి కావాలి ?

నార—ఏమన్నానుం॥ నాయనా ఇంతలో కోపపడుతావు.

భోగ—కోపము లేదు తాపము లేదు. నోరుమూసికొని వెధవ పేలాపన పేలక విను. ఆయన మనయిటికి వచ్చినప్పుడు యీ పాడు వేషంతో ఆయన యెదర కనబడకు. గొడ్డుతోళ్ళులాగ గుడ్డలునీవును ఇంటికి పెద్దొచ్చినా పిన్నొచ్చినా చీడపాక్కు లు గోక్కుంటూ సిద్ద మవుతావు.

నార—నాయనా గొడ్డుతోళ్ళంటి గుడ్డలు కట్టుకుంటా నని ఆక్షేపిస్తావు శుభ్రమైన తెల్లని గుడ్డలు కొనిస్తే నేనుకట్టుకోనన్నానా తలంటుకుంటానురా నాయనా అంటే మంగలాడికి నాలుగు డబ్బు లియ్యవు నీమరదళ్ళు వదినెగార్లునస్తే చీరెలిస్తావు మీ యమ్మకు నీ భార్య వదిలివేసిన పాతచీర్లేకాని కొత్తవికొనియ్యవు నీబావమరుదు లకు జరీకండువాలు శాలువలు కొనియిస్తావు కాని నాకు కప్పుకుందు కొక నూలుదుప్పటియైనా కొనియ్యవు బజారునుంచి కూరతట్టలు నేనే మోసికొని రావాలి కాని యింట్లో చాకలివాడున్నా వాడిచేత నీ భార్య మోయించదు నేనెక్కడైనా అడిగితెచ్చినలంగోస్త్రాలు కట్టు కోవలసినదే కాని చచ్చినా నీవుగాని నీభార్యకాని యియ్యరు పైగా యెందుకు తెచ్చుకొన్నావని నీవు పెళ్లామును తిడతారు నీవు పెట్టవు తెచ్చుకొని తిననియ్యవు పైగా ఆలావున్నాయి యీలావున్నాయి అని ఆక్షేపిస్తావు ఏమిచేయను నేను ?

భోగ—నోరు ముయ్యి. మాలముండాకొడకా నీకీ మధ్యను చెప్పుదెబ్బలు లేక వొళ్లుపొగరెక్కింది నీ వెధవపంచాంగ నాదగ్గఅ

చెప్పవద్దు ఆయన వచ్చినప్పుడు నీ వెదర కనబడ్డావా నరికిపారేస్తాను జాగ్రత ఆయన వెళ్ళేందాకా సావిడిప్రక్కను ముట్టువాళ్ళగదిలో కూర్చో పో నోరుమెదిపావంటే జాగ్రత పళ్లేరాలగొట్టేస్తా.

నార — (తనలో) ఆ భగవంతుడు నాకు చావుపెట్టాడు కాడు ఇటువంటి కొడుకుచేతిలో బ్రతికేకంటే చస్తే మేలు (అని వెళ్ళి పోవును)

సుంద — చూశారా ఆదుర్మార్గం ఆయనను నేనుకూడా సాదించానట నన్నుచుకుంటే పుచ్చి పురుగులోడిపోతారు.

భోగ — ఆపనికినూలిన ముండాకొడుకుతో ఏమిటి పెద్దవాడన్న మాటేకాని ఉచ్చనీచాలు లేవు నాకోవుపాయము తోచింది అది బాగుందేమో విను (అని చెవులో చెప్పును)

సుంద — చాలాబాగుందీయుపాయము అల్లాచేద్దాము.

భోగ — సరే యిక నీవింట్లోకి వెళ్ళు చెప్పవలెమాత్రము చెప్పు కనబడవద్దని. ఒక వేళ దైవవశముచేత కనబడితే యీ యుపాయము బాగుంది నేను వంటబ్రాహ్మడికి కబురంపిస్తాను. పంతులుగారింటికి కబురంపించి యైదారు వెండిగిన్నెలు తెప్పించు వీలైతే వెండరిటాకుకూడా తీసికొనిరా నేను వెడుతున్నాను.

[అని నిష్క్రమించును.]

— 0 —

రంగము 2

[మురళీధరరావుగారి భార్యయమునా బాయి సుందరమ్మ ప్రవేశించుచున్నారు.]

సుంద — మీరు మా యింటికి దయచేసినందుకు నాకుచాలా సంతోషముగావుంది. గోదావరిస్నానం పేరు పెట్టుకొని వచ్చినారు. కాని వెయ్యి వరహాలిచ్చినా మాయింటికి రారు. మా వారురారు.

యము — మాపంతులుగారికి మీపంతులుగారికిని - డాజో స్తి వుండెనని చెప్పారు. ముఖ్యంగా మిమ్మల్ని చూసేదాన్కి వచ్చాను. నేను, చూస్తిని నిండాసంతోషమైంది. ఈ యిల్లు మీదేనాయమ్మా.

సుంద — ఆ! మాదే.

యము — మీ అత్తమామలున్నారా.

సుంద — లేరండి పోయినారు అంతభాగ్యముకూడానా మాకు వారిద్దరువుం టేపైన గొడుగులా గుండును. పువ్వులతో పూజచేసు కుంటూ వుందుము.

యము — ఈవజ్రపాళ్ళదుద్దులు యెంతకు చేయించారమ్మా

సుంద — మూడువందల యేభై రూపాయిలు.

యము — ఇదేమిటండీ. నిండాచిత్రముగావుంది. వెయ్యిరూపా యలు పెడితేకానినాకురావు. ఇంతచవుకగా మీకేలావచ్చాయమ్మా

సుంద — (తనలో) దిక్కుమాలినకర్మం. ఎరువు తెచ్చుకొన్నప్పు డువాళ్ళను కరీదైనా అడిగినానుకాను. (ప్రకాశముగా) మావారు మొన్న ఒకకేసులో చెన్నపట్టణము వెళ్ళికొనుక్కొచ్చారు కరీదెంతో నేనెఱుగను. మూడువందలయాభై యున్నాయని నేననుకొన్నాను.

యము — (తనలో) ఈసంభాషణచూ స్తేయివనగ లెరువు తెచ్చు కొన్నట్టుంది (ప్రకాశముగా) ఈ మొహారీల పేరెంతకరీదమ్మా.

సుంద — మోహారీలపేరాండి మొహారీలపేరు ఇది మాఅత్త గారిదండి.

యము — అబ్బా మీఅత్తగారికి చాలానగలుండేవికాబోలు.

(అప్పుడు తేలుకుట్టి యేడ్చుచు అత్తగారు ప్రవేశించుచున్నది.)

అత్త — అమ్మయ్యో! నాయినో చచ్చానర్రోయి తేలుకుట్టింది సుందరమ్మా నీమూలాన్ని కుట్టిందేఅమ్మా. వారెవరోవచ్చారనిపిడక

లగూడుచాటున కూర్చోమన్నావు. అక్కడ తేలుకుట్టి చచ్చానేఅమ్మా మందేయించవేతల్లీ. ప్రాణము పోతూందే.

యము—అయ్యయ్యో! ఎవరండీ యీముసిలావిడి పాపము పెద్దముత్తయిదువు. పార్వతీదేవిలాగుంది.

సుంద—గణేశం గణేశం. ఆవిడనవతలకు పంపిచెయ్యి.

యము—ఎవరండావిడ?

సుంద—మాయింట్లో వంటలక్కండి. చిన్నప్పటినుంచి కని పెట్టుకుంది. ఇప్పుడేమి చేయకపోయినా యింత అన్నవస్త్రాలిచ్చి పోషిస్తూన్నాము.

యము—చాలామంచివారుమీరు. ఈరోజులలో యిల్లాపో షించేవారెవరు.

అత్త—సుందరమ్మతల్లీ! జబ్బులో కెక్కిందేఅమ్మా. గునపం పోట్లు పొడిచేస్తూంది.

సుంద—గణేశం చూస్తావేమిరీ ఆవిడనవతలకుపంపించమంటే

గణే—ఏమిటండి! అత్తగారొచ్చి తేలుకుట్టి యేడుస్తూంటే అవతలకు గెంటమంటా రేమిటి?

యము—ఇదేమిటండోయి అత్తగారంటాడేమిటి. ఈవిడ మీయత్తగారా?

అత్త—అవునమ్మా! అత్తగారినే.

సుంద—(తనలో) వీడమ్మకడుపుకాలా! యీగణేశానికి బుద్ధి లేదు. ఈఅత్తగారుముండకు బుద్ధిలేదు. ఈవిడ వెళ్ళిపోయినతరువాత నిజంగా గరిటకాలేసి వాతవేస్త (ప్రకాశముగా) అత్తగారు కాదండి. మాఅత్తగారు చచ్చిపోయి యిరవయేళ్ళయినది. మాఅత్తగారు చ చ్చిపోయినప్పటినుంచి యీవిడ మాయింట్లోవుండి వంటచేసిపెడుతూ

వుంటే ఆవిడను అత్తా అని పిలుస్తాము. ఆవిడ మమ్మో యేమే అంటుంది వంటబ్రాహ్మణుడు కొత్తవాడేకనుక అత్తగారనుకున్నాడు. పైగా యావిడకు మతిలేదండి. తింటే అదేతినడం నవ్వుతేఅదేనవ్వడం యేడుస్తే అదే యేడవడం. ఈవిడ వెఱ్ఱిదవడంచేతను నిజంగా తేలు కుట్టినదో లేదో సందేహమేనండి.

అత్త—నారాయణ నారాయణ యిదేమికర్మమే! కిట్టకపోతే కిట్టనట్లుండు గాని నేను వెఱ్ఱిదాన్నా ? మీాయింట్లో వంటలక్కనా? అమ్మా! మీారు మహాలక్ష్మివంటివారు. నేను అందంగాలేనట. మీా వంటివారు వస్తే కనబడకూడదట అందుచేత పిడకలగూడు చాటున కూర్చోపెడితే అక్కడ నన్ను తేలుకుట్టింది. భోగరాజు నా కొడుకే అమ్మా. ఈయమ్మతల్లి కాపరానికి వచ్చినప్పటినుంచి నేను నా కొడుక్కి దూరమైపోయినాను నోటినిండా అన్నంలేదు. కట్టుకుందా మంటే బట్టలేదు. పైగా వెఱ్ఱిదని పేరెట్టారు.

సుంద—మాటలన్ని పిచ్చిమాటలేనండి మతిస్థిరము లేనివాళ్ళతో మీారెందుకు మాట్లాడుతారు. ఇప్పుడు మిమ్మలినికూడా తిడుతుంది.

అత్త—వంటలక్కనైతే అయినానే మందేయించవే చంకలో కెక్కింది.

సుంద—అమ్మాయీా! పిచ్చిదాంతో యేమిటి. మనమవతల కెళ్ళి కూర్చుందాము రండి.

యము—అయ్యో! పాపము! వెఱ్ఱిదేకానివ్వండి తేలుకుట్టి బాధపడుతుంటే మందు వేయించకపోవడం యేమిటమ్మా ?

సుంద—అయ్యో! మీారెరుగరండి ఆవిడసంగతి. మతిస్థిరము లేక రోజూ తేలో జెఱ్ఱో కుట్టిందంటుందండి.

యమ—(తనలో) ఈ యింటిచరిత్రంతా యేదో నాటకము లాగ కనబడుచున్నది. నాకు డాబుదర్పము యెక్కువుంది. (అని సుందరమ్మతో వెళ్ళును.)

—o—

రంగము 3

[అప్పుడు మురళీధరరావుగారు, భోగరాజుగారు, ప్రవేశించుచున్నారు.]

భోగ—తమరు దయచేయడం మాకు పరమానందంగావుంది. మనము వెనక చెన్నపట్టణంలో కలుసుకొన్న తరువాత మళ్ళీ మన మిదే కలుసుకోవడం.

ముర—ఎన్నోసారులు నేనిక్కడికి రావాలని ప్రయత్నంచేసినాను. కాని నిండా పనితొందరచేత సాగిందికాదు. కాని నేటికి ప్రాప్తంవుంది. మీ కోర్టులోకల్లా పెద్దప్లీడ రెవరండీ.

భోగ—వయస్సుచేత పెద్దలు చాలామందున్నారు. కొందఱు పొడుగ్గా తాడిచెట్టంత పెద్దలుకూడా వున్నారు. ఏదోమసిపూసి నేరేడుకాయచేసి రెండులక్షలు సంపాదించినవాళ్లూ వున్నారండి. కాని వుప్పుపత్రిలేదు నోటంట ఒకడు సరిగా క్రాసెగ్జామినేషను చేయలేడు. జడ్జీగారికి నచ్చేటట్టు వాదనచేయలేడు. నన్ను నేను చెప్పుకొన్నానని మీరనుకోవద్దు. నేను నుంచున్నానంటే యెవరపార్టీప్లీడరికి గడగడ. నేనార్గ్యుమెంటుచేస్తూంటే తియ్యనీటికి చేపెక్కినట్టు జడ్జీ ముసిముసి నవ్వులునవ్వి యింకాచెప్పమంటూంటాడు. క్రిమినలుకేసు పుచ్చుకున్నానంటేనాదినార్టనుతడాఖా నేనుబియల్ ప్యాసయ్యానుకానుకానండి ప్యాసయితేనా హైకోర్టులోకి వెళ్లిఆచెన్నపట్నంలోవున్న అయ్యంగార్లను అయ్యర్లను అవతలకూర్చోపెట్టకపోదునా:అయితే యీపార్టీవెధవల కెంత బుద్ధిలేదోకాని ఒకరు మనదగ్గఱకురాక అంతా ఆ పాత

పీనుగుల చుట్టూ తిరుగుతారు వాళ్ళ మోసపుమాటలలో పడిపోతా రండి మనమల్లాటిమాటలు చెప్పము.

ముర—తెలివితేటలు లేకపోతే వాళ్లదగ్గఱ కెందు కెడ్తారు పార్టీలు.

భోగ—యూడోంట్నో సార్ మీకు తెలియదండి దేరార్ సీక్రెట్సు. కొన్ని రహస్యాలున్నాయండి. పార్టీలను తీసుకువచ్చే యేజంట్లుంటారండి అక్కడ. మనకల్లాంటివి కిట్టవు

ముర—సరే యిక్కడస్థితిగతు లెల్లా గున్నాయో మాకేం తెలుస్తుంది.

[అప్పుడేడ్చుచు తల్లి గంగమ్మ ప్రవేశించు చున్నది

తల్లి—అమ్మయ్యో! జబ్బల్లో కెక్కింది ప్రాణాలు పోతూ న్నాయి.

[అప్పుడు గదిలోనుంచి తండ్రి నారపరాజు ప్రవేశించుచున్నాడు]

నార—ఏమిటీ యేమిటే తేలు కుట్టిందా అయ్యో అయ్యో మందు వేయించవ్బాబాయీ మందు వేయుంచు మందు వేయించు.

ముర—ఎవరండి వారిద్దరూనూ.

భోగ—మైకుక్సు.

నార—ఏమిటి నేను కుక్కనంటూన్నాడా ?

ముర—లేదండయ్యా! కుక్కన లేదు. మీరు వారింట్లోవంట చేసేవారని చెప్తున్నారు. అందులో తప్పేమీ లేదు.

భోగ—(తనలో) వీళ్లమ్మకడుపుకాలా వీళ్ళిద్దఱు సిద్ధమయి నా రే సమయానికి గుట్టు బయలుపడిపోయింది. ఏమిటుపాయమిప్పుడు.

నార—ఏమిటీ! మేమిద్దఱము వంటవాళ్లమని చెప్పాడా వీడు మీతోటి. నేను వంటవాడి నయితే వీడు వంటలవాడికొడుకు. నేను కుక్కనయితే వీడుకుక్క కొడుకు. దీనిలో రహస్యం చెపుతావినండి.

ఇదిగో ఇదివీడమ్మ, వీడమ్మ మొగుణ్ణి నేను అదివీడితల్లి నేను వీడితండ్రిని సని చెప్పుకుంటే సిగ్గట, వీడి కవమానమట, అందుచేత వంటవాళ్ల మని చెపుతాడు. మీవంటి గొప్పవాళ్లు వస్తే మేము కనబడకూడదట. అందుచేత దాన్ని పిడకలగూడుదగ్గఱ కూర్చోమన్నాడు నన్ని ముట్ల గదిలో కూర్చోమన్నాడు పోనీ వాడికంతకష్టంగావున్నప్పుడు మన మెందుకు కనబడాలని ఆలాగే కూర్చున్నాము. దీనమ్మకడుపుకాలా యీ తేలిప్పుడే తట్టాలా, అందుచేత అది యివతలకు రావలసి వచ్చింది. నేను ముష్టెత్తి అందఱిళ్ళల్లో చాకిరీలుచేసి నీరుకాసులు పట్టి పొత్తరలుపట్టి సంభావనలకువెళ్ళి కష్టపడి వీడికి చదువుచెప్పించాను. అందుచేత నేను వీడికి తండ్రిగావుండడానికి తగనట. మాటాడితే చెంపకాయలు కొడతాడు. బూతులు తిడతాడు ఇక నే నిక్కడుండను. సెలవుపుచ్చుకుంటాను. రావే నేను ముందు వేయిస్తాను.

(అని యిద్దఱు నిష్క్రమింతురు)

ముర—ఇదేమిటండీ ఆముసలాయన అల్లా అంటాడు. వాళ్ళు మీ తల్లిదండ్రులా ? మీతల్లిదండ్రులు లేరని చెప్పారే వీరెవరు ?

భోగ—వాళ్లు మాతల్లిదండ్రులు కారండి. మాయింట్లో వంటలవాళ్లు మావాళ్లు చచ్చిపోయినారు చిన్నప్పటినుంచి చనువుగా వుండడంచేత అల్లా అంటారు, వాళ్లుపిచ్చివాళ్లు వాళ్ళమాట పాటించకండి.

ముర—(తనలో) ఇదేదో మహామాయగావుంది. ఆవృద్ధులు నిజంగా తల్లిదండ్రులై యుండవచ్చును. పార్వతీపరమేశ్వరులులాగ మంచివాళ్ళలా కనబడుతూన్నారు. అయినా మనకెందుకు. (ప్రకాశముగా) అయ్యా, భోజనాలైనవిగనుక యిక మేము సెలవు పుచ్చుకొని సత్రములోనికి వెళ్ళి పడుకుంటాము.

భోగ—చిత్తము.

(అందఱు నిష్క్రమింతురు)

—౫—

వరదక్షిణ ప్రహసనము

[అల్లూరు రాఘవరావుగారు — పురోహితుండైన చిదంబరదీక్షితులు గారు ప్రవేశించుచున్నారు]

రాఘు — ఏమండి, దీక్షితులుగారు నేను చెప్పినమాటేమి చేసినారు, మా దామోదరరావు జాతకము సరిగా వ్రాసినారా లేదా? నేను మీతో చెప్పినమాటలు జ్ఞాపకమున్నవా? వాడు, మన్మథ సంవత్సరములో జన్మించినాడు. వైశాఖమాస మని జ్ఞాపకము. తిథి వారనక్షత్రములు జ్ఞాపకము లేదు. జ్ఞాపక ముంటేమి లేకుంటేమి. ఏదో మంచి తిథి చూచి గ్రహము లన్నిటిని ఉచ్చదశలో పెట్టి అఖండయోగము పట్టేజాతకము వ్రాయండి. ఆ సంవత్సరములో కుదురకపోతే దుర్ముఖి సంవత్సరములో పుట్టినట్టు వ్రాసినాసరె. ఒక యేడు తక్కువవయస్సులాగాకూడా కనబడుతుంది. ఈ యాండ పెండ్లి వాండ్లు నరపట్టము, తెలివి తేటలు. సాంప్రదాయం చూచుకోడం లేదు. జాతకం తే, జాతకం తే అంటారు. అందుచేత మంచిజాతకం వ్రాసి వాళ్ళమొఖాన పార వేదాము.

చిదం — తమ శెలవైతే వ్రాయక మానుతానా బహుశా మన్మథలోనే కుదరవచ్చును; లేకపోతే దుర్ముఖిలోనో అంతకు కుదురక పోతే హేవిళంబిలోనో వేస్తాను హేవిళంబిలో పుట్టినట్టు వ్రాస్తే యిప్పటి కిరువదియేండ్లే వుంటాయి. గొప్ప కుటుంబాలలో పిల్లవాళ్ళకి రెండేళ్లు తక్కువుంటే మంచిది. వయ సెక్కువుంటే గొప్పవాళ్ళ పిల్లవాడుగదా యిరువదిరెండేండ్లవర కెందుకు పెండ్లికాలేదని యడుగుతారు.

S.V.O. College
Library,
TIRUPATI.
Acc. No. 8088
Date ..

రాఘు-వహవ్వా! వహవ్వా! బాగుంది హేవిళంబిలోవేయండి. జాతకం యేలా గుండా లనుకొన్నారు. అన్నిగ్రహాము లుచ్చదశలో నుండాలి. విద్యాస్థానంప్రశస్తంగాఉండాలి. ధనజాతకమైయుండాలి! ఆహేడ్మాస్టరు ఈయేడు స్కూలుఫైనలుపరీక్షకు పంపించకపోవలె ననుకొన్నాడుకాని, క్రిందిమాస్టరులలో యిద్దరు కాస్త మంచివాళ్ళున్నారు. ఇద్దరికీ చెరొకపందుం ధాన్యం పారేసి మార్కులెక్కువ వేయించి పరీక్షకు పంపించేటట్టుచేశాను. మీజాతకంతో సంపూర్తవుతుంది.

చిదం—జాతక మెంతసేపుగాని వ్రాయడం. రేపుదయం పట్టుకొస్తాను. కాని యిప్పుడొకమాట చెప్పడానికొచ్చాను. గోపరాజు నరహరిరావుగారి దగ్గరొకాడపిల్లయున్నది. ఆపిల్లను మీయబ్బాయి కియ్యవలెననివా రాలోచించి వారిపురోహితుడిని పంపించారు. ఆయన వీథియరుగుమీద కూర్చున్నారు.

రాఘు—ఏమిటీ! వీథరుగుమీద కూర్చున్నారా? ఆమాట ముందుగా చెప్పావుకావేమయ్యా. జాతకవిషయములో మన మనుకొన్నమాటలు కొంపతవ్వి ఆయనకు వినబడలేదుకదా.

చిదం—అబ్బే! ఎక్కడో అరుగుమీద చివర కూర్చున్నాడు. ఆయనకు వినబడలేదు.

రాఘు—సరే! అయితే ఆయనను తీసుకొనిరండి.

చిదం—చిత్తము. (అని వెళ్ళి రాయప్పఅవధానులుగారిని తీసుకొని ప్రవేశించును.)

రాఘు—దయచేయండి అవధాన్లుగారూ! నమస్కారము.

చిదం—వీరేనండి రాయప్పావధాన్లుగారు; గోపరాజు నరహరి రావుపంతుల్లుగ్గారి పురోహితుడు. షోడశకర్మాధికారి; స్మార్తంలో వీరెదుట మరెవరునిలబడ లేరు. స్వాధ్యాయంగూడాగట్టిగా వచ్చును.

రాఘు—అలాగా! విన్నాముగాని దర్శనమెప్పుడు చేయ లేదు.

చిదం—నరహరిరావుగారికోమార్తెను మనఅబ్బాయి కియ్యవలెనని యుద్దేశమున్నది. ఆపనిమీద వీరు దయచేసినారు.

రాయ—చిత్తము ఆపనిమీదనే నేనువచ్చినాను. గోపరాజువారంటే దేశప్రఖ్యాతులు అల్లూరువారంటే అంతకంటే ప్రసిద్ధులు. అందుచేత మీరుభయులు వియ్యమందితే జనకమహారాజు దశరథమహారాజు వియ్యమందినట్లుంటుంది.

రాఘు—అబ్బో! అబ్బ! రాత్రీపగలూ నిద్రాహారం లేకుండా పీక్కు-తింటున్నారండిసంబంధంకోసము సబుజడ్జీగారుకోదండరామయ్యపంతులుగారు తమపిల్లనే యిస్తామంటున్నారు. డిప్టీకలెక్టరు గోపాలగారు తమపిల్లను చేసికోమ్మని బలవంతపెడుతున్నారు. భద్రంపేట జమీందారుగారు మీతో వియ్యమందితేచాలు మాపిల్ల నేలాగైనా మీలో పడేసుకోండి యని వర్తమానంమీద వర్తమాన ముంపుతున్నారు. ఉత్తరాలొస్తున్నాయి మనుష్యులొస్తున్నారు. ఎన్ని వేలు కావలెనంటేఅన్ని వేలు వరదక్షిణయిస్తామంటున్నారు. బాలతోడుగు వెయ్యిరూపాయలునగలిస్తామని కొందరు, రెండు వేలిస్తామనికొందఱు మూడు వేలిస్తామని కొందఱు బతిమాలుతున్నారు.

చిదం—అవునవును. వీళ్ళకు జవాబు చెప్పలేక ప్రాణమువిసికిపోతున్నది.

రాయ—రాఘవరావుపంతులుగారి సంబంధమంటే యెవరు వదలిపెడుతారు? ఇటువంటి పరువుగలసంబంధము తల్లక్రిందల తపసు చేసినా దొరుకుతుందా? మీతో వియ్యమందడాని కెవ రదృష్టము చేసికొని పుట్టారో వారికి లభ్య మౌతుంది.

చిదం—నిజమే! నియోగులలో అల్లూరువారంటే దేశ దేశాలు పేరుమోచినవారు స్థితిగతులుచూస్తే చాలగొప్పవి. సాలుసనా

లుగు వేలరూపాయలు భూములమీదవస్తవి. కొడుకువక్కంటికి వెయ్యి రూపాయలు ఆస్తి ఇదంతా రాఘవరావుపంతులుగారి స్వార్జితమే ఇదిగాక ముప్పదినలుబది వేలరూపాయలువడ్డీకితిరుగుచున్నవి. పదివేల రూపాయలు జవాహరి వున్నది. సాంప్రదాయము మంచిది. వీరు దంపతులిద్దరు మిక్కిలియోగ్యులు, ఈకాలపువారు కారు. పిల్లవాడు లక్షణమైనవాడు. చదువులో సీమమిరపకాయ. ఈలాంటిసంబంధం దొరకమం టేదొరుకుతుందా? ఈపిల్లవాడిజాతకం అఖండజాతకం జాతకరీత్యాచూస్తే హైకోర్టు జడ్జీపని చేసేటట్టున్నాడు.

రాయప్ప—అందుకనే మేమంతా యీలాప్రాధేయపడడం.

రాఘు—అయ్యా! అవధానులుగారు తమరు శ్రమపడి దయచేసినారె. ఏం చెప్పడానికి నాకేంతోచడం లేదు నరహరిరావుపంతులుగారిని నే నెరుగుదును. గోపరాజువారికీ మాకూగూడా యిదివరకు సంబంధము కలిసిందే. మాపిన్నత్తగారి మనుమడికి గోపరాజుగారి పిల్లనే యిచ్చారు. అయితే వకటిరెండు చిక్కులున్నాయి యిందులోను. ఈరోజులలో పిల్లవాళ్ళు మునుపటి పిల్లవాళ్ళు కారు మా అబ్బాయి “బాబయ్యా! నేనుబియ్యేప్యాసయితేనే కాని పెళ్ళి చేసుకో” ననిపట్టుపట్టికూర్చున్నాడు ఎంతమంది చెప్పినావినడం లేదు పైగా వాడికి పందొమ్మిదేళ్ళు వెళ్ళియిరవైయేళ్ళు వచ్చినవి వాడేమోగాని పదహారోయేటినుంచి పెండ్లి చేసుకోనని దెబ్బలాట. లేకపోతే పదహారోయేటే పెండ్లయిపోను వాడికి. ఈనాటిపిల్లవాళ్ల కెంతతోస్తే అంతేగాని పెద్దవాళ్ళు చెప్పడం, వినిడం లేదు. వాడితో నాలోచించిగాని నేనేమాటా చెప్పడానికిన్నీ వీలు లేదు. ఒకవేళ కట్నం, కానుకలవిషయమై సందేహముండి నేనిలాగంటున్నా ననుకొన్నారేమో కట్నాలంటేనాకు తలనొప్పి. అదిఆడవాళ్ళవ్యవహారంగాని మనవ్యవహారం కాదు. సాం

ప్రదాయం చూశనలె; పిల్ల లక్షణంగా వుందా లేదా. ఆరోగ్యంగా వుందా లేదా, అనిచూచుకోవలె, డబ్బు పావనమటండి! డబ్బుభోగం ముండ గడిస్తుంది, కట్నాలడిగేవాళ్లను చూస్తేనాకుమంట. అదిగాక మగపిల్లలకు మంచిచదువుకునే వయస్సులో పెండ్లి చేస్తె చాలాచిక్కులున్నాయండీ. అందుచేతనాకూ ఇష్టము లేదు. చిన్నప్పుడు పెండ్లి చేయడం. అయితే మా అమ్మగారు త్వరగా పెండ్లిచేయుమని పట్టుపడు తుంది. మావంశములోనండి మాతృ దేవతమాట కడుగుదాటము. అందుచేత మాపిల్లవాడినేలాగైనా వప్పించి యేలాగైనావివాహము చేయవలెనని ఆలోచిస్తున్నాను. ఐతే నరహరిరావుపంతులుగారి కుమార్తె జబ్బుగానున్నదని యెవరో చెప్పినారండి!

రాయ—జబ్బేమిటిలెండి. ఏదో ఆనుధ్య దగ్గు. జ్వరం. వచ్చి కొంచసు స్తీచేసింది. మందిప్పించాను. తగ్గింది, పర్వాలేదండి.

రాఘు—సరే! నేనాలోచించి వర్తమానం చేస్తానని నరహరి రావుగారితో మనవిచేయండి. తమరు రేపు వెళ్ళవచ్చును. ఈ వేళ కుండండి.

రాయ—చిత్తము ఆలాగే వుంటానండి. ఏదోవిధంగా తమరనుగ్రహించాలి.

రాఘు—సరే చూతాముగదండి.

(రాయప్పావధాని నిష్క్రమించు చున్నాడు)

చిదం—తమతో అబ్బాయి వివాహమువిషయమై వకటి రెండు సంగతులు మనవిచేయవలెను. మనమిద్దరము బెజవాడ వెళ్ళి నండూరి వారిపిల్లను చూచినాముకదా! వారు వెయ్యిన్నూటపదార్లు కట్నమిస్తామన్నారు. లాంఛనం జరుపుతామన్నారు. పిల్లను తమ కళ్ళతో తమరే చిత్తగించారు. రంభలాగుంటుందికదా! నుతాబా

కాని, అది పిల్లకాటు. అమ్మగారికికూడా ఆపిల్లను చేసుకోవాలనే వుంది. తను రేమంటారో ఆవిషయంలో,

రాఘు — ఆపిల్లకు బాలతోడు గేమయినావుందా?

చిదం — అది లేదు. ఏదో నూరుహూపాయులు వస్తువులకంటె యెక్కువ లేదు.

రాఘు — పిల్ల బాగానేవుంది కాని యేదోముచ్చిబొమ్మలాగుంది? కళా కాంతులు లేవు. అయినా సంసారిదాని కందమెందుకయ్యా. భోగముదా యేమిటి? ''భార్యారూపవతీ శత్రుః''అన్నాడు శాస్త్రకారుడు. అటువంటిపిల్ల యింట్లోవుంటె చిక్కు. నాకాపిల్లవద్దు

చిదం — సింగరాజువారిపిల్లను చూచి రమ్మన్నారు. చూచి వచ్చాను. ఆపిల్లా లక్షణంగానే వుంది. పెద్దపిల్ల. ఆరుమాసములకు కాపురానికివస్తుంది. అబ్బాయికి యీడూ జోడని నా అభిప్రాయం. వారు కూడా వెయ్యిన్నూటపదార్ల కెక్కువ యియ్యలేమన్నారు.

రాఘు — అంత పెద్దపిల్ల మన కెందుకండీ! పిల్లవాడి చదువుచెడిపోతుంది. పెండ్లాముతో కాపురంచేస్తూ చదువేమిటి వెధవచదువులు,

చిదం — వాడ్రేవువారిపిల్లను చూచిరమ్మని తమరు సెలవిచ్చారు. ఆపిల్లనుకూడా చూచివచ్చాను. ఆపిల్లకుతండ్రి సంగీతం చెప్పించేడండి ఆహాహా! వీణెపుచ్చుకొని యెంతబాగా పాడిందను కొన్నారు. శేషువాలకించేట్టుగాపాడిదండీ! ఆపిల్లనుచేసుకుంటే బాగుంటుందండి. పిల్లకూడా దబ్బపండులా గుంటుందండి, ఆపిల్ల తండ్రి కట్నం కానుక తనకు తోచింది పెడుతాను. ఖండించి తన్నైవరడుగ కూడదంటున్నాడు.

రాఘు — ఆపిల్లనాకేకాదునాశత్రువులకుకూడా వద్దుబాబూ! సంగీతమునేర్చుకొన్న కోడలున్నదంటే కొంపకప్రతిష్ట. కొంప భోగ

ముదానికొంపై పోతుంది. ఎక్కడెక్కడ లేని సంగీతపాటకులు వచ్చి సావిడి నింపుతారు. ఆపిల్ల మనకువద్దు.

చిదం.—రాచర్ల వారిపిల్ల వున్నది. ఆపిల్లను మీఅమ్మగారు భార్యాగారుకూడా చూచారు. పిల్ల భారతభాగవతాలు గడగడ చదువుతుంది. ఇంగ్లీషుకూడా, కొంచెము వచ్చును. ఇస్కూలులో చదువుకొనేటప్పుడెన్నో బహుమానాలుకూడ పుచ్చుకొన్నదట. చాలా తెలివిగలది. పచ్చగావుంటుంది. చేరడేసికండ్లు. కట్నంవిష యంలో సందేహంగావుంది. లాంచనాలు, అన్నీకలిసి వెయ్యిరూపా యలకన్న యెక్కువియ్యరట.

రాఘు—భారత భాగవతాలు చదువుకొన్నకోడ లెందుక య్యాహునకు? ఉద్యోగంచేస్తుందా, ఊళ్ళేలుతుందా? వాకిలూడ్చు కొని యిల్లలుక్కొని, మగడికింత అన్నమువండిపెట్టి కాపురం చేసేది కావలెకాని, చదువులు సరస్వతులెందుకు మనకు.

చిదం—అయితే తమభిప్రాయమేమిటో చెప్పండిమరి—

రాఘు—గోపరాజువారిపిల్ల ఏలాగుంది ? వీరిసంగతేమిటి ?

చిదం—చెప్తావినండి! గోపరాజు వారిసాంప్రదాయం మం చిది. ఆయన చాలాయోగ్యులు. భార్యాకూడా అటువంటిదే. నిరం తరాన్న ప్రదాతలువారు. వారిపిల్లకు పన్నెండేండ్లున్నవి. మూడు వేలు రూపాయలు కట్నమిస్తారు. రెండువేలరూపాయలు శాలతోడు గండి. రానూపోను రైలుఖర్చిస్తారు. వియ్యపురాలి లాంఛనాలక్రింద మూడువందలిస్తారు. పెండ్లికుమారుడికి వెండిచెంబులు, కంచం, పట్టు బట్టలు, ఉంగరం ఉత్తరజంధ్యాలువగైరాలిస్తారు. చాలావైభవంగా పెండ్లిచేస్తారు.

రాఘు—పిల్లయేలాగుంది ?

చిదం—పిల్లబంగారపు బొమ్మకాని—

రాఘు—కాని అంటున్నా రేమిమీరు ?

చిదం—మీదగ్గిర నిజందాచకూడదు ఆపిల్ల రెండుసంవత్సరములుగా జబ్బుగావుంది. క్షయజాతిజబ్బు. నానాటికిచిక్కిపోతూంది. తండ్రిగారు చాలామందులిప్పిస్తున్నారు అవేమిప్రయోజనంగావున్నట్టుకనబడదు. పిల్లకు యెటూకానివయస్సయినది బ్రతుకుతుందో లేదో యెవరుచెప్పలేరు. పెండ్లిచేయవద్దని బంధువులు పట్టుపడుతున్నారు. ఆయన చాదస్తుఁడు. కర్మిష్ఠి; బ్రతుకదని పెండ్లిచేయడం మానివేస్తె ఆయుఃప్రమాణము దైవాధీనము, తీరాబ్రతుకుతుందేమో జబ్బులోనే రజస్వలవుతుందేమో యనిభయము. అటువంటిపని జరిగితే నరహరిరావుగారు శాస్త్రంలో చెప్పినట్లు గంగాప్రవేశం చేస్తారుగాని జీవించరు. బ్రతుకుతుందని తెగించి అయిదారువేలు ఖర్చుపెట్టి పెళ్ళిచేస్తె తీరా చచ్చిపోతే యింతసొమ్ముదండుగని బంధువులు పెండ్లిచేయవద్దని సలహాచెప్పుచున్నారు. ఆయన పెండ్లిచేయకపోనను దైవయోగ మేలాగున్నదో అని నిశ్చయించినారు. ఆయనసొమ్మును లెక్కచేసేవారుకారు. అటువంటి బిడ్డపోతే సొమ్ము లెక్కేమిటన్నారు, రాయప్పవధానిగారినికూడా అడిగాను. ఆపిల్ల జీవించదన్నారాయన. అయితే తండ్రిప్రాణంగనుక జీవిస్తుందని ఆశ ఆయనపెట్టుకొన్నారు. పైగా రజస్వలవుతుందనే భయంచేత పెండ్లి చేస్తున్నారు. ఈవిషయంలో తమయభిప్రాయమేమిటి? ఇంతమాత్రం కట్నంవచ్చేసంబధముమరివకటిలేదు.

రాఘు—అయితే పిల్లజీవించదని స్పష్టముగా చెప్పాడా ఆయన?

చిదం—ఆహా! స్పష్టముగా చెప్పాడు. వచ్చినవైద్యులందరు పిల్లనుచూచి పెదవి విరుస్తున్నారట.

రాఘు—వైద్యులనగా దేముళ్ళాయేమిటి! వాళ్ళు తప్పక బ్రతుకుతారన్నవాళ్ళుచావవచ్చును. వాళ్ళుచస్తారనిఆశవదలుకొన్న వాళ్ళు జీవించి రాళ్ళలాగ నుండవచ్చును. ఆయుర్దాయము వీళ్ళనోట్లో

నున్న దా యేమి. వైద్యులమాటే అలాగుండగా రాయప్పవధానుల మాట మన మేమంత నస్మ్మగలము ? ఎందుచేతనోగాని: ఆ పిల్లనే మనవాడికి చేసుకోవలెనని నాకు పుట్టినది.

చిదం—"జనవాక్యం తు కర్తవ్య" మన్నాడు. పదిమంది బ్రతుకదని చెప్పుచున్నారు మనం చేసుకోవడ మేమి బాగున్నది.

రాఘు—బతక్కపో తేంలేదుట. మనలో మనకు సందేహాలెం దుకు నామనస్సులో నున్నమాట చెప్తావిను. మూడువేలరూపాయలు కట్నమిస్తారు; రెండువేలు రూపాయలు బాలతొడుగుపెడ్తారు. రాను పోను ఖర్చులిస్తారుకదా! మనం తరలివెళ్ళి మూడు నాలుగువందల రూపాయలతో పెండ్లి కానిచ్చివస్తాము. పిల్లచస్తె దినవారపుఖర్చు కదా! శ్రాద్ధాల వెంకటావధానులను యిరవైయైదురూపాయలిస్తే దినవారాలంతా తేల్చివేస్తాడు. ఎలాగైనా మనకీవ్యాపారంలో అయిదువేల రూపాయలు లాభం.

చిదం—తమరు చెప్పినమాట నాకు నచ్చినదిగాని తరువాత తమపిల్లవాడిని రెండవ పెండ్లివాడంటారు.

రాఘు—అంటే అన్నారు. అన్నందువల్ల మనకొచ్చిననష్టమే మయ్యా? కాదాయనంటే రెండవపెండ్లికి స్నాతకముండదు. అదిమరీ మంచిది. శ్రమాలేదు. ఖర్చులేదు. ఈవివాహమువల్ల అయిదువేల రూపాయలు లాభమొస్తున్నాయి. రెండవసారి పెండ్లికి మూడువేలైనా గుంజకపోను. మానియోగులలో మొలతాడుకట్టిన మగపిల్లవాడు కనబడడంలేదు. అందుచేత యెంతకట్నమడిగితే అంతకట్నం పోస్తారు. రావడానికి వీలున్నప్పుడు రాబట్టుకోవద్దా! సొమ్ముచేదా యేమిటి? సభలలోనికి వెళ్ళినప్పుడు, పదిమందిలో కూర్చున్నప్పుడు కట్నాలపద్ధతి మంచిపద్ధతి కాదయ్యా అని నేనూ అంటాను. నిడదవోలులో జరిగిన సంఘసంస్కరణసభలో నేను గొంతెత్తి అఱువ

లేదూ? ఎవరైనా అడిగితే ముసలిముండ మాఅమ్మ బ్రతికుందిగదా దానిమీద పెడతాను. ఆబిడ జీవించి యున్నందుకు నాకీ ఉపకారం చేస్తుంది. రెండవది నా పెండ్లామున్నదికదా! అది కొంచెమైనా చదువుకోలేదు, మూర్ఖపుపట్టు పట్టుతున్నదని దానిమీదికి తోస్తాను. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.

చిదం—మీరు చెప్పినదిచాలా బాగున్నదండీ! ఇది తోళ్ళ వ్యాపారంవంటిది. చచ్చినజంతువులతోళ్ళతో వ్యాపారంచేసేవాళ్ళు కొందఱు, బ్రతికినతోళ్ళతో వ్యాపారం చేసేవారుకొందఱు. దీనికి చాలిందింకొకటిలేదు సరే నేను వెళ్లి నరహరిరావుపంతులుగారిదగ్గర తాంబూలం పుచ్చుకొనిరానా యేమిటి?

రాఘు—అవశ్యము మీరువెళ్లి తాంబూలం పుచ్చుకొనిరండి కట్నం మూడువేలు, వియ్యపురాలిలాంఛనాలు మూడువందలు, రాను ఖర్చులు నూరు పోనుఖర్చులు నూరు మొత్తం మూడువేల అయిదు వందలు వచ్చేటప్పుడు పట్టుకొనిరండి.

చిదం—చిత్తము. మధ్యాహ్నము వెళ్ళుతాను.

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు)

—౫—

రెండవరంగము

[రాఘవరావు, చిదంబరదీక్షితులు, నరసింహారావు, ప్రవేశించుచున్నారు.]

నర—పాపము! తమకు చాలాకష్టమువచ్చింది. పిల్లవాడికి సరిగ్గా యిరవై యేండ్లయినా లేవు. అప్పుడే వివాహంకావడం, భార్య పోవడం, చాలాకష్టము.

చిదం—అది పూర్వజన్మకృతమండి! రాఘవరావుగారు ధర్మ రాజుగారు ఆయన కిటువంటికష్టము రాతగ్గదికాదు. ఆయనమట్టుకు

గర్భవాసానపుట్టిన కూతురుపోయినట్టుందికాని, కోడలుపోయినట్టులేదండి! ఆపిల్లకోసం రాత్రీపగలూ కంటికి నేలకు ఏకధారగా విచారిస్తున్నారు.

రాఘు—నరసింహారావుగారూ నాగృహలక్ష్మి వెళ్ళిపోయింది తెలియక భంగపడిపోయినామయ్యా! ఇంతజబ్బుగావుంటే యెంతవెఱ్ఱిముండాకొడుకైనా చేసుకొంటాడండీ? కొంచెము జలుబుచేసి దగ్గుజ్వరమున్నారుగాని. యీలాంటి దారుణరోగమున్నారుకాదు; ఇరవైరోజులైనాకా లేదుపెండ్లయి, అబ్బబ్బబ్బ ఈదుఃఖం నేనుభరింప లేకుండావున్నానండీ దిగాలుపడికూర్చున్నాడు పిల్లాడు, వాడిముఖంచూచి నేను భరింప లేకుండావున్నాను. మాఅబిడా! మాఅమ్మా చేసేగోలకు మితమే లేదు. ఆబతికిన నాలుగురోజులే పాపము పిల్ల మాయాబిడను పట్టుకొని వదిలిందికాదటండీ! ఎంతఆపుకున్నా మగవాణ్ణినాకేదుఃఖమాగ లేదు ఆడవాళ్ళ కాగుతుందా?

నర—రాఘవరావుగారూ తమరు ధైర్యమవలంబించియుండవలె విచారించిన కార్యమున్నదా? ఆపిల్ల మనకు ప్రాప్తం లేదు యింతకు.

రాఘు—ఇంతకూ నాదినములు మంచివికావు. లేకపోతే బంగారమంటిపిల్ల దక్కకపోతుందా?

నర-చిత్తము నేను సెలవుపుచ్చుకుంటానండి తమకు వేఱే చెప్పవలసినవారెవరు లేరుగదా,

రాఘు—చిత్తము నే దిగడతానండి!

నర—(నిష్క్రమించును.)

చిదం-పంతులుగారూ చిన్నరహస్యము. మాచిరాజుజనార్దనరావు పంతులుగారు తమతో ఏకమాటమనవిచేయుమన్నారు. వారిదగ్గరపిల్లవున్నది. రెండువేలుకట్నం, వేయిరూపాయలుబాలతొడుగు

రానూపోనూఖర్చులిస్తామంటున్నారు. ఏమిసెలవు? పిల్లపోయి యీవారా శకి మూడురోజులే అయింది మైలరోజులు వెళ్ళనీ, తరువాత మాట్లా డదామన్నాను.

రాఘు-ఏడ్చినసట్టేయుంది. చచ్చు తెలివి. అలాగంటారయ్యా ! మైలా లేదు. సింగినాదమూ లేదు. ఇలాజెప్పువాళ్ళతోటి. మూడువేల కట్నమూ రెండు వేలబాలతొడుగూ పెట్టమను. పదమూడోనాడే పెండ్లి చేస్తామను.

చిదం— అలాగే చేస్తారు కాని, మైలలో తాంబూలమెల్లాపుచ్చుకుంటాం, శాస్త్ర అప్పడం వడియమెల్లా పెట్టుకుంటాం ?

రాఘు—ఇందు కేమీసు వై. స. బు. పె, పేళ్ళువచ్చింది మీా వ్యవహారమంతా శుద్ధవైదికం. తాంబూలాలు మాపినతల్లికొడుకెళ్లి పుచ్చుకొస్తాడు. అప్పడాలువడియాలుమీాయింట్లో పెట్టించుడబ్బిస్తాను.

[అంతట నారాయణమూర్తిగారు ప్రవేశించుచున్నారు.]

చిదం-ఉష్! ఉష్ సరహరిరావుపంతులుగారి బావమరిదిగారు నారాయణమూర్తిగారు వస్తున్నారయ్యా.

రాఘు—ఏరీ? ఏరీ? అలాగా (అని యేడుపు మొగము పెట్టును)

చిదం—దయచేయండి నారాయణమూర్తి పంతులుగారూ ! ఇక్కడేవున్నారు పంతులుగారు,

రాఘు—(మెల్లగా) దయచేయండి ! (అని చేయిచూపును.)

నారా—చిత్తము- (అనికూర్చుండును)

చిదం—ఎంతోఅంత ముచ్చటపడి వియ్యంపొంది తేదైవమోా ర్వ లేకపోయినాడు.

నారా—ఏంచేయను, అదృష్టమాలాగున్నది. తమరేమోా నగలు పంపిచమని వర్తమానమంపించినారట సరహరిరావుగారికి.

రాఘు—నేనా? నేనా? వర్తమానమంపినది. శివశివ! శివశివ! యెంతమాట, బిడ్డలగన్నాగాని, గడ్డలగన లేదు. కిట్టనివాళ్ళెవరో ఆయనతో చెప్పియుందురు. తెలివితక్కువచేత ఆడవాళ్లె యీపని చేశారో ఛీ! యీ నీచపుపని నేను చేస్తానండి?

నారా—సరే ఏమైతేమిలెండి ఇవిగో నగలు. మీకొక్క వస్తువైనా పెట్టలేదుకదా? అన్నీ మేము పెట్టిననగలే మళాగత్తులు కాక రెండువేల మూడువందల రూపాయలు నగలున్నవి. ఇవిగో దాని చీరలు.

(అని యేడ్చుచున్నాడు)

రాఘు—అబ్బబ్బబ్బబ్బ! ఆవస్తులకేసి నేను చూడలేనండి. నాగుండె దడపెట్టుచున్నది. దీక్షితులుగారూ! అవితీసికెళ్ళి యింట్లో వేయించండి నాయెదుట వుంచకండి.

నారా—చిత్తము నేను సెలవుపుచ్చుకొంటాను. నగలన్నీ సరిగా వున్నవిగదా?

రాఘు—చిత్తము. ఏమనడానికి నోరురాదు.

నారా—(నిష్క్రమించును.)

చిదం—ఏమండోయి నరహరిరావు పెద్దమనిషే. మనము కబురంపఁగానే అడ్డబాసదగ్గరనుంచి పంపించినాడు

రాఘు—పెద్దమనిషే. కాకపోతేమట్టుకుడొక్కబద్దలుచేయను సరేకాని మాచిరాజువారి సంబంధంకుదుర్చు ఎలాగోవకలాగు.

చిదం—మీరడిగినంతవరకు వారిస్తారుకాని పిల్లకు కంట్లో చిన్న పువ్వుంది

రాఘు— పువ్వున్నాసరె కాయున్నాసరె అడిగినంతవరకు సొమ్మిస్తే తాంబూలాలు పుచ్చుకొనిరా వెళ్ళు.

చిదం—చిత్తం అలాగే.

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు)

బధిరచతుష్టయ ప్రహసనము

(చెవిటిశంకరప్పయు భార్య సింగమ్మయుఁ బ్రవేశించుచున్నారు.)

శంక—నీ వనేమాట యేమిటే. చెవిటిపీనుఁగు నన్నమాట ఎరగవాయేమిటి గట్టిగా చెప్పు.

సింగ—ఇంతిమాత్రానికే పీనుగని నన్ను తిట్టాలీ. నేనెంత చెవిటిదాననైనా బొత్తిగావినఁబడకపోదు. కడియాలవారింటికి భోజనానికి పిలిచారు. మీరుకూడా వస్తారా?

శంక—ఏమిటీ కడియాలు చేయించాలి నీకిప్పుడు. ఆసి నీ యిల్లు బంగారంమైరిగదే నీసిగ్గుచిముడా. ఒకమూల కుఱ్ఱదానికిపెండ్లి చేయవలెనని నే నాలోచిస్తూ డబ్బులేక కొట్టుకొనుచుంటే నీకు కడియాలు కావలెనా? కడియాలుకాదు, అందెలుచేయిస్తా.

సింగ—అందాలా... ముసలిదానికి నాకందాలేమిటి. నాకందాలెందుకు. నేను సంసారిని

శంక—కంసాలిని పిలవమంటావు. ఆశి నీయమ్మకడుపుకాలా తలచినప్పుడే తాతపెళ్లా నీకు.

సింగ—నే నేమన్నానని నీయమ్మకడుపుకాలా అని తిడతారు. కడియాలవారింటికి భోజనానికి వెడతారా అంటే యింతకోపమెందుకూ.

శంక—భోజనం పెట్టన్నా కడియాలు చేయించకపోతేను. వెధవకడియాలూ నీవూను బోడిముండ పెండ్లిచేసుకున్నందుకు బాగా అనుభవిస్తూన్నాను.

సింగ—సరిసరి అప్రతిష్ట వెధవకడియాలవారనివాళ్ళనుతిడతారెందుకు? వాళ్ళు మీజోలికొచ్చారా? సొంటి కొచ్చారా? మీ

యిష్టమువచ్చినట్లు నన్ను తిట్టండి నేనుపడతాను. వాళ్ళు కలియుగ వైకుంఠంగా పెళ్లిచేసుకుంటూంటే బోడిముండా పెళ్ళనడ మేమిటె.

శంక—ఆశి నీ సాహసం మండిపోనూ, నేను వైకుంఠానికి వెళ్ళిపోవాలీ. కడియాలు లేకపోతే బోడిముండలాగుంటానంటావూ. ఓసి ముడిగాళ్ళముండా రాచ్చిప్పడటూకులో బూర్లెమూకుడు మినపరొట్టో తిని హాయిగ నుండాలని వుందికాబోలు నీకు. తిందుగాని లే క్షవరం చేసి వదిలిపెడుతా వెధవా.

సింగ—ఆలాచెప్పరాదూ మటిమొద టేనూ. అంత వుండ లేకపోతే అటుకులు నానపోస్తాను. మినపరొట్టయినా కాలుస్తాను. ఎంత సేపు. ఇప్పుడు పప్పునానబోస్తాను. క్షవరం చేయించుకుంటారా చేయించుకోండి మంగలాడికి కబురు పంపిస్తాను. మీరు పనిచేయించుకొని స్నానంచేసేలోపున రొట్టెంత సేపు కాలుతుంది.

శంక—నన్నే అటుకులు తినమన్నావూ, నన్నే మినపరొట్టె తినమన్నావూ, సరే! నేనే వెధవని. నాకు నీవు క్షవరంచేయిస్తానన్నావు మంగలాడిని పిలిపించి. ఛీ దిక్కుమాలిన ముండా నీమొగముజూడను పోచీలు కంకణాలు కడియాలు చేయించలేదని నన్ను చచ్చిపొమ్మంటావూ. ఇదిగో లేచిపోవుచున్నాను నీకు నాకు సరి

(అని లేచుచున్నాడు.)

సింగ—నేనేమి పేచీ లెట్టాను కారణంలేందే దులిపి వదిలిపెడుతున్నారు. నేనీవాళ ప్రొద్దున్నే లేచి యెవరిమొగము చూచానో కాని తిట్లు తగులుచున్నాయి. వెళ్ళకండి యింట్లోనే వంటచేస్తాను.

(అని జందెముపట్టుకొని యాపుచున్నది)

శంక—ఆశి నీ చేతులు పడిపోను, నా జందెము తెంపుతావంటె నాకు సన్యాస మిప్పించాలని వుందా?

సింగ—అయ్యయ్యో! నామూలాన్ని మీరు సన్యసించడ మెందుకు? నేనే పుట్టినింటికి లేచిపోతాను.

శంక—పుట్టింటికి లేచి పోతావా? పుట్టింటికి లేచిపోరంగము మోర్నెను లేచిపో నాకెందుకూ. అక్కడ కడియాలు చేయించేవారు కావలసినంతమంది ఉంటారు.

సింగ—ఈ బుద్ధులు నాకు రంగమ్మ చెప్పింది. దానికొంప తియ్యకండి దానిమొగడు పాపిష్టి మనిషి

శంక—నీమొగడు పాపిష్టిమనిషా? నేను పాపిష్టి వాడనటే నీ దుంప తెగ. (అని నెత్తిమీద బాదుచున్నాడు)

సింగ—అమ్మో! అయ్యో! తలబద్దలై పోతోంది.

శంక—నా తల బద్దలవాలని తిడుతున్నావా? నీ పాతివ్రత్యం మండా. నీతో కాపరం చేసేకంటే గోదావరిలో దిగితే మంచిది.

(అని పారిపోవుచున్నాడు)

(ఇద్దరు నిష్క్రమింతురు)

—*—

రంగము 2

(అప్పుడు శంకరప్ప ప్రవేశించుచున్నాడు)

శంక—(తనలో) ఈవేళ నాకు భోజనం లేకపోయినా సరే ఇక్కడనుండి కదలను. అంగవస్త్రము వేసికొని యీరాత్రి రావిచెట్టు నీడనె పండుకొంటాను. ఆముండకు బుద్ధివచ్చిందాకా తగిన శాస్తి చేస్తాను ఇదిగో! గంగన్న యెక్కడినుండియో వస్తున్నాడు. అన్నట్టు మరిచిపోయినాను వీడీమధ్య నరసాపురం వెళ్లాడు. అక్కడ నాస్నేహితులు నరహరిరావుపంతులుగారుండవలె. ఆయన క్షేమంగానున్నారేమో కనుక్కొని ఆయన కులాసాగావుంటే వెళ్ళి పదిరోజులాయన దగ్గరవుండి గెలి పూడివస్తాను, ఈలోపుగా నీదౌర్భాగ్యురాలికిబుద్ధి వస్తుంది నలుగురు దాన్నే చెప్పుదెబ్బలు కొడ్తారు.

[అప్పుడు గంగన్న ప్రవేశించుచున్నాఁడు]

గంగ—ఓహోహో! శంకరప్పా! ఇదేమిటి చెట్టుక్రింద పడుకొన్నావు?

శంక—ఒరే? నీ చెవులేమున్నాకొం చెంనిమ్మళంగావున్నాయీ?

గంగ—సరే నేను చెవల వెధవనైతే నీ కేమిలే. ఎప్పుడూ అలాంటివాణ్ణె. నీవెప్పుడు యీలాగే అంటావు వేళాకోళానికి,

శంక—నీవు నరసాపురాన్నించేనా రావడం.

గంగ—నరసరాజుగారియింట్లో పెండ్లి అయింది. (అని చెయ్యి విసరుచున్నాఁరు)

శంక—ఏమిటి! నరహరిరావుపంతులు పోయినాఁడూ! హరి హరీ ఎంత మాట! ఎన్నాళ్ళయింది.

గంగ—పదహారురోజులపండుగ అయిపోయింది.

శంక—ఏమిటి దశాహం గూడా అయిపోయింది సంగతే తెలియ లేదు. జబ్బేమిటి?

గంగ—డబ్బేమిటి కావలసినంత ఖర్చు పెట్టారు. వియ్యంకుడు దిట్టమయిన వాఁడు. డబ్బు చాలావుంది. బాగా యింతలా వుంటాడు మనిషి.

శంక—అబ్బా! అంతలావుబ్బిందీ వళ్ళు! పాపము ఆయ నింకెక్కడ బ్రతుకుతాఁడు. అయితే ఎవరు మోశారు?

గంగ—నాలుగేసిరూపాయలు సంభావన యిచ్చారు విద్వాంసులకి.

శంక—సరే! నలుగురుకొడుకులు మోశారు? అయిదోవాడు నిప్పుచ్చుకున్నాఁడు. ఆయన కేమి ధన్యుఁడు. దానాలు బాగా జేసారా.

గంగ—ఆ రెండవకుమార్తె గర్భాదానంగూడా చేశారు. కార్యంలో కార్యం. కావల్సినన్ని వచ్చి పడ్డారు మన బ్రాహ్మలు దేశ దేశాలనుంచి.

శంక—కాకులు ముట్టుకో లేదు. అయ్యో! ఆయన మనస్సులో యేమికోరిక లున్నాయో, దణ్ణంపెట్టుకో లేదు.

గంగ— పెళ్ళివైభవం నే నేమని చెప్పేదును. పదిపుట్ల పుల్లగాడిపోయిల్లో కాలింది. తక్కిన సంభావనలమాట ఏమి చెప్పను.

శంక—అబ్బా! పదిపుట్లకర్ర కాలవలసి వచ్చిందీ. అంత లావున వాళ్ళిచ్చినప్పుడు యెంతకర్రయినా పడుతుంది. నేను పరామర్శకు వెళ్ళాలి. ఇంతకు నాకర్మము.

(అని మొగముకొట్టుకొనుచున్నాఁడు)

గంగ—నీకు సంభావన దొరకలేదని మొత్తుకోకు. మళ్ళీ సంవత్సరానికి రెండవకుమార్తె పెండ్లి చేస్తారు.

శంక—సంవత్సరీకమప్పుడు వెళ్ళితే బాగుంటుంది పరామర్శికి. రెండవమాసికానికో మూడవమాసికానికో వెల్తాను.

గంగ—రెండు మూడు మాసాల్లోగా వాడింట్లో శుభకార్యాలేమీ లేవు నేను వెళ్ళుతాను. నాకు పనివుంది.

శంక—సరే! నీవు వెళ్లు పాపము నీవేంజేస్తావు నాకర్మానికి!

(గంగన్న నిష్క్రమించు చున్నాఁడు)

శంక—(తనలో)ఇంట్లో జూడనస్తే పెండ్లాంముండకడియాలు తెమ్మని తావళాలు తెమ్మని పోచీలు తెమ్మని చంపుతుంది. నరసాపురం వెళ్ళి నాలుగు రోజులు హాయిగా నరహరిరావుపంతులుగారింట్లో వుందామంటే ఆయన వెళ్ళిపోయినాడు. ఇంతకు నాజాతక ప్రభావము ఎక్కడికి వెళ్ళితె అక్కడే నిప్పచ్చు. కాకపోతే నరహరిరావుపంతులుగారికి సలభై యేండ్లయిన నిండలేదు. ఇంతలోకే చావు రావలెనా! ఇంకా యేమి చిక్కులు రాదలచివున్నవో.

[అప్పుడు నల్లసామి యనుచెవిటిగొల్లవాఁడు ప్రవేశించుచున్నాఁడు]

నల్ల—(తనలో) పొద్దు పొడిచినేలనుండి నెలుకుతున్నాను.

పొద్దు నెత్తిమీద కొచ్చింది, ఇం కెక్కడ నెలకను. కటికివోళ్ళు చంపేసి అమ్ముకున్నా రేమో, నాపేనం చాలిస్తావుంది కాళ్ళు నొస్తావున్నాయి. కూంచే పీ చెట్టుక్రింద కూకోని మఱి యెల్తాను. దానిజిమ్మ లాగినఆవు.

శంక—(తనలో) నే నిక్క డున్నానని ఆముండకు ఎవరు జెప్పారో, అప్పుడే యీ వెధవ నెవణ్ణో నాదగ్గిరికి వర్తమాన మంపింది. ఈలాటిచచ్చువెధవలు యిరవై మందొస్తైమాత్రము నేను కదుల్తానా యిక్కణ్ణించి.

నల్ల—(తనలో) ఈబాపనయ్య వొవడో కాని గోతికాడి నక్కలాగ యిక్కడ గూసున్నాడు. ఈన మొకం సూస్తే పెళ్ళైలు శెప్పే ఆయన లాగ యున్నాడు. ఈలాటిబామ్మడే మునుపోతూరి మా గేదెపెయ్య కోటిలింగాలకాడ తప్పితే పెళ్ళైసెప్పాడు, మా యావు ఎక్కడుందో మాదూడెక్కడుందో! ఏలాగెల్లిందో! ఎలా గెల్లిందో యీనన డుగుతాను.

(అని దగ్గిఱకుం బోవును.)

శంక —దూరంగా వుండు! ఏమి మీదిమీదికొస్తావు.

నల్ల—బాపనయ్యగోరు! నే నొక్క పెళ్ళైడుగుతాను జెప్పండి.

శంక—ఆదిక్కుమాలిన ముండమాట నాదగ్గిర జెప్పొద్దు. అది పెండ్లాము కాదు. నేను మొగుణ్ణీగాను.

నల్ల – ఆట్టే ఆల్చం లేదు. చిన్నపెళ్ళై, చిటికెలో అయిపోద్ది మీరు బుద్ధిమంతులు శెప్పండి.

శంక—ఆముండ అతి బుద్ధిమంతురాలా? నేనే అంత అపాత్రపువెధవనా? ఛీ! అవతలికి పో! దానిమాట నాకు చెప్పకు.

నల్ల—ఆవు తెల్లగా వుంటుంది. కుడికొమ్ము విరిగిపోయింది. దాని కండ్లు కాటుకకండ్లు. తరిపిదూడ కూడ వెల్లింది. దూడవొంటి

మీద తెల్లమచ్చలు యఱ్ఱమచ్చలున్నాయి. నిన్నరాత్రి యింటికి రాలేదు. రాత్రి రెండుజాములుదాక నెలికాను. మల్లీ పొద్దుట్నుంచి నెలుకుతున్నాను. కాపళ్ళేదు. మాగొల్లది బెంగబెట్టుకుంది గెంజి తాగదు. ఏడుస్తూ కూకున్నది. అది యేలాగెల్లిందో చెపుదూ బాబూ! ఆవూ దూడాదొరికెనా దూడను నీకిచ్చి వేస్తాను. రొం డేళ్ళల్లో యీాంతది, (అని కాళ్ళు పట్టుకొనును)

శంక—ఆవు దూడ వుండగా మధ్య గుంజాొచ్చిందంట. మధ్య నీ కెందుకురా. నాపెండ్లాము నేను తగవు లాడుకుంటే నీవా రాయ బారివి. నాకాళ్ళు పట్టుకోవద్దు పో!

నల్ల—నేముట్టుకుంటె మైలడుతారనా కాళ్ళు యెనక్కి లాక్కున్నారు. అయితేంగాని ఆవు యెల్లాగెల్లిందో చెప్పు.

శంక—ఆముండ యెలాబోతే నాకెందుకు. ఈలాగున దక్షిణ దిక్కుగా వెళ్ళనీ శ్మశానభూమిలోకి (అని చేయి జాపును)

నల్ల—అదు గల్లా జెప్పు. దచ్చినంగా యెల్లిందా. మా గొల్లది ఆలాగే అంటది. మీారిక్కడే కూకోండి నేను నెలుక్కొ త్తాను దూడను తీసికెల్తురుగాని. (అని నిష్క్రమించుచున్నాడు)

శంక—(తనలో) అబ్బబ్బా శనిగ్రహము వదిలిపోయినది. ఆపాడుముండ వీడిచేతులో యింత పూరగాయముక్కో కొంచెము కూరయో పెట్టి నేనెక్కడున్నానో యేమిచేస్తున్నానో యేమంటు న్నానో కనుకొనిరమ్మని పంపింది. వచ్చినందుకు వీడికితగినట్టు బుద్ధి చెప్పి పంపించాను. కాస్తసేపు అంగవస్త్రము పఱుచుకొని పడుకుం టాను. (అని పండుకొనును)

(అపుడు నల్లసామి ఆవుతోను దూడతోను ప్రవేశించు చున్నాఁడు)

నల్ల—(తనలో) బ్యాహ్మడన్నా బ్యాహ్మడు గాడు ఈన. ఈనంత బ్యాహ్మడు భూమిలో ఫుట్టలేదు. పెరగలేదు. దచ్చినంగా యెల్లమనియిట్టే చెయి జూపించాడు. ఆచాాయని నేనెల్లగానేఆవుదూాడ

రెండు కాపడ్డాయి. పెళ్ళి చెప్పితే యీనే చెప్పాల ఆకు గంటముక్క లేదు. ఈయన పెళ్ళ చెప్పడానికి ఏంటో నోట్లో గొనుక్కుంటాడు. ఇలాగాలా చూస్తాడు. యిట్టి చెప్పేస్తాడు. మనపని అయిందిగనక్క అన్న కాడికి యీన కాదూడ నిచ్చేస్తాను.

శంక ——(తనలో) శని వదలిపోయిన దనుకుంటే వీడి దుంప తెగ వీడు మళ్లీ వచ్చాడు పీక్కొనితి నేటందుకు. నేనిక్కడున్నానని దానితో చెప్పాడు కాంబోలు చెప్తే యేదో పనిగల్పించి మళ్లి పంపింది. కాని వీడిన్ని మాట్లువచ్చి యేం జేస్తాడో చూతాము. రాయబారాలు పంపిన కొద్ది నాకు కోపమెక్కువవుతుంది.

నల్ల ——ఆముదాలుగారూ దండాలండీ !

శంక——నీ వెధవదణ్ణాలు గట్టిపెట్టు. ఆవిడసంపకం నీవురావకం బాగానేవుంది. వెధవసారథివి బయలుదేరినావు చాలుచాలుయీపాటి కవతలుండు.

నల్ల ——మీరు చెప్పిన పెళ్ళి యెంటనే దాకలాయిచ్చింది. ఇచ్చినందుకు నేనన్నమాట పెకారం దూణ్ణిత్తాను పుచ్చుకోండి. మీవాంటోరికిత్తే మాసితాల్లు గూడ పైకెల్తారు. ఇది కుంటుతుందని మీరనుమానించకండి దీంది కుంటికాలు గాదు. రాత్రి యేపాలం లోనో పడ్డేవోడో కాల్లు దుద్దుకట్టతో యిరగెయ్యమోలు ఆయిదంతో మూడుపూటలు కట్టుకడ్తే నెమ్మదిత్తది సూడండి బొమికగాని యిరిగిం దేమోను.

(అని దూడగాలు జూపును!

శంక——(ముక్కుమీద వేలు వేసుకొని) ఆరి దొంగముండా కొడకా ! ఆరిపాపాత్ముడా! నీకెంత దుర్బుద్ధి పుట్టిందిరా! నా పెళ్ళాం ముండ చెప్పినమాటలు విని నామీద లేనిపోని నిందలు వేస్తావా) నేను దాని కాలు విరగొట్టానా? నీవెవండవో నేనెఱుంగను. నీయావు నంతకంటా యెఱుంగను. నీదూండ ముక్కుమొగము యెఱుంగను

నేనేమిటి కాలు విఱుగగొట్టడ మేమిటి ? నా కీగ్రామంలో గోష్పాద మంత నేలైనా లేదు ఇది నాచేలలో పడలేదు. దీనిని నేఁగొట్టలేదు. ఛీ పో ! (అని తోసివేయును.)

నల్ల—అన్న బ్యాహ్మఁడు ఇంతలోకీ మాటతబావతు. నేను దూడనిస్తానన్నాగాని ఆవు నిస్తానన్నానా ? నీవు నేనబద్ధమాడితే జిమ్మపుచ్చిపోవాలి, ఈజిమ్మ తెగ్గొయ్యాలి. నెయ్యి అన్నంతినే బామ్మఁడవు నువ్వే అబద్ధా లాడ్తే యిగ చెప్పేదేమిటి ! నేను దూడనే యిత్తానన్నాను ఇదిగో పుచ్చుకో.

శంక—నాప్రమాణకంగా నేను దీనికాళ్ళు విరగొట్టలేదు. ఆవు దూడకాళ్ళు విరగ్గొట్టితే వంశక్షయమై పోతాను. నాగాయత్రి సాక్షి నే నేపాప మెఱుఁగను.

నల్ల—పుచ్చుకుంటే పుచ్చుకో దూణ్ణి. లేకపోతే అదికూడా నాయింట్లోనో వుంటుంది. మొదట దూడకే నప్పుకొని పెళ్ళి జెప్పి మల్లి ఇప్పుడు గల్తే ఆవు రావాలంటావా ? పూటపూటకి రెండేసి సేర్లు పాలు పితుక్కొని తాగుదాము అనుకున్నావుగాబోసు నేనంత యెఱ్ఱిముండాకొడుకును గాను. ఈబాపనయ్యజిత్తుల్లో పడిపోవడానికి నీవు బామ్మఁడవని నాకేమన్న బయమనుకున్నావేమిటి ?

[అపుడు నారాయణమూర్తి యను బ్రాహ్మణుఁడు
ప్రవేశించుచున్నాడు]

నారా (తనలో) భూలోకనారదుఁడనివచ్చినపేరు రానేవచ్చింది. నాకు వచ్చినపేరు చచ్చినాపోదు. వాళ్ళజుట్లువీళ్ళజుట్లుముడివేసివీలైతే కోర్టులోకి లాక్కుపోయి యేదోవిధంగా నాలుగు డబ్బులు సొమ్ము పారవేసుకోడమే ప్రయోజకత్వము. ఏమీ లేకపోతే యీసంసారం యీడడం యెల్లాగ ? యీనల్లసామిగాడు శంకరప్ప యేవో పట్టింపులు పట్టుకుంటున్నారు ఇదియేదో కనుక్కొని యేదో ఒకబస్కీ యిందులో కొట్టాలె. వీళ్ళతాడుదెగ లీళ్ళిద్దరికి చెముడే. తలకాయ బద్దలు

కొట్టుకున్నా వాడికి వినబడదు. వీడికి వినబడదు. ఈలాటప్పుడే మన దోయం పారేది. వెళ్ళివీళ్ళత గాదా యేమిటోకనుక్కుంటాను. ఏమిటిరా నీతగాదా? (అని గొల్లవానికి సంజ్ఞచేయుచున్నాడు)

నల్ల——చూడండి! మారజ్జమారజ్జ! ఈబాపనాయిన కొచ్చిన దుర్బుద్ధి సూడండి బాబూ, నాయావుదూడ యెక్కడకో పారిపోతే పెళ్ళి చెప్పుమన్నాను. దొరికితే తరిపిదూణ్ణిస్తానన్నాను, దచ్చినంగా యెల్లింది నెలుక్కోమని చెప్పాడు. ఎల్లాను. నాపున్నెం బాగుంది. యాలాయినేసం మంచిది. నాగొడ్లు నాకు దొరికాయి. దూణ్ణిస్తానంటే వొద్దంట. ఆవు గావాల్నంట, అన్నాయం జూడండి బాబూ పాలమ్ముకొని నెయ్యిఅమ్ముకొని యీయావుమూలాన్ని యేదోకొంత పైకర్చు జేసుకొని గెంజినీళ్ళు దాగుతున్నామండి ఈనాశకూలిపోను ఈయావు నిమ్మంటాడండీ.

నారా——(శంకరప్పవంక జూచి) శంకరప్పగారూ! ఏమిటి మీతగాదా?

శంక——ఈవేళ నేను నూయింటాబిడ దెబ్బలాడుకున్నాము. కోపగించి నేనిక్కడొచ్చి పండుకున్నాను. నాపెళ్ళాము నేనెక్కడున్నానో చూచిరమ్మని వీణ్ణిఅంపింది. మొదట దాంతోవీడేంజెప్పాడో ఆపలుగుముండ వీడితో యేంజెప్పిందో నాకేమీ తెలియదు. ఇపుడు వచ్చి వీడు నాదూడకాలు విరగొట్టానంటాడు జూడండి బ్రాహ్మణ్ణి ఆవుదూడకాళ్ళు విరగొడ్తానా? కలికాల మొచ్చిపోయింది. దీనమ్మ కడుపుమాడ అంతఘోరమే.

నల్ల——చిత్తగించండి బాబయ్యా పదిమంది పిల్లాజల్లా సెట్టికొని బతకాలనుకుంటున్నాము. అబద్ధమాడ్తే నాలిక తెగ్గోయించండి. దూడను నేనుయిస్తానన్నానుగాని ఆవును యిస్తానన లేదు.

నారా——(తనలో) చాలాపసందుగా వున్నది తగాదా. ఇంతకు నాయదృష్టము పుచ్చినది. ఇదేసమయము. వీడితో జెప్పవలసిన

మాటలు వీడితో జెప్పి, వాడితో జెప్పవలసినమాటలు వాడితో జెప్పి ఈదూడను కాజేస్తే మంచిది. (ప్రకాశముగా గొల్లవానితో గట్టిగా) ఇప్పు డీయన కోపంమీదున్నాడు. నీవు చెప్పి తేవినఁడు. నీవు వెళ్ళు. నేను నచ్చజెప్పి యీదూడను పుచ్చుకునేటట్టు జేస్తాను. నీవు వెళ్ళు ప్రస్తుతము.

నల్ల—చిత్తం బాబయ్యా! దరమ కామందులు మీరున్నారు గనక బతికి పోయినాను (అని ఆవును తోలుకొని వెళ్ళుచున్నాడు)

నారా—(తనలో) ఇప్పటికి ఒకగ్రహం మొదిలించి రెండవ గ్రహాన్నికూడా వదిలించి వేస్తాను. (శంకరప్పతో గట్టిగా) ఆగొల్ల బోయడు దూడనిక్కడ వదలిపెట్టివెళ్ళాడు వాడిదూడను వాడికి నేనప్పగిస్తాను. మీకువొచ్చినభయము లేదు. దీనికాలు మీరు విరగ గొట్టినారని ఎవరున్ననన్నారు గనుక మీయింటికి మీరు వెళ్ళండి.

శంక—రక్షించారు బాబూ! ఈముండాకొడుకు యిపుడుదూడ ఖరీదు యిచ్చుకోమంటాడేమో యని జడిశాను. మీరే వాడి కప్ప గించుకోండి దాన్ని. (అని వెళ్ళుచున్నాడు)

నారా—(తనలో) గోదానం దొరికింది గాని దక్షిణ దొరక లేదు. సాయంకాలంలోపుగా దక్షిణ యింకొకడిదగ్గిర పుచ్చుకుంటాను ఈచెవిటివాళ్ళిద్దరు గోలచేసి నాకు గోవునిచ్చినారు, ఈవేళకు పడ్డ పాటుచాలు రెండువరహాల సొమ్మౌంటుంది.

(అని దూడను తోలుకొని పోవుచున్నాఁడు)

—*—

బలవంత బ్రాహ్మణార్థ ప్రహసనము

రంగము 1

[అప్పుడు దామోదరయ్య యను కరణము, అన్నంభొట్లను బ్రాహ్మణుడును ప్రవేశించుచున్నారు.]

అన్నం.—(తనలో) అబ్బబ్బా! తల్లితద్దిన మెప్పుడో యెరుగని వాళ్ళతో వేగడము చాలకష్టము. వీడి తల్లితద్దినం వీడికి జ్ఞాపకము లేదట. నేను చెప్పవలెనట! పురోహితుఁడు ముండాకొడుకును అవడంచేతను నా కర్మంకాలింది. ఇంతప్రొద్దెక్కి ఎందుకు వొచ్చావని వీడు మీదబడి కరుస్తాడేమో! వీడమ్మకడుపు కాల. వీడు తగని ముండాకొడుకు. పెండలకడనేనత్తామంటె యీరోజునె కల్లుపాలెంలో యీడిగవాడింట్లో తద్దినం వచ్చింది. వెళ్ళకపోతే నిత్యేపంవంటి రెండుపూటల్లు గంగలో కలిసిపోతవి. ఆ కక్కుర్తి చేత యింతపొద్దెక్కింది. ఈ రహస్యము వీడితో చెప్పడానికి వల్లకాదు. అయినప్పటికి ఒకధైర్యమున్నది వీడు పేరుకు బ్రాహ్మణుడేగాని కర్మిష్టిగాడు. వట్టి మాలముండాకొడుకు. అదిగో! బారెడుచుట్ట నోట్లో పెట్టుకొని కొరివిదయ్యంలాగ వీధి అరుగుమీద గూర్చున్నాడు. ఏమైతె అయినది. వెళ్ళి చెప్తాను.

దామో.—(చూచి) ఓహోహో! అన్నంభొట్లుగారా! ఏమి యీలాగదయచేశారు! ఏదయినా శ్రాద్ధముందా ఏమిటి బాబు! అటువంటివుంటేగాని యీ శ్రాద్ధాలగద్దలు మా వూరిమీద వాలవు.

అన్నం.—మీరన్నమాట నిజమే ఇప్పుడు మీ శ్రాద్ధమే వొచ్చిందిలెండి.

దామో.—అదేమిటయ్యో! త్వరగాజెప్పు కొంపతవ్వి మా యమ్మ తద్దినం కాదుగదా యీ వేళ? తిథేమిటి?

అన్నం.—ఈ వేళ మాఘ శు ౭ గాదయ్యా? మీ య గారి తిథి యీ రోజునే కాదూ. ఆహాహా! ఎటువంటి కొడుకులం కన్నతల్లి ఆబ్దికమే జ్ఞాపకము లేని మహానుభావులు.

దామో.—ఓరి! నీయమ్మ కడుపుకాల తద్దినమైతే ని మొన్న చెప్పక యీ వేళటయ్యా చెప్పడం! ఇప్పుడేలాగ? న కోర్టుహీరింగులే జ్ఞాపకముంటాయిగాని తద్దినాలు జ్ఞాపకముండ ఆమాట తెలిసివుండి నీ వింతపొద్దెక్కి రావడం బాగున్నదా?

అన్నం.—నేను పొరుగూరునుంచి రావలసినవాణ్ణి గనుక తీ బడి లేకపోయింది. నా కాపరం చేపలపల్లె ఆమె మీ కాప చీపుళ్ళదిబ్బా యెను. ముందువత్తామంటె ముష్టియెత్తుకొనే ముం కొడుకును తీరుబడి లేదాయెను సిగాను జ్ఞాపకము లేదాయెను. ఇదం నా ప్రాలుబ్ధనుండి. ఇప్పుడైతే యేమి మించిపోయింది. ఇప్పు జాముపొద్దుకన్న ఎక్కువయెక్కలేదు. మూడుజాములు లోపు తద్దిన మవుతుంది కాని.

దామో — అసాధ్య మొచ్చిందే! దానికోసం తటపటాయిస న్నాను.

అన్నం.—ఏమిటి ఆ అసాధ్యం? అసాధ్యాలన్ని నేన సాధ్యాలు చేస్తాను చెప్పండి.

దామో.—సరే విను. రాత్రి మా ఆవిడ పుల్లిపాయలపులుస కాచింది. అది ఎంతో పాకానబడింది. పొద్దిటికూడా పులుస మిగిల్తే అది పోసుకొని చద్దిఅన్నం తిన్నాను. అందుకని పెద్ద సం హంగా వుంది.

అన్నం.—(తనలో) ఓరి వీడితాడు తెగ! వీడు గొప్పఅసాధ్యం తెచ్చాడు పోని యీరోజున శ్రాద్ధంమాని రేపుపెట్టుతామంటె శేష

మావూళ్ళో గమళ్ళగండి చిన్నదివం. అక్కడికి పోక తీరదు. అందుచేత ఏవో టప్పాలు గొట్టి యీ రోజునే కానిచ్చేస్తాను.

దామో.—ఏమిటయ్యో! ఆలోచిస్తున్నావు? ఏమీ పాలుపోలేదా ఏమిటి?

అన్నం.—బాబూ! మీరు తెచ్చినపేచీ సామాన్యపుదా? పచ్చివెలక్కాయ గొంతున బడ్డట్టుంది. ధర్మశాస్త్రం గట్టిగా ఆలోచిస్తున్నాను. అయితే మీరు మొగం కడుక్కున్నారా?

దామో.—ఏమి ఆలా గడుగుతున్నారు?

అన్నం.—మీ మొగంమీద బొట్టు చెరిపోలేదు, అందుచేత కడుక్కో లేదనుకున్నాను.

దామో.—నిజమేనయ్యా! మఱచిపోయినాను. పొరబాటే జరిగింది. తెల్లవారుజామునే రైతువాడు వచ్చాడు. వాడేదో పేచీ వ్యవహారము మాట్లాడుతూ కూచున్నాడు. ఆమాటల సందడిని మొగం కడుక్కోడం మఱచిపోయి, కడుక్కున్నాననుకొని శీతగ్రాసం చేసేశాను. ఇందు కేమైనా దారుందా? పోనీ రేపు పెట్టగూడదు?

అన్నం.—అమ్మయ్యా! ఎంతమాట. యీవేళే పెట్టితీరవలెను. శాస్త్రిలొప్పవు దీనికి నేను పరిహారం చేస్తాను వినండి. పలుగ్రవేయకముసుపు చేసినభోజనం నిన్నటి భోజనముతో సమానము. ఇప్పుడు లేచి చప్పుచప్పున మొగం కడుక్కో. దంతధావనం అయ్యే తర్వాత భోజనం చెయ్యకపోతే యీరోజున నీవు భోజనం చెయ్యనట్టే.

దామో.—వహవ్వా! మహాబాగున్నదయ్యా ధర్మశాస్త్రం. అయితే మావూళ్ళో రెండవబ్రాహ్మణకొంప లేవని నీకు తెలుసును గదా. ఇప్పుడు భోక్త లెవరు దొరుకుతారు?

అన్నం.—నే నొక భోక్తను గదా! మంత్రంకూడా నేనే చెప్తాను. రెండవ భోక్తనుచూడాలి. అదేకష్టము. ఒకపని చెయ్యండి. మీ న్వూరిపుంతలో మీ పెట్టి వెంకణ్ణివుండమనండి. ఆ చారిని మెవరైనా

బ్రాహ్మణుడు వెళ్ళుతూవుంటే దారి కడ్డంగొట్టి మనయింటివైపు లాక్కురమ్మనండి ఎవడో ఒకడు దారిని వెళ్ళకపోడు.

దామో — వహావ్వా వహావ్వా! మీబుద్ధి పాదరసంవంటి దయ్యా. నీపొట్ట వుపాయాలపుట్ట నాకు రాజ్యము లేదుగాని వున్నట్టయితే నీ కొక అగ్రహారం పారవేస్తును.

అన్నం — రాజ్యముంటె మీరీమాట అనకపోదురు. లేదుగనుక శుష్కప్రియాలు జెప్పడంలో భారీ ఎక్కువ. ఈమాట కేమిగాని ముందు వెట్టివాణ్ణి పంపించండి.

దామో — ఒరే వెంక!

[అప్పుడు వెట్టి వెంకడు ప్రవేశించుచున్నాడు.]

దామో — ఒరే వెంకా! నీవిప్పుడు వెళ్ళి మన వూరి పొలిమేరలో నిలుచుండి బ్రాహ్మణుడెవడైనా ఆదారిని వెళ్లుతుంటే వెళ్ళనియ్యకుండా మనింటికి తీసుకోనిరా. ఎన్ని బతిమాలినా దాటిపోనియ్యవద్దు.

వెంక — చిత్తం బాబయ్యా! కాపుందులోరి శెలవైనాక బ్రాహ్మనోణ్ణి దాటిపోనిస్తానా? అట్టే తెగనీలిగాడంటే బాపనోడి మీదమడి సంక లిరగ మొడుత్తాను. అంతే!

దామో — ఒరే! కొట్టడంమాత్రం కొట్టవద్దు. నయంచేతనో భయంచేతనో ఏలాగో ఒకలాగు నాదగ్గిరకు తీసికోనిరా.

వెంక — మాటన్నా గాని కొడ్తానంటండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

*

రెండవరంగము

[వెంకడు పొలిమేరలో ప్రవేశించుచున్నాడు.]

వెంక — (తనలో) అబ్బబ్బా! పొద్దునెత్తిమీదికొచ్చింది. బుఱ్ఱ మాడతావుంది. సద్దిగెంజి తాగి రాలేదు. కడుపులో మాడ్తావుంది

ఈడబ్బడిసిగ్గొయ్యా. ఒక్క బాపనోడు రాలేదు. యెంత సేపుకూకోను కాపులు మొగాలు కమ్మోరి మొగాలు కాపడ్తున్నాయిగాని బాపనోడి మొకం కాపణ్ణేదు. ఇంటి కెల్లి కూంతగంజి తాగొద్దునా? ఎత్తె కర్నంగోరేమంటాడో ? బామ్మడు దాటిపోయెనా కర్నపోడు నామీద మండిపడి యేడుత్తాడు. ఈడమ్మ చద్దెన్నంగాదుగాని నాకు నక్కసావొచ్చింది.

[అప్పుడు పురుషోత్తమావధానులవారు ప్రవేశించుచున్నారు.]

పురు—నవో, నవో, భవతి భవతి, జాయమానోహ్నం (అను పనస చదువుకొనుచు నడుచుచున్నాడు.)

వెంక—ఓ బాపనయ్యోయి ! అక్కడుండు ! అక్కడుండు !

పురు — ఎవరు వారు ?

వెంక — ఈప్రా రెట్టోణ్ణండి.

పురు—వెధవముండాకొడక ! నాతోనీ కేంపనుంది ? అంత దగ్గరగా నిలుచుంటావేం ? పో ! దూరంగబో. నన్నుండమంటా వెందుకు ? వెధవా చాకిలో కొరివిదయ్యంలాగ నిలుచుని అందరికీ అడ్డమొస్తావేమిటి ?

వెంక—ఉండుముండుమంటె పిచ్చికుక్కలాగ ఒక్కటే వరసని మొరుగుతావేంటి ? నామాట అంతా యినండి, యిన్నాక తిట్టొచ్చును.

పురు—నీమాటేమిటి? వెధవమాట పొద్దెక్కుతూవుంది. నేను తొందరగా పోవాలె. సదస్యంగుడ్డపోతుంది ముండాళ్ళో. నేను దోవనే నడుస్తుంటాను వెనకాలేవొచ్చి చెప్పుతుండు ఆమాటేమిటో.

వెంక—నే సడ్డం లెగిత్తేయాటకుక్కలాగ అదేపడుగు నీవు; నాకు దొరుకుతావా బాపనయ్యా ! నామాట టేను. మావూరి కర్నపాయ నింట్లో చద్దెన్నమంట. అదేనో నీకు మెపతారంట రా ! నిన్ను తీసుకొనిరమ్మన్నారు రాండి యెల్దారి.

పురు—మీవూరి కరణ మేమిటి ? చద్దెన్న మేమిటి ! ... బెట్టడ మేమిటిరా? ఆమాట సరిగా తెలియలేదు. మీకర్ణంగారి... తద్దినమూ యేమిటి !

వెంక—అదుగదేగామసు ! మీ బోడిబాపనోళ్ళ గొడ... వోరికి దెలుత్తాయి. ఆ అన్నంబుట్టబొమ్మడూను మా కర్ణంగ... సెప్పుకున్నారు. ఆగొడవలు నాకెందుకు గాని రాండి ! యెల్దారి.

పురు—మంత్రం చెప్పడానికా యేమిట్రా నేను ! ... తద్దినంమంత్రం రాదు.

వెంక—మంత్రమో తంత్రమో అపూసు నాకు తె... కూడ రాండి.

పురు—నేను రాను. అవతలవూళ్ళో సదస్యపువేళ మి... పోతుంది. దానికే జామారుగుడ్డ కాస్తాపోతుంది.

వెంక—రాకపోతే నేను వొదిలిపెట్టేవాణ్ణిగాను.

పురు—(కోపముతో) ఒదిలిపెట్టకేం జేస్తావురాదొంగముం... కొడకా! చెప్పుతీసు కొట్టిస్తాను. బొండవేయిస్తాను. తవ్వి పాతే... స్తాను. వెధవా! దారెంబడి వెళ్ళనియ్యకుండా అడ్డపెడతావా? ఎ... పొగరెక్కావు ? గొడ్డుమాంసం తిని కొవ్వెక్కావు కొవ్వు తీయి... జాగ్రత్త !

వెంక-అబ్బోసినాయునా! బండవేయింతావా? కొవ్వుదీయింతా... బయమేస్తావుంది. ఎలకబొక్కలో దాకోవాలి. ఏయించావు చ... రారా! యీపాటికి. మీలాటి బూడిదబూసుకున్న బామ్మడికేజడు... ననుకున్నావా యేంటి ? నువ్వేం తాలూక్కచ్చేరి బంట్రోతువ... పోలీసుజవానువా ? ముంచీబువా ? కరణానివా ? నీకు దడ్చేటందు... రుద్రాసిగయ్యలు మెల్లో యేసుకోని ఒంటినిండా ఎలిమిడి బొంకో... గానె బయమనుకున్నావా యేమిటి ? కర్ణాల యింటికొత్తే సె...

పోతావా యేంటి నువ్వు? పప్పుకూడు పప్పులు కాయగూరలు దప్పళాలు దొబ్బితింటావు. నెయ్యన్నం తిండానికి కట్టపడతావుగా మోసు? రా! రా! యీపాటికి.

పురు.—వెధవకొడకా! నేరాను. ఏం జేస్తావో చేయి.

వెంక.—ఏం జేత్తానా! సిలిగావం టే ఆకాంతపని చేత్తాను.

పురు—దిక్కుమాలినముండాకొడకా! యేంపని చేస్తావురా?

వెంక—ఏంపని జేస్తానా! మీాపమడి ముట్టుకుని జెబ్బలు రెండు మట్టుకొని చచ్చిన గేద్దూడను లాక్కెల్లినట్లు లాక్కొనెల్లి మాకర్నంగోరి యీాదరుగుమీాదపారేత్తాను. అప్పుడు సీతెగు లొదులుది. పెద్దమడిసి తిరాగా రావయ్యా బేప్నుడాని మెల్లగాబతిమాలుకొని బతిమాలుకొనిఅడుగుతావుం టే తాటిస్టెక్కి మొగుల్లోగూకం టావు. ఇనతల మాలోడేగాని అంత శాతగానోడు కాడు. మల్లా సూస్కో! మరి నాతమాసా ఏం జేత్తానో. గింజుకున్నావం టె దిమ్మ తిరగేత్తాను. ఎట్టెంక డం టే ఓకనుకున్నా వేమిటి? సచ్చెదవ గాడు. పట్టుకుం టె ఒదల్లు. పిశాసం. కడుపునిండా కూ డెట్టాను రమ్మం టె తడిసినసులక మంచంకుక్కిలాగ బిఱ్ఱబిగుత్తా వేంటి? మీాబాపనోల్లు నన్ను పిల్లుగాని పిలిత్తేనా కమ్మగా గూకొని పప్పు త్తిందును.

పురు—(తనలో) ఈనుర్మార్గుడి వైఖరి సుతిమించి రాగాన పడింది. తాగివచ్చినట్లున్నాడు. నేను మోటతనం చేసి రానంటే నామర్యాద నిలచేటట్టు కనపళ్ళేదు, మాలముండాకొడుకుకు భయమూ భక్తా? మీాద పడి ముట్టుకొని వాడన్నంత పని చేస్తాడు. అంచేత నేనే మాట దక్కించుకొని వీణ్ణి బతిమాలడం కంటె ఎంత మోటముండాకొడుకయినా బ్రాహ్మణుడు గనక కరణాన్నే అడిగి తప్పించుకు వెళ్ళడం మంచిది. మోటసరసం చెయ్యగూడదు. (ప్రకాశముగా) పదరా! ఒస్తున్నాను మీాకరణంగారిదగ్గిరికి ముందునడు. దారిచూపించు.

వెంక—చిత్తం బాపనయ్యగోరు! ఇది బుద్ధికల మాట, రండి! నా వెనకాల రండి! ఒచ్చినట్లే వచ్చి పారిపోయేవు సుమా బాపడా! పందిని గొట్టినట్లు కొట్టేత్తాను. నా సంగ తెరగవు.

పురు — అట్టేపేలకు. నడు వెధవా. ఒస్తున్నాను.

(అని యిద్దరును నడుచుచున్నారు.)

వెంక—(కొంతదూరము నడచి) అల్లదుగో! కర్నంగారిల్లు లోని కెల్లండి. ఆయనే యిలాగొస్తున్నారు. కాబయ్యగోరు ఇదుగో నుండి బామ్మణ్ణి దీసుకోనొచ్చాను.

దామో—తీసుకొని వచ్చేవా? ఏరీ? ఈయనేనా ఏమిటి? మీ దేవూరండి?

పురు—మాది వేదపల్లి. తమరేనా యీవూరి కరణంగారు?

దామో—నేనేనండి. మీ రేవూరు వెళ్ళుతున్నారు?

పురు—కొక్కిరాయిపల్లిలో కోమట్ల యింట్లో వివాహ మున్నది. సదస్యానికి వెళ్ళుచున్నాను. మీ రెందుకో రమ్మన్నా రట.

దామో—ఈరోజున మాతల్లిగారి తద్దినం మాకు భోక్తలు దొరక లేదు. మా పురోహితుడొకడున్నాడు. రెండవ బ్రాహ్మడు లేక దారివెంట ఎవరు వెళ్ళుతూంటే వారిని పిలుచుకు రమ్మని వెట్టి వాణ్ణి పంపించాను. వాడు మిమ్మల్ని తీసుకొని వచ్చాడు మీరు రెండవ భోక్తగా ఉండవలె.

పురు—నారాయణ! నారాయణ! ఎంతమాట! నేను తద్దిన బ్రాహ్మణార్థాలు మానేసి యిరవై ఏండ్లయింది. జీవపితృవైనంత కాలం చేశాను. మా తండ్రిగారు పోయిన తర్వాత మానివేశాను. పైగా నేను అవధానం చేశాను. కొద్దో గొప్పో కర్మిష్ఠిని. అటువంటి వాణ్ణి నేనా తద్దిన బ్రాహ్మణార్థం చేయడం? పైగా కొక్కిరాయిపిల్లి సదస్యంలో మాకు వరహా కిమ్మత్తుగల జాపురాదు వస్తుంది. అది చెడ గొట్టకండి.

అవన్నీ అటుంచండి. తద్దినం రేపోయెల్లుండో అనగా బ్రాహ్మణులను పిలుచుకోవాలిగాని రెండుజాములయిన తరువాత తద్దినం రోజున దారిని పోయే బ్రాహ్మణ్ణి కొట్టుకొనిరమ్మని వెట్టివాణ్ణి పంపుతారా? మీరెంత నియోగ ప్రభువులైనా వెట్టివాడి చేతనా తల్లితద్దినానికి బ్రాహ్మణ్ణి పిలుపించుకోవడం చాలుచాల్లేవయ్యా! అన్నీ అవకతవక లేనా? ఎవరయ్యా మీపురోహితుడు? శిష్యులయీలాగు తయారు చేసినాడు.

దామో—మాపురోహితుడు మాకు తగ్గవాడే లేండి. వెట్టివాడు పిలిచాడని అభిమానంగావుందా? ఎవరు పిలిస్తేమి. బ్రాహ్మడు పిలిస్తే నీకు వరహాలు ఒలికాయా? వెట్టివాడు పిలిస్తే అవి లేకపోయినాయా? గొప్ప కర్మిష్ఠి నని చెప్పుకుంటున్నారు మీరు. యిక్కడ బ్రాహ్మడు దొరక్కపోతే కర్మచెడిపోదా యీవేళ? నాలుగురూపాయల జామారు కోసరం చూచుకుంటున్నారు గానిమీరు బ్రాహ్మణ కర్మకొరకు చూచుకోవడంలేదు. అభావ ముచ్చినప్పుడు అవధానం చేసినవారైనా సరే దేవతార్చనపరులైనా సరే సోమయాజులుగారైనా సరే. బ్రాహ్మణార్థంచేసి బ్రాహ్మణీకం నిలపెట్టవలె. కర్మలు చేసేవారు మీ రేయీలాగంటే మావంటివాళ్ళకు పారగతమున్నదా!

పురు—కర్మలు చెడిపోగూడదు గాని బ్రాహ్మణార్థముచేసేవాడు చేయనివాడు అంటూ లేదా? నామనవి విని నన్ను వదలి వెయ్యండి.

దామో—నిన్ను నేను వొదలను ఇక్కడనుంచి అడుగు కదిలినావంటే వెట్టి వెంకడిచాత నిన్ను కూర్చుంచపెట్టిస్తాను.

పురు—వీధిలోకి వెళ్ళితే వెట్టివాడుపట్టుకుంటాడుగాని లోపల రాడు నేను యింట్లోనే యుండి బ్రాహ్మణార్థానికి కూర్చోను.

దామో—మావంటశాల్లో గుంజకు నిన్ను విరిచికట్టేసి నేను తద్దినం పెడ్తా.

పురు—నేను నాలుక పెరుక్కొని చస్తాను.

దామో—చస్తే శవానికై నాఅర్చిస్తాను. కాని నిన్ను వొదిలి పెట్టను.

పురు—నాయనా! యివి చేతులుగావు కాళ్ళు, నన్ను రక్షించండి (అని చేతులు పట్టుకొనుచున్నాడు)

దామో—ఇవి కాళ్ళుగావు చేతులు; కర్మ నిలపండి. (అని కాళ్లు పట్టుకొనుచున్నాడు)

పురు—(తనలో) ఈముండాకొడుకు శతబండ సహస్రబండ. కరణం తలుచుకుంటె మరణం తప్పదన్నాడు ఈవేళ యిక్కడ బలవంతబ్రాహ్మణార్థంతప్పదు. దేవుడా అనియేడుస్తూ నానిష్టంతా చెరుపుకొని బ్రాహ్మణార్థంచేసి తీరవలసిందే. ప్రొద్దున్నే లేవగానే పుట్టుకుంకముండ ఆమంగమ్మముండ పేడముద్ద చేతిలోబెట్టుకొని ఎదురుగా వచ్చింది అందుచేత నాకీయోగంపట్టింది, (అని ప్రకాశముగా) ఊఁ, సరే, బ్రాహ్మణార్థం చేస్తే రెండవ బ్రాహ్మడేడీ మరి ?

దామో—అడుగో మాపురోహితుడు అన్నంభొట్లు స్నానం చేసి యిప్పుడేవస్తూన్నాడు.

పురు—(చూచి) అన్నంభొట్లుగారూ ! ఏవూరండిమీది ?

అన్నం—మాది చేపలపల్లె. మీది వేదపల్లి. మీరునన్నెరగరుగాని మిమ్మల్ని నే నెఱుగుదును.

దామో అయ్యా మీరుగూడా స్నానంచెయ్యండి అప్పుడే మూడుజాములు గావొచ్చింది.

పురు—ఒక్కసారి స్నానంచేశాను. మీనూతిదగ్గరనే మళ్ళీ చేస్తాను. కాని అన్నంభొట్లుగారు! మీమెడలో జంధ్యం లేదేమండీ?

అన్నం—(తెల్లబోయి తనలో) ఎంతప్రమాదంజరిగింది. రాత్రి నల్లముండువాడికి డబ్బులియ్యకుండా వస్తూంటే బోగంపాపి తల్లి

ములిసిముండ జంఝ్యం పట్టుకు లాగి తెంపివేశింది. ఆమాట నేను మరచిపోయినాను. ఉపాయంచేత దాటలేనా యేమిటి ?

దా మో—జంఝ్యం లేకుండా యల్లా బ్రాహ్మణార్థానికొచ్చావయ్యా!

అన్నం—ఈతద్దిన మెవరిది ?

దా మో—మాఅమ్మది.

అన్నం—మీఅమ్మకు జంఝ్యముందా మఱి ? మీనాయనకు జంఝ్యంవుంది గనుక ఆయనతద్దినానికి భోక్తకు జంఝ్యముండవలెను. అమ్మతద్దినానికి జంఝ్య మక్కఱలేదు. ఇది ధర్మశాస్త్రసమ్మతమైన మాట. తెలిసివుండే చేసాను నేను. తెలియనివాళ్ళుమీమూరుకోండి. ఆయన మెడలోని జంఝ్యం గూడ తీసివేయండి.

పురు—మహారాజుల్లారా! నామెళ్ళో జంఝ్యం తియ్యకండి మీరు చెప్పినట్టు విని బ్రాహ్మణార్థం చేస్తాను. తర్వాత నాయేడు పేము నే నేడుస్తాను. పదండి స్నానం చేదాము. జన్మజన్మాంతర పాపఫలం బయటపడి నాకీబ్రాహ్మణార్థం వచ్చింది.
(అందరు నిష్క్రమించుచున్నారు)

—౯—

అద్భుత శ్రాద్ధ ప్రహసనము

[అప్పుడు సదాశివుడు, వినాయకశాస్త్రి, నరిసింహము ను
ప్రవేశించుచున్నారు.]

సదా—పెద్దలు చెప్పగా వినుటయేగాని స్వయముగా నే నెన్నడు చూడలేదు, నేటికాలానికి మా తండ్రిగారు చనిపోవడం

కాకులు ముట్టుకొనకపోవడం సంభవించినది. ఈవిచిత్రమేమిటో నాకు తెలియలేదు. చెట్లమీఁద కావలసినన్ని కాకు లున్నవి. గోదావరి యొడ్డున క్రింద బోసినయన్నముజూచి వెళ్ళిపోయినవిగాని ముట్టుకో లేదు. దీనికిఁ గారణ మేమైయుండు నంటారు? మీరు చెప్పినదంతా జరిగినమాట నిజము. నేను చాలకాలమునుంచి శ్రాద్ధకర్మ చేయి స్తున్నా గాని యిటువంటిచిత్రముఁ జూడలేదు. పెద్దలు చెప్పేవారు

నర—నేనీలాటిచిత్రాలు రెండు మూఁడుచోట్ల చూచినాను చచ్చిపోయిన వారికి మనస్సులో నేదైనఁ గోరిక లుంటే కాకుల ముట్టుకోవని పెద్దలంటారు. చచ్చిపోయినప్రేత మనకుఁ గనబడకుం డ దుడ్డుగఱ్ఱ చేతఁబట్టుకొని అన్నముదగ్గిరికి జేరకుండ కొట్టివేస్తుందట అందుచేతఁ కాకులు రావట. ఆమాట నిజమే యయ్యుంటుంది. లే పోతే నాలుగుమెతుకులు విదిపితే కావు కావు మని వందలకొ కాకులు వచ్చి వాల్తాయి అలాటిది తవ్వెడుబియ్య పన్నము వేస్తే కాకులు రాకపోవడ మేమిటి? మిరపకాయలు చూచినా క్రిందవా కాకులు అన్నముఁజూచి వెనక్కు వెళ్ళిపోవడం గొప్ప ఆశ్చర్యములో కాదా నేనుమీ మేనమామను, మీనాయనగారికి బావమరిదిని. కను నే నేదో హాస్యాని కంటున్నా నని సీవనుకో వద్దు. మీ నాయనగారి యేవో కోరికలు కొన్ని వుండితీరునవి. ఆకోరికలు నీవు కుమారుడవై నందుకు తప్పకతీర్చి తృప్తి పొందించవలెను. ఆలాగున చేస్తే బంధు వులు లోకులుకూడ మెచ్చుకుంటారు. ''పుత్రమంతేచ కర్మణి అన్నాఁడు శాస్త్రకారుఁడు. కాబట్టి నీవుతప్పకుండ కోరికదీరుస్తాన మొక్కుకో. ఇటువంటి సమయములో మనమనుసరించవలసిన శిష్టా చార మిదే.

సదా—మామయ్యా! నీవు వేళాకోళానికి చెప్పడం లేద నిజమే చెప్పుచున్నావు. అంతవఱకు నే నొప్పుకుంటాను. కా

యీా విషయములో నా కెంతమాత్రము నమ్మకము లేదు. కాకులు ముట్టుకోక పోవడానికి కారణాలనేక ముంటాయి. అన్నం చాలా వేడిగనుంటే ముట్టుకోక పోవచ్చును. దగ్గఱ మనుష్యులు నిలుచుంటే భయముచేత ముట్టుకోక పోవచ్చును. లేకపోతే అది వఱ కేదయినా తిని ఆకలి లేకపోతే ముట్టుకోక పోవచ్చును. అంతే గాని పితృదేవత లేమిటి దుడ్డుగఱ్ఱలు పుచ్చుకొని నిలుచుండుట యేమిటి. ఇదంతా వట్టిపిచ్చిమాట బ్రతికుండగానే కోరికలు గాని చచ్చిపోతే కోరిక లేమిటి ? అది నేను నమ్మను.

నర—నీ వంటే నవనాగరికుఁడవు గనుక నమ్మవు నీతాత లంటివాళ్ళు, నీముత్తాతలంటివాళ్ళు నమ్మినారు. నీతెక్కేమిటి పత్ర మేమిటి ? మాపూరిమునసబు రెండు లక్షల రూపాయల ఆసామి, ఆతఁడు చచ్చిపోయి నప్పుడు యీాలాగే కాకులు ముట్టుకోలేదు. వాళ్ళెన్నో దండాలు పెట్టుకున్నారు. ఎన్ని బెట్టుకున్నప్పటికి ఒక్క కాకైనా వాలలేదు. చిట్టచివరకు వాళ్ళప్రాణం విసికి అతఁడుంచు కున్న ముండకు నెలకు పదిరూపాయ లిస్తామని దణ్ణంబెట్టుకుంటే కాకులు ముట్టుకున్నాయి. ఈలాటి విచిత్రా లెన్నో నేను భూమి మీాఁద నెఱుఁగుదును. నిన్నగాక మొన్న బుట్టి కన్నులు దెరవని లొట్టకాయవు నీవు. నీనమ్మక మెంత జేసు నీ వెంత జేసు ?

వినా—అయ్యా ! సదాశివుఁడుగారు మీరుమామాటలుకొట్టి వేయఁగూడదు. నాకుపదిహేనోయేఁ డొచ్చింది మొదలు యిప్పటి వఱకు వంపలకొలది శ్రాద్ధాలు చేయించాను. మావూళ్లో ఒక బ్రాహ్మఁడు మెనిమిదిలక్షలరూపాయల కధికారి. పరమలోభి. మిరప కాయ కాల్చుకొనేతిన్నాఁడు గాని అన్నము కడుపునిండా ఒకరోజు గూడ తిని యెఱుఁగడు. సైనుగుడ్డే కట్టుకున్నాఁడు కాని జరీపంచ యెన్నఁడు వేసికొనలేదు. ఆయన చచ్చిపోయినాడు. పోయినప్పుడు

కొడుకు దేశ ప్రఖ్యాతిగా దినవారాలు చేయఁదలఁచుకున్నాఁడు. అ
చచ్చిపోయిన తండ్రి కిష్టము లేదు. కొడుకు మొదటరోజునే పీనుగ
మీఁద ముప్పది రూపాయల పట్టుశాలువఁ గప్పినాఁడు. గోదానా
చేసినాఁడు. దానితో కోప మొచ్చింది. కాకులు ముట్టుకోడ
మానివేశాయి. డబ్బు ఖర్చుపెట్టనని ప్రమాణము చేసి, దండవ
పెట్టుకున్నాఁడు. అప్పుడు వందలకొలది కాకులు వచ్చి ముట్ట
కున్నాయి. ఈలాటి వింకా మెన్నోవున్నాయి. నమ్మ నం
యేలాగా ? కాకులు ముట్టుకుంటేగాని గతులు లేవు. కుక్కల
మొదలైనవి ముట్టుకో గూడదు. అందుచేత మీమామయ్యగారు
చెప్పినట్టు చేయండి.

సదా—మీరు నూఱు చెప్పండి వేయి చెప్పండి. మీమాటల
నాకు నచ్చలేదు. అదిగాక మానాయనగారి కేమికోరిక లున్నవో
నాకుఁ దెలియవు. ఆయన నాతో ఏమి చెప్పి పోలేదు. మీతో
నేదైన జెప్పి పోయినా రేమో చెప్పండి. ఆలాగున తప్ప
కుండ చేస్తాను.

నర—మాతోను యేమి చెప్పిపోలేదు.

సదా—ఎవరితోను చెప్పనప్పుడు యేమని మ్రొక్కుకోను

వినా మీయిష్ట మేలాగో ఆలాగు చేస్తానని మ్రొక్కు
కోవయ్యా.

సదా—సరే! వేరే మ్రొక్కుకునే దేమిటి? ఆయనయిష్ట
మేలాగో యాలాగుననే చేస్తాను. మీరిద్దఱు సాక్షులు.

నర—చేస్తావుగద! చేస్తావుగద! చేస్తావుగద!

సదా—ఏమి టన్నిమాట్లడుగు తున్నావు? నీకేమైన చా
స్త్రమా ?

నర—(గుడ్లెఱ్ఱజేసి) చాదస్త్రమా! చాదస్త్రమా! (అనిముఁ
దుకు వెనుకకు ఊఁగుచున్నాఁడు)

వినా—ఇదేమి టయ్యా నరసింహంగారు! ముందుకు వెనుకకు నూగుచున్నా రేమిటి? సదా తెగకలు పుస్తకము జదివేటప్పుడాలాగే చదువుతాడు.

నర—ఏమిటి? నాపేరు నరసింహమూ? ఎవఁడు చెప్పినాడురా నీకు నాపేరు నరసింహమని. నీకు క్రిందు మీఁదు బొత్తిగా తెలియ డంలేదు. నీకు కండ్లు నెత్తిమీఁదికి వచ్చినాయి. జాగ్రత్త! నిన్నమాంతంగా మింగేస్తా.

వినా—సదాశివుఁడుగారు! ఇదేమిటీగోల? ఈయన కేమైన పూనిందా యేమిటి?

సదా—ధోరణిచూస్తే యాలాగే కనఁబడుతున్నది.

నర—ఏదోపూనిందా నాకు! ఏదోపూనిందా? (అని లేచుచున్నాఁడు)

సదా—పూనకపోతే పైత్యగించి దేమో కూచో. కూచో.

నర—నేను కూచోన్రోయి.

సదా—పోనీ! పండుకో.

నర—నేను పండుకోన్రోయి.

సదా—పోనీ! నిల్చో.

నర—నే నిల్చోన్రోయి.

సదా—పోని! యేం జేస్తావో చెయ్యి.

నర—ఏం జేస్తానా! కొంప పీకేస్తా. మిమ్ము లందర్ని పీక్కుతినేస్తా. గుడ్లు పీకేస్తా. ప్రాణాలు తీసేస్తా నేలఁబట్టిరాచేస్తా.

వినా—సదాశివుఁడుగారు! మీకు మాట్లాడడం తెలియదు. మీ రూరుకోండి!

సదా—నేనూరుకుంటాను. మీ రే మాట్లాడండి.

వినా—నీ వెవరో చెప్పవయ్యా.

నర—నే నెవరో యెఱుంగనటయ్యా? చిన్నప్పటినుంచి మా యింటి పౌరోహిత్యం చేస్తున్నావుగదా! యీ మాత్రం తెలియూ?

వినా—తెలియకనే అడిగాను. క్షమించి చెప్పవలె.

నర—నేనా నేను నరసింహమునుగాను. సదాశివుడి మేన మామనుగాను.

వినా—అయితే ఎవరు మీరు?

నర—నేనా? నేను సదాశివుడి తండ్రిని శ్రీనివాసరావును.

వినా—అయితే మీరెందుకొచ్చారు?

నర—నోరెండిపోయింది నోరెండిపోయింది. అందుకొచ్చాను

వినా—నోరెండి పోవడ మేమిటి? శిలోదక వాసోదకాలు తగలడంలేదు?

నర—అబ్బబ్బా! ఆగుడ్డపిడుపు నీళ్లు ఎవరిక్కావాలె. అని నాకక్కఱలేదు.

వినా—అందుకేనా కాకులు ముట్టుకోలేదు?

నర—అవును. నిస్సందేహముగా అందుకే.

వినా—అయితే, మీకేంగావాలో చెప్పండి. మీ కోరిక ప్రకారం నడుచుకోవడానికి మీఅబ్బాయిగారు సిద్ధంగాకూర్చున్నాడు. సదాశివుడుగారూ! మొక్కుకోవయ్యా! యిదే సమయము.

సదా—ఇదివరకే మొక్కుకున్నాను గదండి. మళ్ళీ యిన్ని మార్లెందుకు?

వినా—శ్రీనివాసరావుగారూ! మీ అబ్బాయిగారు మొక్కుకున్నారు. మీకు కావలసిందేమో నిష్కల్మషంగా చెప్పండి.

నర—అలాగయితే చెప్తున్నా వినండి నాకునోరెండిపోతున్నది. వాసోదక మని పేరు పెట్టి గుడ్డపిడుపునీళ్లు శిలోదక మనిపేరు బెట్టి ఱాయిగడిగిననీళ్ళునాకుం బోసినమాత్రాన నాదాహం తీరడం లేదు, మీరు వండివేసిన అన్నమువల్ల నా కాకలి తీరడం లేదు,

వినా—మరి మీకేమి గావాలె ?

నర–ఏమికావలెనా? చిన్నప్పటినుంచి ఉదయమున నాకాఫీ అలవాటు. మధ్యాహ్నంపూట అలవాటు. ఆ రెండింటితోపాటు గోధుమరవ ఉప్మాము అలవాటు. ఒక్కపూట కాఫీగాని టీ కాని లేకపోతే కాళ్ళుపీకేవి తలనొప్పివచ్చేది నడుంనిలబడేదికాదు. చేతులు వంకరలు పొయ్యేవి. నాలుక పిడచగట్టుకపోయేవి. చెవులు దిబ్బళ్ళు వేసేవి. కండ్లు భైరవులు గమ్మేవి, నరాలు తోడి వేసేవి. ఆ కాఫీ చుక్కలు నోట్లోపడ్డట్టయితే వేసవికాలపుఎండలకు శోషిల్లిపోయిన మొక్కలకు వానకురిసినట్లుండేది అమృతంలాగుండేదంటె నమ్మండి. కాఫీ వుంటె నాకు పానక ముక్కఅలేదు. మంచినీళ్ళెప్పుడు త్రాగే వాణ్ణేకాను. గంగాభాండపు కొబ్బరికాయి యిస్తే గిరగిర త్రిప్పి అవతల పారేసేవాణ్ణి. కాఫీవుంటె నా కిక యేమి అక్కఅలేదు. ఉప్మాను; కాఫీ యుంటే అన్నమైనా అక్కఅలేదు. అదే అన్నం. ఒకప్పుడు కులాసా పుట్టింపంటే ఉప్మాలో యింత కాఫీగాని టీగాని పోసుకొని మజ్జిగాన్నంవలె చారన్నంవలె త్రాగేవాణ్ణి. మాతండ్రి చచ్చిపోయినప్పుడుముందు కాఫీనోట్లోపోసుకోందేనిప్పుకుండ బట్టుకోలేదు. తండ్రి తద్దినం రోజునగూడా ముందు కాఫీ త్రాగుతాను. తద్దినం రేపనగా ఆనాటి రాత్రియూ తద్దినంనాటిరాత్రియూ వేరే ఫలహార ముక్కఅలేకుండా ఈరెంటితోనే కాలక్షేపం చేస్తాను. అటువంటి కాఫీ నా కిప్పుడు లేకపోవడంచేత యిప్పుడెంతో యిబ్బంది సంభవించింది. ఇటువంటి కొడుకు నాకుండగా నేనింత బాధపడవలెనా ? ఇప్పుడు నాముఖ్యమైన కోరిక యేమిటంటే కాఫీతో తర్పణంచేసి ఉప్మామాతో పిండం పెట్టవలెను ఆలాచేస్తేగాని నాకు ముట్టదు.

వినా—సరే ఆలాగే చేస్తాము. కాని యిది శాస్త్ర మొప్పుతుందో లేదో. శాస్త్రములలో శిలోదకములు తిలోదకములు

వాసోదకములు చెప్పబడియున్నవి. గాని కాఫీలు టీలు ఉప్పుమాలు చెప్పబడలేదు. శ్రాద్ధాలు ధర్మశాస్త్రప్రకారం చేయవలసినవిగాని మీయిష్టప్రకారం నా యిష్టప్రకారం చేయవలసినవిగావు. గారెలకు బదులుగా మసాలావడలు పెట్టమంటె శాస్త్రి లొప్పుతాయా ?

నర—ఒప్పుతాయో లేదో నా కవసరంలేదు, నాకు ముట్ట డమే నాకుగావాలిగాని తక్కినవిషయం నాకక్కరలేదు. పూర్వ కాలంలో మన్మథుడు సాంబమూర్తిగారి మూడవకంటి చిచ్చువల్ల కాలిపోయి, భస్మపటల మైనప్పు డతనిభార్యయైన రతీదేవి మన్మథు నకు ప్రియమిత్రుడైన వసంతునిఁజూచి చచ్చిపోయిన తన మగనికి పువ్వుతేనెతో తర్పణమిచ్చి పుష్పాళ్ళతో పిండముం పెట్టవలసినదని నొక్కిచెప్పెను. అక్కడ ధర్మశాస్త్రమేమయినది. తిలతర్పణములు మానివేసి పువ్వుతేనెతో తర్పణములిస్తేను అన్నప్పిండములు మాని వేసి పుష్పాళ్ళతోఁ బిండమువేస్తేను మన్మథునకు ముట్టినప్పుడు కాఫీతో తర్పణమిచ్చి, ఉప్పుమాతో పిండం బెట్టి గారెముక్కలకు బదులు యిడ్డెనలు పెట్టితేను నాకు ముట్టక పోవునా? మీశాస్త్రములు తీసికెళ్ళి తుంగలో పూరదొక్కండి బ్రాహ్మలకు పెట్టేటప్పుడుగూడ మాసికం రోజున తద్దినంరోజున క్షీరాన్నం కాచడం మానివేసి వేడి వేడి కాఫీగానీ వేడి వేడి టీగాని దొన్నెల్లోపోసి విస్తరిచుట్టుపెట్టండి. పిండివంటలు మానివేసి బాగా అల్లపుముక్కలుపోసి గోధుమరవతో నిమ్మపండ్ల పులుసుపోసితయారుచేసిన ఉప్పుమా విస్తళ్ళలో బెట్టండి. అప్పుడు నాయాత్మ శాంతిపడుతుంది. అప్పుడు నాదాహాముతీర్తుంది. అప్పుడు నాకడుపు నిండుతుంది.

సదా—ఏం బెట్టమంటే అదే పెడ్త. నా కభ్యంతరము లేదు.

వినా—నారాయణ ? నారాయణ, ధర్మశాస్త్రిలు తగులడి పోతున్నాయి. ఇతర దేశస్థులను జూచి మనవాళ్ళు యింట వంటలేసి

కాఫీలు, టీలు, ఉప్మామాలు అలవాటు చేసుకోబట్టి చచ్చిపోయి పితృదేవత లయినతర్వాత గూడా ఆ కాఫీనీళ్ళమీఁద వుప్మామామీద గూడ వాంఛదీరకుండా యున్నది. ఇప్పుడు ధర్మశాస్త్రాలు మాని వెయ్యాలి. ''తిలోదక, వాసోదక, పిండప్రదానం కరిష్యే'' అను మాటలు తీసివేసి ఉప్మామాపిండప్రదానం కరిష్యే కాఫీ తర్పణం కరిష్యే అని మంత్రాలు మార్చివెయ్యవలసి వచ్చింది. దీ నెమ్మ కడుపుకాల కలియూయ లోకాన్ని యెంతవఱకు ముంచేసింది. కూలి ముండాకొడుకున్ను కర్మిష్టి అయినబ్రాహ్మణముండాకొడుకు కూడా సోడాదాగి కాఫీతాగి యేడుస్తుంటె యిటువంటి యోగం పట్టక పోతుందా? గొడ్లు కుడితి త్రాగినట్లు కంచు చెంబుడు కాఫీతాగడ మున్ను కడుపులు చాకిబానల్లాగ పెంచుకొని రోగాల పాలవడ మున్ను, ఈ కాఫీలు కాఫీకొట్లు వచ్చినతర్వాత నే రోగాలు యెక్కు వవుతూ యున్నవి. ఈ కాఫీకొట్లు పోతేనేగాని మనం బాగుపడము. వేళ లేదు, పాళ లేదు, మడిలేదు, మైల లేదు, ఆకలి అయిందన్నమాట లేదు. కాలేదన్నమాట లేదు. గోనెబస్తాలో పోసినట్టు రహదారీ పడ వలో చక్కపూటుగా సరకు వేసినట్టుతిని దొర్లడమే మనవాళ్ళపని.

నర — ఇదిగో! నేను వెళ్ళిపోతున్నాను. నే చెప్పినట్టు చేయండి లేకపోతే పాడవుతావు.

వినా — ఇది గొప్పచిక్కే వచ్చిందోయి.

నర — చిక్కే లేదు. మా తండ్రిపేరుచెప్పి ఉప్మామా, కాఫీ, టీలు పంచిపెడ్తాను. అదే శ్రాద్ధము.

కైలాసదూత ప్రహసనము

రంగము 1

[అప్పుడు వాసుదేవరావు ప్రవేశించు చున్నాఁడు]

వాసు——(తనలో) తిట్టేనోరు తిరిగేకాలు ఊరుకోలేవని పెద్దలంటారు. కాని పనిచేసేచేతులు కూడా ఊరుకోలేవను మాటపై వాటితో కలపవలసినదే; ఏరోజుకారోజు హస్తలాఘవముచేసి యేదో సంపాదిస్తేనే కాని నిత్యకృత్యంగడవదు. మా నాగమణికి బువ్వగడువవలె బట్టగడువవలె. పైగా నాజూదానకు నాత్రాగుఁడుకు నాతిండికి నాబట్టకు కొంతమిగులవలె. దిక్కుమాలిన బ్రహ్మదేవుఁడు ఒక్క రూపాయలచెట్టు సృష్టించి నాకిచ్చినాఁడు కాఁడు. అందుకే ఆనిర్భాగ్యునకు లోకంలో పూజలేకపోయింది. వాఁడికేమి పోయేకాలమో కాని ఆ బ్రహ్మదేవుఁడు బోసుగా చేతికొద్దీ కర్చుచేసేవాఁడికి డబ్బియ్యఁడు. ఒకరికి పెట్టక తాను తినక యెంగిలిచెయ్యి కాకికైన రాల్పనియ్యేబ్రాశి వెధవలకు కావలసినంతడబ్బిస్తాఁడు. నామాటకుదాహరణముగా ఈ రమాకాంతరావున్నాఁడు! ఏఁడితస్సాకొయ్యా! వీడిదగ్గర లక్షరూపాయలున్నాయి. ప్రాణావసరమువచ్చి యెవఁడైనా బదులునకు వస్తే నూటికి రెండురూపాలవడ్డీ మీఁద అప్పిస్తాఁడు. వాయిదా దాటితే నూటికి నాలుగురూపాయలు పుచ్చుకుంటాఁడు. ఇంట్లో రెండోవిస్తరిలేదు. తండ్రితద్దినమునాఁడైనా పైవాడినిపిలువడు సొమ్ము పాపము పెరిగినట్లు పెరిగినది వీఁడిదగ్గఱ. దానికి విడుదలయ్యే దారిలేదు. చూడవస్తే పిల్లలు లేరు. ఎవడినో పెంచుకుంటాఁడట. ఎందుకు వెధవ పెంపు. పెంచుకుంటే నావంటివాఁడిని పెంచుకోరాదూ. ఒకజోడు గుఱ్ఱాలబండి ఒక మోటారుబండి పెట్టి పెళ పెళ లాడుచు

ఎంత పేరు తెస్తాను వీడికి నేను, ఎవఁడో చచ్చువెధవను పెంచు
టాడు కాని నా వంటివాఁడిని పెంచుకోఁడు. నే నెంతమందినో టో
వేసి డబ్బు లాగినాను, కాని వీఁడిదగ్గఱ నాపాశిక పడినదికా
వీఁడికొంపలో లాగితేనే నాప్రజ్ఞ అని నాకుంది. బదు లిమ్మన్నా
పాశికపడలేదు అర్థరాత్రివేళ యిత్తడినగలు పట్టుకొని వెళ్ళి బంగ
నగలని చెప్పి తాకట్టుమీఁద సొమ్మియ్యమన్నాను. అప్పుడుకూడ
ద్యాయము పాఱినదికాదు. దీని కేమి టుపాయము. వీడి పెళ్ళా
మాత్రము వెఱ్ఱిముండ. వీఁడు లేనప్పు డావిడదగ్గర యేదైన పా
వేస్తేనాద్యాయము పాఱుతుంది. అదిగో వీఁడు గుఱ్ఱ మెక్కి యే
వూరు వెళ్ళుచున్నాఁడు. బహుశః సాయంకాలమువఱకు రాఁ
పాచిక పాఱడానికి కావలిసినంతవ్యవధి యున్నది. పోలేరమ్మత
యీవేళకనక నాద్యాయము పాఱెనా నీజాతరలో రెండు పే
పోతులనిస్తాను. రెండన్న రెండన్న మాట యేమిటిపాఱినకొద్దీయున్న

(తెఱలో)

ఎక్కడికీ వెళ్ళక జాగ్రత్తగానుండు తలుపులన్నీ తాళాలు వే
వాసు —(తనలో) అదిగో జాగ్రత్త అని చెప్పి వెళ్ళి
చున్నాఁడు. ఈ వెఱ్ఱిముద్దరాలును టోపీ పెట్టుటకు తగినవిధ మొక్క
యున్నది. దానికి తగిన వేషము వేసికొంటాను. చిన్నప్పటిన
పగటివేషాలలో దిరగబట్టి యేవేషానికితగ్గ దావేషామున్నది. ఈ
శివభక్తురాలు. మతమంటే యీావిడకు చాలపిచ్చియున్నది నో
వ్రతాలు అంటే చాలాయిష్టము. అయ్యవార్లు అమ్మవార్లు
చాలా ప్రేమ అందుచేత యీావిడ నాటోపీలో పడకపోదు. ఇ
వెళ్ళి వేషము వేసికొని వస్తాను. (అని నిష్క్రమించును.)

2 రంగం

(అప్పుడు వాసుదేవరావు ప్రవేశించు చున్నాడు.)

వాసు-(తనలో) ఇప్పుడు నేను సరిగా జంగము బసవయ్య లాగున్నాను; కనురెప్పలమీంద చెవులమీందకూడా వీభూతి పాము కొన్నాను. అబ్బ వీటికడుపు కాలా; యీ రుద్రాక్ష తావళముల మూలాన్ని మెడలాగివేస్తూన్నది. ఏమైనాఒకగంటసేపు బాధపడాలి ఎవరండమ్మా లోపల తలుపు తీయించండి.

(అప్పుడు మంగమ్మవచ్చి తలుపుతీయును.)

మంగ-ఎవరు వారు. ఎవరికోసము వచ్చినారు.

వాసు-అమ్మా, రమాకాంతంగారిల్లు యిదేనా ?

మంగ-ఆ, యిదేనండి.

వాసు-అమ్మా! మీరేనా మంగమ్మగారు.

మంగ-చిత్తము నేనేనండి.

వాసు-నేనూ అలాగే యనుకొన్నాను. వారు చెప్పిన యానవాళ్ళన్నీ మీదగ్గఱ కనబడు చున్నాయి.

మంగ-ఎవరు చెప్పినయానవాళ్ళండి యవి.

వాసు-ఎవరుచెపితేనేమి తరువాతతరువాతమీకే తెలుస్తుంది.

మంగ-తమరెవరో నాకు తెలియదు. మాయమగవారింట్లో లేరు. తమరు వచ్చినపని యేమిటో తెలియదు.

వాసు-అమ్మా! నేనెవరినో యెందుకువచ్చానో సవిస్తరంగా చెపుతాను; నేను వచ్చినపని విని మీచిత్తమువచ్చినట్లు చేయండి మాకాపురం కైలాసము. నేనునందికేశ్వరుడిని; నందికేశ్వరుండవైతే సాధారణమనిషిలాగున నున్నావేమి అంటారేమో, నానిజరూపం చూపిస్తే జనులంతాజడుచుకుంటారని మామూలుమనిషిలాగ చక్కా వచ్చాను.

మంగ—ఆహా! మహానుభావులైన నందీశ్వరులవారా? నమస్కారము నమస్కారము. తప్పులు క్షమించవలయును. తప్పులు క్షమించవలయును. (అని చేతులు జోడించి కాళ్ళమీఁద పడును)

వాసు—(తనలో) నేను విన్నది నిజమే. ఈవిడ యమాంయకురాలే. అప్పుడే ధోరణి తెలుస్తూన్నది. (ప్రకాశముగా) అమ్మా! తప్పులేమున్నవి క్షమించేటందుకు నీ భక్తికి చాలసంతోషించినాము.

మంగ—దేవరవారు వచ్చుటవల్ల మాగృహపావనమైనది. తమ రెందుకు విజయము చేశారో చెప్పవలెను.

వాసు—అమ్మా! నేను నాస్వంతపనిమీఁద రాలేదు. పరోపకారముకోసమువచ్చాను. లేకపోతే నాకుకైలాసముకదిలి రావడానికి తీరుబడియున్నదా? ఒక్కగడియ నేనక్కడ లేకపోతేజరుగదు. సాంబమూర్తిగారికి నేనే కుడిచెయ్యిని. నేనక్కడ లేకపోతే ఆయనకు తోఁచదు ఆయనపను లన్ని నేనే చేయాలి. ఆలోచన లన్ని నేనే చెప్పాలి. పార్వతీదేవికి నేను పెద్దకొడుకుని పార్వతీ పరమేశ్వరులు అస్తమానం నన్నేపిలిచి నన్నే గౌరవిస్తారని ఆ విఘ్నేశ్వరుఁడికి ఆ కుమారస్వామికి కడుపులో యెంతో అంతగుబ్బు.

మంగ—దేవరవారియోగ్యత అటువంటిది కనక ఆ పార్వతీ పరమేశ్వరు లంత యాదరణ చేస్తున్నారు.

వాసు—అమ్మమ్మా! అలాగనవద్దు. అదినా యోగ్యత గాదు. ఇంతకు వారిద్దరికి నామీఁద అపరిమితమైనదయ. వారి కంతదయ లేకపోతే నేనింతకాలము నిలవగలనా? వారిదయచేత నాకెంతగౌరవముజరుగుతూన్నదో చూడండి. సాంబమూర్తివారిదర్శనము చేయుడం నిమిత్తం దేవేంద్రుఁడు, బృహస్పతి, బ్రహ్మదేవుఁడు, శ్రీమహావిష్ణువు మొదలైన దేవత లందఱు కైలాసమునకు వచ్చినప్పుడు దర్శనానికి తగినసమయము చెప్పవలసినదని నన్నాశ్రయించి నాయనుగ్రహము సంపాదించుకుంటారు. వచ్చేదేవతలు పోయేదేవతలు స్తోత్రముచేసే

దేవతలు వరము లడిగే దేవతలు కష్టసుఖములు చెప్పుకునే దేవతలు, అటువంటిచోటనుండి కదిలి రావడానికి నాకు తీరుబడే లేదు. అయితే ఆముసలాళ్ళకష్టం చూడలేక యిల్లావచ్చాను.

మంగ—ఏ ముసలాళ్ళు స్వామీ.

వాసు—ఎవరో నీలకంఠంగారు పార్వతమ్మగారు అని దంపతులున్నారు.

మంగ—నీలకంఠంగారు మామామగారు, పార్వతమ్మగారు మా అత్తగారు.

వాసు—అప్పు నవ్వు నమ్మా నే నెఱుగుదును ఎఱిఁగుండబట్టే వారుపంపితే యిక్కడికివచ్చాను నీవేనా అమ్మా వారికోడలవు.

మంగ—చిత్తము నేనేనండి.

వాసు—నీవిషయమై వారు చాలా చెప్పారు. ఈలోకములో వున్నంతకాలము వారి కిద్దఱికి నీవు చాలాపుపచారము చేశావని నీవు భూదేవతవని మహాయిల్లాలువని నీవుండబట్టి భూమిమీఁద వానలు కురుస్తున్నా యని వారు చెప్పారు. అత్తమామల మెప్పుపొందుటచేత నీవు చాలాధన్యురాలవమ్మా!

మంగ—సరి సరి యెంతమాట. అది నామంచితనముకాదండి మాఅత్తమామలు పార్వతీపరమేశ్వరులవంటివారు. వారు మంచి వారగుటచేత నాకింత పేరుప్రతిష్ఠలు వచ్చాయి. నేను కాపరానికి వచ్చినది మొదలుకొని వారునన్ను బిడ్డలాగునచూచుకొనుచున్నారు.

వాసు—వారెంతమంచివారైనా నీమంచితన ముంటేనేకాని వారి కావుపచారము జరగదు.

మంగ—అయితే వారిద్దరు సౌఖ్యముగావున్నారండి అక్కడ?

వాసు—ఏమిసౌఖ్యవమ్మా సౌఖ్యముంటే వారు నన్నిక్కడి కెందుకు పంపుతారు.

మంగ— అయితే వారు మిమ్మిక్కడికి పంపించినారా యేమిటి?

వాసు— పంపకపోతే నాఅంతట నేను వచ్చానా మరి.

మంగ— స్వామి! నాకు తెలియలేదు. అయితే వారెందుకు పంపించారు మిమ్మల్ని.

వాసు— ఎందుకు పంపించారని మెల్లిగా అంటున్నావా? వాళ్ళక్కడ పడేకష్టాలు చూచేటప్పటికి కళ్ళు చిల్లులు పడిపోనాయి అంతట నేనే మీదగ్గిఱకు రావాలనుకుంటూంటే వారే పిలిచి నన్ను నీదగ్గిఱకు వెళ్ళమన్నారు. అందుకని నేను వెతుక్కుంటూ వచ్చాను.

మంగ— అయ్యో! వారు కష్టాలు పడుతున్నారా అక్కడ?

వాసు— కష్టాలన్నా కష్టాలా! అమ్మా! కట్టుకుందుకుబట్టలు లేవు వారికి. మీమామగారు గోచీపెట్టుకు తిరుగుచున్నారు. మీ అత్తగారు చిరుగులగుడ్డలు కట్టుకుని కాలక్షేపము చేస్తూంది. ఈదరిద్రము చేత వారు ప్రజల మొగము చూడలేక సిగ్గుపడి తిరుగుతూన్నారు. చలిగాలికి బాధపడలేక వారు చెట్టుతొఱ్ఱలలో పండుకొనుచున్నారు. ఉందామంటే యిల్లులేదు. ఆచెట్టుక్రింద యీచెట్టుక్రింద వారిపంచను వీరిపంచను తలదాచుకొనుచున్నారు. కర్చుచేసుకుందామంటే చేతిలో డబ్బు లేదు వారికి. వారుపడుచున్న కష్టాలిన్ని అన్ని కావు. రమాకాంతంపంతులుగారి వంటికొడుకు మీవంటి కోడలు నుండగా వారి కెన్నిపాట్లు వచ్చినవో చూడు అముసలి వాళ్ళనుచూస్తే నాకడుపు దరికోసుకొని పోవుచున్నది. నేనే కాదు అక్కడున్నవాళ్ళంతా జాలిపడు తున్నారు. ఆపార్వతీపరమేశ్వరులకు గూడా చాలా జాలి కలిగినది.

మంగ— (ఏడ్చుచు) అయ్యో! మామగారు! మీకెంత కష్టము వచ్చినదండీ. అయ్యో! అత్తయ్యా! నేనుండగానీకెన్ని కష్టాలు సంభవించాయండీ. మీరు దిక్కు మాలినపక్షులలా

గ్గైపోయారా. ఈలాంటి సెంకటిళ్ళు మీకొండగా తలదాచు
టకు కొంపే లేకపోవునా? కట్టుకొనుటకు గుడ్డలేదా! ఈ
పోతారని యెప్పుడు అనుకోలే దత్తయ్యా మీ రెంతొంత సుఖ
తున్నా రనుకొన్నా నత్తయ్యా.

వాసు—అమ్మాయి! విచారిస్తే కార్య మేమి ముస
దానికి తగినపని చేయాలి.

మంగ—ఏమిచేయాలో నాకు తెలియడము లేదండీ.

వాసు—తెలియకపోతే అమ్మా నేను చెపుతాను వి

మంగ—చెప్పండినాయనా. ఆదంపతు లిద్దరు సుఖ
టట్టూ నలుగురిలో తల యెత్తుకొని తిరిగేటట్టూ యేమైనా
యం వుంటే చెప్పండి.

వాసు—చెప్పడానికి కేముందమ్మా. మీమామగారికి నా
జరీపంచలు నాలుగు జరీకండువాలు మంచిబనారసు పట్టుపంచ
డువా వుండాలి. మీయత్తగారికి నాలుగుజరీచీరలు ఒక రెండు
చీరలు వుండాలి. ఏదోప్రాదేశమాత్రంగా యిల్లుకట్టుకోడ
నాలుగైదువందలరూపాయిలుండాలి. నిత్యకర్చువాడుకుందుకింకో
రూపాయ లుండాలి. ఈమాత్ర మైనావుంటేనేకాని వాళ్ళు గౌ
ముగా వుండేటందుకు వీలు లేదు.

మంగ—అయ్యోనాయనా! ఆమాత్ర మివ్వడానికి వా
శక్తి లేకపోలేదు. అయితే మావారింట్లో లేరు. ఆయన వచ్చి
దాక మీరు వున్నారంటే ఆయనతో చెప్పి యిప్పిస్తాను.

వాసు—చాలు చాలు నేను నాపనులన్నీ చెడగొట్టుక
రావడమే కాకుండా యింకా మీవారు వచ్చిందాకా వుండనా
నాకవతల పని లేదనుకొన్నావా యిదేపని అనుకున్నావా? ఈవ
కప్పుడే సాంబమూర్తిగారు బెంగపెట్టుకొని యెదురుచూస్తూంటా
పార్వతీదేవి అన్నమేతినదు నేనొక్క నిముషముండడానికి వీలు లేదు. ఇ

యిప్పుడేమైనాయియ్యి, ఇవ్వకపోతే నేను వెళ్ళిపోతాను. ముసలాళ్లే గంగలో చస్తె నాకెందుకు. (అని లేవబోవును)

మంగ-స్వామీ! నందికేశ్వర్లువారూ! కూర్చోండి కూర్చోండి కోపపడకండి, కావలసినజరీబట్టలుపట్టుబట్టలునా పెట్టెలోనే వున్నాయి అవి నే నియ్యగలను కాని నాదగ్గఱ రొక్కమేమీ లేదు. అందుకే తటపటాయిస్తున్నాను.

వాసు-అమ్మాయి! ఇంత తటపటాయించాలా. రొక్కము లేకపోతే నీమెళ్ళోఅన్ని వస్తువులున్నాయి. యేదోవకవస్తువుపార వేయ రాదూ. అత్తమామలకంటే యీ వస్తువులెక్కువా వెధవవస్తువులు. చేయించుకుంటే మళ్ళీవస్తాయి, ఇప్పుడు నేను వెళ్ళిపోయినానంటే అక్కడినుంచి ఇక్కడికి వచ్చేవారు లేరు. కబురు చెప్పేవారు లేరు. ఆకాసులపేరుతీసి ఇల్లాఫారై. నీమగడువచ్చి చూచినానీమీద యేమీ కోపపడఁడు ఎందుకంటే ఆతనితల్లిదండ్రులకిచ్చావుకాని నీవునీవాళ్ళ కిచ్చుకోలేదు కదా. అందుచేత నీవు భయపడవలసిన పనిలేదు. ఆయన చాలా సంతోషిస్తారుకాని నిన్నేమీ అనరు.

మంగ-నిజమే స్వామీ సరే యీకాసులపేరు పుచ్చుకోండి (అని యిచ్చివేసి జరీబట్టలు పట్టుబట్టలు దెచ్చి) ఇవిగో పట్టుబట్టలు జరీబట్టలు పుచ్చుకోండి. (అని యిచ్చును.)

వాసు—అమ్మాయి! పతివ్రతవంటే నీవే, అత్తమామలయందు భక్తిగలదానవంటేనీవే, నిజముగా నీవంటిఆడదుండబట్టే లోకములో కొంతధర్మం నిలుస్తుంది అత్తలను బాధపెట్టేవాళ్ళు మామలను బాధపెట్టేవాళ్ళు కాని యీకాలంలో నీవంటి కోడలొకర్తె కన పడదు. ఈకాసులపేరు ఈబట్టలు తీసుకొని వెళ్ళి మీయత్తమామల చేతిలో పెడతాను. వారు చాలా సంతోషిస్తారు. వీలుగాఉంటే పది హేను రోజులలో మళ్ళీవస్తాను.

మంగ-తప్పకుండా దయచేయండి. మా అత్తగారు మామ గారూ యేమన్నారో మళ్ళీవచ్చి చెప్పండి.

వాసు—తప్పకుండా చెప్తాను యిక నేను వెళ్ళుతాను (అని లేచి తనలో) ఇది వట్టి వెఱ్ఱిముండ అన్నమాట స్పష్టముగా తెలిసింది నాటోపిలో బాగాపడింది. ఇక యిక్కడవుండకూడదు దీని మగడు వచ్చాడంటే పట్టుకొని డొక్క చీరేస్తాడు. వాడు చండశాస నుఁడు ఈయవస్థలో పిక్కబలమే శరణ్యము. (అనిపోవును.)

మంగ—(తనలో) పాపము మహానుభావులైన నందికేశ్వ రులవారు రాబట్టి మాఅత్తమామలకు సుఖం కలిగింది, లేకపోతే వారు కష్టపడడము మాకప్రతిష్ట రావడము సంభవించును. ఆయనిం టిలో లేకపోబట్టి తక్కువ యిచ్చినాను. లేకపోతే యింకాయెక్కువ సొమ్మిచ్చి యుందును.

(అప్పుడు రమాకాంతముపంతులు ప్రవేశించు చున్నాఁడు)

రమా—తలుపు తీసికొని కూర్చున్నావేమీ నీవేమో చిన్న వోయినట్లున్నావేమి ఎవరితో నైనా తగాదాలాడినావా యేమిటి.

మంగ—(ఉత్తరము చెప్పక వెక్కి వెక్కి యేడ్చును)

రమా—(తొందరతో) ఏమిటిది, ఏమైనా జబ్బుగానున్నదా!

మంగ—అయ్యో అత్తయ్యా! అయ్యో అత్తయ్యా! అయ్యో మామగారూ? మీకెంతకష్టము వచ్చినదండి, మేమంతా లేనివాళ్ళ మయిపోయినామా మీకు.

రమా—(తొందరతో) ఏమిటిది మీ మేనమామకో మేనత్తకో జబ్బుగా నున్నదా యేమిటి.

మంగ—అయ్యో! వాళ్ళకు జబ్బులేదు. మీ యమ్మగారూ మీనాన్నగారూ. (అని యేడ్చును)

రమా—ఏమిటది నీకేదైనా దయ్యము పట్టినదా యేమిటి

మంగ——అయ్యో! దయ్యమేమిటి? సరి ఇదొకటి కూడానా మంత్రగాళ్ళను పిలిపించనక్కర లేదు. నాకు దయ్యము లేదు. భూతము లేదు. చెపుతా వినండి. కైలాసంనుంచి నందికేశ్వర్లవారు వచ్చినారు. అక్కడ మీ నాన్నగారు అమ్మగారు బట్టలేక అన్నంలేక యిల్లులేక చాలా కష్టపడుచున్నారని ఆయన చెప్పారు. మనమంతా బాగా వుండి వాళ్ళను కష్టపెట్టుచున్నాము గదా. (అని యేడ్చును.)

రమా——సరే! సరే! ఎవడో దొంగముండాకొడుకు వచ్చి నిన్ను టోపీవేశాడు. యేమైనా యిచ్చావా యేమిటి.

మంగ——(కోపముతో) దొంగముండాకొడుకా. ఎంతమాట! సాక్షాత్తు నందికేశ్వర్లవారు మనమీద అనుగ్రహంచేతను వచ్చి నిజస్థితి చెప్పినదేకాకుండా తిట్లు కూడానా? ఏమైనా యిచ్చావా అని మెల్లిగా అడుగుతున్నారా? వాళ్ళకష్టాలు తెలిసిన తరువాత కూడా యివ్వకుండా వూరుకుంటానా. అత్తమామలమీద యెంత భక్తిలేనిదాననైనా నాచేతనైన దియ్యకపోతానా?

రమా——ఏమిచ్చావు మెడలో కాసులపేరు కనబడడం లేదు. అదిచ్చావా యేమిటి కొంపతవ్వి.

మంగ——ఇవ్వకపోతే యేలాగు. మీరు వెళ్ళి యెక్కడో కూర్చుండిరి. నందికేశ్వర్లవారు వెళ్ళిపోవలెనని తొందరపడ్డారు. సొమ్మిచ్చి పంపకపోతే అత్తమామ లడుగుతారు. ఏమిచేయను. కాసులపేరిచ్చి పట్టుబట్టలు జరీబట్టలు నిచ్చి పంపించాను. మీతల్లి కోసము మీతండ్రికోసము చేశాను. కాని మావాళ్ళకోసము కాదు గదా.

రమా—— సరే టోపీదాసువచ్చాడు. టోపీవేసి పోయ్యాడు. ఏడువందలరూపాయలసొమ్ము గంగలో కలిసి పోయింది వాడేలాగుంటాడో చెప్పు. పట్టుకొని పోలీసువాళ్ళ కప్పగిస్తాను.

మంగ—శివశివా! యెంతమాట. ఆమహానుభావుణ్ణి పోలీసు వారి కప్పగిస్తే వంశనాశన మవుతుంది. ఆలాచేస్తే నేనిప్పుడే నూతిలో దిగుతాను.

రమా—ఓపిచ్చిదానా! నీతెలివి యిల్లా గుండబట్టే ఆలా టోపీలో పడ్డావు. సరేలే వాడిజోలికి వెళ్ళను. నోరుమూసికొని వూరుకుంటాను. ఈయాడవాళ్ళ మూర్ఖతచేతనే మోసగాళ్ళఆటలు సాగుతున్నాయి. లేకపోతే చచ్చినవాళ్ళకి సొమ్మెందుకు? ఇల్లెందుకు? బట్ట లెందుకు?

(అందఱు నిష్క్రమించు చున్నారు.)

ఔషధ ప్రకటనలు

అనేకనృత్తులు చేసి యేవృత్తియందును తనపొట్ట గడువక పోవుటచేత తుదకు వైద్యమారంభించిన యొక మనుష్యుడు తన మందుల నీక్రిందివిధముగా ప్రకటించెను.

శ్రీ బరోడామహారాజుగారు మైసూరుమహారాజుగారు నేపాళ చక్రవర్తిగారు, హైదరాబాదు మహారాజుగారు తిరువాన్కూరు నవాబుగారు, జయపురం సుల్తానుగారు నావద్ద లక్షలకొలది కోట్ల కొలది విలువగల మందులు ఖరీదుచేసి తమ రోగములన్నిటిని బోగొట్టు కొని నాకు కలియుగ ధన్వంతరియని బిరుదు నిచ్చినారు హైదరాబాదు మహారాజుగారైన శ్రీ గోవిందరాజు బహద్దూరుగారు నా మందుల పటుత్వమునకు సంతోషించి నన్ను ఏనుగ అంబారీమీద గూర్చుండ బెట్టి ఊరేగించి రెండు జాఘీరులు నిచ్చినారు. తిరువాన్కూరు నవాబు గారు నా ప్రజ్ఞల పరీక్షించి నాకు హకీం సర్దార్ అని బిరుదిచ్చి నాకు రెండు అగ్రహారములిచ్చినారు. ఈప్రాంతముల జనులు తగిన వైద్యులు, మందులు లేక అకాలమృత్యువుల పాలగుటచేతను ఈ దేశము నాజన్మభూమి యైనందున దానిమీద నాకు విశేషము అభి మానము వుండుటచేతను యిక్కడి ప్రజలను బ్రతికింపదలంచి నా జాఘీరులకు అగ్రహారములకు ముక్తిహారుల నేర్పరిచి నేను ప్రస్తుతము కాతేరుగ్రామములో నివాస మేర్పరచుకొన్నాను. పట్టణములలో కాపు రమంటే వేలకొలదిరోగులురాత్రిపగలు మాయింటిముందరపడిగాపులు పడియుండి నాకునిద్రాహారములు లేకుండ జేయుచు వచ్చినందున పట్టణ ములలో కాపురముండక యీ పల్లెటూరిలో నుండుట కేర్పరుచు కున్నాను. నన్ను నేనుస్తోత్రము చేసుకోగూడదుగాని నామందులువంటి

మందులు లోకములోనే వైద్యునిసద్దను లేవు. ఈమాట నేను లక్ష రూపాయలు పందెమువేసి చెప్పగలను. నాది శాస్త్రకట్టువైద్యమేగాని అల్లరచిల్లరవైద్యము కాదు. వైద్యము మాకుటుంబములో యిరవై తరములనుంచివున్నది. పైగా హస్తవిశేషము మాది మిక్కిలి మంచిది. డబ్బుతీసుకోనడము నాకు బొత్తిగా ఇష్టములేదు. ఔషధములే నాప్రజ్ఞలను తెలియజేయును.

వృత్తిలేక వైద్యముచేసెడి నిర్భాగ్యులగు వైద్యులవద్దకుబోక యింగ్లీషువైద్యుల పాలబడి అరఖులు గోధుమజావలు. త్రాగిచావక మామందులు కొని చిరకాలము జీవింపుడు.

మందులు

జ్వరమూషికమూర్జాలము

ఈమందు హిమవత్పర్వతముమీది ఓషధులు 100, మేరు పర్వతము మీది ధాతువులు 32, మానససరోవరములోని కలువ దుంపలు 56, ద్వైపాయనహ్రదములోని నాచు వీశెడు, బదరికావనము నందలి మూలికలు మొదలైన వస్తువులు పడినవి. ఈమందు తయారు చేయుటకే 30 సం॥రములు పట్టినది. దీనిని సేవించినవానికి సమస్తమైన రోగములు నశించును. పురాణజ్వరములు పూటకుపోవును. మణ్యపుజ్వరములు మాత్రతో హతమగును. ఈమందు వక్కసారి పుచ్చుకొన్న మనుష్యునకు మఱి యెన్నడు జ్వరము రాదు. ఇది తులము రు 93—6—0 పథ్యము సులభము. అన్నము, రొట్టె, సమస్తమైన కూరలు, సమస్తమైనపండ్లు, పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, మీగడ, నెయ్యి, నూనె, దుంపలు, ఉప్పు, పులుసు, కారము, పచ్చళ్ళు, పిండివంటలు, కందులు, శనగలు, మినుములు, పెసలు, మంచినీళ్ళు, వర్జింపవలయు. తక్కినవన్నియు పుచ్చుకొనవచ్చును.

అజీర్ణమహాజీమూతజంగ్మూనాహుతము. అగ్నిమాంద్యద్వాశ్చిక కుక్కుటము. వాతసర్పగారుడము.

ఈ మూడు మందులు అజీర్ణమునకు పెట్టినది పేరు. ఈ మందు పుచ్చుకొన్నవాని కడుపు వేసవికాలంలో పగలు రెండు జాములవేళ యిసుకతిప్ప యెర్రరాళ్ళు యేలాగున భగభగ కాలు చుండునో ఆలాగు కాలుచుండును. అనగా అజీర్ణమన్న మాట లేక యెప్పటికప్పుడు విపరీతమయిన ఆకలి అగుచుండును. ఇందులో వనమూలికలు, సువర్ణభస్మము రజతభస్మము, తామ్రభస్మము, వంగభస్మము, ఇత్తడిభస్మము, కంచుభస్మము, ఇనపభస్మము, కర్ర భస్మము విశేషముగా పడినవి. ఇవిగాక రెండువందలపదహారు దినుసులు పడినవి ఇవిగాక కస్తూరి, కుంకుమపువ్వు, పచ్చకర్పూరము, పునుగు, జవ్వాజి వీ శెడువీ శెడుపడినవి. ఇవిన్నిగాక మొసలిచేదుకట్టు పాముచేదుకట్టు, పాలపిట్టనెత్తిమీదజూలు, పేనుచేదుకట్టు, జెర్రిచేదు కట్టు నెమలియీకెలభస్మము, పెద్దపులి పాలుజున్ను, పిల్లిపాలుమీగడ సివంగిపాలవెన్న, సింహము గుండెకాయ ఏనుగుదంతచూర్ణముకలసినది. ఈయోగములు బసవరాజీయము, చింతామణి, బాహటము, చరకము శుశృతము మొదలయిన అచ్చుపడిన గ్రంథములలోను అవకతవక యింగ్లీషు గ్రంథములలోను నపడవు. ఇవిమా పెద్దలవల్లనేర్చుకొన్న సాంప్రదాయములు పైగా నలువది యేండ్లుసిద్ధులతోను, గోపాయిలతోను బైరాగులతోను గలసి నానారణ్యములు తిరిగి రసవాద శాస్త్రములు కృషిచేసి పరిశ్రమచేసినవి. ఈ మందులు తులము 1కి రు119—0—0రోగులమీద జాలిచేత యేమియులాభ మపేక్షింపక అసలు ఖరీదుకే యిచ్చుచున్నాము. ఒక్కొక్కమందు మణుగుమణుగుకంటె యెక్కువ చేయలేదు. ఇదివరకే వకమందులో యేడువీశలన్నరఖర్చు అయిపోయినది దరఖాస్తులు ముందుగా పంపకపోతే చిన్నమెత్తు

అయినా దొరకదు. కాబట్టి త్వరగా దరఖాస్తులు బంపవలెను. యజ్ఞములయందలి హవిర్భాగములు మితిమీరి తినుటచేత పూర్వము దేవేంద్రుని కొకసారి గాఢమైన అజీర్ణము పట్టగా అశ్వినీదేవతలు యీమందునే చేసియిచ్చినారు. ఈ సంగతి కుబేరపురాణమందును యమపురాణమందును వున్నది.

—౯—

అకాలమరణ జంబాలమార్తాండము.

ఈమందు పుచ్చుకొన్నవారు నూటయేబదియేండ్లు బ్రతుకుదురు. అలాగున బ్రతికీయున్నవారు యిప్పుడనేకమందియున్నారు. ఇందులో నల్లినెత్తురుసేరు, దోమమూత్రము కుంచెడు, పేనుగుండెకాయలు పదలం, సంజీవివేళ్లు మొత్తెడు తలుపుకిరకిరవీశెడు, హంసచేదుకట్లు పది పడినవి. ఇదిపుచ్చుకున్నవారికి చావులేదు. ఇది తులం రు 610 లు.

—౧౦—

భేదీమహావజ్రకవాటము.

దీనికే విరేచనమరమేకు అని రెండవపేరు కలదు. ఇది సేవించినవారికి వాతమువల్లగాని పిత్తమువల్లగాని శ్లేష్మమువల్లగాని యీమూడింటిసమ్మేళనమువల్లగాని మరియేకారణమువల్లగానిఅతిసారమువల్లగాని గ్రహణివల్లగాని అజీర్ణమువల్లగాని వెళ్ళుచున్న విరేచనములు తక్షణము కట్టును. ఈమందు కలరాకు పెట్టినది పేరు. యీ సంవత్సరము యీ మందువల్ల కలరాజాడ్యము తగిలినవారు 9500 మంది బతికినారు. ఇది మాత్ర రూపాయి. ఈ మందెవరికైన పనిచేయని పక్షమున మామందు మాకు సంపూర్ణముగా పంపించివేసిన యెడల వారిసొమ్ము వారికి పంపివేయుదుము. ఇటువంటిమందు లోకమునం దెక్కడను లేకపోవుటచేత ప్రతిదినము లక్షలకొలది బుడ్లు

యితర దేశములవారు మావద్ద కొనుక్కొని పోవుచున్నారు. దీని వాసన తగిలినచోట విరేచన జబ్బుండదు. ఇక లోకములో విరేచనములవల్ల చావు లుండవు.

—*—

స క ల జా డ్య ఘా స మ హి మ ము

ఈమందు దున్నపోతు గడ్డిని దినివేయునట్లు సకలరోగములు హరించును. ఈమందువల్ల తలనొప్పులు, నడుమునొప్పులు; కీళ్ళనొప్పులు,పళ్ళనొప్పులు,వళ్ళునొప్పులు, కళ్ళుమంటలు,ఒళ్లుమంటలు, అరచేతులమంటలు,అరకాళ్ళుమంటలు విషజ్వరములు,సన్నిపాతజ్వరములు, మన్యపుజ్వరములు, పురాణజ్వరములు, గజ్జి, గడ్డకురుపులు, రాచపుండ్లు, పుత్తికూరుదలు, చెవిలోకురుపులు, గోరుచుట్టు, కణుపుజెప్పలు,పంగలుమూదలు,ముడమశూలలు,పోడుపుడుకాయలు,కంతులు బొడిపెలు, అజీర్ణములు, ఆమ్లములు, పిత్తములు, వాతములు, శ్లేష్మములు, ద్వంద్వములు, అతిసారములు,కలరా, మశూచి, బొబ్బలమ్మ, ఆటలమ్మ, పొంగు, శ్వాస, కాస, క్షయ, రక్తక్షీణత, పాండురోగము, మధుమేహము, శిలామేహము, బొల్లి, కుష్టు, పుప్పిగోళ్ళు, పుప్పిపన్నులు, జలోదరము, లంబోదరము, మూగ, చెవుడు, గుడ్డి, కుంటి నత్తి,పిచ్చి,వెఱ్ఱి, మొదలయిన సమస్తరోగములు నశించును. ఇది పుచ్చుకున్నవారికి అకాలమున నెరసిన తలవెండ్రుకలు నల్లబడును. సంతానము లేనివారి కేడాదిలో బిడ్డలు పుట్టుదురు. అన్నహితవు లేనివారు పూటకు కుంచెడు బియ్యపన్నము తిందురు. ఈమందు వెల తు॥ రు 25 లు. నాలుగు తులములు వక్కసారిగా పుచ్చుకొన్నవారికి నూటికి రు 1-9-0 లు కమీషను యివ్వబడును. ఈపై మందులు అమ్ముటకు మాకు ఏజెంట్లు కావలెను. వారు నమ్మకమైనవారు

కావలెను. ముసలివాం డ్రక్కర లేదు. పడుచువారు దరఖాస్తులు పంపకూడదు. భాగ్యవంతులతో మాకు పనిలేదు. బీదవారి నెప్పుడు మే మేజేంట్లుగా నేర్పరచము. ప్రతి యేజెంటు మావద్ద రు 200 లు ధరావతు ఉంచవలయును. ఈ సొమ్మునకు మేము నెల 1 కి నూటికి రు 0-2-2 లు వడ్డి యిత్తుము. ఏజంటు తమకు జీతమే కావలెనో కమీషను కావలెనో తెలియజేయవలయును. దరఖాస్తులు అర్ధణాబిళ్ళ పెట్టి పంపవలయును. అట్లు చేయని దరఖాస్తులు మంజూరు చేయబడవు. ఇదివర కన్ని గ్రామములలో యేజెంట్లు కుదిరినారు గావున ఈ క్రింది గ్రామములలో మాత్రమే యేజెంట్లు కావలెను. పెంటపాడు, పెనుమదం, పేకేరు, పాచిపెంట, పెద్దాడ, పుట్టకుండ, చంపర, నేలపోగులు, పాతిళ్ళ మెరక, తోలేరు, తోకలపూడి, గుమ్మంపాడు, బల్లిపాడు, దగ్గులూరు, కంతేరు, గంగ్రేడు, మూలస్థానం, అలమండ, మండపేట, బిక్కవోలు ద్వారపూడి దొంగలగన్నవరం, వంకాయలపాడు, నూతులపాడు, చింతలూరు భీమడోలు, గజ్జరం, వెమురుపాక, ఆచంట, తాటిపర్రు, తాటిపాక, ఆటపాక, మేడపాడు, తాపేశ్వరం, భగ్గేశ్వరం, మందపల్లి, పెనుమంట్ర.

మామందు లెంతపని చేయునో ఈ క్రింది పెద్దమనుష్యు లిచ్చిన యోగ్యతాపత్రికలు (సర్టిఫికేటు) చూచినవారికి తెలియును. ఈసర్టిఫికేట్లు మావద్ద పదివేలున్నవి కాని స్థలము చాలక మూడు నాలుగు మాత్రమే ప్రకటించుచున్నాము.

యోగ్యతాపత్రికలు

అయ్యా! మీజ్వరమాత్రిక మార్గాలముపంటి మంచుభూలోకములో లేదు. ఇది మూడుమోతాదు లియ్యగానే మా నాయనమ్మగారికి యెనిమిది సంవత్సరములనుంచి ఉన్న పురాణజ్వరము మూడు

పూటలలో కట్టినది. మీ మందులు కల్పవృక్షములని చెప్ప వచ్చును. తెనుగుదేశములవారి యదృష్టమువల్ల మీరీలోకమున నవతరించిరని మాయభిప్రాయము. మీమందున్నచోట్ల లోకములో జ్వరమువల్ల చావులుండవు. ఇటువంటి మందు లనేకముచేసి మీరిం కను లోకోపకారము చేయుదురుగాక. ఇట్లు విన్నవించు మీ మిత్రుడు శ్రీ వెట్టిపాలెం బాల సూర్యనరసింహ వెంకటపిచ్చేశ్వర రావు బహద్దూరు, గడ్డపాలెం జమీందారు.

—*—

అయ్యా మీరు పంపిన అజీర్ణవృశ్చికకుక్కుటము అద్భుత మైన పనిచేసినది. మా మేనమామగారి పినతండ్రి అల్లుడు తమ్ముడు కొడుకు అజీర్ణమువల్ల చిరకాలము బాధపడి ఒక్క మెతుకైన తిన లేక చిక్కి శల్యమై కండ్లలో ప్రాణములు పెట్టికొని యున్నవాడు మీమందు మూడుపూటలు సేవించగానే యెక్కడలేని ఆకలి పుట్టు కొనివచ్చి యిప్పుడు పూటకు మూడుశేర్లబియ్యపుఅన్నము తినుచు న్నాడు. పూటకు అడ్డెడు పెరుగు త్రాగుచున్నాడు. ఆతని చాతి యిప్పుడు 114 అంగుళము లున్నది. అదివరకు పూచికపుల్ల యెత్త లేనివాడు యీమధ్య గడ్డపారవంచి మూడుముక్కలు చేసినాడు. అజీర్ణముగలవారందరు యీమందు పుచ్చుకొనవలయును. ఏమి మూలికలుకలసినవో కాని యీమందువంటిమందు లోకములో లేదు ఇది స్వర్గములోనుంచివచ్చిన దేమో యని తలంచుచున్నాము. ఇది భూలోక పారిజాతము. రోగుల పాలిటి కామధేనువు. ఇట్టిమందులు తయారుచేయుటకు మీకు దేవుడు ఆయురారోగ్య బుద్ధిసంపద లిచ్చు గాక.

ఇట్లు తమ విధేయుడు, తంటికొండ పుల్లేశ్వరరావు.

—*—

స్వామీ, మీరు దయతో నంపిన అకాలమరణ జంబాలపు చండ మార్తాండము అందుకొని అమందానంద కందళిత హృదయార విందుడనైతిని. యీమందునే ననేకమందికిచ్చితిని. పుచ్చుకున్నవారందరు నూటయేబది యేండ్లు బ్రతుకుచున్నారు. మీరింకను కృషి చేసినట్లయిన మనుష్యులు వెయ్యేళ్ళు బ్రతుకునట్లు చేయగలరు. మీరు అశ్వనీ దేవతల యవతారముగాని మనుషులుగారు. ఇట్లు మీ ప్రియశిష్యుడు, వంకపాటి వెంకటకన్నయ్య. పైడిముక్కల గ్రామం మకాం

—*—

భిషగ్మణీ, మీరు సంపిన విరేచన మరమేకను పేరుగల భేదీ వజ్రకవాట మందినది. ఈ మందుతో విరేచనము కట్టుట యటుండగా మేము ఒక కుండనిండ నీళ్ళుపోసి దానికి చిల్లిపొడిచి మీ మాత్ర కుండలో వేయగా చిల్లివెంబడి నీరుకారుట కట్టిపోయినది ఇక విరేచనములు కట్టుట యేమి యాశ్చర్యము. మీరు పెట్టిన ఖరీదుకంటె నూరురెట్లెక్కువ ఖరీదు యిచ్చినను మీఋణము తీరదు. ఇట్లు మీ యాప్తమిత్రుడు కూచిపూడి కోనప్పగారి సిద్ధేశ్వరరావు. దుమ్ముగూడెం.

—*—

[8]

ధర్మసందేహములు

జ్యోతిశ్శాస్త్రములో గట్టికృషి జేసి దైవజ్ఞచక్రవర్తులనిబిరుదు పొందిన గొప్పసిద్ధాంతియొకరు కావలెను. మేమడిగినప్రశ్నలకాయన సరిగాఁ బ్రత్యుత్తరములు చెప్పినపక్షమున, ఆయన కనూనములైన బహుమానములు మేమిచ్చెదము. సాధారణజ్యోతిష్కుడు పనికిరాడు. అనేకరాజులవద్ద బహుమానములు బిరుదులు పొందినవారే కావలయును. వారు చెప్పవలసిన ప్రశ్నలివి. ఈవఱకు మేజస్ట్రీటుపని జేసి పించనుపుచ్చుకొని ఒకానొక గ్రామములోనున్న బెంచి మేజస్ట్రీటు కోర్టుకు ప్రస్తుతము ప్రసిడెంటుగానుండి తప్పుచేసిన వారికి జరిమానలు మొదలగు దండనలు విధించుచున్న మ॥ రా॥ శ్రీ నిర్లక్ష్యం నీలయ్యగారి బక్కచిక్కిన యావు చుట్టుప్రక్కలనున్న కొంపలలోదూరి బియ్యము, పిండి, పప్పులు. కూరలు అప్పుడప్పుడు ఎండుగడ్డియని భ్రమించి ముసలివాండ్ర తెల్లగడ్డములు తినుట యెప్పటినుండి మానివేయును? ఎప్పటినుండి శ్రీనీలయ్యగారు తమయావును యింటిలోఁ గట్టివేసి కాని పసులకాపరిచేతఁగాపించి కాని లోకోపకారము చేయుదురు? 2 గొప్పపదవిలోనున్న హిందువులు తమపయి యధికారుల వద్దకుఁ బోయి తమకు గిట్టనివారిమీఁద లేనిపోని పన్నుగడలుపన్ని అబద్ధపు కొండెములు చెప్పుట యెప్పటినుండి మానుదురు? 3 మ్యునిసిపల్ చైర్మనులు ఎలెక్షనులలోఁ దమకిష్టమైన మనుష్యులతరపునఁ బనిచేయుట (అనగా రహస్యముగా ఓటర్లను ఇండ్లకుపిలిపించి చెప్పియు వారియిండ్లకుబోయి బ్రతిమాలియు) పక్షపాతముగా నడచుట ఎప్పటినుండి మానుదురు? 4 సంఘసంస్కారులమని చెప్పుకొనువారు తాము వ్రాసినవ్రాతలకు తాముచేసిన యుపన్యాసములకుఁ గేవలము విరుద్ధముగా నడచుకొనుట మనదేశములో నెప్పటినుండి యాగిపోవును?

అనగా అతిబాల్యవివాహములుకూడదన్నవారు, ఎనిమిదేండ్లపిల్లలకే వివాహములుచేయుట, వితంతువివాహములు మంచివన్నవారు సమయము వచ్చినప్పుడువివాహములాడకపోవుట మొదలగునవి యెప్పటినుండి మానుదురు? 5 రాతిముక్కలమనుష్యులు, మట్టిభక్షణచేసి జీవించునట్టి మహారోగులు, ఒక్కపట్టణములోనే యున్నారా, లేక పల్లెటూళ్ళలోగూడ నున్నారా! రాతిముక్కల మనుష్యులనగా వీధులలో నెన్నిదుర్వాసనలు వేయుచున్నను వాటివలన నెంతమాత్రము బాధపడక, అవియెల్లను సువాసనలుగానేభావించిబ్రతుకునట్టి మనుష్యులు. మట్టిభక్షించు మహారోగులనగా ముక్కులోనుండి నోటిలోనుండి వీధులలోనిదుమ్ము కడుపులోనికి విశేషముగా బోవుచున్నను లక్ష్యములేక దానిని జీర్ణముచేసికొని యెప్పటియట్లే తిరిగెడు మనుష్యులు. 6 మ్యునిసిపల్ కమీషనర్లలో నైకమత్యమెప్పటినుండి గలుగును? 7 మ్యునిసిపల్ కమీషనర్లు కాందలంచిన వారిలోఁగొందఱు చెప్పెడు బెదురుమాటలకు,అబద్ధములకు జంకకుండనుండునట్లు, ఓటర్లకు తెలివితేట లెప్పటినుండి వచ్చును? 8 సొమ్ము రాబడివిశేషముగాగలప్లీడర్లుపార్టీల కాగితములనేల వేసికొట్టివారినితిట్టి గౌరవముచేయక కాగితముల చదువక కేసులుపాడుచేయుట ఎప్పటినుండి మానుదురు? 9 డబ్బురానిప్లీడర్లు పార్టీలను దేవురించిఫీజుపుచ్చుకోకుండ అరువుకు పనిచేయుట యెప్పటినుండి వదులుకొందురు? 10 ఆసుపత్రులలో కొఱంత లేకుండ అన్నిమందులు నెప్పటినుండి యుండును?

కొన్ని పట్టణములలో దొరకునట్టి శ్రేష్ఠమైన వస్తువులు

1. ప్రాణముతోనున్న ప్రశస్తమైన గోవువరుగు:-లోకములో మనుష్యులు ఉస్తివరుగు, బుడమవరుగు, వంగవరుగు, మొదలయిన వాటినే ఎఱుఁగుదురుగాని గోవువరుగు నిదివరకెప్పుడు నెఱుఁగరు. ఇది పట్టణములలో బ్రతివీధిని దొరకును. మేతబెట్టక యొండగట్టిన యావులకు గోవువరుగని రెండవపేరు. ఈ వరుగు ప్రతిగృహములో నుండతగినది ఎందుకనగాపుష్కరసమయమునందుఁబితృకార్యములందు లక్షవత్తుల నోములందు నిది బ్రాహ్మణులకు దానమిచ్చుటకుఁ బనికి వచ్చును. ఇది మణుగుఁ ఎనిమిదిరూపాయలు అనగా, ఒక్కొక్క యావు రెండుమూడు వీశెల బరువుకన్న నెక్కువగా నుండదు గనుక మిక్కిలి చవుకగా దొరుకును. కొనినవారు దీనికి మేఁత పెట్టనక్కఱ లేదు గనుక వారికి దండుగ యుండదు. ఈ యావులు మిక్కిలిసాధువులు, పీటిదూడలు బ్రతుకవుగనుక యిచ్చినపాలన్నియు యజమానుడు త్రాగవచ్చును. ఓపిక లేక పోవుటచేత, పోటులు తన్నులు లేవు. మెడకు నులకత్రాడుగట్టి తీసుకుపోయినను నది హరాముచేయకుండ వెంటవచ్చును. ఇచ్చినప్పుడు గిద్దెడో, అరసోలడో పాలు పిదుకుకొని యింటిలో మేఁతబెట్టక వీధులలో వదలివేసినపక్షమున నివి పులివిస్తరాకులు, ఎండుత్రాటిమూకులు మొదలగునవి తిని వాటి పొట్ట యవి పోసికొనును. మేతవిషయములో యజమానికేవిధమైన కష్టము నీయవు. ప్రతిజంతువు మఱియొకరిమీద భారము నిలుపక తనపొట్ట తానే పాటుపడి పోసికోవలెనన్న యాత్మగౌరవ సిద్ధాంతము ఈ పశువులకుఁ బాగుగ దెలియును. అదియునుగాక కొంపలలోదూరిదొంగ తిండితినుట యివి బాగుగ నెఱుగును. వీధిదారిని గొట్టినప్పుడు దొడ్డి

దారిని దొడ్డిదారిని గొట్టినపుడు వీధినాగినిబోవుటలో వీటికిగలనేర్పు చెప్పనలవిగాదు. వీటికిగల పట్టుదల పూనిక మిక్కిలి మెచ్చతగినవి. పాలిచ్చినను యివ్వకపోయినను గోమయమునకు ఆడవాళ్ళు పొరుగింటికి పోనక్కఱలేదు. వస్తువు నోటికి దొరికినప్పుడు వేయికఱ్ఱలుపుచ్చుకొని కొట్టినను తినివెళ్లునుగాని పారవేసిపోవు. ప్రజలేమనుకొన్నమనకేమియను వేదాంతదీక్షమాత్రము యజమానులకుండవలయును. ఈ యావులను కొనదలచినవారు మాకు దరఖాస్తులను బంపవలయును. కొనుటకు వచ్చువారు ఈయావులను తేవదీయుటకిద్దఱు మనుష్యులను గూడ తీసుకరావలెను. బేరము ఫయిసలయిన తరువాత తేవదీయునప్పుడే యొకవేళ ప్రాణముపోయినపక్షమున, ఆ దండుగ కొనుకొన్నవారే పెట్టుకొనవలయునుగాని, అమ్మినవారికి లేదు. ఇంటికి తీసికొని వెళ్ళగానే వీటికి గడ్డి పెట్టగూడదు. ఏలయన చిఱకాలమునుండి గడ్డియలవాటులేదు గనుక గడ్డి తగలగానే దానికి రోగమువచ్చును అందుచేత మెల్లమెల్లగా నలవాటుచేయవలయును తక్కినసంగతులు స్వయముగావచ్చి మమ్ము కనుగొనవచ్చును. విష్ణుపురము, గోవునరుగు కంపెనీ ప్రసిడెంటు, వెంకటజగన్నాథ లక్ష్మీసుందర రాఘవేంద్రరావు మాలవీథి, 711, నెంబరుయిల్లు అని వ్రాయవలెను.

2 మొదటిరకముదోమలు :- ఇది పల్లెటూళ్ళ కెగుమతిజేయుటకై ఈయూరిలో బెంచుచున్నాము. చిల్లరగాగొనువారికి పుట్టి రు 5 ల కిచ్చెదము టోకుగాను వారికి పుట్టి రు 4 లు. ముందుగా జట్టీకిపుచ్చుకొన్నవారికి పుట్టి రు 3 లు. డిశంబరు15 తేదిలోపున దరఖాస్తులు పంపినవారికి రు 2-8-0. ఇవి మిక్కిలి యుపయోగమైనవి. రాత్రులయందేగాక పట్టపగలుకూడ మీఁదబడి సంగీతము పాడుచుండును. మూడుమాట్లు అన్నముతిని యేపనిలేక విధి విరామము లేకుండ నిద్రపోవునట్టివారికి నిద్రఆపుటకు, ఈ దోమలు శ్రేష్టమైన

విరుగుడు. పరీక్షలకు చదువుకొను ప్రతివిద్యార్థివద్ద, ఈ దోమలు, అరడజనుండి తీరవలయును. ఇవిచదువుకొనునపుడు నిద్రరానియ్యవు. ఇవియున్న పక్షమున నిద్రవచ్చునను భయముచేత పొడుములవాటు చేసికొన నక్కఱలేదు. బీటుతిరుగక నిద్రపోయె పోలీసు భటులు వీటిని కొనుక్కొన్న పక్షమున వారికే ప్రమాదమునురాదు. ప్రొద్దెక్కి మెలకువవచ్చెడు వారందఱు వీటిని తప్పక పెంచుకొన వలయును. కార్తీకమాసములో తెల్లవారగట్ల స్నానమునకు వెళ్ళ దలంచిన వితంతువులు తమ్ము వేరేలేపెడి వారక్కఱలేకుండ వీటిని పెంచుకొనవచ్చును. డజనుల లెక్కనుపుచ్చుకొన్నపక్షమున డజను అణాకిచ్చెదము. పాలకొల్లుదోమలు కొల్లేటిదోమలు వీటి ముందర దిగదుడుపునకైన పనికిరావు. ఈసంగతి వట్టిమాటగాదు. అనేకపర్యాయములు మేము తనిఖీజేసి చూచినారము. కావలసినవారి క్రింద సంతకముచేసినవారికి దరఖాస్తులు పంపవలెను. రెండుడజను లేకముగా పుచ్చుకొనువారికి మూడింటిని కమీషనుగా నిత్తుము.

దోమా అండుకో, మురికికుండులపేథి,

రుద్రపురము.

—*—

కలియుగయక్షప్రశ్నలు

ఒకగ్రామమందు శివాలయములో అర్చకుఁడైన శివల చిక్కయ్య, ఆగ్రామములోనే విష్ణుదేవాలయములో అర్చకుఁడైన నంబి నారాయణప్పను గలుసుకొని యిట్లనియె:—చిరకాలమునుండి నాకు గొన్ని శంకలు కలవు. నాశంకలు మీరు నిర్వృత్తిచేయవలయును గాని నేను స్వకీయముగా నిర్వృత్తి చేసికొనజాలకున్నాను. అనగానే నంబి నారాయణప్ప అవియేవో చెప్పుమని యడుగగా వారిద్దఱికి, ఈక్రింది సంభాషణ జరిగెను.

చిక్కయ్య—మనుష్యులలో పశువులు, పశువులలో మనుష్యులు ఉన్నారని విన్నాను ఆమాట యెట్లునిజమగును?

నంబి—నిజమే! తమకు న్యాయముగా రావలసినసొమ్ము పుచ్చుకొని సంతుష్టిపొందక, అడ్డమైనచోట్ల ప్రవేశించి మోసము చేసి దొంగగడ్డి తినునట్టి మనుష్యులు పశువులలోనే జమ వారు మనుష్యులలో పశువులు. తనదారిని తానుబోయి పోటు తన్ను లేక యెవరి చేలోనుబడక తిన్నగా నింటికివచ్చునట్టి పశువు మనుష్యునితో సమానము. అట్టివి పశువులలో మనుష్యులు.

చిక్కయ్య—సరే! మగవాళ్ళలో ఆడవాళ్ళు, ఆడవాళ్ళలో మగవాళ్ళు ఉన్నారని విన్నాము. ఇదియెట్లు?

నంబి—ఉన్నారు. ఆడవాళ్ళు చెప్పిన కొండెములువిని, అవియేనమ్మి చీటికిమాటికి, ఇతరులతో కయ్యాలాడుటకు వచ్చునట్టి మగవాళ్ళు ఆడవాళ్ళే. తక్కినఆడవాళ్ళవలె వ్యర్థప్రసంగములు చేయక కలహములాడక కొండెములు చెప్పక చదువుకొని సత్కాలక్షేపము చేయునట్టి ఆడవాళ్ళు మగవాళ్ళే.

చిక్కయ్య—బ్రాహ్మణులలో మాలవాళ్ళు, మాలవాళ్ళలో బ్రాహ్మణులు ఉన్నారట. ఇది యెంతవరకు నిజము.

నంబి—దయ, సత్యము, శుచి, మొదలగునవి బ్రాహ్మణలక్షణములు. ఇవిలేక మెడలో జందెముమాత్రము వేసికొని యెల్లప్పుడు బూతులేమాటలాడుచు, అబద్ధమునకు, అప్రమాణమునకు వెరువక తిరుగు బ్రాహ్మణుడు మాలవాడు. జాతికి మాలవాడైనను దయా సత్యశౌచలములుగలిగి పాపభీతి దైవభీతి కలిగి వర్తించు మాలవాడు బ్రాహ్మణుడు.

చిక్కయ్య-మనుష్యులలో కుక్కలు, కుక్కలలో మనుష్యులు గలరట. ఇందేమైన సత్యమున్నదా?

నంబి—సత్యమున్నది. ఒకని కేదేనిలాభము కలుగుచున్నపుడు పదిమందిపోయి, ఆపనినేమొదలుపెట్టి పోటీలకుదిగి ఒకరితో నొకరు వివాదముపడి, అందఱు చెడిపోవునట్లు ప్రవర్తించినమనుష్యులు కుక్కలు. ఒకపులివిస్తరాకు వీధిలో నెవరైన వేయగానే పదికుక్కలు పడి ఒక్కదానినోటకిదొరకనీయక మీదపడి కరచుకొనిపోవును. ఎవరైన కొంచెముపకారము చేసినప్పుడు, ఆయుపకారము మరువక చచ్చిపోవువరకు విశ్వాసముకలిగియున్న మనుష్యులు మనుష్యులలో విశ్వాసముగల కుక్కలు.

చిక్కయ్య—మగవానికి మగడెవ్వడు?

నంబి — చెప్పినట్లు వినని భార్య.

చిక్కయ్య—ఆడదానికి పెండ్లామెవ్వరు?

నంబి — అప్రయోజకుడైన మగడు.

చిక్కయ్య—మనయూరిలోనున్న కామశాస్త్రి మూడేండ్లక్రిందట భార్యమీదకోపగించి జందెముత్రెంపుకొని సన్యాసముపుచ్చుకొని మరల సంవత్సరమైనతరువాత ఇంటికివచ్చి జందెము వేసికొనెను.

ఈయనను సన్యాసియనవలెనా ? గృహస్థుఁడనవలెనా ? ఈయన చని పోయినప్పుడు పాతిపెట్టవలెనా ? దహనముచేయవలెనా ?

నంబి — ఈయన సన్యాసిగాఁడు, గృహస్థుఁడుగాఁడు. సన్యాసి గృహస్థుఁడగును. ఈయనను చచ్చినతరువాత తగలపెట్టుటకంటె బ్రతికియుండగానే నలుగురు మొగముతగులబెట్టి యావలకుబంపి వేసిన బాగుండును.

చిక్కయ్య — పదేండ్లక్రిందట భీమన్న శాస్త్రి కాశీవెళ్ళి యెంత కాలమునకు తిరిగిరానందున చచ్చిపోయినాడనుకొని యతనిబంధువులు వారికి కర్మ జేసి భార్యకుతలగొరిగించిరి. గొరిగించినకొన్ని మాసములకు భీమన్న శాస్త్రి యింటికివచ్చెను. అతనిని మొదట పితురు దేవతలలో జేరిచి వానికి పిండములు తిలతర్పణములుయిచ్చినారుగనుక, అతనిని మనమిప్పుడు ప్రేతయనవలెనా? పితురు దేవతయనవలెనా? లేక భీమన్న శాస్త్రి యనవలెనా? ఆయనభార్యను ముండయనవలెనా? ముత్తయి దువు అనవలెనా ?

నంబి — అతనిని ప్రేతయనకూడదు. నిజస్థితిని దెలిసికొనకుండ శ్రాద్ధకర్మ జేసినందుకాయన చుట్టములనే ప్రేతలనవలెను. భర్తవచ్చి నందువల్ల ఆయనభార్యజుట్టు పెంచుకొనకతప్పదు గనుక జుట్టు ఎదుగువరకు ముండ. ఎదిగినతరువాత ముత్తయిదువు.

—౯—

సాధారణసంవత్సరము; పంచాంగశ్రవణము

సంవత్సరాదినాడు అల్లిబిల్లి పట్టణమునందు చేపలబజారులో ఈక్రిందివిధముగఁ పంచాంగశ్రవణము చేయఁబడెను.

సంవత్సరఫలము.— సాధారణ సంవత్సరములో పంటలు సాధారణముగనుండును. ఈసంవత్సరము చంద్రగ్రహణములు పున్నమినాడు రాత్రియందును, సూర్యగ్రహణములు అమావాస్యనాడు పగటియందును బట్టుచుండును. చాకలివాండ్రు పట్టణములో నప్పుడప్పుడు బట్టలు తెచ్చుచుందురు. కుట్టుపనివాండ్రును, కంసాలులును సౌమ్యసంవత్సరములో యిచ్చిన బట్టలును నగలును కొన్నిటిని యీ సంవత్సరము మాఘమాసములోగా పుతయారుచేసి యిత్తురు. ఆషాఢ మాసమందును పుష్యమాసమందును వివాహాది శుభకార్యములకు లగ్నము లుండవు. భాగ్యవంతులు తమ ధనమునకు వడ్డీ తిన్నగా రాలేదని విచారింతురు. అందులో కొందఱు కడుపునిండభుజయింపరు. పేదవారు నూటికి రెండురూపాయలపైన వడ్డీకి సొమ్ము తెచ్చుకొని హాయిగ తినుచుందురు. కొన్ని పట్టణముల వీధులలో రాత్రులయందు, ఎప్పటివలెనే పందులు తిరుగుచుండును. చంటిబిడ్డలు కొందఱు బాలపాపచిన్నెలువచ్చి చచ్చిపోదురు. గర్భిణీస్త్రీలలో కొందఱికి కాడశిశువులు కొందఱికి మగశిశువులు కలుగుదురు. గోదావరీ కృష్ణా మొదలగు నదులలో, అప్పుడప్పుడు కొన్ని పడవలు మునుగును. గోదావరియొడ్డున క్రొత్తగాబోసిన గట్టుమీందనుండి కాలుజారి, అప్పుడప్పుడు కొందఱు పడుచుందురు, అమ్మకముపాలలో, ఈసంవత్సరము నీ ళ్ళెక్కువగ కలియుచుండును. రాజమహేంద్రవరములో భోగమువాండ్రను లౌక్యులకంటె వైదికులు, వర్తకులు, ఎక్కువ ఆదరింతురు. బీటుకనిస్టేబులకు నిద్రయెక్కువవచ్చును. నాజర్లు వారంటు

గుమస్తాలు మొదలగువారిపని కొంచెము బాగుండును. చె॥ వెం॥ గోపాలరావుగారును, భద్రయ్యగారు యీసంవత్సరముగూడ కొన్ని వార్తాపత్రికలను ముందు దెప్పించుకొని పత్రికాధిపతులు డబ్బడిగి నప్పుడు, అక్కర లేదని వ్రాయుచుందురు. వేసవికాలములో గొందఱికి తేళ్లుకుట్టును. చైత్రవైశాఖమాసములలో కొన్ని గ్రామములలో ఇండ్లుకాలిపోవును. మునిసిపల్ ఓటర్ల తెలివితేటలు సౌమ్యసంవత్సరములో నున్నట్లె యుండును. ఏ మంచిపనికైనను చందాలువేయు వారు తమ యిండ్లచుట్టు వసూలుచేయు నౌకర్లను వేయిమార్లు త్రిప్పించుకొనుట వెనుకటి సంవత్సరముకంటె అధికముగానుండును. విదేశ వస్తువులందెచ్చి స్వదేశవస్తువులేయని దొంగపేరుబెట్టి యమ్ముట గత నాలుగు సంవత్సరములలో నున్నట్లెయుండును. గొప్ప యుద్యోగస్తులు సిరస్తదార్లు చెప్పినట్లు వినుట ప్రభవసంవత్సరము మొదలుకొని యెట్లున్నదో యిప్పుడు నట్లెయుండును. పేదవాళ్ళకుం ఎక్కువ ఆకలియు భాగ్యవంతులకు అజీర్ణరోగము తరుచుగా బుట్టును. ఇంగ్లీషు చదువుకొన్నవారిలోం గొందఱికి రాత్రులయందు బ్రాంది మీద అప్పుడప్పుడు బ్రాంతిపారుచుండును. త్రాగుబోతులకు జారులకు సిగ్గుబిడియములు నూటికి ముప్పదిపాళ్లు తగ్గిపోవును. రైలుబండ్లలో స్థలముచాలక మనుష్యులు బాధపడి దెబ్బలాడుకొనుట సౌమ్యసంవత్సరముకంటె కొంచె మెక్కువగును. రహదారీపడవల గుమాస్తాలు మొదట తక్కువ రేటు కెక్కించుకొని నట్టేటిలోనికి తీసికొని వెళ్ళిన తరువాత రేటెక్కువడుగుట నిరుటికంటె నొకపాలు తగ్గును. మొత్తము మీద యీసంవత్సరమందు పోయినవాళ్ళుపోగా మిగిలినవాళ్లు ఆయువున్నంతకాలము బ్రతుకుదురు.

సాధారణ సంవత్సరములో వృద్ధి క్షయములు

	పాళ్ళు.
కాఫీకొట్లవృద్ధి	35
సోడాయంత్రములవృద్ధి	40
కిరసనాయలులో నీళ్ళు	10
నేతిలోకంపు	50
బియ్యములో రాళ్ళు	10
మనుష్యులలో నైకమత్యము	2
దానినాశనము	98
ధర్మోపన్యాసములు	70
దానిప్రకారమాచరణము	1½
దొంగవైద్యుల వృద్ధి	20
నాశనం	4
వైదికి నియోగి కక్షలువృద్ధి, కచ్చేరీలలో	50
బ్రాహ్మణ శూద్ర వివక్షత ఎలెక్షనులో	70
లంచములు	70
దానినాశనము	3
మ్యూనిసిపలు న్యూసెన్సు కేసులు వృద్ధి	80
వాటిలో శిక్షలు	95
విడుదలలు	5
అత్తాకోడళ్ళవైరం	56
దానినాశనం	6
యానాంప్రయాణములు	15
దానినాశనం	1
వడ్డీఆశ	79

	పాళ్లు
అప్పు లెగబెట్టుట	45
వైద్యులసొమ్మెగ పెట్టుట	25
ఆకాశరామన్న అర్జీలు	50
అధికారులు వాటినినమ్ముట	25
కొండెములు చెప్పువారివృద్ధి	10
వారికాదరణము	7
వారికి చెప్పుదెబ్బలు	6
ఏజంట్లవృద్ధి	33
దానినాశనము	3
ఈనాందారులు శిస్తులడిగినప్పుడు రైతులు పండలేదని యేడ్చుట	70
దానినాశనము	1½
అప్పులుతెచ్చి వర్తకులు భార్యలకు నగలుచేయించుట	80
అప్పు లెగబెట్టుటకు ఆస్తులు భార్యలపేర వ్రాయించుట	60
సన్యాసులు కొడుకులకాస్తులిచ్చుట	75
దానినాశనము	0
వంటబ్రాహ్మణుల తెగసీలుగు	41
స్వాములవార్లకు ఆంక్షపత్రికలవల్ల వచ్చు ధనవృద్ధి	74
దొంగసన్యాసివృద్ధి	37
ప్లీడరుగుమస్తాలకు కర్చులెక్కువవ్రాయుగుణం	59
ఫోర్జరీలు	12
అవేకోనసీమలో	20
పెండ్లికొడుకుల ధరలవృద్ధి	91
పెండ్లికూతుల ధరలవృద్ధి	24

చామాలమ్మ దర్బారు

రాజమహేంద్రవరము గ్రామదేవతయైన చామాలమ్మ తీర్థము సంవత్సరాది పండగ దినములలో మిక్కిలి గొప్పగ జరుగును. ఆనాడు తెగిన కోళ్ళయొక్క మేఁకలయొక్క సంఖ్యకు మితిలేదు. తన తీర్థపు మహోత్సవము జూచుటకు చామాలమ్మ తన చెలికత్తెలైన వానపల్లి పళ్లాలమ్మను రామదురు మామిళ్ళమ్మను విజ్జేశ్వరపు సాగులమ్మను, అయినవల్లి నూకాలమ్మను. ఉత్తరములు వ్రాసి పిలిపించినది. పిలిపించి పండుగనాడు వారికి కడుపునిండ రక్తమాంసములతో విందులు చేసెను. ఆ రాత్రి వారైదుగురు నీక్రిందివిధమున ముచ్చటించుకొనిరి. ఈసంభాషణ పోతరాజుజరిగినదిజరిగినట్లుగా వ్రాసి పంపెను. పోతరాజు అమ్మవారు తమ్మునన్నమాట యందఱెఱిగిన దే ఆయన మాపత్రికకొక యుపవిలేఖకుఁడుగ నుండుటకంగీకరించి యప్పుడప్పుడే మైన వ్రాసి పంపుచుండును.

సంభాషణము.

చామాలమ్మ—నాతీర్థపు మహోత్సవమునకు నా చెలికత్తెలైన మీరందఱు వచ్చుటచేత నాకెంతో సంతోషముగానున్నది. ఏ టేట మీరిక్కడికి రావలయును.

పళ్ళాలమ్మ—అక్కయ్యా! మీరు మా యూరు మేము మీ యూరు వచ్చి పోవుచు నుండవలయునని యే నా కోరిక. కాని మనకీ సౌఖ్యము గౌరవము చిరకాలము జరుగునని నమ్మకము నాకు లేదు.

మామిళ్ళమ్మ (భయముతో) అమ్మయ్యో! ఏమియాపద వచ్చినది. మన సౌఖ్యము లెందుకు జరుగవు?

సాగులమ్మ—మశూచి విశూచి జాడ్యములు బొబ్బ లమ్మలు లోకములో నున్నంతకాలము మనకు గౌరవమేలజరుగక పోవును?

నూకాలమ్మ—పళ్ళాలమ్మ అక్కయ్య చెప్పినమాటలలో కొంతనిజమున్నది.

చామా—లేనిపోని భ్రమలుపడక మీ భయకారణమేమో నాకు తెలియజేయండి.

పళ్ళా—అక్కయా! ఇదిగోవిను. మశూచి విశూచి మొదలైనవి రోగములేకాని, అమ్మవారుల ప్రయోజకత్వములు కావని మన దేశస్థులు శాస్త్రములు చదువుకొని గ్రహించుచున్నారు. అందుచేత మనకూటిలో దుమ్ముపడినదని నేను భయపడుచున్నాను. ఈ సంగతి లోకములో పాక్కినా, ఇకమీఁద మనకు కోళ్ళుగొఱ్ఱెలు చల్దినైవేద్యమును పానకము మొదలైనవి సమర్పించువారుండరు. అప్పుడు మనమాకలిచేత చావ వలసివచ్చునని భయపడుచున్నాను. ఏబాధనైన బడవచ్చుకాని యాకలిబాధ పడలేముగదా.

మామి—పోనీ యీ దేశమువదలి మఱి యే దేశమైన పోదాముఠండి.

సాగు—కొంచెమో గొప్పో యీ దేశములోనే దొరకవలె కాని మరియొక దేశములో మన మొగముచూచువారే లేరు. పొలి మేరదాటి రానియ్యరు.

నూకా—కటకటా మనదశ యెంతవఱకు వచ్చినది! దీనికేమి గతి?

చామ—ఓసి వెఱ్ఱిముండలారా! మీ పిరికితనం తగుల వెయ్య ఇదా మీకు వచ్చిన భయం? చాలు, చాలు, బెంగపెట్టు కొనకండి. మీ భయము నేనుతీర్చగలను. వినండి. ప్రకృతి శాస్త్ర మనియెడు రాక్షసియొకర్తు క్రొత్తగా బయలుదేరి మన దేశమునకు వచ్చి పట్టణములలో ప్రవేశించి కొందఱికి మనమీఁద భక్తిలేకుండఁ జేయుచున్నమాటనిజమే. కానియట్టివారిసంఖ్యమిక్కిలితక్కువ. మఱి యునిందులోనొకపరమరహస్యమున్నది. అది చెప్పెదవినుండు. ఇంగ్లీషు

చదువుకొన్నవారిసంఖ్య మిక్కిలి తక్కువ అట్టివారు నూటికొకరైన లేరు. ఆచదువు చదువుకొననివారు మనకెప్పుడు భక్తులే యగుదురు. అదిగాక పాటకపు జాతుల వారందఱు మనకు విధేయులే. ఇంగ్లీషు చదువుకొన్నవారికి మన మీఁద నొకవేళ యిష్టము లేకపోయినను యింటివద్ద వారిమాటలు చెల్లవు. వారుమనమీఁద భక్తివద్దని చెప్పినంతమాత్రముననే వారితల్లులును భార్యలు తోబుట్టువులు కూఁతులు మగవారివలె చదువుకొని చెడిపోక పోవుటచేత బ్రహ్మరాక్షసులవలె యజమానులమీఁదబడిపీకివేసి వారిమాట సాగనియ్యరు. ఈమూఢ స్త్రీలు మనపాలిటి దేవతలు. వాళ్ళుండబట్టి మనపరువుదక్కుచున్నది; ఇంతఅన్నము దొరకుచున్నది. ఒకవేళ యజమానుఁడు చండశాసనుడైనపక్షమున అతఁడు కచ్చేరికి వెళ్ళగానే యతనికి దెలియకుండ స్త్రీలురహస్యముగ చద్దినైవేద్యమును, వేడినైవేద్యములుబెట్టియింటి నౌకర్లచేత చాటుగ మనకు కోళ్ళను మేకలను బలికిఁ బంపుదురు. మఱియు యీచదువుకొన్నవారి తెలివితేటలుకూడ ఆడవాళ్ళ తెలివితేటలువలెనే యున్నవి. ఏలయన బి. ఎ. ప్యాసు అయినవాఁడుకూడ జబ్బుచేసినపుడు సోదెకుఁ బంపుచున్నాఁడు. సోదెసంహేబిచ్చినతాడు కట్టుకొనుచున్నాఁడు. యం. ఏ. ప్యాసుఅయిన వాఁడుగూడ మనకు చాటుగ కోళ్ళను మేకలను బంపుచున్నాఁడు. ఈ మధ్య భీమన్న పంతులుగారికూఁతురునకు మశూచికమురాగా నాలుగు రూపాయలు బెట్టి మేకను ఆయనే స్వయముగాకొని తానుమాత్రము గుడికిరాక ఆడవాళ్ళనుమాత్రము పంపినాఁడు బి. ఏ. లు మనయెడ భక్తిచాటు చాటుగ జూపుదురు. మశూచికము కలరా మొదలైనవి శుచిలేని వారికి మంచిగాలి పీల్చని వారికి మంచి నీరు త్రాగనివారికి మంచి బట్టలు కట్టనివారికి మంచి యన్నము తిననివారికివచ్చును. గానిమన ప్రయోజకత్వమువలన రావు. ఈ జ్ఞానము దేశములోనున్న స్త్రీ

పురుషులలో నూటి కొక్కరికైన లేను. కాబట్టి యిటువంటి యజ్ఞాన ముండగాఅటువంటి బి. యే. లు యెం. యేలునుండగాఅటువంటిమూఢ స్త్రీలుండగా మనము జడువవలసిన పనియేమున్నది? ఇంక పదివేల సంవత్సరముల వఱకు మనకిటువంటి భయము గలుగదని నేను పూచీ పడి చెప్పగలను. హిమాలయ పర్వతములు త్రవ్వి వేయవచ్చును. సముద్రములో నీళ్ళన్నియు ఏతాము పెట్టితోడి వేయవచ్చును. ఆకాశముమీదనున్న చుక్కలనన్నింటి నేలరాల్పవచ్చును. కాని హిందూ దేశములో నుండునట్టి స్త్రీలయొక్కయు పురుషులయొక్కయుమూర్ఖత మాత్రము బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ముగ్గురు గలసి మూడు కోట్ల యవతారములెత్తిగూడ మాన్పలేరు. అందుచేత మనకు పుష్కలముగ నన్నమున్నది. ఇంతయెందుకు? ఈ యూరిలో రెండుకాలేజీ లున్నవి. ఇక్కడనున్న విద్యమరెక్కడ లేదుగదా? ఇటువంటి యీ గ్రామములోనే గొఱ్ఱె మేకలు లెక్కలేక చచ్చినవిగదా! నెత్తురు కాలువలుగా పారినదిగదా! ఇవియన్నియు జూచిచూచి మీ కింత భయమెందుకట్రా!

పల్లా—అమ్మయ్యా! నాభయ మిప్పటికి పోయినదే తల్లి.

మామి—ఈ మాట పైకి తెలియనియ్యకండి ప్రమాదము కలదు.

సాగు—డప్పువేసి చాటినను భయములేదే, వీరిమూర్ఖతకు చలనము లేదు.

చామా—సరే, యిక వెళ్ళుదమురండు.

(అందఱు నిష్క్రమింతురు.)

*

శ్రీ రా మ న వ మి పం ది రి

[అంతట గంగరాజు మంగరాజు ప్రవేశించుచున్నారు]

గంగ—మంగరాజుబావగారు నేను శ్రీరామనవమి పండుగ జేయవలయునని యెన్నాళ్ళనుండో తలపెట్టి యీయేడారంభించినాను. రామశాస్త్రిగారు! రామాయణము గంటనుండి లోపలిచావడిలోఁ జదువుచున్నారు. కాని మీరుతప్ప మఱి యెవరును పురాణము వినుటకు రాలేదు. తక్కిన అన్నిపందిళ్ళలోకి పందలకొలది వెళ్ళుచున్నారు. నాపందిరిలోకి యెవ్వరు రాకపోవుటకుఁ గారణమేమి?

మంగ—ఎందుకురాలేదో తెలియలేదా! నీ పందిట్లో యేమి గొప్పయున్నదనొస్తారు. ఈ పండుగ, ఆరంభించకముందే నేను నీతో వేయివిధముల చిలకకుచెప్పినట్లు చెప్పినాను. అప్పో సప్పో జేసి బోగముమేళము పెట్టవోయిబాబు అని నిన్ను నేను బ్రతిమాలుకోలేదూ? కాకపోయినా మీరు పెద్దవాళ్ళమాటలు వింటారా? పెండ్లికేమిటి శ్రీరామనవమికేమిటి మఱేయుత్సవమునకేమిటి భోగముమేళము లేనిదే నిండేలేదు. వాళ్ళు శోభనదేవతలు. వాళ్ళతో పందిరికి కళకాంతులు వస్తాయి.

గంగ—దేవుని యుత్సవానికి బోగముమేళమే ప్రధానమా? రామాయణపారాయణము భజన మొదలైనవి నిండుండదూ? మా తమ్ముడుగూడ నాతో మీలాగే వాదిస్తున్నాడు.

మంగ—మీ తమ్ముడు సబబెరిగిన మనిషి. నీలాగున మూర్ఖపట్టుపట్టడు. నీవీమధ్యను యింగ్లీషు చదువుకొన్న దౌర్భాగ్యులను కొందఱినిజూచి బోగముమేళము పెట్టనన్నావు. వెధవసహవాసాలు చేసి పూర్వపు మర్యాదలు మరచిపోతున్నావు. నీవఱచి చచ్చినా

సరే నీసావట్లోసికెవ్వడూ రాడు. నీవేడ్చిపోతావేమో యని నేను మాత్రమువచ్చినాను. ఆహాహా! అరుణాచలంవంటిబోగందివచ్చి మన పందిట్లో క్షణముసేపు నిలుచుండిన చాలు మహాలక్ష్మి తాండవమాడి పోదూ! అలాంటిది వచ్చినట్టయినా నీ సందిట్లో జనం యిసుక వేస్తే రాలకుండా వుంటారు. ఎవడూరాకపోతే యుత్సవంచేసుకొన్న సార్థక మేమున్నదయ్యా. కనుక నామాట విని యిప్పుడు మించిపోయినదేమి లేదు, యిప్పుడైనా భోగము మేళముపెట్టు. ఈవేళ ఒకరోజు వ్యర్థముగాబోయినా తక్కిన నాలుగురోజులు యిల్లు నిండుగా నుంటుంది. మీకు కావలిస్తే వందరూపాయలు చంద్రయ్యగారిదగ్గర బదులు యిప్పిస్తానురా! ఏలూరులో కంజాక్షి మేళమున్నది. కాకినాడలో నీలాచలం మేళం బహుశా ఖాళీగావుంటుంది. ఇద్దరికి యిప్పుడే టెలిగ్రాపులియ్యి. మాటవదహారులిస్తాం వస్తారా! అని వ్రాయించు.

గంగ—బావా నేను మొదట పొరపాటుచేసినాను. మనము టెలిగ్రాఫులిచ్చి వాళ్లు వచ్చేటప్పటికి పుణ్యకాలము కాస్తా అయి పోతుంది. మనవూళ్లో నరహరి మేళాన్ని యెవరు పిలవలేదు.

మంగ—(నోరు చప్పరించి) ఏమిటోయి. రెండువందలుపోతే పోయినాయి, కంటికిసదరైన మేళము తెప్పించాలిగాని మన వూళ్లో వాళ్ళని పిలిస్తే యేమి గౌరవముంది "క్రొత్తరుచి ప్రాతరోత" అన్నాడు. గనుక టెలిగ్రాపుఇయ్యి.

గంగ—లేనిబావకన్న గుడ్డిబావ మేలుకాదుటోయి బొత్తిగా లేకపోయేకన్న యేదోఒక మేళము వాకిట్లోవుంటే చాలదూ! ఇప్పుడు మీవంటి పెద్దమనుష్యులందఱు కాకులపొడిచినట్లు పొడుస్తున్నారు. తలయెత్తుకొని వీధిలో తిరగడానికి వీలులేకుండానున్నది. ఈమాటి కీలాగున పోనియ్యి; ముందునాటికి నెల్లాళ్ళు ముందుగానే యేలూరో

కాకినాడో వెళ్ళి కూర్చుని మంచిమేళమునకు ముందుగానే బజానా యిచ్చి వాళ్ళచేత కంట్రాక్టు వ్రాయించుకొని తీసుకు-వస్తాను.

మంగ—ముందునాటి కాలాగే చేద్దాములే. ఇప్పు డేమి చేద్దాము?

గంగ—ముందు నీవెళ్ళి నరహరితో మాట్లాడిరా! నేను యీలోపుగ చంద్రయ్యగారియింటికివెళ్ళి నూరురూపాయలు బదులు మాట్లాడుకొని వస్తాను. దేవుఁడుకార్యంగదా! ఆయన బదులు యియ్యకపోతాడా?

మంగ—ఈబదులు బోగము మేళముకోసమని మాత్రమాయనతో చెప్పకు వేరే యవసరమని నోటువ్రాసి పట్టుకొనిరా. పోనీ నరహరి యింటిదగ్గరకువెళ్ళి తిరిగివచ్చి నేనే సొమ్ము తెచ్చిపెడతాను నీవు యిప్పుడు వెళ్ళకు.

(అని వెళ్ళుచున్నాఁడు.)

గంగ—(తనలో) చంద్రయ్యగారు సొమ్మిస్తురా లేదా? లేక పోతే చేయవలసినపని యేమిటి? మాయింట్లోదాన్ని కంటె పదిరోజులు తాకట్టుకు యిమ్మంటే యిస్తుందా లేదా?

(తొందరలో రామరాస్త్రిగారు ప్రవేశించి)

గంగరాజుగారు! గంగరాజుగారు! మీతమ్ముఁడు విరుచుకొని పడిపోయినాడు త్వరగారండి.

గంగ—(తొందరతో) అయ్యో! అయ్యో! ఇదేమిటండోయి (అని లోపలకు బోవుచున్నాడు)

అప్పుడు నలుగురుమనుష్యులు పట్టుకొనగా తమ్ముడు సుబ్బరాజు లేచికూర్చుండి తలయూచుచు గంగరాజును జూచి 'ఓరీ! దుర్మార్గుడా నాస్తికుడా యింతలోనే యింతవాళ్ళుపొగరెక్కినదిరా

నే నెవరిననుకొన్నావు. ఎరుగవుకాబోలు జాగ్రత్త, భద్రాద్రిరాముల వారిని, నాకు భోగము మేళము అక్కఱలేదటరా! వొద్దని నీతో నేను చెప్పినానా? అంత మేళము తెప్పించుకొనుటకు గతిలేనివాడవు నాకీ యుత్సవమెందుకు చేయాలిరా? జాగ్రత్త, యీలాటి బుద్ధితక్కువ మాటలన్నావంటే వంశంనాశనం జేశేస్తా. కపద్దారుగా మనులుకో మాబంటును హనుమంతునిబంపినానంటే యీపూరంతాతగ లేస్తాడు.

గంగ—(భయముతో కాళ్ళమీదఁపడి) స్వామి! నావొల్ల తప్పొచ్చినది తప్పొచ్చినది బుద్ధిగడ్డితిని యీపని చేసినాను. ఇదిగో చెంపలు వేసికొనుచున్నాను. ఇఁకముం దెన్నడు నిట్టిపనిచేయను. నావంశం నిలిపి నన్నురక్షించండి.

సుబ్బ—ఇప్పటికి నీకు తెలివివచ్చినదిగదా! పరవాలేదు లే జాగ్రత్తగానుండు (అని వెనుకకు పడిపోవుచున్నాఁడు)

గంగ—అమ్మయ్యా! బ్రతికిపోయినాను. (అని లోపలికి వెళ్ళి) వోసే! యెక్కడనున్నావు ఈలారా?

భార్య—(వచ్చి) ఎందుకు పిలుస్తున్నారు. లోపల పేరంటాండ్రకు పసుపురాయుచున్నాను.

గంగ—ఇప్పుడుజరిగిన చిత్రకథ నీవు వినలేదుగాబోలు. మా సుబ్బరాజుకు రాములవారుపూని భోగము మేళము పెట్టుమన్నారు. నీవు నాలుగురోజులు నీకంటె నా చేతికి యిస్తివా అది తాకట్టుపెట్టి భోగముమేళము పెడతాను. లేకపోతే వంశక్షయమై పోతుంది.

భార్య—మీతమ్ముడికిరాములవారు పూని భోగము మేళము పెట్టుమన్నారా? విచిత్రపుమనుష్యులువిడ్డూరపుపూనడాలు వచ్చాయి ముండల మటాకోరుముండావాళ్ళు మీతమ్ముడు, వసంగరాజుపన్నిన పన్నాగమిది. అంతేకాని పూనడంలేదు. వాళ్ళపిండాకూడు లేదు.

వాళ్ళు శిమూలాడడానికి మీారు నమ్మడానికి సరిపోయినది కంటి తా కట్టెట్టి బోగము మేళము పిలిపిస్తారా ? ఆమంగరాజు చచ్చినాడు పెట్టిన పేటనేగాని మొదట మీాకీదుర్బుద్ధి పుట్టలేదు ? వాడి ముండలుమో సుకుపోను. వాడి కెప్పుడూ ముండలగొడవేగాని మరియొకటిలేదు.

గంగ—పోనీ యివ్వకపోతే. యివ్వకపోయినావుకాని కేకలు వేయకు. నలుగురు నవ్వుతారు అవతలకు వెళ్లు.

భార్య—వాళ్ళు మీారు మీాయిష్టమువచ్చిన గంగలో దిగండి నాకంటి నేను యివ్వను (అని వెళ్లుచున్నది)

గంగ—(చావడిలోనికి వచ్చి తమ్ముని బిలచి) తమ్ముడూ, చంద్రయ్యగారిదగ్గరకు వెళ్ళి నూరురూపాయలు బదులు పట్టుకురా ?

సుబ్బ—సరే తెస్తాను. (అని వెళ్లును)

మంగ—(వచ్చి) గంగరాజుబావా! నరహరి నన్ను అడ్డమైన తిట్లు తిట్టింది. ఈయూళ్లో యెవరు దాన్ని పిలవకుండా చేసినవాడిని నేనట. ఇదివరదాకా పనికిరాక యిప్పుడు పనికివచ్చినానా సిగ్గులేని కుక్కా యని తరిమి కొట్టినది. కాకినాడ యేలూరు మేళములుకూడా యెక్కడికో వెళ్ళినవని కాళీగాలేవని నాకు తెలిసినది. ఏమిచేయగలం ఈయేటి కూరుకో.

సుబ్బ—చంద్రయ్యగారు దస్తు లేదన్నారు. పోనీ యీయేటి కూరుకుందాము. ముందునాటికి బోగము మేళము పెట్టి ఉత్సవము చేయుచుందుమని మనము మొక్కుకుందాము, రాలోపలికిరా (అని అందరు నిష్క్రమించుచున్నారు.)

—౯—

కావలెను! కావలెను!

చక్కని పండ్రెండేండ్ల పెండ్లికూతురు కావలెను. పెండ్లికూతురునకు అయిదువేల రూపాయల నగలు పెట్టుదురు. పెండ్లికొడుకు అత్త మామలను బావమరదులను తనయింట నేయుంచి పోషించును. కావలసినపక్షమున వేయి రూపాయలో పదిహేనువందలో రొక్కము రహస్యముగా నిచ్చునుగాని, ఆమాట పయికిరానియ్యక సాలంకృత కన్యాదానమనియే వెల్లడిచేయవలెను. పెండ్లికూతురుకిచ్చెడు నగలు గాక, అత్తగారికిగూడ బంగారపుకంటెకాని, కాసులపేరుగాని పెట్టుదురు. ఈ వివాహసంబంధముకుదిర్చినవారికినూటపదహార్లురుసుమీయబడును. పెండ్లికుమారునకు సాలుకుమూడువేల రూపాయలు వచ్చునట్టి భూములు తోటలు నున్నవి. ఇదిగాక లక్షరూపాయలు వడ్డీకి తిరుగుచున్నవి పెండ్లికుమారుడు మంచి సాంప్రదాయకుడు. వీరి పూర్వులు దేశపాండ్యాలు. చాలాగొప్పఉద్యోగములుచేసి యీనడుమనే మూడుసంవత్సరములక్రిందట పింఛనుపుచ్చుకొన్నారు. పింఛను పుచ్చుకొన్నారనుటచేత, ఆయన చాలాపెద్దవారని లోకులు భ్రమపడి పిల్లనీయక వెనుదీయుదురేమో. అట్లు భ్రమపడవద్దు. ఈయన వయస్సు 43 సంవత్సరములు. ఇంతచిన్నతనంలోనే పింఛను పుచ్చుకొన్నారని యందురేమో యిటువినుడు. ఈయన 15వ సంవత్సరములోనే యుద్యోగములో ప్రవేశించి 25 సంవత్సరములు సర్కారుద్యోగము చేసి యుద్యోగముమీద విసుగుపుట్టి నలువదియవయేట నేపించను పుచ్చుకొన్నారు. ఇప్పటికిపింఛనుపుచ్చుకొనిమూడేండ్లయినది. కనుక యిప్పుడు 43వ యేడు. ఈయన పెద్దకుమారునకే 40 యేండ్లున్నవిగదా యీయనకు 43 ఏండ్లెట్లుండునని కొందఱుమూర్ఖులిదివఱకు

మావద్దనాక్షేపించినారు. ఆ యాక్షేపణలు కేవలకల్పితములు, అబద్ధములు. ఏమనగా ఈయన పెద్దకుమారునకు 28 యేండ్లకంటె నెక్కువ లేవు. ఆకుమారుఁడీయనకు 15 వయేట పుట్టినాడు. ఈవిషయమున సందేహము తోఁచినయెడల పిల్లనియ్యదలచినవారు ఈయన జాతకము చూచుకొనవచ్చును. ఈయనజననము ప్రభవ సంవత్సరము. జ్యోతిష్కులకు లంచమిచ్చి తక్కువవయస్సువేసి దొంగజాతకము వ్రాయించినారని జ్ఞాతులు వాడుక వేయవచ్చును. ఆవాడుకమాత్రము పెండ్లికూతురువారు నమ్మవద్దు. మనిషి 60 యేండ్లవానివలె కనబడును గాని నిజముగా అంతవయస్సులేదు. తల ముగ్గుబుట్టవలె నెరసినది ఆయనకు పెండ్లి యెందుకని కొందఱనుచున్నారు. తల వయస్సుచేత నెరియలేదు. సుమారు 10సం॥ క్రిందట ఈయన కుఁగొప్పజబ్బుచేసినది. అప్పుడు సన్నిపాతజ్వరముచేత ఈయన దేహము తెలియక మందులో కలుపుటకై గిన్నిలోపోసిపెట్టిన తేనె తలనిండ పులుముకొనుటచేత క్రమక్రమముగ తలవెండ్రుకలన్నియు తెల్లపడిపోయినవి. పండ్లలోఁ గొన్ని పుప్పిపండ్లు బయలుదేరి విశేషముగా బాధ పెట్టుచుండుట చేత, ఆపండ్లు తీయించివేసి యీయన దంతపుపండ్లు కట్టించుకొన్నాఁడుగాని పెద్ద వయస్సుచేత దంతము లూడిపోలేదు. అనేకస్థలములలోనుద్యోగములు చేయుటచేత, అయానీళ్ళుపడక మేహకారకముచేత కన్నులు చిన్నతనమందే జబ్బుపడిపోయినందున యీయన చలువజోడు కన్నులకు పెట్టుకొనుచున్నాడు కాని చత్వారముచేత జోడు పెట్టుకొను చుండుటలేదు. కాబట్టి పెద్దపిల్ల లున్నవారు తప్పక యీయనకు కన్యాదానము చేయవలెను. వరదక్షిణలిచ్చి కోరి వేడి తలక్రిందుగా తపస్సు చేసినను దొరకని సంబంధము. కాలవశము చేత కళత్రముతప్పిపోయినదిగనుక యీసంబంధము దొరకుచున్నది. పిల్లనియ్య దలచుకొన్నవారు జ్యేష్ఠమాసము లోపుగ

సంబంధము రహితము చేసికొనవలెను. ఏలయనగా, యీ పెండ్లి కుమారుడుగారి దౌహిత్రునకు. అనగా పెద్దకూతురు కుమారునకు, ఈయన పెద్దమనుమరాలిని, అనగా పెద్దకుమారునికుమార్తెను, యిచ్చి జ్యేష్ఠమాసములో తిరుపతిలో వివాహము చేయుదురు. ఆ వివాహముతో గలిపి తనవివాహముగూడ తిరుపతిలోనే యీయన చేసికొనదలచు కొన్నారు గనుక సంబంధము త్వరగా రహితము కావలెను. పిల్లను పెద్దవానికిచ్చిన పక్షమున పిల్లకు, అన్నిముచ్చటలు తీరవేమోయని తల్లిదండ్రులు భయపడ నక్కరలేదు. తిరుపతిలో చేసికొన్నను పెండ్లి 5 రోజులు జరుగును భోగము మేళముకూడా పెట్టుదురు ఇంటికి వచ్చినతరువాత బాణసంచాతోనూ నగారా నౌబతులతోను పెళ్ళిమని యూరేగింపు జరుగును. నాగవిల్లి నాడు దండాడింపుగూడ తప్పక చేసికోదలచుకొన్నారు. దండాడింపునకు, ఆయన నెవరెత్తుకోగలరని మీరు సందేహించ నక్కరలేదు. వంటబ్రాహ్మణులైన సోమన్న, అక్కయ్య, అనువార లిద్దఱు వంతులప్రకారమాయనను ఎత్తుకొని మోయగలరు. ఆ యేర్పాట్లన్నియు నిదివఱకే జరిగినవి. అందుచేత నిక్షేపమంటి సంబంధము చెడగొట్టుకొనక పిల్లనియ్యండి. పిల్ల యెంతో సుఖపడును నెనుకటి భార్య తాలూకు 80 బనారసు చీరలున్నవి మీపిల్ల కట్టినచీర గట్టకుండా నెల్లాళ్ళు కట్టుకొనవచ్చును. వెండిపళ్ళెములు కంచములు గిన్నెలు దొన్నెలు ఎన్నియున్నవో చెప్పలేము. కీన్ కాబు, అతలషుగుడ్డలు వేసిన పట్టుపరుపుమీద మేడలలో నిలువుటద్దముగల గదిలో పందిరి పట్టిమంచంపై పండుకొనవచ్చును. కావలసినపక్షమున పిల్లకు ముందుగానే నాలుగుపుట్లభూమి వ్రాసియిచ్చి 10 వేల రూపాయలామె పేర బ్యాంకిలో వేయుదురు. సవతిబిడ్డలకు, యీయనకు పడదన్న భయము లేదు. పెండ్లికాగానే ఆయన వేరుగా నుందురు. ఈ పెండ్లి ఆయనంతట ఆయన చేసికొనవలెనని లేదు. కావలసినవాళ్లము మేమందఱము స్వయంగా

నొక్కి చెప్పి యితరులచేత చెప్పించి బలవంతపెట్టి మెడలు విరిచి వివాహము చేసికొనుటకు వప్పించినాము. ఈవేళకు ఆయనభార్య పోయి 6 దినములైనది. 13 వ దినముననే వివాహము చేసికొనుట కాయన యంగీకరించినారు గనుక దశరాత్రముల లోపుగానే తాంబూలములు పుచ్చుకోవలెను. భార్యకు సాపిండమై మాశికము బ్రాహ్మలు లేచినతోడనే 12 రోజుననే తిరుపతికి పెండ్లికి ప్రయాణమై వెళ్ళుదురు. ఇతరసంగతులేవి గావలసినను నాపేరవ్రాసి తెలిసికొనవచ్చును

దా, దామోదరరావు,

రుద్రపురము.

---*---

ఆనందసమాజము

ఈపేర నొక సమాజము, ఈ పట్టణములో రెండుసంవత్సరముల క్రిందట స్థాపింప బడినది. కాని యింతకాలమునుండి యది రహస్యముగా నుండెను. ఇప్పుడు దానిని బహిరంగముచేసి దీనివలన కలిగెడు మహాలాభములు లోకులకందఱకు గలుగ జేయవలయు నని మేము సంకల్పించినాము. ఈ సమాజములో చేరినవారి కందఱకు కొంచెము వెలకుమాత్రమే బ్రహ్మానందము కలుగుచుండును ఈ సమాజపు కార్యస్థానము రాత్రి 7 గంటలు మొదలు తెల్లవారు జాము నాలుగు గంటలవఱకు తెఱవబడియుండును. ఇందు సాధారణముగ పురుషులే చేర్చుకొనబడుదురు. స్త్రీలను మొంబర్లగా

జేర్చుకొనము కాని వారుకూడ అప్పుడప్పుడు వచ్చి పురుషులతో పాటు బ్రహ్మానంద మనుభవింపవచ్చును. తల్లిదండ్రులి తగాదాలు లేనియెడల చిన్నపిల్లలనుగూడ నిందులో జేర్చుకొందుము. ఈసమాజముయొక్క ముఖ్యోద్దేశములివి. ఇదివరకు మనదేశములో, ఎక్కడో కొందఱు మహాత్ములు తప్ప తక్కినవారందఱు, ముఖ్యముగ బ్రాహ్మణులు కల్లు సారా బ్రాంది మొదలయిన అమూల్య వస్తువులయొక్క మహిమ యెఱుగక వాటివలన వచ్చెడు సుఖము మహానందము అనుభవింపలేక చెడిపోవుచున్నారు గనుక వాటి యొక్క సేవ దేశములో చక్కగా వ్యాప్తముచేసి లోకులకు అపారమైన యానందము కలిగించుటయే యీసమాజముయొక్క ముఖ్యోద్దేశము. మేము లోకోపకారార్థమే యీ మహాకార్యము తలపెట్టినాము కాని స్వలాభముకొరకుగాదు. మేము చిఱకాలము నుండి యనుభవించుచున్న యీ యానందమును మాతోడి మనుష్యులందఱకు గలుగజేయవలయునను ఉన్నతసంకల్పమే దీని స్థాపనకుం బ్రధమకారణము. మేము వేదాంతశాస్త్ర మభ్యసించితిమి. గావున "ఆత్మవత్సర్వభూతాని" యనునట్లందఱు మావలెనుండవలయునని మాసంకల్పము, ఈసమాజముయొక్క మూలధనముక్రింద వేయిరూపాయలు కావలయును. భాగము నకటికి పదిరూపాయలు చొప్పున నూరుభాగములువేసి యీసొమ్ము వసూలు చేయుదుము. భాగము పుచ్చుకోదలచిన వారు జూను 30 తారీఖులోపుగ యీక్రింద సంతకము చేసినవారికి దరఖాస్తులు పంపవచ్చును. భాగము పుచ్చుకొన్నవారు డైరక్టర్లగుదురు. వీరుగాక సామాన్యమెంబర్లు నెలకర్థ రూపాయచందా నిచ్చినపక్షమున చేర్చికొనబడుదురు. డైరక్టర్లకు సామాన్యమెంబర్లకంటె యెక్కువ హక్కులుండును. డైరక్టర్లు తాగి యెడలు తెలియకయున్నప్పుడు దొర్లుటకు పరుపు లీయబడును. ఒకవేళ యింటికి వెళ్ళలేనియవస్థలోనున్న పుడారాత్రి యిక్కడనే భోజ

నము పెట్టబడును. ఇంటికి వెళ్ళునపుడు గోడలమీద మనుష్యులమీద పడకుండ వెంట నొకబంట్రోతు నీయబడును. మఱియు కావలసి వచ్చినప్పుడు యింటివద్దకే కల్లు బ్రాంది మొదలగునవి పంపఁబడును ఈహక్కులలో నేవియు సామాన్యపు మెంబర్లకుండవు. ఈమూలధనముయొక్క వడ్డీ ధర్మఖర్చుక్రింద వినియోగింతురు. ఆధర్మమేదనగా త్రాగవలెనని సరదా, ఉండి డబ్బులేక గిజగిజ తన్నుకొని బాధపడుచుండు త్రాగుబోతులకు. అనగా ముఖ్యముగా తమ సొమ్మంతయు త్రాగుబోతుతనముక్రిందనే కర్చుపెట్టి సంసారము చితికిపోయియున్న వారికి ఉచితముగా కల్లు సారా బ్రాందీ సప్లయిచేయుదురు. ఈకాలమందు స్వదేశీవిదేశీ భేదములున్న విగనుక మాసమాజములోగూడ వాటి కేర్పాటులు చేయబడినవి. స్వదేశీపద్ధతిలోనివారికి తాటికల్లు యీత కల్లు జీలుగుకల్లు యిప్పకల్లు వీటిసారాయలు సప్లయి చేయబడును స్వదేశీవారికి గళాసులతో పుచ్చుకొనుట యిష్టముండదు గావునసత్తు గిన్నెలతో పుచ్చుకొనవచ్చును. దేవీపూజచేసి వామాచారములో చేరిన శిష్టులెవరైన వచ్చినపక్షమున వారు పట్టుపంచెలు కట్టుకొని పుచ్చుకొనవచ్చును. ఈ సమాజములో దేవతావిగ్రము లున్నవి. గనుక వాటికి నైవేద్యములుపెట్టి వామాచారులు త్రాగవచ్చును విదేశీపద్ధతివారికి బ్రాందీ; విస్కీ, జిన్నూ, ఓల్టాం, త్రీడాగర్లు, సిల్వరు కప్పు, రమ్ముసారా మొదలయినవియు సోడాలెమెన్లడ్డు మంచుగడ్డ మొదలగునవియు సప్లయిచేయబడును. అలవాటు లేనివారికి వెలపరము రాకుండ కొన్ని సాధనములుచేసి ఉద్దరణెడుగాని చెమిచా చెమిచాడు గాని క్రమముగా అలవాటు చేయఁబడును. ఇంటివద్ద భార్య పోరాటము తలిదండ్రుల బాధలుగలవారందఱు ఇదివరకు చాల యిబ్బంది పడుచున్నారు. గనుక యీసమాజమువల్ల ఆయిబ్బందులు తొలగి పోవును. ఇందుకు కావలసిన నంజుళ్లు వగయిరాలు చక్కగా వండగల

నౌకర్లనేర్పరచినాము. ఈనౌకర్లందఱు మిక్కిలినమ్మకము గలవారు ఈసమాజకులు పడవషికార్లు రైలుషికార్లు బండిషికార్లు తరుచుగా వెళ్ళుచుందురు. ఇందులో ఎం, ఏ, బియల్, బియె మొదలగుపరీక్షలలో తేరినవారుండుటచేత జనులుభయపడి మననేమీ యనజాలరు. అందుచేత మెంబర్లు స్వేచ్ఛగా విహరింపవచ్చును. ఒకవేళకొందఱు మూర్ఖులేమైనను అన్ననూ యిందులో మెంబర్లుగానున్న వకీళ్ళసహాయమున అట్టివారిమీద పరువునష్టపుదావాలు తెచ్చి ముక్కునేలబెట్టి రాచివేయవచ్చును. మనముబీధులలోగుడ్డలు కట్టుకొనకుండ పెద్దపెద్ద యుత్సవములలోతిరిగినను ఈపట్టణములో మనజోలికిరాగలవారెవ్వరును లేరు. డబ్బులేకనోడబ్బుకర్చుపెట్టలేకనో తమశరీరములకు పడకపోవుటచేతనో దీనిరుచి యానందము ఎఱుగకపోవుటచేతనో ఓర్వలేమిచేతనో కొందఱు దౌర్భాగ్యులు తాము నీతిమంతులమని విఱ్ఱవీగుచు మావంటివారిని నీతిహీనులని తిట్టి రహస్యముగాను పత్రికలలోను అల్లరిచేయుదురు. కుక్కలుమొఱిగినజంగముపరపతిపోవునా? మనము వాటిని లక్ష్యముసేయనక్కఱలేదు. మనపని మనకు జరుగవలెను. కాని మెనరెట్లు అనుకొన్ననేమి? దీనిపరమార్థము వినుడు త్రాగుబోతులు లోకోపకారులు ఏలయనగా మనలను నమ్ముకొనియే గదా యిజారాదార్లు లక్షలకొలది సొమ్మును పాటలుపాడుచున్నారు మనలను నమ్ముకొనియేగదా చాలమందిషాపులబెట్టుచున్నారు. మనవంటివారి నాధారముచేసుకొనియేకదా యూరపుఖండములో ప్రతిదేశమందు కోట్లకొలది రూపాయలసారా తయారగుచున్నది. ఆ సారాతయారుచేయు కూలివాండ్రందఱు మనవల్లనేబ్రతుకుచున్నారు ఆ గ్లాసులు సీసాలుచేయు పనివాండ్రందఱు మనవల్లనే జీవించుచున్నారు. అవి యోడలమీద తెచ్చుటవలన వేలకొలది యోడకళాసులు మనవలన బ్రతుకుచున్నారు. అది దిగుమతీ యెగుమతీచేసి

యనేకులు మనమూలమున, అన్నము తినుచున్నారు. ఇక్కడి వర్తకులు, వర్తకుల దుకాణములలోనున్న నౌకర్లు మనవల్లనే జీవించుచున్నారు. వేయేల! లక్షలకొలది కోట్లకొలది జనులు మనవల్ల బ్రతుకుచున్నారు. ఈపని మనము మానితిమా యిన్నికోట్లమంది అన్నములేక పస్తుండవలసినదేకదా. కాబట్టి త్రాగుబోతుతనము మానినవారికి మానిపించినవారికి అనేకులకు జీవనాధారము తీసివేసిన మహాపాపము వచ్చును. కాబట్టి తెలివితక్కువవారి మాటలు విని చెడిపోక తెలివినిబడి లోకోపకారముచేసి బ్రహ్మానంద మనుభవింపుడు.

రాజమండ్రీ, }
ఇన్నీసుపేట. }

త్రా. మదనగోపాలయ్య,
జా. రాఘవరావు.

—*—

ప్లీడరుతమాషా

రంగము—ప్లీడరుగారి యిల్లు.

[అప్పుడు ప్లీడరు రాజారావుగారు, గుమస్తా గంగరాజుగారు ప్రవేశించుచున్నారు.]

రాజా—గంగరాజుగారూ! నేను గొప్ప పరీక్షలు ప్యాసు అయినప్పటికి నాదగ్గఱకు పార్టీలు బొత్తిగా రాకపోవుటకు కారణ మేమి? తిన్నగా యింగ్లీషుముక్కలైన రాని ప్లీడర్లయిండ్లకు విశేషముగా పార్టీలు యేల వెళ్ళవలెను. ఓ. అంటే ధం రాని వాళ్ళవద్దకు యెందుకు వెళ్ళుతారండి పార్టీలు?

గంగ—తమరు క్రొత్తవారవడం ఒకటి. రెండవది మనమిచ్చే కమీషను చాలదని యేజంట్లంటారు. మూడవది మీదగ్గర డాబు తక్కువ. పార్టీ దగ్గరకు రాఁగానే యీకేసంత మంచికేసు లేదని తప్పక నెగ్గుననని సొరకాయకోతలు కోసి వేయవలెను.

రాజా—మనము నూటికి పాతికరూపాయలు కమీష నిస్తూ వున్నాముకదా! అంతకన్నా యెక్కువ యెవరిస్తారయ్యా! అదిగాక డాబుకూడా తక్కువ చెయ్యడంలేదు. మొన్నవచ్చిన ద్వారపూడి పార్టీలవద్ద కోసినకోతలు నీవు చూడలేదా! ఈ కేసుకు సంబంధించిన క్రొత్తరూల్సు వచ్చినవనిన్ని మునసబుగారు మనస్వాధీనమని నదురు బెదురు లేకుండా చెప్పి వకాల్తనామా పుచ్చుకోలేదూ!

గంగ—మనమిచ్చే కమీషను చాలదు. శేషాచలంగారు నూటికి నలభై రూపాయలిస్తున్నారు. అంతకంటె మనము కొంచెమైనా యెక్కువిస్తేనేకాని మనదగ్గరకు చేరరు. ఆపైన మనము పార్టీల సొమ్ము వాడుకుంటామని కొంచెము వాడుకపడినట్టు కనబడుచున్నది.

రాజా—సరే కొంత కాలమువరకు మనము నూటికి యేభై చొప్పున కమీషనిస్తామని యేజంట్లతో చెప్పండి. పార్టీలసొమ్మంటే జ్ఞాపకంవచ్చింది. ఆలమూరి కాపులు స్టాంపులనిమిత్తం యిచ్చిన సొమ్ము పూడినదా?

గంగ—పూడలేదు. దానికోసమే తంటాలు పడుతున్నాను. అదియిచ్చి నెల్లాళ్ళపైచిలుకయినది. మొన్న వాడు కనఁబడితే దాఖలు చేసినామని చెప్పినాను. రేపటితో కాలదోషం పడుతుంది. నాకేమి తోచడంలేదు. ఈసంగతివింటే మన యిద్దరికొంపాకూడా మునుగుతుంది. ఈలా చేస్తే —

రాజా—ఊరుకోండి. ఎవరో వస్తూన్నారు. (అని మీసము మీదచేయివైచికొని) హు ఆర్యా! ఎవరుమీరు. ఎందుకు వచ్చినారు

(అప్పుడు నాగిరెడ్డియను కాపు ప్రవేశించుచున్నాడు)

నాగి—దండాలుండి బాబయ్యా, ఈలోగిలెవరిదుండి.

రాజా— నీ కేవరిలోగిలి గావలెను?

నాగి—నా కండీ! ఆరెవరండి. ఆపెద్దప్లీడరు. ఆబుగ్గమీసాలాయన బక్కపల్సగావుంట్టారు.

గంగ—పేరెవరో చెప్పు?

నాగి—నాకు పేర్తెల్దండి.

గంగ—నిన్నెవరు పంపినారు

నాగి—నన్నాండీ, అమలాపురంనుంచి, గంగాడ్రావుగారు, ఉత్తరంయిచ్చి పంపించారండి, నాయేజ్జెం ఆకోరుటులో పోయిందండి. అపీలు దాకలు చేద్దాం అని వొచ్చానండి, ఇదిగో ఆరిచ్చి సుత్తరం.

రాజా—(పుచ్చుకొని తనలో) ఇదిరంగారావుగారిపేర వ్రాసినారు అయితే నేమిలే యెవరికి వ్రాసినారో యీ వెధవకి తెలియదు. గదా (అని యుత్తరము చింపి కవరు ముక్కముక్కలుచేసి పారేసి) మీగంగాధరరావుగారు నిన్ను నాదగ్గర కెపంపి యీయుత్తరమునాకే యిచ్చినారు. నీ అప్పీలు దాఖలుచేసి జడ్జీగారితో హోరాహోరీగా పోట్లాడి నీకేసు గెలిపిస్తాను. ఫీజు తెచ్చినావా? వకాల్తనామా వ్రాయించు. గంగ రాజుగారూవకాల్తనామామీద వ్రాలుచేయించండి

నాగి—పీ చంతా తేలేదండి.

రాజా—తెచ్చినమట్టుకు జమకట్టించవోయి తరువాతచూచుకోందాము. నీవెక్కడి కెడుతావు, నే నెక్కడి కెడతాను.

నాగి—చిత్తం చిత్తం. గంగాడ్రావుగారు చెప్పడం పీడర్కి బుగ్గమీసా లుంటా యన్నాడు బక్కపల్సగా వుంటాడన్నా డండి.

గంగ-ఈయనే బుగ్గమీసాలప్లీడరు. ఈమధ్య వేసవికాలంలో చీదరగా వుంటుందని బుగ్గమీసాలు తీయించినారు. ఈయనమాత్రం

ఒక్కపల్చగా వుండక పెద్దలావుగా వున్నారామేమిటి. ఇదిగో వకాల్తనామామీద వ్రాలుచేసివెయ్యి.

నాగి——చిత్తం (అని సందేహముతో వ్రాలుచేసి) ఖర్చు లెన్నవుతాయండి.

గంగ——నీ వ్యాజ్యం అయిదువందల రూపాయలది కాదూ, అయిదు తొమ్మిదులు నలభైయైదు రూపాయల స్టాంపు, ప్లీడరుఫీజు అయిదయిదు లిరువైయైదు రూపాయలు, వకాల్తనామా రూపాయి. వాలంటరి రూపాయి, సమనుబత్తెము మూడురూపాయలు, ఇంకా యివ్వవలసినవారికి మామూళ్ళు అయిదురూపాయలు.

నాగి——ఇదేటుండి. టాంపుకర్చులునూటికి రు 7–8–0గాదండి

గంగ–నేనేమి అబద్ధమాడినానా యేమిటి. మునసబుకోర్టులో స్టాంపు డ్యూటి నూటికి రు 7–8–0 జడ్జికోర్టులో రు 9–0–0.

రాజా——తక్కిన ప్లీడర్లలాగు మేము దగాచేసి పార్టీలసొమ్మ పహరించము.

నాగి——అప్పీలులో సమనుబత్తె మెందుకండీ,

గంగ——రికార్డుసమనుచేయించవద్దు టోయీ? దానినిమిత్తం బత్తాలు కావా ? నీకు మామీదనమ్మకం లేదేమి ? కర్చులెక్కువ కట్టిసినెత్తిని పేడరాసేవాళ్ళమాటే నీవు వింటావు.

నాగి——కాదండి. అక్కడి ప్లీడరుగుమస్తా ఇయ్యన్ని చెప్ప లేదండి.

రాజా——మునసబుకోర్టులో పడి యేడ్చే గుమస్తాలకు జిల్లా కోర్టురూల్సు యేమి తెలుస్తాయి.

నాగి——(సొమ్మిచ్చి) బాబయ్య, ఇందులో గట్టిగాపనిచేయించాలుండి. మీపాదాలు నమ్ముకున్నానుండి (అని వెళ్ళును)

గంగ—(నవ్వుచు) వీడు టోపీలో బాగానే పడ్డాడు, ఇదిగో యీలాగావలెనండి పార్టీలు.

రాజా—ఈడబ్బు పెట్టి ముందు ఆలమూరు కాపుల వ్యాజ్యము రేపు దాఖలు చెయ్యండి. ఈపార్టీ రంగారావుగారివద్దకు వెళ్ళవలసిన వాడు. ఆవుత్తరం ఆయన పేరనున్నది. నేనే ఆయననని పుచ్చుకొన్నాను. దీనివల్ల యేమీ ప్రమాదంరాదుగదా?

గంగ—తగాదా లేదు. శింగినాదం లేదు ఇల్లాంటివి రోజు లతూతొంబై జరుగుతూంటాయి.

—ం—

రెండవ రంగము

[అప్పుడు ప్లీడరు రాజారావుగారు ప్రవేశించుచున్నారు]

రాజా—(తనలో) ఎన్నికకర్ర్యకర్తలకు దిగినను నెలకు ఏబది రూపాయలువచ్చుట కష్టముగా నున్నది. మఱి యేడిపార్టి మెంటులో నైనా పనిలో చేరుదామంటే తగినపని కనబడదు. ఇంటిఅద్దె యేభై రూపాయ లియ్యవలెను. అప్పుయిచ్చే వాడైనాలేడు. ఏమి చేయవలయునో తెలియకున్నది.

[అప్పుడు కాపు ప్రవేశించుచున్నాడు]

రాజా—ఎవరోయినీవు ?

కాపు—నన్నేఱుఁగరూ; ఎవరన్నకాడికి నచ్చింది వ్యాపారము. నేను యేజ్యం దాఖలు చెయ్యమని సొమ్మిస్తే మీరు దాఖలు చేశారు కారట యెందుచేతనూ. వాడుకొన్నారా యేమిటి.

రాజా—(కోపముతో) ఏమిటోయి పరువు మరియాదలు లేకుండా మాటాడుతావు. మాకు వాడుకొందుకు నీవెధవడబ్బే కావలెనా? నెలకు నాలుగువందలు సంపాదించుకొనేవాడిని నీసొమ్ము వాడు

కుంటూనా ? నీసొమ్మంతా పోగుచేస్తే నేనిచ్చే ఇన్కంటాక్సు అంతి లేదు. పెద్దమనుష్యులవద్ద యేలామాటాడవలెనో నీకు బొత్తుగా తెలియదని తోస్తుంది.

కాపు—అయినకాడికి తాంపు కొనమన్న సొమ్ము వాడుకోని నాకు మర్యాద తెల్గంటూవా? నీపేడరెంత నొవ్వెంత. అబ్బో; మరేద త్రైల్సినోడియి బైగ్లేరావు, పూటకి టికానాలేని నీవంటి చచ్చుపీనుగు కియ్యడం నాదేతప్పు. యేజ్జెం డాకలుచెయ్యాక పైపెచ్చు నన్ను తిడతావా ? చూడిప్పుడు జడ్జీదగ్గరకెళ్ళి నీపరువంతా తీశేస్తాను.

రాజా—నీవ్యాజ్య మిదివరకే దాఖలైనది. కాలేదని నీతో యెవరు చెప్పినారు?

కాపు—ఇప్పుడేకాదూ! యేడ్డుగుమాస్తాగారు చెప్పారు.

రాజా—హెడ్డుగుమాస్తాగారా చెప్పినది. సరిసరి. మొన్న నొక వ్యాజ్యంలో యేమైనా కొంచ మిప్పించమంటే "ఛీ! నేను లంచాలిప్పిస్తానా అటువంటి పనికిమాలినపని చేయను" అని మందలించినాను. అప్పటినుండి నామీద ఆయనకు కోపంగానుండి యీలాంటి అబద్ధములు చెపుతూన్నాడు మాగుమాస్తా రానీ ఆయన నడుగుదుగాని.

కాపు—నీగుమాస్తా తలలుమార్చేవోడు నీవు కొంపలు తీసేవోడివి మీకిద్దరికి సరిపోయింది. మద్దినాల కోర్టుకొచ్చి కనుక్కుంటాను డాకలు కాకపోయెనా నాతమాసా చూసుకో (అని వెళ్లును)

[అప్పుడు గంగరాజు ప్రవేశించుచున్నాడు]

రాజా—ఏమండోయి గంగరాజుగారూ! ఆకాపువచ్చి అడ్డమైన కూతలు కూసినాడు నిన్నవచ్చిన అమలాపురంఅప్పిలుతోకర్చుల క్రింద యిచ్చినసొమ్ము పెట్టి యీవ్యాజ్యం ముందు తగలెయ్యండి. ఊరుకుంటే పరువుదక్కేటట్టు లేదు.

గంగ—వాడన్న మాటలన్ని వి టున్నానండి. నేను వాడుండగానే వచ్చినాను కాని మెదరపడితే నామీదపడి యేడుస్తాడని, ఆ దంపుళ్ళ గదిలో దాకున్నాను. ఈ వేళ తప్పక దాఖలు చేస్తాను. (అప్పుడు రామచంద్రయ్య అను యేజంటు ప్రవేశించుచున్నాడు.)

గంగ—ఓహో! రామచంద్రయ్యగారూ! మామీద నేటి కనుగ్రహం పుట్టినట్లున్నది. దయ చేయండి. (ప్లీడరుగారితో) ఈయన మంచిరాజు రామచంద్రయ్యగారండి. చాలా పలుకుబడియున్న వారును మంచివారును.

రాజా—(లేచి) దయ చేయండి రామచంద్రయ్యగారూ! (అని కుర్చీచూపించి) మీ పేరు వినడమే కాని యెన్నడు దర్శనము చేయలేదు నేటికి సంప్రాప్తమైనది.

రామ—నేనుకూడా మీదర్శనం చేయవలయుననే ఆలోచిస్తూన్నాను. కాని తీరుబడి లేదు. నేను కృష్ణా రామా అని ముక్కుమూసికొని కాలక్షేపం చెయ్యాలంటే పూళ్ళోవారువన్ను ఊరుకోనియ్యరు. అన్ని వ్యవహారాలు తెలిసినవాడను పెద్దవాడను ఘరానాకుటుంబంలోవాడను. అగుటచేత నేనురాను మొర్రోఅనుచున్నా నన్ను పార్టీలు తీసుకొనివస్తారు. ఇప్పుడువచ్చినపనివినండి ఒక మేస్త్రీటు కేసులోమీరు పని చెయ్యాలి. అందులో నూరురూపాయలు ఫీజునిర్ణయిస్తాను నాకు కమీషను యేమిస్తారో తెలియ చెయ్యండి.

రాజా—నేను కమీషను గిమీషను యిచ్చే ప్లీడరునుకాను కమీషను యివ్వడం లాప్రకారం చాలాతప్పు.

రామ—అయితే మీరు ప్లీడరీ చేసినారే. ఈ శ్రీరంగనీతులు నేనెఱగనవి కావు. ఇప్పుడు రెండేసిలక్షలు సంపాదించి తెగనీలుగులు బలిసి గుఱ్ఱపుబండ్లెక్కి తిరుగు పెద్దప్లీడర్లందరిదగ్గర చెవులువడేసి

కమీషను లాగినవాడినే. తల్లిపుట్టిల్లు మేనమామలదగ్గర దాగదు. అయితే నేనుశలవుపుచ్చుకుంటాను. (అని లేచును)

గంగ—రామచంద్రయ్యగారూ! మీరొక్కమాటు దయ చెయ్యండి. నేను మనవిచేస్తాను (అనిదొడ్డిలోనికివెళ్ళి) రాజారావు గారూ! దయ చెయ్యండి;

రాజా (వెళ్ళి) ఏమికమీష నిమ్మంటారతనికి ?

గంగ—ఏలాగో ఒకలాగు వప్పుకుందాము. ఇతని నమ్ము కుంటే కావలసినన్ని కేసులు వస్తాయి. ఇతనిచేతి క్రింద నూరుగురు పార్టీలున్నారు. ఎంత కమీషనడిగినా యితనిని వదలతగినదికాదు. ఇంటిలో నలభైయో ఏభైయో దొరకినపక్షమున యింటి అద్దె క్రింద కొంత బియ్యపుబాకీ కొంత యిచ్చివేయవచ్చును. వాళ్ళు తొందరపడి వ్యాజ్యాలు వేస్తామంటూన్నారు అందుచేత నామాట వినండి.

రాజా—సరే నీయిష్టమువచ్చినట్లు చేయవచ్చును.

(అని వెళ్లును.)

గంగ—రామచంద్రయ్యగారూ ఇల్లా దయ చెయ్యండి.

రామ—(వెళ్లి) మీప్లీడరుగారు వట్టి వెఱ్ఱిపప్పులాగున కన బడతాడేమి ?

గంగ—ఆయన యూఋప్రకారం వెళ్ళేవారు. చాలా కర కట్టు మనిషి. అయితే నేనిప్పుడు మెడలు విరిచినాను లెండి మీ రిప్పుడేమి కమీషను కోరుతారో కోరండి.

రామ నాకు రు 60 లకు చిల్లిగవ్వతక్కువయితే పుచ్చు కోను.

గంగ—రు 60 పుచ్చుకొనుడు.

రామ—మహామహావాళ్ళు యేభై యిస్తూన్నారు. ఈయన క్రొత్తవాడుగదా నాలుగుకేసులు వప్పచెప్పవలెనని వచ్చినాను కాని నాకు కమీషను దొరకక కాదు.

గంగ—సరే మీ యిష్టమువచ్చినట్లు చేయించండి. ముందు రొక్కముమాత్రము చేతిలో పడవేయించండి.

(అని అందఱు; నిష్క్రమింతురు.)

—*—

మూడవరంగము

(రాజారావుగారియిల్లు, అప్పుడు గుమస్తా గంగరాజు ప్రవేశించుచున్నాడు.)

గంగ—(తనలో) నేనేమి చేయవలెనో నాకు తోచకున్నది. గుమాస్తాపనిలో బ్రవేశించిన తరువాత పట్టణవాసపు కాపురముగుట చేత మలమల మాడిపోవుచున్నాను. చింతలపూడిలో బడిపెట్టుకొన్నపుడే నాపని యింతకంటె బాగున్నది. బుద్ధిగడ్డితిని యేమో బావుకుందామని ప్లీడరుగుమాస్తాలో బ్రవేశించినాను. నాయదృష్టముకొలది యీజైనమ్ము ప్లీడరే దొరికినాడు. ఈయనగారికి నోట్లో ఉప్పుపత్రిలేదు ఏపార్టీని టోపీవేసి తీసుకువచ్చినను వాడికేసు తగల వెయ్యడమే, ప్లీడరికే రూపాయలు రానప్పుడు గుమాస్తా ముండావాడికేమొస్తుంది. ఈయనదగ్గఱ మానివేసి మఱెక్కడనైనా బ్రవేశించవలెను.

(అంతలో నొక మనుష్యుడు ప్రవేశించును.)

గంగ—ఎవరోయినీవు?

మను—సేసగిరిరావుగారిల్లు ఇదేనాండి?

గంగ—ఎందుకు శేషగిరిరావుగారు?

మను— మా యేజ్జెముందండీ. ఆయన వకాల్తనామా యివ్వాలుండి.

గంగ—నీవెక్కడో అడివిమనిషివి లాగున్నావు! శేషగిరిరావుగారు ప్లీడరీమానివేసి యీ యూరినుంచి వెళ్ళి మొన్నాళ్ళయినది--

మను.—మా నేరి యెల్లినారండి. మాకిందికోట్టు పీడరుగారు ఆయన నన్నారు ఆయనకే యిమ్మని చెప్పారండి.

గంగ—పాపమాయనయెరుగడు. ఆయన కీయూళ్ళో యింటి అద్దెడబ్బులైనా కిట్టకపోవడంచేత యీయూరునుంచి దుకాణంయెత్తి బరంపురం, అటికేసి వెళ్ళినారు మానివేసి రెండు నెలలయినది.

మను—అలాగైతే మరొకరికిచ్చుకోవాలి.

గ. గ—ఎవరికో యెందుకు యీ యిల్లురాజారావు పంతులు గారిది. ఆయనకే వకాల్తానామా యియ్యి. ఈయన నెలకై దారు వందలు సంపాదించుచున్నారు. మొన్న జడ్జీగారు సబుజడ్జీపనియిస్తాము వెళ్ళుమని యెన్నివిధాలో బ్రతిమాలితే, మీ సబుజడ్జీ జీతం నాకు రెండు కేసులలో వస్తుంది, నేను వెళ్ళనని నిరాకరించినారు. ఈయన వాదం చేస్తూంటే జడ్జీగారు చిరునవ్వునవ్వుచు చెవులు దోరబెట్టుకు వింటారు. లా అంతాకూడా చెరిగి వేస్తారుగదూ! ఈయన యెదర రెండవప్లీడరు నోరెత్తలేడు.

మను—అయితే యీయన ఫీ జెల్లాపుచ్చుకుంటారండి;

గంగ—ఫీజుకేమోయి,నీయిష్టమువచ్చినట్టు పుచ్చుకొంటారు

మను—వకాల్తానామా వ్రాయించుండి.

గంగ—సరే (అని వ్రాసి వ్రాలు చేయించును)

మను—డబ్బు మద్రాల కోర్టుకు పట్టుకొని వస్తానండి. ఈ కాయితాలుచ్చుకోండి.

గంగ—(కాగితములు పుచ్చుకొని) తప్పకుండారా ? మాకు చాలా డబ్బువస్తుందని ఓర్వలేక కొందరునీతో యేవైనా అబద్ధాలు చెప్పగలరు. అవినమ్మకు. కోర్టులోయెవరితోనుమాటలాడకు. కోర్టుకు వచ్చుటకంటె సాయంకాలము యిక్కడికేరా? అక్కడ నీతోమాట్లా డుటకు తీరికయుండదు. ఊపిరి సలుపకుండా మాకు పనియుంటుంది.

మను—ఎక్కడికో అక్కడికొస్తాను (అని వెళ్ళును.)

రాజా—(లోపలినుండివచ్చి) ఏమంటారో గంగరాజుగారూ! మాకు పెద్దదాబు చేశారే. మీకుసమయస్ఫూర్తి చాలాయుండండి. శేష గిరిరావుగారు యీయుహూళ్లోనే లేరని చెప్పివేశారు. మనమిల్లా చెప్పినామని తెలిస్తే చిక్కువస్తా యేమోనుమండీ,

గంగ—చిక్కులు లేవు గిక్కులు లేవు. తమరూరుకోండుస్వా. ఇంతమాత్రమునేను సర్దుకోగలను ప్రస్తుతము నేను సెలవుపుచ్చుకొని వెళ్ళుచున్నాను.

(అని ఇద్దరు నిష్క్రమింతురు.)

—*—

నాల్గవరంగము

రాజమహేంద్రవరము బజారువీధి.

(అప్పుడు వెంకటస్వామియను రయితు ప్రవేశించుచున్నాడు.)

వెంక—అయ్యా! రాఘవరావునాయుడుగారిల్లెక్కడండీ!

మార్గస్థుడు—నాకు తెలియదు.

గంగ—ఎందుకు రాఘవరావు నాయుడుగారిల్లు? నీకేదైనా కేసున్నదావిమిటి?

వెంక—చిత్తం, మాదో అపీలుందండి దాకలు చెయ్యాలండి.

గంగ—ఆయనదగ్గరకు నిన్నెవరుపంపించారు. జాబులంపిన వాడు నాకన్న తెలివైనవాడులాగున్నాడు.

వెం—(తెల్లబోయి) ఏమండిబాబు అల్లా సెలవిస్తూన్నారు.

గంగ—నాకెందుకులే నీ కర్మంనీది (అని నడచును)

వెంక — (వాని వెనుక వెళ్ళి) పంతులుగారు అందేంటో సెలవియ్యండయ్యా !

గంగ — నే సెలవియ్యనక్కర లేదు. ఆయనకు కేసిచ్చిన తరువాత నీకే తెలుస్తుంది. నీవు బుద్ధిపూర్వకముగా గంగలో దిగుతానంటుంటే నేనువద్దనడ మెందుకు.

వెంక-బతిమాలుకుంటూన్నా గాదండి బాబూ. అదేమిటో చెప్పండి ?

గంగ-నీవు వట్టి వెట్టిమాలోకమని తెలిసి యుండికూడా క్రింది కోర్టుప్లీడ రీయనదగ్గర కెల్లా పంపినాడయ్యా ! పార్టీల క్షేమంచూచే ప్లీడర్లు దొరకడం కష్టమండీ !

వెంక — నామనవి చిత్తగించి అదేమిటో సెలవియ్యండి !

గంగ సెలవియ్యడాని కేముంది. ఆయనకు వకాల్తానామా యిస్తే నీ కేసు భగ్గంపాడు ఆయన లాజే దీజె వేసుకొని గుఱ్ఱబ్బండెక్కి వస్నెల విసనకర్రలాగు కోర్టుకు వెళ్ళడమే కాని కేసుచదవడు చదివితే అర్థంకాదు. పయిగాజడ్జీగారు అస్తమానం ఆయనను కస్సుబుస్సూమని కసిరి-చీవాట్లు పెట్టుతూ నేయుంటారు. అయనమాట ఒకటీ సబబుగానుండదు. లా అసలేరాదు. నట్టిగొడ్డుకు అర్పులన్నట్టు పెద్ద గొంతుకమాత్రమున్నది.

వెంక — అలాగాండి బాబు యింతమాల గొడవుందని మాకేం తెలుస్తూందండి. మంచివాడని చెప్పి ఆయనయెల్లమంటే కాబోసునను కొని చెప్పినచ్చాము. నారోజు బాగుందిగనుక బగమంతుడులాగ మీరగపడ్డారు మీ రెరిగిన పీడ రెవరైనా యుంటే నన్నాయన దగ్గరకు తీసికొని వెళ్ళండి.

గంగ — అదిగో బాగుపడేదారికి వచ్చినావు పదవెడదాము !

(అని వెళ్ళుదురు.)

— * —

ఐదవరంగము

(జిల్లాకోర్టులో ప్లీడర్ల గది.)

(అప్పుడు కుర్చీలమీద కూర్చుండి హనుమంత రావుగారు, భాస్కరరావుగారు, గోపాలంగారు, రాజారావుగారు, రంగారావుగారు, శేషగిరిరావుగారు, మఱికొందఱు ప్రవేశించుచున్నారు.) వసారాలో కొందరు పార్టీలు నిలిచియున్నారు.

హను—భాస్కరరావుగారూ; నిన్న మునసబుకోర్టులో మీ వ్యాజ్య మేమైనది.

భాస్క—ఏమైనదని చెప్పనండి మునసబుగారికి ఫలహారమైన తరువాత కొంచెము డోజు అలవాటుగదా, మూకేసు అందులోబడి భగ్గంపాడైనది. నేను వాదించినంతసేపు. ఆయన జోగుచునే యున్నారు.

గోపా—మీ కేసు పోవడానికది రీజను కాదంటోయి. రెండవ ప్రక్కను గాని కొంచెము హిరణ్యశ్రార్ధం తగిలినట్టు కనపడుచున్నది ధోరణచూస్తే అల్లాగున్నది.

రాజా నో. నో. సార్. నే నామాట వప్పుకోను, మన మునసబుగారివద్ద, అట్టి దుర్గుణం లేదు. ఏమండీ వేషగిరిరావుగారూ మీ రెప్పుడైనా విన్నారండి యిటువంటిమాట.

శేష—నా జోలికి రాకండి నన్నేమి అడగవద్దు.

రంగా—రాజారావుగారూ ? మునసబుగారి గుణాలు మీ గుణాలు వకటే గనుక మీ కాయనయందు మిక్కిలి యభిమానముండి.

రాజా—(కోపముతో) డోన్ టాక్ నాన్సెన్సు. అటువంటి నీచపుగుణములు మాయింట్లో కుక్కకయినా లేవు. ప్రాక్టీసువచ్చినా రాకపోయినా సరేగాని నేనటువంటివాటికి వడబడేవాడను కాను,

నేను ప్రిన్సిపిల్సు కోసము కేరుచేసేవాడనుకాని డబ్బుకోసము కేరు చేసే వాడనుకాను.

రంగా—అబ్బో ఇన్ని ప్రిన్సిపిల్సు మీదగ్గరున్నాయన్నమాట నే నిదివఱ కెప్పుడు నెఱుఁగనే మీ ప్రిన్సిపల్సును గురించి అమలాపురమునుంచి నాకు జాబువచ్చి మూడురోజు లయినది. పోనీ యెందు కెందుకని. ఊరుకుంటూన్నాను. ఇదిగో ఉత్తరం. జేబులోనేయుంది.

శేష—అదేమిటండోయి. ఆ యుత్తరమేమిటి.

రంగ—అమలాపురంనుండి గంగాధరరావు వ్రాసినాడండీ. హనుమంతరావుగారూ! యీ లెటరు మీరు చదివి వినిపించండి.

హను—ఏదీ యీలాగియ్యండి (అని పుచ్చుకొని యీ క్రింది విధమున చదువును.)

"మైడియర్ రంగారావు! ఈమధ్య నేను అప్పీలు మీద్వారా దాఖలుచేయుమని మీవద్దకు ఒక క్లయింటును బంపినాను. వాడు మీ యిల్లెఱుఁగక మఱియొక ప్లీడరింటికివెళ్ళి రంగారావుగారి యిల్లెక్కడని యడుగగా, ఆ ప్లీడరు నేనే రంగారావును అని యబద్ధమాడి వానివద్ద వకాల్తనామా పుచ్చుకొన్నాడట. రంగారావుగారికి బుగ్గమీసాలుండవలె మీకు లేవేమని వాడు ఆ ప్లీడరును అడుగగా వేసవికాలం చిరాకుచేత తీసివేయించుకొన్నానని ఆయన చెప్పినారట. ఇది మిక్కిలి ఘోరకలిగా నున్నది. యిటువంటి ప్రబుద్ధుడు రాజాశ్రావేయై యుండవలెను. గాని మఱియొకడు కాడని తోచుచున్నది. అయినను దరియాప్తు చేయవలెను.

అమలాపురం,
15-8-1912,

చిత్తగించవలెను.
గంగాధరరావు.

రంగా—చిత్తగించినారా ప్రిన్సిపల్సు.

రాజా—ఈ యుత్తరం కేవలము అబద్ధము. కవరుమీద పైపేరు నాదేయున్నది.

భాస్క—ఆవేళ ఆ మనిషి ఆకవరు తీసికొని ముందు మా యింటికివచ్చి రంగారావుగారి యిల్లెక్కడ అని అడిగినాడండీ! పై కవరు మీద రంగారావుగారిపేరేయున్నది.

రాజా—పేరింగ్లీషుతో నున్నది. జీ అనే అక్షరమునకు జె అనే అక్షరమునకు భేదము తెలియుటలేదు. అందుచేత నాదే అనుకున్నాను.

భాస్క—(నవ్వుచు) పేరు స్పష్టముగా తెనుగుతో రంగారావుగారికి అని యున్నది. ఇంగ్లీషులో లేదు.

రాజా—మీరందరు కట్టుగట్టి నన్నల్లరి చెయ్యాలని యీలాగంటే నేనేమిచెప్పను.

రంగా ఊరందరూ మీ మీద కట్టుగట్టుటకు కారణమేమి? మీ ప్రిన్సిపల్సు మంచివిగనుక మీ మీదందఱికి కోపముకాబోలు. బియేబియల్ ప్యాసై యిటువంటి అవకతవక పనులు చేసినందుకు సిగ్గుపడి తల వంచుకొనక మీాదు మిక్కిలి యెగురుతావెందుకయ్యా!

భాస్క—ప్లీడరీలో ప్రవేశించిన తరువాత కొద్దో గొప్పో మాలకూటిపనులు మేము చేయుచున్నాము కాని యింత ఘోరకలి కూడదు.

హను—రంగారావుగారూ. ఏదో పొరపాటు జరిగినది పోనియ్యండి. ఊరుకోండీ.

రంగా—నే నూరుకోదలచుకొన్నానండి. ప్రిన్సిపల్సు ప్రిన్సిపల్సు అని సొఱకాయకోతలు కోస్తూంటే యుత్తరము బయలు పెట్టినాను.

[అప్పుడు వసారాలోనున్న మనుష్యులలో నొకడు
శేషగిరిరావుగారిదగ్గరకు వచ్చును.]

మను—సేసగిరిరావుగారు మీారేనాండి.

శేష—ఆ నేనే యెందుకు?

మను—తమరీ యూళ్ళో పీడరీ చేస్తూన్నారాండీ.

శేష చెయ్యకేమి, ఎవరైనా లేదని చెప్పినారాయేమిటి నీతో;

రాజా —(లేచి వెళ్ళిపోవును.)

శేష—రాజారావుగారూ వెడతారేమి కూర్చోండి. ఈమనుష్యుడు చిత్రకథ చెప్పుచున్నాడు వినండి.

రాజా —(ఆమాట వినిపించుకొనకుండ వెళ్ళిపోవును)

మను—మీా కీయూళ్ళో డబ్బు రావడంలేదనిన్ని యింటి అద్దైనా గిట్టకపోవడంచేత యే యూళ్ళో వెళ్ళిపోయినారనిన్ని ఎవరో పీడరుగుమాస్తా చెప్పాడండి,

శేష—ఎవరో ఆయనపే రెఱుగుదువా!

మను—పే రెఱుగనండి. నల్లంగా బక్కపల్చగా పొడుగ్గా యుంటాడండీ.

హను—అయితే రాజారావుగారి గుమాస్తా గంగరాజుగారే.

భాస్క—ఇంత ప్రబుద్ధుడు మరెవ్వరు కనబడరు.

రంగా—అందుచేతనే రాజారావుగారంత తొందరగా వెళ్ళుచున్నారు.

శేష—అప్పుడు ప్లీడరుగారు కూడా సావిట్లో నున్నారా?

మను—సావిట్లో లేరు లోపలున్నారండి.

శేష—హనుమంతరావుగారూ మనమీా యూళ్ళోయిక ప్లీడరీ చేయలేమండీ పడవలపోటీలాగున వచ్చింది.

హను—నిజమేనండి మరియొక చిత్రము చెప్పుతానువినండి. ఈమధ్య గ్రామమునసబు నాతో చెప్పినాడు. మనప్రబుద్ధులలో ఒక రతని దగ్గరకు వెళ్ళి తనకు సాలుకు మూడువేలు వచ్చేటట్టుగా యినక్రంటాక్సు కట్టమని బ్రతిమాలినాడట.

భాస్క—అబద్ధమేమోనండీ పన్నుకట్టమని బ్రతిమాలేవా రుంటారా ?

శేష—ఉండ కేమండోయి తనుసాలుకు మూడువేలువస్తూన్న వని డాబుగా చెప్పుకొనుటకై ఆ పనిని చేసియుంటాడు. మనలో యెంతెంత మహాత్ములైనా యున్నారు. ఇట్టివారున్నారు, అట్టివారు లేరని అనుకోవలసిన పనిలేదు.

హను—అదిగో జడ్జీగారు వచ్చినారండోయి వెళుదామురండి

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

—*—

విజ్ఞాపనము

నేను మునిసిపల్ కమీషనరుపనికి దరఖాస్తుచేయఁ దలఁచు కొన్నాను. కాఁబట్టి వోటర్లందఱు నీక్రింది విజ్ఞాపనమును శ్రద్ధతో జదివి తమవోట్లు విధిగా నాకిచ్చి యితరులచేత నిప్పించి తమ యర్హ కృత్యములను చక్కగా నెరవేర్చుకొందురుగాక యని కోరుచున్నాను.

నన్ను మీవార్డుకు కమీషనరుగా నేర్పరచుకున్న పక్షమున యీ యెలక్షను సమయములో నేతప్ప కుటీయెన్నడు మీ వార్డులోకి నేను రాను అని ఒట్టుపెట్టుకొని చెప్పచున్నాను. మీరందఱు పెం డ్లాము బిడ్డలతో గాఁపురము చేయుచున్నారుగదా మీ కెన్నో యిబ్బఁ

దులుండవచ్చును. నన్నేర్పరచుకొన్న పక్షమున మీ కేయిబ్బంది లేకుండ పనిచేసెదను. ఎట్లనఁగా మీ యిండ్లలోనుండి మురికినీళ్ళు రాత్రిగాని పగలుగాని యెన్నిసారులు వీధిలోనికి వచ్చినను మీకు ప్రాసిక్యూషను అన్నమాట లేకుండా చేసెదను. మీ రెప్పుడైనా మునిసిపల్ స్థలము కలుపుకోవలసిన అవసరము వచ్చినప్పుడు నేను మీ పక్షముననేయుండి రాత్రికి రాత్రి ఆ స్థలము మీకు కలిపి గోడ కట్టించి తక్కిన మునిసిపల్ కమీషనర్లు యేదైనా తగాదా చేసిన పక్షమున నేను మీతోకలిసి ''యీగోడ వీరిదే 25 సంవత్సరముల నుండి నేనెరుఁగుదును.'' అని గట్టిగా వాదముచేసి నాప్రజ్ఞయంతయు వినియోగించి ఆస్థలము మీకుదక్కునట్లు జేసెదను. ఒకవేళ నేనెన్ని ప్రయత్నములుచేసినను ఆ స్థలము మునిసిపల్ వారు మీ కియ్యనిపక్షమున నేను మీచేత మునిసిపల్ వారిమీద వ్యాజ్యములు తెప్పించి నేను మీ తరఫున సాక్ష్యమిచ్చెదను. క్రొత్తగా అరుగులు వేసుకోదలచినవారికి అరుగులు వేయించెదను. చూరులు పెంచుకోదలచిన వారికి తప్పకుండా శాంక్షనుయిప్పించెదను. ఘాటీపాకలు మొదలయినవి వేలము వేయునపుడు నా పక్షమున నున్నవారికి తక్కువపాటకు కొట్టివేయుటకై నా యావత్తుశక్తి వినియోగించి నేను కొట్టివేయించెదను. మునిసిపల్ రోడ్డుకంట్రాక్టర్లు మొదలగువారందఱునా తరఫున యీమెలెక్షనులో తప్పకపనిచేయవలయునని కోరుచున్నాను. నాకు వారీయుపకారము చేసినయెడల వారికిగూడ సాధ్యమయినంత యుపకారము చేసెదను. నేను వారికిజేసెడు యుపకారమేమనగా కంట్రాక్టర్లు రోడ్డుమీద యెంత పనికిమాలిన కంకర తెచ్చిపోసినను అది మొదటిరకం కంకరని వాదించి చెల్లునట్లు చేసెదను. రోడ్డువేయుటకెంతకాల మాలస్యముచేసినను అతని కేవిధమైన యిబ్బంది రానియ్యను. సరిగా డ్యూటీచేయుచున్నామని ప్రతిదినము రెండుసారులు

వార్డులోనికి వెళ్ళి విజ్ఞప్తిగునట్టి తెలివితక్కువ కౌన్సిలర్లు కొందఱువోట్లు బాగు లేవని మెమోలు వగయిరాలు పెట్టినప్పుడు నాబుద్ధియంతయు నే నుపయోగించి కౌన్సిలర్లను తప్పుదారిని బెట్టి వాళ్ళమాట చెల్లకుండ జేసెదను. నేను చేసిన యుపకారములకు వోటర్లుగాని కంట్రాక్టర్లుగాని తక్కిన వార్డులలోనుండు జనులుగాని సంతోషించి నాకు యిటుక, సున్నము లేక రొక్కము బహుమానముగా నియ్యదలచిన పక్షమున కొందఱు అవకతవక కౌన్సిలర్ల వలె "నాకు లంచమిస్తావా నేను లంచము పుచ్చుకుంటానా" అని బడాయిమాటల చెప్పక తెగనీలుగక వోటర్ల మనస్సులకు సంతోషము కలిగించుటకై వారు తెచ్చిన బహుమానమును శిరసావహించి నేను పుచ్చుకొందును. ఈపైన జెప్పిన యుపకారములేగాక యింకను కౌన్సిలర్లు వోటర్లకు చేయదగిన యుపకారము లెన్నో యున్నవి. ఆ రహస్యములన్నియు నిక్కడ వ్రాయుటకు వీలు లేదు. ఏవిధముచేత వోటర్లుగ నుండుటకు వీలు లేనివారు, వోటర్లు కాదలచినపక్షమున యేదోయొక యుపాయము పన్ని వారిపేర్లు జాబితాలో పడునట్లు నేను ప్రయత్నము జేసెదను. అట్లు వారిపేర్లు పడినతరువాత వారివోట్లు తప్పక నాకే యివ్వవలయును. నాకు వోట్లియ్యదలచినవారు సరే మీచిత్తము తప్పక మీకే యిస్తాము అని చెప్పినంతమాత్రముచేత చాలదు నాకియ్యదలచిన వారు నాచేతిలో చెయి వెయ్యవలయును. రామాయణము భారతము నెత్తిమీద బెట్టుకొని ప్రమాణము జేయవలయును. బ్రాహ్మణులు కోమట్లు మొదలగువారు గాయత్రిసాక్షియని జందెముమీద ఒట్టు బెట్టుకొనవలెను. పిల్లల తలకాయలమీద చేయిపెట్టి ప్రమాణము జేయవలయును. అన్నము తినుచున్నప్పుడు మావద్దకు వోట్లడుగుటకు వచ్చితినా, అప్పుడన్నముమీద ప్రమాణము చేయవలెను. ఇట్లు చేయకపోయినపక్షమున మీమీద నాకెంతమాత్రమును నమ్మకముం

డదు. ఇట్లుచేయునివారు నాకు వోట్లు ఇయ్యలేదనియే నేను తలంచెదను. ఎంతరహస్యముగా వోట్లు వేసినప్పటికి ఎవరు యెవరికి వోట్టిచ్చినారో తెలిసికొనుటకు నాదగ్గర అద్భుతమైన శక్తియున్నది. కాబట్టి అది తెలిసికొని నేనే కౌన్సిలరునైన పక్షమున వారిపాట్లు వారికి బెట్టెదను. ఇంక నాకు వ్యతిరేకముగా వచ్చి కౌన్సిలరుపనికి ప్రయత్నము చేయునట్టి వారిసంగతి కొంత చెప్పెద వినండి నా ప్రతిపక్షులందఱు దుర్మార్గులు. నీతిమంతులమని వారు పైకివిఱ్ఱవీగుచుందురేకాని వారు నిజముగా జనులకు ఘాతకులు, ఉపకారశూన్యులు, ఆ పక్షమువారెవరైనను కౌన్సిలర్లుగా వచ్చినపక్షమున మీకర్మము కాలినదన్నమాటే. ఏమనగా వీధులు శుభ్రముగా నుండవలెనని పిచ్చివారలవలె కేకవేయుచు ప్రతిదినము వార్డులలో రెండుమూడుసార్లుతిరిగిమీతూములలోనుండి యొక్క నీళ్ళచుక్కయైనా వీధులోనికి రానియ్యరు. ఒక్కజానెడు స్థలము కలుపుకొనుటకు వీలులేదు. ఒక్క అరుగు సెంచుకొడుటకు వీలులేదు. మాకు వోట్లిచ్చినవారిలో బీదవారికి మేము లంచముక్రిందగాక వాళ్ళపేదసంసారములుచూచి జాలిపడి నాలుగుమూడు రూపాయ లిచ్చుచుందుము. మా ప్రతిపక్షులు, శూన్యహస్తులు శుష్కప్రియాలు గలవారు గావున నొక్కదమ్మిడీగవ్వలెన్నడు నీయరు. మీదుమిక్కిలి మావంటి సధర్ములెవరైనను పేదవారి కిటువంటి దానములు చేసినప్పుడు అవి యాగీచేసి లంచము లిచ్చుచున్నారు లంచములిచ్చుచున్నారని అడ్డమైన కారుకూతలు కూయుదురు. కాబట్టి పైసంగతులన్ని మీమనస్సులో చక్కగా ఆలోచించుకొని మనుష్యుల కుపకారమును చేయుటకు కంకణముకట్టుకొన్న మా పక్షమువారినే నమ్ముకొని నాకు మీవోట్లు ఇయ్యవలసినదని యిందు మూలముగా మఱిమఱి గోరుచున్నాను. చిత్తగించవలెను.

1937 సం॥ మార్చినెల 33 తేది } ఇట్లు మీవిధేయుడు
రాహువారం భగ్గేశ్వరం } జంబుకేశ్వరరావు.

తోకచుక్క మహిమలు

తోకచుక్కలవలన గలిగిన మహాద్భుతములు వర్ణించుటకు వీలుగానన్ని యున్నవి. ఇవి ప్రపంచమంతటను గలవు కాని మన ప్రాంతములయందు జరిగిన యద్భుతములను గొన్నింటి నీక్రింద యుదహరించుచున్నాము. లోకమందు జరిగిన చిత్రములన్నింటిని బ్రకటించుట యెవరికితరముగాదు కావున స్థాలీపులాకన్యాయముగా గొన్నిటిని మాత్రమే ప్రకటింపవలసివచ్చినది.

—: చిత్రములు :—

అప్రయోజకులైన పెండ్లికొడుకులుగూడ 116 రూపాయలు వరదక్షిణ అడుగుట. బహిరంగముగా వైభవముతో జరుగవలసిన వివాహములు రహస్యముగ జరుగుట. గ్రామములోనున్న ముఖ్య వర్ణములవారిలో నొకరికొకరికి కొందఱుబుద్ధిమంతులు వివాదపెట్టుట. ఆమాటలనమ్మి ఆవర్ణములవారు ఆరనివైరములు పెట్టికొనుట. మునిసిపల్ చెయిర్మనులకు, చెల్లవలసినవోట్లు చెల్లకుండ జేయవలయునను బుద్ధిగలుగుట, కొన్నికచ్చేరీలలో జనులిచ్చుకొన్న అర్జీలు మొదలైన కాగితములు రికార్డులు కావలసివచ్చినప్పుడు కనబడకపోవుట, వోటర్లుగా నుండదగినవారిపేర్లు జాబితాలలో లోపించుట, ఏవిధముచేత ఓటర్లు కాగూడనివారిపేరులు వాటిలో నగుపడుట, నాలుగేండ్లక్రిందట చచ్చిపోయినవారు క్రొత్తగా ఈసంవత్సరము ఓటర్లగుట, ఒకవార్డులో ఓటర్లుగా నుండదగినవారు మఱియొకవార్డులోని కెగిసిపోవుట, లంచములు పుచ్చుకొనునట్టి వారిమీదనే ప్రజలకు మిక్కిలి ప్రీతియు న్యాయవర్తనముగలవారిమీద తక్కువప్రీతియు గలుగుట, ఉద్యోగస్థులు రాత్రి జాముప్రొద్దుపోవువఱకు కచ్చేరీలుచేసి ప్లీడర్లను పార్టీలను బాధపెట్టుట, మునిసిపల్ యెన్నుబడిలో వోట్లువేయకుండా

వేసినట్లునటించి వోటుకాగితము జేబులోపెట్టుకొని పారిపోయిన వారికి యేవిధమైన భంగపాటు రాకపోవుట, బహిరంగముగ కలహమాడు కొని పాదరక్షప్రయోగములుచేసికొన్న వారు ఆప్యాయనముగనొకరి నొకరు కౌగలించుకొని ప్రాణస్నేహితులగుట, స్థలవిశాలము లేక దొడ్లలోనుండి నీళ్ళు వీథిలోనికి తూములదారిని విధిలేక విడిచిపెట్టి నందున గృహస్థులను చార్జిచేసి అరుగులకు అరుగులువేసి స్థలము కలుపుకొన్న వారిని వదిలివేయుట

— కారణములు —

ఈ విచిత్రములు పొడగట్టుటకు కారణము లేమనియడుగగా, అనేకులనేకవిధముల చెప్పినారు. జ్యోతిశ్శాస్త్రవేత్తలమని చెప్పుకొను చున్న సిద్ధాంతులు కొందరు విపరీతమైన హేతువులను చెప్పినారు. ఆ హేతువులు నమ్మతగియుండనందున అవి యిక్కడ వివరింప మానితిమి. మాయూరిలో పుట్టు వెంట్రుకలు దీయుటకు పునస్సంధానములు చేయుటకు మఱియు యితర చిన్న చిన్న శుభకార్యములకు ముహూర్తములు పెట్టుటలో అసమాన పండిత శిఖామణి యని బిరుదుపొందిన భాస్కరసిద్ధాంతిభట్టాచార్యులవారు, ఆయనదగ్గరనున్న పంచాంగపు కట్టలన్నియు తిరుగవేసి బోర్లవేసి పైకి క్రిందికి యెగాదిగా జూచి వేళ్ళుమణచి లెక్కపెట్టి నోరుమెదిపి కొంచెమాలోచించి యీక్రింది కారణము సెలవిచ్చినారు. తోకచుక్క యీ సంవత్సరము మునిసిపల్ ఆఫీసులమీదుగా వెళ్ళినది. వోటర్ల జాబితాలు వోట్లువేసే పెట్టెలుతోకచుక్కయొక్క తోకచివరలోబడినవి. కనబడకపోయిన వోటర్ల పేర్లు తోకనంటుకొని పోయినవి. తోకచుక్కయొక్క తల వోటర్ల తలకాయలమీదుగా, అక్కడనుండి అయిమూలగాదిరిగి కొంత సేపు రోడ్డుమీద ప్రయాణముజేసి అక్కడినుండి క్రొత్తగా వేసిన గోదావరిగట్టుమీదకివెళ్ళి అక్కడనుంచి జారి తొలకరివానకు గోదావరిలో కొట్టుకొనిపోయినది. అందుచేత నిట్టి విడ్డూరములు కలిగినవి.

—

విచిత్రమైన మరణశాసనము

ఒక సన్న్యాసి ఈక్రింది మరణశాసనమును వ్రాయించెను. శ్రీమత్సకలలోక పూజితుడగు విశ్వేశ్వరస్వామివారికి నిలయమైన శ్రీకాశీనగరమున వర్తమాన వ్యవహారిక చాంద్రమానమున ప్రభవ నామసంవత్సర శ్రావణశుద్ధదశమీశనివారమునాడు పగలు మూడు జాములు దిరిగినతరువాత నాలుగవజాముయొక్క ప్రథమభాగమున భూమ్యాకాశంబులు సూర్యచంద్రులు సమస్తదేవతలు సాక్షులుగ, పూర్వాశ్రమమందు సచ్చిదానంద తర్కాలంకారునకు మూడవకుమారుడనై యీ సన్న్యాసాశ్రమమందు పరమహంసపరివ్రాజక పదవాక్య ప్రమాణ పారావారపారీణ బ్రహ్మానందభారతీవేదాంత తీర్థస్వాములవారని పూర్ణనామముగలిగి వేదాంతతీర్థులని లోకమందు వ్యవహరింపడుచు అరువదిమూడు సంవత్సరముల పదకొండు మాసముల యిరువైఆరుదినముల వయస్సుగల నేను, చిరకాలమనేక పుణ్యస్థలములు తిరిగి సంపాదించిన నాయాస్తినాకిష్టయిలేని యితరులచేతబడునను భయముచేతను నాయనంతరమందునాశిష్యులాయాస్తినిమిత్తము వివాదపడుదురను భయముచేతను నేనుసంపాదించిన యమూల్యవస్తువులు సద్వినియోగము కావలయునను తలంపుచేతను ప్రస్తుతము నా దేహారోగ్యము చక్కగానున్నప్పటికి శరీరములనిత్యములగుటచేత నెప్పుడేవిధముగా మరణమాగంతుకముగావచ్చునో మనము ముందు జాగ్రత్తపడుట మంచిదని మంచి యుద్దేశముతో సంపూర్ణవ్యక్తితో నిండుశాంతితో వైరాగ్యముతో ఈ మరణశాసనము వ్రాయించుచున్నాను. నాయనంతరమందు నాయాస్తి నేనీక్రింద నేర్పాటు చేసినప్రకారము జరుగవలయును. నేను జీవించియుంటినా నాయాస్తి యీమరణశాసనప్రకారము జరుగక నాస్వాధీనములోనే యుండవల

యును. వెనుక పరాభవసంవత్సర చైత్రమాసమున నేకాదశినాడు తెల్ల వారుజామున శిష్యసమేతముగా గండకీనదిలో నేను స్నానముచేయు చుండగా నాయదృష్టవశమున నాకుదొరకిన సువర్ణముఖి సాలగ్రామ ములు రెండింటిలోచిన్నది పూర్వాశ్రమమునందునామూడవ మేనత్త యొక్క సవతికుమారుడైన నారాయణశర్మకు మేనల్లుడైన గోవింద శర్మయొక్క రెండవయల్లుని తమ్ముడు కేశభట్టునకు చెందవలయును. ఆ రెండు సాలగ్రామములలో పెద్దది యీయాశ్రమమందు నాప్రియ శిష్యుడును బ్రహ్మజ్ఞానసంపన్నుడును లోకమందరు మెచ్చదగిన మహి మగలవాడును నగు శంకరానందమునకుఁ జెందవలయునేగాని మరి యెవ్వరికిని జెందఁగూడదు. వెనుక ప్రయాగలో గంగాయమున సంగమ ప్రదేశమందు ఒకనాడు మధ్యాహ్నము రెండుజాముల వేళ వేసవికాల ములో నేను నాశిష్యులుఁగలసి మఱ్ఱిచెట్టుక్రిందఁ గూర్చుండి కొబ్బరి చిప్పలతో నీళ్ళుత్రాగుచుండగా జూచి నాయం దపరిమితభక్తిగల వాడై యొక కుమ్మరి వెంటనే గ్రామమునకుఁజని నాకుసమర్పించినట్టి దియు నాకు చిరకాలమునుండి చల్లనినీరు దాహము యిచ్చుచున్నట్టి దియు నాహస్తమునకలంకారమైనట్టిదియు మూడుసారులు నాచేతిలో నుండి నేలబడినను పగిలిపోకయుండినదియునగు మట్టికమండలము క్రొత్తగా నావలన నుపదేశముపొంది యీనడుమ నేసన్యసించి నాశాటి ఉదికి యారవేయుచు రాత్రులు నాపాదము లొత్తి నాకుపచారము చేయుచు నన్నే దైవమని నమ్ముకున్న బాలభారతికి చెందవలయును. నాకు బ్రహ్మవిద్యోపదేశము చేసిన పరమగురువులు యోగానందపర బ్రహ్మస్వాములవారు పుత్రవాత్సల్యముచేత శిష్యులందరికంటెను నన్ను న్నెక్కువ గారవించి నన్ననుగ్రహించి నాకుదయచేసినదియు బదరికావన మందు పూర్వమాయనకు గంగుడను చెంచువానిచేత నీయబడినదియు నాకు ముప్పదిసంవత్సరములనుండి కూర్చుండుటకు పీటయై పండుకొ నుటకు పాన్పై చలికాలమందు కప్పుకొనుటకు దుప్పటిఅయి

విచిత్రమైన మరణశాసనము

యెన్నో విధముల నుపచరించినదియు ప్రాతదగుటచేత నక్కడక్క నాలుగైదు చిన్నచిన్న బొత్తులుగలదియు ఒకనాడు చలిమంట కాగుచుండగా కొంచెము చివర యంటుకొనుటచేత కాలినయాన వాలుగలిగి నదియునగు కృష్ణాజినము, గయలో నేనున్న కాలమున నాశరీరములో మిక్కిలి జబ్బుచేయగా నాకుమిక్కిలి భక్తిశ్రద్ధలతో మందులిప్పించి పథ్యపానములు సమకూర్చి సకలోపచారములు జేసిన వామనశర్మయను బ్రాహ్మణుడు బ్రతికియున్నపక్షమున ఆయన కీయవలయును ఆయన జీవించియుండనిపక్షమున ఆయన కూమారుని గాని లేక ఆయన సంతతివారికిగాని చెందవలసినదేగాని యన్యాక్రాంతము గాగూడదు. నాశిష్యులందరు పరస్పరమైత్రిగలిగి కాశీలో కరతలభిక్షులచేత జీవింపవలయును. నేను సిద్ధిపొందిన యనంతరమున నాకళేబరమునునాలుగు కుండలుగట్టి పడవమీదబెట్టి గంగాప్రవాహామయొక్క మధ్యకుదీసి కొనిపోయి యక్కడ యేటిలో ముంచి వదిలివేయవలయును. పైనుదహరించిన నాయాస్థి నాశిష్యులకు సమానముగా నిర్వివాదముగానిష్పక్షపాతముగా బంచిపెట్టుటకు విశ్వేశ్వర స్వామివారి యాలయములో తపస్సుచేసికొనుచున్న విరూపాక్షస్వాములవారును మణికర్ణికాక్షేత్రమున దిగంబరుడై మౌనదీక్షపట్టిన కపాలకుండల స్వాములవారును దశాశ్వమేథ ఘట్టమందు యేకపాదముమీద నిలచి ఊర్ధ్వబాహుడై పంచాగ్నిమధ్యమందు తపస్సు చేయుచున్న చండీనందనస్వాములవారును ధర్మకర్తలై యుండవలయును. ఇట్లునాయిష్టప్రకారము నాయాస్తివారు పంచిపెట్టకపోయినను నాశిష్యులనుభవించకపోయినను వారందరు దేవాలయములేని యూరిలోనున్నవారు రజస్వలయైనపిదప కూతురికి వివాహాముచేసినవారు గోమయము నిందించినవారు పాండురోగిని జూచినవారు పోయిననరకమునకుబోదురు. ఇదినాసమ్మతిని వ్రాయించిన మరణశాసనము.

వేదాంత తీర్థస్వామివ్రాలు,

—*—

పెండ్లికొడుకుల ధరలు

ఆడపిల్లలను గనుటచేత దూరదృష్టవంతులని చెప్పదగిన కొందఱు పెద్దమనుష్యులు తమ సూతులకు సంబంధము కుదర్చవలసినదని మమ్ము తరుచుగా నడుగుచుండుటచేతను మాకప్పుడప్పుడు జాబులు వ్రాయుచుండుటచేతను వారికందఱకు స్పష్టముగా దెలియునిమిత్తము మాకు దెలిసిన వివాహసంబంధములీక్రింద సవిస్తరముగా వ్రాయుచున్నాము. ఈసంబంధములు చేసికోదలచినవారు పురోహితులను బంపి ప్రధానములు చేసికొనవచ్చును తగవుల తారకబ్రహ్మంగారి కుమారుడు విశ్వనాథము. ఈయనకు వయస్సు పదునెనిమిది సంవత్సరములు ఈయన క్రిందటి సంవత్సరము అయిదవఫారముపరీక్ష తప్పిపోయినాడు. పిల్లవాడు బక్కపలచగా నల్లగా నుండును. మీఁది పళ్ళు కొంచెమెత్తుగా నుండును. చిన్నతనమందు బొలపాపచిన్నెలాగా, అప్పుడు కాల్చినమచ్చ అగరుబొట్టువలె మొగముమీఁద గనబడుచుండును. ఈపిల్లవానికి రు 1116 లు కట్నము కావలయును. వియ్యపురాలి లాంచనములక్రింద రెండువందల రూపాయలిచ్చివేయవలెను. వెండిచెంబు వెండిపళ్ళెరము బెట్టి కాళ్ళు కడగవలెను. నాగవల్లినాడు పెండ్లికొడుకునకు బరంపురం పట్టుపంచలియ్యవలెను. పెండ్లివారితో వచ్చినవారికందఱకు బట్టలు పెట్టవలెను. కట్నముసొమ్ము సుముహూర్తమునకు బయలుదేఱి రాకమునుపే పెండ్లికుమారుని తండ్రికి చేరవలెను. ఆసొమ్ములో నొక రూపాయ తక్కువైనను మంగళసూత్రము మాత్రము ముడివడదు.

పెండ్లికుమారునికున్న ఆస్తి.

యేలూరితాలూకా చింతలపూడి డివిజన్‌లో చిన్నతిరుపతి కవతల శ్రేష్ఠమైన భూమి యిరవై యెకరములు కలదు.

2 తెగనీలుగుల దేవయ్యగారు ఈయనకుమారుడు భద్రయ్య. ఈ పెండ్లికుమారునకిరువది సంవత్సరము లున్నవి. ఈయన పెద్దభార్య కుమారుడు ఈపిల్ల వానికిద్దరన్న దమ్ములు. దేవయ్యగారి రెండవ భార్యకు ప్రస్తుత మిద్దఱు కుమారులుగలరు. తండ్రిగారికి కరిణీకము. జీతమెని మిదిరూపాయలు వచ్చును. పైన రెండువందలరూపాయలుదొరకును నాలుగై దువందల రూపాయలు భూములమీదవచ్చును. దేవయ్యగారి పెద్దకుమార్తె పెండ్లికికొంచె మప్పు చేసిరి కాని ఆ యప్పు బాధించదు. ఎందుకనగా భూములు తనఖాయిచ్చినారు ఈపిల్లవానికి పదిహేను వందలరూపాయలు కట్నముగావలయును. నగలు వారికి తోచినన్ని వారు పెట్టుదురు. ఒకవేళ పెట్టకపోయినను బెండ్లికూతురు వారా మాట యెత్తగూడదు. వియ్యపురాలికి అయిదురోజులు అయిదు పె కాసులీయవలెను. ఆడబడుచుల కర కాసులీయవలెను, ఈ పెండ్లి వారికి మంగళహారతిపళ్ళెము మొదలైనవి మామూళ్లు లేవు. తాము ఆడ పెళ్ళివారిని యింటికి మనుగుడుపునకు వచ్చుటయేగాని, ఆడపెళ్ళి వారిని తమయింటికి మనుగుడుపునకు దీసికొనివెళ్లుట వీరికి సాంప్రదాయము లేదు. ఈపిల్ల వాడు నల్లగా లావుగా నుండును.

3 అవకతవక అచ్చయ్యగారి కుమారుడు పిచ్చయ్య. ఇతడు జువ్వలాగున పొడుగుగా నుండును. ఇతడు నాలుగవఫారము జదువు చున్నాడు. ఇతనికి పెండ్లికూతురు మిక్కిలి చక్కనిది కావలయును ఆపిల్ల చదువుకొన్నది కావలయును. ఊరక చదువుకొన్నంత మాత్ర మునసరిపడదు. సంగీతము రావలయును. ముందుగాబెండ్లికొడుకు పెండ్లి కూతురును చూచుటకు వచ్చును. ఆవచ్చినప్పుడు పెండ్లికూతురుఅతని యెదుట పుస్తకముచదువవలెను. కొన్ని పాటలుపాడవలెను. సిగ్గుపడ గూడదు. ఇతనికి కట్నము రొక్కపూర్వకముగా నక్కఱలేదు నాలుగెకరముల యీనాము వరదక్షిణక్రింద నీయవలెను. పెండ్లి

కౌమారుడుకొంచెము గిడసగానుండును. పెండ్లి తిరుపతిలోనే చేయవలెను. కన్యాప్రదాత పెండ్లికొడుకువారికి రానుపోను ఖర్చు లీయవలెను. వీరికి గృహప్రవేశము సదస్యము మొదలయినవి ఆనవాయితిలులేవు. శ్రావణపట్టీలు తెచ్చుట సాంప్రదాయము లేదు. కన్యాప్రదానకాలమందు పిల్లకు బాలతొడుగుక్రింద రు 500 లు గాని అంతకిమ్మతుగల వస్తువుగానియిచ్చి వేయవలెను. పెండ్లికుమారునకు మంచి యాస్తిగలదు. బెండమూరులంకలో య 25 ల యీనాము కలదు. హుకుంపేట ఆవలో య 30 లు కలదు. ఇదిగాక, యీయన మాతామహుని యనంతరమున యెనిమిది యకరముల భూమి కలియును. పినతండ్రిగారికి పిల్లలు లేకపోవుటచేత ఆయన ఆస్తియంతయు నీయనకే వచ్చును. ఇదిగాక యీయన అమ్మమ్మవద్ద చాల డబ్బున్నది. అదంతయు నీయనకే యిచ్చును. పెండ్లివారికి సన్నబియ్యము అన్నము వండించి కూరలు పిండివంటలు నేతితో చేయించవలెను.

4. ఆకెల అంబయ్యగారి రెండవకొడుకు గంగయ్య. ఈయనకు కట్నముక్కర లేదు. పిల్ల యెనిమిదేండ్ల దైననుసరే. మెట్రికులేషను క్లాసులో చదువుకొనుచున్నాడు. ఈయన బియల్ పరీక్షవరకు చదువుకొనుటకు మామగారు మధ్యవర్తులవద్ద నాలుగువేల రూపాయలు నిలువయుంచవలెను. పెండ్లికుమార్తెకు వేయిరూపాయలనగలు తండ్రియే పెట్టుకొనవలెను. ఉభయకర్చులు పెట్టి పెండ్లి జేయవలెను. పెండ్లివారికి ప్రయాణపు ఖర్చులలో నొకటిమాత్రమీయవలెను. భోగము మేళము తప్పక పెట్టవలెను. దానికర్చులు కన్యాప్రదాతయేయిచ్చుకొనవలెను.

5 కోతల గోపాలరావు. ఈయన బియల్ చదువుచున్నాడు. తండ్రి లేడు. ఈయనకుద్వితీయవివాహము, ఈయన రెండవతరగతి ప్లీడరీ

చేయుచున్నాడు. వయసు 30 ఈయన సంఘసంస్కర్తయగుటచే కట్నమడుగడుగాని తల్లిగారియొక్కయు, అన్నగారియొక్కయు బలవంతముచేత యెంతో అయిష్టంమీద విధిలేక కట్నము యిచ్చే వారి పిల్లనే చేసుకొందురు. కట్న మెంతయిచ్చినను పుచ్చుకొందురు గాని వేయిరూపాయలకు తక్కువ యీయగూడదు. ఈ సంబంధ మునుగూర్చి యేమి మాటలాడ దలచుకొన్నను పెండ్లికుమారుని అన్నగారితోనేగాని పెండ్లికుమారునితో మాటలాడగూడదు.

—*—

వోట్లకై తిరుగుట

[జంబుకేశ్వరరావుగారు, చిదంబరరావుగారు ప్రవేశించుచున్నారు]

జంబు—చిదంబరరావుగారూ! మనమిద్దఱమే వెళ్ళి వోట్లడుగుట బాగుండదు. వోటర్లకంటికి నదరుగానుండేటట్లు బిలబిలలాడుచు పదిమంది వెళ్ళవలెను. ఈవోటర్లసంగతి మీకు తెలియదు వీళ్ళు మాయలెఱుగనివాళ్ళు. మనము వీళ్ళను మాటలుచెప్పి టోపీవేసి వోట్లు సంపాదింపవలెను. ఈపరియాయము నాతో మీరుండి ఒడుపు లన్ని చూచి, ఇంకొకమాటు యెలెక్షనుకోసము మీరు ప్రయత్నము చేయండి. ఇదిగో ఈయిల్లు రామచంద్రయ్యగారిది. ఈయన పెద్ద బ్రాహ్మణుడు, లోపలకురండి. (అని లోపలికి వెళ్ళి) రామచంద్రయ్య గారూ (అని పిలుచును)

రామ—(వచ్చి) అయ్యా దయచేయండి. తమరు రావడం వల్ల నాగృహము పావనమైనది. ఏమిసెలవు.

జంబు—ఈమునిసిపల్ యెలెక్షనుగాదండివచ్చినది. కొందరు కుఱ్ఱవాళ్ళు నేను పాతవాడనగుటచేత పనికిరానని చెప్పుచున్నారు. పాతచింతకాయపచ్చడి, పాతయుసిరికాయపచ్చడి పథ్యమునకు పనికి వచ్చే యెంతో యుపకారముజేసినట్లే పాతవాళ్ళుకూడా చాలాపనికి వస్తారని వాళ్లెరుగరు.

రామ—సరి సరి యెంతమాట వాళ్ళకూతలకేమి. నేను తమ సెలవుప్రకారం నడచుకొంటాను

జంబు—సరేగాని మీపెద్దబ్బాయి యిప్పుడు ఏమిచేస్తూన్నాడండీ. పనిపాటలేమైనా నున్నవా?

రామ—ఏమీపనిలేదండి. అధికారుల అనుగ్రహంలేదు.

జంబు—అయ్యయ్యో! నాతో యెందుకు చెప్ప లేదండి! ఈమధ్య మూడుపనులు కాళీవచ్చినవి మనవాళ్ళెవరులేకపోవడం చేత ఆపనులు పైవాళ్ళకిప్పించినాను ఎంతపొరబాటు చేసినారండి. మీ వాడిసంగతి నాతో చెప్పవద్దూ ఇప్పుడైనామించిపోయినదిలేదు. ఒక గుమస్తాపని కాళీయున్నది. మీవాడిచేత తక్షణందరఖాస్తు పంపించండి నేను రేపుదయం చేర్మెనుగారివద్దకు వెళ్ళి మాట్లాడి మీకుఱ్ఱవానికి యిప్పిస్తాను. మావంటిపాతవాళ్ళున్నందువల్ల యివే లాభాలు. ఇప్పటివాళ్ళు మీమొగమేచూడరు దరఖాస్తు పెట్టించండి. మేము సెలవు పుచ్చుకుంటాము.

రామ—చిత్తము. మాపిల్లవాడు మీపిల్లవాడే.

జంబు—సందేహమేమీ (అని వీధిలోనికి వచ్చును.)

చిదం – (కొంతదూరమునడిచి) ఏమండి గుమాస్తాపనులు మునిసిపల్ ఆఫీసులో యేమీకాళీలేనట్లున్నాయి. వీరిపిల్లవానిని దరఖాస్తు పెట్టుమన్నారెందుకు.

జంబు—కాళీలేదన్నమాట నేనెఱుగనటయ్యా. ఎలెక్షనంటే యేమిటి? ఈలాటి గమ్మత్తులే. ఈయెలమీద యీబ్రాహ్మడు మనకు

తప్పకుండా వోటువేస్తాడు. ఎలెక్షనులయినదాక యీయాశ పెడతాను. ఆ తరువాత నాపరుగందుకోమంటాను.

చిదం——ఎలెక్షను చిత్రములు మిక్కిలియద్భుతముగానున్నవి మీరుసాక్షాత్తు కలిపురుషులంతవారండి.

జంబు——ఇవిమాయ కేరోజులు రండీ యిదిగో గంగరాజుగారి యింటికెడదాము. ఈయన పెద్దకోమటి.

గంగ——(ఎదురుగావచ్చి) దయచేయండి జంబుకేశ్వరరావుగారు ఎలక్షనుకోసమే వచ్చారాయేమిటి.

జంబు——మిమ్మలిని నేను వోటడగడానికి వస్తానా; మిమ్ము కూడా వోటడిగితే యింకనాయెలెక్షనెందుకు? సూర్యుడు పడమట పొడిచినా మీరునాకు వోటివ్వక మానరని నాకు తెలుసును. ఈ చిత్రంచూచినారండి తిరుమలరావుగారు నాకువ్యతిరేకముగా కౌన్సిలుకుపనికి దరఖాస్తుపెట్టినారు. ఆయనకు 10 వోట్లు వచ్చేను 11 ఓట్లు వచ్చేను అంతకన్న ఎక్కువరావు.

గంగ——అవునండి! ఆయన నెనరెఱుఁగుదురు? కాకపోయినా తమయిది తమసంగతి యెవరికి దెలియదు!

జంబు——తిరుమలరావుగారు ప్రతిచోటికివెళ్ళి మీకోమట్లను అడ్డమైనతిట్లుతిడుతూన్నారు. ఎందుకో తెలుసునా? మీరందరునాకు వోట్లిస్తున్నారని. అయితేనేమిలెండి యెక్కడకువెళ్ళితె అక్కడ నలుగురు చీచీఅంటున్నారు. అతనిమొగముచూచి వోట్లిచ్చేవారెవరండి? మీకువేరే నేచెప్పనక్కరలేదు. నన్నేర్పరచుకుంటే నేను మీవార్డులోనికిరాను అరుగులు పెంచుకోండి, చూరులు పెంచుకోండి; నేను చూడను కోరినయుపకారమల్లా చేస్తాను. వాళ్ళయితే కోతికికొబ్బరికాయదొరికినట్లు స్తమానం వార్డులో తిరుగుతూంటారు.

గంగ—అన్నీ నే నెరుగుదును. నేను తప్పకుండా తమకే యిస్తాను. అయితేవారొచ్చినపుడు కూడాసరే మీకేయిస్తాను. వెళ్ళండంటానుగాని, ఆమాటలుమీరు నమ్మవద్దు. ఏలాగైనా వోటు మీకివ్వడం ప్రధానంకదాండీ ఎన్నిమాటలైతే నెందుకు!

జంబు—సరే ఆలాగేచెప్పవచ్చును. వోటుమాత్రము నాకియ్యండి మేము వెళ్ళుతున్నాము (అని పోవును.)

గంగ—(కొంచెముసాగనంపి) చిత్తము నేను సెలవుపుచ్చుకుంటాను. మీరెవరెన్ని చెప్పినా మరొకలాగనుకోవద్దు (అని వెళ్ళును.)

చిదం — తిరుమలరావు కోమట్లనుతిడుతూన్నాడా యేమిటండి

జంబు తిట్టడంలేదు తిమ్మడంలేదు. ఈడాబుడాబితేనేగాని వీళ్ళకునసాళ్ఁఅంటె తిరుమలరావుగారిమీద కోపమురాదు. నీకు కీసాబాసా తెలియదు. ఈ చమత్కారాలన్నీ జరిగితేనేకాని యెలెక్షను కాదురంకీ. యీలాగునరండినాగరాజింటికివెళ్ళుదాము. ఈతడుకమ్మవాడు వీనికిప్రపంచవ్యవహారమే తెలియదు. (గుమ్మములోనికివెళ్ళి) నాగరాజూ,

నాగ — (వచ్చి) చిత్తం బాబయ్యా! ఏలినవారు దయచేశారెందుకండి?

జంబు—నీకువోటుంది. అది మాకివ్వాలి.

నాగ — చిత్తం. ముంచీబుగోరు యెల్లా పల్కమంటే ఆలాగు పలుకుతానండి తమచిత్తమెల్లాగో ఆలాగే చేస్తానండి.

జంబు —సరే మాకిస్తానని అవతలవారికిచ్చావంటే నీపని పడతాం ఎవరికిచ్చింది మాకు తప్పక తెలుస్తుంది. ఈకవర్లన్నిటిని కలక్టరుగారు విప్పిచూచి యెవరు యెవరికి వేశారో తెలియ జేయవలసినదని గ్రామమునసబుదగ్గరకు చేర్మెనుదగ్గరకు పంపుతారు. మొదట రహస్యంగా వేసినా చివర తెలియకపోవు. కాబట్టి కపడ్దార్,

నాగ—అయితే యీకవర్లు మళ్ళీ మీదగ్గర కొత్తాయండి.
అవతలవోరు మొన్నవొచ్చి కవరెవ్వరుచూడరు. కలక్టేరు కచేరో
రాచ్చెంగా వుంటాయని చెప్పారేమండి

జంబు—చూశారా యెల్లాంటి అబద్దాలు చెప్పుతూన్నారో
వాళ్ళు తమఅవసరం కడుపుకొని నీకొంప తీయడానికి అల్లాంటి
మాటలు చెప్పుతున్నారు అయితే నీయింటికి పన్నెంత ?

నాగ—ఆఱురూపాయ లేశారండి.

జంబు—అర్జీ పెట్టుతగ్గిస్తాము. పాపమునీకింత పన్నెక్కువే
మిటి.

నాగ——చిత్తము. చిత్తము బాబయ్యా ఈయుపకారము
చేయించుండి.

జంబు—సరే ఇకనీవు వెళ్ళు. (అని వానినిబంపితాను
వెళ్ళును.)

చిదం—పన్నులుకట్టి యిప్పటికి రెండేండ్లయినదిగదా !
ఇప్పుడు పన్నులు తగ్గిస్తారా ?

జంబు—నీవెక్కడో శుద్ధవైదికి లాగున్నావు. ఇప్పుడు
పన్నులుకొట్టివేయుటకు వీలు లేదన్నమాట నాకు తెలియకపోలేదు.
వీడిని టోపీవేయుటకు యిదేమార్గం. మరొకటి వీడివద్ద పనికిరాదు.
ఎలెక్షను అయినతరువాత వీడిపని లబాయిలు దిబాయిలు అన్న
మాట యెఱుగుదును సరే యీవేళకు తిరగడం చాలును. ఇంటికి
వెడదామురండి. మీరు నావిషయమై చాలా పనిచేస్తూన్నారు
గనుక మీకు కొన్నిసంగతులు చెప్పుచున్నాను వినండి. అవతల
వాళ్ళమీద కావలసినన్ని చెడ్డవాడుకలు వెయ్యవలెను. ఎలెక్షను
రోజున మనకు వోటువేసేవాడిని వెయ్యనివాడిని కూడా కౌగిలించు
కొని లోపలికి తీసుకువెళ్ళవలెను. అందువలన అందఱు వీళ్ళవాళ్ళే
యని తక్కినవోటర్లకు తోచును. ఆరోజున మనవారు పదిమంది
మునిసిపల్ ఆఫీసు మొదలు బజారుదాకా మధ్యమధ్య రోడ్డుమీద

నిలుచుండి జంబుకేశ్వరావుగారికి అవుతుంది. తిరుమలరావుగారి కొక్కవోటైన రావడంలేదు. అని వచ్చేపోయే వాళ్ళతో చెప్పు చుండవలెను. అలాగున చెప్పడంవల్ల మొదట వాళ్ళకు వేయదలచుకొని వచ్చినవాళ్ళుకూడా యీ దొంగవాడుక నమ్మి ఒకప్పుడు మనకు వేయగలరు ఓటర్లలో చాలమంది మంచి ఆలోచన గల వాళ్ళు కారు. మాయమాటలు దొంగవాడుకలు నమ్మి బందలోపడి పోదురు. ఇవియేకావు. ఇంకా చాలాసంగతులున్నాయి. అవియన్ని క్రమక్రమముగా చెపుతాను. ప్రస్తుతం పోదాము రండి.

(అని యిద్దఱు నిష్క్రమింతురు)

—౬—

రెండవరంగము

(అపుడు మాధవరావుగారు ప్రవేశించుచున్నారు.)

మాధ—ఏమండోయి కేశవాచార్యులగారు మీవోటు మా తిరుమలరావుగారి కిప్పించవలెను. మాపక్షము న్యాయపక్షమని మీకు తెలుసునుగదా!

కేశ—చిత్తము. తిరుమలరావుగారుకూడ ఇదివరకు రెండు సారులువచ్చి సెలవిచ్చినారండి. మీపక్షము న్యాయపక్షమన్నమాట మెలుగుదును. మీరు సధర్ములన్నమాట మెలుగుదును. కాని నాకిందులో ఒక బాధయున్నది. మీ ప్రతిపక్షులలో కొందరు చెడ్డ వాళ్ళున్నారు. వాళ్ళకు వోటివ్వకపోతే ఈవీధిలో నిలవడానికే వీలు లేదు. నా యింటిమీద రాళ్లువేస్తారు. మా ఆడవాళ్ళను వీధివెంట నడవనియ్యరు. నేను గృహస్థధర్మముగా మీతో ఉన్నయదార్థస్థితి మనవిచేసుకొంటూన్నాను. కాబట్టి నన్ను క్షమించి వదిలివేయండి. మీరు యోగ్యులు గనుక మీతో నిజముచెప్పుకుంటే మీరు వదిలి వేస్తారని నాకు ధైర్యమున్నది.

మాధ—సరే యీ విషయములో మిమ్ము నేను బాధపెట్టను. (అని కొంతదూరము వెళ్ళి) ఏమండోయి రాజరత్నంగారు మీరు మాకు వ్యతిరేకముగా పనిచేస్తూన్నారని తెలిసినది.

రాజ—వ్యతిరేకముగా యేంచేస్తున్నానండి.

మాధ—అవతలపక్షమున మీరు తిరుగుతున్నారటగదా.

రాజ—తిరిగితేనేమండి నా వోటు మీకేయిస్తాను.

మాధ—మాకు వోటివ్వవద్దని అందరితో చెప్పుచున్నారట గాదూ ?

రాజ—చెపితేనేమండి నా వోటు మీకిస్తాను.

మాధ—వారినామినేషనుమీదకూడా మీరు దస్కతు చేసినారట గాదండీ !

రాజ—చేస్తేనేమండి వోటు మీకియ్యదలచు కొన్నపుడు?

మాధ అన్నిపనులు వారికిచేసి వోటు మాకిస్తామని చెపితే యేమినమ్మకము కలుగుతుందండీ.

రాజ—కలగకపోతే నేనేమిచెయ్యనండి ! వారి మొగమాటమువల్ల ఆలాగున తిరగవలసివచ్చినది. కావలిస్తే యీవేళ మీతో గూడ తిరుగుతాను.

మాధ—ఇద్దరితోను తిరగడంవల్ల యేమీ లాభము లేదు. ఎవరికిని నమ్మకముండదు. మునిపి యేదోఒకపక్షమున ఉంటే మరి యూదగా నుండునుగాని యిటొకకాలు అటొకకాలుపెట్టి మనసులో ఒకమాట పైకొకమాట కలిగియుండడం కేవలం అప్రశస్తం. కాబట్టి మీ రాలోచించుకొని మీ యిష్టమువచ్చినట్లుచేయండి. (అని కొంత దూరంవెళ్ళి) గంగరాజుగారూ ! నేను మీకోసమే వస్తూన్నాను. వోటుమాట యేమిచేసినారు ?

గంగ—నావోటు తమ దేయని యిదివరకే మనవిచేయలేదు? అవతలవారు వచ్చినప్పుడూరికే వారికి తప్పకుండా యిస్తాననిఅంటూ వుంటానుకాని ఆంతర్యంలో మాటయేమిటనగా, నావోటు మీది.

మాధ—మొన్న జంబుకేశ్వరరావుగారు వచ్చినప్పుడు వారితోను యీలాగునే చెప్పినారట.

గంగ—చెపితేనేమండి నూరుమాటలు చెపుతాము. అవన్నీ మీకు లెక్క యెందుకు. క్రియా, సంగతి కమాయిషు చూచుకోవాలి కాని.

మాధ—సరే! మీమాట నమ్ముకుంటాము. రేపుదయము తక్కినవాళ్ళను తీసికొని మళ్ళీవస్తాము. (అని వెళ్ళును.)

—*—

యమ ధర్మ రాజు క చ్చే రి

(యమధర్మరాజు. చిత్రగుప్తుడు ప్రవేశించుచున్నారు.)

యమ—అవునోయి చిత్రగుప్త నిన్న సాయంకాలము నీవు ఏవోకొన్ని ధర్మసందేహములనడుగదలచి నావద్దకు వచ్చితివి. అప్పుడు నేను నారదమహామునితో మాట్లాడుచుండుటచే తీరుబడి లేకపోయినది. ఇప్పుడు తీరికగానున్నది, అడగవచ్చును

చిత్ర—చిత్తము. ఇదిగో అడుగుచున్నాను. భూలోకములో హిందూదేశమందు మునిసిపల్ కౌన్సిలులోను తాలూకా డిస్ట్రిక్టు బోర్డులలోను సభికులగుటకు చాలమంది దరఖాస్తులుచేసి వోటర్ల వద్దకు వెళ్ళి వోట్లుయిమ్మని బ్రతిమాలుచున్నారు. వోటర్లు యెవరువచ్చిన వారికే యిస్తామని దరఖాస్తుదారులందరికిగూడ నమ్మకముపుట్ట

బలుకుట యేగాక చేతిలో చేయివేసి తల్లివర్తన, అమ్మతోడు బాబుతోడు గాయత్రీసాక్షి, చండాలుడేసరి నాబిడ్డలతోడేసరిఅన్నంసాక్షి రామదేవుడిపాదాలుసాక్షి, దైవసాక్షి మీపాదాలతోడేసరి, అని వోట్లుపెట్టుకొని భాగవతము భారతము రామాయణము నెత్తిమీద పెట్టుకొని ప్రమాణములుచేసి తాముచేసిన ప్రమాణములు దప్పి మరియెుకలాగున వర్తించుచున్నారు. వెనుక ధర్మరాజు "అశ్వత్థామ హతఃకుంజరః" అని ఒక్క అబద్ధము ఆడినందులకే ఆయనకు యమలోకదర్శన మయినదిగదా. ఇప్పుడు ఈఘోరమైన ప్రమాణములు చేసి తప్పిన యీమహానుభావులకు యేమినరక మేర్పరచినారో నాకు తెలియకున్నది. ఒక్కొక్కవోటరు యిద్దరు దరఖాస్తుదారులవద్ద ప్రతిదినము చేయుచున్న ప్రమాణములు పెట్టుకొనుచున్న వోట్లు వ్రాయలేక మా చేతులుమాగుమాస్తాల చేతులుపడిపోవుచున్నవి. ఒక్కొక్క యెలెక్షనుకు ఒక్కొక్కవోటరు నాలుగుమూడువందలపరియాయము లైన ప్రమాణము చేయును. ఈ ప్రమాణములకు పాటియున్నదా లేదా ? ఉన్నపక్షమున యేనరకములో వీరిని వేయవలసినది. కొందరు వోటర్లు యిదివరకే చచ్చిపోయి బ్రతికివచ్చియున్నారు.

యమ.—ఇది గొప్ప గడ్డుప్రశ్నయే ఇందుకు పాతనరకము లేవియు బనికివచ్చునని నాకుదోచుటలేదు. వోటర్లుచేయునట్టి ఘోరప్రమాణములు వినువారికి మిక్కిలి భయంకరముగానున్నది. అట్టివి తప్పినందున యేదైనా క్రొత్తనరక మొకటి ప్రత్యేకముగావీరి కేర్పరచవలసినదని బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో నేను మాటాడెదను ? అంతవరకు వీరిని, అబద్ధములాడినట్టివారిని పంపించే నరకములోనికి పంపు చుండవలెను.

చిత్ర.—వోట్లు వేయవలసినవిధముగా పెట్టెలలో వేయక మెత్తుకొని వచ్చినటువంటివారు దొంగతనము చేసినవారగుదురా లేదా ?

ఇది ఆస్తికాదుగనుక దొంగతనముకాదని కొందరనుచున్నారు. మీ యభిప్రాయము సెలవియ్యవలెను.

యమ—అది తప్పక దొంగతనమేయగును. అట్టివారు వోట్ల దొంగలు. ఆస్తిదొంగిలించుటయొక్కటే దొంగతనముకాదు. దురుద్దేశముతో ఏది యెత్తుకుపోయినను అది దొంగతనమేయగును

చిత్ర—వోటర్లు వోటువేసినందుకు దరఖాస్తుదారులవద్ద పుచ్చుకొనునట్టి సొమ్ము బహుమానములక్రిందికి వచ్చునా?

యమ—అవి బహుమానములుకావు. లంచములే. వారందరు మనలోకమునకువచ్చినప్పుడు లంచములు పుచ్చుకొన్నవారిని విచారించినట్లే మనము విచారింపవలయును.

(అంతట ఇద్దఱు యమదూతలు చచ్చిపోయిన ఒక వోటరును తీసికొనివచ్చుచున్నారు)

యమ—ఎవడురా వీడు?

దూతలు—వీడొక బ్రాహ్మణుడండి.

చిత్ర—వీడుకూడా ఒక వోటరేనండి.

యమ—వీడి పాతరికార్డు తీయించండి.

చిత్ర—వెనుకటిదంతా వ్రాసి సిద్ధముగానే యుంచినాము. క్రొత్తగా యీమధ్య జరిగిన యెలెక్షనులో జరిగిన దుర్మార్గములు మాత్రము ఆవర్జావేయలేదు. చిఠాలోమాత్రము జేర్చినాము.

యమ—మొన్నటి యెలక్షనులో నీవేమి దుర్మార్గములుచేసినావయ్యా బ్రాహ్మణుడా?

బ్రాహ్మ—(గజగజ వణకుచు) అంతా చెబుతాను మహాప్రభూ! భూలోకములో నారహస్యము దాగినదికాని యేలినవారివద్ద దాగదుకదా. నేను నావోటు దరఖాస్తుదారులకిద్దరికిగూడ యిస్తానని వాగ్దానము చేసినాను, నన్నునమ్మరేమో యనుభయముచేత యిద్దరి

వద్ద ప్రమాణములుచేసినాను. కాని మనసులో న్యాయపక్షము వారికే యిన్వవలయునని తలంచితిని. కాని అంతలో నాకొకచిక్కు తటస్థించినది. నేను నాలుగుసంవత్సరములనుండి యొక చాకలిదానిని యుంచుకొన్నాను. ఒకనాడురాత్రి దానియింట్లో నేనుండగా, ఒక దుర్మార్గుడు తాగివచ్చి ఉతగయెత్తి తలుపుదీసి దానిని నన్ను చావ గొట్టినాడు. అక్కిందిరోజున యీచాకలిది వానినేమో తిట్టినదట. అందుకోసము వాడీపని జేసినాడు. ఆరాత్రి వాడు మమ్ముల నిద్దఱను తన్ని అంతటితో తృప్తిపొందక నన్ను వీధిలోనికి లాగుకొనివచ్చు టకు ప్రయత్నముచేయగా నేను వాని రెండుకాళ్ళుపట్టుకొని నా పరువు బయటపెట్టవద్దని బ్రతిమాలుకొంటిని. వానిపేరు గురయ్య. ఈయెలెక్షనులో అవతలిపక్షమువారు, ఆగురయ్యను నావద్దకు పంపి నారు. వాడు నా దగ్గరకువచ్చి నీవోటు నేను చెప్పినట్లు యిస్తే నే యిచ్చావు. లేకపోతె నీబుఱ్ఱపగులగొట్టివేస్తానని అన్నాడు. అందు చేత అలాయిచ్చినాను.

చిత్ర—నీవు ఉంచుకొన్నది మంగలిదని లెక్కలలో వ్రాసి యున్నది. చాకలిదని చెప్పినావు. నీవు మావద్దకూడా అబద్ధాలాడ దలచుకొన్నావా? నీమాటలు నమ్మి మోసపోవుటకు మేము మునిసి పల్ దరఖాస్తుదారులముకాము.

బ్రాహ్మ—లేదు మహాప్రభూ! పొరబాటుచేత చెప్పినాను.

యమ—చిత్రగుప్తుడా వీడిసంగతి రేపు విచారణచేయ వచ్చును. వీడి నవతలకు పంపివేయండి. వీడుకూడా క్రొత్తనరక ములో వేయవలసినవాడే. (అని పంపివేయుదురు) (అప్పుడు మరి యిద్దరు దూతలు మఱియొక వోటరును తీసకొని వచ్చుచున్నారు.)

చిత్ర—వీడెవడురా?

దూతలు—వీడొక వోటరండి.

యమ—చిత్రగుప్తుడా! వీడీ యెలెక్షనులో చేసిన చిత్రమేమి టోయి?

చిత్ర—వాడిచేతనే చెప్పిస్తానుండండి. చెప్పవోయి,

వోటరు—నేను చేసిన వెనుకటిపాపములన్నీ మీకు జాహిరే కదా? నేను ఎలెక్షనులో ఒకపక్షము వారితరఫున దిరిగి వోటు రెండవపక్షము వారికిచ్చితిని. ఇట్లుచేయుటకు కారణమేమనగా చిట్ట చివర యెలెక్షను సమయమునకు రెండవపక్షమువారు నాబాకీదార్ల చేత నామీద వ్యాజ్యములువేయించి వారంట్లు తెప్పిస్తామని బెద రించినారు, అందుచేత నేనట్లు చేయవలసివచ్చినది.

యమ—పాపము వీడు పరువునష్టమగునన్న భయముచేత చేసినాడు. కాబట్టి వీడికంత ఘోరమైనశిక్ష విధింపగూడదు.

చిత్ర—ఇదిగో మనదూతలు ఇంకొకనిని దీసికొని వచ్చు చున్నారు. వీడికి యెలెక్షనులో ఒకపక్షమువారు కడుపునిండా సారాపోయించగా త్రాగి వొళ్ళు తెలియక తాను వోటువెయ్యదలచు కొన్నవారికి వేయలేకపోవడమేగాకుండా అతి త్రాగుడువల్ల గొంతు కాల్చుకొనిపోయి ఆరాత్రియే చచ్చినాడు.

యమ—వీడికిప్పటికైనా వొళ్ళు తెలిసినదా లేదా? వీడు మన తోగూడ స్మారకము తెలియక మాట్లాడుతాడేమో చూడండి భూలోకంలోనిసా యమలోకంలోకి వచ్చినా దిగదు. వీడిని సారా గూనలో నానేసినట్లు తోస్తుంది,

చిత్ర—వీడిని రేపువిచారించవచ్చునులెండి. ఒరే వీడిని తీసి కొని పొండిరా.

(అని అందఱను పంపివేయుదురు)

(అందరు నిష్క్రమించుచున్నారు)

—౦—

రెండవ రంగము

[యమసుధర్మరాజు చిత్రగుప్తుడు ప్రవేశించుచున్నారు.]

యమ—చిత్రగుప్తుడా! భూలోకములో జరుగుచున్న యెలక్షను చిత్రములు, ఇంకా వినవలెనని కుతూహలమున్నది. మన లోకమునకువచ్చిన వోటర్లింకా యెవరైనా ఉన్నారా?

చిత్ర—వాళ్ళు రాకపోయినా మన లెక్కలనుబట్టిచూచి సంతసింపవచ్చునుగాని వాళ్ళుకూడా చాలమంది వచ్చినారు. మన దూతలప్పుడే యే డెనమండ్రుగురను దీసికొనివచ్చినారు. వాళ్ళుచేసిన చిత్రములు వాళ్ళ నోళ్ళనుండే వినవచ్చును. ఎవడురా అక్కడ! ఏలినవారివద్దకు ఆ వోటర్ల నొక్కొకరినే తీసికొనిరండి.

యమదూత—చిత్తము బాబూ! ఇదిగో వీడొక ముసలి వోటరండి. ఓరీ నీకథ చెప్పరా యేలినవారు వింటారు.

3. వోటరు—చెప్పుచున్నాను, వినండి. బాబయ్యా. నాపేరు గోపయ్య. మావార్డు వోటర్ల జాబితాలో పాపయ్య అనే సునిపి పేరు వోటరుగా వేయబడియున్నది. ఒకపక్షమువారు నాకు వరహాసొమ్మిచ్చి అవతలపక్షం తిరిగిపోకుండా రాత్రి నాలుగు జాములు నన్నొక గదిలో పెట్టి తాళమువేసి నాపేరే పాపయ్య అనిపించి నాచేత వోటు వేయించినారు. పాపయ్య అదివరకే చచ్చిపోయి పదేళ్ళయినదట. నీ పేరు గోపయ్య కాదాయని యెవరో యొక రడుగగా నేను ఖంగారుపడక యెంతో ధైర్యముతో నేను పాపయ్యనేయని జవాబు చెప్పితిని.

యమ—నీవు నిజముగా పాపయ్యవేరా? నీ మొగమున పాపములు ప్రేలాడుచున్నవి. చిత్రగుప్తుడా! యితర పాపములమాట తెరువాత విచారించెదముగాని ముందుగా యీదోషమునకు శిక్షింతము. ఇనుపరూపాయలు నాలుగు యెఱ్ఱగాగాల్చి వీని చేతిలో బెట్టండి.

వోటరు—బాబో, బాబూ క్షమించండి క్షమించండి.

(అని యేడ్చును)

యమదూత—ఏడవకు నడు. (అని గెంటుకొనిపోవును.)

చిత్ర—మరొకనిని పంపించండి.

యమదూత—వీడు మఱియొక వోటరండి. చెప్పవయ్యా నీ సంగతి.

4 వోటరు—చిత్తము మహాప్రభూ! ఏలినవారిని చూస్తే భయమేస్తూంది. ధర్మప్రభువులు బహుకుటుంబీకుడ నగుటచే కడుపు కక్కుఱితి గలిగి చేయరాని పనుల చేసినాను. రక్షించండి.

చిత్ర—రక్షణకేమిలే. కథకానీ.

వోటరు—చిత్తం మహాప్రభూ! నేను మెలక్షను వచ్చినప్పుడు ప్రతి పరియాయము కొంతసొమ్ము సంపాదించే యలవాటుగలిగియున్నాను కొన్నిపరియాయములు, ఇద్దఱిదగ్గరా పుచ్చుకోవడంఅలవాటు గలదు. ఈమధ్య జరిగిన మెలెక్షనులలో ఒకపక్షమువారువచ్చి అడిగినప్పుడు అవతలవారు నాలుగురూపాయాలిస్తానన్నారు. మీరేమియిస్తారని యడిగితిని. వారు ఆఱురూపాయలిస్తామని చెప్పిరి. అప్పుడు రెండవవారి వద్దకువెళ్ళి వా రాఱిస్తామన్నారు. మీరేమిస్తారని యడిగితిని. వారు ఎనిమిదిరూపాయలిస్తామనిరి ఆసంగతి మొదటివారితో చెప్పగా వారు పది రూపాయ లిస్తామనిరి. ఈ ప్రకారం పోటీలు పెట్టి నా వోటుకు ధర యెక్కించి మొదటివారి దగ్గర పదిరూపాయలు రెండవవారిదగ్గర యెనిమిదిరూపాయలు పుచ్చుకొని వోటు వేస్తానని యిద్దఱి దగ్గర ప్రమాణముచేసి చివర కిద్దరకు వోటు ఉపయోగం లేకుండా అడ్డంగా నాలుగుగీతలుగీసి కాగితము పెట్టెలో వేసివచ్చితిని. వెనుక నొక పరియాయము నా మీఁద రెండు పక్షముల వారికి నమ్మకం లేక యిద్దఱుఁగూడ చేరి రెండు రూపాయలును నాచేతిలోబెట్టి ఊళ్ళో

లేకుండా పోమ్మన్నారు. ఈప్రకారం మెలెక్షనులు పండుగులు మోస్తరుగా యెంచుకొని యింతశబ్బు గుంజుకుంటూ ఉండేవాడను.

యమ—గడుసువసమనగా నీదిరా నీలైతే నీవు మమ్ములను గూడ టోపీ పెట్టగలవాడవే! నీడి సంగతి, ఆలోచించవోయి చిత్రగుప్తుడా.

చిత్ర—వీడి ఒంటినిండా చింతనిప్పులవలె కాలిన యినుప రూపాయలు పెట్టండి. తీసికొనిపొండి.

వోటరు—అయ్యో! ఇంతవరకు వచ్చునని యెఱుగక చేసినాను బాబూ. (అని ఏడ్చుచుబోవును.)

యమదూత – ఇదిగో యీ మహానుభావుడింకొక వోటరండి. వీనికథ మఱీ చిత్రమండి. చెప్పనయ్యా.

5. వోటరు—నా చిత్రకథ చిత్తగించండి. చేసిన పాపము చెప్పిన పోవును. మా యూరిలో భోగముదాని నుంచుకొన్నవాని కెక్కువ గౌరవము. ఊళ్ళో యెక్కడనో ముండనుంచుకొన్నవాని కంటె యిటియెదుట నుంచుకొన్నవాడు మిక్కిలి గొప్పవాడు. ఇంటి యెదర నుంచుకొన్న వానికంటె యింట్లోనే భోగముదాని నుంచిన వాడు మఱీ గొప్పవాడు. అట్టివాడూరందఱికి పెద్ద. ఇది మాయూరి మరియాద. నేనొక భోగము దానిని నాయింటిలోనే యుంచుకొన్నాను నేను నావోటు ఒక పక్షమువారికిస్తానని ప్రమాణము చేసితిని. రెండవ పక్షము వారిలోగూడ భోగముదాని నుంచుకొన్న వారొకరున్నారు. ఆయన తనభోగముదానిని నాభోగముదానివద్దకు పంపించి వోటు తన పక్షమున నిప్పించుమని బ్రతిమాలించినాడు. నా భోగముది, వోటాపక్షము వారికియ్యనియెడల తాను వెంటనే లేచి పోదునని నన్ను బెదిరించినది. అది వెళ్ళిపోతె నాకు భూలోకమే అక్కరలేదు. అందుచేత నేను ఆడినమాట తప్పినా భోగముది చెప్పి నట్లు రెండవ వారికే వోటిచ్చినాను.

యమ——పాపమా భోగముదానిని వదిలిపెట్టి యిక్కడి కేలా గున వచ్చినావో తెలియకున్నది.

చిత్ర——ఓరీ వీడిని తీసికొనిపోయి కాలిన యినుప స్తంభములకు కాలిన యినుప గొలుసులు పెట్టి కట్టివేయండి.

యమదూత——స్వామీ! వీ డింకొక వోటరండి. నీ గొడవ చెప్పవయ్యా!

6. వోటరు - మహాప్రభూ! ఎలెక్షనుకు యిద్దరు దరఖాస్తు దారులలో ఆపనికి దగినవాడు మా యిరుగుపొరుగుననే యున్నాడు. మిక్కిలి మంచివాడు. అయినను నేనింత అప్రయోజకుడనై యుండగా యీతని కెందుకీపని కావాలీయని యోర్వలేమితనముచేత నష్టము కలుగజేయదలచి నావోటిస్తానని చేతిలో చేయివైచి కూడా రెండవ నారికిచ్చినాను. నేను తమ పక్షమే యనుకొని మొదటివారు నా యెదుట కొన్ని రహస్యములు చెప్పుకొనుచు వచ్చిరి. ఆమాటలు విని జాగ్రత్తగా అవి రెండవ పక్షమునారితో జెప్పుచూ వచ్చితిని.

యముడు——చాలు చాలు నీ చరిత్ర. ఓరీ వీని చెవులలో యినుపముక్కల కాకులచేత బొడిపించండి చిత్రగుప్తుడా యీవేళకు దర్బారు చాలింతము.

(అందఱు నిష్క్రమింతురు).

దంభసన్యాసి ప్రహసనము

ఇందువచ్చు పాత్రలు.

వరదరాజు—దైవభక్తిగల బ్రాహ్మణుడు
పేరిందేవి—వరదరాజుభార్య
నరసింహభారతి—కలియుగనారదుడనిబిరుదుపొందినసన్యాసి

మొదటిరంగము

[వరదరాజు, పేరిందేవి ప్రవేశించుచున్నారు]

వరద—సరే! ఈసంసారపుగొడవ లెప్పుడునున్నవే. ఈస్వాములవారి విషయమై చేయవలసిన యేర్పాటులు చేసినావా? ఈయన పదిహేనుదినములనుండి మనయింట్లో ఉన్నారుగదా? ఈయనకు వేరే గది, ఇంకాసర్దిపెట్టియలేదేమి? ఈయనను, ఈ యూరినుండి వెళ్ళనీయకుండా మనయింట్లోనేయుంచి ఆయనపాదము లాశ్రయించి ధన్యుల మగుదాము.

పేరిం—అవును. ఈస్వాములవారు మహానుభావుడు, మనకు పిల్లలులేరుగనుక మనయాస్తియటువంటిసన్యాసులకు పూజలుచేయడం క్రింద వినియోగించడమే మంచిది. ఈయనను మరెక్కడికి వెళ్ళనీయవద్దు, అన్నియుపచారములు మనమిద్దఱమే చేయుదము. ఆయన తండ్రివంటివాడు. వేదాంతములో నింతవారు లేరని మన రామశాస్త్రిగారు మొన్న నెవరితోనో చెప్పుచుండగా నేనువిన్నాను. ఈయనవల్ల మనగృహపావన మైనది.

వరద—సందేహమా! నీమనసులోగూడ నిటువంటి భక్తియుండుటచేత నేనెంతో యదృష్టవంతుడను. భార్యాభర్తలు, ఏకాభి

ప్రాయము కలిగియుంటె సరిగా నడుస్తుంది. నేను బజారునకు బోయి వచ్చెదను. ఆయనకు గదిసర్ది యిచ్చివేయి.

(అని యిద్దఱు నిష్క్రమింతురు)

—*—

రెండవరంగము

[నరసింహభారతీస్వాములవారు ప్రవేశించుచున్నారు]

నర—(తనలో) వహవా! నాప్రయత్నము నేటికిసఫలమయ్యెట్టు కనబడుచున్నది నేను భార్యమీద కోపగించి జందెమును తెంపుకొని సన్యసించిన అపాత్రుడనని యిక్కడివారికెవరికి దెలియదు. ఏదో విధముగ రూపాయలు సంగ్రహించి నాపెండ్లాము బిడ్డలకుపంపుటకై యీవేషము మిక్కిలి యుపయోగించుచున్నదన్నమాట యిక్కడి వారి కసలే తెలియదు. కాబట్టి నేను మిక్కిలి ధన్యుడను. ఈయింట్లో నా ద్వాయము చక్కగాపారుచున్నది ఈయజమానుడు వెఱ్ఱివాడు' భార్య, అంతకన్న వెఱ్ఱిది. ఈయిద్దఱుమూర్ఖత చేతనాకల్లవై రాగ్యపు మాటలునమ్మి నన్నే దైవముగ భావించుచున్నారు, ఇంతనమ్మకము నామీదకుదిరినందుకు, ఈదంపతుల కిద్దఱికివిరోధము పెట్టెదను. వరద రాజును నాస్వాధీనము జేసికొని వానిచేత సాలునకు పండ్రెండువందల రూపాయలువచ్చే అతనియాస్తి వేదపాఠశాలలు శాస్త్రపాఠశాలలు పెట్టిస్తానని చెప్పినాపేర వ్రాయించుకుంటాను. అప్పుడు నావ్రతము సంపూర్తియగును. ఏయుపాయముచేత వీరికిద్దఱకు విరోధముబెట్టుదు చెప్పుమా!

(అని యాలోచించును)

[అప్పుడు పేరిందేవి ప్రవేశించును]

పేరిం—స్వామీ! నీళ్లుకాగినవి. ఇవిగోపాంకోళ్ళు తెచ్చినాను శాలీతెండినవి. తమరు స్నానమునకు దయచేయవలెను,

నర—వరదరాజుగారు వచ్చినారా ?

పేరిం—మీాస్నానము జపము అయ్యేటప్పటి కాయనవస్తారు. మీారు ముందు లెండి.

నర—సరే (అని వెళ్ళును. ఇద్దఱు నిష్క్రమింతురు)

—*—

మూ డ వ ర ం గ ము

వంటయిల్లు

[నరసింహ భారతియు పేరిం దేవియు ప్రవేశింతురు]

నర - అమ్మా! ఆయన యింకను దయచేయలేదేమి ?

పేరిం—ఏమో తెలియదు మీారు ముందు భిక్ష కానియ్యండి మీాకు ప్రొద్దుపోయినది.

నర—వద్దు వద్దు. ఆయనను రానీయి. సన్యాసులకు ఆకలేమిటి దప్పికఏమిటి శరీరము నిలవదేమోయని నాలుగు కబళములు తింటాము కాని మాకు ఆకలియున్నదా? ఈలోపుగా యేమైనా కొన్ని పురాణగాథలు చెపుతానువినుు.

పేరిం—స్వామి! గాథలకేమిగాని, ఒకటడుగుతాను చెప్పండి పూర్వజన్మములో, ఏమనుష్యులెవరైయుండిరో మీారు చెప్పగలరని యందరు అంటున్నారు. పూర్వజన్మములో నేనెవరో మావారెవరో కొంచెము సెలవియ్యవలెను.

నర—(తనలో) మంచిసమయము చిక్కినది. ఇదే దివ్యమైన యదను. (ప్రకాశముగా) అమ్మా! నీవు పూర్వజన్మమందు కాశ్మీర మహారాజు కూతురవు. అప్పడు క్షత్రియకన్యవై యెందరో బ్రాహ్మణులను బూజించుటవలన నీజన్మములో బ్రాహ్మణ స్త్రీవైతివి.

ముందుజన్మములో దేవతాకన్యవగుదువు. నీభర్తమాత్రము...(అని యూరకొనెను)

పేరిం—ఊరకుండిరేమి? ఆయనయెవరు? చెప్పండి చెప్పండి.

నర—పోనిస్తూ! అగోడవెందుకు చెప్పినట్టయితే చాలా చిక్కులున్నవి.

పేరిం- ఏమీ చిక్కులులేవు. చెప్పండి. చెప్పకపోతే నన్ను చంపుకతిన్నట్లే.

నర—ఒట్టుకూడా పెట్టినావు, ఇక నేను చెప్పక తప్పదు. కాని నీవేమనుకుంటావో యని చెప్పుటకు నోరురాకున్నది.

పేరిం—నేనేమి యనుకోను, పూర్వజన్మస్థితి ఉన్నదిఉన్నట్లు మీరు చెప్పుచున్నారు గాని యిందులో కల్పించుట కేదీ లేదుగదా. నేననుకొనుట కేమున్నది కాబట్టి మీరు చెప్పండి.

నర—సరే, ఇక తప్పనిసరివచ్చినది గనుక చెప్పుచున్నాను విను. నీమగడు పూర్వజన్మమందు కొండవీడులో ఉప్పరివాడు. అప్పుడప్పుడు గోచిపెట్టుకొని తట్ట పార చేతబట్టుకొని చెరువులు గుంటలు తవ్వుచుండెడివాడు అప్పటివాడిపేరు ఎల్లిగాడు.

పేరిం—రామరామా! నాది యెంతదిక్కుమాలిన బ్రతుకైనదండీ.

నర—ఇందుకనె నేను చెప్పనన్నాను. ఇక నన్నడగబోకు.

పేరిం—పరవాలేదు చెప్పండి. వినవలసినదేదో విన్నాను కదా! కథ మొండితోకలాగున చేయక సంపూర్తి చేయండి.

నర-అప్పుడతడు బ్రాహ్మణులనిమిత్త మొక యూరిలోస్వాయముగా ధర్మార్థ మొక చెరువు త్రవ్వియిచ్చినాడు. అందుచేత బ్రాహ్మణుడైనాడు. ఇది నిజమని నేను ఋజువుచేస్తాను. ఈరాత్రి అతనుపండు

కొన్నప్పుడు నీసాలుకతో అతనివీపు నాకిచూడు ఉప్పగానుండును. అప్పుడుప్పరివాడని నీకు తెలియును.

పేరిం—సరె తప్పక అలాగే యీరాత్రిచేసిచూస్తాను.

[అంతట వరదరాజు ప్రవేశించును.]

వర—స్వామి నాకోసము కనిపెట్టుకొని యున్నారేమిటి ? ఇదిగో స్నానంచేస్తాను.

(అని స్నానమునకు వెళ్ళివచ్చి స్వామితో గలసి భోజనము చేయును.)

నాల్గవరంగము

[అప్పుడు నరసింహ భారతియు, వరదరాజు ప్రవేశించుచున్నారు.]

వరద—స్వామీ! ఈ రోజున నా మూలముగ మీకు భోజనమునకు పొద్దుపోయినది. ఏదో పాడువ్యవహారము ఒకటి వచ్చి నేను వెళ్ల వలసి వచ్చినది.

నరసిం—ఏమంత ప్రొద్దుపోయినది ? ఈమాత్రముపొద్దు పోకుండ సన్యాసులకు జాము ప్రొద్దెక్కేటప్పటికి వండి వరగద్రోసే వాళ్లెవరు ? అయినను నీభార్య అడిగిన ప్రశ్నలవల్ల నాకు ప్రొద్దు పోయినట్టే కనబడలేదు.

వరద—ప్రశ్న లేమిటండోయి. అది శుద్ధ వెఱ్ఱిమొద్దు. దేవర వారిని అవకతవక ప్రశ్న లేమి అడగలేదుగదా ?

నర—అబ్బే! అవకతవక ప్రశ్నలుగావు. ఆవిడడిగినవి తెలివైన ప్రశ్నలే. నేను నాథర్తగారు క్రిందటిజన్మలో ఎవరము అని యడిగింది. ఇందులో అవకతవకేమున్నది. తెలివైనప్రశ్నయేగాదా?

వరద—దాని మొగంతెలివి! ఏమితెలివిలెండి! అయితే మీరేమి సెలవిచ్చినారు?

వర — ఏదో నాకుదోచినవి రెండుముక్కలు చెప్పాను.

వరద — ఆలాగు కాదు చెపుదురు. నేనెవరిని పూర్వజన్మమందు?

వర — ఇటువంటి వడిగితే దీనిలో అసాధ్యాలు చాలా ఉన్నాయి. ఊరుకుందూ, నామాట విని.

వరద — ఊరుకోను. మీరు నామాఁద్దు చెల్లించాలి. నే నెవరినో చెప్పండి ముందు.

వర — అయితే చెప్తాతా విను. నీవు పూర్వజన్మమందు సౌరాష్ట్రదేశ మేలిన మహారాజువు. ఆజన్మలో యుద్ధములుచేసి చాలమందిని చంపితివి. ఒకసారి బ్రహ్మదేవుని గురించి తపస్సుచేసి నీవు బ్రహ్మప్రత్యక్షముకాగా రాచపుట్టుకలో హింసచేయవలసి యుండును కాబట్టి నాకు ముందు బ్రాహ్మణజన్మ ఇయ్యవలసినదని యడిగితివి. బ్రహ్మనరేయని నీకు బ్రాహ్మణజన్మ నిచ్చెను. ఈ సంగతులే నీ భార్యతో జెప్పితిని.

వరద — (సంతోషముతో) మీయనుగ్రహమువలన నాకు త్తమజన్మయే కలిగినది. పూర్వజన్మములో నాభార్య యెవరు ?

వర — అదే అడగవద్దు.

వరద — అదికూడా తమరు సెలవిచ్చి తీరవలెను.

వర — అందువల్ల నీ మనస్సునకు బాధ కలుగుతుంది నేను చెప్పను.

వరద — ఏమీ బాధలుకలుగవు. సందేహించకుండా చెప్పండి.

వర — ఇంత బలవంత పెట్టితే నేమిచేయను. చెపుతా విను. నీభార్య క్రిందటి జన్మలో అబ్బా! చెప్పుటకు నోరురాకున్నదయ్యా; ఏమని చెప్పను. క్రిందటి జన్మలో ఆవిడ కుక్క.

వరద — (తనలో) దిక్కుమాలిన జన్మ (ప్రకాశముగా) దానికి బ్రాహ్మణస్త్రీజన్మ యెట్లు కలిగిదండి ?

నర—చెపుతాను విను. ఆకుక్క గ్రామములో పులి యాకులు నాకి యెక్కడెక్కడనో తిరిగి ఒక దేవాలయములో రాత్రులు పడుకునేది కొందరుదొంగలా దేవాలయములో దేవుడు తాలూకు నగలు సొమ్ము హరించవలయునని రాగ యీకుక్క గట్టిగా మొరిగి దొంగలను నిలవబెట్టెను. అంతలో గ్రామములోని వారందఱు లేచి దొంగలను తరిమివేసిరి. ఈ పుణ్యకార్యము చేయబట్టి దానికి బ్రాహ్మణస్త్రీజన్మ కలిగినది. నామాట అబద్ధముకాదు. అది కుక్కగనకనే ప్రతిదినము నిద్రపోవునపుడు నీవీపు నాకును. యీవేళ మేలుకొని చూడుము.

వరద—ఆలాగే చేసెద. అబ్బా! ఈకుక్కతో మాట్లాడడమంటేనే అసహ్యమేస్తూన్నదండి.

నర—ఇదిగో అటువంటి మాటలనకు. నామూలాన్ని నీకీ బాధ కలిగినది. నాకు తప్పక నరకం వస్తుంది.

వరద—మరేమీ భయములేదు. (అని వెళ్ళును.)

(ఇద్దరు నిష్క్రమింతురు.)

—*—

అయిదవరంగము

పడకటిల్లు

[వరదరాజు పెరిందేవి పండుకొనియుందురు.]

పేరిం—(లేచి కూర్చుండి) స్వాములవారు చెప్పినట్లీయన ఉప్పరివాడగునో కాదో నిజము తెలిసికొనుటకై యీయన వీపు నాకి చూచెదను. ఈయన మేలుకోలేదు గద (చూచి) లేదు లేదు అదిగో నిద్రపోవుచున్నారు.

వరద—(తనలో) ఇది యేమిచేయునో చూచెదను. (అని నిద్రనటించును.)

పేరిం—(మెల్లగా మగనివీపు నాకి) స్వాములవారు చెప్పిన ట్లీయన వళ్ళుప్పగానే యున్నది. ఈయన తప్పక ఉప్పరివాడే.

వరద—(లేచి) ఛీ! కుక్కా అవతలకు పో!

పేరిం—ఛీ! ఉప్పరివాడా అవతలకు పో!

వరద—ఇంకా సిగ్గులేక మాట్లాడుతావేమి.

పేరిం—నేనేమి సిగ్గుపడనక్కర లేదు. మీారేతలవంచుకోవాలి.

నర—(వేచి తనలో) ఈ కేకలేమిటి చెపుమా! నేను వేసిన విత్తనము చెట్టై ఫలించినట్లు తోస్తుంది. అని (తలుపువద్దకువెళ్ళి) వరదరాజుగారూ! ఏమిటాగడబిడ యివతలకు రండి. (అప్పు డిద్దరు తలుపు తీసుక యివతల పడుదురు.)

నర—ఏమిటయ్యా! ఈయడావిడి?

వరద—ఇది నేను నిద్రపోవుచున్నప్పుడు నావీపు నాకు తున్నది. ఇది క్రిందటి జన్మాన్ని కుక్క, ఈకుక్క పెండ్లాము నాకు వద్దు. దీనితో నేను కాపురము చేయను ఇదిగో సన్యాసులలో గలియు చున్నాను. నాఆస్తి అంతా మీాపేర వ్రాసియిస్తాను. మీారేదో మఠము కట్టించండి. (అని జందెములు తెంపుకొనును).

పేరిం—ఈయన క్రిందటి జన్మాన్ని ఉప్పరివాడు. ఇన్నాళ్ళు యీాయనతో కాపురముచేసినదే చాలును. సిగ్గు సిగ్గు. నేనిప్పుడే నాపుట్టినింటికి వెళ్ళిపోవుచున్నాను. ఈమగడు నాకువద్దు. యీాసంసారం వద్దు. నానగలన్నీ మీాకిస్తాను. మీారేదైనా ధర్మకార్యం చేయించండి. (అని నగలాయన కిచ్చును.)

నర—అయ్యో! పండువంటి కాపురం చెడగొట్టుకోకండి. మీాదాంపత్యం చూస్తే నాకెంతో ముచ్చటవేసేది. మీారు చిలకా గోరింకలవలె వుంటారనుకొన్నాను. నామాటవిని తొందరపడకండి బాబూ!

(అని యేడ్చును.)

వరద—మీరు లక్ష చెప్పండి యీ కుక్క నాకునద్దు. ఇదిగో నాయాస్తి మీకిప్పుడే ధారాదత్తము చేయుచున్నాను. రేపుదయం యిక్కడ భోజనంచేస్తే చండాలుడేసరి. సత్రములోనికి వెళదాము పదండి (అని స్వామినిలాగికొని వీధిలోకి పోవును)

పేరిం—స్వామీ! తెల్లవారిన తరువాత యిక్కడ ఒకగడియైనా ఉండను. ఇక ఈయన మొగము చూడను. (అని గదిలోనికి వెళ్ళి తలుపు వేసికొనును.)

నర—(తనలో) ఇప్పటికి నా సంకల్పము సంపూర్ణముగా నెరవేరినది. ద్వాయము సరిగా పారినది. సన్యాసియైన యీవరదరాజును యేమతంలోనో కాస్తమాత్ర వేసి చంపి యీ వేయిరూపాయల ఆస్తి నాబిడ్డలకు యిచ్చెదను. ఇంతకు వాళ్ళు అదృష్టవంతులు.

(అని అందరు నిష్క్రమింతురు.)

—*—

ముష్టి ప్రహసనము

(అప్పుడొకవీధిలో కామయ్య, రామయ్య, భీమయ్య, ప్రవేశించుచున్నారు.)

కామ—భీమయ్యా! నీవు తెలియనివాడవు తెలియనట్లుండవు. అన్నిసంగతులు నాకే తెలుసునని సర్వజ్ఞత్వము తెగనీలుగు నీ కెక్కువ. మాణిక్యముశాస్త్రుల్లుగారు ఆలాగున చెప్పుచుండగా నేను విన్నాను. మొట్టో అంటూంటే నీవు నమ్మవేమి?

భీమ—మాణిక్యముశాస్త్రులుగారు అంతమూర్ఖుడు కాడని నా నమ్మకం. ఈవిధంగా ఆయన చెపుతాడ నేనమ్మకం నాకు లేదు. ఇంత అధికంగా ఆయన చెపుతాడా.

కామ — ధర్మమేమిటోయి శాస్త్రము చెపుతూంటేను. ఆయనను మించిన పండితులీ లోకములో యెక్కడా లేరు.

భీమ—పాండిత్య మెవరికి కావాలి. శాస్త్రములు కూడా లోకాచార ప్రకారముండవలెను. కాని లోకవిరుద్ధముగావుంటేయెవ రొప్పుకొంటారు.

కామ—మనకీ వివాదమెందుకు ? ఇప్పుడేవెళ్ళి మాణిక్యము శాస్త్రులుగారిని కనుక్కుందాముర మన సందేహం తీరిపోతుంది.

భీమ—అదే యుత్తమపక్షము.

(అని యిద్దరు బయలుదేరి మాణిక్యము శాస్త్రిగారి యింటికి వెళ్ళుదురు)

కామ—శాస్త్రులుగారు ! నమోనమః.

భీమ—నమస్కారమండి ! శాస్త్రులుగారు.

మాణి—దీర్ఘాయుష్యమస్తు దయచేయండి. ఊరక రారు మహాత్ములన్నట్లు తమరేదో పనిలేకుండా దర్శనమీయరు. అపనేదో సెలవీయవలెను.

కామ—పనేమిటిలెండి ! ఊరికే దర్శనముచేసి వెళ్ళవలెనని వచ్చినాము.

భీమ—అదేమి మాటలండి ! కొంచెము పనిమీదకూడావచ్చినామండి. మాకిద్దఱకు నొకధర్మసందేహంతోచింది. ఆవిషయముతమ దగ్గర నివారణ చేసుకుందామని వచ్చినాము.

మాణి—అదేదో సెలవియ్యండి నాశక్యమయితే సందేహం

[illegible]

కామ—మనవి చేస్తూన్నాను వినండి. గుడ్డివాళ్ళకు కుంటి వాళ్ళకు ముష్టి పెట్టడంవల్ల పాపమా పుణ్యమా? ఇదియే మాధర్మ సందేహం. పుణ్యము వస్తుందని భీమయ్య వాదము, పాపము వస్తుందని నావాదము. మీరీ సందేహము తీర్చవలెను,

మాణి—ఇది గొప్పసందేహమే. ఈవిషయమై వెనుక నేనొకసారి యుపన్యాసమిచ్చి అందులో యేమిచేయవలెనో స్పష్టముగా చెప్పినానే.

కామ—అవును! అప్పుడు మేమందరము విన్నామండి.

భీమ—నేనప్పుడూళ్ళో లేను విన లేదండి.

మాణి—అలాగైతే మళ్ళీ మనవిచేస్తాను. గుడ్డివాళ్ళు కుంటివాళ్ళు మూగవాళ్ళు కుష్టువాళ్ళు మొదలైనటువంటి అనాధలందఱు దేవుని కాగ్రహపాత్రులు. వారేదో మహాపాతకముచేయబట్టి వారిని దండించుటకై భగవంతుడు వారికానివిధములైన రోగములు తెచ్చి పెట్టినాడు. రోగములు తెచ్చిపెట్టుటయేగాక యీవిధముగా అన్నము లేక మలమల మాడనుని కూడా యేర్పరచినాడు దేవునిచేత శిక్షింపబడ్డవారిని మనము రక్షింపదలచినయెడల మనమీాద దేవునికి తప్పక కోపమువచ్చును. అందుచేత వాళ్ళకు మనము ముష్టివగయిరాలు పెట్టకూడదు. మరియేవిధమైన సహాయము చేయకూడదు. ఇట్లెందుకు చేయగూడదో మీకు స్పష్టముగా చెపుతాను వినండి. ఒక దేశమును పరిపాలించు రాజున్నాడనుకోండి. ఆయన కొందరు దొంగలను కైదులో పెట్టిస్తాడు. ఆదొంగలకు మీారు పరుపులువేసి పిండివంటలతో భోజనములు పెట్టి సంరక్షణ చేస్తామంటే రాజు వప్పుకుంటాడా? రాజునకు కోపంరాదా? ఆలాగే భగవంతుడుకూడా తన చేత యెవడు శిక్షింపబడ్డాడో వారికి సహాయముచేసిన వారిమీాద తప్పకుండా కోపగించును,

కాము—తమరు సెలవిచ్చినది యుక్తియుక్తముగా ఉన్నది. వెనుక ఉపన్యాసములోకూడా ఇదే తమరు శెలవు యిచ్చినారు.

భీమ—శాస్త్రిలుగారూ! తమరు చాలచదువుకొన్నవారే కాని మీమాటలుకొన్ని యుక్తియుక్తముగా లేవు. ఇది కేవలమన్యాయము. మీమాటనుబట్టి నడచుకుంటే యే అపత్తులో ఉన్నవారికిఁ గూడ సహాయము చేయగూడదన్నమాటే.

మాణి—సందేహమేమి? ఆపత్తులు మనముచేసిన పాపములనుబట్టి భగవంతుడు విధించినశిక్షలు. కాబట్టి ఆపత్తులున్నవారికేవిధమైన సహాయమును చేయగూడదు.

భీమ—ఇది మిక్కిలి బాగున్నది. ఇంత లోకవిరుద్ధమైన శాస్త్రము చెప్పినవారు మీరొక్కరే

కాము—ఆయన మాటమీద నీకువిశ్వాసముంటే సరే, నమ్మకము లేకపోతే మాట్లాడకూరుకో. కాని ఆయననేమిఅనకు.

భీమ— సరే! (అని లేచిపోవును)

(అందరు నిష్క్రమింతురు.)

—౯—

రెండవరంగము

(మాణిక్యశాస్త్రిగారి యిల్లు.)

[అప్పుడు మంచముమీద పరుండి మాణిక్యముశాస్త్రిగారు ప్రవేశింతురు.]

మాణి—ఎవరంవచ్చేవారు?

భీమ—నేను భీమయ్యనండి. తమకు కొంచెము సుస్తీగా నున్నదని విని చూచిపోవలెనని వచ్చినాను.

మాణి—చిత్తము అనుగ్రహమున్నది గనుక వచ్చినారు. నేని వేళకు పది లంఘనములు. నాభార్య నేటికెనిమిది లంఘనములు. మా అత్తగారు లోపలికి రావడానికివల్ల లేదు. నాభార్యకు యీ వేళ ప్రొద్దుట నుండి పరాకుమాటలు వచ్చుచున్నవి. మాపిల్లను పంపించుమని దాని మామగారికి ఉత్తరం వ్రాసినాను. ఇంకా అక్కడనుండి జవాబు రా లేదు. మంచివైద్యుని యెవరినైనా మీరుతీసుకొనివచ్చి నాకు నాభార్యకు మీరు వైద్యము చేయించవలెను. ఇదిగాక మీరొక యేబది రూపాయలు నాకిప్పించవలెను. ఈ రెండుసహాయములు తమ వల్ల కావలెను.

భీము సహాయముచేయుట కేమికాని నాకొక పెద్దభయము పట్టుకొన్నది. మీరాపత్తులోనున్నారు. ఆపదలోనున్న వారిమీద భగవంతునకు కోపముగానుండునని అట్టివారికి సహాయము చేసినవారి మీద కోపమువచ్చునని మీరు సెలవిచ్చినారు. అందుచేత మీకు సహాయము చేసినపక్షమున భగవంతునికోపమునకు పాత్రుడనై యే నరకమునకు బోదునోయని భయమగుచున్నది. కాబట్టి మీకు వేయి నమస్కారములు. నన్ను నరకములోనికి పంపకండి.

మాణి—(తెల్లబోయి కొంతసేపు మాటాడలేక) భీమయ్య గారూ ! నామాట నాకు చక్కగా వప్పగించినారు. అప్పుడెందుకు చెప్పినానో చెప్పినాను అమాటలు మీరు మనసులో నుంచుకోవద్దు. ఈయాపత్సముద్రము దాటించవలెను.

భీము—మీరుభయపడకండి. నరకములోనికి బోయినను సరే నేను మీకు సహాయము చేసెదను. ఆపదలోనున్న వారింద రవసరములు మీయవసరములవలెనే ఉండును గనుక అటువంటి పిచ్చి యుపదేశములు లోకమునకు చేయకండి. ఇదిగో నేను వెళ్ళి వైద్యుని దీసికొని సొమ్ముపట్టుకొని వస్తాను.

(అందరు నిష్క్రమింతురు.)

—గ—

శవవహనము

ఒకటవరంగము

[అప్పుడు సీతాపతిగారు నీలకంఠముగారు కనకయ్యగారు రామచంద్రయ్యగారు ప్రవేశించుచున్నారు.]

నీల—సీతాపతిగారూ! మీనాయనగారు చనిపోయినారని మీరు విచారింపవలసిన పనిలేదు. ఆయన చాలా పెద్దలు. అదృష్టవంతులు. మీచేతిలో వెళ్ళడమల్లా మంచిది.

కన—నిజమే? ఈ న్యాయరోజులలో కుమాళ్ళచేతిమీదుగా తలిదండ్రులు వెళ్ళుటకంటె ప్రశస్తమేమియు లేదు. ఇది మనము పెళ్ళిలాగున దలచుకోవలెనుగాని చావులాగున దలపగూడదు.

రామ—ఆయనకేమండి సహస్రమాసజీవి. మహారాజులా వెళ్ళిపోయినారు.

సీతా—విచారించవలసిన పని లేదు కానండి, నాకుమారుని పెండ్లి చూడకుండా వెళ్ళినాడని నాకు విచారముగానున్నది. మాపిల్లవానికి పదియవయేడు. "ఈ మనుమడికి పెండ్లియైతే బొమ్మలపెండ్లిలాగుంటుంది కన్నులారాచూస్తాను. త్వరగా పెండ్లి చెయ్యి నాయనా" యని నన్ను మానాయనగారు తొందరపెట్టినారు. ఆపని నేను చేయలేకపోయినాను (అని కన్నులనీరు పెట్టుకొనును.)

నీల—ఇంతకు ఘటన లేకపోయినదిగాని మీరాయన ముచ్చట తీర్చదలచుకొన్నారుగదా, విచారించకండి. ఇంతకు నక్షత్రం మంచిదేనా?

సీతా—మంచిది కాదండి. ధనిష్ఠాపంచకాలు. అందు చేతనే దొడ్డి గుమ్మముదగ్గర వీధిలో రెండుతడికెలడ్డము కట్టించి అక్కడ పెట్టించినాను.

కన—అవును యెక్కడై తేనేమండి అంతా ఆయనదే.

రామ—మంచిపని జేసినారు. ఈ పిల్లామేక దూడదుడికి యెక్కడికి తీసికొనిపోయి మనము వేరే కాపుర ముండగలము ?

[అప్పుడొక పురోహితుడు ప్రవేశించుచున్నాడు]

పురో— సీతాపతిగారూ! చాకలివాడు తేవలసిన వస్తువులు తెచ్చినాడు. అన్నీ తయారైనవి. తమరు లేచి స్నానము చెయ్యాలి. నీలకంఠముగారూ! శవము ఇవతలపడే మాటేమిటి? మీరంతా కావలసినవాళ్ళుగదా.

నీల—నిజమే! యింతకంటె విధాయకమైనపని యేమున్నది? కాని మా యింట్లో కొంచెము అనుపపత్తిగా ఉన్నది.

పురో—ఏమనుపపత్తి ?

నీల—మా యింటిదానికి నెలతప్పినదని రెండవ మాసమని మావాళ్ళు చెప్పుకొనుచున్నారు. భార్య గర్భిణితో నున్నప్పుడు శవము మోయగూడదుగదా.

పురో—సరే! దానికి మీరేమిచేస్తారు గనుక. పాపము కనకయ్యగారు! తమరేదైనా కొంచెము ఇందులో—

కన—తమరు నన్నడగవలెనా వేరే వీలుంటే నేనే చేస్తును గాదూ, మానాయనగారు బాగున్నారన్న సంగతి మీకు తెలియదూ !

పురో—అన్నట్లు మరచిపోయినాను. నిజమే! రామచంద్రయ్యగారూ. తమమాట యేమిటి ?

రామ—నాకు వేరే యభ్యంతరమేమున్నది గనుక నిన్న శనివారం గనుక నా వ్రతప్రకారం ఏకభుక్తం చేసినాను. అందుచేత కాకచేసి చాల నీరసంగా ఉన్నది, బొత్తిగా ఓపిక లేదు. లేకపోతే మరోమాట చెప్పేవాడినా యేమిటి? పేటలో రావువారి కొట్లలో నున్నారు.

సీతా—(పురోహితునితో) వాళ్ళకోసం కబురంపించండి, చికొ్కచ్చినప్పు డేమిచేస్తాము మరి.

పురో—చిత్తము. ఓరే పిచ్చిగా నీవు పేటలోనికి వెళ్ళి రావు వారి కొట్లలో విస్సయ్య, దేవయ్య, అని యిద్దరుంటారు. వాళ్ళిద్ద రితో సీతాపతిగారియింట్లో జరిగిన సంగతిచెప్పి నలుగురిని వెంటనే తీసుకొనిరా.

పిచ్చి—చిత్తము (అని వెళ్ళును)

—౯—

రెండవ రంగము

[సీతాపతిగారు పురోహితుడు ప్రవేశించు చున్నారు]

పిచ్చి—ఇదిగో వచ్చారండి, ఆ యిస్సయ్యగారు నేనెళ్లే తప్పటికి మంచముమీదనుండి లెగనేలేదండి. ఆయి నుంచుకున్న ముండ బలమతాన్ని లెగొట్టి పంపిందండి. ఆయన మొహమైనా తిన్నగ కడుక్కోకుండా వచ్చాడండి, ఈ రెండో ఆయన గుడిసేటి దానింట్లో నేనెళ్లేతప్పుడికి సద్దికూడు తింటూవున్నాడు. నన్నుచూచి తలుపు చాటుకు వత్తిగిలిగంజ తాగి చెయి కడుక్కొని వచ్చినాడు. ఆ! మొత్తముమీద నలుగురు వచ్చినారండి.

సీతా—ఆ గొడవలన్నీ నాకెందుకు! వాళ్ళింటిదగ్గర యేమి యేడిస్తే మనకెందుకు. ఇల్లారమ్మను.

[అప్పుడు విస్సయ్యతో పిచ్చిగాడు ప్రవేశించును]

పిచ్చి—ఇదిగోనండి వచ్చినారు. మన బాబయ్యగారికి జబ్బె క్కువయినప్పటినుండి మన యింటిచుట్టు తిరుగుచుండే వాడండి.

విస్స—ఛీ! నోరుముయ్యి. ఈ యింటిచుట్టు తిరిగేటందుకు నాకేమిపని? పిలిన వారు కబురంపితే వచ్చినానుగాని ఇంతకుముందీ యిల్లే యెరుగనండి నేను.

సీతా—ఊరుకోరా పిచ్చిగా, ఇప్పటి మాటేమిటో చెప్పండి, మీ రేమిపుచ్చుకుంటారు?

విస్స—ఏలినవారికి తెలియనిదేమున్నదండి. మనము మనము ఒకే వూరివాళ్ళముకదండి. ఆట్టేదురాశకుపోతే బాగుండదు. కొన్నాన్నకు వరహా చొప్పున నాలుగు నాలుగులు పదహారురూపాయలు దయ చేయించండి.

సీతా—ఇదేమి గోరకలయ్యా! పదహారు రూపాయలు రేటెక్కడాలేదు. మా బాబయ్యగారి వంట్లో రక్తమాంసాలే లేవు. ఇద్దరే మోసికొని పోవచ్చును.

విస్స—ఇద్దర మెక్కడ మోయగలమండి. రెండు మైళ్ళెళ్ళాలి. దాని కష్టసుఖాలు తమకేమి తెలుసు. తమరెప్పుడైనా శవాలు మోశారా ఏమైనానా?

సీతా—నన్ను శవాలుకూడా మోయమంటావు.

విస్స—అది కాదండి నాకష్టంమాట మనవి చేశాను కాని తమరిని అంత మాటంటానాండి!

సీతా—ఏదో ఒకటి చెప్పు త్వరగాను.

విస్స—చెప్పడాని కేముండండి అసలే ఇది నీచపుపని గదండి బ్రాహ్మణజన్మమెత్తి పీనుగుల మోయుటకంటె తప్పేమున్నదండి. పొట్టకోసం యీవృత్తి యేదుస్తూన్నాం. వ్రతంచెడ్డా ఫలము దక్కాలి.

సీతా—ఎక్కడాలేని మామూలుటయ్యా మరి?

విస్స—లేకేమండి. దాని వడుపుకొద్దీ యీలా పుచ్చుకొంటూనే యుంటాము. మొన్న కన్నయ్యగారు పోయినప్పుడు 24 రూపాయలు పుచ్చుకొన్నాను. కామప్పశాస్త్రుల్లు పోయినప్పుడు 20 రూపాయలు పుచ్చుకొన్నాను. దాని వడుపుకొద్దీ అడుగుతాము. కాక

పోయినా ఎప్పుడైనా నూటి కొకటి వస్తుంది కాని తమవంటివారిళ్ళలో తరుచుగా రావుకదండీ!

సీతా—ఛీ! మాయిళ్ళల్లో యిటువంటివి తరుచుగా రావలె నని కూడా కోరుచున్నావు,

విస్స—అదికాదండి నాయభిప్రాయము. ఏలినవారు తప్పట్టుకో వద్దు. మాకిదేవృత్తి. మరియొక శుభకార్యాలలో మీరు దరికి జేర నియ్యరు. ఎప్పుడో నూటికొకటి వచ్చినప్పుడందులో తక్కువ చేస్తే మేమెల్లా బ్రతకమని మనవిజేస్తున్నానండి.

సీతా—మూడువరహాలు పుచ్చుకొని కార్యముకానిచ్చెయ్యి

విస్స—బాబు యీ పరియాయము నేను మనవి చేసినట్టు పోనియ్యండి, ఇప్పుడు వ్యవహారం రద్దీగానుంది. మాకు నాలుగు డబ్బు లొచ్చేరోజు లివ్వేనండి. పూర్వోక్తులరా ప్రవేశించినది అవతల మూడు వరహా లిస్తామని ఒకరు కబురుపంపుతే వెళ్ళక తమ కబురు మీద యిక్కడికి వచ్చినాము. ఈపరియాయం యీలాకానియ్యండి. మీ యింట్లో మరియొక పరియాయము చవుకగా పనిచేస్తాను.

సీతా—(కోపముతో) ఛీఛీ! నోరుమూయ్యిసిర్భాగ్యపుముండా కొడకా, మాయింట్లోమరియొకసారిచవుకగా పనిచేస్తావా? నీకోసము యింటిల్లపాదిని చావమంటావాయేమిటి ?

విస్స—బాబయ్యా తమ రాగ్రవాపడవద్దు పని రద్దీమూ లాన్ని వీలులేదని మనవిచేసాను. కాని మరియొకటి కాదండి.మావల్ల లోపాలోపములుంటే తమరు క్షమించాలి.

సీతా—పిచ్చిగా! మన పురోహితుడుగారు కామశాస్త్రుల్లు గారు దొడ్లో యున్నారు. పిల్చుకొనిరా.

పిచ్చి—చిత్తము. (అని ఆయనను తీసుకొనివచ్చును.)

పురో—ఏమి శెలవు వీళ్ళెవరైన తేల్చారా?

సీతా—ఈ నిర్భాగ్యులతో నేను మాట్లాడను. మీ రవత లకు తీసుకొని వెళ్ళి మాట్లాడి తేల్చండి.

పురో—విస్సయ్యా! ఇల్లా రా (అని అవతలకు తీసుకొనిపోయి) ఏదో చప్పున తేల్చు. ప్రొద్దెక్కుచున్నది

విస్స—ఏమి దేల్చనండి! ఈలాటి గొప్ప స్థలములలో మాకు వచ్చేది మీరు చెడగొట్టవద్దు. ఈ లాంటిది మీయింట్లో అయితే పూరికే మోసినా మోసినవాళ్ళమే. ఒక్కవరహాకు మోసినా మోసినవాళ్ళమే.

పురో—నారాయణ నారాయణ. ఇంతదక్కుమాలిన నోళ్ళే మిరా మీవి. మా యింట్లో యిటువంటిది రావాలని, చవుకగా పని చెయ్యాలని మీ కోరికెలా? సరే నీయిష్టముప్రకారం చేయిస్తాను. ఇక మాట్లాడకు. (అని లోపలికి వెళ్ళి) నా మనవి చిత్తగించి వాళ్ళు చెప్పినట్లు వప్పుకోండి. వాళ్ళు వచ్చి కసాయి ముండాకొడుకులు. ఏమీ వప్పుకోనుటలేదు. పైగాను మీ యింట్లో వస్తే చవుకగా చేస్తామన్నారు.

సీతా—సరే రమ్మనండి. కర్మ గోదావరినడ్డునే చేద్దాము.

(అంతట సీతాపతిగారు నిప్పుపట్టుకొనగా విస్సయ్య మొద లగు నలుగురు బ్రాహ్మణులు పాడెపట్టుకొని పోవుచున్నారు.)

(అందరు నిష్క్రమించుచున్నారు.)

—*—

కాండూరి జానకిరామయ్యగారి పెండ్లి

ఒకటవ రంగము

[జానకిరామయ్యగారు జగన్నాధంగారు భైరవసిద్ధాంతిగారు ప్రవేశించుచున్నారు.]

జగ — జానకిరామయ్యబావగారూ! పెద్దకాలంలో తమకు చాలా కష్టము వచ్చింది. ఈ వయస్సులో తమకు కళత్రవియోగం కావడం చాలా బాధకరం, అది యెంతబాధకరమో కొంతకాల మనుభవించినవాడిని నాకు తెలునును. భగవంతునికి తెలుసును

భైర — సందేహ మేమండి నాకుగూడా యీమధ్య నిటువంటి చిక్కే తటస్థించుటచేత పదిహేనువందల రూపాయలకు నా యిల్లు అన్ని తాకట్టుపెట్టి పదేళ్ళ రండ నొకదాన్ని కట్టుకొన్నాను, ఇన్నాళ్ళుబ్రతికి ఆఖరికిఅపత్నీకుడనై చావనాయను అభిమానముచేత తంటాలుపడ్డాను. ఏపెళ్ళింో సదస్యమునకు వెళ్ళినా అపత్నీకుడికి తాంబూలం యివ్వమంటూ వచ్చినారు. అందుచేత అలా చేయ వలసి వచ్చినది.

జాన — (నిట్టూర్పు విడిచి) తమరు సెలవిచ్చినట్లు యిటువంటి బాధ మరియొకటి లేదండి. కొంప గుండం వేసుకొని పోయినది కాదండి? జిహ్వా చచ్చిపోయినది, కుడిభుజము పడిపోయినదండీ. ఆరోజు మొదలు కొని నాయిల్లు చీకటికోణాసుయినది, ముందుదారి నాకేమి పొడ గట్టడం లేదు.

భైర — మీాకేమండి మహారాజులు. తమకు కొడుకులుకోడళ్లు మనుమలు మనుమరాండ్రు పెళ్ళుమని దుర్యోధనసంపత్తిగా నుంది. తమకు జరుగుబాటు లోటేమి యుండదు.

జగ—భైరవసిద్ధాంతిగారూ! మీకుగూడ పిచ్చా! యేమిటి ఈ పిదపకాలంలో యెక్కడికొడుకులు యెక్కడికోడళ్ళుయెక్కడి జరుగుబాట్లు? అవిపూర్వపుమాటలు. కొడుకులకావూ తాపితృభక్తులు కోడళ్ళకా అత్తమామల భక్తులు? మునుపటికాలంలోనే అంతరించినవి. కాస్త తల్లిదండ్రిమీద భక్తియున్నవాళ్ళం మనమేగాని యీనాటివాళ్ళకు లేదండి, ఈనాటికోడళ్ళుముసిలిముండా వాళ్లకేసిచూస్తారా! వాళ్ళవెకవెకలు వాళ్ళ పకపకలు జోకులు అవ్వేకాని వాళ్ళకు కళ్ళు కనబడతాయండి?

జాన—మీకడుపుచల్లగా నిజంచెప్పారండిజగన్నాంథగారూ! మనము సుఖపడాలంటే మనవస్తు వుండాలండి; మనవాళ్ళు కానైతే మంచివాళ్ళైకాని అయితేనేమండి భార్యాదారివేరు. బిడ్డలు కోడళ్ళు దారి వేరు.

భైర—(తనలో) ఈయనకు డెబ్బదియేండ్లున్నప్పటికి పెండ్లి చేసుగోవలెనను గట్టిసంకల్పము, కలిగినది. అందుచేతనే కొడుకులు కోడళ్ళు యీయనకెన్నో యుపచారములు చేస్తూన్నప్పటికి జరుగుబాటు లేదని పెండ్లికోసము దొంగయెత్తులు వేస్తూయున్నాడు. (ప్రకాశముగా) తమరు శెలవిచ్చినది సత్యమేనండి.

జగ—కనకనేముందుదారి నేనుమనవిచేస్తూన్నానండి.మీరు వివాహము చేసుకొండి.

జాన—సరిసరి, నాకిప్పుడు వివాహమేమిటి ? బావగారూ ! నాకు పిల్లనిచ్చేవా డెవడు ?

జగ—ఇచ్చేవారుంటే చేసుకుంటారా ! ఇవ్వకేమి నాకివ్వలేదా, పురుషోత్తమరావుగారి కివ్వలేదా? బుచ్చిరాజుగారికివ్వలేదా, ఈ భైరవసిద్ధాంతిగారి కివ్వలేదా.

భైర—సరి సరి నామాటకేమి. నేను జానకిరామయ్యగారి కంటె చాలా చిన్నవాడిని.

జాన—ఇదొకటా క్రొత్తవింత. మీరు బాగా పదిపద్దాలు గేళ్ళువచ్చి షోడశబ్రాహ్మణార్థాలు చేస్తూండేటప్పటికి నేను గోచీ పెట్టుకొని అప్పుడప్పుడే బడిలోనికి వెళ్లుచుండే వాడిని.

జగ—వయస్సుల కేమిలెండి, ఉన్ననీ్న ఉన్నాయి లేననీ్న లేవు దానికేమి. నేనడిగిన మాటకు సమాధానం చెప్పండి. ఇచ్చే వారుంటే మీరు పెండ్లాడుతారా ?

జాన—మీరంతా యీలా బలవంత పెడుతూంటే నేను మరోలా చేస్తే బాగుంటుందామరి కాని నలుగురు నవ్వుతారేమో యని భయమేస్తూంది.

జగ—ఎవడో నవ్వేవాడు కుక్కలు మొరిగితే యేనుగు పరువ తేమి పోతుంది చెప్పండి. మనమేమైనా కానిపని చేస్తూన్నాము కనక నా నవ్వేటందుకు. పడిపోయిన కొంప నిలబెట్టుకుంటూన్నాము. అదీ తప్పేనా!

జాన—ఈ పేపర్లొకటున్నాయిగాదండి. ఈ పేపర్ల ముండా వాళ్ళకి కావలసినదీ అక్కర లేనిదీ లేదు.

జగ—వెధవపేపర్లమాటెందుకు. నేను పేపర్లెప్పుడు చూడనే చూడను. ఈనవనాగరికులన్నా పేపర్లన్నా నాకుమంట. నవ్వేడ మెందుకు. మనభీమరాజుగారికి 65 వ యేట పెండ్లి అయినది. అరు గురు పిల్లలు పుట్టినారు. మనపెండ్లి చేసుకొన్నామని ఆక్షేపించే యీ పడుచు నిర్భాగ్యులలో కొందరికి పిల్లలేలేరు. వాళ్ళకూతలు లెక్కే మిటి. ఇక నేను సెలవు పుచ్చుకుంటాను. నాకవతల పనియున్నది. తక్కినసంగతులు మనభైరవసిద్ధాంతిగారు రేపు మాట్లాడుతారు లేవండి. మీకూ భోజనానికి ప్రొద్దుపోయినది.

(అని అందఱు నిష్క్రమింతురు.)

—*—

రెండవ రంగము

[అప్పుడు జానకిరామయ్యగారు భైరవసిద్ధాంతిగారు ప్రవేశించుచున్నారు.]

జానకి.—సిద్ధాంతిగారూ! మీ రేదో మాట్లాడుతారని మొన్న జగన్నాథంగారు వెళ్లేటప్పుడు సెలవిచ్చినారు. ఆ విశేషాలేమిటో సెలవియ్యండి.

భైర.—సెలవిచ్చుట కేమున్నది. తమ వివాహవిషయమే. నేనొక సంబంధం కుదుర్చుకొని వచ్చినాను. పిల్ల పండ్రెండేండ్లది. లక్షణంగా నుంటుంది. సాంప్రదాయానికి వేరేలోటు లేదు. అన్నోదకాలికి లోపము లేదు. ఆ బ్రాహ్మణుడు తదన్నం తద్రసంతిని గౌరవముగా కాలక్షేపము చేయుచున్నాడు.

జానకి.—ఎవ రాయన పేరు చెప్పరేమి?

భైర.—మరెవరుగారు. మన యెడవిల్లి మంగయ్యగారు.

జానకి.—ఆయనా, సరిసరి. ఇవ్వడాని కొప్పుకొన్నాడూ! పిల్ల లక్షణంగానే యుంటుంది చూచినాను. మొన్న శ్రావణమాసములో మా యింటికి తల్లీ కూతురు పేరంటమునకు వచ్చినారు. అయితే కన్యాదానమే చేస్తాడా? ఏమైన అపేక్ష యున్నదా?

భైర.—అతఁడు కానైతే కన్యాదానంచేసే సాహసం గలవాడే కాని స్థితిగతులు కొంచెము తక్కువ. పైగా ఋణగ్రస్తుఁడై యున్నాడు అందుచేత నీ సంగతి మీతో మనవిచేయుచున్నాడు.

జానకి.—ముసుగులో గుద్దులాటెందుకు స్పష్టంగా చెప్పండి యేమి కావలెనో.

భైర.—పెండ్లికూతురుతల్లి పన్నెండువందల రూపాయలు కావలెనంటుంది. అందులో వెయ్యి రూపాయలు అప్పు తీర్చుకొంటారట, తక్కిన రెండువందలుపెట్టి కంఠి చేయించి మెడలో వేసికొంటుందట.

జానికి—శాస్త్రు్లకేమి. అది లెక్క లేదు. రహితపరచుకొని వస్తుమా. అల్లాగే యిస్తాను.

భైర — రహితమున కేమున్నది. తల్లిదండ్రు లిద్దఱు వప్పుకొన్నారు. పిల్లదాని తాత యున్నాడు. అనగా తల్లితండ్రి. ఆయనకు మీనయస్సే ఉంటుంది. ఆయన పండువంటి పిల్లదాన్ని కాటికి కాళ్లు జాపుకొన్న ముసలి ముండా వాడికిచ్చి గొంతుక కోస్తారుటట్రా యని వాళ్ళను తిట్టుతూ ఉన్నాడు అందుచేత వాళ్ళు తటపటాయిస్తూన్నారు. ఆయన రెండురోజులలో ఊరికి వెళ్ళిపోవుచున్నాడు. ఆయనగారే నన్ను మీ వయస్సెంతో కనుక్కొని రమ్మనమన్నాడు.

జానకి—ఇదోగడ్డొచ్చింది మళ్ళీ. ఆముండాకొడుకు మొగాన్ని కూడా వందరూపాయలు పారవేస్తే పూరుకోడూ ?

భైర—వాడికాగొడవలున్నట్టు కనబడదు.

జానకి—అయితే మీరోపని చేయండి. నాకు ఏభైయో యేభైయైదో యున్నట్టుగా నొక జాతకం తయారు చేయండి. అది ఆయనకు చూపెడదాము.

భైర—మీరు పించను పుచ్చుకొనే అయిదేళ్ళయినదిగదా ఏభై యేళ్ళంటే ఆ ముసలవాడు నమ్ముతాడా?

జానకి—నమ్మకేమండి మసిబూసి నేరేడుకాయచేసి యేదో జాతకం మీరు వ్రాస్తురూ అది ఆధారముచేసుకొని మనము యేభై యేళ్ళే అందాము.

భైర— మీ పెద్దకొడుకే ముప్పైయైదు యేళ్ళున్నట్టు కనబడుతుంది.

జానకి—వానికి ముప్పదియైదెక్కడున్నాయి. మొన్నటికుఱ్ఱాడు కాకపోయినా పదహారోయేట పిల్లలు పుట్టినవాళ్ళు లోకంలో లేరూ.

భైర— లేకేమి ఆగయ్యాళి ముండాకొడుకు నమ్మడుగానిఇది గాక మరో యిబ్బందికూడ ఉందని చెప్పుకుంటూన్నారు. ఆ పిల్ల యేమో ఆడపిల్లల స్కూల్లోకి వెళ్ళి చదువు చున్నదట. ఆ చిన్న దేమో నాకీ ముసలి మగడక్కర లేదంటూన్నదట.

జానకి—(కోపముతో) ఏడిశింది అవతవకపిల్ల దానిష్టమేనా యేమిటి. యిప్పుడొచ్చాయి వెధవస్కూళ్ళు, వెధవచదువులుఆడపిల్లలకి. వంటపొయిదగ్గరకూర్చుని యింతవుడకేసి చాకిరీలు చేసేవాళ్ళకి చదువెందుకయ్యా. వీళ్ళుద్యోగాలు చేస్తారా; ఊళ్ళేలుతారా? చదువు చెప్పిస్తే యేమంటుంది మగడే వద్దంటుంది.

భైర—పిల్లముండ. దానిమాటకేమి లెండి అదెల్లాగో ఒక లాగు సొనాయిస్తాము. దానియిష్టమూ యేమిటి. రెండవ జాతకం వ్రాయడానికి తమజన్మ సంవత్సరం చెప్పండి.

జానకి—అసలు పరాభవలో పుట్టినాను. ఇప్పుడు సాధారణ సంవత్సరంకదా! నిజానికి అరవైయైదేళ్ళున్నాయి. పదో పన్నెండో తగ్గించి మీ యిష్టమువచ్చిన సంవత్సరములో జననం వేసి జాతకము వ్రాయండి. నాకు యేభైయేళ్ళున్నాయన్నా నమ్ముతారు నాది కాయశరీరం.

భైర—నా పాట్లేవో నేను పడతాను. ఎల్లాగో సొసాయిస్తే సరిగదా మీ కెందుకు.

జానకి– మీకిందులో ఒక యేభైరూపాయలు ముట్టచెప్పాలని యున్నది.

భైర—ఆమాట తలపెట్టకండి. వెధవసొమ్ము సొమ్ముకేమి. మీ యవస్థచూస్తే నాకుకడుపు దరిగోసుకుపోతూయున్నది. మిమ్మల్ని నొక యింటివాడిని చేసి మాట దక్కించుకోవలెనని యున్నది. దైవ ఘటన యేలాగున నున్నదో తెలియదు.

జానకి—సిద్ధాంతిగారూ! మీరు పూర్వ కాలము మనుష్యులు కనుగ స్నేహధర్మం నిలిపి నా విషయమై యింత పరితాపము పడుచున్నారు. ఈ కాలపువాళ్ళకిటువంటి స్నేహ ధర్మాలున్నాయా? అయితే చూడండీ! పిల్ల వినేటట్టుగా తల్లిదండ్రులతోటి మూడు వేల రూపాయలు నగలు పెడతారు. బంగారపుజడ. కట్టు కాసులపేరు, మొహిరీలపేరు అన్నీ పెడతారని చెప్పండి! దక్షిణాది చీరలుపునహా చీరలు బనారసు చీరలు రెండు పెట్టెలతో నున్నాయి. అవి అన్నీ యిస్తారని చెప్పండీ. హాయిగా మేడమీద నుండవచ్చునని చెప్పండి.

భైర—చెప్పడానికేమి, అన్నీ చెబుతాను. కుదుర్చుకొని వస్తాను. నాకు చాలా అవుసరముగా నున్నది. ఒక్క పాతిక రూపాయలు బదులిస్తారూ నెల్లాళ్ళలో యిస్తాను.

జానకి—సరి దీనికి బదులెందుకండి పుచ్చుకోండి. (అని సందువా తాళముతీసి సొమ్మిచ్చును.)

భైర—బదులైతేనేగాని నేను పుచ్చుకోనే పుచ్చుకోను. సెలవుపుచ్చుకొని రేపువస్తాను. ముహూర్తమే కుదుర్చుకొనివస్తా.

(అని లెక్క పెట్టుకొని రొంటిని దోపును.)

(అందరు నిష్క్రమింతురు.)

— 5 —

మూడవ రంగము

(మంగయ్యగారి యిల్లు)

[ఎడవల్లి మంగయ్య, భైరవసిద్ధాంతి ప్రవేశించుచున్నారు.]

మం. గ—కర్చులమాటయేమిటి. నా కాయనిచ్చే సొమ్మంతా నా అప్పులక్రిందే పోతుంది. రెండువందల రూపాయలైనా యుంటేనే గాని యింత పప్పూఅన్నం పెట్టి నలుగురు బంధుగులను పంపడం కాదు. ఇదికూడా పెండ్లికొడుకు దగ్గరనే పుచ్చుకోనవలెను.

భైర—ఆయనతో జెప్పి నేనిప్పిస్తాగాదూ. సథ్యా నీమామ గారి పోరాటము వదుల్చు ముందు ఆయన బొత్తిగా పిల్లనే యివ్వ డానికి వల్ల కాదంటూన్నాడు కాదూ.

మంగ—అవకతవక ముండాకొడుకు. ఆయనతో యేమిటి పోనిస్తూ. రాత్రి మేమిద్దరము దెబ్బలాడుకున్నాము. ముసలివాడికి పిల్లనియ్యవద్దని ఆయన, యిస్తానని నేను పట్టింపులు పట్టుకొన్నాము. చివరకు మాటమాటావచ్చి ఆయనజందెము తెంపుకొని అన్నం మానుకొని లేచిపోయినాడు, కాకపోయినా నాపిల్లకు వాడెవడయ్యా? నాపిల్లను నాయిష్టమువచ్చినట్టు చేసికొంటాము.

భైర—నిజమే. ఆయన వెళ్ళిపోవడంవల్ల సుముహూర్తము తప్పకుండా జరుగుతుంది. మనమిప్పుడు జానకిరామయ్యగారి యింటికి వెళ్ళి తాంబూలాలు పుచ్చుకొని ముహూర్తము రహితము చేసికొని వద్దాముదండి. ఆయనదగ్గర మాత్రము మీరు మరొక మాట అనవద్దు. ఎందుకంటే ఆయనను మంచిమాటాడితే నీయిల్లు బంగారమై పోతుంది. ఎందుకంటే ముసలిముండాకొడుకునకు పెండ్లామునోరికినా పిల్లవాడికి గుడ్డపేలికిదొరికినా వదిలిపెట్టడని యొకసామెత యున్నది. అది నిజము. నీకూతురు కాపరానికి వెళ్ళనిస్తూ వాడింట్లో యున్న సొమ్మంతా నీయింట్లో పడుతుంది. ఇప్పుడు నాలుగు వేలరూపాయలు నగలు పెడతాడు.

మంగ—నగలుపెడితే మనకేమి వస్తుందయ్యా. అందులోది యేమైనా మనము ముట్టుకొనుటకు వల్లా యేమైనానా?

భైర—ఆయన అయిదువేల రూపాయలకు భీమా చేయించి నారు. ఆభీమాసొమ్ము కూడా యీపిల్లపేర ట్రాన్సుఫరు చేయిస్తాను. ఇదిగాక నాలుగువందలో మూడువందలో వచ్చేభూములు మీపిల్ల పేర వ్రాయిస్తాను. పిల్ల కాపరానికి రానిస్తూ. ఈ ముండాకొడుకు కుక్కలాగు మీరు చెప్పినట్లు వింటాడు. ఇన్నిమాటలెందుకు మంగ

య్యబావా! ఒక్క మాట చెబుతానువిను. నేను అమంగళం పలికి నానని నన్ను తిట్టకు. ఈ ముండాకొడుకునకు అతి మాత్రము రోగ మున్నది. మహా బ్రతికితే అయిదేళ్ళు బ్రతికేను ఆరేళ్ళు బ్రతికేను. ఏరాచపుండో వేసి చస్తాడు. నీకు అమాంబాపతు పాతికివేలరూపా యల ఆస్తి కలుస్తుంది. ఇంతకు నీపిల్లలజాతకం మంచిది.

మంగ—ఆమాటెందుకు పోనిస్తూ, వాళ్ళు పదికాలాలపాటు బ్రతికియుండాలని నాకోరిక. నడవండి వెడదాము వారింటికి.

(అని యిద్దరు నిష్క్రమించుచున్నారు)

—*—

నాలుగవ రంగము

(జానకిరామయ్యగారి యిల్లు)

[భైరవ సిద్ధాంతి మంగయ్య గుమ్మముముందర నిలచుచున్నారు]

భైర—మంగయ్యబావా! నీవు కొంచెముసేపు యీ యరుగు మీద కూర్చుండుము. నేను కొంచెముసేపు జానకిరామయ్యగారితో పెండ్లికర్చులసంగతి మాట్లాడి నిన్ను పిలుస్తాను, అప్పుడు నీవు మేడ మీదికి రావచ్చును.

మంగ—సరే! యిక్కడే కూర్చుంటాను.

(అని అరుగుమీద కూర్చుండును)

భైర—(లోపలికి వెళ్ళి మేడయెక్కి) జానికిరామయ్యగారూ! -డనున్నారు!

(అప్పుడు తివాసీమీద కూర్చుని ప్రవేశింతురు)

జాన—ఇలాదయచేయండి. ఇక్కడ ఇక్కడ.

భైర—అంతా కుదిరినది. పెండ్లికర్చులవిషయమై తగాదా

వచ్చినది. ఆయన పెట్టుకోలేనంటూన్నాడు అవికూడా మీరేవహిం చాలట.

జాన —ఎంతవుతుంది?

భైర —రెండువంద లవుతుందన్నారు.

జాన—సరే యిచ్చివేస్తాను. కాని నేనీరొక్కమిచ్చి పిల్లని కొన్నట్లు పెండ్లికర్చులకూడా యిచ్చినట్టు లోకంలోయెక్కడా తెలియనీయకండి. నాకు అప్రతిష్టగా నుంటుంది.

భైర—నయమింకా. ఈసంగతి రెండవవారికి తెలియనిస్తానా

జాన—అయితే ఆముసలాయన యేమంటున్నాడు ? పిల్ల యేమంటూన్నది ? సంగతేమిటి?

భైర—ముసలాయన అల్లుడుతో తగవాపడి లేచిపోయినాడు. పిల్లయింకా గుణుస్తూందట. పిల్లరండ దానితోకేమిటి. పిల్లముండకు చదువుచెప్పించడం ఒక అనర్థకం; రెండవది పంద్రెండేండ్లువచ్చినదాక పెండ్లి చేయకుండావుంచడం వొగ అనర్థకం చిన్నప్పుడే పెండ్లి చేస్తే యీబాధలుండవు.

జాన—నిజమే అందుకే మనపెద్దలు చిన్నతనములో పెండ్లి చేయమని ఆడదానికి చదువుకూడదని అంటారు.

భైర—మీమామగారువచ్చి క్రిందకూర్చున్నారు. ముహూర్తము స్థిరపరచుకొనేందుకు వచ్చినారు, ఆయనను కేకవేస్తునా.

జాన—రమ్మనండి.

భైర—(మేడవసారామీదికివెళ్ళి) మంగయ్యగారూ! దయ చేయండి.

మంగ—(పైకివెళ్ళి) నమస్కారము జానికిరామయ్యగారు.

భైర—వద్దు వద్దు. నీనాయనకు నమస్కారముచేయకూడదు నీవు మామగారూ. ఆయనఅల్లుడు. వయస్సులో ఆయన చాలాపెద్ద

వైలైనా వానికినీవు పెద్దవాడవు గనుక నీవు నమస్కారము చేయగూడదు. జానికిరామయ్యగారూ! మంగయ్య కాట్టే వయస్సులేదు. మీ పెద్దబ్బాయి యీడువాడు. ఈయనభార్యయైనా మీపెద్దమ్మాయి యీడుది.

జాన — నాకైనా వయస్సాట్టే లేదండి. త్వరగా పించను పుచ్చుకొన్నాను గనుక పెద్దవాడిలా కనబడతాను.

మంగ — పరవాలేదు. ఈవయస్సుకేమండి. మిమ్మల్ని మళ్ళీ వకయింటివారిని చేయడంవల్ల నాకెంతో పుణ్యము వస్తుందని మీకు పిల్లనిస్తూన్నాను. మీవయస్సొక లెక్కా? మీకంటె రెట్టింపువయస్సు గలవాళ్ళు పెళ్ళాడుచున్నారు. నాపిల్లదాని అదృష్టము బాగుంటె మీరు వేయేళ్ళకీ వర్థిల్ల గూడదూ?

భైర — సందేహమేమిటి ఈయనే నూరేళ్ళుబతికిమీపిల్లదాని వల్ల కొడుకులను కూతుళ్ళను కంటాడుచూడు. ముహూర్తము స్థిర పరచండి. మళ్ళీ బుధవారము మంచిముహూర్తమున్నది. ఆముహూర్తము పంచకరహితమై యున్నది. తారాబల చంద్రబలములు సరి పోయినవి.

జాన — సరే బాగానేయున్నది. అదినాకిష్టమే.

భైర — అనుకున్నట్టుమంగయ్యగారికిసొమ్ముయిప్పించివేయండి

జాన — మీకు కాసులిస్తాను పుచ్చుకోండి. అమాంబాపతు నూరుకాసులుయిస్తాను. అనగా పదిహేనువందల రూపాయలగును.

(అని లోపలికెళ్ళి యెంచి తెచ్చియిచ్చును.)

మంగ — (లెక్కపెట్టుకొని మూటగట్టుకొని) ఇక నేను సెలవు పుచ్చుకుంటా.

భైర — నేనుకూడా సెలవుపుచ్చుకుంటాను. యిప్పటికి నేను కృతార్థుడనైనాను.

జాన—చిత్తము, నేను నాప్రయత్నం మీదఃంటాను.

(అందరు నిష్క్రమింతురు)

—*—

ఐదవరంగము

[జానికరామయ్య భైరవసిద్ధాంతి ప్రవేశించుచున్నారు]

జానిక—సిద్ధాంతిగారూ! ముహూర్త మీ రాత్రియేగదా మీరు సాయంత్రము పెందరాళెవచ్చి మాయింటిదగ్గర కూర్చుండండి. మనమంతా కలిసి తరలివెళ్ళుదము.

భైర—పల్లకీ భజంత్రీలమాట యేమిచేసినారు కుదిర్చినారా?

జాన—పల్లకీవద్దు భజంత్రీలు వద్దు. సుముహూర్తము వేళకు మాత్రము డోలుసనాయి తెప్పిస్తాను. రెండవపెళ్ళివాడికి పల్లకీ యెందుకు? భజంత్రీ లెందుకు?

భైర—అల్లాఅనకండి. తమకు రెండవపెళ్ళికాని పిల్లకు రెండవపెళ్ళికాదుగదా? పిల్లకు ముచ్చటా అచ్చటా తీరవద్దా? పెద్ద వారు పల్లకీ యెక్కరని యెవరో అనుకుంటూండగా విని పెళ్ళి కూతురు యీ వెధవపెళ్ళి నాకొద్దేవద్దని యెంతో యేడ్చిందట.

జాన—నిజ మవును. పాప మాచిన్నదాని ముచ్చటకూడా తీరవలసినదే. పోనీ యేదైన పల్లకీ కుదర్చండి. పాలనిమిత్తం రాయి మొయ్యాలన్నట్టుగా పిల్లనిమిత్తం నేను పల్లకీ యెక్కుతాను.

భైర—ఆపని చాలాబాగావుంది. అది అందరు మెచ్చుకొనే పని. ఎందుకంటే యిదివరకే అందరు పెళ్ళికొడుకు పెద్దవాడు పెద్ద వాడని పిల్లని ఉడికిస్తూఉన్నారు. అందుకు తోడుగా పల్లకి యెక్కక పోతే మరీ అభాసుగా వుంటుంది.

జాన—కిట్టనివాళ్ళు చెబుతారు పీటలమీద పెళ్ళిళ్ళు చెడగొట్టే మహానుభావులు లేరుగనకనా? అయినప్పటికి నేను సాధ్యమయినంతవరకు పడుచువాడులాగుండుటకే ప్రయత్నము చేస్తూన్నాను. ఈముహూర్తము నిశ్చయమయినప్పటినుండి తలమీదనున్న తెల్లవెంట్రుకలకు నల్లరంగు వేసుకుంటూన్నాను. ఇప్పుడు నా వెంట్రుకలు జీడిగింజలుకన్న నల్లగా ఉన్నాయి. ఈమధ్య సంపెంగనూనెతోనే తలదువ్వుకుంటున్నాను. నేను సహజంగా బక్కపలచగా రివటగానుండుట చేతను కాయశరీరం మనిషినగుటచేతను నా కరవయి యేళ్ళున్నా—కాదు కాదు యాభై యేళ్ళున్నా ముప్పయి యేళ్ళ వాడిలాగే కనబడతాను. పెళ్ళికూతు రిదివఱకెప్పుడూ చూడకపోవడంచేత భ్రమపడుతోంది కాని చూస్తే అంత బెంగపెట్టుకోదు.

భైర—ఆనాలుగు తలంబ్రాలు నెత్తిమీద పడేవరకు యేవో మాయోపాయములుచేసి మీరు కాలంగడపండి. పిల్ల చాలా తెలివైనది. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టును. అయినా మీరుపెట్టేబంగారపుజడ, కట్టుకాసులపేరు చూస్తే నగలసంబరంమీద యీవిచారం మరచిపోతుంది లేండి. సరి ప్రస్తుతం నేనింటికి వెళ్ళి సాయంకాలము వస్తాను. అందరము కలసి వెళ్ళుదాము.

జానకి—చిత్తము.

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు.)

ఆఱవ రంగము

(కామయ్య భీమయ్యయను ఇద్దరుబ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు)

కామ—ఏమోయ్ భీమయ్యా ఏమిటి విశేషాలు?

భీమ—ఉన్న విశేషము వక్కటే. మన జానకిరామయ్యగారికి రాత్రి వివాహమైనది. యెంతో శోభస్కరముగా జరిగినది.

కామ—ఏమిటాశోభ ? శాస్త్రి నా చెవినిగూడా వేస్తూ.

భీమ—శోభన్నశోభా ! పెళ్ళికూతురు కన్యాదానపువేళ హోరున యేడుపట. పెండ్లికొడుకువారి తరుపువారు యెందు కేడుస్తూంది అని అడిగితే ప్రొద్దుటినుండి ఉపవాసము గనుక ఆకలిచేత యేడుస్తూందని తల్లిదండ్రులు సర్ది చెప్పారు.

కామ—చాలా పసందుగా నున్నది ఇంకో చిత్రముకూడా జరిగినదట యేమిటి ? మంగళస్నానాలికి వెళ్ళినప్పుడు పెళ్లికొడుకు నూతి దగ్గర జారి పడ్డాడట యేమిటి. చట్ట నెప్పి పట్టినదట.

భీమ—అప్పుడే నీదాకా వచ్చినదీ యీసంగతి. పెళ్ళికొడుకు ముసలివాడైనందుకు ముసిలివాడులాగ నడవక పడుచువాడులాగ గబగబ నడవపోయినాడు. లేనిపోని గోటు తెచ్చిపెట్టుకుంటే యేమవుతుంది ? పడ్డాడు చట్ట విరిగింది. తోమడానికి చీకటితోటే కుమ్మరాడిని తీసుకువెళ్లుచున్నారే.

కామ—ఆయన కట్టించుకొన్న దంతపు పళ్లూడి క్రింద పడ లేదుకదా.

భీమ—పడలేదు కాని, యీ నాలుగురోజులలోను యింకా యెన్ని అభాసులు జరగాలో అన్ని జరుగుతాయి. నీ చెవులతో నీవే వింటావు. ఏడుకట్లసవారీ యెక్కవలసిన ఆయన పల్లకీ యెక్కుచున్నాడు. దినవారాలుజరగవలసినయీడులో పెళ్ళిజరుగుచున్నది.

కామ—సరే నాకు పనియున్నది. నేను వెడతాను. రేపు కలుసుకుందాము.

(అని యిద్దరు నిష్క్రమింతురు).

—*—

ఏడవ రంగము

(అప్పుడు జానకిరామయ్యగారు విస్తరి ముందర పీటమీద కూర్చుండి ప్రవేశించుచున్నారు)

జాన—భైరవసిద్ధాంతిగారూ! మాపురోహితుణ్ణి రామావధానులు గారిని యిల్లా పిలవండి.

భైర—చిత్తము పంపుతాను. (అని వెళ్ళును.)

(రామావధాని ప్రవేశించును.)

జాన—రామావధానిగారూ! యిల్లా దయచేయండి. నాకు విస్తరివేసి వడ్డించి అరగంటయినది. పెండ్లికూతురు నేనుగలిసి భోజనము చేయవలెను గనుక కనిపెట్టుకుని యున్నాను. పెండ్లికూతురు యెంతసేపటికి రాదేమి? మీరు వెళ్లికనుక్కోండి. నా ప్రాణముచాలి వస్తూంది. నేను నల్లముండా ముండావాడినన్నమాట తెలియదు. పెండ్లి వారికి బొత్తుగా యింగితజ్ఞానం లేదు. మరియాద తెలియదు.

రామా—చిత్తము. ఇదిగో నేనువెళ్ళి కనుక్కొని తెలుసుకొనివస్తాను. (అని వెళ్ళును.)

(అప్పు డొకగదిలో ఏడ్చుచున్న పెండ్లికూతురు తల్లి దండ్రి మఱికొంద రాడవాళ్ళు ప్రవేశించుచున్నారు.)

తల్లి—అమ్మాయి. పన్నెండేండ్ల పిల్లవు. చెపుతే తెలుసుకోలేవేమే సుఖంమల్లే యేడవగూడదు. లే. అన్నాని కాయన కనిపెట్టుకున్నారు.

తండ్రి—అమ్మాయి లే. అమ్మా లే. దబ్బున వెళ్ళు.

పెండ్లికూతురు—నేనువెళ్ళను. నాకన్న మక్కర లేదు. మీ యింట్లో రూపాయల సంచులు పడ్డాయిగదా. నేను అన్నము తింటేనేమి తినకపోతే యేమి ?

తల్లి—ఛీ అనకతవక మాటలాడకు. పిట్టకొంచెము కూత ఘనము అన్నట్టు పెద్దపెద్దమాటలాడుతావేమిటి. పెద్దవాళ్ళము మేము మాయిష్టమువచ్చినట్లు నీమంచికోరి గొప్పసంబంధము తెచ్చినాము. కూటికి గుడ్డకి లేని కుఱ్ఱముండాకొడుక్కి కట్టిపెట్టమన్నావేమిటి. కావలసినంతభాగ్యం నిండా నగలు పెట్టుకొని అనుభవించేభాగ్యం నీకు లేదేమో కాని అంతా అదృష్టవంతురాలనంటున్నారు. కాక పోయినా ఆయనమాత్ర మేమంత పెద్దవాడు.

పెండ్లికూ—అవును. చిన్నవాడే. మాతాతయ్యయీడువాడు.

తండ్రి—ఛీ నోరుముయ్యి ఎవరైన వింటే నవ్వుతారు.

పెండ్లికూ—నవ్వనియ్యి నాకేమి భయములేదు. నేను రాత్రి విస్తరిముందర కూర్చున్నప్పుడు నడియాలు అప్పడాలు కొఱకలేక పోయినాడు నాకదగ్గర కూర్చుంటే ముసలికంపేస్తుంది. నేను రాను.

తల్లి—ఓసీ నీయమ్మకడుపు గాలిపోయిరిగదే దిక్కుమాలిన ముండా నీమూలాన్ని అప్రదిష్ట వస్తూందేనాకు (అని ఒక్క చరుపు వేయును,)

పెండ్లికూ—అమ్మయ్యో చంపివేశావే, (అని యేడ్చును)

తండ్రి—ఓసీ మోటముండా. పెళ్లికూతురే. దాన్నిప్పుడు కొట్టకు. ఈనాలుగురోజులు మాటదక్కించవే.

తల్లి—కొడతానా చంపుతానా దీన్ని. దీనిమొగముమండా; నలుగురులోను దీనిమూలాన్ని నాకు తలవంపులుగానున్నది.

[అప్పుడు రామావధానులు ప్రవేశించును.]

రామా—మంగయ్యబావగారూ. అవతల పెండ్లికుమారుడు గారు భోజనమునకు కనిపెట్టుకొనియున్నారు. ఆయన పదిగంటలకు భోజనంచేశేవారు. ప్రొద్దుపోయినదాక నుండలేరు. ఇప్పుడు పన్నెండు గంటలయినది. పిల్లని త్వరగా పంపించండి,

తండ్రి— దీనికేదో శనిపట్టినదండి. అస్తమానం యేడుస్తూ కూర్చుంటుంది. నాకేమీ పాలుపోవడంలేదు. అన్నానికి వెళ్ళమంటే వెళ్ళదు.

రామా — ఇది యేమైన గ్రహబాధ యేమో చూచారా.

తల్లి—నాకు నిజంగా గ్రహబాధలాగే తోస్తుంది. ఇదివర కొక్కనాడైనా పెంకితనంచేశి యెరుగదు నామాటకెదురుచెప్పి యెఱుఁగదు. ఇప్పుడు నేను చెప్పినట్టు వినదు, ఇది గ్రహబాధే.

ఒకస్త్రీ—(చేతులు త్రిప్పుకొనుచు ముందుకువచ్చి) వదినే ! అదే నిజము. నిన్నరాత్రి పందిట్లో నేను చాపవేసుకొని పడుకొని నిద్రించుచున్నప్పుడు యెవరో ఒక ఆడది నల్లచీరగట్టుకొని నగలు బెట్టుకొని అల్లా వెళ్ళిన జాడయైనది. పిలిస్తే పలకలేదు. పెళ్ళివారి తాలూకు మనిషి యేమో అని వూరుకొన్నాను.

తల్లి—అది తప్పకుండా దయ్యమే, మా యింటావంటా యెక్కడా చచ్చిన పునిస్త్రీలు లేరమ్మా.

ఒకస్త్రీ — పేరేమిటమ్మా. దాని సవతిలేదూ? ఈ పెళ్ళి ఆవిడ కిష్టంగా నుంటుందా ?

తల్లి — నిజమేనమ్మా బాగా చెప్పావు.

తండ్రి—గట్టిగా అనకండి. ఆమాటబాగుండదు.

రామా—సాయంకాలము నేను దయ్యాల మంత్రగాడిని తీసుకొని వస్తాను. అందాకా మీరు గప్చిప్పుగా వూరుకోనండి.

పెండ్లికూ—నాకు దయ్యము కాదర్రోయి నన్ను కొట్టి బాధ పెట్టకండి.

ఒకస్త్రీ—ఆమాటలు దయ్యపుమాటలే. ఈ పిల్లమాటలు గావు తన్నుకొట్టి మారణహోమము చేస్తారనే భయంచేత మనల నందఱను మోసము చేయుటకా పిల్లచేత అల్లాపలికిస్తూంది.

(అప్పుడు పందిట్లో గడబిడ వినబడును)

రామా—ఆగడబిడ యేమిటి చెపుమా!

[అప్పుడు వంటబ్రాహ్మణుడు ప్రవేశించును]

వంట—అయ్యో అయ్యో పెండ్లికుమారుడుగారు పీటమీద పడిపోయినారు. రండి రండి.

(అందరు పరుగెత్తుచున్నారు)

(అప్పుడు పీటమీద జానకిరామయ్యగారు పడియుందురు. చుట్టుజనులుందురు)

మంగ—చెవులు ముయ్యండి. చెవులుముయ్యండి.

రామా—అథవాపుత్ర సన్నిధౌ అన్నారు కొడుకును దగ్గరకు పిలవండి.

వంటబ్రా—శోష వచ్చిందయ్యా అన్నం మజ్జిగలో పిశికి నోట్లోపొయ్యండి.

[అంతట జానకిరామయ్యగారి కూతురు ప్రవేశించును]

కూతురు—(చూచి) నానోయ్ యి ఈదిక్కుమాలిన పెండ్లి యెందుకొచ్చినదోయి.

(అని యేడ్చును)

మంగయ్య—పెండ్లిపందిరిలో యేడ్వకమ్మా నీకు వోగాయిత్వము తెలియదు ఏమీ తెలియదు.

కూతు—ఇంకేమి వోగాయిత్వమోయి తండ్రి మానాన్న మాకు దూరమైనాడు.

వంట—(జానకిరామయ్యగారినోట్లోమజ్జిగఅన్నముపోయును)

జాన—(కొంచెము తెప్పిరిల్లి) భయము లేదు ఖంగారు చేయకండి.

(అని మెల్లగాబలుకును)

(అంతట నలుగురు మనుష్యులు సాయముపట్టి జానకిరామయ్యగారిని గదిలో బంధుకొనబెట్టుదురు.)

(అందరు నిష్క్రమించుచున్నారు)

—*—

ఎనిమిదవరంగము

[కామయ్య భీమయ్య ప్రవేశించుచున్నారు]

కామ—ఏమోయి భీమయ్యా. మనమంగయ్యగారింట్లో వివాహాము ముగిసినట్లున్నది.

భీమ—ఆహా! ముగిసినది. ముగియక యేన్నాళ్ళుంటుంది?

కామ—విశేషాలు చెప్పవేమి. ఆనాడు కాలువిరగబడి పెండ్లికొడుకు కుమ్మరివానిచేత తోమించుకొనువరకు విన్నాము. తరవాత కథ యేమిటి?

భీమ—కథలకేమున్నాయి. నాలుగవరోజున ఊరేగింపు జరిగినది విన్నావా?

కామ—అరవయి యేళ్ళ ముండాకొడుకు సిగ్గులేక యెల్లా ఊరేగినాడయ్యా!

భీమ—అంతమాత్రమునకే ఆశ్చర్యపోకు నీవు. అందులో విశేషమున్నది, పెండ్లికుమారునకు అతిమూత్రవ్యాధి ఉన్నదట, అందుచేత ఆయనగారు మాటిమాటికి పల్లకి దింపుమని బోయిలను బాధలుపెట్టి లఘుశంకకు వెళ్ళుచు వస్తూయుండేవాడు. బోయివాళ్ళు ఒకసారి దింపుటకు కొంచెము ఆలస్యముచేయగా వాళ్ళమీదబడి కొట్టబోయినాడు. అప్పుడందరు ఆపివేసినారు.

కామ—బాగావున్నది. ఊరేగింపునకు మీరుస్వయముగా వెళ్ళి యీ మహోత్సవమంతా చూచినారా యేమిటి?

భీమ—వెళ్ళినాను. ఇటువంటి ఉత్సవములు చూడకపోతే కన్నులున్న లాభ మేమి.

కాసు—నాకబలి, దండాడింపు అన్నీ అయినవా? దండాడింపులో పెండ్లికొడుకు నెవరెత్తుకొన్నారు?

భీమ—పెండ్లికూతురును జానకిరామయ్యగారివంట (బ్రాహ్మ డెత్తుకొన్నాడు. పెండ్లికొడుకును రామన్నగాడు ఎత్తుకొన్నాడు.

కాసు—ఏ రామన్న పీనుగులు మోసే రామన్నే?

భీమ—అవునువాడే. వాడు ఆయనను యెత్తుకోకమునుపు మెల్లిగా నా చెవిలో యీలా గన్నాడు. "ఎప్పటికైనా యీాయనను నేనే మోయవలసినవాడను గనుక యెంతబరువున్నాడో నేను చూచుకుంటాను." అని చెప్పి యెత్తుకున్నాడు

కాసు—దండాడింపులో ముచ్చట లేమైనా జరిగినవా?

భీమయ్య—లేకపోవడ మేమి. చిన్న ముచ్చటొకటున్నది. పెండ్లికూతురు తెలిసే చేసినదో తెలియకే చేసినదో చెప్పలేము కాని బుక్కా—బగ్గుండ పెండ్లికొడుకు కన్నులలో కొట్టినది. దండాడింపు అయినది మొదలుకొని ఆయన తిన్నగా కన్నులు తెరవలేకుండా నున్నాడు. ఇకముందు కండ్లవైద్యము కూడా చేయించుకోవలసి వస్తుంది.

కాసు—అప్పగింతలు బాగా జరిగినవా?

భీమ—ఆఁ జరగ కేమి. పెండ్లికొడుకును రామన్న కప్పగించారు. పెండ్లికూతురును వంటబ్రాహ్మడి కప్పగించారు.

కాసు—అదేమి టల్లా అంటున్నావు?

భీమ—పెండ్లికూతురుకు అత్తమామలు బావమరదులు, ఆడబిడ్డలు లేరుగనుక అత్తవారి తరపు వంటబ్రాహ్మడె సమస్త బంధువు గనుక అతనికే అప్పగించినారు.

కామ—నిజంగా అప్పగించారా యేమిటోయి ?

భీమ—నిజముగా చేయి పాలల్లోవేసి అప్పగించలేదు కాని పెండ్లికూతురు తల్లీ తండ్రిమాత్రము వంటబ్రాహ్మడిని పిలిచి నాయనా పిల్ల నిప్పటినుంచి మీ యింట్లోనే యుంచుతాము జాగ్రత్తగా చూడాలి. అన్నిటికీ నీవే సుమాయని చెప్పినారు.

కామ — అందుకు వంటబ్రాహ్మడేమన్నాడు ?

భీమ—ఏమంటాడు ! ఏవిధమైన లోటుపాటు లేకుండా అన్నిటికి నేనేయై సంరక్షణ చేస్తానని చెప్పినాడు.

కామ—ఈలాటి పెండ్లి సాధారణముగా మనముచూడము. పెండ్లికుమారుడు గారికి మీరెన్నాళ్ళు వేశారు ఆయుర్దాయం ?

భీమ—ఎవడు చెప్పగలడు. మీవంటివాళ్ళ ఆశీర్వచన ప్రభావంచేత ఆయన పదికాలాలు బ్రతక గూడదు ? ఆ చిన్నదాని కడుపున పదికాయలు కాయగూడదా ?

కామ— లేకపోతే వితంతుశరణాలయంలోనికి వెళ్ళిహాయిగా పెండ్లి చేసుకోగూడదా?

భీమ—ఛీ ఊరుకో, సుఖమల్లె ఆయన పెండ్లి చేసుకుంటే దిక్కుమాలిన మాటలాడుతావు.

కామ—దిక్కుమాలిన మాటలుకావు. నీ చెవులతో నీవే వింటావు. రా, పోదాము.

(అని యిద్దరు నిష్క్రమించుచున్నారు.)

---*---

[15]

చిత్రసంభాషణము

[హరిశాస్త్రి శంకరశాస్త్రి సంభాషింతురు.]

హరి—ఈవీధి యెక్కడికి వెడుతుందండి?

శంకర ఈవీధి యెక్కడికీ వెళ్ళదు. నాచిన్నతనమునుండి నేనుచూస్తున్నాను. యిది యిక్కడనె వుంటూన్నది.

హరి— యీవూళ్ళో చెరువుగట్టుగు యేలాగు వెడతారండీ?

శంకర—అందరుమనుష్యులు వెళ్ళినట్టే రెండుకాళ్ళతోనడిచి వెడతాము కాని మరియొక లాగు విపరీతముగా వెళ్ళము.

హరి—మీయింట్లో కూరలు యీరోజున యేమిచేసినారండి?

శంకర—యేమిచేస్తాం తిన్నాం.

హరి—మీవూళ్ళో సత్రం సరిగాజరుగుచున్నదా?

శంకర—ఒక అంగుళమైనా జరుగుటలేదు. మునుపున్న చోటనే యున్నది

హరి—మీరీరోజున యేమి యెక్కివచ్చినారండీ?

శంకర—ఏమెక్కి? ప్రొద్దెక్కి ఎండెక్కివచ్చినాము.

హరి—మీరంగయ్యగారు యీమధ్యను పోయినారట. ఏమివచ్చి పోయినారండి?

శంకర—కాలమువచ్చి పోయినారు.

హరి—మీకుభూములు మాన్యము లేమైనా ఉన్నవా?

శంకర—భూములూన్నున్నవి మాన్యములూ వున్నవి.

హరి—పంటపొలములా? తోటలా?

శంకర—పొలములూగావు, తోటలూగావు. నాకున్నభూములు రుద్రభూములు, బహిర్భూములు. మాకున్న మాన్యములు సామాన్యములు.

హరి—మీపూరు రాజులలో గొప్పరాజెవరు?

శంకర—పోతరాజు.

హరి—మీరు యేనీళ్ళు తాగుతారు చెరువునీళ్ళా?నూతినీళ్ళా

శంకర—అది యేమిః మాకు తెలియదు. మేము మంచినీళ్ళు తాగుతాము.

హరి—మీపూళ్ళో ధనవంతులు చాలమందియున్నారటండీ?

శంకర—ఆహా!మాపూళ్ళో ఒక్కొక్కడి దగ్గరపదికోట్లున్నవి

హరి—అందరు భాగ్యవంతులు యేగ్రామమందు లేరు మీరు అబద్దము చెప్పుచున్నారేమో!

శంకర—అబద్దము కాదు. నిజమే ప్రమాణంచేసెదను. నేనెంతో బీదవాడను కదా నాదగ్గరే నాలుగుకోట్లున్నవి. రెండు పట్టుకోట్లు రెండు ఆల్పాకాకోట్లు మొత్తం 4 కోట్లు.

హరి—వారములలో ఏవారం మంచిది. యేవారం చెడ్డది?

శంకర—యీదినములను బట్టిజూడగా యీాయవారంమంచిది దినవారం చెడ్డది.

హరి—రోజులలో యేరోజు మంచిదండి?

శంకర—నవరోజు చాలా మంచిది.

హరి—అన్ని దానములలో ఏదానము ఉత్కృష్టమైనది?

శంకర—నిదానము

హరి—ఏపాలు పుచ్చుకొన్న మనము చెడిపోనుము?

శంకర—పాపాలు, కోపాలు.

హరి—ఏమనువు హిందువుల కిష్టము లేనిది?

శంకర—మారుమనువు.

హరి—మాఅమ్మాయికివివాహం చేయదలుచుకొన్నాను. పెండ్లికి ముఖ్యంగా యెవరెవరిని పిలవవలెనో కొంచము సలహా చెప్పండి?

శంకర—చెప్పుచున్నాను వినండి. పెండ్లికి ముఖ్యముగా యుండవలసినవారు వీరు. అన్నంభట్టువారు, కందులవారు, శనగపల్లివారు, పెసరగంటివారు, పప్పువారు, నేతివారు, వుప్పువారు, కొండావారు వంకాయలవారు, బీరకాయలవారు, చెమ్మకాయలవారు, ఫోకలవారు, పొగాకువారు, చల్లావారు, పందిలివారు, పాకలవారు, మూతివారు, చెరువువారు.

—౦—

సప్తగ్రహకూటము

క్రిందటి నెల 31 వ తేదీని సప్తగ్రహకూట మగునని యు అందువల్ల ప్రపంచమున కనేక కష్టములు సంభవించునని యు లోకులు తలంచిరి. ఈ గ్రహ కూటములవల్ల జరిగిన వైపరీత్యములు కొన్ని మాకు తెలిసినంతవఱ కీక్రింద నుదహరించుచున్నారము:–

అత్తవారియింటి యల్లుళ్ళు కన్యారాశిలోను మిధునరాశిలోను నుందురు. తులారాశి సరుకులమ్మ్ము వర్తకుల స్వాధీనమయి పోవును. (తుల అనగా త్రాసు.) చిన్నపిల్ల లాదయ మేడుగంటలకు, ఉద్యోగస్థులు పదిగంటలకు, తక్కిన వారు రెండు జాములకును కుంభరాశిలో ప్రవేశించుచుందురు. ఆ సమయములందు శూద్రాదుల యిండ్లలో మీనరాశి కుంభరాశిసమీపమున చేరుచుండును. వృశ్చికరాసి ఆకాశమండలము వదిలి కన్నముల పాలగును. (మేషం మేక) ఈరాశి గొల్లల పాలగును. వృషభరాశి మెడలమీద నాగలికాడిబండి యెక్కును. మకరరాశి నదులపాలు సముద్రములపాలు నగును. (మకరమనగా మొసలి) ధనుర్రాశి కోయవాండ్ర చేతిలో నుండునని యు సింహరాశి

అడవుల పాలగుచుననియు కర్కాటకరాశి బొరియలలో దూరియుండు ననియు వేరుగ జెప్పనక్కరలేదు. ఈరాసులలుండగ, అతివర్షములు కురిసినచోట ధాన్యపురాసులు తగ్గును. కాని సర్కారున కీయవలసిన శిస్తు రూపాయలరాసులు మాత్రము తగ్గవు. ఉద్యోగస్థులకు తాబే దారులు చేయవలసిన సప్లయివస్తువుల రాసుల యథాప్రకారముగానే యుండును. లంచములు పుచ్చుకొనువారికి సొమ్మురాసులు పెట్టెలలో జేరును. ప్లీడర్ల ఫీజు రాసులు విసుగురాసులు ఎక్కువగనుండును. శ్రద్ధరాసి పనిరాసి చాలమంది దగ్గఱ కనబడదు. ధాన్యాదులు అపర దినుసుల రాసులు రాసులుగ నిలవపోసిన వర్తకులకు దండుగరాసి దుఃఖరాసి కొందర కేర్పాటైయున్నది. లంచము పుచ్చుకొని అర్బతు నాటు కంపెనిలో దాచుకొన్న కొందరు ఉద్యోగస్థులయొక్క ధనరాసి నాసియైనది. గనుక వారు తిరిగి ప్రజలమీద సొమ్ము వసూలుచేసి పెద్దరాసి చేయుదురు. ఈ సప్తగ్రహ కూటమువల్ల వచ్చిన పౌర బాట్లు వైపరీత్యములు గొన్ని యీ క్రింద నుదహరించుచున్నాము:-

అదివరకు రెండుమూడు సంవత్సరములనుండి యొకచోటనున్న యుద్యోగస్థులు యింకా కొంత కాలము తామక్కడ నుందుమనుకొని తమదగ్గర దాఖలైన కేసులలో లంచములు తెప్పించి పుచ్చుకొనిరట. పాపము వారి కకస్మాత్తుగా బదిలీయై పోయినదట. పాపమా యుద్యో గస్థులు వీరితో జెప్పకుండగనే వెళ్ళిపోయిరి. అడుగుటకు వీలైన యంశము కాదు గావున నోరుమూసికొని ఊరకుండిరి. ఈ గ్రహ కూటమువల్ల ఆయుద్యోగస్థులకు వీరిసొమ్ము వీరికిచ్చుటకు వీలు లేక పోయినది. రాజమహేంద్రవరము పాలఘాటు మునిసిపాలిటీల గత సం వత్సర పరిపాలనను గురించి గవర్నమెంటువారు విమర్శన చేయునపు డాయా మునిసిపలు చేర్మెనులయొక్క పరిపాలనము చక్కగానున్న దనియు కౌన్సిలర్లదే లోపమనియు కేవలము పౌరబాటుగా వ్రాయుట

కీసప్త గ్రహకూటమే కారణము న్యాయబుద్ధియు సమదృష్టియు గల గవర్నమెంటువారికినయిత మీాపాడు సప్తగ్రహకూటము పొరబాటభిప్రాయమును గలిగించినదిగదా దీనికదుపు కాల! దీనియందెంత శక్తియున్నదోచాలచోట్ల ఈసప్తగ్రహ కూటమువల్లముండ నుంచు కొన్నవాడు జూదగాడు, త్రాగుబోతు, బూతులు తిట్టువాడు, లంచగొండి, మోసగాడు గొండెగాడు ఈయేడుగురు అతిమైత్రిగలిగి ప్రవర్తింతురు. ఆసప్త గ్రహకూటముల కెంత మైత్రియుండునో వీరిలోవీరికి నంతమైత్రియుండును. సాధారణముగ వీరందఱు నొకచోటనేచేరియుందురు. ఆకాశమందున్న సప్తగ్రహకూటమునకు పోటీగా వీరు భూలోక సప్తగ్రహకూటమై ఆకాశగ్రహములకంటె ఎక్కువకీడు సేయుచుందురు. ఆకాశగ్రహములకు యేమైన కొన్ని శాంతులు చేసినపక్షమున అవి శమించును. ఈ గ్రహముల కెంత శాంతి చేసినను క్రూరదృష్టియేగాని దయాదృష్టి లేదు. ఇవి యన్నియు సాధారణముగ నీచ గ్రహములే కాని కాలవశముచేత గొప్ప రాసుల లోనికి వెళ్ళి ఉచ్చదశకు వెళ్ళుచుండును. ఈగ్రహములలో అప్పుడప్పు డొకదానితో నొకటి పోరాడుచుండును. కాని అన్నియు సమానబుద్ధికలవగుటచేత త్వరలోనే కలియుచుండును. ఆకాశము మీాదనున్న సప్తగ్రహకూటము త్వరలోనే విడిపోవును. గాని యీా గ్రహకూటము విడిపోవునట్లుతోచదు. ఇదియే సప్తగ్రహకూటఫలం.

గొప్ప వైద్యుడు

ఒకానొక ఘనవైద్యుడు తన ప్రజ్ఞనుగురించి మాపత్రికలో ప్రకటన జేయవలసినదని కోరినందున యీాక్రింది ప్రకటనమును మేము లోకులకు దెలియచేయుచున్నాము. ఇదిప్రకటించుటవలన లోకమున

కుపకారము జరుగును గాన మేము దీని నుచితముగానే ప్రకటిం
చున్నాము.

ఆంధ్రమహాజనులారా! నేను లోకోపకారార్థమై వైద్యవ
చేయుచున్నాను. నాదగ్గర లేని మందు లేదు నేను కుదర్చలేని జాడ
ము లేదు. నేను మందిచ్చినపక్షమున సమస్తరోగములు తప్పక కు
రును ఒక వేళ యీజన్మలో నారోగము కుదరకపోయినను నామం
ప్రభావమువల్ల ముందుజన్మములో నారోగము రాదు. నేను వైద్య
చేయుట కొప్పుకొన్నపక్షమున నేయింటిలో వైద్యము చేయుదుని
ఆయింటిలోనే రాత్రిపగలు నివాసము చేయుదును. అక్కడనే భో
ము చేసి యక్కడనే పండుకొందును. ఇట్లు చేయుటకు గారణము నే
సదుపాయముగ, అన్నముతిని బసచేయవచ్చునని కాదు. నేను దూ
ముగా బసచేసినపక్షమున రోగియొక్క బంధువులునన్ను పిలుచుట
నాలుగు మూడు సారులు రావలసియుండునుగద. వచ్చినపక్షమున వ
కాళ్ళు నొప్పిపెట్టును. కాలమువ్యర్థమగును. నేను వారింట్లోనే
చేసెడుపక్షమున రోగిబంధువులకీబాధలుండవు. ఒకసారి ఒకరియింట్లో
వైద్య మొప్పుకొందును గాని యేక కాలమం దిద్దఱియిండ్లలో
వైద్య మొప్పుకొనను. మొదట ఒప్పుకొన్న చోట యేదో సం
తేలినతరువాత రెండవచోట ఒప్పుకొందును. నాదగ్గర నలుగురుశి
లున్నారు. వారునలుగురు నాలుగుసత్రములలోను బసచేసియున్నా
సత్రములలో బసచేయుటచేత వారికి జీవనాధారము లేదనిమీరుత
చవద్దు. మార్గస్తులనేకులు సత్రములలో బసచేసిజబ్బుపడుచుందు
అట్టివారిని నావద్దకుతీసికొనివచ్చి వైద్యము చేయించుటకై వారిని స
ములలో నుండుమని నేనేయాజ్ఞాపించినాను. ఆశిష్యులు నేనువైద్య
చేయునట్టి యింటికివచ్చి కావలసిన మూలికలు వస్తువులు మొదల
నవి యిచ్చుచుందురు. అందువల్ల రోగిచుట్టములకు శ్రమయుండ

మందులు మొదలయినవి వాళ్ళేనూరుచుందురు. ఇందుకు వాళ్ళ కేవిధమైన ప్రతిఫలము నీయనక్కఱ లేదు. ఒకవేళ నావైద్యమువలన రోగము కుదరక రోగి మరణముపొందుట సంభవించిన యెడల ఆయింటివారు శవమును మోయుటకై వాహకులు నిమిత్తము వెదకనక్కఱ లేదు. నాశిష్యులు నలుగురు ఏవిధమైన యాటంకము లేక శవమును మోయుదురు. ఒకవేళ నాశిష్యులలో నెవడైన యేకారణముచేతనయినా రాక పోయినపక్షమున ఒకకొమ్ము గాని అవసరమైన పక్షమున రెండుకొమ్ములుగాని పట్టుట కేవిధమైన యభ్యంతరము నాకు లేదు. నేను చిన్నతనమందు శ్రాద్ధమంత్రము చెప్పుకొన్నాను. అముక్క లిప్పటికి నాకు గట్టిగా వచ్చును. కాబట్టి దినవారములు చేయించుటకై వేరే మంత్రబ్రాహ్మణులకోసమై వారు వెదుకుకోనక్కఱ లేదు. నేనే కర్మ యథావిధిగా జరిగించగలను నాశిష్యులే పదకొండవదినమందు పన్నెండవదినమందు షోడశపిండములలో భోక్తలుగా గూర్చుందురు. కాబట్టి భోక్తలకోసము వారు వెదుకనక్కఱ లేదు. రోగము కుదిరినతరువాత నాకు బహుమానమీయవచ్చును. కుదరకపోయినపక్షమున నేనుపడ్డశ్రమకు డబ్బియ్యనక్కఱ లేదు. గోదానము నాకిచ్చి వారికితోచినంత మంత్రదక్షిణ యిచ్చినపక్షమున నేను సంతోషపడుదును. ఈ పైయుపకారము లేగాక ప్రజల సదుపాయముకొఱకు నేనింకొక పనిగూడ చేయదలచుకొన్నాను. మందులు పోయగలనుగాని ఆయువుపోయలేనుగదా. అందుచేత నేను వైద్యముచేయు స్థలమందు దైవవశముచేత రోగి పోవుట తటస్థించిన యెడల గృహయజమానులు తరువాత కర్మలకు యిబ్బందిపడకుండా ఒక కట్టెలఅడితియు ఒక కుండలదుకాణము పెట్టించ దలచుకొన్నాను. గంధపుచెక్కలు సైనుబట్టలు ఫురికొస డొక్కనార చీపుళ్ళు మొదలయినవి కూడా అక్కడనే దొరకును. నన్ను వైద్యమునకు పిలిచిన యింటివారికే గాని తదితరులకు నేను సర

కులనమ్మను. ఇదివరకు లోకములో వైద్యము చేయునట్టివా
లున్నారుగాని యిన్నిసదుపాయములు చూపించి వైద్యమ
నట్టి వారిదివఱకు లోకములో లేరు. ఈ పట్టణవాసు
పూర్వపుణ్యముచేతనే నీగ్రామమువచ్చి చేరితిని. కాబట్టి
కూచక మనుకొనక వాగాయిత్యమనుకొనక అన్నిలాభమ
కొని యెవరింట్లో జబ్బుగానున్నను నన్నే పిలువవలయు
చున్నాను. ఇట్లు

విన్నవించు వి

సిండాల రాను

—*—

మహజరు

మహారాజరాజశ్రీ గోవిందరాజపురం కొత్వాలువా
మునకు — మాపట్టణములోనున్న విటసంఘముయొక్క ప్ర
దర్శి కోడెగాల కొనేటిరావు, సభాధ్యక్షుడు దివాలా దిగ
ఉపసభాపతి దండుగుల దామోదరరావు వ్రాసి దాఖలుచే
జరు అర్జీ.

అయ్యా! ఈనెల 35 వ తేదీ రాహువారమునాడు
అష్టవంకరల అంబుజాక్షిగారి కొంజా నసారా అరుగుమీద
సంఘముయొక్క బహిరంగసభలో, ఈక్రిందితీర్మానము
ఆనందరావుపంతులుగారిచేత ప్రపోజుచేయబడి కొరకం
రావుగారిచే సెకండుచేయబడి యెల్లవారిచేత నంగీకరి
"ఈపుర మందలి పడమటివీధిలో సంసారులను లేవగొట్ట
మనము కొత్వాలుగారికి మహజరివ్వవలెను," ఈపై తీ
సభకు విజయంచేసినవారందఱిచేతను. ఏకకంఠ్యముగ న
బడినది ఈ తీరుమానముయొక్క అర్థము ఏలినవారికి సం

తెలియుటకై యీక్రింది సంగతులు మీకీశదానిమిత్తం తెలియజేయుచున్నాము— మేము రమారమి పది సంవత్సరముల క్రిందట మహారసికుల కందఱకు వినియోగముగునటుల విటసంఘము నొకటి స్థాపించినాము. ఇది లోకోపకారార్థమై స్థాపింపఁబడినది. ఎట్లనగా పూర్వకాలమునందలి యుద్యోగస్థుడు ప్రతివాడు, ఒక్కొక్క భోగముదానిని చేరదీసి యెంతో షోకేలాగా కాలము వెళ్ళబుచ్చేవాడు. అందుచేత భోగము వాళ్ళకు, సానెవాళ్ళకు. గుడిసెవేటువాళ్ళకు అన్నవస్త్రములు లోటులేకుండ గౌరవముగ కాలక్షేపముజరుగుచుండేది. ఇప్పుడు నవనాగరికులు బయలుదేఱి పూర్వమరియాదలు పాడుచేసి "అవశ్యం పితురాచార" మన్నమాట మరచిపోయి మే మేక పత్నీవ్రతస్థులమని సింగినాదమని జీలకఱ్ఱయని తెగనీలిగి పెద్దపోకలబోయి గొప్పకబురులు చెప్పి భోగమువాళ్ళ నుంచుకొనుట మానివేసినారు. అంతతో భోగభోగము మేళములగూడ చూడమని ప్రమాణము చేయుచున్నారు. ఎక్కడనో మొత్త మనసుగల మంచిమహానుభావు లట్లు ప్రమాణములుచేసియు యేచాటుననో వీలైనప్పుడు భోగము మేళములుచూచి వాళ్ళ కొంపలలో దూరుచున్నప్పటికి మొత్తముమీద యీనవనాగరికుల చెడ్డనడతలవల్ల భోగము వాళ్ళకూడు పడిపోయినది, సరిగా అన్నవస్త్రములున్న భోగముదే యిప్పుడుకనబడదు. భరతఖండముయొక్క గొప్పయంతయు భోగమువాళ్ళతోనేయున్నది. ఊర్వశీ రంభ మేనక లేకపోయినపక్షమున స్వర్గలోక మేప్రకారముగ పాడైపోయి దిబ్బయగునో ఆప్రకారముగానే వేశ్యాంగనలు లేకపోయినపక్షమునభరతఖండము నిస్సారమై రసహీనమై శ్మశానమై కనబడును. వేశ్యలు లేకపోయినచో శృంగారరసము చెడిపోవును. సంగీతము నశించిపోవును. అభినయమడుగంటును, నాట్యమునష్టమగును, కాబట్టి భూతదయచేత జూచినను సంగీతాభినయశాస్త్రముల వృద్ధినిబట్టి చూచినను పురుషుల ఆయుర్వృద్ధి తలచి చూచినను సర్వవిధములచేతను మనము వేశ్యల నాదరింపవలసియున్నాము. ఈగొప్పయుద్దేశ్యమును మనసులో పెట్టు

కొని లోకము తీతువుపిట్టలవంటి యీనవనాగరికులతోనే యున్నదా యని తెగించి మమ్ము నాదరించువారే కోటానకోట్లు తప్పక యుందురని నమ్మి ఈ విటసంఘము లోకోపకారార్థముగ దేశోపకారార్థముగ స్థాపించితిమి. స్థాపించినది మొదలుకొని మీదయవల్ల నానాటికి మెంబర్లు విరివిగా జేరుచున్నారు. ఇప్పటికి రిజస్టర్లమీదనున్న మెంబర్లు నూరుగురు. ఈ సంఘములో జేరి, అప్పటప్పట గ్రహచారము చాలక మరణము చెందిన మెంబర్లు 280. రిజస్టరులో పేరువేసికొనవద్దు మీసంఘములో మెంబర్లుగ జేరుతాము అని చెప్పి చేరినవాళ్ళు ఇప్పటికై దువందలమంది. ఇది శుక్లపక్ష చంద్రునివలె నానాటి కెంతో అభివృద్ధిపొందుచున్నది ఇప్పు డేలినవారికి మేము మనవిచేసికొను నట్టి ప్రార్థన యేమనగా ఈవిటసంఘములో కొందరము గోవిందరాజ పురములో పడమటవీథిలోనున్న సందులో వేశ్యాంగనల నుంచుకొన్నాము. మేము అర్థరాత్రివేళ అపరాత్రివేళ ఆ వీథులలో తిరుగుచుంటిమి. ఒకప్పుడు మేము ఒళ్ళు తెలిసివుంటాము, ఒకప్పుడు ఒళ్ళు తెలియక ఉంటాము. మానిమిత్తము బోగమువాళ్ళనిమిత్తము పెద్ద మనుష్యులుకూడాలనేకమంది వస్తూవుంటారు. పైన చెప్పబడినవీథిలో మాతోపాటు సంసారులుకూడా కొందరు కాపురమున్నారు. ఈ సంసారు లీవీథిలో నుండుటవల్ల మాకున్ను మా బోగమువాళ్ళకున్ను చాలా యిబ్బందిగానున్నది. మే మెప్పుడైనా ఒళ్ళు తెలియకుండా వచ్చినపక్షమున ముసుగులువేసికొని రాత్రులు సానెకొంపలలోదూరు నట్టి పెద్దమనుష్యులను యీసంసారులు అనవసరముగ ముసుగులెత్తి చూచి ఫలానివారు అక్కడికి వెళ్ళినారు ఇక్కడికి వెళ్ళినారని గ్రామములో వాడుకలు వేయుచున్నారు. మే మెప్పుడైనా రాత్రులు ఒళ్ళు తెలియక కొంచెము మోటమాటలతో దెబ్బలాడుకొన్న పక్షమున ఇక్కడ సంసారస్త్రీ లున్నారు. బూతుమాట లాడవద్దని మమ్మును యిబ్బంది పెట్టుచున్నారు వెనుక నూరురూపాయలు జీతము పుచ్చుకొనునట్టి పెద్దమనిషి యొకడు ముసుగు వేసికొని యొకరాత్రి సానె యిల్లనుకొని సంసారియింటి తలుపువద్దకు వచ్చి కమలాక్షీ కమలాక్షీ

యని పిలవగా యజమాని లోపలినుండివచ్చి జుట్టుపట్టుకొని చెప్పుతో గొట్టి పంపెను. సంసారులమధ్య నుండబట్టి మాకిట్టి చిక్కు- లప్పు డప్పుడు తటస్థించుచున్నవి. కాబట్టి యేలినవారు ధర్మఖామందులు గనుకను మీరుకూడా స్వయముగ మహారసికులుగనుకను అర్జీదారు లందఱు ముండలముతాకోరు లనుకొనక సంసారులను ఆవీధిలోనుండి లేవగొట్టి మాకున్ను వేశ్యకాంతలకున్ను సంపూర్ణమైన స్వేచ్ఛ సౌఖ్యము కలుగజేయుదురని ప్రార్థించుచున్నాను. ఈఘనకార్యము సరసులైన మీా యధికారములోనే జరుగవలెనుగాని మరొకరి యధి కారములో జరుగదు.

దివ్యచిత్తానకు తేవలెను,
ఇట్లు విన్నవించు విధేయులు,
దివాలా దిగంబరిరావు వగైరాలు.

—*—

ఆ కా శ వి శ్వ వి ద్యా ల య ము

ఇంద్రవారము 37 వ డిశంబరు 19763 వ సంవత్సరము. కాలము అనురసంధ్యవేళ గం. 7–5 ని మొదలు 7–6 ని. వఱకు

విషయము—గణితము.

1 ఒక గ్రామమునసబు తనపై యధికారులు వచ్చినప్పుడు వెన్నమీాగడ పాలు కోళ్లు మేకలు గుఱ్ఱములకుగడ్డి మొదలగునవి సప్లయిచేయగా నతనికి నూరురూపాయలు కర్చయ్యెను. అధికారి బిల్లుచేయ మనగా మునసబు అయినంతసొమ్ముకు బిల్లుచేసినపక్షమున కోపము వచ్చునని రు 35–11–8 పైసలకు బిల్లుచేసి తక్కినసొమ్ము ఆయూరిలో నున్న 89 గురు రయితులను దామాషాయిని యిచ్చు కొమ్మని చెప్పెను. అందు 19 గురు రయితులు మేమిచ్చుకోమని తిరుగుబాటు చేయగా మునసబే పెట్టుకొనెను. ఒక్కొక్క రయితు పెట్టుకొన్న దండుగయెంత ? మునసబు పెట్టుకొన్న దండుగయెంత ?

$2 \times 2\frac{1}{2}$ వెడల్పు $\times$ 100 ల పొడుగుగల యొకవీధికి కంకర వేయవలయును. ఈ కంకర వేసిన రెండువారములకు గోతులు పడునట్లు, మూడువారముల కడుగుననున్న మట్టి బయలుపడునట్లు, నాలుగువారములకు వేసిన ఆనవాలే కనబడకుండనుండునట్లు తేలికయైన కంకర అంగుళములో నెనిమిదోవంతు యెత్తున కంట్రాక్టరుకు యెస్టిమేటు సొమ్ములో నూటికి 95 వంతులు మిగులునట్లు వేయుటకెంత సొమ్మువట్టును ?

3 అప్పుడప్పుడు కేసులలో దొరికిన రు 6750 లు ఒక కాని స్టేబిలు, ఒక హేడ్డు, ఇద్దరుయిన స్పెక్టర్లు అనునలుగురకుపంచిపెట్టుడు. కాని స్టేబిలుకంటె రెండు రెట్లు హేడ్డునకును హేడ్డుకంటె రెండు రెట్లు ఇనస్పెక్టరునకును రావలయును.

4 విష్ణుపురమను గ్రామములోనున్న బందెలదొడ్డిమీద అధికారముగల గ్రామమునసబు ఆసంవత్సరము గ్రామవాసులు బందెకు తోలుకొని వచ్చిన 793 పశువులకును, పశువు 1కి 0—4—0 ల చొప్పున సర్కారుకు చెల్లవలసినసొమ్ము మింజుమలె మునసబు సర్కారుకు 73-4-0 లు జను కట్టించెను. మునసబుగారు లెక్క వ్రాయకుండా యెన్ని పశువులు తోలుకొని బందెసొమ్ము తాంబూలపు కర్చుక్రింద వినియోగించినారు ?

5 చెన్నపట్టణము గొల్లవాడొకడు ఇంటింటికి ఆవునుదూడను తీసికొనివచ్చి పాలుపిదకదలచి పాలుచేపుదలనిమిత్తము ప్రతియింటి వద్ద దూడను ఒకసారితల్లితో గలిపి వెంటనేయీవల కీడ్చుచువచ్చును. అతడావిధముగ ప్రతిదినము 12 యిళ్ళకు పాలిచ్చుచువచ్చెను. ఒక్కొక్కయింటివద్ద నొక్కచుక్కపాలు దూడత్రాగినపక్షమున వారమునకెన్ని చుక్కలు పాలు దూడత్రాగును ?

6. నూరుచుక్కలు ఒకగిద్దెడుగా లెక్కచూచుకొన్న పక్షమున దూడకడుపులో సోలెడుపాలు పడునప్పటి కెంతకాలముపట్టును?

7 నూరురూపాయలు జీతముపుచ్చుకొనునట్టి యొకయుద్యోగస్థుడుప్రతిదినముడైరీ వ్రాయుటకుబద్ధకించి ముప్పదిదినములూరకుండగా

పైయధికారి యేది సీడైరీ చూపుమని యడిగినప్పుడు త్వరగా, త్వరగా డైరీవ్రాయుట కెన్నిగంటలతనికి పట్టును? పుట 1కి 20 పంక్తులుండును పంక్తి 1 కి 25 అక్షరము లుండును.

7 ఒక సత్రముగుమస్తా రోజు 1 కి 50 బ్రాహ్మణులకు 30 యితర వర్ణస్థులకు అన్నము పెట్టవలసి యుండెను. ప్రతి మనుష్యునకు 0–2–0 ల చొప్పున సత్రపు అధికారులు లెక్కచూచి యతనికి ప్రతిదినము సొమ్మిచ్చుచుండిరి. నెల 1 కి 30–0–0 ల చొప్పున అతడు సత్రము సొమ్ములోనుండి లాభముతీసుకొన్న పక్షమున ఈ గుమస్తా ప్రతిదినము యెంతమంది కడుపు కాల్చవలెను.

8 రాజమహేంద్రవరములో గోదావరిఒడ్డున వేసినగట్టుమీద నుండి మెట్లమీదుగా గోదావరిలోనికి డెబ్బది సంవత్సరముల ముస లమ్మ యెక్కితే కాలుజారిన పక్షమున యెన్ని పిల్లిమంతములు వేసి నీళ్ళలో పడును?

ఈ ప్రశ్నలలో నొకటియైన వ్రాయక యూరికే కూర్చున్న కొందరు పరీక్షలో కృతార్థులగుదురు. వ్రాసినవారు తప్పిపోదురు.

—*—

పెండ్లికొడుకుల లక్షణములు

ఒక బ్రాహ్మణుడు తన కూతునకు వివాహయోగ్యమైన వయస్సురాగా తనకు సంబంధము కుదిర్చిపెట్టుమని మరియొక బ్రాహ్మణు నాశ్రయించెను. ఆబ్రాహ్మణుడు సరేయని యంగీకరించి కొంతకాల మిట్టటు దిరిగి యొక సంబంధము కుదుర్చుకొనివచ్చి పెండ్లికూతురు తలిదండ్రులతో నీ విధముగా జెప్పెను.—

"నేను కుదుర్చుకొని వచ్చిన సంబంధము మీ యదృష్టము వల్ల లభించినదని చెప్పవచ్చును. వారి యింటిపేరు భాగ్యమువారు, గోత్రము భారద్వాజస గోత్రము, మీకును వారికిని ఋషులు కలియరు. కుల గోత్రముల కేమిలోటు లేదుగదా. ఆ గ్రామములో వారు మిక్కిలి ప్రసిద్ధులు. పెండ్లికొడుకుపేరు ధనరాజు. వారియింట్లో కావలసినన్ని యెలుకలు పిల్లులు నల్లులు పేలు నున్నవి. వారియిల్లు చాల విశాలమైనది. కావలసినంత గాలి వెలుతురు వచ్చును. వెలుతురుమాట చెప్పవలసి వచ్చినప్పుడు సూర్యచంద్రులను యింటిలో కట్టివేసినారనియే చెప్పవచ్చును. వారిది స్వాంతకమతము. వారికి కావలసినన్ని ధాన్యము పండును. ఆయూళ్ళో వారికి కావలసినన్ని భూములున్నవి. పెద్ద సంసారము. పదిమందికలవాళ్ళు బంధుసముద్రులు. దొడ్డినిండా యెప్పుడు చూచినా కావలసినన్ని పశువులు. వారికెంత మాత్రము గర్వములేదు. పాడియున్నది. పెండ్లికొడుకు పచ్చగా దబ్బపండువలె నుండును. నిజముగా చూడ కన్నులు లేవని చెప్పవలసినదే. అతనిదర్జా యెటువంటి దను కొన్నారు. అతడు వీధులలో సంచరించునపుడు రాజువలె సంచరించును. అనగా యీప్రక్కనొకమనిషి ఆప్రక్కనొకమనిషియతని కెల్లపుడు నుండవలసినదే అధమపక్షముఒకమనిషియైనకూడాఉండక పోతే యతడిల్లుబయలుచేరడు అతనిదస్తూరీ మోస్తరుగా యెవరిది యుండదు. ఆయింటివారేవస్తువు నిమిత్తము వీధిలోనికి వెళ్ళవలసిన పనియుండదు. ఒకరిదగ్గరవారు బదులు తెచ్చుకోరు. ఒకరికివారివ్వరు. పెండ్లికొడుకెంతసుకుమారుడో వినండి. ఒకరుతనకు గొడుగుపట్టవలసినదేగాని తాను స్వయముగా గొడుగుపట్టుకొనడు, జోడుతొడుగుకుంటే కాళ్ళు కందిపోవునని యతడు జోడైనా సరిగా తొడగడు. మెత్తని పరుపుమీద పండుకొన్నను అతని యొడలు నలిగి పోవునని చెప్పవచ్చును. ఎండకన్నెరుగని సుకుమారుఁ డనగా నతడే. అతడు

యిల్లు కదిలి యెక్కడికి వెళ్ళడు. తన పొలములోనికైన తానెప్పుడు వెళ్ళడు. ఆతని కేపని కావలసిన యింట్లోవాళ్ళు పయివాళ్ళుకూడా గబగబ వచ్చి చేసి పెడతారు. కాబట్టి యీసంబంధము సర్వవిధముల చేయతగ్గది.

ఆయనమాటనుబట్టి పెండ్లికూతురు తలితండ్రులు పెండ్లికొడుకును చూడకయే వారియిల్లు వాకిలినైన దర్శింపకయే సంబంధము నిశ్చయించుకొని ముహూర్త మేర్పరచిరి. పెండ్లివారు ముహూర్తము నాటికి తరలివచ్చిరి. పెండ్లిసమయమున పెండ్లికొడుకు కన్నులు కనబడనివానివలె ప్రవర్తించెను. ఆకారముమట్టుకు బాగుండెను గుడ్డివానివలె నున్నాడది యేమిటని పెండ్లికూతురు వారడుగగా పెండ్లికొడుకు కన్నులు కలిగినవని. అందుకు నిప్పులు యెండ చూడలేడని పెండ్లికుదుర్చుటకు వచ్చిన బ్రాహ్మణుడు జవాబు చెప్పెను. అదివిని పెండ్లికూతురు వారొకవిధముగ నగము బెంగతో నుండిరి. పెండ్లికొడుకు గుడ్డివాడనియు వారు మిక్కిలి పేదవారనియు దెలిసి మిక్కిలి గోలపెట్టి సంబంధము కుదిర్చిన బ్రాహ్మణునిమీదపడి యేడ్వగా నతడీ విధముగా జెప్పెను. ''నామాటలర్థము చేసికొనుటకుమీకు తెలివి తేటలు లేకపోయినవిగాని నేనొక్కమాటయైనా యబద్ధము చెప్ప లేదు. చిత్తగించండి! నేను చెప్పిన కులగోత్రములలో అబద్ధము లేదుకదా. ఇంటినిండా యెలుకలున్నాయని చెప్పినాను. ఆమాటలనుబట్టి ఇంటినిండా ధాన్యమున్నా యనుకొన్నారు, అదితప్పా. ఇట్లు జేమరమ్మతులలో నుండటంవల్ల విశేషముగా యెలుకలున్నవి ఎలుకలబాధపడ లేక వారీ మధ్య కొన్నిపిల్లులను పెంచుచున్నారుగనుక పిల్లులున్నమాటనిజము. పరిశుభ్రము లేని మనుష్యులగుటచేత వారికున్న రెండు నులకమంచములు నల్లులతో నిండియుండడమున్ను, తలలు పేడపేలు పట్టియుండడమున్ను నిజము ఇంటికి పయికప్పు వేసికొనకపోవుటవల్ల సూర్యచంద్రు

లింటిలో కట్టివేసినట్టే యున్నారు అటువంటి యింటికి కావలసినంత గాలి వెలుతురు నుండుటలో నబద్ధమేమున్నది. దొడ్డికి గోడలు లేక పోవుటచేత ఊరివారి పశువులన్నియువచ్చి అక్కడనే యుండెడివి. అందుచేత దొడ్డిలో నెల్లప్పుడు పశువు లుంటాయన్నమాట యబద్ధము లేదు. సాలుకు వారికి కావలసిన ధాన్యం మూడుపుట్లు అవిపండే భూములు మూడెకరాలున్నవి. అందుచేత వారికి కావలసినంతధాన్యం పండుననియు కావలసినన్ని భూములున్నవనియు జెప్పుటలో నబద్ధము లేదు. వారికి స్వంతికమతె మున్నదనుట అబద్ధముకాదు. ఒకచోట తెచ్చుకొన్న బదులు తిరిగి తీర్చరు గనుక వారికెవ్వరు బదులియ్యరు ఒకరికి బదులిచ్చుటకు వీరివద్ద యేమీలేనే లేదు. పెండ్లికొడుకు పచ్చగానున్నాడన్నమాట నిజమేకదా. చూడ రెండుకన్నులు లేవని నేను మొదటనే చెప్పితిని. అందుచేత నే యెల్లప్పుడు యిద్దరు మనుష్యులత నికి సాయముండవలయునంటిని. రాజులు యెల్లప్పుడు నౌకర్లమీద చేతులు వేసికొని నడచునట్లు యీ పిల్లవాడుకూడా స్వయముగా నడవలేక పోవుటచేత ఒకరిమీద చేతులు వేసికొని నడచును. ఇత డెప్పుడు అంధుడగుటచేత ఇల్లుకదలడు. అశక్తుడగుటచేతఅతనిపనులు యింట్లోవాళ్ళు పయివాళ్ళుకూడా వెంటనేచేసిపెడుదురు. అతడువ్రాసిన అక్షరములు అష్టవంకరలతో నుండును. గనుక ఆతనిదస్తూరీవలె మరెవరిది యుండదనుట నిజము. గర్వము లేదన్నమాట నిజము నెత్తిమీద గడ్డిమోపు బుజముమీద నాగలి పెట్టుకొని వారి మగవారు పొలమునుండి యింటికివత్తురు. అతడుస్వయముగా గొడుగు కొనుక్కోలేడు కనుక మరియొకరతనికి గొడుగు పట్టవలెనేగాని స్వంతిగొడుగు లేదు. ఇదివరకెన్నడు జోడు తొడుగుకొనుట పరుపుమీద పండుకొనుట, అలవాటు లేదు. గావున ఆరెండూ సమకూడినపు డతనిశరీరము కందిపోవునని నేను చమత్కారముగా చెప్పితిని. నేనెంతో చాతుర్యము

గా జెప్పితినిగాని అబద్ధము చెప్ప లేదు. మీరు గ్రహించుకొనే తెలివి తేటలు లేకపోయినవి. ఇంతకు బ్రహ్మదేవుని ఘటన ఆప్రకారముగా నున్నది. మీరు తప్పించగలరా నేనుతప్పించగలనా! ఇంతకు పిల్ల ప్రారబ్ధము ఆప్రకారము నున్నది. విచారించిన కార్యము లేదు.''

ఆమాటలు వినగానే తల్లిదండ్రులు మిక్కిలి చింతిల్లిరి. పెండ్లి కుమార్తెల తలిదండ్రులు పెండ్లికొడుకును వారియిండ్లు వాకిళ్ళను స్వయముగా జూచుకొనవలసిన దేకాని మధ్యవర్తులు చెప్పినమాటల నమ్మి సంబంధములు నిర్ణయించుకొనువారికి యిటువంటి చిక్కులే తటస్థించునని చూడవచ్చినవారందరు తమలో తామనుకొని వెళ్ళిపోయిరి.

—*—

జనాభానాటకము

[నాంది]

గీ. ఒక్కమట్టి సిరాబుడ్డి యొక్కచేత
దస్తరాలు రెండవచేత దాల్చుకొంచు
తిరుగు ఎన్యూమరేటర్ల దీర్ఘమైన
నగరపులునిసుపులు మిమ్ముగాచుగాత!

(నాంద్యంతమున సూత్రధారుడు తెరవంక జూచి)

పారిపార్శ్వకా! నీవుకూడ ఎన్యూమరేటరుగా నేర్పడితివా యేమి! నాటక ప్రారంభమున కాలస్యము చేయుచున్నావు?

పారి — అవును. నేను మూలపిల్లిలో వేయబడితిని. అందుచేత స్నానము చేసి భోజనము చేసివచ్చునప్పటి కంత ప్రొద్దుపోయినది ఇప్పుడు సెలవేమి?

సూత్ర—విష్ణుపురమందలి యెన్న్యాము రేటర్లు సూపర వైజర్లు కొందరు గృహస్థులు యీ రాత్రి యేదైనా అపురూపక నాటకము ప్రయోగింపుమని నన్ను కోరుట చే జనాభా నాటకమను గొప్పరూపకము నీరాత్రి ఆడదలచుకొన్నాను.

పారి—ఇది యే మహాకవిచే రచియింపబడినది?

సూత్ర—అయ్యో! ఆయననే యెఱుగవా నీవు. ఆయనకీర్తి-

గీ. ముగ్గువలె పాతువలె మఱిబుగ్గివలెను
సీమసున్నమువలె చల్ల చెలువమునను
నెరసినట్టి వెంట్రుకలట్లు యెముకలట్లు
గూడకొంగలవలెనొప్పు గొప్పగాను.

ఆయన పేరు వెలవెలపాటి విస్సన్న మహాకవిసార్వభౌముడు. ఈయనకు కవిగండభైరవుండనియు, ఆంధ్రకవీంద్రచక్రవర్తి శిఖామణియనియు, దుష్కవి భల్లూక నిప్పుపెట్టెయనియు, ప్రతివాదభయంకర దుడ్డుకఱ్ఱ ధారియనియు, అనేక మహారాజులు బిరుదులిచ్చిరి.

పారి—ఆబిరుదులిచ్చిన మహారాజు లెవరు?

సూత్ర—చెప్పెదవినుము. చతుస్సముద్రముద్రితమహీమండలమంతయు పాలించుచున్న శ్రీమద్రాజాధిరాజ భూమండలాఖండల కాట్రేడుగారు, గుమ్మాల తమ్మన్నదొర, సీమచింతలచిక్కయ్యరెడ్డి మొదలగు చక్రవర్తులిచ్చిరి.

పారి—సరే తెలిసినది. అతివిస్తరమెందుకు. మనము కథా ప్రారంభము చేయుదుము. మహాకాల అమావాస్యనాడు బ్రాహ్మణార్థము వప్పుకొన్న బ్రాహ్మణుని మొగమువలెనే మటమటలాడుచు బుచ్చిరాజను యెన్న్యామ రేటరు ప్రవేశించుచున్నాడు. మన మిక పోవుదుము.

ఇది ప్రస్తావన.

—*—

మొదటి యంకము

[అప్పుడు బుచ్చిరాజు, అచ్చిరాజు అనుయిద్దరు మెన్యూమ రేటర్లు ప్రవేశించుచున్నారు]

బుచ్చి—ఏమోయి అచ్చిరాజు! ఎక్కడనుండి వచ్చుచున్నావు!

అచ్చి—ఎక్కడనుండి యననేల? నాబ్లాకులోనుండి. ఈ జనాభా నా ప్రాణముమీదికి వచ్చింది. ఆసూపరవైజరు ముండాకొడుకు కలియుగరావణాసురుడు. వాడు నాయెముకలు కటకట కొరుకుచున్నాడు. నాలెక్కలలో తప్పులున్నవట. నన్నతడు ప్రాసి క్యూషనుచేయించి జెయిలులోనికి పంపుతాడట. చేతగాని ముండాకొడుకును యెందుకు వేశావురాయని ఆయధికారి నడిగే దిక్కు లేదు కద! ఇంతకు నాకర్మమని మొత్తుకొనుచున్నాను.

బుచ్చి—నీవు మొత్తుకొనకు. ఈలోపము స్థానికాధికారులది కాని సర్కారుది కాదు. సర్కారు ఉద్దేశము మంచిది. వారిచట్టము మంచిది. జనాభాలోకోపకారమైనది. దీనికి మనమందరము చేతులు కట్టుకొని పనిచేయవలయును.

అచ్చి—చేయుచున్నాము కాదటయ్యా. చేతకానివాళ్ళను వేసిన యెడల వాళ్ళేట్లు చేయుదురు?

బుచ్చి— దానికేమిగాని నేను నీకు సహాయముచేసిపెట్టెదను. ఇదివరకు వ్రాసినచిత్తు సరిగా యున్నదేమో యిళ్ళకువెళ్ళిచూచిరా!

అచ్చి—మహాప్రభో! రక్షించినావు. ఇదిగో యిళ్ళకువెళ్ళి సరి చూచెదను.

(అని యిద్దరు నిష్క్రమింతురు)

ఇది విష్కంభము.

—*—

మొదటి రంగము

తిరుకచ్చినంబిఅయ్యవార్లగారియిల్లు.

అచ్చిరాజు—(గుమ్మములోనికి వెళ్ళి) అయ్యవార్లంగారూ

తిరు—ఎవరువారూ? ఇదిగో వచ్చుచున్నాను. (అని తలుపు దీయును)

అచ్చి—నేనండి! ఎన్యూమరేటరు అచ్చిరాజును.

తిరు—తిరిగి యెందుకు వచ్చినారు మీరు? మొన్న వచ్చినారు కాదూ! నేను యింట్లోనున్నపుడు లేనపుడూకూడా మావాళ్ళను పేరు చెప్పమని చంపుతున్నారట యేమిటి?

అచ్చి—లేదు స్వామీ! లేదు. మొన్న వ్రాసికొనివచ్చిన చిత్తు సరిగానున్నదేమో మీకొకసారి వినిపించెదను వినండి.

తిరు—వినిపించండి వింటాను.

అచ్చి—తిరుకచ్చినంబి అయ్యవార్లంగారు. వయస్సు 45 బ్రాహ్మణులు.

తిరు—అట్టెట్టె! ఆగు. నీపాడునైజమునీవు కనబరచుకొన్నావు కాని మాన లేదు. మనకిద్దరికి కోవెలలో ప్రసాదాలదగ్గర వచ్చిన తగాదా మనసులోనుంచుకొని నన్నీవిధముగా పరాభవము చేస్తావా?

అచ్చి—(తెల్లబోయి) యేమి పరాభవమండీ! స్వామీ!

తిరు—యేమి పరాభవమా. యింతకంటె యేమి కావాలి. ఎరిగుండీ నంగనాచివలె నటిస్తావా? చూడు నలుగురిచేత నీనోట్లో గడ్డి పెట్టించిపరాభవ మేమిటో చెపుతాను. మంగరాజు మామ గారూ! మీరిల్లా దయచెయ్యండి వీడిదౌర్జన్యము చూతురుగాని.

మంగ—(వచ్చి) యేమిటండోయి అది! కాకపోయినా యీ యెన్యూమరేటర్లు బొత్తిగా పొగరబోతులండీ.

అచ్చి—సంగతివినకుండా పొగరబోతులంటూ రేమిటండీ నేను చేసిన పరాభ మేమిటో చెప్పవయ్యా బాబు చంపక.

తిరు—మామగారూ చూడండీ! వీడిరాతమండా. నన్ను బ్రాహ్మణుడని వ్రాసినాడు. నేను బ్రాహ్మణ్ణట. ఈచచ్చు యుద్యోగము నీకయిందని యింత కన్నులు నెత్తికిరానా? నేను బ్రాహ్మణ్ణా?

అచ్చి—వేదము చదువుకొన్న మహానుభావులు. మీరు బ్రాహ్మణులుకాక యెవరౌతారు. శూద్రులగుతారా? కోమట్లగుతారా? రాజులగుతారయ్యా?

తిరు—అదుగో మళ్లీ ఆకూతే కూస్తావు. నేను బ్రాహ్మణ్ణి అవడానికి నేనేమి పొత్తర్లుపడతాననుకొన్నావా, నీరుకాసులు పడతాననుకున్నావా? అడ్డమైనవాళ్ళచేత కాళ్ళగడిగించుకొంటాననుకొన్నావా?

అచ్చి—ఆపనులు చేసేవాళ్ళైనా బ్రాహ్మణులంటే? మీరు తప్పకుండా బ్రాహ్మణులని నాయభిప్రాయము. నేనల్లా వ్రాస్తాను.

తిరు—అల్లాగే వ్రాస్తావు? నలుగురిలోబెట్టి యీడిపిస్తాను. రాయికావలస్తే. నీబాబు బ్రాహ్మణుడు, మీతాత బ్రాహ్మణుడు. మీముత్తాత బ్రాహ్మణుడు.

అచ్చి—ఆమాటలు నాకు కోపము లేదు. మావాళ్ళంతా బ్రాహ్మణులే. మిమ్మల్ని యేమివ్రాయాలో చెప్పవయ్యా తుడుపెట్టి వ్రాస్తాను.

తిరు—శ్రీవైష్ణవుడు అనివ్రాయవలెను ఇప్పుడైనా బుద్ధి కలిగి, ఆ ప్రకారము వ్రాయి.

అచ్చి—(పకపకనవ్వి) ఇదిటయ్యా! నీపిచ్చకూల. శ్రీవైష్ణవులుమాత్రము బ్రాహ్మణులు కారటయ్యా. మెడలోనివి జందెములు కావూ? మీరు దేవతార్చన చేసికోరూ మీరుభయవేదాంత ప్రవర్తకులు కారూ!

తిరు—ఆసావంతా నీకెందుకు! నేను చెప్పినట్టు వ్రాయి. లేక పోతే నేను బ్రాహ్మణుడన్నది కొట్టివేసి తహసిలుదారుగారికి కలక్టరుగారికి అర్జీయిస్తాను.

మంగ—పోనీ ఆలాగే వెయ్యిరాదటయ్యా. నీ సొమ్మేమి పోయినది.

అచ్చి—ఈ తగాదాలు ప్రతీయింట్లోను వస్తూన్నాయండోయి. మొన్న కరణం సుబ్బరాజుగారిని బ్రాహ్మణుడని వ్రాస్తే నన్ను కొట్టబోయినాడు. మీరు చెప్పినట్లు వ్రాయమని మారూల్సులో లేవు. మా సూపరవైజరు ముక్కులుకోరి కేవాడు. ఆయన వ్రాయమంటే వ్రాస్తాను లేకపోతే లేదు.

(అని వెళ్ళుచున్నాడు.)

తిరు—మామగారూ చూచారా వీడిదార్జన్యము! సరే కానివ్వండి. (చేతులు పట్టుకొని) ఇవి కాళ్ళుగాని చేతులు కావు. తమరు నాకొక సహాయము చేయించాలి.

మంగ—ఏమిసహాయము చెప్పండి చేస్తాను.

తిరు—తాలూకాకచేరీలో జనాభాపని చూసే గుమాస్తాపేరు జనార్దనరావు. ఆయన మీకు స్నేహితుడు. ఆయనతో శిఫారసు చేసి బ్రాహ్మడిపేరు తీయించెయ్యాలినాకు.

మంగ—స్నేహితుడే! ఎక్కడైనా బావగాని వంగతోట దగ్గర బావకాడు. ఇందులో యేమయినా హిరణ్యశ్రార్ధము పుచ్చుకుంటే నేగాని పని చెయ్యడు.

తిరు — పోనీ! ఒకరూపాయ డబ్బులు పారవేద్దాము. ఈ యప్రతిష్ట పడేకంటె రూపాయపోతేయేమి?

మంగ—సరే రూపాయి తెండి నేను వెళ్ళి మాట్లాడి పని చేయిస్తాను.

తిరు—(లోపలికి వెళ్ళి రూపాయి తెచ్చియిచ్చి) యిది మీా కార్యముక్రింద యెంచుకోవాలి సుమండి.

మంగ—సందేహ మేమి? అల్లా చేయిస్తాను.

(అని యిద్దరు నిష్క్రమింతురు)

—*—

రెండవ యంకము

1వ రంగము

కాపుల వీధి

[అప్పుడు నరసంభట్టను మెన్యూమరేటరు ప్రవేశించుచున్నాడు.]

నర - (తనలో) అమ్మయ్యా! ఈవేళ 10దవ మార్చి ఈరాత్రితో పేర్ల గుండాన్ని పడును ఒక్కొక్కయింటికే వెళ్ళి యిదివరకు పేర్లు వ్రాసినవారున్నారో లేదో కనుగొని త్వరగా ముగించుకొని పోతాను ఏకుక్కలు కరవకుండా యేదయ్యాలు మీాదపడకుండా దాటితినా అదృష్టవంతుడను. ఇదిగో మొదట యీా యింటికి వెళ్లెదను. (ఒక యింటికివెళ్ళి) ఎవరండీ లోపల తలుపుతీయండి.

ముసలమ్మ—(లోపలనుండి) వోవరారూ?

నర—నేనండీ.

ముస—నే నంటేవరు?

నర—ఎవరూ లేదు. నేనే.

ముస—పేర్లేదా, ఊర్లేదా. నేనేనని అరుత్తావెందుకూ!

నర—మరెవరు లేరు నేనమ్మా తలుపుతియ్యి.

ముస—నీ నేను మండిపోనూ పేరుచెప్పుదూ.

నర—నన్నెరగనట్లే మాటాడుతావేమమ్మా నేనంటేనూ,

ముస—గొంతుకు బద్దలయ్యేటట్టుఅరు. నేను తలుపుతియ్యను. అద్దంరేఖిరికాడొచ్చి అరుత్తావెందుకు నువ్వారవో నాకెరికేంటి.

నర—నేను. నరసంభట్టును.

ముస—నరసంబొట్టావరు? నీకు మాకాడేం పనుంది?

నర—పేళ్లు వ్రాసికోవాలి తలుపుతియ్యి.

ముస—(ఏడ్చుచు) అయ్యో సిజిమ్మడో. మల్లావచ్చావంట్రో
(అని తలుపు తీయుచున్నది.)

నర—(తెల్లపోయి గుమ్మముదిగి క్రిందికి వెళ్ళును.)

ముస—నీరాతమండిపోను. నాకొంపతీసి మల్లీవచ్చావా. నీకళ్ళు కాలిపోనూ. యేయేలప్పు డొచ్చావో, యేయేలప్పుడు సూసావో. యేయేలప్పుడు రాశావో నీరాత నట్టేట్లో గలిశిపోనూ. మాణిక్కెమంటి పిల్లోణ్ణి సిపొట్టపెట్టుకొన్నావుకందా! మాయిబాప నోడ. నీలెక్కలు నేలమడ.

నర—ముసలమ్మా! అల్లా తిడతావేమిటి నే నేమిజేశాను. ఏమిజరిగింది ?

ముస—ఏంజరిగిందని మల్లా అడుగుతావా ? చేసినపనిచేసి (అని యేడ్చుచు) నీవు పేర్లురాసుకెల్లిన మూడోనాడు మూడేళ్ళ పిల్లోడు బంగారమంటోడు తిరుగుతా తిరుగుతా యిట్టే సచ్చిపోయి నాడు. నాయినోయి! నాయినా! నీజీవానికిపేర్లెక్కడొచ్చినాయి రోయి నాతండ్రీ! ఈబాపనోడు నీజీవనాని కెములోడయినాడురోయి నాయనా! నాతండ్రీ! నాబుల్లోడ! ఈడుపేరు రాసుకోకపోతే నూరేళ్ళుబతికే బతుకురా నీది.

నర—పిల్లవాడాయుర్దాయము లేక పోయినాడు. పేరువ్రాసు కొంటే పోతాడా? మీయింట్లో ఎందరున్నారో అందరిపేర్లు చెప్పు. వ్రాసుకొనడానికి వచ్చినాను. పిల్లలెందరు పెద్దలెందరు?

ముస — ఆరిబాపనోడ ! నిన్ను మావిళ్ళ మ్మేసుకుపోనూ. నీకేం దురుబుద్ధిపుట్టిందిరా. ఆణ్ణిచంపి యీాళ్ళనుకూడా చంపాలనివొచ్చావా ? నన్నుచంపినాసరే బిడ్డలపేళ్లు చెప్పను. యేమిచేస్తావో చెయ్యి.

నర — జాగర్త. చెప్పకపోయినావంటే నిన్ను ప్రాసిక్యూషను చేయిస్తాను. జుర్మానా వేయిస్తాను. జైలుకు పంపిస్తాను. జాగ్రత్త.

ముస — యేంటీ ? పోసుకోసం యేయిత్తావు. పోసుకోసం యోంట్రా నీపిండాకూడా. పిల్లోణ్ణి చంపి పోసుకోసం యేయిత్తావు ? ఎల్లా యేయిత్తావో పోసుకోసం యెయ్యి. రోకలుచ్చుకొని రొమ్ములో మొదుత్తాను. ఉండు నీజిమ్మడ. అక్కడుండు. (అని లోపలికి వెళ్ళుచున్నది.)

నర — ఉండు, పోలీసువారిని తీసుకొనివస్తాను. (అని పోవుచున్నాడు).

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు)

—౯—

రెండవ రంగము

గురుమూర్తి దీక్షితులుగారి యిల్లు.

గురు — (అరుగుమీద కూర్చుండి వేదము చదువుకొనుచుండును.)

నర — (గబగబవచ్చి) శాస్త్రిగారూ ! మీాయింట్లో జనమంతా యెందరో చెప్పండీ.

గురు — అయితే నరసంభట్లుగారూ ! యీాపేర్లు వ్రాసుకొనుట యెందుకు ? తలకు రూపాయి పన్నుకడుతారట. పన్నుకట్టడం కోసమట. నిజమేనా ?

నర — అబ్బెబ్బే ! శాస్త్రుల్లుగారూ, అబద్ధమండీ ఎందరు జనమున్నారో లెక్కపెట్టుటకొరకుగాని పన్నుకట్టుటకుగాదు.

గురు—కాదనకపోతే సర్కారుమనిషివి నువ్వునంచావు? సర్కారేదో మెచ్చి నీకేదో కప్పుచారని అభిమానంకోసం పడేడుస్తూ న్నావు. నిజంచెప్పు. నాకెందుకు పన్ను కట్టిస్తావు. కరువుకాలం పన్నిచ్చుకోలేము. గనుక మాయింట్లో ఆఖ్టైనుంది లేరని వ్రాయి. చిరకాలమునుంచి యెరిగినందుకు నాకీమేలు చెయ్యాలోయి. బ్రాహ్మణ్ణి గదా. నాకు నిష్కారణంగా పన్ను కట్టిస్తేసీకేమి వస్తుంది.

నర—శాస్త్రిగారూ! మీరు వేదం చదువుకొన్నమాటే గాని మీకు ప్రపంచజ్ఞానము లేదు. మీరు ఫూల్సు. నేను పై ౹మరీ ప్యాసై ఫస్టుఫారము చదివాను. నాకన్ని సంగతులు తెలుసును. తెలియకపోతే నోరుమూసుకొని యూరుకోండి. కాని యిల్లాంటి అవకతవక మాటలనకండి, పన్నులులేవు బందెలు లేవు.

గురు—నీడాబులు కట్టిపెట్టు. నేను ఆవలిస్తే పేగులు లెక్క పెట్టేవాడిని మొన్నమొన్నటి లోట్టకాయవు నీకేమి తెలుసును. పన్నులు కట్టడంకోసం కాకపోతే యేయింట్లో యెందరు జనముంటే వాళ్ళకెందుకు? వాళ్ళేమి వెఱ్ఱివాళ్ళై లెక్కపెడుచున్నా రను కొన్నావా యేమిటి. చంటిపిల్ల వాళ్ళదగ్గర చెప్పినట్టు చెపుతావేమిటి నా దగ్గర.

నర—అవన్నీ యెందుకు మీయింటో యెంద రున్నారో చెప్పండి.

గురు—(తనలో) చెప్పితే తప్పకుండా పన్ను పడుతుంది. కాబట్టి మాయ చెయ్యవలెను. (ప్రకాశంగా) మావాళ్ళందరూ పుట్టింటికి వెళ్ళినారు, నేనొక్కడినే అత్తిసరు పెట్టుకొనితినుచున్నాను

నర—దీపాలవేళ మీభార్యపిల్లలు వెంకప్పసోమయాజులు గారింటికి పేరంటమునకు వెళ్ళి నాకుకనబడ్డారు. లేదని అబద్ధమాడుతా రేమి?

గురు — ఎవరినిచూచి ఎవరనుకొన్నావో వాళ్ళు కారు.

నర — అయితే నేనీసంగతి సూపరు వైజరుగారితో రిపోర్టు చేస్తాను.

గురు — సరే చెయ్యి. (తనలో వీడు మోటనిర్భాగ్యుడు అంతపనిచేస్తాడు. నేను వెళ్ళి సూపరు వైజరుగారి కాళ్ళుపట్టుకొని యీ ఆపత్తు తప్పించుకొంటాను.

(అని యిద్దరు నిష్క్రమింతురు)

మూడవ యంకము

రంగము.

బోగము రంగసాని యిల్లు

[అంతట ఎన్యూమ రేటరు నరసింహము ప్రవేశించుచున్నాడు.]

నర — (తనలో) ఎన్యూమ రేటరుపనిని నేను సంతోషముగానే చేయదలచుకొన్నానుగాని నాకర్మముకాలి యీ బోగము వాళ్ళ యిళ్ళు నాపాలబడుటచేత నాకు మిక్కిలి కష్టముగనున్నది. పూర్వకాలపు బోగమువాళ్ళు పెద్దమనిషిని యెవరినైనా చూస్తే లేచి దండముపెట్టేవాళ్ళు. ఈకాలపుసానులు కుర్చీలమీదకూర్చుని లేవనేలేవరు. అడిగినమాటకు సమాధానముచెప్పరు. అవన్నీ అటుండగా యీ రాత్రివేళ వీళ్ళు తలుపుతీస్తారోతియ్యలేదని చెపుతే సూపరు వైజరూరుకోడు. నాకిందులో నక్కచావువచ్చినది ఇదిగో రంగసానియింటికి వచ్చినాను. దీన్ని పిలుస్తాను. (ప్రకాశము) రంగసానీ! రంగసానీ! తలుపు తలుపు.

(అప్పుడు రంగసానియు మరియొక పురుషుడు లోపలగదిలోనుందురు)

రంగ — ఎవరువారు ?

పురు—ఓసీ పలకకు మాటాడకు.

రంగ—పలకకపోతే యెల్లాగండీ, వారేదేనా రిపోర్టుచేస్తే తంటావస్తుంది.

పురు—జీలకఱ్ఱతంటా ఏంతంటావస్తుంది. తంటావస్తే నేలేనూ?

రంగ—మీరెందుకు రాత్రులు మా కొంపల్లోదూరి, అడ్డమైన గడ్డీతిని పగలు పెద్దపెద్దవారివలె సంగనాచులై భోగమువాళ్ళ పేరు చెపితే తిడతారు. పైగా మాతరపున వకాల్తునామాయైనా పుచ్చుకోరు. మిమ్ముసమ్ముకొంటే గంగలోదిగినట్టే.

పురు—ఆమాటకేమిగాని నీవు తలుపుతీస్తే వాడువచ్చి నన్ను చూస్తాడు. వాడిక్కడ చూచి పరాభవము చేయగలడు. పైగానా నోరు వాసనవేయుచున్నది.

రంగ—ఆయన యీగదిలోనికిరాడు. ఆయన అడిగిన మాటలకు సమాధానము చెప్పి వెంటనే పంపివేస్తాను. మీరుభయపడకండి.

పురు—నామాట వినవే. తలుపుతియ్యకే. ఎందుకైనా మంచిది. ఈవేళ యింట్లోకూర్చోవలసినవాడను పొరపాటుచేత బుద్ధినేరక వచ్చినాను. నేను నీయింటికి వస్తూయున్నసంగతి నెవ్వరు యెఱుఁగరు. పరాభవము చెయ్యకు.

రంగ—ఏమీ పరాభవము లేదు; ఊరుకోండి.

నర—తలుపుతియ్యమంటే తియ్యరేమిటి.

రంగ—వస్తూన్నానుండవయ్యా. (అని తలుపుతీయును.)

నర—రంగసానీ! నీవు మీయమ్మ మీదాసీది నీపెంపుడు కూతురుగాక మరెవరైనా క్రొత్తగావచ్చినారా?

రంగ—ఇద్దరుచుట్టాలు మాయింటికి వచ్చినారండీ.

నర—వాళ్ళపేర్లేమిటి?

రంగ—కనుక్కొనివస్తాను. ఇక్కడకూర్చొండి (అని బల్ల చూపి వెళ్ళును)

నర—(తనలో) ఈలోపుగ ఊరికే కూర్చుని యేమిచేస్తాను వ్రాసినవన్నియు సరిచూస్తాను. దీపంలేదే, అదిగో గదిలోనున్నది. అక్కడకు వెళ్ళిచూస్తాను. (అని గదిలోనికి వెళ్ళుచున్నాడు)

[అంతటగదిలో మంచముమీదకూర్చుండి తిరుపతిరావుగారు ప్రవేశించుచున్నారు.]

తిరుపతి—(నరసింహామును చూచి మొగముమీద బట్టవేసుకొని మంచము క్రిందదూరుచున్నాడు.)

నర—తిరుపతిరావుగారా యేమిటి? దూరకండి దూరకండి. మంచముక్రింద దూరకండి.

తిరు—(తనలో) అనుకున్నంతపని జరిగినది. ఈపాడుముండ నేనుచెప్పినట్లువిన్నదికాదు. పిలిచినప్పుడు పలుకకపోతే ప్రాణం విసికి వాడేపోవును. ఇప్పుడేమిచెయ్యను? బైటికివచ్చుటకూ వీలులేదు. రాకపోవుటకూవీలులేదు.

రంగ—ఏమిటండీ మీరునాగదిలోనికివచ్చారు. ఈగదిలోనికి మిమ్మల్ని నెవరురమ్మన్నారు. మీరువచ్చినపని చూచుకోవలసినదే కాని యీగొడవలన్నీ మీకెందుకు ? మిమ్మల్ని యీగదిలోనికిరమ్మని రూల్సున్నాయా?

నర—మమ్మలినిరమ్మని రూల్సులేవు. తిరుపతిరావుగారంతటివారు రావచ్చునని రూల్సున్నాయి. సరే ఈరాత్రి యెవరుయెక్కడనుంటే వారక్కడ నున్నట్టు వ్రాసుకోమని రూల్సున్నాయి. కాబట్టి తిరుపతిరావు గారు మీయింట్లోనున్నట్టు వ్రాస్తాను.

తిరు—(ఈవలకువచ్చి) అయ్యా మీపేరేవరండి. ఎన్యూమరేటరుగారూ? మీదర్శన మెప్పుడూ చేయలేదు.

నర—నాదర్శనము తమరు చేయుటకు నేనెంతవాడిని. మీ దర్శనమునకే నేను వెనుక రెండుసారులు ఉద్యోగము యిప్పించుమని అడుక్కుందామని వచ్చినాను కాని దర్శనమయినది కాదు. తమవంటి వారి దర్శన మెప్పుడయినా యీలాంటిచోట కావలసినదే కాని యిళ్ళ దగ్గర కాదు.

తిరు—అప్పుడేదో పనితొందరమీదుండి దర్శనము కాలేదు, దానికేమిగాని యిప్పుడుమీరుకొంచెము శాంతించండికోపగించకండి.

నర—తమరు కొంచెము దూరముగానుంచుని మాట్లాడండి. మీనోరు వాసనేస్తుంది. ముక్కు బ్రద్దలైపోతున్నది.

రంగ—ఏమిటయ్యా, పెద్దాపిన్నా యెరుగకుండా నోటమ్మట యెంతమాటనస్తే అంతమాట అంటావా?

నర—నాకేం భయమా యేమి? ఆయన చెడ్రతాగి మాట్లాడుతోంటే నోటివాసన భరింపలేకుండావున్నాను. ఆయనకు లేనికోపము నీకొస్తుందేమి? నాలుగురూపాయల కోసం నీవేవాసనయినా భరిస్తావు నేనల్లా భరింపలేను.

తిరు—ఊరుకోవేతగాదాలు పెట్టకు. ఎన్యూమరేటరుగారూ! మీరు నాపేరిక్కడ వ్రాస్తానంటున్నా రేమిటి?

నర—అవును యెక్కడుంటే అక్కడ వ్రాయవలసినదనే మా రూల్సున్నాయి.

తిరు—రూల్సుకేమిగాని కొంచెముగృహస్థధర్మ మాలోచించండి. మనమంతా ఒకవూళ్ళోవుండేవాళ్ళము. తెల్లవారితేస్తే మొగమొగాలు చూచుకోకమానము. నలుగురిలో తలయెత్తుకొని తిరుగుతున్నాను. పొరబాటుచేతనో, బుద్ధినేరకనో, యీరాత్రి యిక్కడకు వచ్చినాను. ఇంతమాత్రము చేత మీరీప్రకారముగా చెయ్యగూడదు, నాకీయుపకారము మీరు చెయ్యవలెను.

నర—నాకు రూల్సులేవు చేయడానికి వీలున్నట్టు కనబడదు ఇప్పుడు సూపర్‌వైజర్ గారుకూడా వస్తారు. ఆయన చూచినట్టయినా నా ప్రాణంమీదికి వస్తుంది.

తిరు— ఒసే వీధితలుపు గట్టిగా గొళ్ళెముపెట్టిరా ఆయన కూడా చూస్తే మరీపరాభవము.

నర—మీరు తలుపుగొళ్లెము పెడితే నేనొప్పుకోను. మీరు లోపలబెట్టి చావగొట్టించాలన్న యభిప్రాయమా యేమిటి?

తిరు—ఇదో తంటా వచ్చింది. సరే ఈ యుపకారం నాకు చెయ్యండి మీకు ప్రత్యుపకారము చేస్తాను.

నర—ఏముపకారము చేస్తారు ?

తిరు—మాయిలాకాను పదిహేనుమాయిల పనొకటుంది అది యిప్పిస్తాను. రేపు ఉదయమే ఆర్డరు వేస్తాను.

రంగ— ఇరవయి దరఖాస్తులుపెట్టి ఆరుమాసములు ఆశ్రయించి సంపాదించుకోలేనిపని యీాయనగారరగంటలో సంపాదించుకొన్నాడు.

నర—చిత్తము మీసెలవుప్రకారము నడుస్తాను మీమాట మీరు నిలబెట్టుకోవలెను.

తిరు—మాటతిప్పితే చండాలుడేసరి. మీరుకూడా నేనిక్కడున్నసంగతి యెవరితోను చెప్పనని ప్రమాణం చెయ్యండి.

నర—నా ప్రమాణంగా నేనుచెప్పను. నేను సెలవు పుచ్చుకుంటా.

తిరు—ఓసీ త్వరగా వెళ్ళి తలుపు వేసెయ్యవే మళ్ళీయెవ్వరూ రాకుండా.

రంగ—(తలుపు వేయును.)

నర—(వీధి గోనికివెళ్ళి తనలో) ఈ యడావిడిలో రంగసానీ యింట్లోకొచ్చిన క్రొత్తవాళ్ళపేరు వ్రాసుకోవడం మరిచిపోయినాను.

పోసీలే. అన్ని లెక్కలు సరిగానుండి యేడుస్తాయా యేటి. ఏలాగో పదిహేనురూపాయల పని సంపాదించుకొన్నాను.

(అని వెళ్లుచున్నాడు.)

నాలుగవ అంకము

మొదటిరంగము

[అప్పుడు రహిమాన్ ఖాన్ అను ఎన్యూమరేటరు ప్రవేశించుచున్నాడు.]

రహి.—(ఒకయింటివద్దకు వెళ్ళి) ఈ యింటి ఖామందు యెవర్?

రామమూర్తి—ఈ యిల్లు వెంకట్రామయ్యగారిది.

రహి.—షరే! రాసికుతాం. ఉండు (అని వ్రాయుచున్నాడు.)

రామ—ఇది యేమిటయ్యా వెంకట్రామయ్య అని వ్రాయడమునకు వెంటుకురామయ్య అని వ్రాస్తూన్నావు.

రహి—మాకీవస్తాదిలాగు రాస్తాం. నీకీ పూచీలేదు. నీకి మా అతికార్ రికావు. పేర్లబోలో.

రామ—ఆయన పెద్దకొడుకు రమణయ్య.

రహి—ఏమిటి మర్నయ్యా?

రామ — మర్నయ్య కాదు రమణయ్య.

రహి—అరే యేమిపేరువోయి. నామర్దాపేర్.

రామ అదేమిటయ్యా సాహేబు! మరణయ్య అని వ్రాస్తావు.

రహి—అరే మాకి కోపం వస్తాది. నీకి యెవడువోయి మాకి వస్తుంది మళ్లేరాస్తాం కపడ్దార్. అరే నీకీ పేరు చెప్పు.

రామ—నన్ను అరేవోరే అనకు. అనక బాగా జరిగదు.

రహి—అరే. ఇందులో తప్పేమివోయి.

రామ—మళ్ళీ అరే అంటావు.

రహి—ఖ్వాహ్మ్‌కా బే. తగాదాకి కాల్ తివ్వుతావేమి వోయి? మీకీ, మాకీ తప్పు పిల్చాం? మీకీ అరే అంటే తప్పా అరే అల్లా! కాఫరుపేర్లు బలే తమాషావోయి. (నవ్వుచున్నాడు.) నీపేరేమిటి రామమూర్తి ?

రామ—అన్నీ తప్పులే వ్రాయుచున్నావు ఏమైనాఅంటే మీాద పడతావు.

రహి—అరే! ఆమాట వద్దు మీకీ జనానాపేర్లు చెప్పు.

రామ—నరసయ్య.

రహి—అరే ఆడది ? మొగది ?

రామ—ఏమిటయ్యా ! అదిఅంటావు.

రహి—అదిఅంటే తప్పేమిటివోయి. మాకీ ముందా అన్నామా : అమ్మాఅన్నమా. ఏమిటిట్లాం అది ఆడది మొగది ?

రామ—ఆడదేనయ్యా.

రహి—ఛూ, నీది జూటమాట అదిమొగది పేరు. ఆడది అయి తేనరసమ్మ చెప్తారుకాదు మీకీ అదియెవరు? నీగీయేమికావాలా?

రామ—ఆవిడ మాయమ్మ.

రహి—నీకీ జూటబాత్ చెప్తాన్నావు మాకీ తప్పుల్ రాయిం చాల్నా, మీా యమ్మాకీ ముగుడూ వచ్చిన తర్వాత ఆతన్కి దరి యాప్తుచేసి సరిగా రాస్కాపోతాం సలాం.

రామ—హిందువుల యిళ్ళకు తురకని వేసినందుకు ఆ యధి కార్లది బుద్ధితక్కువ కాని నీదికాదు. నాయనా ? తురకలయిండ్లకు వేయక నిన్ను హిందువుల యిండ్లకు వేయడమేమిటి.

రహి—ఆచ్ఛాబాత్ సెప్పావోయి నీకి. మాకీ సప్తావున్నాం మీ కాఫరు పేర్లకీ రాస్కోలేక. మాకీ హిందూలకీ కోంపల్ నద్దు మంచే ఆతహాసిల్‌దారు మా మాట యినక్క మ్మాసుల్ని గోతుల్పడేశాడు భాయి (అని పెళ్ళచున్నాడు.)

—*—

రెండవరంగము

[రామశాస్త్రిగారియిల్లు రహిమూన్‌ఖాను ప్రవేశించుచున్నాడు.]

రామ—సలాం. సాహేబుగారూ దయచేయండి.

రహి—ఆజీ పండత్ మీకీపేరు సెప్పండి రాసుకుతాం.

రామ—నా పేరు రామశాస్త్రి అంచారు.

రహి—రామశాత్రి అంచామూ.

రామ — ఏమిటయ్యా నాపేరు సరిగా వ్రాయవ్వయ్యా. ''అంచారు'' అనేది పేరుకాదు.

రహి—కాక్పోతే యెల్లాసెప్పావుపోయి. ఇదేం తమాషా అనుకున్యావ్. మీకీ పెళ్ళాము పేరు సెప్పు

రామ—నా పెళ్లాము పేరు చెప్పకూడదు.

రహి—నీకీ పెళ్ళాముపేరు సెప్కాపోతే మరికోడి పెళ్ళాం పేరు సెపుతాను. ఏమ్ హిందూలోయి మీకీ.

రామ—మాలో యెవరిపెళ్ళాముపేరు వారు చెప్పకూడదు సాయిబూ.

రహి—ఎవరిపెళ్ళాముపేరు వారు సెప్కాబోతే ఇంకోర్కి పెళ్ళాము పేరు సెపుతారువోయి? మీ హిందూల్లో బలే తుంటరి యోసంవోయి.

రామ—అల్లాంటిమాట లనకండిమీరు.

[అప్పుడు రత్నమ్మయను నామె ప్రవేశించుచున్నది.]

రహి—అది యవరు సండత్.

రాము—ఆవిడ మా యింట్లో కాపురమున్న వారి భార్య.

రహి—నీపేర్ ఎవరమ్మా

రత్తమ్మ—నాపేరు రత్తమ్మంచారు.

రహి—(నవ్వుచు) రక్తమ్మా? అరే రక్తంపేరు యెవరూ పెట్కారునాోయి. ఎంత కాఫర్లునాోయి మీకీ?

రాము—రక్తం కాదు. రత్నం.

రహి—సాలువోలు. నోరుకీ మూసొ్క మీకి పేర్లుసూస్తే మాకి డోకువస్తాది. అమ్మానీకీ ముగుడు పేర్ సెప్పు.

రత్న— (ఊరుకొనును)

రహి—అరే ఊరుకుతా వేమిటె? మాట చెప్పవు మాతో మీకి యేలాకోలం యేమ్టి.

రత్న—అవేమ్మాటలండీ. వేళాకోళం యేమిటి మాకుమీకూ మావారు వింటే బాగుండదు కూడాను.

రహి—కాకోప్తే యేమ్టి ముగుడు పేరుల్ సెప్మమంటే సెప్పవు

రత్న—చెప్పగూడదు

రహి—నీ ముగుడు పేరు సెప్కాపోతే యింకోదాని ముగుడు పేరు చెపుతావునీకి

రత్న—అల్లాంటి కూతలు కుయ్యకు బాగుండదు బుద్ధి చెప్పించేను.

రాము—ఊరుకోవయ్యా కోపపడకు మాలో పేర్లు చెప్పగూడదల్లాగ

రహి—సెప్పకపోతే లెక్కల్ తగిల్ సెట్టండి ఈలాగ్ సెప్కా ఆట్టే గడబిడ్ సేస్తే మాకీ రిపోర్టు తగిలిస్తాం మీకి మీద తగిల్పిచామంటే పర్గల్ సెట్టాలా మీకి గదిలో

రామ—బాబూ ఊరుకో ఆవిడ మొగుడు పేరు సీతయ్యగారు వ్రాసుకు వెళ్ళు.

(అందరు నిష్క్రమించుచున్నారు)

—౧—

మూడవరంగము

సాంబయ్యగారి యిల్లు

[రహిమాన్ ఖాను ప్రవేశించుచున్నాడు చావడిలో నొక ముసలి వితంతువుగురియొక పడుచు పిల్ల ప్రవేశించు చున్నారు)

రహి—ముసిలిఅమ్మా! నీ పేరేమ్టి ఆ పిల్లాకి పేరేమ్టి

ముస—నాపేరు మంగమ్మ పిల్ల పేరు సీతమ్మ

రహి—దాని ముగుడు పేరేమ్టి

ముస—(ఏడ్చుచున్నది)

రహి—అరే యేడుస్తావేమిటివోయి ముగుడుపేరు సెప్మంటే.

ముస—(ఏడ్చుచు) నాయనా ఆధీనం తప్పింది నాయనా.

రహి—ఆదీనం తప్పిందీ? ఎవరికీ ఆదీనంలో వుంటే నూకి యేం. ముగుడు పేరు సెప్పు

ముస—(ఏడ్చుచు) తలచెడ్డపిల్ల నాయనా?

రహి—తలా సెడిందీ? దివానా యెమ్టి పిచ్చియెత్తిందీ అయితే యేమ్ మగుడుపేరు చెప్తానియేమ్?

ముస—కాదు నాయనా మొగుడు లేడు వెధవపిల్ల

రహి —ఛీ జూటామాటల్ చెప్తావు నీకి మొగుడు వుంటే లేడని సెప్తావేమి ? ముగుడు లేక్పోతే బుట్టా గొరిగించవ్ వోయి

మున — కాదు నాయనా శివరాత్రి కోటిపల్లి వెళ్ళవలెనని చూస్తూన్నాము చిన్నపిల్లలకి కొన్నాళ్ళు తీయించకుండా వుంచుతారు బొట్టులేదు అదే ఆనవాలు వెధవ పిల్లలకు.

రహి —అరే అల్లా ! మాకి తెల్స్తాదిలేదు బొట్టు లేక్పోతే యెకవాసిల్లా సరే తెల్తాంది.

(అప్పుడు రంగమ్మయను 16 యేండ్ల పుణ్యస్త్రీస్నానము చేసి బట్టతో పిడప పెట్టుకొని వచ్చుచున్నది)

రహి—ఈయమ్మాకి పేరేమిటి

మున—రంగమ్మ నాయనా ?

రహి—అరెమియాలో మనుసుల్కి రంగం మోల్మేన్ పేర్లు కూడా పెడతార్ బడా తమాష్ వోయి

మున—మేము రంగం మోల్మేను వెళ్ళేవాళ్ళము కాము నాయనా అల్లా అనకు.

రహి అరే ముశలమ్మా ! పాపం ఈపిల్లా నీకేమి కావాలా!

మున—వీళ్ళిద్దరు నాకూతుళ్ళు నాయనా.

రహి—రంగమ్మాకి ముగుడుకూడా పోయినాడూ యెన్నాళ్లయింది ? అరే యిద్దరు కూతుల్కి యెద్వాల్ నీకి.

మున —రామరామా, అల్లా అనకండి సాహేబుగారూ శుక్రవారంపూటా

రహి—మాకి అబద్దం సెప్పాంబే

మున — దానిమొగుడున్నాడు నాయనా ? అల్లా అనకండి

రహి — గడియకి ఒకమాట సెప్తావు బొట్టులేక్పోతే యెద్వాపిల్లానావు దీన్కి బొట్టులేదు ఇది యెద్వాపిల్ల ఔనుకాదూ

ముస—నాయనా తలంటుగుంది. ఇంకా బొట్టు పెట్టుకోలేదు. అంతేకాని మరియొకటికాదు.

రహి—అరే ఎం బలేతమాసాలు వోయి మీకొంపల్లో. మాకిపోతాం సలాము మీకి అరే హిందూల్ పేర్ల లిఖోమని మాకి తహసిల్ దారు సంపియేశ్నాడు వోయి మాకి సస్తావున్నాం.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

నాటకము సమాప్తము.

—*—

గ్రంథ ప్రకటనము

చూడుడు ! చూడుడు !

చదువుడు ! చదువుడు !

చూడలేనివారు చదువలేనివారువినుడు. వినలేనివారు తెలిసికొనుడు. తెలిసికొనలేనివారు మీమీ దురదృష్టములకు మిమ్ము నిందించుకొనుడు. మీ రదృష్టవంతులైతే, మీ జన్మము సఫలమగు యోగము మీకుంటే, మీ పెద్దలందరు తరించు భాగ్యము మీకు గలిగితే, వెయ్యేల, మీరు ధన్యాత్ములైతే మా పుస్తకములుమీరు చదువుదురు. ఈ పుస్తకము కొననివారి డబ్బు వ్యర్థము. చదువని వారి బ్రతుకు వృథా. విననివారి చెవులు దొప్పలుగాని చెవులు కావు. మా గ్రంథములలో మొదటిది.

వెఱ్ఱిపప్పీయము.

ఇది 93 ఆశ్వాసముల మహాప్రబంధము. ఇందలి కథానాయకుడగు వెఱ్ఱిపప్పగారికి ఆయన ప్రియురాలగుపో లేరు దేవిమీద మోహము

గలిగినపుడు వర్ణింపబడిన శృంగారరసముయొక్క రుచి వారంతటివారే గాని సామాన్యులు గ్రహింపజాలరు. ఈశృంగారరసము చదివినవారికి తప్పక పిచ్చియెత్తక మానదు. ఇందలి జాలిరసము విన్నవారుయింటి వారిమీదను పొరుగువారిమీదను పడి గోలుగోలున యేడువగలరు వీరరసముయొక్క వర్ణన జదివినపుడు మనుష్యులావేశముగలవారై శరీరముల మరచి తలలు విరియబోసుకొని కత్తులు కటారులు – అవి దొరకనపుడు కత్తిపీటలు, గరిగమ్మలు పుచ్చుకొని శత్రువులెవరు కనిపించనపుడు యింటివారిపైబడి మర్దింతురు. హాస్యరసము విన్నపుడు వీధులందుబడి దొర్లి, పొర్లి డొక్కలో నొప్పివచ్చునట్లు కడుపుబ్బో పోట్లు వచ్చునట్లు పొట్ట ఉబ్బునట్లు తిన్నయన్నము వెళ్ళబోసికొనునట్లు, గుండెలు బ్రద్దలగునట్లు, వర్షకాలమున నూతులు బోదురుకప్ప లొకసారి యరచునట్లు వెకవెక, పకపక నవ్విునవ్వి తబ్బిబ్బై పొరుమారగుదురు. ఇది ప్రతిగృహమందుండదగిన పుస్తకము. శైలి మిక్కిలి సులభమై, మృదువై, లలితమై, సరసమై, శ్రావ్యమై, గంభీరమై, భీకరమై, భయంకరమై యుండును. ఇందుకొన్ని యాశ్వాసములు గోదావరీజలపాకము. అనగా గోదావరిజలముల్లే కష్టమక్కఱ లేకుండ గడగడ గ్రహించవచ్చును. కొన్ని యాశ్వాసములు అత్తెసరుపాకము. అనగా అత్తెసరులోని గంజి లోపల యినికి హరించునట్లే, యిందలి భావము పైకిచెవ పోకుండ లోపల యిమిడి యుండును. అత్తెసరు మెతుకులట్లు అక్కడక్కడ పద్యములు బిరుసు పదునుగ నుండును. మరికొన్ని యాశ్వాసములు స్వయంపాకము. వేఱొక కొన్ని యాశ్వాసములు స్వహస్తపాకము. వెయ్యేల! చదువుకొనువారి పూర్వజన్మపరిపాకము చేయుటకే యీ యుద్గ్రంథము బయలుదేరినది. ఇది ప్రస్తుతము యక్షిణీముద్రాక్షరశాలలో ముద్రణమగుచున్నది రాక్షస సం॥ర ఆషాఢశుద్ధ అమావాస్య కొత్త మంగళవారములోపుగ కొనదలంచినవారికి దీని ఖరీదు. 6 పైసలు.

ఈసొమ్ము మనిఆర్డరుగాపంపించవచ్చును. ఆతారీఖుదాటినతరువాత కొనదలచినవారికి ఖరీదు, రు 9-4-0 ప్రస్తుతము కొద్దిగా 3 లక్షల 42 వేల 532 ప్రతులుమాత్రమే వేయించినాము, గనుకనున్ను, దాదాపుగ అన్ని పుస్తకములకు యిదివరకే ఆర్డర్లువచ్చియున్నవి గనుకను, ఆశాభంగముకలుగకుండ కాలముమించకుండ దరఖాస్తులు త్వరగాపంపుకొనవలెను.

అరడజను ప్రతులొక్కసారికొనువారికి డజను ప్రతు లుచితముగ నీయబడును. వర్తకులకు నూటికి రు 3-2-0 కమిషనీయబడును.

ఈగ్రంథమురచించిన మహాకవిగారు వెక్కిరింతల వెంగళప్ప గారు. ఈయన ప్రపంచమంతట ప్రశిద్ధికెక్కిన మహాకవీశ్వరసార్వభౌమ శిఖామణిచక్రవర్తి దూర్వాహులగుటచేతను, ఈయన నిమిషమునకు 732 పద్యముల చొ॥న ఆసుధారాకవిత్వము చెప్పగల మహాసమర్థులగుటచేతను, ఈయనకు మహారాజులు చక్రవర్తులు, బంగారు పతకములెగాక అప్పుడప్పుడు వెండిబిళ్ళలు, నబ్బుబిళ్ళలు, అర్థణాబిళ్ళలు, డబ్బుబిళ్ళలు కూడ బహుమానమొసగియుండుటచేతను, ఈయన నింతవారంతవారని యెంతవారును చెప్పలేకపోయినను, యీయన గ్రంథమునుగూర్చి మహాత్ములిచ్చిన అభిప్రాయములు కొన్ని యీక్రింద పొందుపరచుచున్నాము.

మహామహోపాధ్యాయ కొంకనక్క గురులింగశాస్త్రిగారిట్లు వ్రాసినారు:—'మీ వెఱ్ఱిపప్పీయమును నేను సమగ్రముగా జూచితిని. కాళిదాస, భవభూతి, మాఘు, మయూర, వ్యాస వాల్మీకులకవిత్వముల కంటె యిందలికవిత్వము వేయిరెట్లధికముగ బాగున్నది. ఇందలిపద్యములు గారెముక్కలవలెయంతో రుచిగనున్నవి. దీనికి అల్లపుపచ్చడివలె చిన్నవ్యాఖ్యానమునుకూడ గ్రంథకర్తగారె రచియించియుంచినందునసర్వజనగ్రాహ్యమైయున్నది. ఇట్టిగ్రంథము జన్మమెత్తి చూచి

మెరుగను. ఇకముందు చూడఁబోను. ఇంకొకజన్మమునకూడ చూడగల నమ్మకము లేదు. ఇందలి వీరరసపద్యములు రెండు చదువగానె నాకావేశమెత్తి గొడుగుకామతో నాభార్యను మెత్తగా మర్దించితిని. మీగ్రంథమందలి పై రెండుపద్యములను నేను చదువుచుండగా దగ్గరనుండివిన్న నానీళ్ళబ్రాహ్మణుడుకూడ ఆరసముగ్రహించి, కావిడిబద్ద తిరగవేసి నన్ను వెన్నుపూస విరుగునట్లుకొట్టెను. కాబట్టి ఈ గ్రంథమందరు కొనదగినది.

యమ్. ఏ. డి. బి. యే. డి; యస్. ఏ. డి; పి ఏ. డి. మొదలగు గొప్ప పరీక్షల నిచ్చి యుద్యోగము చేయుచున్న సిరసాల నీలాచలంగారిట్లభిప్రాయమిచ్చిరి :—

'వెంగళప్పగారు దయతోపంపిన వెఱ్ఱిసప్పీయమును వందనపూర్వకముగ నందుకొంటిని. ఈ గ్రంథకర్తగారు మనపూర్వులవలె అనకతవక గ్రంథప్రబంధములు, పుక్కిటిపురాణములు వ్రాయక దేశచరిత్ర గ్రంథములు, వ్రాయునభిలాషతో వెఱ్ఱిసప్పగారి చరిత్రమును రసవంతముగ వ్రాసి యీ దేశమునకు, పరదేశమునకుగూడ మహోపకారము చేసినారు గనుక, ఈ దేశస్థులు. పరదేశస్థులు ఈ లోకమువారు, పరలోకమువారుకూడ వారియెడల కృతజ్ఞులై యుండవలెను. ఇందలి జాలిరసపుపద్యములు చదివి నేనుయింటబడి యేడ్చుచుండగాపొరుగువారందరునాకేదోయాపదవచ్చినదనిపరుగెత్తికొనివచ్చిరి ఇందలి హాస్యరసమున్నకథపట్టు నేనుచదివినప్పుడు నాకు డొక్కలో నొప్పి, గుండెల్లోపోటు బయలుదేరి క్రిందబడి దొర్లుచుండగా మహారోగమువచ్చినదని వారందరు వైద్యుని తీసికొనివచ్చిరి. కాబట్టి యీగ్రంథమందరు కొనవలెను. ఇంకను నిట్టి యభిప్రాయములు

లక్షలకొలదియున్నవిగాని గ్రంథవిస్తరభీతిచే ప్రకటింపబడలేదు. పైగ్రంథము కావలసినవారు యీక్రింది యడ్రస్సుకు వ్రాయవలెను.

మేనేజరు,

చామాలమ్మ డిపో,

దయ్యాలపేట, ప్రేతపురము.

—*—

గొట్టాలమ్మ జాబీదు

గొట్టాలమ్మఅని, విశాలాక్షిఅని, కలరాఅని, నానావిధములైన బిరుదునామములుగల మేమునూపాదసేవకులై, పరమభక్తులై, అత్యంతప్రియులై, మొదటినుండియు మాయందు విశ్వాసముగలవారై మాకు సేవలు, జాతరులు, ఉత్సవములు మొదలైనవి విరివిగా చేయుచున్న మాపరమాప్తులకందరికి అనగా స్త్రీలకుపురుషులకు, బాలురకు,వృద్ధులకు, పేదలకు భాగ్యవంతులకు అన్నివర్ణములవారికి, అన్నితెగలవారికి, అన్నిశాఖలవారికి యీక్రింది జాబీదును మేముప్రియపూర్వకముగాపంపుచున్నాము. గనుక దీనినిమీరుశిరసావహించి, మాయాజ్ఞమన్నించి మాముద్దు చెల్లించి యెప్పటిభక్తిప్రపత్తులను మాయందు చూపవలెనని కోరుచున్నాము. మాయందుమీరట్టిభక్తిప్రపత్తులను చూపకుందురని మాకేవిధమైన సందేహమును యెన్నడును మనోవాక్కాయకర్మలందు లేదు. ఏలయనగామీరందరు ఆస్తికులుపెద్దలయాచారప్రకారము నడుచువారు, బుద్ధిమంతులుగనుక మామీదమీకు మాతృవాత్సల్యముకలదన్నమాటలోకవిదితమే, అయిననుయీమధ్య

యీ దేశములో తెల్లవారువచ్చిపూర్వాచారములకువిరుద్ధముగాఆరోగ్యములని గీరోగ్యములని కొన్నికొన్ని శనిపోని దుర్బోధలు చేయుట చేతను. అర్థములేని అపకతవక కొ్రొత్తశాస్త్రముల కొన్నిటిని కనిపెట్టి యీ దేశములో అనవసరముగాప్రవేశపెట్టుటచేతను ఆపాడు దుర్బోధలు వినియు ఆపాడుశాస్త్రములు చదువుకొనియు మీలో కొందరు తెలివితక్కువవారు మమ్మీమధ్య అనాదరణము చేయుచున్నట్లు మా కప్పుడప్పుడు కర్ణాకర్ణిగా వినబడుటచేతను, వారి దురాలోచనలు విని, వారి దుస్సహవాసదోషమున కొందరు హిందూ దేశపు స్త్రీలుకూడ చెడిపోవుచున్నారని మాకు భయము కలుగుట చేతను, సామాన్యముగ మీరెంత చదువుకొన్నను ఎంతజ్ఞాన తేజస్సు మీలో ప్రవేసించినను మమ్ము మాత్రము విడిచిపెట్టరని గట్టి నమ్మకము ఉన్నప్పటికిన్ని దేశకాలపాత్రములబట్టి 'కః కాలః కోధర్మః' అను పెద్దలవాక్యమును జ్ఞాపకము తెచ్చుకొని యెందుకైన మంచిదేయని మీవిధిధర్మములను మీకొకసారి జ్ఞాపకముచేయుటకై మేమీ తాఖీదును ప్రత్యేకముగ నిపుడు లిఖితరూపకముగా మీకుపంపవలసిన యగత్యము కలిగినది. ఈ తాఖీదు మాపరమభక్తులైన వారెల్లరు చూచుకొని చదువుకొనవలసినదే కాని. నాస్తికులకు, పాషండులకు, పరమేశ్వరుడు తప్ప యితర దేవతలు. యితరమంత్రములు యితర సాధనములు పనికిరావని తెగనీల్గెడు నిర్భాగ్యులకు, తెల్లవారికి యిది యెప్పుడు చూపించగూడదు. చదివి వినిపించగూడదు. అట్లుగాక మా అధికార తిరస్కారముచేసి యీతాఖీదు పైజెప్పినవారికి చూపించిన వారు నకలిచ్చినవారు చదివివినిపించినవారు ఏవిధముగాగాని తెలియ జేసినవారు కబురుపంపించినవారు, మరియింకా ప్రత్యక్షముగా గాని పరోక్షముగాగాని, గూఢముగాగాని బహిరంగముగాగాని యిటువంటి వారితో సహవాసముచేసినవారు మా ఆగ్రహమునకు విశేషముగా పాత్రులగుదురని విస్పష్టముగాను నిర్మొగమోటముగాను యిందు

మూలముగా తెలియపరచగోరుచున్నాము. ఇంగ్లీషు చదువుకొన్న వారిలో ఎక్కడో వెయ్యికిద్దరుతప్ప తక్కినవారందరు మాకు పరమ భక్తులై మా పాదపూజార్థము వారింటనుండు వెధవముండలచేతను, పునిస్త్రీలచేతను యెరిగి కొందరు యెరుగక కొందరు ఏదోయొక విధముగ మాకు నైవేద్యములను బంపుచున్నారు గనుక వారు మా అగ్రహస్తులు కాజాలరు. మహమ్మదీయులు మతాంతరులైనను, మన హిందువులు వారి పీర్ల పండుగలలో వేషమువేసి మ్రొక్కులు మొక్కుకొని పిల్లలను పకీరులు జేసి భక్తిశ్రద్ధలజూపుచుండుటచే వారిలో కొందరుకూడ చాటున నైవేద్యములు పెట్టి మ్రొక్కుచున్నారు గనుక వారినిగూడ మాభక్తకోటిలో చేర్చుకొన్నాముగనుక వారికీసంగతి తెలియజేసిన చేయవచ్చును. ఇక స్వదేశక్రైస్తవులలో గూడ కొందరు బుద్ధిమంతులు యీపాటిమీద బుట్టినవారైయు కొంత కాలము మమ్ముకొలిచి తరువాత వేరుకారణములచేత క్రైస్తవులై పైకి ధనియాల్ (డేనియల్), యిసిమిత్తు (స్మిత్తు) పెడరెక్కలు (ప్రెటరిక్కు) సగ్గు (స్నగ్గు) మొదలగుపేరులు పెట్టుకొని యున్నప్పటికి కలరా మశూచిరోజులలో మాశరణమే జొచ్చుచుండుటచేత వారిని గూడ మాభక్తగణములో జేర్చుకొన్నాము, అందుచేత యీతాకీదు వారుగూడ చూడదగినవారే. కాని యెన్నడు యీతాకీదుమాత్రము కలలోగాని, పొరబాటునగాని, వేళాకోళముగగాని దొరలకుమాత్రము చూపించకూడదు. ఎందుకనగా వారుమనకులస్థులు కానందున మాయందు భక్తిశ్రద్ధలు లేనివారుకావున అట్టివారు చూడకూడదు. లోకములో తమయెడల భక్తిగలవారిమీద ప్రేమ కలిగియుండుట న్యాయముగనుక మాకుజాతరలు ఉత్సవములు చేయుచుండెడుభక్తుల యింటనే మేము సాధారణముగా బసచేతుము. మేమేగ్రామమునకైనా రాదలచుకొన్నప్పుడుముందుప్రక్కగ్రామమునుండిభక్తులద్వారా మారాక తెలియచేయుదుము. మేము వచ్చేరోజులలో మాభక్తులెవరు తమ

యిండ్లకు వెల్లలు వేయకూడదు. వీధులలో చక్కగా నేల తడిసి చల్లగా యుండగలందులకు తూములనుండివచ్చు నీరు జీవనదులవలె యథేచ్ఛముగా ప్రవహించుచుండవలెను. ఇండ్లముందు పెంటపోగులుమా జమాబందీ పూర్తిగాఅగువరకు కదపగూడదు. ఒక వేళ పట్టణములలో మ్యూనిసిపల్ వారు తెలివితక్కువచేత ఆపోగులను కదిపి తీసికొనిపోవు పక్షమున వారికి కనపడకుండా యెంతచిన్నదొడ్లున్నా ఆదొడ్లలోనే దాచుకోవలెను. ఇళ్ళకు గచ్చులు, సీమెంట్లు చేయించకూడదు. ఇండ్లు యెప్పుడు పేడపూతలతో నిండియుండవలెను. పశువులపాకలు మరుగుదొడ్లు, పడకటిండ్లకు, వంటయిండ్లకు సాధ్యమైనంత దగ్గరగానుండవలెను.

మాసంస్థానములో దోమలను, యీగలను; సంగీతపుపాటకులుగ నేర్పరచి, వాటిపోషణనిమిత్తమై పాలకొల్లు, రాజమహేంద్రవరము, కొల్లేరు మొదలైనవాటిని మానౌకరీ చేసినంత కాలము పుత్రపౌత్రపారంపర్యము దానవిక్రయాధికారము లేకుండా మొఖాసాలుగ అనుభవించుటకై పట్టాలిచ్చివేసినాము. గనుక మేమువచ్చేటప్పటికి వారితోకూడ కలిసి మాకెదురుసన్నాహముచేసి మమ్ము తీసికొనివెళ్ళి మేమున్న దినములలో వారిచేత సంగీతము పాడించడమే కాకుండా, మేము వెళ్ళినతరువాతను, మేము రాకమునుపును వారిసంగీతము వింటూయుండవలసినది. ఇది తండ్రి తద్దినమువలె తప్పనిది. అత్తరు, పన్నీరు, హారతికర్పూరము, పచ్చకర్పూరము. కస్తూరి మొదలగు దుర్గంధవస్తువులు మేమున్నంతకాలము మాచుట్టుప్రక్కలకైనా తీసుకొనిరాకూడదు. ఎందుచేతననగా వాటినిచూచినతోడనే మాకు వెలపరము పుట్టి తలనొప్పి, డోకు, అసహ్యము బయలుదేరును. మేము మీగ్రామములు ప్రవేశించేటప్పుడు పైనచెప్పిన దుర్గంధవస్తువులమ్మే దుకాణములనుండి వాటి వాసన బయలుదేరి మాకు బాధగలిగించునని భయమగుచున్నది. గనుకమాకెదురుగావచ్చే భక్తులు వారికిలభ్యమైనన్ని

పేడతట్టలతో వచ్చి ఉభయపార్శ్వములందు విడువక మాదగ్గఱగానే యుండి ఆపేడవాసన పైవాసనను చంపివేసేలాగున నుండునట్లు యేర్పాటుచేయవలెను. మాభక్తులు తెల్లబట్టలు కట్టుకొనరాదు. ఒకవేళ మేము లేనప్పుడు కట్టుకున్నను, మేమున్నరోజులలో ముఖ్యముగా అట్టి బట్టలతో మాకంటబడగూడదు. తోటకూర, గోంగూర, ఎలకజీడికూర తూటికూర, చామ, బెండకాయ మొదలయినవి తిని వాటితో నేమాకు విందుచేయవలెను. ఈవిధముగా లేనిచో అసలు మేమెన్నడు త్రొక్కిచూడము. మాకు మధ్యాహ్నము ఫలహారములక్రింద తోమనిపళ్ళెములో పోసి కళ్ళుగుడ్డపైనిగప్పి, ఈగలుముమ్మురితో నిండునట్లు అమ్మకమునకు తెచ్చే తాలింపుసెనగలు, నాలుగుదినములక్రిందట చేసిన పాత పెసరట్లు, ముక్కిపోయిన అటుకులు, మాగికుళ్ళిపోయిన పండ్లు. చలివాసనవేసే పేలవుండలు, సెనగవుండలు, మెతకకంపుగొట్టేపులియారపటుకులు, యినుపపళ్ళకైనా నములుటకు స్వాధీనముకాని జీళ్ళుఆరగింపుచేసి మాభక్తులందరు ఆప్రసాదమును కడుపునిండా తినవలెను. కాఫీకొట్టులలో బడి వెక్కసముగా తినేవారిని, పైవస్తువులుతిని బ్రతికేవారిని మాబిడ్డలుగా యెంచుకొని పెంచుకొని దత్తహోమము చేసికొనుచున్నాము. మేమువచ్చేముందర, మాకుబిక్షచేసేటప్పుడు తెల్లవార్లు మేలుకొనవలెను. మేముదొరలయిండ్లకు వెళ్ళక మీయిళ్ళేనమ్ముకొని యున్నాము. గనుక మీతండ్రితాతలుచేసినట్లు మీరుకూడా మమ్ము గౌరవించి మీగ్రామమునుండి మమ్ము వెంటనే వెళ్ళగొట్టక, పదికాలములపాటుంచి యేపేటా తిరిగిరప్పించుకొని బిక్షలుసేయుచు భక్తిశ్రద్ధలను చూపించుచుండవలెనని కోరుచున్నాము

ప్రస్తుతము భద్రాద్రినుకాం. ఇట్లు ఆజ్ఞాపించు మీనెత్తిమీదదేవత,
చైత్రశుద్ధ శ్రీరామనవమి గొట్టాలమ్మ.

—*—

బ్రహ్మదేవునికి పూజ్యత యెందుకు లేకపోయెను?

[ఒకనిద్దురపోతు, ఒకతిండిపోతు, ఒకత్రాగుబోతు, ఒకతిరుగుబోతు, ప్రవేశించుచున్నారు.]

తిరు— ఒరే! విష్ణుమూర్తికి సాంబమూర్తికి లోకములో ఇన్ని వేల ఆలయములుండి యెంతో వైభవముతో పూజలు కైంకర్యములు సేవలు జరుగుచుండగా పాపము బ్రహ్మదేవునికి ఒక్క చోటనైనా ఆలయము లేకపోవుటకు గారణమేమి? మీరందరు బుద్ధిలో బృహస్పతులుగదా? కాబట్టి యీ విషయమై చక్కగా ఆలోచించి చెప్పండి. ఇది చాలా ముఖ్యమైన విషయము. వీటి విషయమై ఆలోచించి పరియవసానము దెల్పుటకు మనకంటె సమర్థులైనవారు లోకములో నెవ్వరును లేరు. అనేక పండితులు చిరకాలము నుండి యీ సందేహముచేత బాధపడుచు సందేహానివృత్తి చేసికొనలేక చాలాతంటాలు పడుచున్నారు. ఈకీర్తి మనకే దక్కవలెను. పరోపకారార్థ మిదంశరీరమన్నాడు గనుక మనముమిక్కిలి పాటుపడి యీవిషయము తేల్చిలోకమున కుపకారము చేయవలెను. మన యభిప్రాయము ఒక పుస్తకముగా అచ్చువేయించి ఉచితముగా పంచిపెడదాము.

నిద్ర—ఒరే నీవువేసిన ప్రశ్న చాలాబాగున్నది. నాకుగూడ చిరకాలమునుండి యీ సందేహమే యున్నది. మనము యీ లోకములో మూడునాళ్లు బ్రతికే బ్రతుకుగదా? అంతకన్న నెక్కువ లేదు. ఏదో యిటువంటి శాశ్వతమైన యుపకారము లోకములో చేసిపోతిమా మన పేరుండిపోతుంది. కాబట్టి యీ విషయమై మన అందరి అభిప్రాయములు వరుసగా చెప్పుదాము.

తిరు—సరే ముందుగా నీయభిప్రాయము చెప్పు. బ్రహ్మదేవుని కెందుకు పూజ్యత లేకపోయినది ?

నిద్ర— నామీదనే పెద్దరికము పెట్టి ముందు నన్నే అడిగినారు గనుక చెప్పుచున్నాను వినండి. బ్రహ్మదేవుడు ముసలివాడగుట చేత మతిలేక తెలివితక్కువ పనులు చాలా చేసినాడు. అందులో ముఖ్యమైన తెలివితక్కువ నేను చెప్పుతాను వినండి రాత్రి భాగము నిద్రపోవలసినదని యేర్పాటుచేయుట మొట్టమొదటి తెలివితక్కువ. ఇతడు చేయవలసిన దేమనగా రోజుకు ఎనిమిది జాములు కాకుండా 20 జాములు చేయవలసినది. అందులో 18 జాములు కేవలము హాయిగా నిద్రపోవుట కేర్పరచిన మిక్కిలి బాగుండును. అన్నము తినుటకు నిద్ర మేలుకొని రానక్కరలేకుండా యేదైనా యొక్క యేర్పాటు చేయవలసినది అనగా అన్నము తినుటకై వేరే ప్రయత్నము చేయనక్కరలేకుండా మంచముమీద పడుకున్న పాళమున నోటిలో ముద్దలువచ్చి పడునట్లు—అవి మనుష్యుడు నిద్దరలోనే నమలనక్కరలేకుండా జీర్ణము చేసుకునేటట్టు యేర్పాటులుండవలెను. ఉదయం మేలుకొనవలయుననే నియమ ముండగూడదు నిద్ర యేలా యుండవలెననగా సాధారణమైన చప్పుళ్ళకు కేకలకు పిలుపులకు మెలకువ రాగూడదు ఇదిగాక ఇంతకన్న నెక్కువ సదుపాయ మొకటికూడా చెప్పుతాను. మనుష్యుడు నడుస్తూ నిద్రపోయేటట్టు బ్రహ్మదేవు డేర్పాటు చేయవలెను. ఈవిధమైన యేర్పాటు చేయకపోవుట చేత బ్రహ్మదేవునికి పూజ్యత లేకపోయినదని నా యభిప్రాయము.

తిండి—నీయభిప్రాయము నాకంతగా నచ్చలేదు. ఎల్ల కాలము నిద్రయే పోయినపక్షమున బ్రహ్మదేవుడు సృష్టించిన పదార్థముల తినుటకే వ్యవధియుండదు. అవి మనము తినకపోతే వాటిపని యేమికాను ? అందుచేత నీవు చెప్పినయుక్తి బాగుగాలేదు. నేను చెప్పబోయే సబ

బులు వింటివా నీవేగాక మీరందరు నాలో నేకీభవింపక మానరు. బ్రహ్మదేవుడు తినుటకై సృష్టించిన పదార్థము లనేకములుగనున్నవి. మనుష్యునకు పెట్టినపొట్ట మిక్కిలి చిన్నదిగానున్నది. ఎక్కువతిందా మన్నను పొట్టపట్టదు. ఇదియే బ్రహ్మదేవునియొక్క ముఖ్యమైన తెలివితక్కువ. మనుష్యునిపొట్ట యేలాగుననుండవలెననగా ఒకపెద్ద సారంగమువలె నుండవలెను. వేళపాళ లేక రాత్రియనక పగలనక మితి మేర లేక యెన్నెన్నివస్తువులు తిన్నప్పటికి యెక్కువసముగా నుండ గూడదు. ఆయాసము కలుగగూడదు. డోకు రాకూడదు అజీర్ణమన్న మాట చేయకూడదు. ఏవస్తువైనా లోపలపడగానే వెంటనే జీర్ణమై పోవలెను. అదికాక బ్రహ్మదేవు డిప్పుడు జీర్ణకోశము కడుపులోనే పెట్టినాడు. అది ఆలాగున ఒక్కచోటనే యుండగూడదు. రాసుల కొలది తిన్నప్పటికి అరిగిపోవునట్లు శరీరమంతటా జీర్ణకోశ ముండ వలెను. అనగా కాళ్ళలోను, చేతులలోను, వీపులోను, తలలోను గూడ జీర్ణకోశములే యుండవలెను. ఇదిగాక వస్తువులయొక్క రుచిని తెలిసికొనుటకై యొకనాలుకనే యేర్పరచినాడు అనంతకోటివస్తువులరుచి ఒక్కనాలుకతో తెలిసికొనుట కష్టముగా నున్నదిగనుక రుచులు తెలిసికొనుటకై యింకా అనేక అవయవములకు శక్తులియ్యవలెను. పెద్దపెద్దపండ్లు అన్నపుముద్దలు అమాంతముగా ఒక్కసారి మింగుటకై యిప్పుడున్ననోరుకంటె పదిరెట్లు పెద్దనోరియ్యవలెను.

త్రాగు—మీయిద్దరి సబబులుకూడా నాకంతగా నచ్చలేదు. బ్రహ్మదేవుడు కల్లు సముద్రములు, సారాయి సముద్రములు, చేపల గుట్టలు, మాంసపుపర్వతములు నిర్మింపక ఉప్పునీళ్ళసముద్రములు, మంచినీళ్ళనదులు, యెందుకుపనికిరాని రాతికొండలు, సృష్టించుటవల్ల అతనికి పూజలేకపోయినదని నేను ప్రమాణముగా చెప్పగలను. ఉప్పు

నీళ్ళసముద్రములు నిశ్చయముగ ప్రపంచమున కేమియుపయోగ మని బ్రహ్మదేవుడు సృష్టించినాడు చెప్పండి? కల్లుసముద్రము లున్న పక్షమున బీదలు సాదలు డబ్బుపెట్టి కొనవక్కర లేకుండా యిష్టము వచ్చినప్పుడు యిష్టమువచ్చిన ముంతలతో ముంచుకొని త్రాగి, అందు లోనే స్నానముచేసి దానిమీదగా లేపీల్చి హాయిగా నుందుముగదా! అట్లుచేయకపోవుటచేతను సారాకు దుర్వాసన పెట్టుటచేతనుపానకము వలె దానికి రుచిపెట్టకపోవుటచేతను బ్రహ్మదేవునిమీద లోకులంద రికి అసహ్యము పుట్టినది.

తిరుగు మీయుక్తులు సరియైన యుక్తులుకావు. బ్రహ్మ దేవుడు వ్యర్థమయిన వృక్షము లనేకములు లోకములో సృష్టించి నాడు. ఈ లాటిచెట్లు కోటానకోట్లు సృష్టించి లోకము పాడుచేయుట కంటె వక్కరూపాయల చెట్టు, ఒక డబ్బులపాదు సృష్టించినపక్షమున ప్రపంచములో మనుష్యులు తమయిచ్చవచ్చినట్లు వ్యభిచారాది దోషముల పాటించక సుఖులోలులై తిరుగవచ్చునుగదా! అట్లు చేయకపోవుటచేత బ్రహ్మదేవుడు వట్టి అవకతవక నిర్భాగ్యుడై నాడు. అందుచేత పూజ లేకపోయినది.

తిండి—ఒరే! మనలో మన మేకీభవించ లేము. మనయభి ప్రాయము లచ్చువేసి. లోకులందరికి పంపుదాము. ఎక్కువమంది యెవరిదంగీకరిస్తే వారిది సరియైనట్లు.

అందరు—సరే.

(అని నిష్క్రమించుచున్నారు.)

—౯—

దంపతుల ముచ్చటలు

[కనకమ్మయు రామచంద్రరావుగారు ప్రవేశించుచున్నారు.]

రామ - ఎన్నిపిలిచినా పలుకవేమిటి. ఏమిచేయుచున్నావు. ఎక్కడనున్నావు ?

కన —(మెల్లగ) ఇక్కడనేయున్నాను. ఎందుకు ?

రామ—గొంతుకింత సన్నగించిన దేమి ? అంతమెల్లగా పలికితే ఎవరికి వినబడుతుంది ? ఏమైనా కొంచెము కోపము చిత్రగించావా యేమిటి? మాట సన్నంగా వస్తూంది.

కన—నాకేమికోపము నామాట ఒకప్పుడింతకన్న గట్టిగానుందా యేమిటి.

రామ—ఆమాటలోనే యున్నది.కోపమువచ్చినట్లు మొగము కూడ మటమటలాడుచున్నది కాని యెప్పట్లాలేదు.

కన—మటమటలాడక ఒకప్పుడుమాత్రం మీకంటికి కలకలలాడుచు కనబడినదా యేమిటి ?

రామ —అదంతా నాకు తెలియదుగాని వ్యవహారము మామూలుగాలేదు. మామూలుగానున్నట్టయితే యెవరితోను మాట్లాడకుండగా యీచీకటియింట్లో యెందుకు పడుకుంటావు. చాకలివాడు దీపము వెలిగించలేదా యేమిటి ?

కన—మీనౌకర్లు నేచెప్పినట్లు వింటారా యేమిటి ?

రామ—వినకపోతే నాతో చెప్పరాదూ.

కన—మీరు మాత్రము నేచెప్పినట్టు వింటారా యేమిటి?

రామ— కూసంవిడిచిన తాచుపాములాగ మాటిమాటికి. ఆ విధంగా కిస్సుబుస్సుమంటూ వేమిటి నీమనసులో నున్నసంగతేమిటో చెప్పరాదు. ఆ బాధ యేమిటో తీర్చి వేస్తాను.

కన—నాకు బాధ లేమున్నాయి. నేను బతికుండడమే ఓ కందఱికి బాధగాని నాకేమీ బాధలులేవు.

రామ—మనసులోనున్న దేమిటో చెప్పమంటే చెప్పక సణుగుతావేమిటి! వెధవసణుగు. నీకర్మం అలాగై తేనేనేమిచెయ్యను,

కన—నాకర్మమన్నమాట నాకూ తెలుసును. కాకపోతే వెఱ్ఱిహాడి పెళ్ళాము వాడకల్లా వదినన్నట్లునాటకపువాళ్ళదగ్గరనుంచి వన్నింత లోకువెందుకుచేస్తారు. కర్మంబాగుంటే అందరు డిప్టీకల క్టరు పెళ్లాలులాగూ నేనూ ఉందును. నేను అయిదువందల రూపా యలు జీతంపుచ్చుకొనే డిపిటీకలకటరు పెళ్ళానన్నమాటేగాని నా మాట యెంతమాత్రము వూళ్ళోవాళ్ళు వినడమేలేదు. మీ యింట్లో పట్టెడన్నము మీ దాసీది తింటున్నది. నేను తింటూన్నాను.

రామ—ఈసోదంతా యెందుక్కాని నాటకుల కేమిటి,లోకువవడమేమిటి ? టిక్కెట్లకోసము నీవుపమైనా వర్తమాన మంపినావా యేమిటి ?

కన—అవును, బుద్ధిహీరబాటొవచ్చి మనవంటబ్రాహ్మణుని, హరేరాముసింగుని టిక్కట్లకోసము పంపించినాను.

రామ—వాళ్ళువెళ్ళి యేమనిఅడిగినారేమిటి. నీపేరుపెట్టడిగారా, నాపేరు పెట్టడిగారా?

కన—నాపేరుపెట్టి అడుగమంటానా? మీపేరుపెట్టే అడిగారు. డిపిటీకలక్టరుగారు వారింట్లో ఆడవాళ్లు పిల్లలు నాటకానికి వస్తారని చెప్పమన్నారని మనవాళ్ళక్కడ చెప్పినారట. చెప్పగానే గడగళ్ళాడుతూ దయచేయవలసినదని చెప్పక,నాటకానికి, వారువస్తే మా అభ్యంతర మేముందని ఆ మేనేజరన్నాడట. కొందండి టిక్కెట్లు కావాలని మనవాళ్ళడిగినారట. వాడిహగరు పోడిచెయ్యా! ఆమేనేజరప్పుడు, టిక్కెట్లు కావలిస్తె కొనుక్కుంటే వస్తాయి. అన్నాడట.

నాటకా లాడుకునే వెధవల కంటిపొగరా? వెనక మీరు నూరు రూపాయల మేస్త్రీ రిటుపని తహసిలుదారుపని చేసేటప్పుడే రామపురంలోను గంగపురంలోను అక్కడికి నాటకాలాడడానికివచ్చేవాళ్ళందరు మనకు కావలసినన్ని టికెట్లు పంపించేవారు అప్పుడు నాటకాలకు మన యింట్లో వెళ్ళినంతమంది వెళ్ళగా మన వీధులలోనున్న ఆడవాళ్ళనందరిని తీసుకుపోయేదానిని. ఇప్పుడు వాళ్ళు మన కేటికట్టు లేకుండా చేసినారు? వీళ్ళకింత గీర్వాణమా ? ఇంతకూ కూర్చున్న గుడ్డియుండ లేవకుండా మీ యధికార మిల్లాగున్నది.

రామ—ఇవ్వనన్నారుగా ? అయినా అప్పటిరోజులు వేరు. ఇప్పటిరోజులు వేరు. పయిగా అవి పల్లెటూళ్ళు ఇది బస్తి.

కన—పల్లెటూ రేమిటీ బస్తీయేమి. ఇంతకూ ఆపక డులేదు. మామేనమామ రివిన్యూఇన్స్పెక్టరుచేస్తూ తాలూకా అంతా గడగడలాడించాడు, పగడుంటే వాళ్ళకల్లా అనేందు కెన్ని వేలగుండె లున్నాయి. మన చిన్నబ్బాయి వడుగుకు నూరుకావిళ్ళ పెరుగు రావలసినది. అయిదు కావిళ్ళు రావడం ? డిప్టీకలక్టరీచేస్తూ కూరలు మనం కొనుక్కోనా ! ఏమి యుద్యోగమయ్యా యిది ? జీతమురాళ్ళగొప్పేనా అన్నపూర్ణయ్యగారు డిప్టీకలక్టరీలో లక్ష రూపాయలు సంపాదించాడు మీరు జీతంగాక పాతిక వేలు సంపాదించే టప్పటికి బ్రహ్మాండం బద్దలయింది. అందులో పదివేలు కంపెని దివాలాలో గంగపాలై నాయిగదా! ఇంతకు నాటకపువాళ్ళకు బుద్ధి చెపుతారా లేదా ?

రామ—చెప్పనూ? డొక్క చీరించేస్తాను. వాళ్ళకు యినక్కం టాక్సు కట్టించి మచ్చమాపుతాను. (ఇద్దరు నిష్క్రమింతురు.)

—*—

అపూర్వ యాచకుడు

[అప్పుడు దామోదరయ్య అను బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నాడు.]

దా—(తనలో) ఈ గ్రామములో నే నేరూపకముగా యాచన చేయవలెనో తెలియకున్నది. ఏలూరులో యజ్ఞము చేస్తానని యాచించితినిగదా! నరసాపురములో కుమారుని యుపనయనమని, కాకినాడలో కూతురును కన్యాప్రదానము చేస్తానని, అమలాపురంలో చెంబు గుడ్డలు దొంగ లెత్తుకు పోయినారని, చేసిన యాచనలు. అంత సఫలం కాలేదు. కొందరు వెఱ్ఱిముండావాళ్ళు నా మాటలు నమ్మి కొంతసొమ్మిచ్చినప్పటికి మొత్తముమీద ద్వ్యాయము తిన్నగా పారినదికాదు. ఇప్పుడు రాజమహేంద్రవరములో ఏపన్నాగముమీద యాచించుట బాగుండునను చెపుమా? అన్నసత్రం వేసినానని బొంకుదునా? ఇది యంతగా పొసగదు. దేవాలయం కట్టిస్తానని బొంకుదునా? మావూళ్ళో దేవాలయం యిదివరకే యున్నది. అందుచేత డబ్బురాదు. కాబట్టి మావూళ్లో దేవాలయము ముందర గోపురము కట్టిస్తానని నేను బయలుదేరుతాను. బ్రాహ్మణాళ్ళదగ్గరకు వెళ్లితినా ఒక్కడబ్బైనా పుట్టదు. నాలుగు డబ్బులసొమ్ము దొరికితే తక్కిన వర్ణాలవాళ్ళ దగ్గరే దొరకాలి, ముఖ్యముగా ఆడవాళ్ళదగ్గర, అందులో వెధవముండల దగ్గర నాయెత్తు పారినట్టు మరెక్కడా పారదు. వెయ్యేళ్ళకు వెధవముండలు దేశంనిండా చల్లగానుండవలెను. గుళ్ళన్నా గోపురాలన్నా పిచ్చినమ్మకం వాళ్ళకుంటుంది గనుక యింతడబ్బు పారేస్తారు. ఆడబ్బుపెట్టి నేను సెంపటికొంప కట్టుకొని, హాయగా కాపురముంటాను. నాయిల్లే గోపురము, నేనే దేవుడను, ఇదిగో నా

కేదుకుగుండా పెద్దయిల్లు కనబడుచున్నది. యింట్లో యెవరో భాగ్యవంతులే యుండి తీరవలయును ఇదిగో లోపలకు వెళ్ళి గోపురమువంక బెట్టి అడుగుతాను. (అని వెళ్ళుచున్నాడు)

[అంతట లింగరాజుగారు ప్రవేశించుచున్నారు]

లింగ—(తనలో) నాకర్మమేమో కాని నా సొమ్మంతా తక్కువవడ్డీకే తిరుగుచున్నది. నూటికి రూపాయతొమ్మిదణాలకంటె, ఎక్కువ యిచ్చేవా డెవడు దొరకలేదు వాళ్ళ అదృష్టమేమోకాని, ఆరాయన్నగారికి, నందయ్యగారికి తనఖామీద నూటికి మూడు రూపాయలచొప్పున వడ్డీకి పట్టుకువెళ్ళేవారు దొరుకుతారు. ఇంతకు నాఅదృష్టము తిన్నవయినది కాదు ఎవడి దగ్గరైనా ఖరాఖండిగా వసూలు చేదామంటే పెద్దమనుష్యులమని పేరుపెట్టుకుని తుంటరి ముండావాళ్ళు కొందరు నాదగ్గరకువచ్చి "పాపమువాడు పేదవాడు ఏభైరూపాయలు మానివెయ్యి నూరురూపాయలు మానివెయ్యి" అని లేనిపోని సిఫారసులు చేస్తుంటారు. నావద్దకు వచ్చి చెప్పకపోతే వీళ్ల పుట్టేమి మునిగిపోయినది? ఆపైన ఈ ధర్మకార్యములకు చందా వెయ్యమని పెద్దమనుష్యులు చందాజాబితా పంపుతారు, పైగావచ్చి పీక్కుతినే యాచకులు వందలకొలదిగదా! అయినా నే నెప్పుడూ వీళ్ళకు దమ్మిడీ యిచ్చేవాడను కాను. అయినప్పటికి మంచి మాటలతో వీళ్ళను సాగనంపాలి కాని కసిరి కొట్టినట్టయితే వీళ్ళంతా అర్జీలిచ్చి యిన్కంటాక్సు కట్టిస్తారు.

[అప్పుడు దామోదరయ్య ప్రవేశించుచున్నాడు]

దా—"నవోనవో భవతి భవతి జాయ మానోహ్నా"

లింగ—(కోపముతో) ఎవరువారు? ఏమిటి చెవికోసిన మేక లాగు అరుస్తావు. ఆ సోదేమిటి. ఏయూరు నీది, ఎందుకు వచ్చావు?

దా—చిత్తము. మాది కృష్ణాతీరం. నేను ఘనాపాఠిని.

లింగ—ఘనాపాఠీ ఘనాపాఠీ నాకు తెలియదు. మీ రెందుకు వచ్చారో చెప్పండి?

దా—తమరు ఆగ్రహించక సావధానముగా చిత్తగించండి. మాగ్రామములో దేవాలయములో నేనొక గోపురము కట్టించుచున్నాను. దానికి అయిదారువేలు రూపాయలు కావలెను. అందుకోసం నేను యాచనకు బయలుదేరినాను. ఇది నాకుటుంబ రక్షణకోసంగాదు. దేవునికార్యం. ఈయూరు తహసిల్దారుగారు, ప్లీడర్లు తమకు దోచిన సాయము చేసినారు. నాభోజనము నిన్నా యీ వేళ కూడా తహసిల్దారుగారి యింట్లోనే.

లింగ—(తనలో) వీరు తహసిల్దారు గారింట్లో భోజనంగదా. నామీద యేమైనా తహసిల్దారుగారితో చెప్పినట్లయితే ఆయనకు కోపము వస్తుందేమో. కనుక వీనిమీద కోపము చెయ్యకూడదు. (ప్రకాశముగా) అయ్యా! తమరు మహానుభావులు తమవంటివారు కొందరుండబట్టి భూమిమీద వానలు పంటలు కలిగియున్నాయి. తమరు చేసినపని చాలామంచిది. తమ సెలవుప్రకారం నేనుకూడా నడచుకుంటాను.

దా—(తనలో) ద్వాయంపారినది ఈయన యేదైనాదిట్టము గానే యిస్తాడు. (పైకి) తమవంటి ధర్మాత్ము లుండబట్టే లోకమర్యాద జరుగుచున్నది. దేవబ్రాహ్మణపక్షపాతం గల గృహస్థులు తమవంటివారు పదికాలాలపాటుంటేనే మా మహానుభావత్వాలు కనబడతాయి. దీని కైదైనా విరివిగా యిప్పించాలి.

లింగ—(తనలో) వీడిని నోరెత్తకుండా పంపించే యుపాయమేమిటి చెపుమా?

దామో—(తనలో) యేదో ఆలోచిస్తూన్నాడు. ఎంత సొమ్మియ్యనా అని ఆలోచిస్తూన్నాడు.

లింగ—అయ్యా! తమరు తలపెట్టిన కార్యము గొప్పది. దీనికి యేభై, నూరు యిస్తే సరిపోదు. బాగా యెక్కువగా యివ్వవలెనని నాకున్నది.

దామో—(తనలో) వహవా, వహవా, చేపవలలోపడినది,

లింగ—కాబట్టి తమరు ఎన్ని అంతస్తుల గోపురం కట్టిస్తారో చెప్పండి?

దా—ఆరంతస్తులండి.

లింగ—సరే! బాగుంది. నేనొక అంతస్తే కట్టించివేస్తాను.

దా—అయితే మొదటి అంతస్తుకే తమరు సొమ్మియ్యించండి. వెయ్యిరూపాయలవుతాయి.

లింగ—అలా కాదు. అయిదంతస్తులుకట్టించి మీరు నావద్దకు రండి. ఆపిమ్మట ఆరవ యంతస్తు నేను దగ్గరనుండి కట్టిస్తాను.

దా—(తనలో) ఈ లోభిముండాకొడుకు నాకొంప తీసినాడు. అయిదంతస్తులు నేను కట్టించడంలేదు. ఆరోఅంతస్తు వాడు కట్టించడంలేదు. ఈగడుసుముండాకొడుకు నన్ను నోరెత్తకుండా చేసినాడు. గడుసుతనమనగా వీడిదిరా బాబు. వీడిదానం మండా వద్దనడానికి వీలులేదు. పుచ్చుకోనడానికి వీలులేదు. (పైకి) చిత్తము. తమరుచేసిన దానం చాలా బాగా యున్నది. మధ్యాహ్నము మీదర్శనము చేస్తాను.

లింగ—(తనలో) వీడి రోగము చప్పగా కుదిర్చినాను.

—*—

అపూర్వ స్వయంవరము

మొదటి రంగము

[రామదాసుగారు భావరాజుగారు ప్రవేశించుచున్నారు.]

భావ — రామదాసుగారూ! మీ యభిప్రాయమేమిటో స్పష్టముగా చెప్పండి.

రామ — భావరాజుగారూ! చల్లకువచ్చి ముంత దాచడ మెందుకు చెప్పుచున్నాను వినండి. మన నాగరాజుగారి కీమధ్య భార్యావియోగమైనది. ఆయన పెద్ద యుద్యోగములో ఉన్నారు. ఆయనకు ప్రథమకళత్రము తాలూకు కొడుకు కొమ్మా యెవరు లేరు. వెనక దిక్కు-కూడా ఆయనకొట్టే యున్నట్టు కనబడదు. మాపిల్ల పదమూడేండ్ల వయసుగలది గనుక నాగరాజుగారికిచ్చి వివాహము చేయించండి. మీ మాటంటే ఆయనకెంతో గురి. మా పిల్ల యెత్తరి కూడాను. త్వరగా కాపరాని కొస్తుందని ఆయన తప్పకుండా వప్పుకుంటారు.

భావ — ఆయన అసలే పెండ్లి చేసుకోననంటున్నాడే ఇదెల్లాగ?

రామ — శవురు గట్టిగా చెప్తే ఆయనవింటాడు. మనమంతా పోగై యెల్లాగో ఒకలాగ మెడలు విరిచి ఆయనచేత వప్పించాలి.

భావ — ఇంటివాడు గొడ్డుగేదె అంటే పొరుగువాడు పాడిగేదెఅన్నట్లు, ఆయననాకు పెండ్లివద్దు మొర్రో అంటూంటే చేసికొనక తప్పదని మన మెల్లాగ చెప్పమండి? ఆయనకు లేనిబాధ మధ్య మన కెందుకండి! అదిగాక మీరు పదమూడేండ్లుపెంచి పిల్లను శుభ్రమైన కుఱ్ఱవాని కెవ్వరికైనా యివ్వక, ఏబదియేండ్లు దాటి అరవయ్యో పడిలోనున్న వాని కిస్తామంటా రేమిటి. పిల్ల సౌఖ్యము చూడవద్దా

రాము—పిల్ల సౌఖ్యపడకేమండీ డిస్ట్రిక్టు మునసబు పని చేస్తూన్నారు గదా. కావలసినంతమంది నౌకర్లు చాకర్లు వంట బ్రాహ్మణులు ఒంటినిండా నగలు యింటినిండా వస్తువులు పైగా ఆయనకు 45 ఏండ్లకంటె ఎక్కువ లేవు.

భావ — ఇప్పుడు మీయల్లుడు కాబోతాడు కనక వయస్సు తగ్గిందేమోకాని, ఆయనకు వయస్సు 55 సం॥రములు. ముందు మార్చి నెలలో పించనుకు దాఖలు చేయబోవుచున్నారు. ఇంటినిండ వస్తువులు ఒంటినిండా నగలేకాని మనసునిండా సంతోషము మాత్ర ముండదు. ఇంతకు మీరు నాకు ముఖ్య స్నేహితులుగనుక నేను ఆయనతో చెబుతాను. ఈ సంబంధమైతే మీకేలాగైనా అదృష్ట వంతులే. నాగరాజుగారు పది కాలాలపాటు బ్రతికితే పిల్ల అదృష్ట వంతురాలు. లేక త్వరగా కడతేరితే మీరదృష్టవంతులు. పదండి పెండ్లిమాటలకు వెడదాము.

రాము—చిత్తము మీ రెఱుగనిదేమున్నది కనుక మీదయ పదండి.

(ఇద్దరు నిష్క్రమింతురు)

— * —

రెండవరంగము

(నాగరాజుగారియిల్లు నాగరాజుగారు కుర్చీమీద కూర్చుందురు)

నాగ—ఓరీ చాకలీ? ఈపూట మందు తెచ్చినావా లేదా ? వైద్యుడుగా రేమన్నారు?

చాక—మామూ లన్నం తినొద్దన్నారండి. గోదుమన్నం తిన మన్నారండి. పనద్దార బెల్లం ఒద్దే పుచ్చుకోద్దన్నారండి.

నాగ—ఈయన యెప్పుడూ అతిమూత్రపు వాళ్ళకు గోధుమ అన్నమే పెట్టిస్తాడు, పాలు పంచదార వల్లకాదంటాడు. ఈపత్యము చేత మలమల మాడి చావాలి, ఇక పించను పుచ్చుకుంటేనే మంచిది

[అప్పుడు రామదాసుగారు భావరాజుగారు ప్రవేశించుచున్నారు]

నాగ—ఒహోహో! భావరాజుగారా దయచెయ్యండి. వారెవరు ?

భావ—వీరు రామదాసుగారని మనవాళ్ళే. వీరియన్నగారిని బహుశా మీరెఱిగియుందురు. వెనుక మీకోర్టులో అమీనుగా యుండేవారు రంగదాసుగారని ఆయన తమ్ముడే యీయన.

రామ—రంగదాసుగారు సాక్షాత్తు మాఅన్నగారేనండి.

నాగ—అల్లాగా! పాపము ఆయన చాలా మంచివాడే పాపము ఆయన పోయినాడు గాదూ? ఆయన కూతురునే కాబోలు మూర్తిరాజుగారికి మూడవ కళత్రముగా ఇచ్చినారు. పాపము ఆయన పెండ్లిఅయిన మూడునెలలకే పోయినాడు.

రామ—చిత్తము చిత్తము. ఏదో దాని దురదృష్టమల్లాగ నున్నదండి.

భావ—మీానంటో కొంచెం నెమ్మదిగా నున్నదాండి?

నాగ—ఏమి నెమ్మదండీ! ఈ యతి మూత్ర మొకప్పుడు నెమ్మళముగ నుంటుందీ. ఎల్లాగో దినములు గడుస్తున్నాయికదా? ఇక పించను పుచ్చుకుంటాను పనిచెయ్యడాని కోపిక లేదు.

భావ—కళత్రవియోగమైనప్పటినుండి మీకు బాధ మరింత యెక్కువగానున్నట్టు కనిపిస్తూన్నది.

నాగ—అవును మఱి ఏమిచెయ్యను? ఈశ్వరేచ్ఛ ఆలాగున్నది.

భావ—మీతో ఆవిషయమై నేను మాటలాడడానికే వచ్చినాను మన రామదాసుగారిదగ్గర పదమూడేళ్ళపిల్లయున్నది. ఆయన ఆపిల్లను తమకియ్యవలెనని ఆలోచిస్తున్నారు దీనికి మీరంగీకరించవలెనని నాకోరిక.

నాగ—(చిఱునవ్వుతో) బాగా సెలవిచ్చారు భావరాజుగారు. ఇప్పుడు నాకు పెండ్లేమిటయ్యా! అతిమూత్రరోగము బలమైనది

మూలశంక ముప్పదియేండ్లనుంచి యున్నది. కొంచెము దగ్గుకూడా యిప్పుడు బయలు దేరుచున్నది. పిల్లను నాకిచ్చేకంటె గంగలో దింపితే మంచిది.

భావ.—అవ్వేమిమాటలు ? ఆలా సెలవియ్యకండి. జబ్బుగా నున్నారు గనుక నే తమరుముఖ్యంగా వివాహము చేసికోవాలి. ఏమంటే మీకు భోజన సదుపాయము వగయిరాలు గృహస్థాశ్రమంలో ప్రవేసిస్తేనేకాని జరుగవు.

నాగ.—వంటబ్రాహ్మణుని పెట్టుకుంటే కావలసినన్ని సదుపాయములు జరుగుతాయి. ఇంతకు రామదాసుగారూ! మీరు నాకే యుద్దేశముచేత పిల్ల నిస్తూన్నారో చెప్పండి. నేను పడుచువాడనా స్పురద్రూపినా యేమిటి మీ యాలోచన ?

రామ.—చిత్తము నాకు మరేయుద్దేము లేదండి తమరు బంధు సముద్రులు. తమరు వెనుక మా అన్నగారికి మీ కోర్టులో అమీనా పని యిచ్చి మా కుటుంబ పోషణ చేసినారు. ఆ విశ్వాసంచేత నేను మీ వంశము నిలపదలచి మీకు పిల్ల నిస్తూన్నాను.

నాగ.—నావంశం పోతే నాకే విచారము లేనప్పుడు మధ్య మీకెందుకు ? రాములవారి వంశము ధర్మరాజుగారి వంశము లేనప్పుడు నావంశము లేకపోతే భూమికి లోటా ? ఇది కేవలము దొంగ వేషముకాని నిజము కాదు.

రామ.—దొంగవేషము కాదండి. నిజమే. వంశము నిలిపితే పుణ్యమని యిల్లాచేస్తూన్నాను.

నాగ.—పుణ్యమైతే పెండ్లి వద్దు మొర్రోఅనే నా వంశం నిలపక పోతే పెండ్లి కావాలని యేడ్చే పడుచుపిల్లవాళ్ళు పేదవాళ్ళు అనేకమంది యున్నారు. వాళ్ళ వంశములు నిలపండి. పిల్లవాడి దగ్గర చెప్పినట్లు నాకీమాటలెందుకు చెపుతారు ? పిల్ల నెందుకిస్తారో నాకు తెలుసు.

రామ — నేను పిల్లను మీకుతప్ప యింకెవ్వరికి నియ్యను. మీ చిత్తం.

భావ — రామదాసుగారూ, ప్రస్తుతం సెలవుపుచ్చుకుందాము రండి. మరల దర్శనము చేద్దాము. సెలవు పుచ్చుకుంటాము.

నాగ — తర్వాత మాటలాడుదాము రండి. రేపు దయ చెయ్యండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

—*—

మూ డ వ రం గ ము

[అప్పుడు నాగరాజుగారు, భావరాజుగారు, రామదాసుగారు ప్రవేశించుచున్నారు.]

నాగ — భావరాజుగారూ! శనిగ్రహంలాగు నన్ను పీక్కు తినుటకు మళ్ళీ వచ్చినారా? ఆయన పిల్లను ఆయన యిష్టమువచ్చిన వారికిచ్చుకోమని చెప్పండి నాకక్కర లేదు.

భావ — తమ రాలాగున సెలవిస్తే పనికిరాదు. ఆయన పిల్లను మీకిచ్చి మీయిల్లు నిలపదలచుకొన్నారు. ఇందులో నేను మిమ్ములను మొగమాటపెట్టక మానను.

రామ — నాగరాజుగారూ! నాదొక్క మనవి చిత్తగించండి. మీరు గొప్పవారగుటచేత మీవంశం నాశనమగునంటే నాకెంతో వాగాయిత్యంగానుండి మీవంశం నిలపాలని నేను యీపనిసంకల్పించు కొన్నాను. వంశం నిలిపిన పుణ్యంవంటిది మరొకటిగాదు. మీరు

చదువుకొన్న వారు ఎక్కువయుక్తులు చెప్పి వారివంశం నిలపరాదా వీరి వంశం నిలపరాదంటే నేను మనవి చెయ్యజాలను. పడుచువాళ్ళకు ఎవరుపడితే వారే పిల్ల నిస్తారు, కాని వయసు ముదిరినవారికి యెవరూ పిల్ల నియ్యరు. కాబట్టి అటువంటి వాళ్ళకు యియ్యడమే యియ్యడం, దానివల్ల నే పుణ్యం ఉంటుంది.

నాగ (నవ్వుచు) మీ యుక్తులు మాంచిత్రంగా నున్నవి. ఈ యుక్తిని బట్టి లోకంలోనున్న వాళ్ళందరు తమపిల్లలను ముసలి వాళ్ళకే యిచ్చి పుణ్యము సంపాదించాలి.

భావ—ఏదో ఆయనకు తోచినయుక్తి చెప్పినారు మీరు అట్టే ఖండించక అంగీకరించండి.

నాగ—మీరింత సంతోషముగా నాకు పిల్లనిస్తా నంటూ న్నారు గాని పిల్ల మట్టుకు మనసులో చాలా ఖేదపడుతుంది.

రామ — అది పొరబాటండి. తమరాలాగ సెలవియ్యగూడదు మాపిల్ల 13 సం॥ ములు వయసుగలది రేపు వినాయకుడు చవితి నాటికి పదమూడేండ్లు వెళ్ళిపోతవి. పిల్ల ఉదారుగా నుంటుంది గాని గిడసకాదు. పైగా కొద్దో గొప్పో చదున్నకుంది. నిజంగా మీరు చెబితే నమ్మరు. అదేమి చిత్రమో, తమపేరు ఫలమో, దాని పుణ్యమో కాని తమరినే కాని మరొకరిని వివాహమాడ నంటూం దది. దానికి తమ సంగతి యెవరు చెప్పారో యేమిటో చండాలుడే సరి నే నెప్పుడు చెప్పలేదు సుమండి మీ పాదాలు సాక్షి.

నాగ—(నవ్వి) ఇదేమి చిత్రమండోయి. ఇది ప్రకృతి వ్యతి రేకముగా నున్నది. ఇది కలికాల ధర్మం లాగుంది. పదమూడేండ్ల పిల్ల చదువుకొన్నది. తోటివాళ్ళందఱు పడుచు పిల్లకాయలను పెండ్లాడుచుండగా చూస్తూకూడా ముసలివాళ్ళనే కాని తాను పెండ్లాడ నంటూన్నదా ? ఈవిడ కలియుగ గాంధారిలాగున్నది.

రామదాసుగారూ, మీ మాటలు మీకు బాగుండవచ్చును గాని యీ మాటలు లోకంలో యెవరైనా నమ్ముతారాండి. ఇంతన్యాయముంటుందయ్యా.

భావ—వినడాని కాశ్చర్యముగానే యున్నది. కాని అది సత్యమని ఆయన అంటూన్నాడు.

రామ—పోనీ! నామాటలు నీకింత నమ్మకంగా లేకపోతే ఒక్క దాఖలా చిత్తగించండి. తమరు రేపు సాయంకాలమప్పుడు షికారుగా మాయింటికి దయచెయ్యండి. పిల్లయొక్క కోరిక అప్పుడు స్వయంగా తమరే చిత్తగింతురుగాని.

భావ—అవును. ఒకమాటు పిల్లను చూచినట్లూ ఉంటుంది. రేపొకమాటు అల్లా వెడదాము పదండి.

నాగ—ఆమహోత్సవ మేమిటో చూస్తాను. రేపు వస్తాను పదండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

నాలుగవ రంగము

రామదాసుగారి యిల్లు.

(అప్పుడు మాణిక్యము, రామలక్ష్మి, అన్నపూర్ణ అను ముగ్గురు పిల్లలు ప్రవేశించుచున్నారు)

రామ—అన్నపూర్ణా! విన్నావటే. ఓ తాయలగారిని ముసలి మొగుడుకిచ్చి పెండ్లి చేస్తారట! ఎన్నో నగ లున్నాయట.

అన్న—ఎవరికే ముసలి మొగుడు?

రామ—(నవ్వుచు) ఏమో నాకు తెలియదు. మాణిక్యాన్ని అడుగుదాము ఏమే మాణిక్యం! యెవరికే ముసలి మొగుడు?

మాణి—(కోపముతో) ఇల్లాంటి మాటలు నాదగ్గరనకండి అమ్మాయి. మాఅమ్మతో చెబుతాను.

రామ—అందరుఉండగా నీకంతకోపమెందుకే. నిన్నేమైనా ముసలాడి కిస్తామన్నారా యేమిటి మీవాళ్లు?

అన్న—నాగరాజుగారు పెళ్లి చేసుకుంటారట. నిన్నిస్తారా యేమిటే?

మాణి—(ఏడ్చుచు) నిన్నిస్తారు కావలిస్తేను. ఇల్లాటి వెధవ మాట లనకండి (అని లోపలికివెళ్లి) చూడవే అమ్మా వీళ్ళంతా నన్ను ముసలిమొగుడుకిచ్చి పెండ్లి చేస్తారని ఉడికిస్తున్నారు.

తల్లి—ఉడికిస్తే నీవెందుకుడకాలి? ముసలిమొగుడయితే భయంలేదులే. వాళ్ళందరి మొగుళ్ళకన్నా నీమొగుడెక్కువయేళ్ళే బతుకుతాడులే ఊరుకో. (అందఱు పోవుదురు.)

—*—

ఐదవరంగము

[రామదాసుగారు, భార్యా ప్రవేశింతురు.]

రామ—నాగరాజుగారు కొంచెము మెత్తపడ్డారు. మనపిల్లను తప్పక చేసుకుంటాడు.

భార్య—ఏమో, అంతదృష్టవంతులము అవాలికదా. మీరు మొన్నరాత్రి అన్నట్లు ముండామూటాకూడా త్వరగానే దక్కుతాయి.

రామ—అల్లా గట్టిగా అనకు. ఇది పిల్లచెవినిబడ్డా అది పెళ్ళాడనంటుంది. నే నాయనతో మీమొదుటే మాపిల్ల మిమ్మలిని పెండ్లాడుతానని చెబుతుంది అని చెప్పివచ్చినాను. రేపుసాయంత్రం ఆయన వస్తారు. వచ్చినప్పుడు ఇద్దఱుముగ్గురు పడుచుపిల్లవాళ్లనుగూడా ఆయన సరసను నుంచోబెట్టి మనము మనమ్మాయి నడగాలి. అడిగితే మనపిల్ల నాగరాజుగారినే పెండ్లాడుతానని అనేటట్టు చెయ్యాలి.

భార్య—అదిమనం చెప్పినట్లు ఆలాగేఅంటుంది. నేను దాని చేత అనిపిస్తాను. ఆవిషయమై భయంలేదు. అనకపోతే యెరగదూ. నాచేత్తాడు దెబ్బలు చీపురుకట్టదెబ్బలు దానికి జ్ఞాపకము లేవుగనకనా. వంటయినది. లెండి భోజనానికి, దానిచేత యేమనిపించాలో మధ్యాహ్నము ఆలోచిద్దాము.

(అందరు పోవుదురు)

ఆరవరంగము

రామదాసుగారి యిల్లు

[రామదాసుగారు, భార్యయు, కూతురు మాణిక్యమును ప్రవేశింతురు.]

రామ—అమ్మాయీ! మాణిక్యము. నీయదృష్టము మంచిది. పదమూడేండ్లు పెంచినందుకు పరువుగలసంబంధము గొప్పసంబంధము తీసుకవచ్చినాను. అన్నిముచ్చటలు నీకు తీరుతాయి. ఒంటెనిండా ఒంటెడు నగలు పెట్టుకొనవచ్చును.

భార్య—దానదృష్టముతో పాటు మన అదృష్టముకూడా ఉంది. బిడ్డ ఒంటినిండా ఒంటెడునగలు పెట్టుకొని తిరుగుతూంటే చూచేభాగ్యము మనకుగూడ నున్నదిగదా.

రామ—అవును మనము కూడా అదృష్ట వంతులమే. అమ్మాయీ నిన్ను మన నాగరాజుగారి కివ్వడానికి నిశ్చయము చేసినాను. ఆయనకు నెలకు నాలుగువందలరూపాయలు జీతము.

మాణి... నాకీపెళ్లి వద్దు. వీధిలోకి వెడితే ముసిలిమొగుడును చేసికొన్నానని అన్నపూర్ణా రామలక్ష్మి అంతా ఆక్షేపిస్తారు. నాకు సిగ్గేస్తుంది.

భార్య— ఆక్షేపిస్తే వాళ్ళని చెప్పుతీసుకొట్టిస్తాను. నిన్నాక్షేపించేటందుకు వాళ్ళెవళ్ళు? వాళ్ళ మొగుళ్ళు పడుచువాళ్ళన్నమాటే గాని చస్తే మనవర్తికి దిక్కులేదు. వెధవయింగ్లీషుముక్కలు నాలుగు చదువుకుంటూన్నారని కూడుగుడ్డ లేని కుఱ్ఱకుంకలికిచ్చారు చదువుకుంటే మాత్రము యీ వెధవలికి నాలుగువందల రూపాయల యుద్యోగాలయి యేడిశాయా యేమిటి.

రామ—అమ్మాయీ! నీవు పిల్లదానవు. నీకు తెలియదు. అయిదువేలరూపాయల నగలు పెడతారు. నీకు మొహరీల పేరుకూడా చేయిస్తారు. కావలసినన్ని సవారీలు గుఱ్ఱబ్బళ్ళు యెక్కి తిరగవచ్చును ఇంకా కావలసినన్ని లాభాలున్నాయి.

మాణి—నగ లెందు కేమిటినాకు. అంతా నవ్వుతారు. నాకొద్దీ పెళ్ళి.

భార్య—దిక్కుమాలినదానా. నీకు వెధవపెంకితనము మహాబలిసినది. చావకొట్టేస్తానుచూడు, వెధవముండా.

మాణి—అవును వెధవముండను చెయ్యాలనే నీయాలోచన. అందుకే యీ పెళ్ళి.

రామ—(భార్యతో) ఊరుకోవే పాడుముండా పిల్లను బెదరకొడతావేమిటి ముందుగా నువ్వావతలకుపో కాశ్శేపు.

భార్య—నాకెందుకు నేపోతాను. రెండు చరుపులేస్తే జేద్దేవరాయని చెప్పినట్లువింటుంది. అమ్మ పెట్టేవి రెండు పెడితేనేగాని దాని రోగం కుదరదు. పిల్లముండగదా. యేసంబంధము కుదురుస్తే దీనికెందుకు? పెద్దవాళ్ళ యిష్టమేదో అది చేస్తాము. ఈమాయచదువులొచ్చిన తరువాత పిల్లముండలంతా పెంకితనాలు బలిసి పాడైపోతున్నారు.

రామ—నీయమ్మకడుపుకాలా నీవవతలకెళ్ళవే.

భార్య—మీరు, అది గంగలోదిగండి. నేవెడతాను.

(అని వెళ్ళుచున్నది.)

రామ— అమ్మాయీ! నామాటవిను. శాస్త్రప్రాజ్ఞతవచ్చిన దానవు, పైగా చదువుకొన్నావు. తండ్రిమాటా తల్లిమాటా వినాలి కదా. మనము వెయ్యిజన్మాలుతల్లక్రిందుగా తపస్సుచేసినా వారిసంబంధం దొరకదు. వారితోవియ్యంపొందామంటేగొప్పన్నది. ఆయన యీసంబంధము చేసికొననంటూన్నారు. అనేకమంది తమ పిల్లలను తీసికొనివచ్చి ఆయనకాళ్ళమీద పడేస్తున్నారు. అయితే మాపిల్ల మిమ్మలిని పెండ్లిచేసుకొనుటకు కోరుచున్నదని నేనొక బూటకము చెప్పివచ్చినాను ఏలాగునైన మనసంబంధము చేసికోవాలని. అయితే పిల్లచేత ఆమాట నాయెదుట అనిపించండి. నేను చేసుకుంటాను అని నాగరాజుగారన్నారు. సరేఅల్లాగేచేస్తుందన్నాను. ఈసాయంకాలము వారు మనయింటికివస్తారు. వచ్చినప్పుడు మనశాఖవాళ్ళనే అందమైన వాళ్ళని పడుచువాళ్ళని యిద్దరిని ఆయనసరసున నుంచోపెడతాను. పెట్టి నీవెవ్వని పెండ్లిచేసుకుంటావని నిన్ను నేనడుగుతాను. అప్పుడు వేలుపెట్టి నాగరాజుగారిని చూపించాలి. నాగరాజుగా రెల్లాగుంటారో ఆనవాలెరుగుదువా?

మాణి—ఎరక్కేమి చప్పిదవడలు ముగ్గుబుట్టలా తలాఆయన యెవరెఱగరు?

రామ—అమ్మా! అల్లా యీసడింపుగా అనకుమరి. మాఅమ్మా, మాతల్లి. నామాటదక్కించు. తీరా మాటిచ్చివచ్చాను.

మాణి—సరే నీయిష్టం. నాకర్మంనాది. (అనిపోవును)

రామ—(భార్యనుపిలిచి) ఓసేవు అది నప్పుకుందే. నీ వెధవ మాటలుమూలంగా కాని లేకపోతే అది మొదటే వప్పుకొనును. ఇక లేచి దానికి కాస్త తలదువ్వు.

(అని యిద్దరు పోవుచున్నారు.)

—0—

ఏ డ వ ర ం గ ము

రామదాసుగారి యిల్లు

[అప్పుడు నాగరాజుగారు, భావరాజుగారు, చంద్రరావు, సూర్యారావు ప్రవేశించుచున్నారు.]

రామ—దయచెయ్యండయ్యా! మాగృహపావన మైనది (అని అందఱను కుర్చీలమీద కూర్చుండబెట్టును.)

నాగ—కొంచెం పనియున్నది. త్వరగా వెళ్లాలి.

భావ—రామదాసుగారూ! ఆపనేమిటో త్వరగా కానియ్యండి.

రామ—చిత్తము (అని లోనికివెళ్ళి కూతురుచెయ్యిపట్టుకొని) అమ్మాయీ! వారువచ్చారు నామాట దక్కించాలి తల్లీ. యెవరిని పెండ్లి చేసుకుంటానన్నప్పుడు వేలుపెట్టి నాగరాజుగారిని చూపించాలి. అక్కడ చంద్రరావు సూర్యారావు అని పడుచువాళ్ళిద్దరున్నారు. కొంపతవ్వి వాళ్ళను చూపించకుసుమా అమ్మా! (అని చావడిలోనికి తీసికొనివచ్చును.

భావ—(రహస్యముగా) అదిగోనండోయి పిల్లవచ్చుచున్నది. పెండ్లికొడుకుగారు జాగ్రత్తగా కూర్చుండండి.

[రామదాసుగారు, కూతురు ప్రవేశింతురు.]

రామ—అమ్మాయీ! నీవీ కూర్చున్నవారిలో నెవరిని పెండ్లి చేసికొంటావు వ్రేలితో జూపించూ? (అని ఆమెవ్రేలు సాగతీసి నాగరాజుగారివైపు తానే పెట్టుచున్నాడు.)

చంద్ర — (తనలో) వహవా! రామదాసుగారే పెండ్లికూతురై వరించుచున్నారు.

సూర్యా — (తనలో) ఇది చిత్రమైన నాటకము. ఇది బలాత్కార వివాహప్రహసనము.

నాగ — ఇదేమిటండోయి రామదాసుగారూ! ఆపిల్ల చెయ్యి మీరేపట్టి చూపిస్తూన్నారు? ఆపిల్ల కిష్టము లేదుగాబోలు!

రామ — సరిలెండి సిగ్గుగాదటండీ చిన్నపిల్లాయెను. పదిమంది లోనికివచ్చి చెప్పడమూ యెను.

భావ — అవునవునండీ. సిగ్గుచేత నేకాని మరొకటికాదు. ఇష్టము లేకపోతే చెయ్యి మరివకరికేసే తిప్పును.

నాగ — ఇది అపూర్వస్వయంవరము. తీసికొని వెళ్ళండిపిల్లను.

రామ — (పిల్లనులోపలికి పంపి) రేపు బుధవారము మంచి ముహూర్తమున్నది. ఆవేళ కానిచ్చెయ్యండి.

భావ — చాలా బాగానున్నది. అలా చెయ్యండి.

నాగ — అది నాకూ సతోషమే కాని బాజాభజంత్రీలు వల్ల కాదు. తోరణాలు కట్టగూడదు. పురోహితుఁడు తప్ప యితర బ్రాహ్మణులను లోపలకు రానియ్యగూడదు ఇంతకూ యీపెళ్ళి నేకోరినది కాదు. మీరు బలవంతపెట్టబట్టి నేచేసుకొంటున్నాను. ఇందులో నాదోష మేమీలేదు.

భావ — దోషం నేపంచుకుంటాను. సుఖంమీరనుభవించండి.

రామ — తమ యిష్టప్రకారము నేనుజరిగిస్తాను. ప్రయత్నము చేయించండి.

(అందఱు నిష్క్రమింతురు)

*

సీరాటరేవు

ఎనిమిదవ సంగము

(అప్పుడు నరసమ్మ, గవరమ్మ, శరభమ్మ ప్రవేశించుచున్నారు.)

నర—వోవిడా గవరమ్మోదినే! విన్నావా నాగరాజుగారు పెళ్ళాడారట?

గవ—పెళ్ళి ఎంతశోభగా వుండాలో అంతశోభగావుంది.

శర—ఆశోభేమిటి చెప్పు వింటాము.

నర—పెళ్ళికంటా ముందు పెళ్ళికూతురు, పెళ్ళికొడుకును యేరుకోడం వచ్చిందికాదుటమ్మా! లోకంలో చిత్రం. సీతామ్మవారు, సత్తిభామాలాగా నేటి కాలాని కీయమ్మాయి బయలుదేరినది యేరుకోడానికి. యింతకంట విడ్డూరం లోకంలో లేదు. అదెంత కలికాలప్పిల్లోగాని ముసలాడినేకాని పెళ్ళాడనని పట్టుపట్టినదటమ్మా!

గవ—పట్టూ లేదు. నా మొగం లేదు. తల్లి తండ్రి చావగొట్టి దానిచేత సరే అనిపించారు. వాళ్ళన్నమాటకి అది గంగిరెద్దులాగ తలాడించింది. ఆ పిల్లని తీసుకొచ్చి ఆ ముసలాయన యెదుటపెట్టి నీ వెవరిని పెళ్ళాడుతావో చూపించుమని దాన్ని అడిగారు. అడిగితే అది మొద్దులాగున ఊరుకున్నదికాని చూపించలేదు.

శర—మనసులో లేందే దానికెలా వస్తుందమ్మా పైకి మాత్రం. అదిజ్ఞాన మెఱిగిన పిల్లామెను.

గవ—అదెంతసేపటికి చూపించకపోతే తండ్రి దానివేళ్ళు పట్టుకులాగి తానే చూపించాడు.

నర—ఈపెళ్ళికొడుకు దాని మొగుడుకాడు. దానితండ్రి మొగుడు. ఎందుకంటే తండ్రే స్వయంగా యేరి చేసుకున్నాడుగనుక

గవ—ఆతరవాత కథవిను. పెళ్ళికొడుకు గుమ్మానికి పసుపు రాసి తోరణం కట్టనియ్యలేదు, బాజాలు వాయించనియ్యలేదు.

శర—తోరణంగట్టి బాజాలు వాయిస్తేమీ?

గవ—ఆయనకు మొదటిభార్య పోయిన విచారమట! అందుకు వల్ల కాదట!

శర—ముప్పయి యేళ్ళు కాపురముచేసిన పెళ్ళాము చచ్చి పోయిన తరువాత మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి విచారము లేదుకాని తోరణంకట్టి బాజాలువాయిస్తే విచారమా యీయనకు? ఎంత మాయవాడేఅమ్మా!

నర—నిక్షేపమంటి పన్నెండేండ్ల పిల్లని అరవయియేళ్ళ ముసలతొక్కుముండావాడు పెళ్లాడ్డం విచారము లేదుకాని తోరణం విచారము వచ్చినదీ యీయనకు? అదికాదె కారణం. లోభి ముండావాడు తోరణం చూచినా బాజాలువిన్నా పదిమంది వస్తారు సంభావన యివ్వవలసి వస్తుందని భయము.

శర—ఆయనకసలు పెళ్ళే యిష్టములేదుగాదు మరి.

గవ—ఊరుకుందూ. అదోవేషం ఇష్టంలేకపోతే పెళ్ళెందుకు చేసుకోవాలి, ముసలాడికి పెళ్ళేమిటని పదిమందీ నిందిస్తారని యిదో వేషం వేశాడు. బలవంతాన్ని పదిమంది జబ్బలుపట్టి కూర్చోపెట్టారా యేమిటి?

నర—పెళ్ళిసోద్దాలు వినండి. మధ్య మాటలు పెట్టకండి. కన్నెధారకు తీసుకువచ్చేటప్పుడు పెళ్ళికూతురు యేడుస్తూ వచ్చినదట. ఎందుకేడుస్తూందని యెవరో అడిగితే. వచ్చేటప్పుడు గడప కాలికి తగిలినది. అందుచేత యేడుస్తూందని తండ్రి చెప్పినాడట.

శర—శాబాసునే అమ్మా! వాడెంతకైన సాహసుడే వా డెక్కడితండ్రే అమ్మా మాయతండ్రి! దీనిపాలిటి యెములాడు.

నర—చుట్టా లెవరైనా వచ్చారా?

గవ—చుట్టాలూ లేరు. పక్కాలు లేరు. పెళ్ళికొడు కెవరిని పిలవకూడదన్నాడు.

నర—ఇదేమి పెళ్ళే అమ్మా. దొంగపెళ్ళి చాటుపెళ్ళిలా గుంది. ఇంతకంటె వెధవముండల పెళ్ళిళ్ళు బాగాజరిగాయి మన వూళ్ళోను. పెళ్లుమని రామడోళ్ళతోటి ఊరేగింపులతోటిసీ.

శర—ఇంతగంటూ ఆపెళ్ళి ళ్ళైనయము.

గవ—తరువాత యింకోచిత్రం విను. మొన్న ప్రొద్దున్న పెండ్లయిపోయింది కాదా. నిన్నపొద్దున్న పెండ్లికూతురు తల్లీ కూతురుకు పెట్టిన నగలన్నీ తాను వంటినిండా పెట్టుకొని కులుకుతూ పేరంటానికి పిలవడానికి బయలుదేరినది.

శర—దాని కెంతసిగ్గులేదే అమ్మా.

నర—ఇంతకూ ఆవిడ అదృష్టవంతురాలు. ఈనగ లెప్పటి కీవిడ మెడలోనే ఉంటాయి.

శర—ఈవేళ పాకెన్నా యేమిటి?

గవ—వారింట పాకెన్న మామూలు లేదట.

శర—వారింట ముసిలితనములో పడుచుపిల్లలను పెళ్ళాడ డమే మామూలుకాని తక్కిన మామూళ్ళేవి లేవుకామోసును!

గవ—ఇల్లాంటి అవక తనపెళ్లిచూస్తే ఊరందరికి లోకువ.

నర—అప్పుడే యింటిపెత్తనమంతా మామగారు వహించి యింట్లోవాళ్ళనితిట్టి లేచిపొమ్మంటూన్నాడట.

శర—నడిమంత్రపుసిరి నరంమీద్మాదపుండూ అన్నారు.

గవ—నాలుగేళ్ళు మనం బ్రతికున్నామంటె అన్నీ చిత్రాలు వింటాము. రండి వెడదాము. పొద్దెక్కినది.

శర—అవుతే ఊరేగింపుందిటో. అడగటం మరిచిపోయి నాను.

గవ—ఇక ఒకటె ఊరేగింపు. మధ్యమధ్య ఇన్ని ఊరేగింపులు లేవు పోదాంపద.

(అందరు నిష్క్రమింతురు)

—*—

స్వగౌరవరక్షణము

మొదటిరంగము

[ఆంజనేయులుగారు ప్రవేశించుచున్నారు]

ఆంజ—(తనలో) ఆత్మగౌరవము ప్రతివాడునిలుపుకోతగినది. ఆత్మగౌరవము కావాలి కావాలని ఉపన్యాసము లిచ్చేవారేకాని సమయమువచ్చినపుడు నిలుపుకొనేవారెవరు లేరు. నేనీరోజున తప్పకుండా నిలుపుకుంటాను. ఇంటిలో తిరిగేటప్పుడు గొప్పవాళ్ళంతా పాంకోళ్లు తొడుగుకుంటారుగదా యని నేనుకూడా పాంకోళ్లజత చేయించుకొన్నానుగదా? మునసబుగారు తహసిల్‌దారుగారు సిరస్తదారుగారు షికారు వెళ్ళేటప్పుడు ఎడమభుజముమీద చెన్నపట్టణపు రుమాలు, కుడిభుజముమీద కండువా వేసుకుంటారు గనుక నేనుకూడ చెన్నపట్టణపురుమాలు దుకాణముమీద అరువుతీసికొని వేసికొంటున్నానుగదా. డిప్టీకలక్టరుగారిలాగ చేతిలోనికి వెండిపొన్ను కఱ్ఱసంపాదించినానుగదా. దిక్కుమాలిన నాకు జీతము పదిరూపాయలైపోయినదిగాని తక్కిన అన్నివిషయములలోను డిప్టీకలక్టరుగారు తహసిల్‌దారుగారిలాగె యున్నాను. పెద్దాపురపు మిట్టపైజార్లు తొడుగుకొని చేతిలో పెట్టెడాకులు చెక్కలు పుచ్చుకొని భూమి అదిరేటట్టుటకటక

లాడుతూ నడిచివెళ్ళుచున్నానంటె కూరలమ్ముకొనేవాళ్ళు గొల్ల వాళ్ళు గడ్డికావిళ్లమ్ముకొనేవాళ్ళు హడిలిపోయి యీయనెవరో గొప్పవారనుకొని పక్కపక్కకి వత్తిగిలుతారుగదా. నేను డబ్బు కూరకొన్నను డబ్బుమల్లెపూవులు కొన్నను కూలివానిచేతే తెప్పి స్తానుగాని నేను ముట్టుకోనుగదా. ఆత్మగౌరవమంటె యీలాగె నిల బెట్టుకోవడం. గణపతిరావుగారి కూతురు వివాహము యీవేళకు నాలుగోరోజు. ఈవేళరాత్రి అందరిని భోజనమునకు పిలిచినారు. సుబ్రహ్మణ్యంపంతులుగారు భోజనానికి జోడుకాగడాలు వేయించు కొని వస్తారు. మహాదేవరావుగారు ఒంటికాగడా వేయించుకువస్తాడు. తక్కిన పెద్దమనుష్యులు చాలమంది లాంతరులు వేయించుకొని వెడ తారు. నేనుకూడా యీ వేళ లాంతరు వేయించుకొనే వెడతాను. ఈ విధంగా ఆత్మగౌరవము చూపించుకొనకపోతే మన మీద యెవరికీ గౌరవముండదు ఆత్మగౌరవముండాలని చెప్పేవారియొక్క అభిప్రాయమంతాగూడా యిటువంటిదే యైయుంటుంది. అయితే మాయింట్లోలాంతరు లేదు. లాంతరు యెరువడుగుతే బాగుంటుందా? ఛేస్సి యెరువడుగకూడదు. ఒకటి కొంటేనే మంచిది. ఈలాంటి పను లకు తరుచుగా అక్కరకువస్తుంది. చేతిలో డబ్బులేదు. ఏమి చెయ్యను ? నర్సయ్యమామగారిని బదులడుగుదాము పోనీ. ఇయ్యక పోడు. నర్సయ్యమామగారు !

నర్స—ఏమి ఆంజనేయులుమామగారు.

ఆంజ—నాకు జరుగురుగా ఒక్కరూపాయ బదులు కావలెను.

నర్స—ఏమి అంతజరుగు రేమివచ్చినది ?

ఆంజ—తరువాత మనవిచేస్తాను. ప్రాణావసరమువచ్చినది. వెనుక బదులుయిచ్చిన రెండురూపాయలు చాలాఆలస్యముగాయిచ్చి నానని మీరు మనసులో నుంచుకొనవద్దు. త్వరగా యిస్తాను.

నర్స — రేపు సాయంత్రములోపుగా యివ్వాలి. (రూపాయ యిచ్చును.)

ఆంజ — (పుచ్చుకొని) తప్పకుండా యిస్తాను. మనక్ ఒక యింట్లో కాపురమున్నందుకు మీరుమాత్రము సాం డప్పుడు చేస్తుండాలి.

నర్స సరే దానికేమి (అని వెళ్ళుచున్నాడు.)

ఆంజ — (తనలో) రూపాయ దొరకినదిగదా. పావలా బేడలాంతరుకొంటే నాదర్జాకి సరిపోదు. అందుచేత మూ లాలుపెట్టి పెద్దలాంతరు—అందులోకి ఒకకొవ్వొత్తి కొ తక్కిన మూడణాలు లాంతరువేసినవాని కూలికింద వినియో ఇప్పుడే దీపాలు పెట్టినారుగదా! ఇంకా లాంతరు దు లుంటాయి. ఇప్పుడేవెళ్ళి ఒకలాంతరు కొనుక్కొనివస్తాను. తెచ్చేటందుకు కూలివాడు దొరుకుతాడా? దొరకడు. చీకటిగదా. చంకలోపెట్టుకొని పైన బట్టకప్పుకొని నేనే కుంటాను. చీకటిచాటు గనుక యెవరికి తెలియదు.

(అని నిష్క్రమించు

—౯—

రెండవరంగము

[ఆంజనేయులు ప్రవేశించుచున్నాడు.]

ఆంజ — (తనలో) లాంతరు మంచిదే కుదిరినది. కొ కూడా కుదిరినది. ఇక చాకలివాడు కావలెను. మాచాకలివా యిన్నీసుపేటలో నున్నదిగదా. అది యిక్కడికి మైలుదూ నున్నది. ఇంటికి వెళ్ళినప్పటికి వాడక్కడ దొరకడు. వాడు లోనే యుంటాడు కాబట్టి చాకిరేవుకు వెళ్ళడమే వుచితము గైనా పదియంది పెద్దమనుష్యులతో పాటు లాంతరువేయి

భోజనానికి వెళ్ళి ఆత్మగౌరవమును నిలబెట్టుకొనడమే ప్రధానము, హుందాతనము. పామేదాతనము మనము తెచ్చుకుంటే వస్తాయిగాని లేకపోతేరావు. జీతంకొద్దయినా నేను ఆరిందాలలో జేగవలసినవాడను గనుక చాకలివానిని తెచ్చి తీరవలె. లాంతరు వేయించుకొని తీర వలె. చాకిరేవయినాఆట్టె దూరములేదు. గోదావరివడ్డునుంచి ఎట్టి రాళ్ళపక్కంమ్మట వెళ్ళితినా చాకిరేవునాలుగడుగులుప్రయాణము, అక్కడవాడు తప్పకుండా వుంటాడు. వుండకపోతే మరియొకచాకలి వాడినైనా విధిగా తీసుకురావచ్చును. ఇప్పుడేడుగంటలయినది. భోజ నాలు తొమ్మిదిగంటలకుకాని కావు. కాబట్టి చాకలివానిని తీసుకు రావలెను. ఆత్మగౌరవమా? మజాఖా!

(అని పోవును)

— ౬ —

మూ డ వ ర ం గ ము

ఇసుకతిప్పదరి చాకిరేవు.

[అప్పుడు ఆంజనేయులు ప్రవేశించును]

ఆంజ—(తనలో) మాచాకలా డెంత వెదకినా కనబడ లేదు. పోనీ మరొకడిని కుదుర్చుకుంటాను. (అని యొకచాకలిని చూచి)ఒరీ నీపే రెవరు?

చాక—నాపే రెంకకండీ. పే్రాస్సుగుని నన్ను గీనేమన్నా శేత్తా రేంటుండి ఏంతప్పు శేశానుండి రాస్కందుకు?

ఆంజ—ఓరే నిన్నేమైనా చేయడంకోసంగాదు నిన్నడిగినది. కొంచెము పనియున్నది. నీవు మాయింటికి రాగలవా?

చాక — ఏవుండి బాబూ మీాయింట్లో వొవరైనా పోయినా రేంటుండి.

ఆంజ — ఛీ ఛీ, దార్భాగ్యుడా పాడుపేలాపన పేల్తావు. నాకు లాంతరు వెయ్యాలి. నీవు వెయ్యగలవా ?

చాక — అయ్యబాబూ, తిడతారేంటుండి, యీలగానియీ లొస్తే వోవరైనా పోయినారనుకున్నాను. పోనీండి లాంతరు కావాలొస్తే లాంతరేత్తాను. నాపేరు పోతిగాడు.

ఆంజ — సరే! వేశినందు కేమిపుచ్చుకుంటావు, మొదటే బేరము ఫయిసలు చేసుకుంటే మంచిది.

చాక — లాంతరేశిగల్లి మిమ్మక్కడి దిగమెట్టమనేనాండి మీరొచ్చిందాక అక్కడ కూకో వాలాండీ ?

ఆంజ — అహః అక్కడ కూర్చోవలసిన దే యేమడుగుతావో అడుగు.

చాక — పావలా దైసేయుంచుండి.

ఆంజ — పావలా యేమిటి? ఈకాస్తపనికి పావలా? ఆఖరు మాట మూడణాలిస్తాను.

చాక — శిత్తం అల్లాగే యిప్పించుండి. ఇల్లిదిగో యీమూట యింట్లో మా రేశి మీ యెనకాలొత్తాను, మీరింటి కెల్లుండి, మీ యిల్లెక్కడుండి తమపే రెవరుండి?

ఆంజ — నాపేరు ఆంజనేయులు. మాయిల్లు మార్కండేయులు వీధిని. నీ వాలస్యము చేస్తే పనికిరాదు. ఇప్పుడు రమారమీ 8 గంటలు కావచ్చినది 9 గంటలకు భోజనాలవుతాయి. త్వరగా రా. అయినా మీ యిల్లెక్కడ?

చాక — రావోరికొట్లమూలుండి.

ఆంజ — సరే. నేయింటికి వెళ్ళుచున్నాను. త్వరగారా. మార్కండేయులు గుడిదగ్గరకు వచ్చి ఆంజనేయులుగారి యిల్లేదంటే చెపుతారు.

(ఇద్దఱు నిష్క్రమింతురు)

—*—

నాల్గవ రంగము

ఆంజనేయులుగారి యిల్లు

ఆంజ—(తనలో) ఈచాకలిముండాకొడు కింకావచ్చినాడు కాడు. రమారమీ తొమ్మిది కావచ్చినది. ఇదివరకప్పుడే రెండు మార్లు భోజనానికి రమ్మని పిలిచి వెళ్ళినారు. ఆలస్యమయిపోతుందని భయమేస్తూంది. భోజనమైనా మానివెయ్యాలి కాని లాంతరు లేకుండా వెళ్ళగూడదు.

[అంతట సోమన్నయను బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నాడు.]

సోమ—ఏమండోయి ఆంజనేయులుగారు! మనవాళ్ళందఱు వచ్చినారు. త్వరగా దయచెయ్యండి. వడ్డన లయిపోయినాయి. మీరు, రామచంద్రరావుగారూ తరువాయి.

ఆంజ—ఇదిగో మీవెనకాలే వస్తూన్నాను. పదండి.

సోమ—చిత్తము (అని వెళ్ళును.)

ఆంజ—(తనలో) చాకలివెధవ యింకావచ్చినాడుకాడు. వాడికోస మెవ్వరైనా పంపుదామంటే యింట్లో మనిషిలేడు. పోనీ రావువారి కొట్లకేసి నేనే యొకసారి వెళ్ళివస్తాను. నడవగల మగ వానికి నాలుగడుగుల ప్రయాణం.

(అని వెళ్ళును.)

—*—

ఐదవ రంగము

చాకలివీధి.

ఆంజ—పోతిగాడి యిల్లెక్కడ?

స్వామి—వోవరారు. ఆంజనేయునుగారా యేంటి

ఆంజ.—ఎవరువాడు స్వామిగాడా యేమిటి? నేనేరా.

స్వామి—ఏముండి బాబూ యిల్లాగొచ్చారు?

ఆంజ—కొంచెము పనుండివచ్చాను. లాంతరువేయాలినాకు. నీవువస్తావాపోనీ.

స్వామి—ఒత్తాపదుండి. పొద్దోద్దా యేంటుండి.

ఆంజ—ప్రొద్దుపోదు త్వరగారా మాయింటిచాకలివి నీవేదొరకినావుగనుక చాలాసంతోషముగానున్నది.

(అని వెళ్ళుచున్నాడు.)

ఆరవరంగము

ఆంజనేయులుగారి యిల్లు

పోతి—ఆంజనేయులుగారూ! (అని కేకవేయును) (ఆంజనేయులు స్వామిగాడూ ప్రవేశించుచున్నారు)

ఆంజ ఇంత ప్రొద్దుపోయివస్తే యెవరికికావాలి నీకోసము కనిపెట్టుకుని కూర్చుండి ప్రాణము విసికి యింటిచాకలి తీసుకువచ్చి నాను.

పోతి—ఏమన్న పెద్దమడిశివయ్యానువ్వా? నన్ను రమ్మని శెప్పి యింకోణ్ణి పిలుత్తావా? పావళా అక్కడమెట్టి కదులు.

ఆంజ—ఛీ త్రాగుబోతు వెధవా! నోరుముయ్యి.

పోతి—మాటలు మిగుల కాట్టేను. అంటేనుల్లీ అంటాను. రమ్మనడం యెల్లమనడం నీయిట్టమే. (అని ఆదారినివెళ్ళునట్టియిద్దరిని పిలిచి) అయ్యా సూడం డీపెద్దమణిశి, సాకిరేవులో కొచ్చి లాంతరెయ్యాలని నన్ను పిల్చుకొచ్చి యిప్పు డెల్లమంటాడు.

ఆంజ – వాడిమాటలు మీరు నమ్మకండి (అని లోపలికి వెళ్ళి మూడణాలు తెచ్చి వాడికిచ్చి) అట్టే అల్లరిచెయ్యక అవతలకు లేచిపో పెద్దా పిన్నా యెరుగవు తుంటరి వెధవా.

పోలి — నొవ్వేరుగుదువటయ్యా మశేదా ?

(అని పోవుచున్నాడు)

ఆంజ—స్వామిగా యీలాంతరు వెలిగించు.

స్వామి —(లాంతరు వెలిగించును.)

(ఆంజనేయులు లోపలికి వెళ్ళి స్నానముచేసి పట్టుపంచలు కట్టుకొని పావుగంటలో వచ్చును.)

ఆంజ — స్వామిగా లాంతరుచ్చుకొని ముందు నడూ.

స్వామి — చిత్త (మని నడచుచున్నాడు.)

ఆంజ—(కొంతదూరము వెళ్లిన తరువాత) స్వామిగా, అక్కడాగు. ఆ చప్పుడేమిటి ? భోజనాలయి చేతులు కడుగుకుంటూన్న చప్పుడా ఏమిటది.

స్వామి— కామోసుండి. సూశిరానా యేటుండి.

ఆంజ— చూచిరా త్వరగా.

స్వామి—(వెళ్లి చూచివచ్చి) బాబయ్యా! భోజనాలై పోయినా యండి. శెంబులుచ్చుకు కొందరలా గెల్లిపోతూన్నారు. కొందరిల్లా గొత్తూన్నారు. కొందరు తాంబోళాలు నములుతున్నారు.

ఆంజ — ఓరేయి చప్పుచప్పున యింటికి వెళ్ళిదాము రా. భోజనాలు అయిపోయినాక అక్కడికి వెళ్ళడము గౌరవముకాదు.

(అని యిద్దరు యింటికివచ్చుచున్నారు.)

భార్య—అల్లా దూరంగా వెళ్ళండి.

ఆంజ — ఏమి వెలప లున్నావా యేమిటి ?

భార్య—అవును! నే నింట్లోకి రాగూడదు. మీరు భోజనము చేయకుండా వచ్చినారేమి ?

ఆంజ—ఇల్లాటి పరువు తక్కువ వాళ్లింటికి వెళ్ళడము నాదె బుద్ధితక్కువ. ఇక జన్మజన్మానికి వీళ్ళగుమ్మము త్రొక్కిచూడను. నన్ను భోజనానికిపిలిచి నేను వచ్చినదాకా కనిపెట్టుకుండక ముందు భోజనాలు చేశినారు.

భార్య—అయ్యో ఇప్పుడు మనయింట్లో వంటచెయ్యడాని కైనా వీలు లేదే. భోజనానికి వెడతారని వంట చెయ్యలేదు. మధ్యాహ్న పన్నముంటే నే తిన్నాను. పోనీ సోలెడు బియ్యము అత్తెసరేసుకుంటారా ?

ఆంజ — ఆ పాట్లు నేపడలేను. కడుపులో కాళ్ళెట్టుకుని చల్లగా పరుంటాను ఆత్మగౌరవము కలవాళ్ళకి రోజులు కావివి.

భార్య—ఏమిరోజులో పెళ్లివారిల్లు మనయింటికి పట్టుమని పదిబారలు లేదు. ఇక్కడకు లాంతరు కావాలన చాకిరేవులోకివెళ్ళి చాకలిపేటలోకివెళ్ళి వచ్చేటప్పటికి పుణ్యకాలముకాస్తా వెళ్లిపోయి నది. ఎవరైనా వింటే తలవంపులు ఇద్దరు చాకలాళ్ళకి కూలిదండుగ, ఈరాత్రి యుపవాసము, ఇన్నివచ్చాయి. ఏమయినా అంటే మీరు కోపపడతారు.

ఆంజ—ఛీ నోరుముయ్యి. పశువా బోడిముండ! పేడచేసు కునే ముండకి నీకు ఆత్మ గౌరవమేమి తెలుస్తుంది. ఇల్లాంటి అవక తవక పేలాపన పేలకు చెప్పుదెబ్బలు తినేవు.

భార్య—నాకెందుకు! బుద్ధితక్కువ వచ్చి అన్నాను. ఆత్మ గౌరవపు లాభము మీరే అనుభవిస్తూన్నారుకదా ?

ఆంజ – స్వామిగా నీవు పొద్దున్నేరా నీ డబ్బు లిస్తాను.

స్వామి—చిత్తము.

(అని అందరు నిష్క్రమించుచున్నారు.)

—*—

దివాలదేవి వ్రతకల్పము

బ్రహ్మలోకమునకు నారదుడు వెళ్ళి బ్రహ్మకు నమస్కారము చేసి యిట్లనియె–''మహాత్మా, బ్రహ్మదేవుఁడా! భూలోకమునందు మనుష్యు లనేకులు ధనములేక యిబ్బంది పడుచున్నారు. కొందఱు ధనము చాల సంపాదించి యైశ్వర్యములతో దులతూగు చున్నారు. ధనములేని యా పేదవారంతఱు విస్తారము కష్టపడకుండా ధనవంతు లగుటకు ఏదైన యుపాయము మున్నదేమో, ఆనతియ్యవలయును. ఆ యుపాయము మీరు సెలవిచ్చిన పక్షమున నేను సకల లోకములు సంచరించు చుందును గనుక మీరు చెప్పిన యుపాయము నా మను ష్యులకు బ్రకటించి వారందరు సుఖపడునట్లు చేసెదను'' ఆ మాటలు విని బ్రహ్మదేవుడు మిక్కిలి సంతోషించినవాడై నారద మహా మునితో నిట్లనియె–

''ఓయి నారదా! నీవడిగిన ప్రశ్నము మిక్కిలి మంచిది. దానికి తగిన యుపాయ మొక్కటి యున్నది. ఆయుపాయము భూ లోకములో ప్రతి మనుష్యునకును నీవు చెప్పగూడదు. ఎవ్వరు దానికి తగుదురో వారికే ఆ యుపాయము చెప్పవలయును. ఇది పరమ రహస్యము. అతిగోప్యము. మితముగా ధనము వాడుకొనువారికి గౌరవము కొరకు దేవులాడువారికి, జాలిగలవారికి ఈ రహస్యమును నీవు తప్పి జారియైన నెఱిగింపగూడదు. ఈ నిబంధనలకు నీ వొప్పు కొందువేని, ఆ విషయము నీకు సంపూర్తిగా నెఱింగించెదను.''

నారదుడు చెప్పుచున్నాడు.—

మహాత్మా మీరు సెలవిచ్చినట్లుగానే దానిని పరమగోప్యము గానే యుంచెదను. కాబట్టి నాకు దానిని తక్షణ మెఱిగింపవలయునని కోరు చున్నాను. అది వినుటకు నా మనసు మిక్కిలి తత్తరపడు చున్న యది.

బ్రహ్మ చెప్పుచున్నాడు.

అట్లైన యో నారదా శ్రద్ధగా వినుము. దివాలదేవి వ్రతమను పేర నొక వ్రతము కలదు. ఇది గొప్ప వ్రతము. ఈ వ్రతమును శ్రద్ధాభక్తులతో ఆచరించి ఆ దేవిని నిష్ఠతో గొలిచిన వారి యింట లక్ష్మీదేవి ప్రత్యక్షమై థింథిమ్మని తాండవమాడు చుండును.

నారదుడు పల్కుచున్నాడు—

దేవా! ఈ వ్రతము అపూర్వమైనదని తోచుచున్నది. ఇది వరకు కన్నది విన్నది గాదు. ఇది యే పురాణములోనిది ? ఈ దివాలదేవి యెక్కడ నుండును ? ఆమె నే మాసమం దేతిథినాడు ఏ వారమునా డారాధింపవలయును ? ఏ విధముగా పూజింపవలెను. ఈమెకు నైవేద్య మేమి పెట్టవలెను ? పూజసేయునట్టి వారు యెటువంటి నిష్ఠ గలిగి యుండవలెను ? ఈ వ్రతము మిక్కిలి లోకోపకారమైనది. కాబట్టి దీనిని మీరుసమగ్రముగా నాకెఱిగింపవలయును.

బ్రహ్మదేవుడు పలుకుచున్నాడు—

నారదా ! నీవన్నట్లిది యపూర్వ వ్రతమే. మునుపెన్నడు విన్నది కన్నదికాదు. దీని విధానమంతయు మిక్కిలి స్వల్పము. తక్కిన వ్రతములవలె దీనికి మడి స్నానము మొదలయినవి విశేషముగా అక్కర లేదు. ఈ వ్రతము నే జాతివాడైన నాచరింపవచ్చును. దీనికి విఘ్నేశ్వరపూజ పుణ్యాహవాచనము మొదలయిన మంత్రములతో ప్రసక్తి లేదు. సంకల్పము మాత్రమున్నది. కాని బ్రాహ్మణులువచ్చి ఆ సంకల్పము చేయింపనక్కర లేదు. ఎవడిమట్టుకు వాడే ఆ సంకల్పము చేసి కొనవచ్చును. ఈ వ్రత మాచరించువాడు దానిని పరమ రహస్యముగా ఆచరింప వలయునుగాని రెండవ వానికి చెప్పగూడదు. ఈ వ్రతము

కలిపురాణములో జెప్పబడియున్నది. దివాలదేవియను దేవత కలి పురుషుని మూడవకూతురు. కలిపురుషుడు కక్కుర్తి అను మహాదేవిని పెండ్లియాడగా వారిద్దరికిని యీ దివాలదేవి జన్మించినది. ఈ దివాల దేవి కిద్దరు తమ్ము లున్నారు 1 లోభుడు 2 ద్రోహుడు దివాలదేవి యెక్కడనుండునో వీరిద్దరును అక్కడ ప్రత్యక్షమై యుందురు. దివాల దేవి ఆశ్రితులయందు మిక్కిల వాత్సల్యముగల దేవత. ఈ దేవతను మనస్సులోనే నిల్పుకొని ప్రార్థింప వలసినదే కాని విగ్రహములు చేసి పూజింప నక్కర లేదు. ఈమెను కొలుచు చున్నట్లు రెండవ మనుష్యుడు తన కెంత యాప్తుడైనను సరే తెలుపకూడదు. వెయ్యేల! దేవి ప్రసన్నము చిట్టచివర అగువరకు తన భార్యతోగాని, కొడుకుతోగాని, అన్నదమ్ములతోగాని చెప్పగూడదు. కలలోనైన నోరు జారకూడదు. అట్లు నోరు జారి తెలియ జేసిన యెడల దివాలదేవి ఫలమియ్యదు. సరేగదా, మీదు మిక్కిలి నత్తిఅణచును. దీని విధానము సంగ్రహముగా జెప్పు చున్నానువినుము——

ఈ దేవి నారాధించి భాగ్యవంతుడు కాదలచినవాడుకష్టపడ గూడదు. ఒకరి దగ్గర నౌకరీ చేయగూడదు. శరీరము నొచ్చునట్టి కూలిపని మొదలగునవి చేయగూడదు. వేషము ఎక్కువగా వేయ వలెను వేషముడాబు ఎంతయెక్కువగానుంటే ఆ దేవతకంతయిష్టము మొట్టమొదట యేదో వ్యాపారముగాని వర్తకముగాని పెట్టవలెను. అందు నిమిత్తమై తెచ్చినట్లు అప్పులువిశేషముగా తెచ్చుచుండ వలెను లోకులు అందరు యిచ్చేవడ్డీకంటె యెక్కువ వడ్డీ యిచ్చు చుండ వలెను ఎఱను చేపలు పడినట్లు వడ్డీ యెక్కువ అనగానే, అది వరకు భూమిలో డబ్బుపాతి పెట్టుకొన్నవాళ్ళు పాటులు పెల్లగించి అతనికే బదులిత్తురు. ఆవరకు తక్కువడ్డీల కిచ్చుకొన్నవాళ్ళు ఆ

సొమ్ము తీసుకొని యాయనకేయిత్తురు, వితంతువులు తమతాలూకు నగలమ్ముకొని యాయనకే సమర్పింతురు.

ఈప్రకారముగాధనమందరిదగ్గర బదులుపుచ్చుకొనుచుప నెల వడ్డీ ఆనెల ముప్పదియవ రోజుకే వెండిపళ్ళెములో బెట్టి బదులిచ్చిన వారి యిండ్లకు కొంతకాలమువరకు పంపుచుండవలెను. నమ్మకము కుదిరిన తరువాతవడ్డీసరిగా యివ్వనక్కర లేదు. ఈలోపుగా భూములు యిండ్లుకొని భార్యపేరనో అత్తమామల పేరనో వ్రాయించవలెను. గుల్లవస్తువులు కాకుండా బంగారపు కడ్డీనగలు భార్యకు బిడ్డలకు విశేషముగా చేయించవలెను. ఈలాగున వస్తువులు విశేషముగా భార్యకు బిడ్డలకు చేయించినయెడల దేవికి కనులపండువుగానుండును. అట్టి వారిమీద దేవికి అనుగ్రహము హెచ్చు, కొట్టులో సరకు తక్కువ యుండవలెను. ఋణ ప్రదాత లిచ్చిన సొమ్మంతయు నగల రూపకముగాగాని కాసులరూపకముగాగాని యింట్లోనెయుండవలెను. అప్పు తక్కువగా నున్నపుడొక గుఱ్ఱపుబండి, అప్పు లెక్కువైనప్పుడు జోడు గుఱ్ఱాల బండి యుండవలెను. వ్యాపారము క్షీణించిన కొలది గుమస్తాలు డాబు హెచ్చుగా నుండవలెను. చాటుగా దాచిన రూపాయలు, నగలు యీ దేవికి రోజూ నైవేద్యము పెట్టవలెను. దానములు ధర్మములు యెక్కువగా చేయచుండవలెను. దేవాలయములలోకి తరుచుగా వెళ్ళి కైంకర్యము లెక్కువగా చేయవలెను. మాటలు తేనె తేటలుగా నుండవలెను. శాంతము వినయము నెక్కువ చూపవలెను. తాను సత్యసంధుడులాగున కనబడుటకై అదివరకప్పు లెగబెట్టిన వాళ్ళను గట్టిగా తిట్టుచుండవలెను. ఇట్లుండగా యీతని పని క్షీణించు చున్నదని వాడుకపుట్టును. పుట్టగానే అప్పులవాళ్ళు వచ్చి యిల్లుచుట్టవేయుదురు. వేయగానే దివాలా దేవత వచ్చి యీయన నావహించును. ఆవహించి యీయనచేత ముద్దినుసు

ఋషులు పలికించును, అప్పులవాండ్రను గౌరవింపక రెండు కాళ్ళు ాపుకొని యీయన కూర్చుండవలయును. ఆ దేవిని చూడగానే ప్పులవాళ్ళు భయపడి గొల్లుమందురు. అప్పుడు జంకక వెనుదీయక ఋగమాటపడక సిగ్గుపడక ''నాయనా దైవ వశముచేత యీలాగు చ్చినది. కొట్లోసరకులు మీ స్వాధీనము చేసికొని పంచుకోండి'' ని చెప్పి సరకులు చూపవలెను. అందుకు వారు వప్పుకోనిపక్షమున మధ్యాహ్నమే కోర్టుకు వెళ్లి యిన్సాల్వెన్సీ పిటీషను దాఖలుచేయ లెను. ఇది దివాలాదేవి మహాత్మ్యము ఇది రామబాణమువలె మోఘమైనది. ఇందుకు సిగ్గు బిడియములు ముందుగానే విడిచివేయ లెను. దొంగ యేడ్పులు యేడ్వవలయును. ఇట్టివి చేతగాని వాని ంట దివాలాదేవి అడుగుపెట్టదు. ఈ వ్రతము లోకములో రహ స్యముగా నుపదేశము చేయుము.

నారదుడు పలుకుచున్నాడు— –

మహానుభావా యీవ్రతము అన్నివ్రతములలో నుత్తమ మైనది. ఈలాగ ప్రత్యక్ష ఫల మిచ్చే వ్రతము మరియొకటిలేదు. నిని తప్పక యుపదేశించెదను,

—*—

చమత్కార సంభాషణ

సోమరాజు కామరాజుగారు మీవయసిప్పు డెంతండీ?

కాము—ముప్పదియైదు సంవత్సరములండి.

సోము—అయిదు సంవత్సరములక్రిందట మీరు మా యింటికి వచ్చినపుడు మీవయస్సు యెంత అని నేను మిమ్ములను అడిగినాను.

కామ — అడిగితే అప్పుడెంతని చెప్పినాను!

సోమ—అప్పుడుకూడా ముప్పది అయిదు సంవత్సరములే యని సెలవిచ్చినారు. అప్పుడు యిప్పుడుకూడ ముప్పదియైదు సంవత్సరము లెట్లుండును. ఆమాటైనా అబద్ధం కావాలి. యీమాటైనా అబద్ధం కావాలి.

కామ—ఏమాటా అబద్ధం కాదు.

సోమ—మీ మాటలు మిక్కిలి చిత్రంగా ఉన్నాయి.

కామ—నేను అందరిలాగు అప్పుడొకమాట యిప్పుడొక మాట చెప్పేవాడినికాను. ఎప్పుడూకూడా ఒకమాటమీదేయుండే వాడిని. గనుక ఆలాగుననే చెప్పుచున్నాను.

సోమ—(నవ్వి) మీసత్యనిత్యత చాలా పసందుగానున్నది మీకు కలియుగ హరిశ్చంద్రులని బిరుదిచ్చిన చాలాబాగుండును.

కామ—బిరుదు లిచ్చేవారు లేరుగాని యిచ్చినపక్షమున నాకంటె తగినవాడెవ్వడు ?

సోమ—అయితే మీరిప్పుడీగ్రామ మెందుకు వచ్చినారు ?

కామ—కోర్టులో సాక్ష్యమునకు వచ్చినాను.

సోమ— మీ గ్రామమునుండి వచ్చే ప్రతివ్యాజ్యముకోను మీరే సాక్షిగా వస్తారెందుచేతను ?

కామ—మాగ్రామములోకల్లా నేనొక్కడనే గరాణమనిపిని. అబద్ధమాడకుండా సత్యముపలికేవాడినికూడ నేనొక్కడనే. అందుచేత నాయందు గౌరవముగలిగి గ్రామములోనున్నవాళ్ళందరూ, ప్రతి వ్యవహారములోకి నన్నే తీసుకువెడతారు. ఆకారణంచేత నాకు ప్రతి వ్యవహారములో సాక్ష్యమువస్తుంది.

సోమ—అంతేనా! మీరుడబ్బుపుచ్చుకొని యెరిగినవ్యాజ్యము లోను యెరుగని వాజ్యములోను కూడా కూటసాక్ష్యమునకు వస్తారని ప్రజలు చెప్పుకుంటున్నారే.

కామ—అది కేవలం కిట్టనివాళ్లు వేసిన వాడుక కాని నిజం కాదు.

సోమ—మీసాక్ష్యము నమ్మగూడదని వెనుకటి మునసబు గారు గట్టిగా వ్రాసినారట.

కామ—నాసాక్ష్యమన్న మాకేమిటి! బోనులో కెక్కినవా ళ్ళందరికి యీపాట్లున్న వే. రెండుపక్షములసాక్ష్యము నమ్మరుగదా? ఏదోయొక్క పక్షమునమ్మి రెండవపక్షము అబద్ధమనకతప్పదు. అంతేకాని మాసాక్ష్య మెప్పుడునిజమే.

సోమ—సరేదానికేమిగాని కామరాజుగారూ మీరు కాశీ వెళ్ళినారు కాదా?

కామ—కాశీమాకుటుంబమంతా కలసి వెళ్ళినాము.

సోమ—కాశీ వెళ్ళినవారు మిక్కిలి ప్రియమైనవస్తువులేవైనా రెండువదిలిపెట్టి రావలెనట. మీ రేవస్తువులు వదలిపెట్టినారు?

కామ—అబద్ధమాడకుండా నిజం చెప్పమన్నారా?

సోమ—అయ్యో! తప్పక నిజమే చెప్పవలెను, అబద్ధమాడ మన్నా మీ రాడరు కాదూ.

కామ—చెబుతావినండి. నేను కాశీలో సిగ్గుబిడియములు రెండు వదలివేసినాను.

సోమ—మీ పెద్దన్న గారు ఏమి వదలి వేసినారు?

కామ—మా పెద్దన్న గారు దయాదాక్షిణ్యాలు వదలివేసినారు.

సోమ—మీ చిన్నన్న గారో.

కామ—ఆయన పరువుమరియాదలు వదలివేసినారు.

సోమ—మీ పెద్దతమ్ముడేమి వదలి వేసినాడు?

కామ—వాడు మానాభిమానములు వదిలివేసినాడు.

సోమ—మీచిన్నతమ్ముడు?

కామ—మాచిన్న తమ్ముడు కాశీలో పెళ్ళాముబిడ్డలను వదిలి వేసినాడు?

సోమ—మీతండ్రిగారేమి వదలివేసినారు?

కామ—మాతండ్రిగారు ప్రాణాలే వదిలివేసినారు.

సోమ మీతోకూడా కాశీ యింకెవరో వచ్చినారట. వారేమి వదిలివేసినారు.

కామ—ఆవచ్చిన వారిలో ఒకావిడ మగనిని వదిలివేసినది.

సోమ—బాగున్నదండి! కాశీమహాక్షేత్రము వెళ్ళి మిక్కిలి ప్రియమైనవస్తువులు మీలాగున వదిలివేసినవారెవ్వరు లేరు. మీ చరిత్ర అద్భుతము. మీయన్నదమ్ములైదుగురిని చూడగా పంచ మహాపాతకములు మగరూపము ధరించినట్టు కనబడుచున్నవి.

కామ—ఏమోయిదంతా మీదయ. మేము నిజముచెప్పబట్టి యూరికే మాపేరు వెల్లడగుచున్నదన్నమాటకాని నూటికి తొంబది తొమ్మండుగురు మావంటివాళ్ళే అయినా అబద్ధమాడనివాళ్ళు లోకంలోలేరు. ఇప్పుడు మీచేత అబద్ధమాడిస్తాను చూడండి.

సోమ—ఏదీ యేలాగు ఆడిస్తావో చూతాము.

కామ—నాతో గూడరండి. ఇక్కడికి రాఘవపుర మెంత దూర మున్నది.

సోమ ఇక్కడికి క్రోశెడున్నది.

కామ—సరే! (అని మరియొకవీధివెళ్లి) ఇక్కడికి రాఘవ పుర మెంతదూరమున్నది?

సోమ—క్రోశెడున్నది.

కామ—అదిగో మీరబద్ధ మాడుచున్నారు. ఇందాక క్రోశె డున్నదన్నారు. అక్కడినుంచియిక్కడికి రెండువందల గజములునడిచి

వచ్చినాము. ఇక్కడికి కోశెడున్నదా ? కొంతదూరము తగ్గలేదా? ఈస్వల్పవిషయములో మీరెందు కబద్ధమాడుచున్నారు ?

సోమ—మీసత్యసంధత్వము బాగున్నది. ఇది లోకములో కనివిని యెఱుంగని సత్యసంధత.

కామ—స్వల్పవిషయమైనా అబద్ధమే కాబట్టి మీరు మేము అంతా ఒకటే.

రామ—మీయోగ్యత చాలామంచిదిగాని నడవండిపోదాము.

—౯—

గోసాయిచిట్కాలు

నాపేరు కోతలకొనయ్య. కోతలనుటచేత బడాయిమాటలు చెప్పువాడనని మీరనుకొనువద్దు. మా పూర్వులు పూర్వము, అనేక సంస్థానములలో సేనాపతులై మహాపౌరుషవంతులై శౌర్యరాసులై ధైర్యపు, పాతరలై రోషపుగాదెలై యుత్సాహపుగోతులై శత్రువులను యుద్ధరంగములలో పట్టిగొంతులు కోయుటచేత మాయింటి పేరు కోతలవారని పౌరుషముచేత గలిగినదని కొందరు పెద్దలు చెప్పుచున్నారు. ఇదిగాక! మరియొక కారణముగూడ కలదు. మాపూర్వులలో నొకరు యజ్ఞములు చక్కగా చేయించుట నేర్చికొని ప్రతి దినము అనేక యజ్ఞపశువుల గోయుటచేత కోతలవారని మాకు యింటిపేరు కలిగినట్లు మరికొందరు పెద్దలు చెప్పుచున్నారు. ఎట్లైన నేమి కోతలవారన్నది మాకు పౌరుషనామమే. నాకు చిన్ననాట నుండియు వైద్యమునం దభిమానము గలదు కావున నేననేకమంది గోసాయిల నాశ్రయించి బహువిధములైన చిట్కాల నేర్చికొంటిని. కడచిన ఆదివారమునాడుపట్టి సూర్యగ్రహణగాలమందుమహానుభావు

పైడైన యొక గోసాయి నాకు మార్కండేయక్షేత్రమున ప్రత్య
క్షమయ్యెను. ఆయన నాకంటికేగాని మరియొకరికి కనబడలేదు. ఆయ
యెంతసేపు మాటలాడినను నాకొక్కనికేగాని యితరులకు విన
లేదు. ఆయన ఆదినమందే యిక్కడను కోటిపల్లిలోను కాశీలో
కనబడెను. ఆయనకు ఎనిమిదివందల సంవత్సరములు వయసు
ఆయన గోళ్ళు యినుపగునుపములంత పొడుగుగా నున్నవి. ఆయ
గడ్డము జడలు జనపనారవలె తెల్లనై పాదములను సీలమండల
తాకుచున్నవి. శరీరము పదియారవవన్నె బంగారుచాయగానున్న
కన్నులకు చత్వారము లేదు. చెవులకు చెవుడు లేదు. సండ్లప
త్వము తప్పలేదు, నడిచినాడంటే పదామడైనా అలసటపడకుం
నడుస్తాడు. తిన్నాడంటే ఒక్కమాటునాలుగుశేర్ల బియ్యపన్న
లకోటాకుమెతుకు లేకుండా కొట్టివేస్తాడు. ఆయన యీ కాల
మనుష్యుల నెవ్వరిని యెఱుంగడు. రాజరాజనరేంద్రుని కాలము
నున్నట్లు చెప్పినాడు. సారంగధరుని నన్నయ్యభట్టును పావులూ
మల్లన్నను బాగుగా నెఱుంగుదునని చెప్పి వారివా రెవరై
యున్నారా యని అడిగినాడు. ఈనడుమ పావులూరి మల్ల
కాలమును గురించే సందియపడి తగవులాడుచున్నారు. అట్టి సంది
ములు కలవారీయన దర్శనముచేసి పావులూరి మల్లన్నసం
అడిగిన బాగుండును. చిత్రాంగి పెళ్ళినాటికీయనకుయిరువదిమూ
సంవత్సరముల ఆరుమాసముల వయస్సట. సారంగధరునితండ్రి, కా
చేతులు నరికించినప్పుడు మళ్ళీ మొలచుటకై మీననాథమహాప
వ్రాసిన పసరులు, వేళ్ళు యీయనస్వయముగ నెఱిఁగియుండుట
వైద్యశాస్త్రములో నీయన కపారపాండిత్యము గలదు. చచ్చిపో
వారి నీయన బ్రతికించగలఁడు. బూడిదయైనతరువాతమాత్ర మీయ
బ్రతికించలేడు. బూడిద వేడిగానున్న పక్షమున కొందరిని బ్రతికిం

గలడు. ఈయన మీననాథమహామునికి సాక్షాత్తు శిష్యుడు. రాజ సరేంద్రుడుగారి యింట్లోను దగ్గరొంప పట్టినప్పు డీయన వైద్యము చేయుచుండెడివాడు. ఈయన ప్రజ్ఞలు ఈక్రింద చిట్కాలవల్లనే సంపూర్ణముగ తెలియగలవు. ఈచిట్కాలు పరమరహస్యము లయినవి గనుక, ఉపదేశముపొందనివా రెవ్వరికి జెప్పగూడదు. చెప్పిన పక్షమున మహాపాతకము పొందుదురు.

చి ట్కా లు

1 చిడుముకు చిట్కా--చిడుమురోగమునకు యిటువంటి ఔషధము లోకములో లేదు. పూర్వము భేతాళునకు శరీరమునందు జిల పుట్టినప్పుడు ధన్వంతరి యీచిట్కానే ప్రయోగించెను. ధన్వంతరి చరకునకును. చరకుడు శుశ్రుతునకును, శుశ్రుతుడు వాగ్భటునకును అతడు మాయోగికిని క్రమముగా నుపదేశించిన చిట్కా యిదియే. ఈజిలకు నాలుగు దివ్యౌషధములు గలవు. మొదటిది పొడుగైదిట్టమై మంచి వాడిగలిగి సూరకత్తివంటిగోరు. దాని కనుపానము సలసల్లా రెడు వేడినీరు. ఈరెండు మిక్కిలి మైత్రిగలవి. ఏది లేకపోయినను కుదురదు.

దీనికిపత్యము—సిగ్గువిడుచుట, సభలోనైన సందేహింపక గోకుట దీననుపశాంతికాని పక్షమున అనగా అదితామరకింద తేలిన పక్షమున చక్కని యినుపకోరముగాని, గరిగమ్మకాని, చౌరచేప తోకగాని, యివి దొరకనప్పుడు హంసపాదు కాగితముతో తశ్శాంతి చేసికొనవచ్చును. అదియు దొరకనప్పుడు పెద్దతాటి నాశ్రయింప వలెను. గచ్చుగోడలు బొత్తిగా పనికిరావు. ఈచిట్కా కొంతకాలమువరకు ప్రయోగించి చిడుముగలవారది యెంతవరకు పనిజేసినదో మాకు సమగ్రముగా తెలియజేసిన యెడల వారికి తక్కిన చిట్కాలన్నియు కరతలామలకముగ నుపదేశించి మహోపకారము చేయు

దుము. కాన కవరులో మాత్రము ఒక అణాబిళ్ళపెట్టి పంపించవలెను. అణాబిళ్ళలు పెట్టనియుత్తరములు మంజూరి చేయబడవు ఇట్లనుటచేత అణాబిళ్ళలకై మేము వ్రాసితిమనుకొనవద్దు.

ఇట్లు,

కోతల కోనయ్య.

మొలగజ్జి మూలయ్యగారి పై విలాసము చిత్తగించి కోతల జలగయ్యగారి కుమారుడు కోనయ్యగారికి యిప్పించవలెను.

మురదలూరుపోష్టు, గోకవరం

కడచినవారమున మాగోసాయిచిట్కాలలో ఒకటియైన చిడముమందును గూర్చి ప్రకటింపగానే బుద్ధిమంతు లనేకు లామందును సమగ్రముగా ప్రయోగించి దాని పటుత్వములు పరీక్షించి చూచి యటువంటి ప్రశస్తమయినమందు మరియొకటి లేదని మాకు జాబులు వ్రాసిరి. అందొక జాబు నీక్రింద బ్రకటించుచున్నాము—

'(మహారాజశ్రీ) కోతల కోనయ్యగారి దివ్యపాదారవింద సన్నిధికి—

లోకోపకారపరాణులై మీరు ప్రకటించిన దివ్యౌషధమును గూర్చి నేను చదువుకొని సంతోషించి దానిని ప్రయోగించి చూచితిని, నాశరీరముమీద చిడముగాని తామరగాని లేని స్తలముఒక అంగుళమైనను లేదు. తామర ఏలాటిదనగా మాబావమరదులు గేదితామరయని. అంగుళము దళసరియున్నదని నన్ను వేళాకోళము చేయుచుందురు. సాధారణముగా గోళ్ళు తీయించుకొను నలవాటు నాకు లేనందున నాగోళ్ళన్నియు పారలవలె పదునై పొడుగుగానున్నని, మీయౌషధమునుగురించి చదువగానే నేను సలసలలాడునట్లు నీళ్లు కాపించి యథావిధిగా మీరుచెప్పినట్లు చేసితిని. అహాహా! ఆ సౌఖ్యమేమని చెప్పుదును. బ్రహ్మానందమనగా అదియే బ్రహ్మానందము.

కాని స్నానమైనతరువాత రక్తము కాలువలు కట్టినది. శరీరమంతట భగ్గున మంట బయలుదేరినది. శరీరమంతయు నెత్తుసిగాయములతో నిండుటచేత పుప్పులగుత్తులతో నిండినతురాయిచెట్టువలె నేనగపడితిని. ఈమంటమాత్రము లేకుండా మీరేదైనా సాధనమాలోచించినపక్షమున మీమందువంటిమందే లేదు. కాబట్టి మాయందనుగ్రహించి తక్కినగోసాయిచిట్కాలుకూడాప్రకటింపవలయునని కోరుచున్నాను.

చిత్తగించవలెను,

గేదితామర కిచ్చయ్య,

బరుకులపాలెం.

మేము మహాయోగి నాశ్రయించే నేర్చికొన్న మందుల పటుత్వము శోధించి చూచునట్టి బుద్ధిమంతులు కొందరు దేశమందుండుటచేత దేశము బొత్తిగా గొడ్డుపోలేదని తెలిసికొని మేము చాల సంతసించుచున్నాము. ఇటువంటి మహనీయులిచ్చుచున్న ప్రోత్సాహముచేత మేము మరింత పూనికగలవారమై తక్కిన గోసాయిచిట్కాలను గూడ లోకోపకారార్థమై ప్రకటింప సాహసించితిమి చిట్కాలలో మొదటిది చిడుముమందుకదా.

రెండవ గోసాయిచిట్కా- ధవళకేశనాశని, ఈమాయకలికాలమందు, అనేకులకు బాల్యమునందే తలవెంట్రుకలు నరయుచున్నవి. మన్మథుడైననుసరే నరసిన వెంట్రుకలుండెనా యతనిమీద నసహ్యము పుట్టును. అందుచేత పడుచువారియందరభిప్రాయములను మేము కనిపెట్టి లోకములో తెల్లవెంట్రుకల యాపదలేకుండ చేయవలయునని సంకల్పించి మాగురువైన మహాయోగియొక్క యుపదేశముచేతను మాస్వబుద్ధికౌశలముచేతను, చిరకాల లోకానుభవముచేతను కలిగిన ప్రజ్ఞ అంతయు సమ్మేళనముచేసి బహుదినములు కష్టపడి యోజించి

తెల్ల వెంట్రుకలు నాశనము చేయునట్టియొక గొప్పసాధనమును కనిపెట్టితిని. ఈపరమహంసక్రియ యేగ్రామములోనైనను దొరకును. కర్చు విశేషము లేదు. అది ప్రయోగించినప్పుడు కొంచెమునొప్పిగానుండును గాని రవంత సేపు ప్రాణము లుగ్గపట్టుకొని అబాధ సహించినపక్షమున తరువాత మంచిసుఖము కలుగును. కష్టపడినప్పుడేకదా ఫలముదక్కుట! ఈపరమహంసక్రియ యేదనగా తెల్లవెంట్రుకలుగల మనుష్యుడు రెండణాలుపెట్టి ప్రశస్తమై పటుత్వముగల తంటసమునొక దానిని కొనవలెను. కొనుక్కొని అద్దము ఎదుటపెట్టుకొని తెల్లని వెంట్రుకను గురిచూచిపట్టి దానితో లాగవలయును. తాను స్వయముగా చేసికొనలేని పక్షమున మంగలివానిచేత తీయించవలెను. అబ్బా అనకూడదు. అమ్మా అనకూడదు. అయ్యో అనకూడదు. దీనిని మించినమందు మరియొకటియుండదని మేయి పందెమువేసి చెప్పగలము. తక్కిన మందులన్నియు ధనాకర్షణముచేయునట్టి మాయమందులు.

మూడవ గోసాయిచిట్కా

దోమనివారిణి—ఈకాలమునందు పట్టణములలోను పల్లెలలోను ప్రతిగృహమందు దోమలు విశేషముగానున్నవి. వీటికాటువల్ల మనుష్యులకు నిద్రపట్టక పోవుటయేగాక మన్యపుజ్వరములు మొదలయినవివచ్చుచున్నవని గొప్పగొప్ప వైద్యులు చెప్పుచున్నారు. అందుచేత మనమందరము సుఖముగా నిద్రపోయి బ్రతుకవలెనంటే దోమలబాధ నివారణచేసికొనుటవిధి. ఇందుకు మా యోగీశ్వరుడుగారు గొప్ప చిట్కాను కనిపెట్టిరి. అదియేదనగా దోమలున్న గదిలో పండుకొన్న మనుష్యులందరును రెండుమూడురాత్రులు తెల్లవారుపరకు మేలుకొని కుట్టుటకువచ్చిన దోమలన్నిటిని చేతితో బట్టుకొని ఒకొక్కరుఒక్కొక కత్తిరపుచ్చుకొని జాగ్రత్తగా వాటిరెక్కలను కత్తిరించివేయవలెను.

ఈ రెక్కల మూలముననే అవి యెగిరి మనుష్యుల మీద పడు చున్నవి. ఎగురుటకు శక్తి పోగానే ఉన్నచోటునుంచి కదలలేక పోవును. అప్పుడు మనకెంత మాత్రము బాధ కలుగదు.

నాలుగవ చిట్కా.

నల్లులనాశని:—ఈమందుకూడ సకల జనులకు అత్యవసరమే. మంచమున కసలే నల్లులు పట్టకుండ నొకటి రెండు విధానములు కలవు. అవి ముందుగా వివరించుచున్నాము. ఇంటిలోనున్న మంచములమీద మనుష్యులు పండుకొనకుండ క్రింద పడుకొన్న పక్షమున మంచములకు నల్లులు పట్టవు. ఇది యొకటి. మంచము తాలూకు కుసులన్నియు నూడగొట్టించి అటకమీద వేసిన పక్షమున అసలే పట్టవు. ఇది రెండవ విధానము. ఈ విధానము అంగీకరింపక కొందరు మంచముమీద పండుకొన్న పక్షమున నల్లులు విశేషముగా కుట్టినా దానికీ క్రింది విధానము చేయవలెను. మత్కుణమారి యని మేమొక అరఖు తయారుచేసితిమి. మంచము మీదనున్న ప్రతినల్లిని పట్టుకొని దానినోరు పగులతీసి సూది మొనతో నీ యరఖు రెండుచుక్కలు దానినోటిలో వేసిన యెడల అది తక్షణమే చచ్చిపోవును. చావకపోయినయెడల ఒకచుక్కయయిన ఖర్చు పెట్టకండా మామందు మాకు పంపిస్తే బుడ్డికరీదు ఎనిమిదణాలు తిరిగి మీకిచ్చి వేయుదుము. ఈబుడ్డి పోష్టులో వచ్చునప్పుడు మందు వలికి పోయినను బుడ్డి పగిలిపోయినను నష్టముమీరే యిచ్చుకొనవలెను.

అయిదవ చిట్కా.

పేలకు పిల్లల పిడుగు—ఈమందు ప్రస్తుతము మగవాళ్ళకు మాత్రమే ఉపయోగింప దలచుచున్నాము. సంవత్సరమునకు మూడ

కాలు కర్పు పెట్టినయెడల పేలబాధ వదలిపోవును. వెలతక్కువ. ఫల మధికము. కాబట్టి యీ చిట్కా నందరు గమనించవలెను. నెల కొకసారి ప్రతి పురుషుఁడు తల నున్నగా శుభ్రముగా చలిమిడి ముద్ద వలె నుండునట్లు గొరిగించుకొనవలెను. పేలు పుట్టకుండ నుండుట కింతకంటె గొప్పమందు లేదు. ఈ విషయమై యింకా సందేహము లున్నవారు యీ క్రిందివారికి వ్రాసి తెలిసికొనవచ్చును.

ఇట్లు
కోతల కోనయ్య
దరదలూరు, గోకవరంపోష్టు,
తామరాడతాలూకా.

—*—

చిత్రమైన తంతి వార్త

రంగము.

రంగపురమునం దొకయిల్లు.

(అప్పుడు జానకమ్మ కనకమ్మ సుభద్రమ్మ ప్రవేశించుచున్నారు)

జాన—కనకమ్మప్పా! మీతమ్ముడుగా రేయూరెళ్ళారమ్మా! పాపము, సుభద్రమ్మవదినె మాయన్నగారింకా రాలేదని బెంగపెట్టు కొన్నట్టున్నది.

సుభ—నీవు వేళాకోళముగా అన్నావుకాని నాకు మావారు రాలేదని నిజంగా బెంగగానే యున్నది. వెళ్ళినపని కాలేదని పైగా సుస్తిగా నున్నదని ఉత్తరము వచ్చినది.

కన—మరేనమ్మా! బొత్తిగా తోచడంలేదు.

జా—ఏయూరు వెళ్లారు. ఏమిసుస్తీ చేసినది?

కన—బరంపురం వెళ్ళాడు.

జాన—ఏమిపనిమీద వెళ్ళారు?

కన—ఏదోవ్యవహారంమీద వెళ్ళాడు.

జాన—ఏమిసుస్తీ చేసినది?

కన—గ్రహణివల్ల బాధపడుచున్నాడట.

జాన—ఏమైనా కొంచెము నింపాదిగానున్నదా?

కన—నింపాదిగానున్నదనే ఉత్తరమువచ్చినది. కాని దూర భారంకబురు. మేము బెంగపెట్టుకుంటామని నిమ్మళముగానున్నట్టు వ్రాశాడేమో!

సుభ—అందుచేతనే బొత్తుగా తోచడములేదు. ఈతోచక పోవడానికి సాయం యేవో వెధవపీడకలలుకూడా వస్తూంటాయి. అందుకుచేత మనసు మనసులో లేదు.

జాన—పరవాలేదమ్మా జడియకండి నిమ్మళముగానుంటుంది వెళ్లినది కొత్తయూరు గనుక నీటిపల్లడిచేసి కొంచెము సుస్తీచేసినది.

సుభ—నీనోటివాక్యాన్ని పెందరాడే నెమ్మళముగానుండాలి కదమ్మా! చెపితే నమ్మవుగాని జానికమ్మొదినా, ఒక్కమెదుకు సహించడంలేదు. విస్తరిముందర కూర్చోడంలేవడం ఆయన యెప్పు డొచ్చి కంటపడతారా యని యెంతో బెంగగా నున్నది.

(అని కంట తడిపెట్టును.)

జాన—ఛీఛీ ఊరుకో వదినే. పునిస్త్రీపడుచువు శుక్రవారం పూటా కళ్ళనీళ్ళు పెట్టుకోకూడదు. ఆయనకేమి మహారాజులా చక్కావస్తాడు. ఊరుకోండి. ఇంతకు నెమ్మళముగా నున్నదికదా?

కన—ఊరుకోవే అమ్మా సుఖంమల్లే యేడువకూడదు.

జాన—వెంకటేశ్వర్లకు మీదుకట్టి మొక్కుకొండమ్మా ఆయన సుఖంగా వస్తారు.

కన—దానిచేతి కంకణంతీసి మొన్నఉత్తరం వచ్చినరోజు ననే మీాదు కట్టాను.

జాన—అయితే భయమేమున్నది. తప్పకుండా నింపాదిగా ఉంటుంది.

(అప్పుడొక బంట్రోతు టిల్లిగ్రాఫు తీసికొనివచ్చును.)

బం—ఇదిగోనుండమ్మా మీాను టిల్లిగ్రాపొచ్చినది.

కన—ఎవరికి నాయనా యెవరికి?

బం—మీా కేనండీ మీాపెద్దబ్బాయిగారికి రంగారావుగారికి వచ్చినది.

సుభ—ఏయూరునుంచి నాయనా యేయూరుండి.

బం—బరంపురాన్నుంచని తోస్తుంది.

కన—బరంపురాన్నుంచే. అయ్యో నాతమ్ముడో అయ్యో నాతమ్ముడో ఇంకేముందర్రా.

సుభ—అయ్యో! నేనేమిచేతునోయి తండ్రీ (అని చదికిలబడు చున్నది.)

కన—అయ్యో తమ్ముడా! బరంపురం యిందుకోసం వెళ్ళావుట్రా నాయనా?

సుభ—కడసారంచూడడానికేనా ప్రాప్తిలేక పోయిం దేఅమ్మా

బం—అయ్యో టెలిగ్రాఫు పుచ్చుకోండమ్మా యెవరైనాను.

కన—ఇంకా పుచ్చుకోవడ మెందుకోయి తండ్రీ. సంగతి తెలిశే పోయిందినాయనా.

సుభ—టెలిగ్రాఫులో యేముందో మొగంమీాదే తెలుస్తోం దోయి నాయనా! నావొళ్ళు దడొస్తొంది నన్నెవరైనా పట్టుకోం డోయి అమ్మా. (అంతలో కొంద రమ్మలక్కలు చేరుచున్నారు.)

జాన—అదేదో విప్పి చదివించుకోండర్రా!

సుభ—చదివించడ మెందుకమ్మా వదినా! కొంప మునిగిపో యింది. నావరహాలచెట్టు పడిపోయింది.

కన—ఎంతపాపిష్టి వేళ బయలుదేరాడేఅమ్మా! వెళ్ళేటప్పుడు యెవరో కాని తుమ్మారు. కొంచెంసేపు ఆగుమంటే రైలుమించి పోతుందని వెళ్ళాడు. దాని తుమ్ము నేలబడా, ఎంతపని జరిగిందే అమ్మా!

(అని పెద్దపెట్టున యేడ్చును)

కన—బ్రాహ్మడెంతమంచివాడె అమ్మా! నేనంటే పంచ ప్రాణాలుకదా ఇంతకు ఆబ్రాహ్మడి కావూళ్ళో నున్నది మట్టి.

సీత—ఆమృత్యు దేవత జుట్టట్టుకొని లాక్కెళ్ళిందమ్మా ఆ పూరు. ఎవళ్ళకాపదవచ్చినా తన ఆపదలా జూచుకొనేవాడుకదా.

జాన—వీధులోనుంచి యింటిలోకి వస్తూన్నాడంటే ఆడవా ళ్ళంతా గజగజ కదా. ఎంతఖాయిదా.

బం—టెల్లిగ్రాఫు పుచ్చుకొండమ్మా నేవెళ్ళాలి.

జాన—సుభద్ర మొగాని కీపాడు రాత యెక్కడ గాశిందో కాని కలకల లాడుతూ వుండేది. ఆనాలుగు గుల్లలుపెట్టుకొని పసుపు కుంకం రాసుకుంటే మహాలక్ష్మీ లా గుండేది.

[అప్పుడు రంగారావు పరుగెత్తుకొని వచ్చుచున్నాడు]

రంగ—ఏమిటత్రా యీఖంగాళు, ఎందుకేడుస్తారు?

కన, సుభ—(రంగారావును కౌగలించుకొని) నాయనా! కొంప మునిగిందిరా యింకేముందిరా బరంపురానుంచి టెల్లిగ్రాఫు వచ్చిందిరా!

రంగా—ఏముంది టెల్లిగ్రాఫులో? ఏది ఏదీ.

బం——ఇదిగోనండీ పెళ్లిగాపు చింపి చూచుకోకుండానే యేడు స్తూన్నారు వీరు.

రంగా——ఊరుకోండి. ఊరుకోండి. చూస్తూన్నాను. పెలి గ్రాపు. ఊరుకోండి.

(అని చదువుకొనుచున్నాడు)

కన——ఎప్పుడు నాయనా పోతా! నిన్నా యీవేళా?

రంగా——చీ వూరుకో నీతొందర తగ లెయ్యా! ఏమీ భయములేదు. అంతా నింపాదిగా నున్నారు.

కన——నింపాదిగావున్నాడూ నాయనా! నింపాదిగానున్నాడూ

సుభ——అయితే పెల్లిగ్రాపు యేమిటో చదువు.

రంగా——అందరు సుఖముగా నున్నారు. మన అమ్మాయికి మంచిసంబంధం కుదిరిందని నాన్నగారు పెల్లిగ్రాపు యిచ్చారు సాలు మూలం తెలియక ముందుగా యేడుపుప్రారంభించినారు.

కన——జబ్బుగా నున్నమీదట పెల్లిగ్రాపు వస్తే అదేఅను కొన్నాము.

సుభ——పెలిగ్రాపు అలాంటప్పుడేకాని యివ్వరని నే వను కొన్నాను.

జాని——నే చెప్ప లేదటమ్మా నిమ్మళంగా నుంటుందని.

రంగా——చాలు యీపాటికి! ప్రయోజకత్వముచేశా రూరు కోండి సిగ్గుసిగ్గు.

(అందఱు నిష్క్రమింతురు)

—*—

ధర్మపరిపాలనసభ

సభావృత్తాంతము.

ఉత్తమోత్తములైన మన పురాతనధర్మము లన్నిటిని నిలుపుటకును, బొమ్మచెముడు డొంకలవలెను దూలగొండ చెట్లవలెను, పల్లేరుకాయలవలెను దేశములో బయలుదేరుచున్న నవనాగరిక పద్ధతులను ముక్కముక్కలుగా ఖండించి నిర్మూలనము చేయుటకును ఈసభ జన్మించినది. ఈసభకు చాదస్తపు చెలమయ్యగారుఅగ్రాసనాధిపతిగాను, ఆవుపేడ అన్నంభట్లుగారు, ఉపాగ్రాసనాధిపతిగాను, వెఱ్ఱితలల వెంకటదాసుగారు కార్యదర్శిగాను, ఉన్నారు. ఇందులో చర్చింపబడునట్టి విషయము లనేకములు కలవు, ఈసభకు బ్రాహ్మణులేకాని మరొకరు ప్రతినిధులుగా రాగూడదు. ప్రతినిధులు చొక్కాలు కోట్లు మొదలయినవి తొడుగుకొనగూడదు. జాబరా బట్టలుగాని, చిరివేరురంగు వేసిన బట్టలుకాని ధరింపవలెను. తాటియాకుల పుస్తకము లేగాని అచ్చువేసిన పుస్తకము లీసభకు పట్టుకు రాగూడదు. అవి తెచ్చినపక్షమున, అచ్చుపుస్తకములు వెంటనే చలిమంటలో పారవేయబడును. గోష్పాదమంత జుట్టున్నవారేకాని యిందులోనికి రాగూడదు. గిరజాలుకాని, జునపాలుగాని, పెద్ద జుట్టుకాని యున్నపక్షమున వెంటనే సభలో గొరిగించివేయబడును. ప్రతినిధులుగా వచ్చువారికి మీసములుండగూడదు. ధర్భాసనములు కృష్ణాజినములు జారీచెంబులు తప్పక తెచ్చుకొనవలయును. ఈసభవారందరు చాపలమీద కూర్చుండవలయునేకాని కుర్చీలమీద బల్లలుమీద కూర్చుండగూడదు. ప్రతినిధులకు కావలసిన సదుపాయములన్నియు మేము చేయుచుందుము. ఈసంవత్సరము సభ మొరుకలపాడులో జరుగును. అక్కడన్ని యేర్పాటులు చేయబడినవి. స్నాన

మునకై చెఱువులేర్పాటు చేయబడినవి. బసలకు విశాలమైన వీథి యరుగులేర్పాటు చేయబడినవి. భోజనసదుపాయము నిమిత్తమై అక్కడకు వచ్చునట్టి ప్రతిమనుష్యుడు అడ్డెడుబియ్యము ఉప్పు, మిరపకాయ, చింతపండు ఇంటిదగ్గిరనుండి మూటకట్టి తెచ్చుకోవలెను. పూటకు సోలెడుబియ్యముడుకునట్టి యిత్తడిపాత్రగూడ దెచ్చుకోవలెను. అత్తెసరు చేసికొనుటకు పొయ్యి మేము సప్లయి చేయగలము. ఈగ్రామములో పుల్లలుదొరకుట కష్టముగనుక ప్రతినిధులు వచ్చునప్పుడు త్రోవలో చెట్లనున్న యెండుచిదుకులు వెంట దెచ్చుకొనుటమంచిది. అంట్లు శూద్రులుతోముటచేత స్వహస్తపాకుల ఆచారమునను భంగముగాన్పున యెవరియంతటవారు తమతప్పేలాలను తోముకొనవలయును. సభజరుపుటకై యొక పెద్దదొడ్డి నేర్పరచినాము. సందెల్లు వేసినపక్షమున దుర్మార్గులెవరైన సభమీద కిట్టక నిప్పుపెట్టుదురేమో యను భయమున పైనపందిరివేయక యుంచినాము. సభ విరోధికృన్నామ సంవత్సర మార్గశిరబహుళ అమావాస్యనాడు జరుగునుగనుక ప్రతినిధులందరు ఒకరోజు ముందుగానె రావలయును. ఎందుకనగా, సభ జరుగవలసినదొడ్డి గోతులలోను ముండ్లచెట్లతోను నిండియున్నది. గనుక అది వారు స్వయముగానె బాగుచేసికొనవలెను. సన్మానసంఘమువారు శూద్రాది సేవకులచేత బాగుచేయించకలరుగాని బ్రాహ్మణోత్తములు కూర్చుండుస్థలము అపవిత్రమయిపోవునని బాగుచేయించలేము. మరియు ప్రతినిధులలో స్వార్థత్యాగము కలవారెందరుందురో పరీక్షించుటకుగూడ సన్మానసంఘమువారాపద్ధతి నేర్పరచినారు. మాసభకు వ్యతిరేకముగా మాటలాడదలంచినవారాయూరు రాగూడదు. ప్రతినిధులు చాలమంది వత్తురుగనుక ఒక్కొక్కరు ఒక్కొక్క నిమిషముకంటె మాట్లాడ గూడదు సభవారియిష్టమైనచో అంతకంటె నెక్కువసేపు గూడ మాట్లాడవచ్చును. సభవారి యిష్టములేకుండ నొకవేళ

మాట్లాడినపక్షమున అట్టివారు కాళ్ళు చేతులుపట్టుకొని క్రిందకు లాగి వేయబడుదురు. సాయంకాలమైనతరువాత సభాభవనమందుపాములు తేళ్ళు జెఱ్ఱులు మొదలయిన దుష్టజంతుసంచారము లుండునుగనుక సూర్యాస్తమయమునకు పూర్వమే సభముగించవలెను.

కార్యక్రమము—మొదటిదినం

ఉదయం గం॥ 4, 5, ల వరకు నిద్ర మేలుకొనుట 5 మొదలు 5–10 నిమిషములవరకు పొడుముపీల్చుకొనుట 5–11 మొదలుకొని 5–35లవరకును బహిర్దేశముపోవుట 5–35 మొదలుకొని 5–40 వరకు దంతధావననిమిత్తమై చెట్లనుండి పుల్లలువిరుచుట 5–41 మొదలుకొని 5–55 వరకు ముఖప్రక్షాళనము 5–55 మొదలు 6 వరకు బసలు చేరుట, 6 మొదలు 6–10 వరకు ఆవుపేడకొరకు యిల్లిల్లు తిరిగి తెచ్చుకొనుట.

6–10 మొదలు 6–20 వరకు పొయి అలుక్కొనుట, 6–20 మొదలు 6–40 వరకు పుల్లలుకూడా తెచ్చుకొననివారు వంటచెఱుకు తెచ్చుకొనుట. 6–40 మొదలు 6–45 వరకు పిడకతో నిప్పు తెచ్చుకొని పొయి రాజేసుకొనుట. పిదప 7 గంటలవరకు స్నానము మడి బట్టలారవేసికొనుట. 7 మొదలు 10 వరకు జపము, వంటచేసికొనుట శిష్యులు ఊరువెంట మజ్జిగకొరకు బయలుదేరి తిరుగుట. మరికొందరు శిష్యులు పొడుముచేయుట. 10 మొదలు 12 వరకు భోజనములు చేయుట. 12 మొదలు 1 గంటవరకు అంట్లుతోముట. 1 గంట మొదలు 2 వరకు బసలలోనుండి బయలుదేరి సభ దొడ్డికి వెళ్ళుట. 2 మొదలు 4—35 వరకు వెంట్రుకపరీక్ష. అనగా ప్రతినిధులందరు సరిగా గోష్పాదమంత జుట్టుంచుకొని వచ్చినారో లేదో యని శోధించుట. ఈశోధన నిమిత్తమై యొక చిన్న యుపసంఘ మేర్పడినది. ఆ సంఘమువారే యీపరీక్షం జేయుదురు. ఈసంఘముయొక్క కార్యదర్శి

వద్ద అంగుళములగుర్తు వేయబడ్డ యొక ఉపుతాడుండును. ఈతాడుతో ప్రతివానిజుట్టును గోష్పాదమంత యుందో లేదో పరీక్షించి చూతురు. గోష్పాదముకంటె యెక్కువ యున్నపక్షమున తక్షణమే యెక్కువయున్న భాగము గొరిగివేయించబడును. $4\frac{1}{2}$ మొదలు $5\frac{1}{2}$ వరకు యీవిధమైన క్షురకర్మ. 5 మొదలు $6\frac{1}{2}$ వరకు అకాలమందు అనగా భోజనానంతరమందు క్షురకర్మచేయించుకొన్నందుకు ప్రాయశ్చిత్తములు చేయించుకొనుట ఈప్రాయశ్చిత్తము నిమిత్తము నాలుగు తట్టల ఆవుపేడయు రెండుకడవల గోమూత్రమును సిద్ధముచేసి యుంచుదురు. ఇది బహుప్రయాసముమీద స్వధర్మపరిపాలన నిమిత్తము సంపాదించి సన్మానసంఘమువా రుంచినందుకు వారికిప్రతినిధులు అనేక కృతజ్ఞతావందనముల జేయఁగలయును. తక్కిన దినముల కార్యక్రమముగూడ నించుమించుగ నిట్లే యుండును. వెంట్రుకపరీక్ష మొదటి దినమందే యైపోవును గనుక ఆ కాలమందు సభ జరుగును.

ధర్మపరిపాలన సభ వెనుక చెప్పబడిన ప్రకారము మొదటి దినమున కార్యక్రమము జరిగించి రెండవనాడు మధ్యాహ్నము రెండు గంటలకు కలిసెను. సభ కలియవలసిన దొడ్డిలో చాలచోట్ల యెండ విశేషముగా నుండుటచే కొందరు సభికులు తాటియాకు గొడుగులు వేసికొనియు కొందరు దర్భాసనములు, కొందఱు కృష్ణాజినములు నెత్తిమీద వేసికొనియు నిలిచియుండిరి. నీడయున్న పట్టున కొందఱు కూర్చుండిరి. ఒక మూలనున్న ఉసిరిక చెట్టుక్రింద దర్భాసనము వేసి అగ్రాసనాధిపతిగారిని దానిమీద గూర్చుండబెట్టిరి. చల్లబడిన తరువాత క్రమక్రమముగా సభికులు కూర్చుండ జొచ్చిరి. అందఱు సమావేశమైన తరువాతసన్మానసంఘాధ్యక్షుడైన నంగినోటి నారాయణప్పగారు మహాప్రౌఢితో లిట్లుపన్యసించిరి.

ఓధర్మపరిపాలన పరులైన సోదరులారా!

మీకందఱకు స్వాగతము. మీ జారీచెంబులకు మీ కొల్లాయి గుడ్డలకు స్వాగతము. మన పూర్వాచారములకు మన గోమయము నకు మన చాదస్తమునకు పూర్ణమైన ఆయుర్దాయము కలుగుగాక! మహానుభావులైన మీరందరును ధర్మబుద్ధితో బహుప్రయప్రయాసల కోర్చి యింతదూరము వచ్చినందులకు నేను చాలా సంతోషించు చున్నాను. మీకు స్నానములనిమిత్తము, బసలనిమిత్తము, భోజన ముల నిమిత్తము అష్టకష్టములబడి తగినయేర్పాటు న్నియు చేసి నాను. మేము చేసిన యేర్పాటులలో నేవిధమైన లోపము లేదు. కాని, ఒకవేళనున్న పక్షమున దానిని క్షమించవలయునని కోరు చున్నాము. ఇక మీసభాకార్య నిర్వాహము చేయుటకై మీ అధ్య క్షుడుగారిని యెన్నుకొనుడు.

అని యుపన్యాసము చేసి ముగించగానే తప్పులదామోద రయ్యగారును, వంకరమాటల వరదయ్యగారును, నోటివట్టపు నూకయ్యగారును గంభీరభాషణములతో చాదస్తపు చలమయ్యగారి గుణములు వేయివిధముల వర్ణించి, ఆయనను గ్రాసనాధిపతిగా నుండు మని కోరిరి. అంతట చాదస్తపు చలమయ్యగారు సభికుల జయజయ ధ్వనులమధ్య అగ్రాసనాధిపత్యము వహించి యిట్లుపన్యసించిరి.

ఓఅన్నలారా! ఓతమ్ములారా!

నాకంటె యెక్కువ చాదస్తము యెక్కువపట్టుదలగల మహ నీయు లెందరోయుండగా యీగొప్ప గౌరవము నాకుమీరు జరిగించి నందుకు మీకందఱకు వందనముల చేయుచున్నాను. మన ఆచారము లన్నియు అడుగంటి పోవుచుండుటచేత మనధర్మములు నిలుపుటకే యిటువంటిసభ చేయవలసిన యవసరము నేటికివచ్చినది. ఏమిపాపిష్టి కాలము వచ్చినదోకాని ఆవుపేడంటే అందరికి అసహ్యముకదా! ఆవు మూత్రం నెత్తిమీద చల్లుకోవడమే లేనపుడు లోపలకు పుచ్చు

కోవడం లేదని వేరే చెప్పవలయునా? వీళ్ళిల్లు మాసిపోను. ఈదిక్కుమాలిన నవనాగరికులు కొందఱు పోగై ఆడపిల్లలను అమ్ముకోవడం తప్పని, ఆవుపేడ తినడం కూడదని అతిబాల్యవివాహాలు చేయరాదని వితంతువులకు తలవెంట్రుకలు తీయగూడదని స్త్రీ పునర్వివాహములు కావలెనని యిష్టమువచ్చినట్లల్లా పేలుతూన్నారు. పేలి దేశము పాడుచేస్తూన్నారు. ఆభగవంతు డెక్కడున్నాడో ఇంతమందికి మరిడిజాడ్యములు వస్తాయి, వీళ్ళకు రాగూడదూ? (వినండి, వినండి) పూర్వకాలంలో లంకలో పుట్టినరాక్షసు లందరు గూడ జన్మాంతరము లెత్తి యీ ప్రకారము నవనాగరికులై పుట్టినారు. వీళ్ళందరికి మీలో మంత్రశాస్త్రములు నేర్చిన మహనీయు లెవరైనాయున్న యెడల ప్రయోగములుచేసి కడితేరిస్తే యెంతో లోకోపకారము జరుగును. వీళ్ళు తేళ్ళు పాములవంటివాళ్ళు గనుక వీళ్ళకి హాని చేసినా పాపం లేదు. (వహావా వహావా) ఈనవనాగరికులు చెప్పే మాటలన్నీ మనము తోసిపారవేసి మనము పూర్వధర్మములు నిలపవలెను. సోదెకు వెళ్ళడము తప్పట. అమ్మవారికి మేకలను కోళ్ళను బలియియ్యడం పాపమట. ఆడవాళ్ళకు చదువులు కావాలట. నానోటికి తిన్నగా రావుగాని పొయి దగ్గర కూర్చుని వంటేడిశే ముండలకు చదు వెందుకయ్యా! (వినండి,వినండి) వీళ్ళుద్యోగాలు చేస్తారా ఊళ్ళేలుతారా? ఇదియెంతి విదపకాలమో కాని ఆడవాళ్ళుకూడా తగుదునమ్మా అని చదువులకు సిద్ధమగుచున్నారు. వీళ్ళ చదువులు తగలెయ్యా! (భళీ, భళీ చెవులొగ్గి వినండి) స్వాములవారి పాదతీర్థము గోచితీర్థము త్రాగడము అసహ్యమట. ఈలాగున గురుధిక్కారం చేసినందుకు వీళ్ళనోళ్ళు పుచ్చిపోవద్దా, కలియుగం కనక వాళ్ళపాపం యింకా పండడం లేదు. ఎప్పటికైనా పండకపోదు. మనవుసురు వీళ్ళకు తగలకపోదు. వివాహములలోను దేవుడు వూరేగింపులలోను భోగముమేళములు పెట్టగూడదట. భోగంమేళం

లేనిపెళ్ళి యేమిపెళ్ళి. అవకతవక పెళ్ళి ఇంకా యిటువంటి యుత్తమ
ధర్మములనేకము లున్నవి. వీటినన్నిటిని మనము కాపాడవలెను.
కొన్ని ధర్మముల పరిపాలించడంలో మనశక్యంగాదు గనుక మనము
గవర్నమెంటువారిని సహాయమడుగవలెను. మనలో నున్నటువంటి
అన్నిశాఖలకు అన్నిసభలు ఏటేటా వేరుగా జరిగేటట్టు యేర్పాటు
చేయవలెను. ఏలాగనగా, ఆరువేల నియోగులకు ఆరువేల నియోగి
మహాజనసభ, నందవరీకనియోగులకు నందవరీకనియోగిమహాజనసభ
ఇట్లే తెలగాణ్యపునియోగి మహాసభ, ప్రథమశాఖనియోగిమహాజన
సభ, ప్రథమశాఖవైదికమహాజనసభ, వెలనాటిసభ, వేగినాటిసభ,
కాసలనాటిసభ, ములికినాటిసభ, ఆరామద్రావిడసభ, కోనసీమ
ద్రావిడిసభ, దివిలిద్రావిడిసభ, పుదూరిద్రావిడిసభ వైష్ణవులలో
వడహాలిమహాసభ, తెంగలిమహాసభ, గోలుగొండవ్యాపారిమహాసభ
మాధ్వులలో, మాధ్వమహాజనసభ, కరణికమ్మవ్యాపారి మహాసభ,
ఉండునట్లేర్పాటు చేయవలెను. ఇంతియేగాక క్షత్రియులలో వైశ్య
లలో, శూద్రులలో ఎన్నెన్ని అంతర్భాగములైన తెగలున్నవో
అన్నిటికి మహాజనసభలుండు నట్లేర్పాటులుచేసి మనమగ్ర జాతివార
మైనందుకు సహాయముచేసి నడిపింపవలయును. వెయ్యేల! దేశ
మంతట, వల కెన్నికన్ను లుండునో శరీరమున కెన్నిరోమ కూపము
లుండునో అన్నిసభలుండవలయునని నాయభిప్రాయము, అట్లుండిన
పక్షమున, ఏశాఖవారి కాశాఖవారు తగిన యేర్పాటులు చేసికొన
వచ్చునని నాయభిప్రాయము. ఒక తెగవారు మరియొక తెగవారిని
శుభములకుగాని అశుభములకుగాని భోజనములకుగాని తాంబూల
ములకుగాని పిలవగూడదు. ఇట్లు పిలుచుటవలన ఒకరిచెడ్డ ఆచార
ములు మరియొకరికిసోకి మైలవడిపోదురు. అంతట ధర్మములు చెడి
పోవును. కాబట్టి యీసంగతులన్నియు గట్టిగా ఆలోచించి మీ

తీర్మానములలోనికి తీసుకురావలయును. ఓమహాత్ములారా! భారత మాతకడుపున మీరందరు పుట్టినందుకు యీధర్మముల మీరందఱు పరిపాలించి యీసభ వృద్ధిలోనికి దెచ్చి భ్రష్టులుగాక మీరందఱు స్వర్గమును చూరగొనుడు. దూషణ భూషణ తిరస్కారములు శరీరమునకుగాని పరమాత్మకు చెందవుగనుక మమ్మలిని యెవరేమన్నను తిట్టినను పాడుపత్రికలలో వ్రాసినను మొగముమీద ఉమ్మివేసినను తుడిచికొని సిగ్గుభిడియముల వదిలిపెట్టి యీధర్మముల తప్పక కాపాడవలయును.

(అందఱు జయాజయాయని తప్పట్లు కొట్టుచున్నారు)

—*—

తీ రు మా న ము లు

ఈతీరుమానములు సభవారి యెదుట ప్రవేశపెట్టునపుడు, ఆయా పెద్దమనుష్యులు చేసిన యుపన్యాసములను గ్రంధవిస్తరభీతిచే వ్రాయజాలక వట్టితీర్మానములు మాత్రమే వ్రాయుచున్నాము. ప్రతినిధులు విశేషముగా వచ్చుటచేత సందడి హెచ్చెను. అందుచేత నుపన్యాసకుల మాటలు వినబడవను భయముచేత, తీర్మానములను గురించి మాటలాడినవారున్నతాసనమెక్కి మాటలాడిన బాగుండునని ప్రసిడెంటుగారి ప్రక్కనున్న యొక మొండిగోడ నెక్కి మాటలాడిరి. ప్రతి తీర్మానమును గురించి యుపన్యాసములైన తరువాత సభాధ్యక్షుడు లేచి యిది మీకందఱకు ఇష్టమేనా, యిష్టములేనివారు చేతులెత్తండి యని యడుగగా, అందరు కరతాళధ్వనులతో నైకకంఠ్యముగ సమ్మతించిరి.

మొదటి తీర్మానము.

కలియుగకాలము పిదపకాలమగుటచేత, ఆడపిల్లలు పదిసంవత్సరములకే యుక్తవయసును చాలచోట్ల పొందుచున్నారు గావున, ఆడపిల్లలను ఎక్కువవయసు వచ్చినదాకా ఉంచక రెండుసంవత్సరముల నయసు లోపుగానే వివాహములు చేయవలసినది. మాటలు వచ్చిన తరువాత వివాహముచేసినపక్షమున తలిదండ్రులు యేవంకరటింకర మగనికి కట్టిపెట్టదలచినను వప్పుకొనక ఈ మగడునాకువద్దు, ఈ మగడునాకు కావాలి యని ఆటంకములు చెప్పవచ్చును. గనుక అట్టిభయము లేకుండా, ఆడపిల్లలకు మాటలురాకుండా వివాహములు చేయుట ఈ సభవారి ముఖ్యోద్దేశము.

ఈ తీర్మానమును గూర్చి అబద్ధాల అన్నయ్య దీక్షితులుగా రుపన్యసింపగా పచ్చిబూతుల బలరామావధానులుగారుధ్రువపరచిరి.

రెండవ తీర్మానము

కన్యాశుల్కములు పరశుల్కములు, పుచ్చుకొనుట, యిచ్చుట కొన్నిశాస్త్రములచేత దూష్యమైనను తరతరములనుండి పెద్దలాచరించుటచేత శిష్టాచారమైపోయినది. గనుకను శాస్త్రముకంటె, ఆచారమే బలవత్తరమగుటచేతను, కన్యాశుల్క వరశుల్కములు యిష్టమువచ్చినవారు యథేచ్ఛముగా బుచ్చుకొనవచ్చును. యివ్వవచ్చుననియు, అట్టివారిని ఆక్షేపించినవారిని స్వాములవారితో జెప్పి వెలివేయించవలసినదనియు ఈ సభవారి యభిప్రాయము.

ఈ తీరుమానవిషయుమై చాల చర్చ జరిగినది. శుల్కమెంత పుచ్చుకోవలెను, అని చర్చవచ్చెను. అనేకులు, అనేకవిధముల అభిప్రాయమును చెప్పిరి. మొత్తముమీద ఆడపిల్లలకు నెలకొకవంద రూపాయలు పుచ్చుకోవలెనని చెప్పిరి. అనగా అయిదునెలల పిల్లలకైదువందలు 6 నెలల పిల్లల కారువందలు 10 నెలల పిల్లలకు పది

వందలు శుల్కము పుచ్చుకోవలెననియు మగపిల్లవానికి వరశుల్కముగా ఏడాదిక వందరూపాయలు, అనగా అయిదేండ్ల పిల్లవానికై దువందలు ఏడేండ్లవాని కేడువందలు పుచ్చుకోవలెనని చెప్పిరి.

ఈతీర్మానమునుగూర్చి నీతిమాలిన నీలాచలంగా రుపన్యసింపగా స్వలాభపు సన్యాసయ్యగారు ధ్రువపరచిరి.

మూడవ తీర్మానము.

హిందూదేశములో వితంతువులసంఖ్యఅధికమైపోయి ప్రయాణములు చేసేవారందరికి సరిగామంచిశకునములు కుదరకపోవుటచేతనున్ను ఈవితంతవు లనుభవించే ఆస్తి వాళ్ళవాళ్ళజ్ఞాతులకు చిరకాలమునకుగాని సంక్రమించకపోవుటచేతనున్ను, మనదేశములో జనసంఖ్య అతివిస్తారము అయిపోవుటవల్ల కరువులు మొదలగునవి వచ్చుచున్నవి. గావున జనసంఖ్య తగ్గించవలసినభారము మనపైనున్నది. గనుకనున్ను రమారమి నూరుసంవత్సరముల క్రిందట దేశద్రోహియైనరామమోహనరాయలు, అతనిమిత్రులలోకలిసిన యింగ్లీషు అధికారులును గలసి అన్యాయముగ, అధర్మముగ మూన్పివేసిన సహగమనమును తిరిగి మాదేశములో స్థాపించవలసినదని గవర్నమెంటువారిని పార్లమెంటువారిని యీ సభవారు వినయవిధేయపూర్వకముగా కోరుచున్నారు.

ఈ తీర్మానమును గూర్చి రాతిగుండెల రాజన్నగారును, బండమనసు పల్లయ్యగారును మాట్లాడిరి.

నాలుగవ తీర్మానము.

ఒకవేళదొరతనమువారు మనఅదృష్టలోపముచేత సహగమనమును తిరిగి స్థాపించుటకు వప్పుకోనిపక్షమున ''సకేశింపిధవాంధృష్ట్వా సచేలం స్నానమాచరేత్'' అనియున్నది. గనుక, అనగా తలవెంట్రుకలతోనున్న విధవనుచూచినప్పుడు వెంటనేస్నానముచేసి బట్టలుతడుపుకోవలెననియున్నదిగనుక, ఇప్పుడు విశేషముగాతలవెంట్రుకలుంచు

కొనుచున్న యీ వితంతువులను చూచి మాటిమాటికి మనము స్నానము చేయలేక చచ్చిపోవుచున్నాము గనుకనున్నూ, తల వెంట్రుకల విధవలు వంటలు మొదలైనవి చేయగూడదు గావున శిష్టులైన వారి గృహములలో వంటలు మొదలైనవాటికి యిబ్బంది గలుగుచున్నది. గనుక నున్ను స్త్రీ వితంతువు కాగానే, ఎనిమిదేండ్ల వయసున్నా సరే 15 ఏళ్ళ వయసున్నా సరే వెంటనే తలవెంట్రుకలు తీయించివేసి వెయ్యవలసినదని ఒక చట్టము గవర్నమెంటువారు ఏర్పరచ వలసినదని యీ సభవారును తక్కిన హిందువులును మహజరియ్యవలసినది.

ఈ తీర్మానమును గూర్చి మొండిపాదముల మూలయ్యగారు ఉపన్యసింపగా శివరాల జగ్గయ్యగారు ధ్రువపరచిరి.

అయిదవ తీర్మానము

మా దేశములో ఆడవాళ్ళకు చదువు చెప్పుట, అధర్మము, అనవసరము. శిష్టాచారమునకు విరుద్ధము నగుటచేత, ఇకముందు గవర్నమెంటువారు బాలికా పాఠశాలల స్థాపించవలదనియు వెనుక స్థాపించిన పాఠశాలలన్నియు నష్టము గలిగించుచున్నవి గావున క్రమక్రమముగా నెత్తివేయ వలసినదనియు గవర్నమెంటు వారికి మనమందరము మహజరుల యిచ్చి యీ విషయమై గవర్నమెంటు వారు శాసన నిర్మాణ సభలో గట్టిపని చేయవలసినదని ఆనరబుల్ సర్దార్ బహదూరు తిక్కపట్టు తిరుపతిరావుగారికి అర్జీ యివ్వవలసినది.

ఈ తీర్మానమునుగూర్చి ఆకాశరామన్నగారున్నూ, అజ్ఞానపు అంబయ్యగారును మాట్లాడిరి.

6 వ తీర్మానము.

మనుస్మృతి మొదలయిన ధర్మశాస్త్రములలో శూద్రులు బ్రాహ్మణులకు సేవచేయవలసినదే కాని, అంతకంటె మరియొక

వృత్తి యేమీ చేయగూడదని స్పష్టముగా జెప్పియున్నది గనుకను, శూద్రులు బ్రాహ్మణులతో సమానముగా కూర్చుండకూడదనియు కూర్చున్న పక్షమున కఠినమైన శిక్ష చేయుమనియు నున్నది గనుకను, శూద్రులకు బ్రాహ్మణులకంటె తక్కువ ఉద్యోగములే గాని యెక్కువ యుద్యోగము లీయ గూడదనియు బ్రాహ్మణులు ప్రత్యేకముగా ప్రయాణము చేయుటకై బ్రాహ్మణ రైలుబండ్లు కొన్ని వేయించవలసినదనియు, ఈ సభవారు గవర్నమెంటువారికి విజ్ఞాపన పంపించ వలసినది.

ఈ తీర్మానమును గూర్చి కయ్యాల కామయ్యగారును నోటిదుడుకు నూకయ్యగారును మాటలాడిరి.

7 వ తీర్మానము

ఒకవేళ సర్కారువారు ఏకారణము చేతనయినా ప్రత్యేకము రైళ్ళు వేయించక పోయే పక్షమున శూద్రాదులు కూర్చున్న అపవిత్ర స్థలములలో బ్రాహ్మణోత్తములు కూర్చుండుటకు శాస్త్ర మొప్పదు గనుక అటువంటి స్థలములలో బ్రాహ్మణులు కూర్చుండుటకు ముందు వాటిని శుద్ధిచేసి కొనుటకై ప్రతి బండిలోను బిందెడు నీళ్ళు, తట్టెడు ఆవుపేడ పడవేయించి వలసినదని యిందుమూలముగా కోరుచున్నాము.

ఈ తీర్మానమును గూర్చి చాదస్తపు చలమయ్యగారి తమ్ముడైన చెల్లయ్యగారును, ఆచారపు అన్నయ్యగారి తమ్ముడైన అక్కయ్య శర్మగారును మాట్లాడిరి.

8 వ తీర్మానము

మాలవాళ్ళను వీధులవెంట ఇప్పుడిప్పుడు మనవాళ్ళు తెనుగు మీరి వెళ్ళనిచ్చి నందుకును, నడవనిచ్చి నందుకును మేమెంతో అంత విచారిస్తూండగా, ఇప్పుడిప్పుడు కొందఱు దుర్మార్గులైన నవనాగరికులు బయలుదేరి వాళ్ళకి పాఠశాలలు పెట్టించి చదువులు చెప్పిస్తా మం

టూన్నారని కర్ణకఠోరమైన వార్తనూ చెవిని బడినది. ఇది నిజమే యైన పక్షమున, ఆలాగు ప్రయత్నములు చేసేటటువంటి వర్ణభ్రష్టుల నందరిని ద్వీపాంతర వాసమునకు పంపించివేయ వలసినదని యీసభ వారు వినయ విధేయతతో సర్కారువారికి మనవిచేసికొనుచున్నారు. ఆలాగు చేయని పక్షమున యీసభవారు, పుత్రమిత్ర కళత్రము గాను, సకుటుంబ పరివారముగాను కృష్ణా గోదావరీ నదులలో దిగ దలచుకొన్నారు గనుక మమ్మలిని ఆత్మహత్యలుక్రింద చార్జీలు చేయవద్దని కోరుచున్నాము.

ఈ తీర్మానమును గూర్చి ఉడుకుబోతుతనపు ఉళ్ళక్కిగారును సాహసము శంకరప్పగారును మాట్లాడిరి.

9వ తీర్మానము.

ఈసభలోచేరిన ప్రతిమనుష్యుడున్నూ తాను ప్రతిదినము ఉదయమునందు ఇష్టమైనపక్షమున నిమ్మకాయంతగాని అధమ పక్షము గచ్చకాయయంతగాని కుక్షిపావనం నిమిత్తం తప్పక ఆవు పేడ పుచ్చుకొని తీరవలసినది. గోబ్రాహ్మణేభ్యా అన్నాడుగనుక యిదియందరికి ముఖ్యకర్తవ్యము. అదిఒక వేళ వెగటుగానున్న పక్ష మున తానుపుచ్చుకోదలచిన ఆవుపేడముద్దంత చింతకాయపచ్చడి కాని ఉసిరికాయపచ్చడికాని కలిపిపుచ్చుకొననలెను. పెద్దవాళ్ళయిన తరువాత యిదిపుచ్చుకొనుట వెగటుగాలోచును గనుక మనపిల్లలకు యికముందుపుట్టేపిల్లలకు నల్లసంపమాత్రంత గోమయము ప్రతి దినము అలవాటుచేయవలసినది. ఆవుపంచితముకూడా కుక్షిపావనమే గనుక అది సభలో జేరిన వారందరును ప్రతిదినము ఉదయమందు ఒకగిద్దెడు పుచ్చుకొనవలెను వెగటుగానున్నపక్షమున ఈనాటి నవ నాగరికపు టుద్యోగస్థులు మును పెప్పుడు అలవాటులేని వెగటు కాఫీలో పంచదార వేసిపుచ్చుకొన్నట్లుగానే దీనిలోగూడ పంచ

దారవేసి పుచ్చుకోవలెను. చిన్నపిల్లలకు గోమయం విధంగానే దీనిని కూడ ఉగ్గులో కలిపి పట్టవలెను.

ఈతీర్మానమునుగూర్చి గోతల రుద్రయ్యగారు, చొల్లునోటి సుందరయ్యగారు, చిడుము సీతయ్యగారు ఉపన్యసించిరి.

10 వ తీర్మానము

దేవాలయములలోను వివాహములలోను వేశ్యాంగనలుకూడదని కొందరునవనాగరికులు బ్రహ్మరాక్షసులవలె పోట్లాడుచున్నారు. అటువంటివారిమాటలుమనముతిరస్కరించి భోగమువాళ్ళు యీనాడు ఆనాడు పుట్టినవాళ్ళుకారుగనుకను కృతయుగంనుంచి ఉన్నారుగనుకను వాళ్ళని ఆదరించడం శిష్టాచారమనియు దిక్కుమాలిన ఆజాతి వారిని పోషించుట భూతదయయనియు ఈసభవారు అభిప్రాయపడుచు వేస్యాంగనలను దేవాలయములోనికి రప్పించిన్ని పెండ్లింళ్ళలో మేళములోనికి పిలిచిన్ని వాళ్ళను ఉంచుకొనిన్ని యీసభవారందరు వాళ్ళని గౌరవించి ప్రోత్సాహము చేయవలసినది. ఏగ్రామములో నైనా భోగంవాళ్ళు లేనిపక్షమున ఆగ్రామమునకు అప్రదిష్టగావున ఆయప్రదిష్టపోగొట్టుటకై ఆగ్రామంలోవాళ్ళు యితరగ్రామములలో నున్న భోగమువాళ్ళను తీసుకొనివచ్చి వాళ్ళకు విద్యలుచెప్పించి కొందఱు పెద్దమనుష్యులు వారిని ఉంచుకొని మాన్యములిచ్చి వాళ్ళని సర్వవిధముల చేత కాపాడవలసినది.

ఈ తీర్మానమునుగురించి జులాయి సూరయ్యగారు, పోఖరీ పున్నయ్యగారు తుంటరి దుర్గప్పగారు మాట్లాడిరి.

11 వ తీర్మానము

మన ప్రసిడెంబుగారైన చాదస్తపు చెలమయ్యగారు లోకోపకారార్థమై అనేక సంవత్సరములు కష్టపడి బహుశాస్త్రములశోధించి మనకందరకు సత్యంతోపకరమైనట్టియు మోక్షసాధనములైనట్టియు

రెండు మహాగ్రంథము లరచియించినారు. అవియేమనగా, వెంట్రుకల మీమాంస ఆవుపేడీయమునను గ్రంథములు. ఇందు వెంట్రుకల మీమాంస జైమినిముని వ్రాసినపూర్వ మీమాంసకంటెను వ్యాస మహాముని రచియించిన ఉత్తర మీమాంసకంటెను ఎక్కువ యుపయోగమైనది ఎక్కువమంచిది. దీనికి నిరక్షరకుక్షి సుంతయ్యగారు గొప్ప వ్యాఖ్యానము వ్రాసినారు. ఇందు మీసములు తలవెంట్రుకలు ఉంచుకొనుట పెంచుకొనుట మొదలయిన విషయముల కూర్చియు క్షురకర్మ యెప్పుడెప్పుడే యేవిధముగా ఎంతంతసేపు చేయించుకో వలసినదో ఆవిషయములను గూర్చియు బహువిరళముగాను విపులముగాను చర్చింపబడియున్నది. ఆవుపేడీయమందు గోమయము యొక్క మాహాత్మ్యమున్ను అది యేయేకాలములయం దెవరెవరేయేవిధముగా నెంతెంత పుచ్చుకోవలెనో ఆ విషయమును గూర్చియు చెప్పబడియున్న ఈపుస్తకము లచ్చువేయించుటకై పది వేల రూపాయలు పట్టును గనుక యీసభవా రందరును దేశము వెంట చందాలకు బయలుదేరి పోగుచేయవలసినది.

ఈతీర్మానమునుగూర్చి నిశానిసీలపరాజుగారు మందబుద్ధి [illegible] రెయ్యగారు ఏమీరాని యెఱ్ఱంరాజుగారు మాట్లాడిరి.

ఈ తీర్మానములతో సభ ముగిసెను. చాదస్తపు చెలమయ్యగారు పడినశ్రమకు, ఆయన పాండిత్యమునకు ఆయన స్వార్థత్యాగమునకు ఆయనలోకోపకారబుద్ధికి అనేకులు పొగడి సభ ముగించిరి. ముందు సంవత్సరమీసభ ముష్టిపురాగ్రహారములో జరుపుట కా గ్రామవాసులు కోరిరి. సన్మానసంఘమువారు చేసిన సదుపాయములకు యేర్పాటులకు చాలమంది వారికి వందనములజేసి సభ ముగించిరి.

—*—

యమలోకవర్ణనము

[అప్పుడు నారదుడు, వామనశర్మయను బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నారు]

వామన—నారదమునీంద్రా! నమస్కారము మీరెక్కడ నుండి దయచేయుచున్నారు?

నార—కళ్యాణమస్తు. నేను యమలోకమునుండి వచ్చుచున్నాను.

వామ—మీవంటి మహనీయులు గూడ యమలోకమునకు వెళ్ళవలసిన అవసరమున్నదా?

నార—దైవానుగ్రహము వలన మేము యమలోకమునకు వెళ్ళవలసిన యవసరము లేదు. కాని చూడ వేడుకపుట్టి వెళ్ళినాను. పూర్వము ద్వాపరయుగములో యమలోక మొకసారి చూచినాను. అప్పటికి ఇప్పటికి భేద మేమున్నదో తెలిసికొనగోరి యిప్పుడొకసారి వెళ్ళి చూచి వచ్చినాను.

వామ—యమలోక మేలాగున నున్నదండీ?

నార — ఏలాగుననున్నదని చెప్పను, అన్ని వస్తువులు మహాభివృద్ధి పొందుచుండవలయుగదా అందుచేత యమలోకము కూడ మిక్కిలి వృద్ధిలోనున్నది.

వామ—వృద్ధిలో నున్న దేమండి. అది పట్టణమా పల్లెయా?

నార—పల్లె కర్మమేమి అదికూడ కలకత్తా, లండను, బొంబాయివంటి గొప్పపట్టణమే.

వామ—అబ్బా! అంత పెద్దపట్టణమా?

నార—అంతా యికనంతా ! పూర్వము కృతయుగములో చిన్నపల్లె. ఒక నూరుమంది లోపుగ నుండెడివారు. త్రేతాయుగములో రమారమి వేయిమంది యుండెడివారు. ద్వాపరయుగములో రమారమి లక్షజనము. ఈకలియుగములో యమలోకమంతా దురాత్ములతో నిండిపోయినది. నివేశనములు చాలక యెన్నో పేటలు కట్టినారు. చుట్టుప్రక్కల పల్లెటూళ్ళు దానిలో కలిపివేసినారు. ఎన్ని వందలో క్రొత్తవీధులు బయలుదేరినవి. ఇంటిమీద యిల్లున్నది. మనుష్యునిమీద మనుష్యుడున్నాడు. ఇప్పటికీ బొత్తిగా చాలుట లేదు.

వామ—అయ్యా ! యమలోకపు జనాభా యెన్నడైన తీసినారా ?

నార—తియ్యకేమి! అక్కడజనాభా మీభూలోకపు జనాభా వలె పదిసంవత్సరముల కొకసారితీయరు. అక్కడ సంవత్సరమున కొకసారి తీయుదురు.

వామ—ఈయేడు జనాభాతీసినారా ?

నార—ఆహా తీసినారు. మొన్ననే చైత్రశుద్ధపాడ్యమినాడు తీసినారు.

వామ—ఎంతజనాభా యున్నది ?

నార—మీ భూలోకములో గతసంవత్సరము ఎంతమంది మనుష్యులుచచ్చిపోయినారో ఇంచుమించుగా అంతమందిమనుష్యులు యమలోకములో నున్నారు. వీరుగాక, అదివరకు ప్రతిసంవత్సరము చచ్చిపోయిన జనమందరిసంఖ్యకూడ చేర్చినపక్షమున యమలోకజన సంఖ్య లెక్కపెట్టుటకు వీలు లేక యున్నది.

వామ—మునీశ్వరా! మీరు అతిశయోక్తులకు ప్రసిద్ధి అందుచేత మీమాట నమ్మజాలకున్నాను. యమలోకములో అంతజనాభా యున్నదా ?

నార—నేను నిశ్చయమే చెప్పుచున్నాను. అతిశయోక్తి కాదు. చిత్రగుప్తుడు, అతనిగుమాస్తాలు లెక్కపెట్టలేక నానావస్థలు పడి యేలాగో జనాభా తేల్చినారు.

వామనశర్మ—పూర్వకాలము మీా రెప్పుడైన వైకుంఠము చూచినారా ?

నారదుడు— చూడకేమి. యెన్నోసారులు చూచినాను. అప్పుడు వైకుంఠము పుణ్యాత్ములతోనిండి క్రిక్కిరిసిపోయియుండినది.

వామ —అది యిప్పుడేలాగున నున్నది ?

నార—ఇప్పుడు వైకుంఠములో పట్టుమని పదిమందియైనను లేరు. పట్టణమంతయు పాడుగొట్లాడుచున్నది.

వామ—మిక్కిలి యాశ్చర్యముగా నున్నది. అయితే యమలోకములో ఎవరెవరు మీాకు కనబడినారు ?

నార—ఎవరని చెప్పుదును! అయినను ముఖ్యులను గొందరిని చెప్పుచున్నానువినుము. బంగారు కిరీటముధరించిన మహారాజాధిరాజులు చక్రవర్తులు అందఱు నక్కడనే యున్నారు. రాజ్యచక్రములను తమచేతులలో బెట్టుకొని గారడివాండ్రవలె త్రిప్పుజాలిన మహామంత్రులనేకులక్కడనున్నారు. గొప్ప గొప్ప యుద్ధరంగములలో శత్రువులని పేరుపెట్టి లక్షలకొలది మనుష్యులను సంహారముచేసిన సేనాపతులక్కడనే యున్నారు..

వామ—అన్నన్నా! మహారాజులందఱుఅక్కడనేయున్నారా? ''రాజ్యాంతే నరకం ధ్రువం'' అనుమాట నిజమైనదే. కాని పాపము వారెన్నెన్నో దానములుచేసినారు. అగ్రహారములిచ్చినారు ఎందరికో వివాహములు చేసినారు. సత్రములు వేయించినారు. ఆ పున్నెమేమైపోయిననో.

నార—వెఱ్ఱివాఁడా! ఒకగోవునుజంపి, పెద్దపులి తానుతిన్నంత మాంసముతిని మిగిలిన దానితో నూరు నక్కలను పోషించును. ఆ రాజుల ధర్మములు నట్టివే. కాకులనుగొట్టి గ్రద్దలకు వేయుట వలన పుణ్యము కలుగునా ?

వామ—చిత్తము. మీరు తెలవిచ్చినది నిజమే. ఇంకను యమలోకములో మీ కెవరు కనబడినారో సెలవిండు.

నార—పెద్దపెద్ద న్యాయవాదులమని పేరుపెట్టుకొని మన వద్దకు వచ్చిన కక్షిదారులను నాశనము చేయునట్టి ప్రముఖులు వేల కొలది కనబడినారు. ఎక్కడనో యిద్దరు ముగ్గురు తప్ప ఉద్యోగస్థులందఱు అక్కడనేయున్నారు.

వామ—ఎన్నిమారులు చూచినను లాక్యులేకాని క్రిస్టులు మొదలయినవారు మీకక్కడ కనబడలేదని తోచుచున్నది.

నార—(నవ్వుచు) పిచ్చివాడవు. కంటికి నదరుగా కనబడిన వారే కర్మిష్టులు. బైరాగులు, వేదాంతులు, సన్యాసులు. బావాజీలు గోసాయీలు, సాధువులు. యోగులు, బ్రహ్మచారులు అనిలోకములో విఱ్ఱవీగిన మహానుభావులందరు యమలోకమునే యలంకరించినారు.

వామ—ఏమిచిత్రము. అట్లయిన కుండలములు వేసికొని శాలువలు కప్పుకొన్న బ్రాహ్మణోత్తము లెక్కడ నున్నారు ?

నార—ఈ బైరాగులపక్కనే వారున్నారు.

వామ—సరే, వీరందరిమాట కేటిగాని వైకుంఠములోనికి వెళ్లినప్పుడు మా తాతగారు మీ కక్కడ కనబడ్డారా ?

నార—మీ తాతగారు నా కక్కడ కనబడలేదు.

వాను— మరెక్కడ కనబడ్డారు కైలాసములోనా ?

నార— కైలాసములోనుగాదుయమలోకములోనేకనబడ్డారు.

వామ—అయ్యయ్యో! ఆయన మిక్కిలి బాధపడుచున్నారు గాబోలు.

నార — ఆయన బంధువర్గమంతతోను గలిసి యుండుటచే నంత బాధపడుట లేదు.

వామ — అయ్యోయ్యో ! బంధువులందఱుగూడ అక్కడనే యున్నారా ?

నార — ఆయన పితృపితామహులు పదితరములవరకును గల వారందరు వానితో గలిసియే యున్నారు.

వామ — వాండ్రు తెలివితక్కువవల్ల యమలోకములోనికి వెళ్ళినారు గాని మేము యమలోకములో బ్రవేశించము.

నార — నిజమే, మీరాయమలోకములో ప్రవేశింపదగినవారు కారని అక్కడ కొందరు చెప్పుకొనుచున్నారు.

వామ — ఎవరు చెప్పుకొనుచున్నారు ?

నార — చిత్రగుప్తుడు మొదలయిన వారందరు చెప్పుకొనుచున్నారు.

వామ — అట్లయిన మాకీనరకప్రాప్తి లేదు గాబోలు !

నార — అవును మీ నిమిత్తమై క్రొత్త నరకములు క్రొత్త యమలోకములు సృష్టింపవలెను గాని యిప్పుడున్న యీనరకములు యీ యమలోకములు పనికిరావు.

వామ — (తెల్లబోయి) ఏమండి యిలా గనుచున్నారు.

నార — అనకేమి మీరు చేయుచున్న మహాపాతకములకు పాతనరకములు పాతయమలోకములు పనికివచ్చునా ? అందుచేత నట్లంటిని.

వామ — అట్లయిన నాగతియేమి ?

నార — నీ గతి దుర్గతియే.

(అని నిష్క్రమించు చున్నాడు)

—*—

వామ—(తనలో) ఈయనమాట నిజ మగునా ? ఈయన మాత్రము యమలోకము చూచివచ్చినాడా ? ఈయన కలహములు పెట్టుటకు పెట్టినదిపేరుగదా. అందుచేత నే బెదరించుటకు నాలుగు కోతలు కోసి యుండవచ్చును. అందువలన నాకు భయములేదు. కాబట్టి నా వ్యాపారము నేను యెప్పటి యట్లు సాగించుకొనుచు సుఖముగా నుండనచ్చును.

(అని నిష్క్రమించుచున్నాడు)

—♦—

అ పూ ర్వ న ర క ము.

యమధర్మరాజు సభ.

[అంతట యమధర్మరాజు, చిత్రగుప్తుడు పీఠములపై గూర్చుండి ప్రవేశించుచున్నారు.]

(వారి ఎదుట నొక పురుషునియాత్మ నిలిచేయుండును)

యమ—చిత్రగుప్తుడా ? ఎవడు వీడు ?

చిత్ర—ఇతఁడే ధనగుప్తుడు. భూలోకములో మధురాపురము వీని కాపురము.

యమ—ఓహో ! వీనికథ లేనా పరిపరి విధముల చెప్పుకొని మన కింకరులు కడుపులు పగులునట్లు నిన్న నవ్వుకొనుచున్నారు.

చిత్ర—చిత్తము. ఇతడేనండి ఈ మహానుభావుని గాథలు వ్రాయగలవారున్న పక్షమున భారత భాగవతము లంతంత గ్రంథము లగును.

యమ — భూలోకములో నీ మహానుభావు డెందుకు ప్రసిద్ధి కెక్కినాడు ?

చిత్ర — ఈతడు సకల గుణాభిరాముడు. అన్నిటికిని ప్రసిద్ధి కెక్కినాడని చెప్పనచ్చును కాని ముఖ్యముగా లోభత్వమునకు పేరు మోసినాడు. ఈయన పిసిని గొట్టులలో మహాచక్రవర్తి. వారిలో అగ్ర తాంబూల మీయనకే యియ్యవలసియుండును.

యమ — అబ్బా! అంత పిసినిగొట్టా.

చిత్ర — ఎంత పిసినిగొట్టో నేను దేవరివారితో మనవి చేయ జాలను. ఈ సంగతినిబట్టి గ్రహింపుడు. ఈతడు మృతినొందుటకు ముందు పదునేను దినములక్రిందటనే తన సొమ్మున్న గదిలో తన్ను పండుకొనబెట్టమని కొడుకులను పీడించి ఆ గదిలో పండుకొనెను. ఆ దినములలో నితని కన్నద్వేషము కలిగినది. మంచినీళ్ళు పాలు మాత్రమే త్రాగి జీవించెను. ఈతని రోగము చూడగా గొప్పది. అట్టిరోగముతో నాహారము తినకుండి యెట్లు జీవించెనాయని వైద్యులాశ్చర్యపడి ధనకాంక్షచేత చూచిచూచి ప్రాణములు వదిలిపెట్ట లేక అంతకాలము జీవించెనని యభిప్రాయపడిరి.

యమ — గట్టిప్రాణము కాని-నో మంచినీళ్ళతో బ్రతుకుట కష్టముకాదా?

చిత్ర — అతడు త్రాగినవి కేవలము మంచినీళ్ళుకావు మహా ప్రభూ! తన పెట్టెలలోనున్న సొంతనగలు. తాకట్టుపట్టిన నగలు, వెండి బంగారు నాణెములు, తన యెదుటకు తెప్పించి యవి కడిగించి యా నీళ్ళొక పాత్రలో బోయించి తనకు దాహమైనప్పుడెల్ల నొక్కొక యుద్ధరిణెడు నీళ్ళుపోయించుకొని త్రాగుచు వచ్చెను.

యమ—ఆహా! ఈతని లోభత్వము మిక్కిలి యాశ్చర్యకర మైనది. ఇట్టిలోభిని నేనెన్నడు చూడలేదు. ఇతడు దేవతాసేవల నెన్నడు చేయింపలేదా?

చిత్ర—చేయకపోవుటయె గాదు. ఒక దేవాలయమునకు ధర్మ కర్తలలో నొకడై కొంతసొమ్ము హరించినాడు.

యమ—సరే ఇతనిచరిత్రము త్తరోత్తరచిత్రముగానున్న దే. సత్రములైన వేయించలేదా ?

చిత్ర—సత్రములలో రాళ్ళు వేయించలేదా యనియడుగుడు. ఆత డన్న దాన మెన్నడు చేయించలేదు సరిగదా ఒకడు చేయుచున్న వార్త వినుటగూడ నతని కసహ్యామే. ఈత డేడాదికి రెండుసార్లు మాత్ర మన్న దానము చేసెను. అవియెప్పుడనగా తల్లిదండ్రుల తద్దినములకు.

యమ—ఆదినములలో సంతర్పణములు చేసెనా?

చిత్ర—సంతర్పణములు కావు. పితృతర్పణములు. ఇద్దరు బ్రాహ్మణులకు భోజనము.

యమ—ధనధాన్యవస్త్రదానాదులు చేసినాడా యని వేర అడుగనక్కఱ లేదు.

చిత్ర—ఆదానములొక కొంతవరకు చేసినాడు. ఎట్లనగా, అప్పులు పుచ్చుకొన్న వారు కొంతమంది యెగబెట్టుటచేత ధనదాన ఫలము కొంత దక్కినది. చాకలివాళ్ళపహరించిన బట్టలచేత కొంత వస్త్రదాన ఫలము దక్కినది. రయితులు మక్తాలో నీయలేక మాను కొన్న ధాన్యమువల్ల ధాన్యదానము దక్కినది.

యమ—(నవ్వుచు) అట్లయిన నగలుచేయించినపుడు కంసాలి యపహరించిన స్వర్ణ లేశముచేత నితనికి స్వర్ణ దానముకూడ దక్కి యుండును. ఇతనికి దారపుత్రులున్నా రా?

చిత్ర—ఉన్నారు. వారికొక నాడైనా కడుపునిండ అన్నము
పెట్టలేదు. కట్టుకొనుటకుగుడ్డ లియ్యలేదు. వెయ్యేల! వీడు తాను
తినలేదు ఒకరికి పెట్టలేదు ఒకరినితిననియ్యలేదు.

యమ—వీనియందు జారత్వచోరత్వాది దోషములుకలవా?

చిత్ర—చోరత్వమునకు సందేహము లేదు. కాని జారత్వము
లేదు. ఎందుచేతననగా దానికై కొంతసొమ్ము వ్యయముచేయవ
యునని యావృత్తిమానుకొన్నాడేకాని కాంక్ష లేకకాదు.

యమ—పోనీ లోభత్వముచేతనైనను వీని కేకపత్నీవ్రతము
దక్కినది.

చిత్ర—ఈవిధముగా నితనికి చాల ఫలములు దక్కినవి. ఇత
పిసినిగొట్టుతనమునుగురించి పలుమాటలు చెప్పనక్కరలేదు. ఇతడ
చనిపోవుటకుముందొక మరణశాసనము వ్రాయించెను. అదిచూచి
పక్షమున వీనియౌదార్యము తేటపడగలదు.

యమ—ఏదీ ఆమరణశాసనము. ఇటువంటివాడు వ్రాయించి
నది చిత్రముగానుండకపోదు.

చిత్ర—ఇదిగో చదువుచున్నాను. వినండి. వర్తమానవ్యా
హారిక చాంద్రమాన ప్రభవనామసంవత్సర చైత్రశుద్ధపంచమి బు
వారం మధురాపుర నివాసియైన ధనగుప్తుడు తెలివితేటలతోనుమం
స్పృహతోను వ్రాయించిన మరణశాసనము-నేను వడ్డీవ్యాపారమ
చేతను మరియితరవ్యాపారములచేతను సంపాదించినరొక్కము రెండ
లక్షల యిరువదియైదువేలు. ఈసొమ్ము నాకుమారులునలుగురుసమ
నముగ పంచుకొనవలెను. ఈసొమ్ము లోకులకు నూటికి రెండుమూ
యల వడ్డీచొప్పున బదులుయిచ్చియున్నానుగనుక అబదుళ్ళుత్వరగ
యివ్వనియెడల వాళ్ళకొంపలమ్మించి చెఱసాలలకు పంపించి వసూ
కొనవలెను. నావద్ద అప్పులు పుచ్చుకొన్నవాళ్ళకు, ఒకగుడ్డిగవ

మైన నేను మానివేయుట నాకలవాటు లేదుగావున నాకొడుకులు కూడా బాకీదారులుయివ్వవలసిన సొమ్ములోనుంచి యొకదమ్మిడిమైన మానగూడదు. మానినపక్షమున వాళ్ళు పరమదుర్మార్గులై నాకు, నావంశమునకు అప్రదిష్ట తెచ్చినవారగుదురు. ఇవ్వవలసిన సొమ్ములో కొంతమానివేయుట నాయింటవంట లేనియాచారముగనుక యిదియెన్నటికిని నాకొడుకులు చేయగూడనిపని. నేను చనిపోవునట్టిసమయమునకు నాకుపూర్తిగస్పృహయున్నపక్షమున ఇల్లుమైలపడిపోకుండ నేనేయేలాగునోడేకి వీధిలో అరుగుక్రింద కూర్చుండుదును. నాకొకవేళ స్పృహలేకపోయినపక్షమున నాకొడుకులును నాభార్యానన్ను సాయముపట్టి యింక రెండుమూడుజాములకు చనిపోదుననగానే దొడ్డిలోనున్న పశువులపాకలోగాని లేక వీధియరుగుక్రింద తడికికట్టిగాని దానిలోనన్ను పండుకొనబెట్టవలసినది. అంతేకాని యిల్లు మైలపరచవద్దు నక్షత్రము మంచిదికాదని యిల్లువదిలిపెట్టవద్దు. నాదిగ్రుక్కెడు ప్రాణము. ఎక్కడపోయినను పోవచ్చును. ఇంటిలోచచ్చినవాని గొప్పయేమిటి? అరుగుక్రిందచచ్చినవాని తక్కువయేమిటి? ఇట్లెందుకు వ్రాయించుచున్నానననగా నక్షత్రము చెడ్డదైనపక్షముననిల్లువదిలిపెట్టవలెను. వదిలిపెట్టినపక్షమున మనసామానంతను తరలించుకొని మరియొకరింటికి వెళ్ళవలెను. వెళ్ళినపక్షమున మనవస్తుసామానులు మనసరుకులుచూడగానేకన్నుకట్టును. మనగుట్టూమట్టూ బయలుపడును. డబ్బిచ్చి శవవాహకులచేత నన్ను మోయించవద్దు. వాళ్ళునాలుగువరహాలో, మైదువరహాలో పుచ్చుకొందురు గనుక వాళ్ళని పిలవనే వద్దు. బంధువులుకొందరు వచ్చి ఉచితముగానే శవము మోయుదుమందురు. అదికూడ అంగీకరించవద్దు ఏలయననగా ఇట్లుచితముగా మోసినవారు మరియొకప్పుడు సాయముచేయుమని నాకొడుకులను మొగమాటపెట్టుదురు. అందుచేత నాశవమును మరియొకరిచేత మోయించక నాకొడుకులునలుగురులో పెద్దవాడు నిప్పుపుచ్చుకోగా

మిగిలినముగ్గురు కష్టపడి యేలాగో యొకలాగు మోయవలసినది. దానములు విశేషముగా ఇయ్యవద్దు ఒక్కగోదానముమాత్రము చేయవలెను. ఏలాగోయొకలాగు దానితోక దొరకబుచ్చుకొని వైతరణీనదిదాటి ఆవలపడతాను గోదానంనిమిత్తమై నేనొకగోవును జాగ్రత్తచేసియుంచినాను. అది గడ్డి యెక్కువతిని పాలు తక్కువ యిచ్చే పోటుతన్నుగల పసరమని దానిని మనయింట్లో నుంచక నేను మనకు సొమ్ముబాకీయున్న యొకగొల్లవానియొద్దకుపంపి దానిని మేపుమని చెప్పినాను. వాడుచితముగా మేపుచున్నాడు. వానినడిగి తెచ్చి ఆయావును గోదాన మీయవలెను. నగ్నప్రచ్ఛాదనమిచ్చునపుడు పట్టిమంచములు దూదిపరుపులు నియ్యక నులకమంచము, జమ్ముదూదిపరుపు, పాతయిత్తడిరేకుచెంబు యియ్యవలెను. సంతర్పణ లెప్పుడు చేయించవద్దు. నాకువైద్యముచేసినవైద్యునకు మీరేమియునియ్యనక్కర లేదు. ఏమనగా నాకుకుదర లేదు గనుకను, వేరుముక్కలతోను కషాయముతోను మందులిచ్చుటవల్ల అతనికి కర్చు లేదుగనుకను, వానికియ్యవలసిన దేమియు లేదు. రాజగోపాలస్వామివారి యాలయమున కీయవలసినదని యొకముసలమ్మ నాచేతికి నాలుగువందల రూపాయలిచ్చినది. ఈ సొమ్ము దేవునకిచ్చినపక్షమున తినువారు పూజారులేకదా, మనము దేవునిబిడ్డలమే మనము మాత్రమేల తినగూడదని యాసొమ్ము నావద్దనేయుంచి దానివడ్డీతో అప్పుడప్పుడు దేవునికి కైంకర్యములుచేయించుచుంటిని. నాకొడుకులు కూడా ఆప్రకారమే పులిహోరమీద ధ్యానముపోయినపుడు సాలుకు, ఒకరూపాయకుమించకుండా కైంకర్యము చేయింపవలెను. నాదగ్గర సొమ్ముదాచుకొన్నామని కొందరువచ్చి నాకొడుకుల నడుగవచ్చును. వారువచ్చినపుడు పత్రములు చూపించుడని నాకొడుకు లడుగవలెను. పత్రములు లేనివారికి దమ్మిడియివ్వవద్దు. పత్రములున్న

వారికి లెక్కచూచి, అంతమొత్తము నొకసారియియ్యక అప్పుడో నాలుగు అప్పుడోనాలుగు చేతిలోబెట్టి బాకీలేదనిపించవలెను. తాకట్టుమీద తనఖామీదనేగాని అప్పులీయవద్దు. నూటికి రెండు రూపాయలు తక్కువవడ్డి వేయవద్దు. తిండిక్రింద బట్టలక్రింద విశేషముగా సొమ్ము కర్చుపెట్టవద్దు చుట్టములు వచ్చినపుడుతప్ప కూరలు కొనకూడదు.

యమ—అహాహా! ఇటువంటి మరణశాసనము వ్రాసినవాడెవడు లేడు ఇతని కొడుకులు, ఇతని యాస్తినే పంచుకొన్నారా యితని గుణములగూడ పంచుకొన్నారా?

చిత్ర—ఈతని ధనము మాత్రమే కొడుకులకు సంక్రమించినది కాని గుణములు పూర్తిగా కొడుకులకు సంక్రమించలేదు.

యమ—సరే! ఈతని విషయములో వినవలసినదంతయు విన్నాము. తెలియవలసినదంతయు తెలిసినది. ఈతని నేనరకములో మనము పడవేయవలసియున్నదో యాలోచింపవలయును.

చిత్ర—మన లోకములోనున్న ప్రాతనరకము లేవియు వీనికి పనికిరావు. ఈతని కేదైన అపూర్వమైన నరకము మనము కల్పించవలయును.

యమ—ఆనరకమేదో నీవే యాలోచించి చెప్పుము.

చిత్ర—అదే యాలోచించుచున్నాను.

యమ—నీబుద్ధి కేదైన పొడకట్టినదా?

చిత్ర—ఆహా యొకటి పొడగట్టినది.

యమ—అది యేదో త్వరగాచెప్పు. నేను వినుటకు గుతూహలపడుచున్నాను.

చిత్ర—(చెవిలో యమునితో నేదో చెప్పుచున్నాడు.)

యమ—(నవ్వి) వహవ్వా! ఇది మిక్కిలి బాగున్నది. ఇంత కంటె వీనికి ఘోరమైననరకము వేరే యొకటి యక్కరలేదు. వీని యాత్మను త్వరగా భూలోకమునకు మనకింకరులచేతికిచ్చి పంపు.

చిత్ర—ఓరి కింకరులారా! ఈలోభివానియాత్మను మరల వానియింటికి గొనిపోయి కొంతకాల ముంచుడు. ఇది ధర్మరాజుగారి సెలవు.

కింక—చిత్తము.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

—౦—

రెండవ రంగము

(మధురాపురము—లోభివానియిల్లు)

[అప్పుడు లోభివానియాత్మ, యమకింకరులు ప్రవేశించుచున్నారు.]

ఆత్మ—(తనలో) ఏమిది! ఈయిల్లు నాయిల్లేనా? నేను చచ్చిపోయి యిప్పటికింకా సరిగా నెల కాలేదుగదా. ఇంతలోనే యీ యింటికింత క్రొత్తరూపేలరావలెను. పరమనిర్భాగ్యులైన నాకుమారులు పదిపదిహేనురూపాయలు కర్చుపోయి దీనికంతకు వెల్లవేయించినారు కాబోలును. అందుచేతనే దీని కీక్రొత్తకళ వచ్చినది. పాడుపోకులు నిర్భాగ్యులకు, నెలలో పదిపదిహేనురూపాయలు తగులబెట్టిన యీ నిర్భాగ్యులెన్నడైన బాగుపడుదురా? వీళ్ళు అడుక్కుతినిపోదురు. ఛీ! పరమదౌర్భాగ్యులు. గోడలు తెల్లగానుంటేనేమి నల్లగనుంటేనేమి. నేనీయింట్లో అరవయిసంవత్సరములు కాపురముచేసినాను. వెల్లవేయకుండా బ్రతికినాను. ఈగాడిదలకు యింతలోనే వెల్ల కావలసివచ్చినది. నాకడుపున యెంత నిర్భాగ్యులు పుట్టినారు. ఇదిగో ఈ గదిలో నాపెద్ద కొడుకు

కూర్చుండి యెవరితోనో మాట్లాడుచున్నాడు. నేను బ్రతికి యుండగా నావద్ద, అప్పుపుచ్చుకొన్న కాంచనవర్మ తానీయవలసిన అసలీఫాయిదాలు తెచ్చి యిచ్చుచున్నాడు. అహాహా సొమ్ముచూచి యెంతకాలమైనది. నాకన్నులిప్పుడెంత చల్లగానున్నవి. అహాహా! రూపాయల చప్పుడు విని యెంతకాలమైనది. ఏమి టామాటలేమిటి చెప్పుమా? నూటికి రూపాయవంతున వడ్డీ పుచ్చుకొమ్మని వాడు బ్రతిమాలాడుచున్నాడు. నాకొడుకేమనునోగదా? నేను నూటికి రెండు రూపాయలచొప్పున వడ్డీ వ్రాయించితిని. నాకొడుకు మెత్తబడుచున్నాడు. అయ్యో, అదిగో రూపాయికాడికి యెంచి పుచ్చుకొనుచున్నాడు. ఛీ! నిర్భాగ్యుడా ఛీ పాపాత్ముడా! ఛీ పితృద్రోహీ వీడు నాకొడుకుగాడు. అయ్యో నాసొమ్మా! అయ్యో నాధనమా! అయ్యో నాలక్ష్మి, కాళ్ళొచ్చేతులూవచ్చి యెగిరిపోవుచున్నవటే, అయ్యో నేనిది భరింపజాలను. అయ్యో! కింకరులారా నన్ను తీసికొనిపొండి అయ్యో! ఆ యమధర్మరాజు నన్నేనరకములోనైన బడివేయక యిక్కడికెందుకు పంపినాడు. ఆనరకము లన్నిటికన్న నాకిదే బాధగానున్నది ఇదే మహానరకము అయ్యో నన్ను రక్షించండి. రక్షించండి కింకరులారా, కటకటా! అదిగో నా రెండవకొడుకు గుఱ్ఱపుబండి యెక్కి వచ్చుచున్నాడు. రెండువేలు కర్చుపెట్టి బండి కొన్నాడు ఈయపాత్రునకు బండీ కావలెనా! ఈయపాత్రుడు నిష్కారణముగా నెలకు నలుబదిరూపాయల వడ్డీ పోగొట్టినాడు. ఛీ వీడి కడుపు కాలా? ఇదిగో నామూడవకొడుకు వంటయింట గూర్చుండి మామిడిపండ్లతో పిండివంటలతో భోజనము చేయుచున్నాడు.

ఆహాహా! జొన్నసంకటి గోంగూరపులుసు తినక వీడికింత సంకటమేమి? వీడాగర్భ శ్రీమంతుడా! వీడికి రుచులు కావలెనా? వీడికి మామిడిపండ్లతో భోజనమేమి. పొట్టనింపుకొనుటకై యింత

సింగారము యిన్నిరుచులు కావలెనా? ఇంత గంజికూడు చాలదా? వంద యెనిమిదిరూపాయలు పెట్టి మామిడిపండ్లా. అయ్యోయో నేనంతనిర్భాగ్యుడను. ఇదిగో నానాలుగవ కొడుకు ఓహో యేదో ధర్మకార్యము నిమిత్తము నాలుగువందలు చందా యిచ్చుచున్నాడు. నాలుగు వందలే! నాలుగువందలే చందా? నీధర్మముమండిపోను, నీ చేతులుపడిపోను, ఈలింగశరీరముతో నేనుండుటచేత వీరితో మాటలాడుటకు వీలులేదు కాని లేకపోతే, ఆచేతులు విరుగకొట్టుదును కదా? నేనుబ్రతికియుండి నాకొడుకులు నలుగురు చచ్చినయెడల నా సొమ్మంతో జాగ్రత్తగానుండి నాకొంపయెంతో బాగుపడునుకదా! అల్లా జరిగినదికాదు. దైవము ఓర్చినాడుకాదు. అయ్యోయ్యో! నేనిక్కడ నిలువజాలను, ఈయిల్లు అగ్నిహోత్రముకంటె ఎక్కువ వేడిగానున్నది. నాకొడుకులలో నొకరికైన నాగుణములబ్బినవికావు అయ్యోయ్యో! ఈగుమ్మముముందర ముష్టివేయుటకొక నౌకరునుబెట్టి బియ్యము కర్చుచేయుచున్నారు అయ్యో! ఇంటినిండ నౌకర్లు వంటలక్కలు. ఓరీ దౌర్భాగ్యపు ముండకొడుకులారా! ఇంతమంది లోకములో చచ్చిపోవుచున్నారు. మీకు చావువచ్చినది. కాదురా. సింహాపుకడుపున లేళ్ళుపుట్టినట్లు నాకడుపున మీరు పుట్టినారు కింకరులారా నన్ను గొనిపొండు నేనిక్కడ నిలువజాలను.

కింక—(తమలో) లోభివానికి తనసొమ్ము కర్చగుచుండగా చూచుటయే నరకమనుభవించుట. అందుచేతనే వీని నేనరకములోను పడవేయక వీనికొడుకులుచేయుకర్చు వీనికిచూపించినపక్షమున వీడు మహానరక మనుభవించినట్లు బాధపడునుగనుక అదియే వీనికి శిక్షయని చిత్రగిప్తుడుగారు యమధర్మరాజుగారితో రహస్యముగా సెలవిచ్చినారు. ఆదే అపూర్వనరకము. కాబట్టి మనమువీనిని యమధర్మరాజుగారి సన్నిధికి మరలతిసికొని పోగూడదు. ఇక్కడనె కొన్ని వత్సరము లుంచవలయును.

సమాప్తము.

విచిత్ర గోదాన ప్రహసనము

[అప్పుడు రామనాథుడను గ్రామాధికారి ప్రవేశించుచున్నాడు.]

రామ—(తనలో) ఈయూరికి నేను గ్రామాధికారినైనందున నన్ను జూచినను గ్రామదేవతను చూచినను ప్రజలకు సమానభయమే. గ్రామదేవతకన్న యొకవాసి నన్ను జూచినప్పుడె భయమెక్కువ. ఇంత చండశాసనుడనైన నాకు నేటికాలమునకు నిష్కారణముగ నొక రూపాయ దండుగవచ్చుచున్నది. ఈదండుగ నేనెట్లు పోగొట్టుకొందును చెపుమ ? ఈదండుగ లేకుండ చేసికొనుటయే నాప్రయోజకత్వము.

[అప్పుడు గోపినాథుడు ప్రవేశించుచున్నాడు]

గోపి—నాన్నగారూ ! ఏమిటివిచారించు చున్నారు. ఆవును గురించియేనా? ఆవు బ్రతుకదు. మెడ వాలవేసి పండుకొన్నది. పొట్ట ఉబ్బిపోయినది. చొంగల కార్చుచున్నది ఇంతకు మనకు ప్రాప్తము లేదు. ''ఋణానుబంధరూపేణ పశుపత్నిసుతాలయాః'' అన్నాడు గనుక ఋణము తీర్చుకొన్నది దానికి మనకు ఋణము చెల్లిపోయినది. విచారించకండి.

రామ—నాయనా ! గోవుకొరకు నేను విచారించుటలేదు. ఏమనగా దీనిని నేను డబ్బుపెట్టి కొనలేదు. గొల్లరంగడుగాడిని బెదరించి యుచితముగా దెచ్చినాను. దీనిమేతవిషయమై నేనొక్క డబ్బయినా యెన్నడు కర్చుచేసి యెఱుగను ఉలవలు పీరిశెట్టి నెత్తికొట్టి పుచ్చుకొన్నాను. చిట్టు తవుడు దంపుళ్ళవాళ్ళను బెదరించి లాగినాను గడ్డి రయితులమీద వంతువేసి తెచ్చినాను. ఈయావు పోయినయెడల మరియొక ఆవును రేపు ఉదయమున తేగలను.

గోపి—నాన్నగారూ! అయితే మీ కింత విచారమెందుకు పాపము గోవు బాధపడుచున్నదనియా ?

రామ—గోవుబాధ నేను చూచినానాయేమిటి. నా బాధ నే పడుచున్నాను.

గోపి—ఆబాధయేమిటో చెప్పండి. రేపటినుండి పేడనీళ్ళ ఆవుపేడయుండదని శామ్మ చాలా దుఃఖపడుచున్నది. మీ దుఃఖవ యేమిటో సెలవియ్యండి వింటాను.

రామ—ఇదిగోవిను చెప్పుచున్నాను మన మీ గ్రామము కధికారులముగుట చేతయెవరియింటనయిననుగోవు చచ్చిపోయినప్పు దానిని వెట్టివాళ్ళచేత మనము ఈడిపించినందుకు చచ్చిపోయి గోవుయొక్క యజమాని మనకొక్క రూపాయ కట్న మిచ్చు మామూలై యున్నది. గోవు మనయింటనే పోవుచుండుటచేత, మన రూపాయ యిచ్చువారెవరులేరు. చచ్చిన ప్రతి యావుకు మనకొ రూపాయవంతున రావలెనుగదా. ఈ యావుకు రావలసిన రూపా పోయినదిగదా యని నాకు మిక్కిలి విచారముగానున్నది. ఈయా పోతే పోయినదిగాని రూపాయి వచ్చేసాధనము కనబడకున్న నీబుద్ధి కేదైన పొడగట్టునేమో చూడు.

గోపి — నిజముగ నిది మనము విచారింపవలసిన విషయమే పెద్దలు తమకే తోచనపుడు, ఈయుపాయము నాకు తోచగలదా అయినను నాకీ యుపాయము తోచుచున్నది బాగున్న పక్షము మీ రుపయోగింప వచ్చును. (అని చెవిలోఁ జెప్పుచున్నాడు.)

రామ—వహవా ! భేషైన ఉపాయమురా ? నా కొడు వైనందుకు నన్ను మించినవాడవై నావురా! ''పుత్రాదిచ్ఛే త్ప జయం'' అనుమాట నీయందు సార్థకమైనదిరా ? వెంటనే పిలిపించ

కాదుకాదు. నీవే వెళ్ళి తీసికొనిరా? ఎందుకంటే చెప్పకు. నీవువచ్చే లోపున నేను స్నానముచేసి కూర్చుంటాను.

గోపి—సరే యిప్పుడే వెళ్ళివస్తాను.

(ఇద్దరు నిష్క్రమింతురు)

—౬—

రెండో రంగము

[అంతట గోపీనాధము, నరసింహదీక్షితులు ప్రవేశింతురు]

గోపీ—నరసింహదీక్షితులుగారూ ఒడ్డుమెరక పల్లముగా నున్నది. మెల్లిగా మెట్లెక్కండి. పెద్దలు. కాళ్ళు తడబడగలవు.

నర—మెల్లిగానే అడుగులు పెడుచున్నాను. భయంలేదు. కొంచెం చత్వారమన్నమాట గాని పటుత్వముతప్పలేదు. ఏరీ మీ బాబయ్యగారేరి?

గోపీ—అదిగో మడిగట్టుకొని కూర్చుండి యున్నారు. మీ నిమిత్తమే యెదురుచూచు చున్నారు.

రామ—దయచెయ్యండి నరసింహదీక్షితులుగారూ! నమోన్నమః

నర—అఖండైశ్వర్యాభివృద్ధిరస్తు, ఎందుకో సెలవయిందవ, కార్యమేమో చెప్పమంటే అబ్బాయిగారు సెలవిచ్చినారు కారు. మా మీదేదో అనుగ్రహమే అనుకుంచున్నాను.

రామ—ఈ గ్రామమంతలోను తమవంటిపెద్దలు సాధులు లేరు. తమకు గోదానము చేయవలయునని బుద్ధిపుట్టినది. తమరు స్నానముచేసి వచ్చినారా?

నర—చేసివచ్చినాను. చేసివచ్చినానండి. అహహా! ఏమితమ యోగ్యత, తమకీర్తిచంద్రప్రకాశముచ లెలోకములో వెలుగుచున్నది

గదా. సాక్షాత్తు రాములవంటివారు. దానకర్ణులు. నన్ను పోషించు చున్న ప్రభువులేమీరు. అందుకనే యింత దయ.

రామ—ఆవు దొడ్డిలో నున్నది దానిని యిక్కడికి తీసికొని రావడమెందుకు. మంత్రము చెప్పండి. ధారాదత్తము చేసెదను.

నర—అక్కరలేదండి. (అని మంత్రము చెప్పును)

రామ—(చేతిలో నీళ్ళు వదులుచున్నాడు)

నర—గోవు నొకసారి చూడనా?

రామ—చూడ నక్కరలేదు. నే నిప్పుడే మీ యింటికి పంపించెదను. మీరు వెళ్ళండి నల్లమందు వేళ యైనది.

(అందరు నిష్క్రమింతురు.)

—*—

మూడవరంగము

[నరసింహదీక్షితులు, రామనాథము ప్రవేశించుచున్నారు)

నర—రామనాథంగారూ? చిన్నమనవి. ఎందుచేతనోగాని మీరుదానము చేసిపంపినగోవు మెడవాలవేసి పడిపోయినదండీ. కడుపు వుబ్బినదికూడాను దానివాలక మెంతమాత్రము బాగుగ లేదు.

రామ—భయపడకండి కాశ్శేపటికో కూశ్శేపటికో తగ్గిపో తుంది. ఉదయమున మావాళ్ళు చిట్టు విశేషముగా పెట్టినారు. అందు చేత కడుపునొప్పివచ్చి ఆలాగున బాధపడుచున్నది, అంతియెగాని మరియొకటిగాదు. అదెంతో మంచిగోవు. పోట్లు తన్నులు లేవు.

నర—మంచి దేగానండి, అది మరణవేదన పడుచున్నట్లు తోస్తుందిగాని నాకు జబ్బువచ్చినట్లు తోచడంలేదు.

రామ—పిచ్చిమాటలాడకయ్యా వెంటనేవెళ్ళి గొల్లసుబ్బడిని పిలిచి చికిత్స చేయించండి.

నర—(తనలో) ఈమహానుభావుడేదో కుత్రమును చేసినాడు. గట్టిగా మాటాడుదామంటే గ్రామాధికారిగనుక భయము. (ప్రకాశముగా) చిత్తము ఆలాగే చేస్తాను. (అని వెళ్ళును.)

రామ—(తనలో) సరే. ఈబ్రాహ్మణునివల్ల మనకురూపాయి తప్పకుండా వస్తుంది. అబ్బాయీ గోపినాథము యిల్లారా!

గోపి—(ప్రవేశించి) ఎందుకు బాబయ్యా ?

రామ—మాదిగవాళ్ళకోసము కబురంపించు.

గోపి—ఆవు చచ్చిపోయినదా యేమిటి.

రామ—పోలేదు సిద్ధమైనది.

గోపి—పోకుండానేనా ప్రయత్నమంటాను.

రామ—నీవు వాళ్ళను పిలిపించే లోపునే పోతుంది.

గోపి—అయితే నేనేవెళ్ళి పిలుచుకొనివస్తాను. వర్తమానము పంపుటకు మనుష్యులెవ్వరూ లేరు. (అని వెళ్ళును)

(అప్పుడు విచారముతో నరసింహదీక్షితులు ప్రవేశించుచున్నాడు.)

నర—(తనలో) ఈ ముండాకొడుకు తనయింట్లో గోవుచచ్చిపోవుట కిష్టములేక చావునకు సిద్ధముగానున్న యవస్థలో దానిని నాయింటికి పంపించినాడు, నా కొంపకు వచ్చినతరువాత జామైనా బ్రతుకలేదు.

రామ—ఏమి దీక్షితులుగారూ ! ఎల్లాగున్నది గోవు ?

నర—(కన్నీరుతో) పోయిందండీ.

రామ—ఎంతసేపైనది ?

నర—ఇప్పుడిప్పుడే.

రామ—గొల్లసుబ్బిగాడిని తీసికొనివచ్చి యేమైనా వైద్యము చేయించినారా లేదా ?

నర—లేదండి. వెళ్ళవలెనని అనుకుంటూండగానే పోయినది.

రామ — (కోపముతో) ఎవడు చెప్పినాడయ్యా నీకు, ఆలస్య మమృతంవిషం అన్నమాట యెరుగవు. మాణిక్యమువంటి గోవున నిష్కారణముగా చంపివేశినావు.

నర — నేనాండి నేనాండి చంపినవాడిని. చిత్తంచిత్తం. తమర అల్లా సెలవిస్తే నేనేమి మనవి చేయను. అది నాయింట్లో గడ్డిపోచ యైన కొరక లేదు. గుక్కెడు నీళ్ళయిన త్రాగ లేదు.

రామ — తినక పోతేమాత్రం శుభ్రమైనగోవును నేనునీకుదాన మిచ్చితిని. మేతమెక్కువై దానికి కడుపునొప్పివస్తే గొల్లవాడి పావలో బేడో యివ్వవలసి వస్తుందని వైద్యము చేయించక దానిని నిష్కారణముగ చంపి యింకా మాట్లాడుతావు. ఇంత కక్కురితి బ్రాహ్మణుడవనితోస్తే దానము నీకియ్యక మరియొకరికిస్తును.

నర — ఎంతమాట యెంతిమాట. గోవు మావాకట్లో చచ్చి పోయినందుకే విచారిస్తుంటే యీ యపనిందకూడానా నామీద. గొల్లవాడిని తీసికొనివచ్చుటకైన వ్యవధిలేనిదే నేనేమిచెయ్యనండి

రామ — మీరు బ్రాహ్మణులన్నపేరేకాని పచ్చి కసాయి వంటివారు. మీకు జంతువంటే దయాదాక్షిణ్యములు లేవు.

నర — ఇంతకు నారోజులు బాగుగలేవు. మీ చిత్తమువచ్చి నన్ని అనండి. పాపము పుణ్యము పరమాత్ముడు పాలించగలడు తమరధికార్లుగదా. తమరేమన్నసరే. దాన్ని అవతల పారవేయిం చండి యేలాగో.

రామ — రూపాయ యివ్వండి పారవేయిస్తాను.

నర — (తెల్లబోయి) రూపాయా. ఇంతన్యాయ మెక్కడ నైనా యున్నదండి.

రామ — అవకతవక ప్రసంగాలు చేయకు. డొక్క బ్రద్దలు చేసేను ! అన్యాయమా ! కామధేనువునంటి గోవును చేతులార చంపి మామూలు రూపాయ యివ్వవటయ్యా.

నర—ఒక్కపూట పాలైన త్రాగలేదుగదా! రూపాయ నిష్కారణము నాకు దండుగ పెట్టించడం న్యాయమా.

రామ—మామూలు తప్పించడం న్యాయమా. ఈవేళ నీకు మానితే రేపుఊరందరికి మానవద్దా. నీకుమానుటకు నీగొప్ప యేమిటి

నర—గొప్ప యేమీలేదు. మీవాళ్లలో చచ్చిపోవలసినగోవు మావాళ్లలో చచ్చిపోయినది.

రామ—ఆమాటంటే జాగ్రత్త! తగినట్లు బుద్ధి చెప్పిస్తాను.

నర—పోనియ్యండి పెద్దవాడిని పిల్లలుగలవాడిని గనుక వదలి వెయ్యండి.

రామ—ఊరంతా పెద్దవాళ్లే. ఊరంతాపిల్లలుగలవాళ్లే.

నర—అప్పైతే యేంజెయ్యమని సెలవు.

రామ—రూపాయి తెచ్చియివ్వమని సెలవు. రెండో సెలవు లేదు.

నర—రూపాయిఉంటే వారంరోజులు నాకు నాపిల్లలకు బియ్యమువస్తాయి. నన్ను క్షమించి మానివెయ్యండి.

రామ—ఆమాటలు తీసివెయ్యండి ఇంటికివెళ్ళి రూపాయ పంపండి.

నర—(లేచి తనలో) నారాయణ నారాయణ ఇంత ఘోర కలి ఇంత దుర్మార్గము యెక్కడా లేదుగదా. వీడు రాక్షసుడుగాని మనుష్యుడు గాడు. ఇప్పుడు చెంబో ముంతో తాకట్టుపెట్టి రూపాయ వీడియదాన్ని పారవెయ్యాలి. (అని వెళ్ళబోవును)

రామ—దీక్షితులుగారు రూపాయి పంపుతారాలేదా?

నర—చిత్తము ఇప్పుడేవెళ్ళి బదులు తెచ్చి పంపుతానండి. (అని వెళ్ళును)

రామ—(తనలో) ఇక్కడకు సంకల్పసిద్ధుడనైనాను.

[అప్పుడు గోపినాథుడు ప్రవేశించును]

గోపి—బాబయ్యా మాదిగవాళ్ళు వచ్చినారు.

రామ—సరే రూపాయిపంపగానే దీక్షితులుగారింటికి వెళ్ళి దాన్ని తీసుకొనిపొమ్మను.

గోపి—ఆలాగే చేస్తాను.

(అందరు నిష్క్రమించుచున్నారు)

—*—

నాలుగవ రంగము

[యమలోకము యమధర్మరాజు, చిత్రగుప్తుడు, రామనాథము యొక్క ఆత్మ, కొందరు కింకరులు ప్రవేశము]

యమ—చిత్రగుప్తుడా వీడెవడు?

చిత్ర—దేవా! ఇతడు భూలోకములో రామనాథమను పేర బరగిన యొక బ్రాహ్మణుడు. పాపములపాడను గ్రామమున కధికారి.

యమ—వీడు చేసిన పాపపుణ్యములు చూచినావా?

చిత్ర—దేవరవారు పాపము లేయని సెలవియ్యవలెను. వీడున్న చోట పుణ్యములమాట తలపెట్టగూడదు. పాపము.

యమ—ఓరీ! నీవేమి చెప్పుకొనెదవు?

రామ—నేనడిగిన ప్రశ్నకు మీరు ముఖ్యముగా జవాబు చెప్పవలెను. నీవు పాతయముడవా కొత్తయముడవా?

చిత్ర—(తెల్లబోయి) ఇది యేమిప్రశ్నరా మూర్ఖుడా.

యమ—(ఆశ్చర్యముతో) యమలోక సృష్టియైనతరువాత ఇటువంటి ప్రశ్న వేసిన దిట్టరి యెవడు లేడు.

చిత్ర—యుగయుగంబులనుండి నేనిక్కడ నుద్యోగము చేయుచున్నానుగాని యింతవాని నెప్పుడు పొడగట్టి యెరుగను.

యమ—ఓరీ నీమాట కర్థ మేమి ?

రామ—మీ యధికారములో అన్యాయము లెక్కువ జరుగు చున్నందున మిమ్ము నుద్యోగమునుండి తీసివేసి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు క్రొత్తయమధర్మరాజు నేర్పరచినారని వినియున్నాను. అందు చేత నీవు క్రొత్తయముడవో ప్రాతయముడవో తెలియజేయవలయును. అంతవరకు మీకు విచారణచేయుట కధికారము లేదు.

చిత్ర - అందుకిప్పు డేమనిమెదవు ?

రామ—ఏమందునా ? బ్రహ్మ విష్ణు మహేశ్వరులను పిలిపించి వారియెదుట ఈయనయే నిజమైన యమధర్మరాజని ఋజువు చేయించ వలెను.

యమ—అంతవరకు నిన్ను మేము విచారింపగూడదా ?

రామ—ఎంతమాత్రము వల్లగాదు. మీరు బలవంతముగ శిక్షించిన పక్షమున అది యన్యాయపుశిక్ష యగును.

చిత్ర—(యమునితో) మన మెవ్వరిని యన్యాయముగ శిక్షింప గూడదు. కాబట్టి మనమిప్పుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులవద్దకు వెళ్ళి యీవివాదమును పరిష్కరించుటయే మంచిది.

రామ—ఏలినవా రాప్రకారముగా న్యాయము దయచేయ వలెను.

యమ—సరే! మనముముగ్గురమువారిసన్నిధికి వెళ్ళుదము రండు.

చిత్ర—వారి ముగ్గురను మన మెక్కడ చూడగలము ?

యమ—ఇప్పుడు సాయంకాలము కావచ్చినదికదా ? సాంబ మూర్తివారు ప్రదోషకాలమున కైలాసపర్వతముమీద తాండవ నృత్యము చేయుదురు. అదిచూచుటకై బ్రహ్మ విష్ణు లక్కడకు దయ చేయుదురు. అప్పుడు వారిని మన మేకముగ చూడవచ్చును. రండు. (అని పోవుచున్నారు.)

—*—

ఐయిదవ రంగము

కైలాసపర్వతము

[అప్పుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు యమధర్మరాజు చిత్రగుప్తుడు రామనాథము ప్రవేశించుచున్నారు.]

విష్ణు—యమధర్మరాజా! చిత్రగుప్తుడును ఒకపురుషుని యాత్మయు వెంబడించగా నీవిందేల వచ్చితివి? నీవేదో పనిమీదనే వచ్చినట్లు గన్పట్టుచున్నది.

బ్రహ్మ—పనిలేకుండ తనపని చెడగొట్టుకొని యితడిక్కడికేలవచ్చును?

యమ—చిత్తము పనిమీదనె వచ్చి యున్నాను. ఈ పురుషుడు మహాపాపి. వానిపాపములకై నేను శిక్షింప దలచుకోగా నీవు నిజమైన యముడవుకావు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నిన్నుద్యోగమునుండి తప్పించినారు. అది తేలువరకు నన్ను విచారణ సేయవద్దు అని పలికినాడు.

బ్రహ్మ—ఏమి వీనిసాహసము.

విష్ణు—నిన్నెవ్వరును తీసివేయలేదు.

మహే—ఈ పురుషు డపూర్వ సృష్టికర్తలాగున కనబడుచున్నాడు.

చిత్ర—వీడపూర్వసృష్టికర్తయే. వీడు చేసిన తప్పుసృష్టులు వందలకొలది గలవు.

యమ—ఓరీ వినుచున్నావా? నాయధికారము వారు తొలగించలేదట. నేనే నిన్ను విచారణ చేసెదను.

విష్ణు—ఈనిర్భాగ్యునిమాటనమ్మి నీవు పనిచెరుపుకొని యింతదూరమురావలయునా? ప్రతివాడు లేనిపోనివంక లేవో పెట్టుచుండును. నీవొక్కపూట యధికారము సేయగలవా?

యమ—అన్యాయము చేసినవాడ నగుదునేమోయను భయ మున నిట్లుచేసితిని. ఇకముందు చేయను.

రామ — (యమునితో) చిత్తము మీరే విచారణ చేయండి. (తనలో) ఇప్పుడేదైన గట్టియుపాయ మాలోచించవలెను.

యమ — చిత్రగుప్తుడా! వీనిపుణ్యపాపముల లెక్కవేసి చదువు

చిత్ర—పాపము లేగాని పుణ్యములు లేవని యిదివరకే మనవి చేసినాను. సెలవైనచో జాబితా చదివెదను.

రామ—అన్యాయము చేయవద్దు. నేనొక పుణ్యముచేసి గాను. గోదానం చేయలేదా ?

చిత్ర—ఓరీ నీగోదానంమండా! బ్రాహ్మణునియొద్ద రూపాయ రాగుటకై చచ్చిన గోవును దానముచేసినావు.

రామ—ఏదైనా గోవుదానము అగునా కాదా ?

యమ—ఛీ వీనితో వాదమెందుకు తీసికొనిపోయి మహానరక ములో పారవేయుడు.

రామ—మహాప్రభూ మనవి మనవి. చిత్తగించండి. చిత్తగిం చండి.

విష్ణు—వినుచున్నాము నీమనవి చెప్పుకో.

రామ—చిత్తగించండి మహాప్రభువులారా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులగు త్రిమూర్తులలో నొకరి దర్శనము చేసినను బ్రహ్మ హత్య గోహత్య గురుహత్య స్త్రీహత్య శిశుహత్య మొదలగు మహా పాపములు నశించి జన్మరాహిత్య మగునని పురాణములుఘోషించు చున్నవి. అట్లుండ త్రిమూర్తుల దర్శనము ఏకకాలమున జేసిన నాకు మరల నరక ముండవచ్చునా ?

బ్రహ్మ—ఇది నిజమే.

విష్ణు—వీనియుక్తి మిక్కిలి బాగున్నది.

మహే—దొంగలకు టక్కరులకు ఈవిధమైన యుక్తులు సహజమే.

చిత్ర—ఏమి సెలవు?

యమ—ఈధర్మసందేహము త్రిమూర్తులే తీర్చవలయును.

త్రిమూర్తులు—వీనికి నరకము లేదు. మోక్షమే.

చిత్ర—పరమపాపాత్ముడు తప్పించుకొనిపోయినాడు.

రామ—నా యుక్తియే యమలోకములో గూడ నాతల కాపాడినది.

బ్రహ్మ—నోరున్న తలగాచును. ఇక పోదమురండు.

(అందరు పోవుచున్నారు.)

—*—

కనకయ్యపంతులు కంతి

[అప్పుడు దామోదరయ్యగారు, గంగాధరుడుగారు ప్రవేశించుచున్నారు.]

దామో—గంగాధరుడూ నీవు చెప్పినట్లు చిన్నప్పటి రోజులే రోజులు.

గంగా—అటువంటి రోజులు మళ్ళీ మనజన్మములో రావోయి కనకయ్య పంతులుగారు చదువు చెప్పడం మనము చదువుకోడం బలే షోకుగా వుండేది కాదూ.

దామో—మన పంతులుగారు కంతి గోకుకోవడం తోనే కాలము వెళ్ళబుచ్చేవారుగాని మనకు చదువు చెప్పుటకు తీరిక లేక బాధ పడేవారు.

గంగా—(నవ్వుచు) అవును పాపము. నడుము దగ్గర నిమ్మకాయంత కంతి యుండేది, కుడిప్రక్కను పొడుము కాయంత యెడమ ప్రక్కనుపొడుముకాయంతకంతియుండుట చేత రెండుప్రక్కలను రెండు పొడుముకాయలు దోపుకొనినట్లు లోకులు భ్రమపడుచుండేవారు.

దామో—కంతి నిమ్మకాయంత కాదు. వెలగకాయకంటె పెద్దదిగానుండేది.

గంగా—కాదబ్బాయి. నిమ్మకాయకంటె పెద్దదికాదు. ఏ మాత్రమో చూపువాసి తక్కువే యనుకోవచ్చును.

దామో—సరిలే. నీవు తిన్నగా యెప్పుడూ చూచినట్టు కనబడదు.

గంగా—చూడలేదూ? బాగా చెప్పావు. కంతి పులారమెత్తినప్పుడు గోకిగోకి తన చేతులు నొప్పిపెట్టగా నాకు పెద్దగోళ్ళున్నవని నన్ను పిలిచి నాచేత గోకించుకొనేవాడు. నే నెఱగనూ ?

దామో—చాలుచాలులే. నేనుమాత్రము గోకలేదూ? ఎంతో, అసహ్యపడుచూ విధిలేక గోకపోతే చిల్లరత్రాడు పుచ్చుకొని పీపు చిట్లకొడతాడని భయముచేత ఏలాగో గోకేవాడిని. బాగా పట్టెడు కంతి. వెలగగాయకంటె ఏమాత్రమో చూపువాసి పెద్దగాని చిన్నగాదు. రెండు నిమ్మకాయలంత కంతి యుండేది.

గంగా— ఒరే నీవాదనలు మొదటినుండి యీలా అడ్డదిడ్డముగానే యుంటాయి. అంతా ఆద్వైతమే నీవాదము. యతంటే ప్రతి.

దామో—అడ్డ దిడ్డ వాదన నాదా నీదా ? ఎరగనివాడవు యెరగనట్టుండకుండా పెద్దపెద్ద కోతలు కోస్తావు. నీకోతలు నాదగ్గర పనికిరావు.

గంగా—మరే నీదగ్గర కోతలుకోస్తే పెద్ద బహుమానమొస్తుందని కోస్తున్నాను. వెధవ పేలాపన పేలకు.

రామో.—వెధవ పేలాపనా? నీవే వెధవవు పదిమాట్లు.

గంగా—నీవు వెధవన్నర వెధవవు. నోరు మూయి. చెంప కాయలు తినేవు.

దామో.—చెంపకాయలా! ఎవడురా కొట్టే వెధవ. ఎడం కాలు చెప్పు మ్చుకొని కొడతాను మళ్ళీ పేలు ఆ పేలాపన.

గంగా—కొట్టక పోతే నీవు బ్రాహ్మడవు కావు కొట్టరా. నిర్భాగ్యపు ముండాకొడకా.

దామో.—బ్రాహ్మణార్థాలు చేసి వాళ్ళుకొవ్వెక్కి- ఉన్నావు. కొవ్వుతీస్తానురా, యువతలకురా!

గంగా—నేను దొంగసాక్ష్యాలిచ్చి డబ్బు సంపాదించుకొనడం లేదు. సిగ్గుమాలిన వెధవ. కోర్టులో నలుగురూ ఛీ ఛీ యని నీ మొగము మీదా దుమ్మెత్తి పోశారు గదూ.

దామో.—నే నేమి గోడలు దుమికి చెంపకాయలు తినలేదు. పదిమంది ఆ వేళ రాత్రి మెసరిమీద ఉమ్మి వేశారో తెలుస్తూనే యుంది. మన పరువు ప్రతిష్ఠలు వేరే చెప్పకో నక్కరలేదు.

గంగా—నీ పరువు ప్రతిష్ఠలు మాత్రము మెక్కువ మండి పోయినాయా యేమిటి! నీవంశముకొద్దీ వస్తున్నాయి నోటమ్మట మాటలు.

దామో.—ఓరీ భడవా! వంశము జోలికి వెడతావురా (అని గుద్దుచున్నాడు.)

గంగా—గుద్దుతావురా తుంటరి ముండాకొడకా! (అని మరల గుద్దుచున్నాడు)

దామో.—(కరచు చున్నాడు)

గంగా—(రాయితో పన్నూడ గొట్టుచున్నాడు.)

(అప్పుడు పదిమంది చేరి వదిలించుచున్నారు.)

—*—

గంగా—(వగచ్చుచు లేచి) కుక్కముండాకొడుకు చూడండి యెల్లా కరిచాడో.

దామో—నీకన్న కుక్కయినా నయమే. నాపన్నూడగొట్టి నావు. రక్త మొస్తూంది. నే చార్జీ యిస్తాను.

గంగా—నన్ను కరిచావు. నెత్తురొస్తోంది. మనిషికాటుకు మందు లేదన్నారు. నేను చార్జీయిస్తాను. జందెములు తెంపినావు. నేను వెళ్ళి జందెములు వేసికోవాలి.

(అని నిష్క్రమించు చున్నారు.)

—౯—

రెండవ రంగము

[అప్పుడు ధామోదరుడు, సదాశివుడు ప్రవేశించు చున్నారు]

దామో—ఒరే సదాశివుడూ! ఈవిషయములో నీవు నాకు గట్టి సహాయము చేయవలెను. గంగాధరుడుగాడు చాలా పొగరెక్కి యున్నాడు. వాడి పొగరు మనమంతా కలిసి అణచివేయవలెను. నేను గంగాధరుడుమీద చార్జీ యిచ్చినాను గనుక నీవు నాతరపున సాక్ష్యం పలుకవలెను. నీఋణం నేనుంచుకొనను.

సదా—ఋణానికేం గాని మీరు సెలవిచ్చిన తరువాత మరి యెకలాగు చేస్తానా? గంగాధరుడుకూడా తనతరపు సాక్ష్యమునకు రమ్మని నన్ను చాలా మొగమాట పెట్టుచున్నాడు.

దామో—వాడ మొగమాటము మీ కేమున్నది.

సదా—అంతచేటు లేదుకాని కొంచె మున్నది. వాడి దగ్గర వెనక పదిరూపాయలు చేబదులు పుచ్చుకొన్నాను. అది యివ్వలేక పోయినాను. ఆ మొగమాటముచేత నేను వాడిమాట కడ్డుచెప్ప లేకుండా యున్నాను.

దామో — ఇంతేకదా చచ్చుసంభావన. పదిరూపాయలేక ఇదిగో ఈపదిరూపాయలు పట్టుకొని వెళ్ళి వాడిమొగాన్ని గిర త్రిప్పి పారవెయ్యి.

సదా — అమ్మయ్యా! ఈదెబ్బతో నేను స్వేచ్ఛగానుంటాం. వెధవ ఋణంచేత వాడు కనబడితే భయము వేస్తూండేది. ఇప్పు భయములేకుండా నుంటాను. (తనలో) వెధవది తెలివితక్కువచే పదిరూపాయలే బాకీయని చెప్పినాను. ఇరువది రూపాయలని చె నప్పటికి, ఈజోరుమీద పీడు పారవేశేవాడే. ఇంతేను నా నాల మీద దరిద్రదేవత కూర్చున్నది. సరే యీ కేసయేలోపుగాయిం పదిరూపాయలు పీడిదగ్గర గుంజలేకపోతానా?

దామో — నేను ప్లీడరుగారిని నడుచ్చుకుందుకు వెడతాను ఇంతలో ఆసొమ్ము వాడి కిచ్చివేసి నీవు మాయింటికిరా?

సదా — చిత్తము. (అని వెళ్ళుచున్నాడు.)

దామో — (కొంతదూరము వెళ్ళి) ఏమోయి రంగారా గారున్నారా లోపల? (అని లోపలికి వెళ్ళును.)

రంగా — ఓహో దామోదరయ్యగారా! దయచెయ్యి ఏంపనిమీద వచ్చారు?

దామో — గంగాధరుడు నన్ను పసూ్నాడగాట్టిట్టి అవమా పరచినాడు. వాడిమీద నేను చార్జీ యిచ్చినాను. మీరు నాతరఫు ప్లీడరుగా రావాలి.

రంగా — చార్జియే యిచ్చావు? డాక్టరుసర్టిఫికట్టు కావా దీనికి; తెచ్చావా?

దామో — తెచ్చాను. డాక్టరుగుమాస్తాకు అయిదురూపాయ లిచ్చి డాక్టరుగారితో మాట్లాడించి ఆయనకో పదిరూపాయలిచ్చినాను

ట్రెజెస్సరిగారికో అయిదు రూపాయిలిచ్చి మొత్తముమీద డాక్టరుసర్టి ఫికెట్టు సంపాదించినాను.

రంగా.—భేషు మంచిపని చేసినారు. అదిమంచి ఆధారము. అయితే నాకు ఫీజేమి యిస్తారు ?

దామో.—ఒక పాతికరూపాయ లిచ్చుకుంటాను.

రంగ.—(నవ్వుచు) పాతికరూపాయ లిస్తావా! పాతికరూపాయలకు వచ్చేవాళ్ళు లేరు. నూరురూపాయలకు తక్కువైతే నేను రాను. అప్రతిష్ఠకూడాను. పైగా ఒకరహస్యము చెబుతానువిను. నన్ను పెట్టుకొనుటవల్ల నీకొక లాభమున్నది. మేజిస్ట్రీటుగారు నేనూ చిన్నప్పుడొకబళ్ళో చదువుకున్నాము. నేను పట్టిన కేసంటే ఆయన సాధారణంగా కొట్టివేయడు.

దామో.—అందుకునేగాదూ నేను మీ దగ్గరకు వచ్చాను మరి. ఏదోవిధంగా నన్ననుగ్రహించండి. ఏభైరూపాయ లిచ్చుకుంటాను. దయచెయ్యండి.

రంగా.—నీవునాకు ముఖ్య స్నేహితుడవు గనుక చెపుతూన్నాను. డెబ్బదియైదురూపాయలు ముందుగాయియ్యి. కేసు నెగ్గితే తక్కిన పాతికరూపాయలు యిస్తుగాని.

దామో.—చిత్తము. సదాశివుడు మనతరుపు సాక్ష్యమునస్తానన్నాడు. వాడేం చెప్పాలండి. నిష్కారణంగా వీధమ్మట వెడుతూంటే నన్ను పిలిచి కొట్టినాడని వాడు చెపుతాడు. అది సరిపోతుందాండి.

రంగా.—సాక్ష్యానికేమి! వాళ్ళేంచెప్పాలో హీరింగునాడు నేను చెపుతాను కాదు. ఇందులో యెంతపని చెయ్యాలనుకున్నావేమిటి. అడ్డసవాళ్ళు వేసి గంగాధరుడుగాడి సాక్షులను బోనులో పెట్టి గడగడ లాడించేస్తాను. వీడి పుట్టుపూర్వోత్తరం అంతాయెత్తుకొని వస్తాను. అంతపని చెయ్యాలి.

దామో—పుట్టుపూర్వోత్తరం యెత్తవచ్చునండీ. వీడి పరువంతా కడిగెయ్యాలండి కోర్టులోపెట్టి.

రంగా—చూస్తూ యెంతపని చేస్తామో. కాని యిందులో చిన్నరహస్య మున్నది. ఈమేస్త్రీటుగాడు కక్కురితి ముండాకొడుకు. వాడి మొగాన్ని ఒక యేబదిరూపాయిలు పారేస్తివా కుక్కలాగు పనిచేసి గంగాధరుడుగాడి కొంకచుఱక తగిలిస్తాడు.

దామో—(ఆతృతతో) పుచ్చుకుంటే చూడండి పోనీ. అప్పోసప్పోచేసి పారేస్తాను. మనకు కక్షే ప్రధానం. ఏమైనా కేసు నెగ్గాలి. ఖైదౌతుందా వెధవకు ?

రంగా—ఖైదౌతుందాంటా వేమిటి. డంకామీద దెబ్బకొట్టి మరీ ఔతుంది. వాడిని బుజ్జగొరిగించి సెంట్రలు జెయిలుకు పంపించకపోతే అప్పుడను.

దామో—(సంతోషముతో) మేస్త్రీటుగారి దగ్గరకు యెవరిద్వారా వెళ్ళాలి ?

రంగా—ఎవరిద్వారా అక్కరలేదు. నేనే పట్టుకొని వెళ్ళి యిస్తాను.

దామో—సరే యికనేమి. నేను సాయంత్రం సొమ్ముపట్టుకొనివచ్చి మీకిస్తాను. ఎల్లుండి హీరింగు. ఈరాత్రియె మాట్లాడండి.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

మూడవరంగము

[అప్పుడు గంగాధరుడు, నారాయణప్ప ప్రవేశించుచున్నారు.]

గంగా—ఒరే, నారాయణప్ప! ఈవిషయములో నీవు సహాయము చేయకపోతే యికనేగంగాప్రవేశము కావలసినదే. తేల్చినా ముంచినా నీతోవున్నది నావ్యవహారము. దామోదరుడుగాడి

పొగ రణచకపోతే యికమన బ్రతుకెందుకు. గుడ్డిగవ్వ నెత్తిమీద పెడితే గుడ్డిగవ్వ చెయ్యని వెధవకంత పొగరా? కనకయ్యపంతులు కంతిమాలెత్తి నాతో పోట్లాడి నన్ను కొడతాడా.

నారా—కొట్టడమే! ఎంతమాట. చెడి బ్రతికిన ముండా కొడుకు మొదటనుంచి, నడిమంత్రపుసిరి నరముమీద పుండో యన్నారు పెద్దలు. ఈనాటికి నాలుగువేళ్లూ లోపలికి పోతున్నాయి గనుక వాడికి తల తిరిగింది. మీ శెలవేమిటి. ఏమి చెయ్యమంటే అదే చేస్తాను.

గంగా—వాడు నన్ను కొట్టిన సంగతి నీవు ఎరుగుదువుకదా. నీవు నా తరఫున సాక్ష్యము పలకాలి, ఛార్జి యిదివరకే యిచ్చి వేశాను. సాక్షుల జాబితాలో నీపేరిదివరకే వేశేశాను.

నారా—నాతో చెప్పకుండా యెందుకు వేశావు. నేనా రోజున వూళ్ళోనే లేనే?

గంగా—ఊళ్ళో ఉండడేదేమిటోయి. ఏకూత కుయ్యమంటే ఆకూత కుయ్యవలసినదేగాని రెండోజోలి నీకెందుకు?

నారా—ఆలాంటి వాణ్నేగాని హీరింగునాటికి వూళ్ళో ఉంటానో ఉండనో సందేహం. తప్పకుండా జల్లిసీమ వెళ్ళవలెను. అక్కడ దాసరి వీరాస్వామి భాగోతం వేస్తూన్నాడు. నేను కృష్ణ వేషం వెయ్యవలెను. అక్కడ నాల్గు కీర్తనలు చేయిస్తాడు. నాల్గు వరాల సొమ్ము నాకు దొరుకుతుంది. ఈ తెల్లవారగట్ల బయలుదేరి వెళ్ళిపోవలెను.

గంగా—ఓరీ వెఱ్ఱిముండాకొడుకా! ఆ భాగోతంకన్న యీ భాగోతం బాగానడుస్తుంది. ఆనాల్గు వరాలసొమ్ము నేను నీకుయివ్వ లేనా? యిదివఱకు యివ్వలేదా! ఎప్పటికప్పుడే పరగడుపా.

నారా—మఱచిపోలేదండి. ఏదో కరువుకాలంకదా. పిల్ల మేకతో గడవక చాలా వేగిపోతున్నానండి.

గంగా—ఆ నాలుగు వరాలు నేను యిస్తానులే. వుండిపో.

నారా—చిత్తం. ఆవేళ యేమి జరిగిందో సాయంకాలము నాతో చెప్పితే నేను అతికి యేలా చెప్పాలో ఆలా చెబుతాను.

గంగా—సరే నీవుయింటికి వెళ్ళి సాయంకాలము మా యింటికి రా. నేను ప్లీడరుగారి యింటికి వెళ్ళివస్తాను.

(అని కొంతదూరము నడచి)

వామనరావుగారు యింట్లోవున్నారా ?

(అని లోపలికి వెళ్ళుచున్నాడు.)

వామ—అదిగో గంగాధరుడుగారా దయచెయ్యండి. ఏం విశేషములు. మీకు దామోదరుడుకు యీమధ్య తాతా మనుమడు వరుస జరిగిందేమిటి ?

గంగా—ఆ జరిగినమాట నిజమేనండి. కనకయ్య పంతులు గారి కంతిని గురించి వాడునాతో దెబ్బలాడినాడు.

వామ—(నవ్వి) యిదేమి విపరీతమయ్యా. కనకయ్యపంతులు కంతి యెంతని మాట పట్టింపులు పెట్టుకొని చార్జీలు యిచ్చు కున్నారా ? నలుగురు నవ్వరూ.

గంగా—సరి నవ్వడానికేగాని ఎవళ్ళ పిచ్చులు వాళ్ళకే యున్నవి. మీరు నా తరపున ప్లీడరుగ రావాలి. నేనప్పుడే చార్జి యిచ్చివేసినాను.

వామ—ప్లీడరుగా రావడాని కేమిగాని, పైసాలో బ్రహ్మ దేవు డున్నాడు. డబ్బుయిస్తే వస్తాను. డబ్బిస్తే రా కేమి. మీవంటి తెలివి తక్కువవాళ్ళు యీలాంటి అవకతవక పట్టింపులు పెట్టుకొని పోట్లాడుకోకపోతే మేము బ్రతికేది యేలాగు. ఒక మహాను భావుడు చిల్లి చెంబులో భాగంనిమిత్తం అన్నగారితోపోట్లాడి వెయ్యి రూపాయిలు వ్యాజ్యాల నిమిత్తం తతగుల బెడతాడు మరియొక బుద్ధిమంతుడు బోడిగోడల నిమిత్తం బూతులాడి మూడుకోర్టులు తిరుగును. మీవంటి వాళ్ళుంటే మాకు రూపాయల పంట. మీరు రెండువందల రూపాయలివ్వండి నాకు.

గంగ — ఏమిటండి ఇంతఘోరకలి, ఈచిన్న చార్జీకి రెండు వందలా? సుబ్బారావుగారు రు 50 లకు వస్తారు.

వామ — సుబ్బారావుగారు ఏబై కిరానడమేమి! పద్మనాభ రావుగారు పాతికకే వస్తారు మరోకరు పదిరూపాయలకే వస్తారు. దామోదరుడుకి తప్పకుండా శిక్ష పడాలంటే రెండువందలిచ్చి నన్ను తీసుకొనివెళ్ళు.

గంగ — దీనికి శిక్షపడుతుందాండి జన్మానా పడుతుందా?

వామ — శిక్షపడడం చేసేవాదనలోవుంది. శిక్ష పడుతుందీ అంటే శిక్షపడి చూపిస్తుంది. అందరు వాదిస్తే పడుతుందీ? దాని యిగుమతు నేను చేస్తాను. తమాషా చూస్తుగాని.

గంగ — ఏమి యిగమతుచేస్తారో శెలవివ్వండి ఎంతసొమ్మ యినా ఖర్చు చేస్తాను. వాడికి శిక్షపడడమే నాకు కావలసినది.

వామ — వకాల్తనామా యియ్యవయ్యా! తర్వాత చెప్తాను సంగతి.

గంగ — నాప్రమాణంగా మీాకేవకాల్తానామా యిస్తాను. ఆ యిగమతు చెప్పండి సంతోషిస్తాను.

వామ — శెక్షనులో వుందయ్యా. వాడు నన్ను చంపవలెనని ప్రయత్నించినట్లు శెక్షను మార్చివేస్తాను. పైగా రెండోమార్గం మేజస్ట్రీటువారికి కొంత మేతవేస్తినా అన్నికార్యములు సప్లయి అవుతాయి.

గంగ — పుచ్చుకుంటారాండి మేజస్ట్రీటుగారు? అయితేమెంత యివ్వాలి?

వామ — ఎంతేమిటి రెండువందలకు తక్కువ పుచ్చుకోడు. ఏదో కల్లబొల్లిమాటలల్లి వాడికి శిక్షవెయ్యాలిమరి.

గంగ — సరే మీారు నూరురూపాయిలు పీజు పుచ్చుకోడానికి అంగీకరించండి. సాయంకాలం మీాఫీజు మేజస్ట్రీటుగారి ముడుపు

కూడా పట్టుకువస్తాను, అయితే యెవరిద్వారా యివ్వాలి యీ లంచము ?

వామ—ఒకరిద్వారా ఎందుకయ్యా! మేజస్ట్రీటు నేను ఒకటే శాఖవారం. కాసులపొట్లంకట్టి చేతిలోపెడుతాను. కాని నా ఫీజు చాలదు. ఇందులో ఎంతపని చెయ్యాలనుకొన్నావు.

గంగ—గెలిస్తే యింకో యాభైరూపాయి లిస్తానులెండి.

వామ—అయితే నీతరపు సాక్ష్యం బలంగావుందా? ఎవరెవరు సాక్షులు?

గంగ—సాక్ష్యానికేమి. నారాయణప్పగా డొకడు, సుందరప్ప నొకడిని వేశాను. ఇద్దరు చాలరూ?

వామ—సరే. వాళ్ళిద్దరు దిట్టమైనవాళ్ళే. సరి యిక నువ్వు వెళ్ళి రాత్రి సొమ్ము తీసుకురా.

గంగ—గట్టిపని చెయ్యాలిసుమీ. శెలవుపుచ్చుకుంటాను.

(అని వెళ్ళుచున్నాడు)

వామ—(తనలో) ఈరోజు లేచినవేళమంచిది. రెండువందల రూపాయిలు లాభము. కొంపనిమిత్తం బాకీవున్న అద్దె యీదెబ్బతో తీరిపోతుంది. వందరూపాయిలు నాఫీజు మేజస్ట్రీటుగారికి యిస్తానన్న రెండువందల్లో వందరూపాయిలు నేను పుచ్చుకుని వంద మేజస్ట్రీటు గారికిస్తాను. ఇలాంటి పేచీకోర్లు నలుగురుండి యీ మేజస్ట్రీటుగారు యింకో రెండేళ్లుంటే నెలకు నాలుగువందలచొప్పున సంపాదించ గలము. ఇంతకీ అదృష్టమేలాగుందో తెలియదు సరి కచేరీవేళ అయింది స్నానంచేస్తాను (ప్రకాశముగా) గుమాస్తాగారు. మీరు యింటికివెళ్ళి పెందలకడే భోజనము చేసిరండి.

గుమాస్తా — చిత్తం పొద్దున్నుంచి ఒక పార్టీ అయినా రాలేదండి. డస్కుదగ్గర కునికిపాట్లు పడుతూ కూర్చున్నాను. నడుము నొప్పి పెట్టుచున్నది. శెలవు పుచ్చుకొని వెడుతాను.

(అని వెళ్లుదురు)

*

నాల్గవ రంగము

మేజస్ట్రీటుగారి గృహము

[మేజస్ట్రీటుగారు, రంగారావు ప్రవేశించు చున్నారు.]

మేజ—రంగారావుగారు! ఏమి రాత్రి దయచేశారు మాకేమైనా శుభవర్తమానం తెచ్చినారా యేమిటి?

రంగా—తమ దయవుంటే శుభముల కేమి లోపం.

మేజ—ఏమిటి విశేషాలు శెల వియ్యండి? మనకిదే కొత్త కాదుకదా! మనం పూర్వపరిచయులమే కదా?

రంగా—మనవిచేస్తా. దామోదరుడు, గంగాధరుడు తగవులాడుకొని ఒకరి నొకరు కొట్టుకున్నారు. ఒకడు రాయి పుచ్చుకొని రెండవవాడి పన్నూడగొట్టినాడట. ఇంకొకడు కఱచినాడట. ఇద్దరు డాక్టరు సర్టిఫికెట్టులు పుచ్చుకొని చెరోచార్జీ పారవేశినారు. తగాదా స్వభావం మిక్కిలి విచిత్రమైనది.

మేజ—తగాదా స్వభావాని కేమి లేస్తురూ! కాకితాలుచూస్తే స్వభావమే తెలుస్తుంది. ముందు తమ రొచ్చినపని చెప్పాదురూ.

రంగా—నాకు దామోదరుడు వకాల్తనామా యిచ్చినాడు. కేసు ఎల్లుండి హీరింగు. అందుచేత తమదర్శనం నిమిత్తంవచ్చినాను.

మేజ—చల్లకువచ్చి ముంత దాచడం ఎందుకు భయంలేదు. చెప్పివెయ్యండి.

రంగా—దామోదరుడు చాలా పెద్దమనిషి. పిల్లలు కలవాడు. వాణ్ణి అక్రమంగా గంగాధరుడు కొట్టినాడు. అందుచేత గంగాధరుడుని తమరెల్లాగైనా శిక్షించి న్యాయం దయచెయ్యాలి. (అని చెయ్యిపట్టుకుని ఒక పొట్లం చేతిలో పెట్టుచున్నాడు.)

మేజ—దానికేనిలెండి (అని పొట్లం విప్పిచూచి) ఏడు పెద్ద కాసులు తెచ్చారా! ఇందులో రెండువందల రూపాయిలకు తక్కువ పుచ్చుకోవడం నాకు యిష్టంలేదు. వ్రతముచెడ్డా ఫలం దక్కాలి. గడ్డితిన్నా కాని కడుపునిండాలి. నాది కుటుంబం పెద్దది జీతంచాలదు. అందుచేత ఏదో కొంత కక్కుర్తి పడుచున్నాను. అదేనా మీరు తెచ్చి యిచ్చినప్పుడేకాని మరొకచోట చెయ్యి చాచటం లేదు. నా మనవి విని తక్కిన సొమ్ముకూడా తెప్పించండి.

రంగా—వాడు బీదవాడు. అట్టే యిచ్చుకోలేడు. ఇక్కడకే గుడ్లు మీదకివచ్చినాయి. ఏదో కష్టవచ్చిందికదా యని యింతవఱకు దిగేడుకాని సామర్థ్యంపట్టికాదు. తమరేలాగోలాగు అనుగ్రహించాలి ఏదో చంద్రుడికో నూలుపోగన్నారు.

మేజ—ఏం అనుగ్రహించడం. వెధవది డబ్బు తిన్నానని పేరున్నా చూస్తే ఏమిలేక పోవడమున్నూ.

రంగా—అల్లాగాదు. ఈ కేసు రాలేదనుకోండి మీరీ కేసులో పుచ్చుకోలేదనుకోండి.

మేజ—అనుకుంటే అన్నీ అనుకోవచ్చు సరే మీరేదో విధంగా తెచ్చేరుగనుక పుచ్చుకుంటాను. తిరిగి యిచ్చివేసినట్లయితే మీరు చిన్నబోతారు. మీరు చిన్నపోవడం నాఅభిప్రాయంకాదు.

రంగా—చిత్తం మనమిద్దరం చిన్నప్పుడొక క్లాసులో చదువుకున్నాం గనుక మీరీఅభిమానం ఉంచినారు తమరొచ్చి నప్పటినుంచి నాకింత అనుకూలముగా జరుగుతోంది.

మేజ—మీరెల్లాగో బాగుపడడం నాకు కావలశింది. మీరు బాగుంటే మేము బాగున్నట్టే.

రంగా—చిత్తం అలాటి అనుగ్రహం ఉంచవలసిందనే. ఇక నేను సెలవు తీసుకుంటా. (అని వెళ్ళుచున్నాడు.)

మేజ—(లోపలికివెళ్ళి) ఏం జేస్తూన్నావు ఇల్లారా! నీవు శ్రావణ శుక్రవారంపూజ చేసుకుంటావా?

భార్య—(ప్రవేశించి) పూజచేసుకోకేమి! కాసు యిస్తేసరి పూజ చేసుకుంటా.

మేజ—ఇదిగో ఒక కాసుగాదు. ఏడు కాసులివిగో (ఏడుకాసు లిచ్చుచున్నాడు) ఏడుసంఖ్యపనికిరాదాఏమిటి? ఒక కాసుయిల్లాయియ్యి

భార్య—డబ్బు విషయంలో ఏడుసంఖ్య పనికివస్తుంది. మరో దాల్లో పనికిరాదు.

మేజ—ఆడవాళ్ళకు డబ్బుదగ్గర నగలదగ్గర చాదస్తాలు లేవు.

భార్య—ఉండండి. ఎవరో పిలుస్తున్నారు మిమ్మల్ని.

మేజ—ఎవరువారు ? (అని సావడిలోకివచ్చి) ఓహోహో వామనరావుగారా, ఊరకరారు మహాత్ములు. ఏమిఇల్లాదయచేశారు.

వామనరావు—(ప్రవేశించి) ఊరికేనే మీదర్శనం చేయ డానికి వచ్చాను. (అని కూర్చుండును)

మేజ...(కూర్చుండి) ఏమిటి విశేషాలు. ఏలాగుంది తమ ప్రాక్టీసు ? బాగుందా !

వామ—ప్రాక్టీసు కేమిటి, ఏదో రోజు వెడుతూంది, అంత సంచులు కట్టిపడేయ్యటంలేదు. నిత్య కృత్యానికి లోపము లేదు. ఎవ రేనా తెలివితక్కువ వాళ్ళు లోకంలో వుంటే మా పని బాగా వుంటుంది. కనకయ్యపంతులు కంతి పెద్దదా చిన్నదా అని దామో దరుడు గంగాధరుడు దెబ్బలాడుకుని చార్జీ లిచ్చుకున్నారు గంగా ధరుడుగాడు నాకు వకాల్తానామా యిచ్చినాడు. ఏదో నూరు రూపా యిలు ఫీజు గుంజుకున్నాను. నెల్లాళ్ళదాకా తిండికి భయంలేదు.

మేజ—భేషు బాగావుంది. మీకొక్క కేసులో నా నెలజీతం వచ్చినది. అదృష్టవంతులయ్యా మీరు.

వామ—మీ అనుగ్రహంవుంటేనే మా అదృష్టం శోభిస్తుంది లేకపోతే గుడ్డిగవ్వకు పనికిరాదు. మీరు మాశాఖవారు, మాబంధువు లవుటచేత నాకు మాప్రాణ పోకట వచ్చింది.

మేజ—ఇదేమి చిత్రం, మీ కాపత్తేమిటి ?

వామ— ప్రతివాళ్ళు మా దగ్గరకువచ్చి మేజప్ట్రీటుగారు మీ బంధువులుకదా, మా విషయమై మీదు కొంత శిఫారసు చేస్తురూ అంటారు. చేస్తే మీకు కోపమువస్తుంది. చెయ్యకపోతే వాళ్ళకు కోపము వస్తుంది.

మేజ—ఇప్పుడెవరు మిమ్మల్ని అలాగు బాధపెట్టేది ?

వామ—ఎవరైతే ఏంలెండి, పేరెందుకు.

మేజ—భయం లేదు. చెప్పండిఫరవాలేదు. రహస్యకృత్యంలో అనుకున్నవి బయలు పెడతానా ఏమిటి ?

వామ—సరిసరి, ఎంతమాట తమరు బయలుపెడతారా! ఈ గంగాధరుడుగారే తమతో ఒకసారి మనవి చెయ్యమని నన్ను బల వంత పెట్టుచున్నాడు.

మేజ—శిఫారసు చెయ్యడానికేనా ఇపుడొచ్చారు? మేజప్ట్రీటు గారు ఊరికే శిఫారసు వింటారా అని చెప్పండి వాడితోటి.

వామ—ఊరికే వినమని నేనుమాత్రం మనవి చేస్తానా ?

మేజ—వట్టిసిఫారసు కాకపోతే మేము వింటాము.

వామ—ఊరికే గాదండి యథాశక్తిగా మంత్రపుష్పంతోనే దేవతారాధన చెయ్యవలెనని వున్నది. దేవుడైనా మంత్రపుష్పంతో వుంటేనేగాని వరం యివ్వడు.

మేజ—మనసులో వున్నది చెప్పేయండి ! భయంలేదు.

వామ—ఒక శతమానం మట్టుకు వాడు నా చేతికిచ్చినాడు తమ రనుగ్రహించి వాడికేసు నెగ్గించి దామోదరుడు పోగ రణిగిం చాలి. నేను పట్టిన కేసులు నాలుగైదు నెగ్గించేరంటే యిక నాకు పార్టీలు వస్తారు.

మేజ—శతమానంతోగాదండి. రెండు శతమానములతో కాని కాదు. అసలుపుచ్చుకోవడమే పాడుపని. పుచ్చుకున్నప్పుడు పూర్తిగా పుచ్చుకోవాలి.

వాము—పూర్తైక్కడికి. కేసు చిన్నది దెబ్బలాటకేసు.

మేజ—ఏ చిన్నకేసైనా చేతులారా అన్యాయంచెయ్యాలా! అవతల వాడికేదో చురక తగిలించాలా? ఆగాలి యీగాలి పోగుచేసి వాడు నేరస్థుడని పది దొంగకారణాలు వ్రాయాలా?

వాము—నిజమే శ్రమ చాలానే వుంది. వాడినేదో అనుగ్రహించి దీనితో సంతోష పడాలి మరో కేసులో దీనికంటె అధికంగా యిచ్చి తమరిని సంతోష పెడతాను.

మేజ—మీరు నాకు ముఖ్య బంధువులు. సమాన శాఖవారు అగుటచేత మీరు బలవంత పెడితే నేను పుచ్చుకోవలసి వచ్చింది కాని లేకపోతే పుచ్చుకొవలసిన పనిగాదు. ఇదివర కెప్పుడు చెయ్యి చాచిన వాడను గాను. వెధవది యీమధ్య మా కుఱ్ఱవాడి చదువు చెన్నపట్టణంలో చదువుకోడం. దానికి ఖర్చుచేత ఏదో కొంచెం మెత్తపడ్డాను. సర్కారు జీతం తింటూ యీపని చెయ్యటం నాకెంతో సిగ్గుగా వుంది.

వాము—నిజమేనండి. బి. ఏ. బి. ఎల్. ప్యాసుఅయి వెధవది లంచా లిప్పించడం నాకు మాత్రం ఏంప్రతిష్ఠ. పొట్ట జరగక ఏదో యీలా చేస్తున్నాము. వెధవదని నాకుమాత్రం తెలియదూ.

మేజ—నిజమే శలవు పుచ్చుకుంటా. ప్రొద్దుపోయింది. మీరు కూడా వెళ్ళండి.

వాము—చిత్తం వెళ్ళుచున్నాను (అని మేజస్ట్రీటు చేతికి నూరు రూపాయిల పొట్లంయిచ్చి వెళ్ళును)

మేజ—(లోపలికి వెళ్ళి) ఏంజేస్తూన్నావు? నిద్రపోతూన్నావు? అప్పుడే నిద్ర. ఇదుగో ఈ నూరు రూపాయలు బీరువాలో పెట్టు.

భార్య—ఇదేమిటి ఫిర్యాది ముద్దాయి లిద్దరిదగ్గర పుచ్చుకున్నారా ఏమిటి కొంపతవ్వి?

మేజ—ఊఁ నీకేమి తెలుసు? రూపాయిలుతీస్తూ పుచ్చుకోవడం యిద్దరిదగ్గర తీసుకున్నాను. దీనిలోఏలా తీర్పుచెపుతానో అదే చిత్రం చూద్దుగాని.

భార్య— ఒకడిదగ్గరనుంచిలంచము పుచ్చుకుంటేనే అపాయం వుంది. రెండోవాడు కోపంచేత పైయధికార్లకు తెలియజేయవచ్చు. ఇద్దరిదగ్గర తీసుకుంటే ఎవ్వడూ చెయ్యాడు.

మేజ -- రెండుపార్టీలదగ్గరి తీసికొంటేనే గడుసునాడి లక్షణం దాచు. పద. నిద్రవస్తూవుంది. పడుకుంటాను.

—*—

ఆయిదవరంగము

[మేజస్ట్రీటు, రంగారావు, వామనరావు, దామోదరయ్య. గంగాధరుడు ప్రవేశించుచున్నారు.]

మేజ—ఇక్కడికి సాక్ష్యవిచారణ అయిపోయినది. ప్లీడర్లిద్దరు చేయవలసిన వాదములుకూడ చేసివేశినారు. కేసు సమాప్తమయిపోయినది.

రంగా—తీర్పెప్పుడు శెలవిస్తారు?

మేజ—రేపు చెప్తాను తీర్పు.

దామో—(రహస్యముగా రంగారావు చెవులో) తీర్పేమి చేస్తాడని మీ అభిప్రాయమండీ?

రంగా—(రహస్యముగా) ఏంచేస్తాడంటావేమిటి. వాడికి చుఱక తగిలిస్తాడు చూస్తూవుండు.

వామ— రేపు మేమంతా రామాండి.

మేజ—మీ యిష్టమైతే రండి. ఇందుకైతే రానక్కర లేదు.

గంగా—(వామనరావు చెవులో) మనతరఫు తీర్పవుతుందాండి.

వామ—(మెల్లగా) సందేహమేమిటయ్యా వాడు జెయిల్లో పడి మట్టితట్టలు మోస్తాడు. చూస్తూఉండు. కేసు యెంత ఘనఘనంగా నడిపేనని నీయభిప్రాయం! చూడు దేబిముండాకొడుకులాగ దామోధరుండు మెల్లా చూస్తూన్నాడో చూడు వాడికర్మం కాలింది, చూడు. కత్తివాటేసినా మొగాన్ని నెత్తురు లేదు.

దామో (రంగారావుతో మెల్లగా) ఏమిటండి! వామనరావు గారున్నూ గంగాధరుడున్నూ గుసగుసలాడుతూ ఖులాసాగావున్నారు.

వామ—(మెల్లగా) ఏడవలేక నవ్వుతూన్నారు. రేపుమధ్యాహ్నం తెలుస్తుంది వీడిపస. అగ్రహారప్రవేశం చేయిస్తాను వీణ్ణి.

మేజ—బంట్రోతు! దుమ్ములపిల్లి కేసు పిల్వావోయి.

ప్లీడర్లు—మేము శలవుపుచ్చుకుంటామండి.

(అని నిష్క్రమింతురు.)

—*—

ఆరవ రంగము

[రంగారావు, దామోదరుడు ప్రవేశించుచున్నారు.]

రంగా ఏమయ్యోయి తీర్పు చెప్పేడా?

దామో—(విచారముతో) ఏమితీర్పయ్యా వీడమ్మకడుపు కాలా కేసు తగలేసి వదలిపెట్టాడు.

రంగా—ఏమి ఏంజేసేడేమిటి?

దామో— ఏమిజేసేడని చెప్పను బాబూ! మాయిద్దరికి చెరి అయిదు రూపాయలు జుర్మానా వేశాడు.

రంగా—నీకుకూడ వేశాడా జుర్మానా. ఏంఆశ్చర్యం. వాడిని తప్పకుండా ఖైదులోకిపంపిస్తాడని, నీవిషయమై బాగా రాసి నిన్ను వదలిపెట్టేస్తాడని అనుకున్నాను. ఇంతవిపరీతంగా చేశేడేమిటి. డబ్బు చ్చుకూడా యింత ద్రోహం చేశేడేమిటి. ఛీ, ఛీ, ఛీ బొత్తిగా నీతిలేదు.

దామో—ఇంత అన్యాయమెక్కడచూడ లేదండి. జుర్మానా వేసినవాడు మనదగ్గరసొమ్మెందుకు పుచ్చుకోవాలి? విశ్వాసఘాతుక ముండాకొడుకండి వీడు లంచగొండివాళ్ళకి నీతుంటుందా? అయితే యింతకుసొమ్ము వాడికిముట్టిందా? సొమ్ము వాడిచేతిలోనే బెట్టేరా!

రంగా—సరిసరి. ఏడుకాసులు తీసుకువెళ్లి పొట్లంకట్టి వాడి చేతిలో బెట్టేనయ్యా ఇదొకటికూడానా?

దామో—మీ మాటలు నేనమ్మనయ్యా బాబు. ప్లీడర్లు మైరావణులు. డబ్బు ముట్టియుంటే నాకు యిల్లా జుర్మానా వేస్తాడా యేమిటి? వాడికిపిచ్చా యేమిటి.

రంగా—నే ప్రమాణంచేసి చెబుతానయ్యా సొమ్ము నేపట్టుకు వెళ్లి యిచ్చాను.

దామో—ప్రమాణాలు గిమాణాలు నాకు జాంతానై. అయిందేమిటో అయిపోయింది. నేను నోరుమూసుకు కూర్చుంటాను. నాప్రాలుద్ధము ఇంతకన్న నేననుకోవలసిన దేమీ లేదు.

రంగా—నేను చెప్పవలసిన దేముంది. ఇది నమ్మకముమీద వెళ్ళవలసినదిగాని యింకొకటికాదు. లంచముయిప్పించడమనే నీచపు పనికి వొడబడినందుకు నాకు శాస్తి కావలసినందే.

దామో—మీకుకాదు, నాకయింది శాస్తి, ప్రాయశ్చిత్తము.

(అనిపోవుచున్నాడు.)

—ర—

ఏడవ రంగము

[వామనరావు గంగాధరుడు ప్రవేశించుచున్నారు]

వామ—గంగాధరుడుగారు! ఈమాయయేమిటో నాకు తెలియకుండా వున్నది. మేజస్ట్రీటు మీకు రు 5 లు దామోదరుడుకు రు 5 లు జుర్మానా వేశినాడట.

గంగా—అయ్యో నాఖర్మం కాలా. ఆ ముండాకొడుకుని రు 5 లుతో వదలివేయడం కాకుండా నాకు రు 5 లు జుర్మానా వేశాడా. ఎక్కడేనా వుందా. అయిన కాడికి రు 200 లు మింగి నాకొంప తీస్తాడా?

వామ—కేకలెయ్యకయ్యా బాబు. అల్లరిచెయ్యకు. చెప్పు తుంటే తంటా.

గంగా-అల్లరి చేస్తానా మరీఅల్లరి చేస్తానా. ఇంతద్రోహమా ఈవూళ్ళో యీమేజస్ట్రీటుగాడిని ఏకియేకి వదలిపెడుతా నుండండి.

వామ—అప్రదిష్ట. పైగా మనము చిక్కులలో పడడం కూడా వస్తుంది. నోరుమూసుకో.

గంగా—కొంప తాకట్టుపెట్టి రెండువందలు తీసుకువచ్చి వీడి మెదాన్ని పోశానయ్యా బాబు! నాకడుపు రవులుకుపోతూంది.

వామ—రాత్రి నేవెళ్ళి మేజస్ట్రీటుగారిని కనుక్కొస్తాగాని నా పరువుకూడా తీసెయ్యకు.

(అని నిష్క్రమిస్తూన్నాడు)

—*—

ఎనిమిదవరంగము

[మేజస్ట్రీటుగారి యిల్లు మేజస్ట్రీటు, వామనరావు, ప్రవేశించుచున్నారు]

వామ—తమరీలాగున చేసినందుకు గంగాధరుడు చాలా యేడుస్తూన్నాడు.

మేజ—గంగాధరుడుమీద నేరం చాలా రుజువైనది. వాడికి ఖైదు వెయ్యవలసినది. ఈలంచ మిచ్చాబట్టి రు 5 లు జుర్మానా వేసి వాడిపరువు కాపాడినాను.

వామ—దామోదరుడుకు శిక్ష వెయ్యలేదేమి ?

మేజ— వాడిమీాదేమి రుజువుకాలేదు. అయినప్పటికి యీ మొహమోటంచేతనే రు 5 లు చురుకు తగిలించినాను.

వామ—ఏమైనా వాడు చాలా యేడుస్తూన్నాడు పాపము.

మేజ— ఏడిస్తే నేనేమి చెయ్యను.

[అప్పుడు రంగారావుగారు ప్రవేశించుచున్నారు]

వామ — నేను శలవుపుచ్చుకుంటాను. (అని వెళ్లును)

రంగా-ఏమండి, దామోదరుడుకు కూడా రు 5 లు జుర్మానా వేశి పైగా గంగాధరుడుని చులాగ్గా వదలివేశారు?

మేజ —దామోదరుడిమీాద కేసు బాగా ముకర్దమూగా రుజువైనది. వాడికి ఖైదు వెయ్యకుండా రు 5 లుతో వదలివేశాను. గంగాధరుడు మీాద కేసు రుజువుకాలేదు. అయినప్పటికి వీడు యేడ్చి పోతాడని వాడికికూడా చురక వేశినాను.

రంగా—డబ్బుపోయి జుర్మానాపడిందని వాడు యేడుస్తు న్నాడు.

మేజ—ఏడవనియ్యండి వెధవలని. కనకయ్యపంతులు కంటి పెద్దదా చిన్నదా అని పోట్లాడుకుని కోర్టుకెక్కిన వెధవలు యేడవ వలసిందే. ఇప్పటికైనా బుద్ధివస్తే మంచిది.

రంగా—చిత్తం నేశలవు పుచ్చుకుంటాను.

మేజ—మంచిది.

రంగా—(వెళ్లును)

మేజ—ఏంజేస్తూన్నావు విన్నావా కేసు చమత్కారం?

భార్య—మీ చమత్కార మంతా నే గోడప్రక్కనుంచి వింటూన్నాను. ఉభయులదగ్గర పుచ్చుకున్నందుకు ఉభయులకు బరువు లేకుండా ఉభయులకు వాతబెట్టునట్లుగా తీర్పు జేసినారు. మీ టక్కరి తనం బాగావుంది. ఎంత టక్కరితనం వున్నా ఎప్పుడో అప్పుడు గోతులో పడక మానరు.

మేజ—పడ్డప్పుడు చూతాము లెద్దు. ఈ టక్కరితనం లేక పోతే నీకు కంటెలు కాసులుపేరు యేలావస్తాయి ? జీతం భోజనానికే సరిగదా. పదపద భోజనమునకు వేళ అయింది.

(అని వెళ్ళుదురు.)

లండను సంకల్పము.

మహాజనులారా! సోషల్, రిలిజియస్ రిఫారము లెల్ల యెడ లను వ్యాపించుచుండు నిక్కాలంబున నైతము తమకింక పట్లు వద లని పూర్వాచారపరాయణ శ్రోత్రియ కర్మిష్ఠులనేకులు కలరు. అట్టి వారు కార్యావసరములలో రాజధానియగు లండను నగరమున కేగ వలసి వచ్చెనేని కర్మభూమి కాకుండుటచే వెళ్ళక మానుచున్నామని యందురు. వారి కా సంశయ మక్కరలేదు. లండనుకు వెళ్ళినను అక్కడ థేమ్సునదియందు స్నాన మాచరించుచో పఠించదగు సంకల్ప మీ క్రింద వివరించితిమి.

ఆచమనము—లండన్ వేస్వాహా - జూళసేస్వాహా-కె ౧ స్త వేస్వాహా-ఇంగ్లండ్-స్కాట్లండ్ - ఐర్లండ్ తత్సైక్షోర్వరేణ్యం - జుహోవా దే వశ్యదీమహి - ధీయో యోనః ప్రచోదయాత్ - మమ

ఉపాత్త ధనవ్యయ ద్వారా-కాంటినెంటల్ టూర్ - సంప్రాప్త్యర్థం-సమ్యగశిక్షితాంగేయ భాషా సంశయనివారణార్థం-హేట్బూట్రౌష ప్రముఖ వివిధ వేషసంధారణౌత్కంఠాపరిపూర్త్యర్థం-పల్లీగ్రామేణతాసంజనితా, అనాగరికతా నివృత్తిసిద్ధ్యర్థం - టేబిలూపరిసోపానత్కవ చోష్ణీషాదివేష చిరప్రార్థిత భోజన మనోరథసంపాదనార్థం-భూమేః, పూర్వగోళార్ధే, మూరష్లండే, రష్యా, జర్మనీ, ఫ్రాన్సు, స్పైన్, పోర్చుగల్, ఇటలీ, నార్వే, స్వీడనేత్యాది మహాదేశానాం పశ్చిమప్రాంతే-చతుస్సముద్రముద్రిత గ్రేటు బ్రిటన్నామక మహాద్వీపే-ఛవియట్పర్వతస్య దక్షిణదిగ్భాగే-వేల్సుదేశస్యాగ్నేయభాగే బ్రిస్టలుకాల్యాయాః ప్రాగ్దేశే-మహానాగరిక ప్రదేశే - సెంట్పాల్సు కతీడ్రల్ వెస్టుమినిస్టరబ్బేత్యాది మహాదేవాలయవిరాజితే - హైడ్పార్కు, గ్రీన్పార్కు రీజంటుపార్కు నామకమహోద్యాన విభూషితే టవర్బ్రిడ్జి,లండన్ బ్రిడ్జివెస్టుమినిస్టర్బ్రిడ్జినామక, బ్రిడ్జిత్రయ విచిత్రితే-ట్రాఫాల్గర్ స్క్వేరంతస్థిత నెల్సన్సుమాన్యుమెంటిత్యాది మహాద్భుతస్థలాలంకృతేభూమ్యంతర్గంగమ్యమానదూమశకటమార్గమహాద్భుతే గ్యాస్లైట్ ఎలక్ట్రిక్లైట్నామక దీపావళీ దేదీప్యమానే-ఆర్చిబిషపాఫ్లండన్నామక మహారుష్యాశ్రమస్థల పవిత్రితే-సేవాయహోటల్ప్రాంతె,హౌసెస్సాఫ్పార్లమెంటుతీర్థే-క్లియోపాట్రస్ నీడిల్సన్నిధాపురోహితీభూత, తోమసుక్కెండ్సన్నామక థేమ్సుపుత్రసదావలంబితే-సదాసన్నిహితాగ్నిహోత్రే - శ్రీమల్లండన్నామక మహాక్షేత్రే-అస్మిన్వర్తమానవ్యవహారికఫాల్గుణమాసేన - క్రీస్తోరనంతరంవింశతితమశతాబ్దవత్సరేమాసే...దినే, తత్కాలసమ్మిళితనానాదేశ సమాగతానేకధూమ నౌకాస్థంభ సంభారసంభృత వైదేశికారణ్యభ్రాంతి మహాపథ్యాం-అఖండథేమ్సునద్యాం వీరభద్రశర్మాహం జ్ఞానస్నానం కరిష్యే.

అద్భుతసంతర్పణ ప్రహసనము

మొదటిరంగము

[అప్పుడు కేశవభట్టు, నారాయణ సోమయాజి, మాధవశర్మ, గోవిందశాస్త్రి ప్రవేశించుచున్నారు.]

కేశ—ఒరే సోమయాజులు! ఓరి శర్మ, ఓరి శాస్త్రి, యీవేళ మనమంతా నక్కను త్రొక్కి వచ్చినాము. మనమంతా గంగాపుత్రుల మయినందుకు గంగకు మనమీద చాలా దయయున్నది. ఈవేళ పెద్ద గొడ్డే పడినది.

నారా—ఎక్కడరోయి బాబూ, చెప్పు చెప్పు. ఈమధ్య నాలుగుమూడు దినములనుండి చచ్చుముండాకొడుకు లేగాని తీర్థవాసులలో గొప్పవా డెవడు లేడు. ఈవేళ గొప్పవాడొచ్చాడని నీవు చెప్పిన మాటవల్ల ప్రాణము లేచివచ్చినది.

మాధ—ఎవ డావచ్చినవాడు, తూర్పువాడా, హైదరాబాదు వాడా?

గోవిం—మారువాడీ అనుకుంటాను. సత్రములో యెవరో గొప్పమారువాడీ వచ్చి బసచేశాడట.

కేశ—గోవిందు డప్పుడే జాడకట్టేడు, మారువాడీ వాడే, వీడు కోటీశ్వరుడట, హైదరాబాదునుండి వచ్చినాడు.

నారా—స్నానం చేశాడా?

కేశ—స్నానమయినది. ఇప్పుడే చేయించివచ్చాను.

మాధ—ఏమిచ్చాడురా స్నానము చేయించినందుకు?

కేశ—నాకో పెద్దకాసిచ్చాడు. చేరిన బ్రాహ్మణులకు తలొక రూపాయ యిచ్చినాడు.

మాధ—మాకు కబురంపించావు కావేమిరా? సంభావన మాకేది.

కేశ—ఇంత పెందలకడే స్నానము చేస్తాడనుకోలేదు. లేక పోతే వత్తును. నాపెద్దకాసులో ఒక్కొక్కడికి నాలుగవవంతు భాగము రానేవస్తుందికదా. పైగా గంగాపుత్రులింకా ముగ్గురున్నారని ఆయనతో మనవిచేసినాను. మధ్యాహ్నము మీసంభావన యిస్తానన్నాడు.

నారా—నీవుసాధారణముగా వదిలిపెడతావు. వీలుగా నున్నంత గుంజుతావుగాని.

మాధ—ఇంతేనా వాడివల్ల మనకేమైనా లబ్ధియున్నదా ?

కేశ— లేకపోతే పెద్దగోడ్డుపడిందని యెందుకంటాను. చెప్పేది వినండి! ఏభైమంది బ్రాహ్మణులకు సంతర్పణచేయించుమన్నాడు. ముప్పైయైదురూపాయలు నాచేతికిచ్చినాడు.

నారా—(గుండెకొట్టుకొని) ఏభైమందికి ముప్పైయైదు రూపాయలిచ్చాడురా? ఆరివీడిభక్తికూలా. బ్రాహ్మణులచేత బంగారము తినిపిస్తాడాయేమిటి! నూటికి మంచి సంతర్పణకు యిరవది రూపాయలు చాలును. ఏభైమందికి పదిరూపాయలే చాలును.

మాధ—ఒరేవాడు త్తరాదివాడురా. విస్తరి రూపాయచేసే టట్టు భోజనంపెడతాడు.

గోవిం—రూపాయా! విస్తరి వరహాకూడా చేస్తుంది. మన వైపు భోజనమా వెధవతోటకూరా దొగ్గలికూరతోను.

కేశ—అవును, అల్లాగే చెప్పాడు. నాలుగుపిండివంటలుండా లన్నాడు. చీనాలడ్డు అమృతజిలాబి బాదంహల్వా క్షీరాన్నం చేయించుమన్నాడు ఇంకా బ్రాహ్మలు పైనైతే వాళ్ళని వెళ్ళ గొట్టక అన్నం పెట్టుమన్నాడు. పైసొమ్ముగూడా యిస్తానన్నాడు. భోజనంచేసిన బ్రాహ్మణులను తనదగ్గరకు తీసికొని రమ్మన్నాడు. వాళ్ళకు సంభావన కూడా యిస్తాడట.

నారా—సరే యిక కర్తవ్యమేమిటి ?

కేశ—ముందుపనేమున్నది మనమామూలుప్రక్రియచేద్దాము

మాధ—సంతర్పణ చెయ్యకుండా చేశాననడమే.

గోవిం—బాగుండదురా. పదిరూపాయలు కర్చుపెట్టి మామూలు సంతర్పణైనా చేదాము అంతా దొబ్బేస్తే అల్లరవుతుందేమో యని భయం.

కేశ—ఓరి పిరికిసెధవా! నోరుమూయరా. నీవు మాకు శనిసెధవవు వెనకాలుండి దిగలాగుతావు శకునపక్షిలాగ యెప్పుడు అశుభమే పలుకుతుంటావు, సంతర్పణా లేదు, గింతర్పణా లేదు. ఈ ముప్పదియైదు పంచుకుందాము. ఇంకొక్కయాభై మందికికూడా పెట్టామని చెప్పి మరొక యిరువైయైదురూపాయలు పుచ్చుకుందాము. మన జట్టు బ్రాహ్మలొక యేబదియరవదిమంది ఉన్నారుకదా. వాళ్ళకు కబురంపించు. వాళ్ళకు సంభావన యిప్పింతాము, వాళ్ళు భోజనము చేశామని సంతర్పణ బాగాయున్నదని ఆ మారువాడితో మాత్రము చెప్పవలెను. ఏమేమి పదార్థములు తిన్నారని యెుకవేళ మారువాడీ యడిగితే అవిమాత్రము వాడితో తొణుకు బెణుకు లేకుండా చెప్పగలందులకై కూరలు పదార్థాలు పాఠము చెప్పించు.

నారా—మనవాళ్ళందులో గట్టివాళ్ళే. వేరేపాఠము చెప్పనక్కఅలేదు. చూపిస్తే అందుకుపోతారు ముండాకొడుకులు.

మాధ—అయితే వీళ్ళందరికి తలొకరూపాయ ఆయన సంభావన యిస్తాడుగదా ఈసంభావన వాళ్ళకుచితముగా మనముయిప్పించినందుకు రుసుముక్రింద ఒక్కొక్కడిదగ్గర మన మర్ధరూపాయయైనా యూడెయ్యాల. ఇది మనకు మామూలేగాదూ.

గోవిం—మామూలేగాని దురాశదుఃఖానకుచేటు. ఈరుసుము పుచ్చుకోవడంచేత కడుపుమండి యేముండాకొడుకుబయలు పెడతాడో యని నాకు భయం.

కేశ—నీభయం మండిపోయిరి, అక్కుపక్షి వెధవా. ఎప్పుడూ ాలాగే హడులుతూంటావు. ఈవేళ మొత్తముమీద మనము ర రూపాయలు కళ్ళజూడాలి. నలుగురము నాలుగు పాతికలు ముకోవాలి. వెనక నాగపూరునుంచివచ్చిన తాగాజీయనే మారు ీవద్ద యిల్లాచేసి మనమంత తలోపది పంచుకోలేదటరా ?

మాధ—సరే కానీరా బాదలేదు. ఇదో లెక్కా యేమిటి కు.

గోవిం—గంగాపుత్రులమంటే మనమే గంగాపుత్రులముకాని యొకరు కారురా !

నారా—ఓరే యీవేళ నే నిక్కడకు వస్తూండగా పునిస్త్రీ ంచు యెదురుగుండా వచ్చినదిరా ! నేనప్పుడే యనుకొన్నాను దో లాభముంటుందని.

కేశ—సరే మనమంతా తలోమూలకువెళ్ళి తలో పదిమంది ాహ్మణులను కొట్టుకువద్దాము. వాళ్ళందరు భోజనము చేశామని ుదివాడీతో చెప్పవలెను. ఆబ్రాహ్మలిని యొక్కొకరిని యజమాని రకు వెళ్ళనియ్యకండి మీ రెవరైనా యుంటెకాని—

మాధ— సరే.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

—♦—

రెండవరంగము

ప్పుడు మాధవశర్మ పదిమంది బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు)

మాధ—ఒరే ! కొండుభట్టు ! రామావధానులూ సుబ్బన్న క్షతులు మీ రందఱు భోజనముచేశామని చెప్పాలి. పిండివంటల స్త జ్ఞాపకమున్నాయా ?

కొండు——జ్ఞాపకము లేకేమయ్యా! ఇందాకటినుంచి వీళ్ళందరిని కూర్చుండ పెట్టిపాఠము చెప్పినాను. చిన్నప్పటినుంచి.అలవాటైనపని. ఇంతలో దేలిపోతారా మనవాళ్ళు!

మాధ——రండినాతోగూడ అదిగో మారువాడీ తివాసీమీద పరుపు పరుపుమీద జముఖానా వేసికొని మహారాజులాకూర్చున్నాడు.

[అప్పుడు మారువాడీ ప్రవేశించు చున్నాడు]

మారు——రాండి. రాండి. కూచోండి. భోజన్ అయింది.

కొండు——చిత్తం. చిత్తం. అహహా, ఏమిభోజనం. ఏమి భోజనం. ఇటువంటి భోజనం మా జన్మమెత్తిన తరువాత నెన్నడు చేయ లేదు. విస్తరి వరహా కిమ్మతుగదా. మీ వంటి ధర్మాత్ము లీ దేశ మెప్పుడురాలేదు. ఇంత వైభవంగా సంతర్పణ మెన్నడు చేయ లేదు.

మాధ——బ్రాహ్మణులు మరి యేబైమంది అయినారండిఇంకో ముప్పదైదు రూపాయలు కూడా అయినవి. అవి తమరుదయచేయించాలి.

మారు——పహవ! బ్రాహ్మణ్ భోజన్ కు ఎంతఅయింది అంత యిస్తాం. అందుకు భయంలేదు. భక్ష్యం ఏమేమి చేసినార్?

కొండు——లడ్డూవుండలు చేయించారు.ఏమిరుచిగావున్నాయి. ఏమిరుచిగా వున్నాయి.

గిట్టి——కేసరిభాతు అమృతజిలేబీ చేయించారండి. మా పసందుగా వున్నాయి.

మారు——ఒకరు లడ్డూఅంటారు ఒకరు కేసరిభాతు. అమృత జిలేబీ అంటారు యిందులో యేది చేయించారు?

మాధ——(తనలో) ఈ ముండాకొడుకులు జ్ఞాపకము లేకతప్పు దారిని పడ్డారు. కొంపమునుగుతున్నది (ప్రకాశముగా) చిత్తము

కొందఱు బ్రాహ్మణులు లడ్డూకావాలంటే అవి యివికూడా చేయించానండి.

మారు—సరే. అందుకే ఖర్చు ఎక్కువాలయింది.

[అప్పుడు నారాయణసోమయాజులు పదిమంది బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు]

మారు—రాంజీ. బొమ్మన్ జీ. లడ్డూవుండ బాగుందా?

నారా—లడ్డూ చేయించండేనాండి తమరు వద్దని చెప్పారు గనుక మానేశాను.

మారు—అరే! ఆయన లడ్డూ చేయించానంటే మీరు లేదంటారేమి? ఏమయ్యా! జూటా మాటా చెప్పావునూకు.

మాధ—చిత్తం. చిత్తం. జూటాకాదండి. అదిచేయించి కావాలన్న బ్రాహ్మలికి మాత్రమే వేశామండి. జూటాకాదు.

మారు—అరే! మీ మాటలు షూస్తే మాకు సందేహం వస్తావుంది. (అని నారాయణ సోమయాజులతో వచ్చిన బ్రాహ్మణులనుచూచి) మీరు యేంభక్ష్యం తిన్నారుస్వామీ!

ఒకడు—బొబ్బట్లు పూరీలు చేయించారండి. మహారుచిగానున్నాయి మహాబాగున్నాయి.

నారా—(తనలో) వీళ్ళమ్మకడుపుకాలా వీళ్ళు జ్ఞాపకము లేక తగలేస్తూన్నారు.

మాధ—(తనలో) కొంప మునిగి పోయింది. పరాభవము జరుగుతుంది.

మారు—(ఆశ్చర్యముతో) అరే ఇదేమిచిత్రమయ్యా, మీరు తమాషా బ్రాహ్మలు ఒకరుచెప్పినమాట ఒకరు చెప్పరేమిటి ఒకడు లడ్డూఅంటాడు. ఇంకొకడు బొబ్బట్లంటాడు. ఇంకొకడుపూరీఅంటాడు మీరు షూస్తే దొంగల్లాకనపడుతారు. మీరు సంతర్పణచెయ్య లేదని

తోస్తూంది. నేను కాశి గయా హరిద్వార్ గోకుల్ బృందావన్ వెళ్ళినాను. అక్కడ గంగా పుత్రులున్నారు. ఇంతనీచం ఇంతా మోసం ఎక్కడా లేదు. ఇంతాజూటబొమ్మ్గా మన దేశంలో లేరు. తూ నామర్దా బామ్నల్ మీర్ అరేమీ మోగంషూ స్తే పాపంవస్తుంది. మాసు డబ్బు దొబ్బడానికి దొంగటక్కరు వేసినారు మీరు మీ పని పట్టించవాలా కాని ఊర్కోకూడదు. మీరు అందరినీ యీలాగే మోసం చేస్తార్ అరే కోర్నె జవాన్ కాలేఖాన్ అబ్దుల్ ఖాదర్ ఇదరావురే.

కాలే—క్యా హుకుంజీ

మారు—అరే పోలీస్కూ బులావ్

కాలే—జీ (అని వెళ్ళును)

మాధ—(భయముచేత వణుకుచు) చిత్తం చిత్తం క్షమించాలి. క్షమించాలి. మారువాడిగారూ బుద్ధిపొరబాటొచ్చింది క్షమించాలి.

నారా—మారువాడిగారూ రక్షించండిరక్షించండి. ఇకెప్పుడూ బుద్ధిపొరబాటుపని చెయ్యరు.

మారు—అరే మీబుద్ధి కుక్కబుద్ధి ఇప్పుడీలాగంటార్ రేపు కొంపల్ తీస్తార్. ఈలాగున మీ రెంతమందినిఁ మోసంచేశారో అన్నం పెట్టకుండా పెట్టామని కడుపుల్కాల్చి ఆబద్దాల్ చెప్పి డబ్బు సంపాదిస్తార్ మీరు. కపడ్దార్ !

మాధ—(చేతులుపట్టుకొని) బుద్ధినేరక చేసినామండి, యిక ఎప్పుడూ చెయ్యం. మీరే తల్లి తండ్రి.

మారు—ఛీ. నన్ను ముట్టుకోకు. కుక్కా ముట్టుకోవచ్చు పందిన్ ముట్టుకోవచ్చు కాని నిన్ను ముట్కోకూడదు. మీరు బామ్నల్. అని చెప్తే నామర్దా.

నారా—ఇదివరకు యెప్పుడూ చెయ్యలేదండి. అందుచేత ప్రథమతప్పిదంక్రింద క్షమించాలి.

మారు— నేనుకాదు. పోలీసువారు క్షమిస్తారు మీకు అరే అబ్దుల్ ఖాదర్! ఆ పెద్ద గంగాభట్ ఉన్నాడే కేశవభట్ ఆయ న్గారిని తీస్కురా. అయన్నికూడా పోలీస్కు అప్పగించాలి.

మాధ—తమ సొమ్ము తమకు దాఖల్ చేసుకుంటాము. రక్షించండి.

మారు—సరే యేభై మంది అయినారు. ఇంకా ముప్పైవైదు రూపాయల్ ఇమ్మన్నావు కాదువోయి నీవు! మీకు పోలీసువారు మేశ్రీటు బుద్ధిసెప్పాలి. పోలీసురానీ.

—*—

మూడవరంగము

[మారువాడి, పోలీసు హెడ్డు, ఒకకనిస్టేబిలు, నారాయణ సోమయాజులు, మాధవశర్మ ప్రవేశించుచున్నారు.]

మారు—రాండి, హెడ్డుగారు దయచెయ్యండి! ఈ బ్రాహ్మలు సంతర్పణచేస్తామని నాదగ్గర ముప్పైవైదు రూపాయలు పుచ్చుకొని ఆరూపాయిలు హరించినారు పట్టుకొనిదరియాప్తు చెయ్యండి.

హెడ్డు—ఓ! ఈబ్రాహలా వీళ్ళు బద్మాషీలు. వీళ్ళందరికి టోపీలు పెడుతున్నారు. రండి నాతోకూడారండి బ్రాహ్మలు!

మారు—ఈబ్రహ్మల్ జట్టుకి మేళనాయకుడున్నాడు. వాడిపేరు కేశవభట్. వాడికి పట్టుకోండి.

హెడ్డు—చిత్తం, వీళ్ళందరికి బుద్ధిచెప్పిస్తా.

మారు—ఈబ్రాహ్మలంతా భోజనం పెట్టలేదని సాక్షులు వీళ్ళనికూడా దీస్కుపోండి.

హెడ్డు—చిత్తము, రండయ్యా అందరురండి!

(అప్పుడు మారువాడీ తప్ప తక్కినవారునడుచుచున్నారు)

హెడ్డు—(కొంతదూరము వెళ్ళినతరువాత) ఎక్కడయ్యా కేశవాభట్టు యిల్లు, చూపించండి?

నారా—చిత్తం చిత్తం. ఆకనపడే వెలగచెట్టున్న యిల్లేనండి

మాధ—అడుగోనండి యీలాగేవస్తూన్నాడు.

హెడ్డు—రానీయండి వెతకక్కర లేకుండా వెంటనేదొరకినాడు

(అప్పుడు కేశవభట్టు చేతులతో నాలుగుపొట్లములు పుచ్చుకొని ప్రవేశించుచున్నాడు.)

కేశ—(తనలో) ఇది యేమిటి చెపుమా! పోలీసువారు బ్రాహ్మలని వెంటబెట్టుకొనివస్తూన్నారు. మననారాయణుడు మాధవుడుకూడాయున్నారేయిందులో.

హెడ్డు—(సమీపించి) ఏమండి కేశవభట్టుగారు తమరెక్కడికి వెళుచున్నారు? ఆచేతిలోనిది యేమిటి?

కేశ చిత్తం చిత్తం. ఈవేళ మారువాడీయొకరు సంతర్పణ చేయించినాడండి. ఆసంతర్పణప్రసాదం తనకు పెట్టుమని నాతో చెప్పినాడు. అందుకని ఆపిండివంటలు పొట్లాలుకట్టి పట్టుకొని వెళ్ళుచున్నాను.

హెడ్డు—సంతర్పణ యెక్కడచేయించినారండీ తమరు?

కేశ — ఘంటసాలవారి సత్రములో చేయించినామండి. వందమంది బ్రాహ్మణ్యాం లేచినారు.

హెడ్డు—అల్లాగునటండి! ఇవన్నీ అక్కడ చేయించిన పిండివంట లేనాండి?

కేశ—(తెల్లబోయి) చిత్తం చిత్తం అవేనండి?

హెడ్డు—మీటక్కరితనం బయలు పడినది. మీరు సంతర్పణ చెయ్యకుండా డబ్బుదొబ్బినారని చార్జీవచ్చినది పదస్టేషన్కుపద.

కనిస్టేబిలు—ఏమయ్యా బ్రాహ్మడా! ఇందాకా కొండయ్య కొటులో నాలుగణాలిచ్చి నాలుగుపొట్లాలు కట్టించలేదూ? ఇదిసంతర్పణలో పొట్లాలేయని మారుపాడికిచ్చి మోసంచేస్తావా? తుంటరి పదస్టేషనుకు పద

హెడ్డు—మీకందరికి బుద్ధిచెప్పితేనే కాని బొత్తిగా అన్యాయముగానున్నది. ఇంతఘోరకలా! సంతర్పణకనిడబ్బి స్తేదొబ్బేస్తారయ్యా మీరు?

కేశ—ఆసంతర్పణ చెయ్యలేదని మీకెవరు చెప్పారు? నేను సంతర్పణ చేసినాను.

హెడ్డు—అబ్బా తెగనీలు గెక్కువగానున్నదే. తీసికొని వెళ్ళి యీాయనను స్టేషనులో లాకపు చెయ్యవోయి కనిస్టేబిలు.

నారా—హెడ్డుగారూమావాడు తెలివితక్కువవాడు. తొందరపడ్డాడు. తమరనుగ్రహించాలి.

మాధ—ఓరీ కేశవుడూ మనగుట్టు బట్టబయలైనది. నీవాట్టే బుకాయించక వారికాళ్ళట్టుకో. లేకపోతే తరణోపాయము లేదు మనకు.

కేశ - నావల్ల పొరబాటొచ్చింది. తమరు రక్షించాలి.

హెడ్డు—మేమెక్కడరక్షించకలమండిమిమ్మలిని! మీరుగొప్ప బ్రాహ్మలు. సంతర్పణ చేయించినవారు.

నారా—తమరలాంటే యెల్లాగండి మరి. తమరుక్షామందులు

కని—మాధవశర్మగారూ! యిలా దయచెయ్యండి. (అని కొంచెముదూరము తీసికొనిపోయి) ఏమయ్యా! హెడ్డుగారి కేమైనా యింత పారేయ్యండి. లేకపోతే స్టేషనులో కూర్చుండపెడుతాడు.

మాధ—ఏమిమ్మంటారో చెప్పు?

కని—ఏదో మీలోమీ రాలోచించుకొని చెప్పండి.

మాధ—ఓరే నారాయణ సోమయాజులు, ఓరే కేశవభట్టు, మీరిద్ద రిలారండి. మాట చెపుతాను.

నారా—ఎందుకు ?

కేశవ—ఇదిగో వస్తున్నాను.

మాధ—ఒరే మనము మా చెడ్డచిక్కులలో పడిపోయి నామురా. సూస్తుండగా గోతిలో దిగినాము. పైగా అప్రతిష్టపాలై నాం. ఈ హేడ్డుముండాకొడుకు కర్కోటకుడు. తీసికొనివెళ్ళి కొట్టులో పెట్టినా అప్రతిష్టకూడాను. కాబట్టి యేదైనా యిచ్చి వీడిని వదలించు కొందాము పట్టు.

కేశ—ఏమిమ్మన్నావు చెప్పు ?

నారా—మారువాడీదగ్గర మనముపుచ్చుకొన్న ముప్పై యైదు రూపాయలు వీడికి పారవెయ్యి. ఆ ప్రాచిద్రవ్యము మనకువద్దు.

కేశ—ఆ ! ముప్పైయైదు రూపాయిలిస్తానేమి ?

నారా—ఇవ్వకపోతే కొట్టులోకూరగ్చో. నీమూలాని మేము కూడా చస్తూన్నాము.

మాధ—బాబూ నామాటవిందూ ఇచ్చేస్తూ.

కేశ—సరే మీయిష్టమువచ్చినట్లు తగలెయ్యండి.

మాధ—కనిస్టేబులుగారూ యిల్లా దయచెయ్యండి.

కని—(సమీపించి) ఎందుకు ? ఏదైనకుదిర్చారా ?

మాధ—ఇదిగోమారువాడిదగ్గర మేముపుచ్చుకొన్న ముప్పై యైదురూపాయలు మీకిస్తాము. పుచ్చుకొని మమ్మలిని కరుణించండి.

కని—సరే హెడ్డుగారితో ఆలామనవిచేస్తాను. (అని హెడ్డు దగ్గరకు వెళ్ళి మాటలాడి తిరిగివచ్చి) అయ్యా! హెడ్డుగారు వప్పుకో నంటున్నారండి వ్రతంచెడ్డా ఫలందక్కాలి అంటున్నారు. ఈముప్పై

యైదూగాక నలుగురు నాలుగైదులిరువయి రూపాయ లిస్తే వప్పుకుంటారట.

కేశ — ఏమైనా సరేకాని నేనొక్కదమ్మిడీ యియ్యను.

కని — అసలీవ్యవహార మింతమట్టుకు ముదిరిందినీమూలాన్నే. నీవు బుకాయించకపోతే ఆయనకింత కోపము రాకపోదు.

మాధ — నీయమ్మకడుపుకాలా వప్పుకోరా! కొంపమునిగి పోతున్నది. గంగలో దింపినవాడివే నీవు.

నారా — అయ్యా! వాడియ్యకపోతే నేనిచ్చుకుంటానుగాని వ్యవహారము సొసాయించండి.

కని — సరే. పట్టుకువచ్చి యియ్యండి. మేమిక్కడుంటాము

(అప్పుడు నలుగురు యిండ్లకువెళ్ళి సొమ్ము తెచ్చి యిచ్చుచున్నారు)

హెడ్డు — (సొమ్ముపుచ్చుకొని కనిస్టేబులుతో) ఈవేళ మా మంచి వాడుపొచ్చింది. ఈపిరికి బాపనోళ్ళు గోతులో పడ్డారు.

కని — ఈవేళ మనము నక్కనుతొక్కి వచ్చాము.

(అందరు నిష్క్రమించుచున్నారు)

—*—

వింతవిందు

[అప్పుడు రైలుబండీదిగి భగవంతరావుగారు ప్రవేశించుచున్నారు)

భగవం — (తనలో) ఇది క్రొత్తగ్రామము. ఈవూళ్ళో యెవరి మొగం నే నెఱుగను. ఎక్కడికిపోయి బసచేయుదును చెపుమా? అయినా యీస్టేషనుదాటి వెళ్ళేటప్పటికి యెవరితోనైనా కాస్తపరిచయం కలగకపోతుందా. (అని నడచుచున్నాడు)

[అప్పుడు సదాశివరావు నీలకంఠయ్య అను నిద్దరు కాఫీహోటలు యజమానులు ప్రవేశించుచున్నారు)

సదా—అయ్యరువాళ్ ఇంగెరాయ్యా ఇంగిరా

భగవం-(తనలో) ఎవరో పిలుచుచున్నారు. (ప్రకాశముగ) ఎవరయ్యా నీవు?

సదా—నాను కాఫీహోటల్ పంతులు. మాహోటల్కు రా అయ్యా.

నీలం—అయ్యా. మాకొట్టుకు రండయ్యా.

భగవం—నీవెవరు?

నీల—నేనుకూడా కాఫీహోటలు యజమానుడనే,

భగవం—నీవు తెలుగువాడవు. ఆయన అరవవాడునా? సరే బాగున్నది.

సదా—నా హోటల్కు రాఅయ్యా! నల్లయిడ్లి నల్లకాపీ నల్ల ఉపమా.

భగవం—నల్లకాపీ యేమిటి? నల్లయిడ్లీ యేమిటి ?

సదా—నల్లఅంటే మననోరుండ్లే. ఆనోర్కి లోపల వేస్తే రంబరంబ రుచిగా వుంటుంది,

నీల—అయ్యా. మాహోటలులో పులిహోర, మినపరొట్టె బొబ్బట్లు, పూరీలు సమస్తము వున్నాయి. మీరు తప్పక మా హోటలుకే దయచెయ్యాలి.

సదా—నాహోటల్కు రా అయ్యా!

నీల—అరే నాహోటలుకు వచ్చేవారిని నీవు తీసుకపోతావే మోయి!

సదా—అరే పోడాముట్టాడా. నేను సూస్తిని వాడిని మొదల,

నీల—ఆయన చాలా పెద్దమనిషి. వాడినిగీడిని అంటావేమిటి నోరు సంబాళించుకో. నీవు మొదట చూడడమేమిటి. నేనే. చూశాను.

సదా—అరే నీవు తప్పుడువాడివిరా. నేను సూస్తే నీవు సూశావు?

నీల—అట్టేపేలకు. చెప్పుదెబ్బలు తినేవు.

సదా—అరెపోడా. చెప్పుదెబ్బలు ఎవుండిద కొడతావునీవు. నీపై చార్జీయిస్తా.

నీల—నీదిక్కున్నచోట చెప్పుకో పో. రండయ్యా (అని చెయ్యి పట్టుకొను చున్నాడు.)

సదా—అయ్యరువాళ్! మీరు సూస్తున్నారుగదా వీడికూత పోలీసువాళ్ళకు తునుక్రేస్.

నీల—నీశొళ్ళుగాలా నీయిష్టము వచ్చినచోట చెప్పుకోరా?

భగవం—మీపుణ్యమయిరి మీరిక్కడ కొట్టుకోకండి, నేను మధ్యను సాక్ష్యమురా లేక చావాలి.

నీల—తమరు మాయింటికి దయచేస్తురూ, సాక్ష్యము అక్కర లేదు గీక్ష్యము అక్కరలేదు. అరవవాడివంట తమకు సపిపడదు కూడాను.

భగవం-సరే పదండి మీయింటికేవస్తా. ఎక్కడ మీయిల్లు?

నీల—ఇదిగోనండి ఆ కనబడే బంగాళా. దయచెయ్యండి. తమ మాటయుంటే యిలా యియ్యండి పట్టుకువస్తాను.

భగవం—బాబు! మీరు బ్రాహ్మలు. మీచేత మూట మోయించనా!

నీల—పరవాలేదు. ఇల్లాయిప్పించండి.

భగవం-(తనలో) రైలుదగ్గరనుంచి యీమూట మోయుట కెవడైనా రెండబ్బులు పుచ్చుకుంటాడు, అది అక్కరలేకుండా సమకూడినది.

(అని యిచ్చుచున్నాడు)

[కొంత నడచి యిద్దరు యిల్లు ప్రవేశించుచున్నారు]

నీల—తమరీకుర్చిమీద దయచెయ్యండి పంతులుగారు.

భగవం—సరే (అని కూర్చున్నాడు)

నీల—తమ కేమి కావాలి కాఫీవుంది. ఉపమావుంది. యిడ్డెన యుంది. పులిహోర బొబ్బట్లు బాదముహల్వా యేమికావలస్తె అవి యున్నాయి.

భగవం—అన్నీ కూడా తీసుకురండి.

నీల—(అన్నివస్తువులు తెచ్చి యెదుట పెట్టుచున్నాడు)

భగవం—(ఒక అరగంటసేపు కూర్చుండి అన్నివస్తువులు హాయిగ తినుచున్నాడు.

నీల—చాలునాండి యింకేమైనా పెట్టించినా? సోడావుంది కావలెనా?

భగవం—సోడా అక్కర లేదండి. కాఫీ తాగినాను గనుక యిక దాహము లేదు.

నీల—వస్తువులన్నీ బాగున్నాయాండి?

భగవం—ఓ. చాలాబాగున్నాయండి. ఇటువంటివస్తువు లెప్పుడు నేను తినలేదు.

నీల—(తనలో) మొత్తము ఎంతయినదో లోపలకువెళ్ళి లెక్క వేసికొని వస్తాను. (అని లోనికి పోవును)

భగవం—(తనలో) కడుపు పూర్తిగా నిండినది. సాయం కాలముదాకా భోజనముకూడా అక్కర లేదు. ఇక మనదారిని మనము వెళ్ళవచ్చును.

(అని మూటపుచ్చుకొని వెళ్ళుచున్నాడు)

నీల—(వచ్చిచూచి) అరే. ఏడీ ఈయన (అని తొందరతో వీధిలోనికి వచ్చి) వెళ్ళిపోవుచున్నాడు. వెళ్ళిపోవుచున్నాడు. ఏమం

డోయి పంతులుగారూ పంతులుగారూ ఓమూటపట్టుకువెళ్ళే పంతులు గారూ.

భగవం—(వినిపించుకొనక) గొంతుకు బద్దలయ్యేటట్టు చించుకో ముండాకొడకా. (అని విసురుగా నడచుచున్నాడు)

నీల—(వెనుక పరిగెత్తిపోయి వగర్చుకొనుచు) ఏమిటండీ పిలుస్తూంటే పలకరేం?

భగవం—నన్నా పిలుస్త మీరు? ఎవరినో అనుకున్నాను. ఎందుకుపిలిచారు?

నీల—ఎందుకంటా రేమిటి సొమ్మియ్యకుండా వెడతా రేమి

భగవం—సొమ్మెందుకు?

నీల—మీరిప్పుడు మాహోటలులోతిన్న వస్తువులకు.

భగవం—ఏమి చిత్రమయిన మనుష్యులయ్యా మీరు? సొమ్ముకా మీరు నాకిప్పు డీవస్తువులు పెట్టినది. ఊరికేనే మీరు ధర్మసత్రం వేశారనుకొన్నాను.

నీల—సత్రంవేశానని యెల్లా అనుకుంటారయ్యా! మాహోట లుకు రండంటే మా హోటలుకు రండని నేనును సదాశివరావు దెబ్బలాడుకొంటేమి.

భగవం—అవన్నీ నాకు తెలియవు. డబ్బులుచ్చుకు..టానని నీవు నాతో చెప్పలేదు. ఆషరతు మనకు జరుగలేదు.

నీల—ఆషరతు జరుగనిమాట నిజమే. వచ్చేవాళ్ళతో ముందు షరతులు మాట్లాడుతామా మేము?

భగవం—మాట్లాడకపో తేయియ్యవలసిన రూలెక్కడున్నది.

నీల—అయితే యెగపెడతావా?

భగవం—ఎగబెట్టడమేటి యియ్యవలసినఅవసరమేలేనప్పుడు

నీల—(నోరు బాదుకొనుచు) అయ్యో అన్యాయమా అయ్యో అన్యాయమా. ఇంత పచ్చిఘోరకలి యున్నదా. చూడం

డయ్యా చూడండి యీచిత్రం. పైగా మహాడబ్బిచ్చీవాడిలాగే అన్ని వస్తువులూ చెడతిన్నాడండి.

భగవం—నీయిష్టమువచ్చినట్టు నెత్తినోరు బాదుకో! నీయిష్టము వచ్చినట్టు తిట్టుకో గింజుకో చావు. నేనొక్క దమ్మిడీగవ్వ లిచ్చే వాడిని కాను.

నీల—నారాయణ! నారాయణ! యింతపాపమెక్కడా చూడ లేదండి. పదణాల డబ్బులు పోయినాయి. సదాశివరావుగాడూ నేనూ మాలోమాకు కలిసికట్టుతనంలేక పోటీలుపడి దెబ్బలాడు కొన్నందుకు నాకు తగినశాస్తి జరిగినది. ఇకెప్పుడూ పోటీలకు వెళ్ళ గూడదు. బుద్ధివచ్చింది.

(అని యేడ్చుచు పోవును.)

భగవం—(తనలో) ఈలాటి వెధవలు నూరుమందయినారు. ఈరోజుకు అవసరం తీరిందిగదా. రేపు యింకోవూళ్ళో టోపీవేస్తాం.

(అని పోవుచున్నాడు)

—*—

పి శా చ వి లా స ము

మొ గ టి ర ం గ ము

[అప్పుడు దయ్యాలదాసు ప్రవేశించుచున్నాడు.]

దాసు—(తనలో) అన్నివిద్యలలోకి నావిద్య బాగున్నది కచే రీకి వెళ్ళనక్కరలేదు. అంగరకాలు తలగుడ్డలు ధరించనక్కరలేదు. ఒకడిఆజ్ఞలో నుండనక్కఱలేదు. ఎవడికి లోబడియుండనక్కఱలేదు.

ఏమిఅక్కఱలేకుండానె నెలకొక తహసిల్ దారు జీతము సంపాదించు చున్నాను. పైత్యభ్రమగల నిర్భాగ్యులు లోకములో ఉన్నంత కాలము నాఆట సాగుతుంది. నేను దయ్యాలమంత్రగాడిననే బిరుదు నాకుంటుంది. చేతిలో ఖంగుఖంగుమని కావలసినన్ని రూపాయలు పడతాయి. నాకుంకుమబొట్టు, నాయెఱ్ఱగుడ్లు, నాగడ్డము మీసములు చూచినవారు నన్ను తప్పక దయ్యాలమంత్రగాడనుకొందురు ఈ గ్రామములో వేషము సాగినన్నాళ్ళు ఇక్కడ వేస్తాను. తరువాత ముందూరు తలాయిస్తాను. అదిగో! యెవడో వస్తూన్నాడు. సత్యసూరి గాబోలు! వీడి తలపండువగలా వీడొకడు నాకిక్కడ పోగైనాడు. దయ్యములున్నవని. వాటిని నేను వదులుస్తానని, నేనిక్కడ కోతలు కోస్తాంటే దయ్యాలులేవు మొర్రోయని వీడు బయలుదేరినాడు. వీడు నాకూట్లో మట్టిపోస్తాడో యేమిటో, అయినా యీలాంటి అవకతవకవాళ్ళ నెందరిని తకాయించినాను కాను.

[అంతట సత్యసూరి ప్రవేశించుచున్నాడు.]

సూరి—దాసుగారూ! నమస్కారము.

దాసు—దయచెయ్యండి. భోజనమయినదా?

సూరి—ఆహా! తమదయవల్ల. మఱి నామాటేమి చేశారు?

దాసు—మీ మాటేమిటి?

సూరి—దయ్యాలను నాకు చూపించడంమాట. నాకోరిక మొదటినుండి అదేకాదూ.

దాసు—నీవు మాచెడ్డతగాయిదా మనిషివయ్యా. దయ్యాలని చూపించడమంటే సామాన్య మనుకున్నారా యేమిటి పిశాచాలిని మీరు చూడగలరా. పేగు సాగిపోతుందే! మీరు మూర్ఛపోతారు చూస్తే.

సూరి—నేను మూర్ఛపోను, నాకేమి భయము లేదు. నేనర్థ రాత్రివేళ అనేక పరియాయములు శ్మశానంలోకి వెళ్ళాను. వాళ్ళు జల్లుమనై నా అనలేదు.

దాసు—మీరు శ్మశానమునకు వెళ్ళినప్పుడు మీకు కన బడక పోనచ్చును. కాని నే నిప్పు డావాహన చేశానంటే చెట్లు మీదనుంశి కొండముచ్చులు దిగినట్టుగా చింపిరి తలలు బానకడు పులు వంకర కాళ్ళు నిప్పుల గ్రుడ్లు దాకపిడత నోళ్ళు చేటచెవులు వేసికొని దయ్యాలు వందలు వేలు లక్షలు మీయెదురువచ్చినుంచుని తెయ్యిమని ఆడుతాయి. అప్పుడు గాబరాయెత్తి కలరాజాడ్యము వచ్చినవాడులాగ నీవు సకల అభస్మారము అవుతావు. చచ్చిపోతావు. నాకు మరో సందేహ మేమీ లేదుగాని నీవు స్వచ్ఛమైన బ్రాహ్మ డవు. నీవునామూలాన్ని చచ్చిపోతే నీ పెళ్లాము బిడ్డలు నా కోసము యేడుస్తారే, ఏలా చూపించను వీడికి దయ్యాలు ? అని సందేహిస్తూ న్నాను.

సూరి—ఆలాటి సందేహము మీకక్కర లేదు. నా పెళ్ళాము బిడ్డలు మీ ప్రాణానికి యేడవరు. నాదిపూచీ.

దాసు—వాళ్ళు యేడవకపోవడానికి నీపూచీ యేమిటయ్యా నీవు చచ్చిపోతే వాళ్ళేడవరా యేమిటి. ఒకవేళ యేడవరనుకో. నేను వేదశాస్త్రాలు చదువుకొని యింతవాడనై చూస్తూ చూస్తూ బ్రహ్మహత్య చెయ్యనా ? బ్రహ్మహత్యకంటె పాతకమున్నదా ? నాచేతులతోనే నెల్లా చెయ్యనటువంటిపని.

సూరి—ఇందులో బ్రహ్మహత్య యేమున్నదయ్యా.

దాసు—నీవు బ్రాహ్మడవు. నిన్ను చంపితే బ్రహ్మహత్య కాదటయ్యా.

సూరి—నాకోరికమీద చేస్తావు. అందులో పాతక మేమి.

దాసు—చంపుమని కోరితేమాత్రం చంపవచ్చునా ? అది యేలాగైనా బ్రహ్మహత్యే.

సూరి—మీయంతట మీరుచంపితే తప్పు పాతకంరాదు.

దాసు—సరె పాతకం రాదనుకో ! మీరు చచ్చిపోతే నాకు మరో చిక్కొస్తుందే.

సూరి—ఆచిక్కేమిటి. మీబుద్ధికుశలతకొద్దీ చిక్కులు వందల కొలది మీకు తోస్తున్నాయి.

దాసు—ఆచిక్కేమిటో చెపుతావిను. అది అన్నిటికన్నా గొప్పది. నీవు చచ్చిపోతే పోలీసువారు వచ్చి నన్ను పట్టుకుంటారు కోర్టులో వేస్తారు. ఇన్నాళ్లూ బ్రతికి యింటి వెనకాల చచ్చేరా యన్నట్లు చివరకు నీమూలాన్ని ఖైదులో పడనా ?

సూరి—మీరు ఖైదులో పడితే వదిలించుకోవడం మీ చేత కాదా ?

దాసు—చేతగాకేమి, నాలుగు దయ్యాలను పిలిచి మాట లాడినానంటే అర్థరాత్రివేళవచ్చి కావలియున్న జవానులకు నాలుగు కర్రుకిచ్చి చప్పుడుకాకుండా తలుపులు పగులగొట్టి ఖైదులోనుంచి నన్ను వదిలించి నన్ను యెత్తుకు తీసుకొనివెళ్ళి మాయింట్లో పరుపు మీద పడుకోపెట్టకలవు. అయితే అంతపనెందుకని. దేశమల్లా గోల యిపోతుంది. పైగా ఖైదులో పడ్డానన్నమాటే అప్రతిష్ట నాకు.

సూరి—వెంటనే వదిలివచ్చినప్పుడు అప్రతిష్ట యేముంటుంది?

దాసు—వదిలించుకురాగానేఆమరునాడు ప్రొద్దున్నేఖైదులో పెడతారు. నేను ఖైదులోనికి వెళ్ళడం దయ్యాలు వదిలించడంయిదే పనా? ఇదిగాక యింకో గొప్పచిక్కుంది చూడండి. నేను ఖైదులో పడితే లోకాని కపకారం. ఏమంటే యిప్పుడు దయ్యాలుపట్టి బాధ పడేవాళ్ళ కందరికి నేను వాటిని వదిల్చి ఉపకారము చేస్తూన్నాను

నేను లేకపోతే వాటిని వదిల్చేవాడుండడు. ఎన్నికుటుంబాలకో హాని కలుగుతుంది. అదిగాక నేను గొప్పమంత్రగాడి నగుటచేత దయ్యాలాట్టే పేట్రేగి మనుష్యులమీద పడుటలేదు. నేను ఖైదులోపడితే అవి పేట్రేగి మనుష్యులమీద పడి లోకమును నాశనం చేస్తాయి. అందుచేత నేను ఖైదులో పడడం యిష్టంలేదు.

సూరి—అలాగైతే మీరు ఖైదులో పడకుండాయుండే యుపాయం నేను చెపుతా వినండి. దయ్యాలపరీక్ష నిమిత్తం నాఅంతట నేనే దయ్యాలని చూపించమన్నానని మీతప్పులేదని నేను స్వదస్తూరీతో ఉత్తరం వ్రాసియిస్తాను. అది మీదగ్గర పెట్టుకోండి. మీకు భయములేదు.

దాసు-(తనలో) వీడమ్మకడుపుకాలా వీఁడునదిలేవాడు కాదు. ఎన్ని దొంగయెత్తులు వేసినా యెత్తుకు పైయెత్తువేసి తనమాటేపైగా వుంచినాడు. ఇకనప్పకోక తప్పదు. ఇక నాకేమియుక్తి తోచడం లేదు. కానీ ఏగతేమౌతుందో అవుతుంది

సూరి—ఏమి టాలోచిస్తున్నారు. జవాబు చెప్పరేమి?

దాసు—ఆలోచన యేమీ లేదు. పాపము మీయవస్తే ఆలోచిస్తున్నాను. దయ్యాలు ఒకసారి వచ్చాయంటే ఆహారం పడితేనే కాని వెళ్ళవు. భయపడి మీరైనా చస్తారు. లేకపోతే అవైనా విరుచుకుతింటాయి. అవి పేట్రేగుతే నేనైనా ఆపలేను. కొరివిదయ్యాలు బాలింతదయ్యాలు ముసలిదయ్యాలు పడుచుదయ్యాలు పిల్లదయ్యాలు పెద్దదయ్యాలు శాకినీలు ఢాకినీలు కామినీలు భూతములు భేతాళములు యక్షిణీలు బ్రహ్మరాక్షసులు వచ్చి నిన్ను చుట్టుముట్టి నోట్లోనుంచి మంటలు, చెవుల్లోంచి జెఱ్ఱెలు ముక్కులోనుంచిపాములు బయలుదేరుతూంటే, శవాలని పీక్కుతుంటూ, పుఱ్ఱెలలో నెత్తురు పోసుకు తాగుతూ తలలు విరియబోసికొని తెయ్యని ఆడుతూంటే,

నే నెల్లా ఆప నావాటిని, నీవెల్లా బ్రతుకుతావా యని నాకు గంపెడుబెంగ పట్టుకొన్నది. ఆపైన అని గ్రామంలో పడి యేమి కొంపలు తీస్తాయో యని భయంగావుంది.

సూరి—తమరంటే వాటికి గడగడకదా. అందుకుచేత గ్రామానికి భయంలేదు. నేను పోయినా నాకు విచారంలేదు. అందుకుచేత చూపించండి.

దాసు—సరే! మీకర్మమునకు నేనేమిచేయను! ఎవడి ప్రారబ్ధ మెలాగున్నదో అల్లాగౌతుంది బ్రహ్మలిఖిత మెవ్వడు తుడిచివేయ గలడు. మీకు దయ్యాలచేతిలో చావుంది. మీజాతకరీత్యా కూడా మీకు మార్కదశ ఉన్నది రేపు శనివారంరాత్రి చూపిస్తాను. నాతో శ్మశానమునకు రండి.

సూరి—తప్పక వస్తాను.

(అందఱు నిష్క్రమింతురు.)

—౦—

రెండవరంగము

శ్మశానభూమి

(అప్పుడు దయ్యాలదాసు సత్యసూరి ప్రవేశించుచున్నారు)

దాసు—సూరిగారు! శ్మశానభూమిలో ప్రవేశించినాము. ఇక మీయదృష్టములో నున్నది.

సూరి—భయములేదు. మీమంత్రములవలననే దయ్యములు మనకు కనబడి వెనుకకు వెడలిపోవును.

దాసు—(తనలో) ఈ ముండకొడుకు మూలమున నాకు చావువచ్చినది. దీపములు పెట్టిన తరువాత నే నిల్లుకదలలేను. కది

లితే చేటుభయము. అయినప్పటికి వీడు నాకు సాయమున్నాడుగనుక భయ ముండగూడదు. ఏచెట్టునో పుట్టనో చూపించి వీడికి, అదే దయ్యమని చెపుతాను. వీడు మొండిబండలాగున్నాడు. వీడికిభయము లేదు. ఏమీ లేదు.

సూ—దాసుగారూ! చెప్పులు తొడుగుకు వచ్చినారా? లేకపోతే యెముకలు మేకులు కుండపెంకులు వెదురుపేళ్ళు కాళ్ళలో గుచ్చుకోగలవు.

దాసు—తొడుగుకొనేవచ్చినాను (తనలో) నాకు భయము వేయుచున్నది. ఈయనచేయి గట్టిగాపట్టుకుంటాను. (ప్రకాశముగా) సూరిగారూ! మీచెయ్యి నామీదవేసి నన్ను గట్టిగా కౌగలించుకోండి. మీరుభయపడి మూర్ఛపోతారేమో.

సూరి—నాకేమీ భయము లేదయ్యా!

దాసు—అలాగుకాదు. నా మనసు చి త్తగించండి ఎందుకయినా మంచిది.

(అని ఆయన చెయ్యి తనమీద వేసికొనుచున్నాడు.)

సూరి—దాసుగారూ! మీ శరీరము వణుకుతూన్నట్టుందేమి?

దాసు—(తనలో) నేను భయముచేత వణకడం వీడుగ్రహించినట్టున్నాడు! దీనిని నేను సమర్థించుకోవలెను. (ప్రకాశముగా) నేను మంత్రాలన్నీ యిప్పుడు పునశ్చరణ చేయుచున్నాను. అందుచేత శక్తులు, దేవతలు అన్నీ వచ్చి సన్నావహించుచున్నవి. శక్తులావహించినప్పుడు వొళ్ళు కంపమెత్తదా మరి?

సూరి—సరే! పదండి. (అని ముందుకు చూచి) అదేమిటండో దాసుగారూ! ఆ దుబ్బ ప్రక్కనుంచి యెవరో లేచుచున్నారు?

దాసు—(గడగడ వణకుచు) ఏడీ యేడీ! ఎక్కడ?

సూరి—అడిగోచూడండి దక్షిణంగాను!

[అప్పుడొక విగ్రహము ప్రవేశించుచున్నది.]

విగ్ర—(తనలో) తప్పకుండా నాయెదుట కనపడుచున్నవి. దయ్యములే ఈ రెండు దయ్యములు నన్ను చూచిన పక్షమున తప్పక నామీద పడి చంపగలవు.

దాసు—సూరిగారూ! అది తప్పక దయ్యమే నేను యెన్ని విధాలో మీతో చెప్పినాను. దయ్యములు కనబడతవి రావద్దయ్యా అని చెప్పినాను. నా మాట మీరు విన్నారుకారు. ఈ దయ్యము మిమ్మలిని నన్ను గూడ మింగి వేస్తుంది. దీనికి సాయంగా యింకా కొన్ని దయ్యాలుకూడా రావచ్చును.

సూరి—రానియ్యండి. భయము లేదు.

దాసు—భయములేదని మీరంటే సరా? నాకు భయముగానేయున్నది.

సూరి—మీకే భయమా? భయముచేత నేను చచ్చిపోతానని మీరు చెప్పినారే. అలాటిది మీరే భయపడుచున్నారా?

దాసు—ఈవేళ యేమోకాని నా మంత్రముల పునశ్చరణ పనికిరావడంలేదు. మన యెదుటనున్న యీదయ్యము మంత్రశాస్త్రమంతా వచ్చిన బ్రాహ్మణ దయ్యములాగున్నది. అందుచేతనే నా మంత్రములు పనిచెయ్యక నాకు భీతి పుట్టినది.

సూరి—నేనున్నాను మీకు భయములేదు. నన్ను కౌగిలించుకోండి. ఏమి! మీ వొళ్ళంతా చెమటపడుతూంది ధైర్యము తెచ్చుకోండి. ఆ విగ్రహము మనకేశే వస్తూంది.

దాసు—(భయముచేత మాటరాక) మీ మీ మీ మీ మూలాన్ని నే నే నే నే చచ్చిపోతూన్నాను. చూడండి ఆ దెయ్యం మనమీద కొస్తూంది అదిగో దాని కాళ్ళు వంకరగా నున్నవి. అది

వి|గ—(తనలో) ఈ దయ్యాలు నన్ను చంపక మానవు ఇప్పుడేమిగతి. గట్టిగా కేక వేస్తాను. పొలములలోనున్న వాళ్ళైన రైనా నాకు సాయము వస్తారు (అని) అంతా రండర్రోయి.

(అని కేక వేయుచున్నాడు.)

సూరి—(తనలో) ఏమి యీ యాశ్చర్యము. దయ్యమా మనుష్యుడా యెవడు వీడు ? దాసు చెప్పినట్లు దయ్యములే వచ్చుచున్నవా? ఇతడు ధైర్యముగా నున్నపక్షమున నేను ధైర్యముగా నుందును. ఇతడు మట్టిముద్దలా చదికిలబడుటచేత నాధైర్యముగూడ చెడిపోయినది ఇప్పుడేమిగతి.

దాసు—సూరీ! నన్నొదిలిపెట్టవయ్యా! నేనిక్కడ నిలవలేను. ఆదయ్యము తక్కినదయ్యాలనికూడా రమ్మని రండర్రోయియని పిలుస్తూంది. అవన్నీ వచ్చిన తరువాత మనము బ్రతకనేలేము. ఇప్పుడే పారిపోదామురా. నీవు రాకపోతే నేను వెళ్ళక మానను. నన్ను వదిలిపెట్టు.

(అని చెయ్యివదిలించుకొని పరుగెత్తుచున్నాడు)

సూరి—ఇక నిక్కడ నేనెందుకు.

(అని వాని వెనుక పరిగెత్తుచున్నాడు.)

వి|గ—రండర్రో రండర్రో.

(అని వారి వెనుక పరిగెత్తుచున్నది.)

కాపులు—(పొలము విడిచి) ఎక్కడఎక్కడ ఏమిటి ఏమిటి?

(అని వీరి వెనుక పరిగెత్తుచున్నారు)

దాసు—(కొంతదూరము పరుగెత్తి, ఆయాసముచేత) చచ్చావర్రో (అని క్రింద పడుచున్నాడు.)

సూరి—దయ్యాలురోయి బాబో దయ్యాలు.

(అని దాసుమీద పడుచున్నాడు.)

విగ్ర—ఇక నే పరిగుత్తలేనర్రోయి.

(అని వాళ్ళమీద పడుచున్నది.)

కాపులు—దీపం దీపం.

(అనియొక దీపమును తెచ్చిచూచుచున్నారు)

కాపు—(పై విగ్రహమును లేవదీసి) వోవడవురా నువ్వుమడి శివా దయ్యానివా ?

విగ్ర—(వగర్చుచు) కోంపడకండి మాప్రభూ! నేను సాకలి సరివిగోణ్ణంకి. ఆదాసుగోరు దయ్యాలని సూపిత్తానని చూరిగారితో చెపుతావుంటే యివి దయ్యాలెల్లాగుంటాయో సూద్దారని ఎల్లి యీరిద్దరే దయ్యాలనుకోని యిలా పగ్గెత్తుగొచ్చాను.

సూరి—ఏమిటి చాకిలి సరివిగాడవటరానువ్వూ నీవు దయ్యమనుకొని మే మిద్దరము పరిగెత్తుకొచ్చాము. దాసుగారూ! లెంచి దయ్యము గాదు. చాకలి సరివిగాడు.

దాసు—(మెల్లగా) నీమాట నేను నమ్మను అది దయ్యమే కాని మనిషి కాదు. ఒకప్పుడు పిశాచాలు మనిషి వేషము వేసికొని యిల్లా మోసం చేస్తుంటాయి.

చాకలి—బాబయ్యా! నేను దయ్యాన్ని కానుండి సరివిగాణ్ణుండి చవారీలు మోసిన కాయ లియిగోనండి.

దాసు—చాకలిదయ్యాలికి బుజాలమీద కాయలుంటాయి

కాపు—లేవయ్యా యీ పాటికి దయ్యాల్లేవు గియ్యాలు లేవు మా గొప్పమంత్రగోడివొచ్చావుగూళ్ళోకి. ఇల్లా దద్దిల్లి పారిపోరే వోడవు నీవేమిదయ్యాలొదులుత్తావు. నడునడు.

దాసు—బాబూ యీవేళకి బ్రతికాను. ఇక నెప్పుడు దయ్యాల మంత్రాలు చెప్పను. రండి వెడదాము.

(అందరు నిష్క్రమింతురు

తుంబుర నారద సంవాదము

తుం—మహాత్మానారదా! నీవు బ్రహ్మమానసపుత్రుడవు. నీకు తెలియనివిషయములు త్రిలోకములయందు లేవు. నాకు కొన్ని ధర్మసందేహములు కలవు వానిని నీవు తీర్పవలయు,

నార—మిత్రుడా తుంబురా! నీవు నాసిడవలెనె యేకాలమందు నన్ననుసరించి తిరుగుచుందువు నీసందేహములుబాపుట నాకు ప్రథమవిధి. అనియేవో చెప్పుము.

తుం—చిత్తము మహాప్రసాదము. కలియుగములో నధికారములుగల కొందరు మనుష్యులు వెన్నెలలోగూడ సేవకులచేత లాంతరులు వేయించుకొని. నడచుచుందురు సకలజగంబునకు చంద్రుడు దేవుడిచ్చిన గొప్పలాంతరుగదా అట్టిగొప్పలాంతరు వెలుగుచుండగా దాని వెలుతురున సమస్త వస్తువులు కనబడుచుండగా లాంతరుదీపముతో నేమి ప్రయోజనము ఈసందేహము నాకు దీర్పవలయు.

నా—(నవ్వి) ఆహాహా! గొప్పసందేహామే కాని యీ విషయమున నీవు శంకానివృత్తిచేసికోవలసిన దే? ఇదిగో కారణము చెప్పుచున్నాను వినుము. అధికారముగలవారిలో పెక్కుమందికి కన్నులు మనుపున్నచోట నుండవు. కన్నులు నెత్తికి వచ్చును. ఆకారమాత్రముచేత కన్నులు మునుపున్నచోట నున్నను దృష్టి మునుపున్న చోట నుండదు. అందుచేత కొందరధికారులకు కన్నులు తిన్నగ గనబడవు. కన్నులు పొరలుగప్పిపోవును. అధికారమదము దృష్టి కడ్డమువచ్చును. అట్లొక విధమైన గ్రుడ్డితనము కన్నుల నావరించుటచే సరిగా కనబడక వెన్నెలలోగూడ లాంతరులు వేయించుకొందురు.

తుం—మహాత్మా చందమామ వెలుతురువల్ల కన్నులు కనబడని వారికి లాంతరు వెలుతు రుపయోగించునా?

నారద—కొంతవర కుపయోగించును చత్వారము రేజీక
యున్నవారికి సన్నదీప ముపయోగించనప్పుడు పెద్దవత్తి వేసి దీ
మెక్కువ కాంతిగలదిగ జేయుదురు. పట్టికన్నులు కనబడనప్పు
సులోచనముల దృష్టివల్ల చక్కబడునట్లు చంద్రకాంతి కనబడకున
వానికి లాంతరు వెలుతురువచ్చి ముసుపటిదానికి తోడుపడి కొం
కనబడవచ్చును. ఇట్లు కనబడక పోవుటచేతనే అధికారి నడచునః
జేమనుష్యుని మీద పడునోయను భయముచేత బంట్రోతులు వ
కంఠాలు ముందు నడచి తొలగండి తొలగండియని శాటసారుల
దొలగించుచుందురు.

తుం—భళీభళీ. మీరు చెప్పినది మిక్కిలి చక్కగానున్న
అయితే నిట్టియధికార్లకు ఏవస్తువులూ సరిగా గనబడవా!

నారద—కనబడకేమి. వారికి కొన్ని చక్కగా గనబడు
తా బేదార్లయందు తప్పులు త్వరగా కనబడును. లోకులబాధిం
టకై క్రొత్తదార్లు క్రొత్తపుంతలు వేగముగ గనబడును. తమయ
గ్రహము సంపాదించుకొనుట కాశ్రితులు తెచ్చినకట్నములు క
కలు హిరణ్య గర్భములు చీకటిలోనైన కనుబడును. పైయధి
రుల మెప్పించు నుపాయములు మఱిమఱి కనబడును.

తుంబు—మునీంద్రా! అధికారుల కన్నులయందేనా ద
ముండుట, లేక మఱియితర అవయవములయందుగూడ ద
ముండునా? వారికి చెవులు సరిగ వినబడునా మనసు సరిగనుండు

నారద—మిత్రుడా! నీవడుగుచున్న ప్రశ్నములు మిక్కి
మంచివి. నీ ప్రశ్నల కన్నిటికి దగిన యుత్తరముల జెప్పుచున్నా
వినుము. సందేహములు బాపికొనుట వురుషలక్షణము. అట్లుచేయ
చేత నాకు మిక్కిలి సంతోషముగ నున్నది.

తుంబు—మీవంటివారి దర్శనము లభించినప్పుడె సందే
ములు తీర్చికొనకపోయిన పక్షమున మావంటివారి సందేహము

తీర్చికొనుట యెప్పుడు. అందుచేత నేనిప్పుడు మిమ్ము నొక్కటి యడుగుచున్నాను.

నార — సరే ఆకర్ణింపుము. అధికారుల కన్నులయందు దోష మున్నట్లె చెవులలోగూడ గొంతదోషముండును.

తుంబు — దేవా ! ఆదోష మెట్టిది ?

నార — ప్రజలు సాధారణముగ జేసికొనుచున్నట్టి మనవి సనవులు చప్పున వినబడవు. వారు కంఠము లెత్తి యరచినను ఒకప్పుడు గోల యెత్తుచున్నను అవి వినబడవు. పూర్వస్నేహితులు పేదచుట్టాలు మొదలగువారి మాటలుగూడ వారికి తరుచుగా వినబడవు.

తుంబు — ఎందుచేత వినబడవు ? చెవుడా ?

నార — కేవలము రోగసంబంధమైన చెవుడుగాదుగాని యిది యొకవిధమైన చెవుడే.

తుంబు — ఈవిధమైన చెవుడున కవుషధము లేదా?

నార — ఈ చెవుడురోగము వైద్యులసహాయమువలన కుదురు నదిగాదు. మందులవలన మానునదిగాదు. దీనికి గొప్ప యౌషధ మొకటే యున్నది. "అధికారాంతమునందు జూడవలనుగా నా యయ్య సౌభాగ్యముల్" అనువాక్యమునుబట్టి యుద్యోగమునుండి తొలగింపబడుటయే యీ చెవుడునకు గొప్పమందు. ఇది యమోఘ మైన యౌషధము. తక్కిన యౌషధము లొకప్పుడు పనిచేయును ఒకప్పుడు పనిచేయవు. కాని యీ యౌషధము మాత్ర మట్టిది గాదు. దీనిశక్తి యమోఘమైనది.

తుంబు — స్వామీ! అధికారములో నున్నపుడు వారికేవి వినబడుచుండును ?

నార—కొన్ని తప్పక వినబడుచుండును అవి యేవన కొండెములు తప్పక వినబడుచుండును. కట్నములు కానుక ధాన్యము కూరలు పాలు పెరుగు నెయ్యి పండ్లు మొదలగునవి పంపుమని తమకు లోబడిన మనుష్యులు చెప్పునట్టిమాట లెంత మెల్ల జెప్పినను స్వచ్ఛముగ వినబడును. అందులో నొక్క యక్షరమైన వినబడకపోదు. తమకు బహుమానముగ దెచ్చిన రూపాయ మంచిదో కాదో యని తెలిసికొనుటకై మోగించినప్పుడు కలుధ్వని చక్కగా వినబడును. భార్య నగలుపెట్టుకొని ఘలుఘల్లున తిరుగుచున్న చప్పుడు హాయిగా వినబడును. తనకుగిట్టని మనుష్యులు ఏమూలలనో గూర్చుండి చెప్పుకొనిన చాటుచాటు మాటలన్నియు గట్టిగా వినబడును. ఇన్కంటాక్సు మొదలయిన పన్ను గట్టుటకు ఉన్నసంగతులు లేనట్లు లేనిసంగతు లున్నట్లు వినబడును మనుష్యు లొకసంగతి చెప్పుకొన్నపుడు మరియొకసంగతి వినబడు ప్లీడర్లొకవాదముసేయగా వీరి చెవులకు మరియొక వాదము వినబడు

తుంబు—మహాత్మా మీయుపదేశమువలనధన్యుడనయితి

(ఇద్దఱు నిష్క్రమింతురు)

—౯—

మెట్టవేదాంతము

[అప్పుడు బలరామస్వామిగారు, నీలకంఠముగారు ప్రవేశించుచున్నారు)

నీల—బలరామస్వామయ్యగారూ! ఇది పూర్వజన్మవాసనయో ఈజన్మవాసనో నే నెరుగనుగాని మీరు మాసావిట్లోకి రాగా గుప్పున వాసన కొడుతూంది.

బల—మీరు పూర్వజన్మవాసన యీజన్మవాసన రెండు కూడా లేనివారు. మీరు సౌఖ్యపడలేరు ఒకరు సౌఖ్యపడుతూంటే చూడలేరు.

నీల—నీకు నీసౌఖ్యమునకు వెయ్యి నమస్కారములు. నాకు యీ త్రాగుబోతు సౌఖ్యము వెయ్యి జన్మాలకైనా వద్దు. నాకేకాదు. నాశత్రువులకైనా వద్దు.

బల—కావలెనంటే మాత్రము వస్తవా. తనకు ధైర్య ముండవలె, ఓర్పుకొనేశక్తి యుండవలె. మీవంటి అప్రయోజకు లకు యిటువంటి శక్తులురావు.

నీల—రాకపోతే మానిరిగాని నాదొక్క మనవున్నది. చిత్త గించండి.

బల - ఏమిటో ఆమనవి చెప్పండి కొంచెముసేపు చిత్త గిస్తాము.

నీల—మీరు పట్టపగలు మాత్రము మద్యపానము చేయ వద్దని నా మనవి.

బల—రాత్రి చేయవచ్చునా యేమి?

నీల—రాత్రి చేయకూడదు.

బల—రాత్రి చేయకూడదు. పగలు చేయకూడదుగదా. రాత్రి చేయవచ్చునని మీరుయేలా చెప్పుచున్నారు పాపమైనప్పుడు పగలు చెయ్యకూడనిది రాత్రి చేయవచ్చునా?

నీల—పాపమన్నమాటకు సందేహము లేదు. పగలు త్రాగ వద్దన్న దానికి కారణము వినుడు. రాత్రులు మీరు మీయింటిపద్దనే యుందురు. మీకంపు మీకు, మీబంధువులకు యింపుగానుండును, పగలు త్రాగివచ్చినపక్షమున యీకంపు మేము భరింప లేకుండ నున్నాము. పైగా పగలు మీరనేక వ్యాపారములమీద పోవుదురు. ఒళ్ళు తెలియక పడిపోయిన చాలా ప్రమాదము సంభవించురు.

అప్రతిష్టవచ్చునన్నమాట నేను చెప్పగలను. ఏలననగా యింత కంటె యప్రతిష్ట యిక వచ్చుటకు వీలు లేదు.

బల — మీరేదో పాపమనుచున్నారు. పాపములు పుణ్యములు జాంతానై. యజ్ఞములో బ్రాహ్మణుడు మేకను చంపితే పుణ్యము. కసాయివాడు మేకను చంపితే పాపమా? మేము వేదాంతులము. సల్లిని పేనును చంపితే యెంతో ఆవును మేకను చంపితే అంతే మనిషిని చంపినా అంతే. అన్నీ జీవములే. అన్నీ ప్రాణములే. ఉద్యోగములలో చేరినవారు సర్కారువారి ఆర్డరుప్రకారం కుక్కలను చంపించుచున్నారా లేదా? అందువలన పాపమా పుణ్యమా? లోకములో పాపము లేదు. పుణ్యము లేదు. ఏదో ప్రతిష్ట అని సెలవిచ్చేరు. ప్రతిష్టేమిటి అప్రతిష్టేమిటి పిచ్చమాటలుగాని, లోకులందరు చేరి వాడు త్రాగుతాడని చెప్పుకొన్నంతమాత్రమున వాడికివచ్చిన నష్టమేమి? ఈ చెప్పుకోవడమువల్ల వాడికి సారాయి దొరకడంలేదా? అప్పులవాళ్ళు బదుళ్ళివ్వడము లేదా? ఆస్తిఉన్నంత మట్టుకు మంచివాడికి చెడ్డవాడికి అప్పులిస్తారు ఆస్తి లేనప్పుడు శుద్ధ శ్రోత్రియుడికి అప్పు లియ్యరు, త్రాగుబోతుకు అప్పులియ్యరు. మీరందరు ఏమనుకుంటే నాకేమి? నన్ను మెచ్చుకునేవాళ్ళు నన్ను మెచ్చుకుంటారు. త్రాగుటకు డబ్బులేనివాళ్ళందరో కాళ్ళులాగి నడుముపీకి, మతిలేక నావద్దకు వత్తురు. వచ్చినప్పుడు నేను వాళ్ళ నాదరించి ప్రతివాడికి త్రాగినంత సారా పోయిస్తాను. అప్పుడు వాళ్ళు సంతోషించి మహారాజా! నీవు వెయ్యేళ్ళు బ్రతుకు. నీవు ధర్మరాజవు నీవంటివాడికి జమీలు రాజ్యాలు యివ్వక దిక్కుమాలిన భగవంతుడు పిసినిగొట్టు ముండావాళ్ళ కిస్తాడు. నీ చేతిలో రాజ్యాలుంటే కల్లుచెరువులు, సారాసరస్సులు, బ్రాందీ కాలువలు త్రవ్విస్తువుకదా? అని వారు నన్ను స్తోత్రము చేస్తారు.

చేగోడీలునంటి కుండలాలు చెవులకు తగిలించుకొని చిరుగుల శాలు వొకటి మీాద కప్పుకొని చెవులు తడికలు కట్టునట్లు ఏవో రెండు పనసలు చదువు అవధానిగారికి ఏవో బేడడబ్బులిస్తే ఇంద్రుడవు చంద్రుడవని స్తోత్రములు చేస్తాడు. నీమెప్పుకి నామెప్పుకి భేదమేమిటి ?

నీల—ఓరిబాబు యిదేమి వేదాంతమయ్యోయి. మెట్టవేదాంతములాగున్నది.

బల—మెట్టవేదాంతమో, పల్లపువేదాంతమో నాకు తెలియదు త్రాగుడు మంచిది. దేవతలుత్రాగే అమృతమేమిటి ? అది సారాయే. యజ్ఞములలో చేసే సోమపానమేమిటి ? అది సారాయే. సారా అమృతరసాయనము, దేవతలు త్రాగుబోతులు, మునులు త్రాగుబోతులు, ప్రపంచమంతా త్రాగుబోతులు. త్రాగుట వైద్య శాస్త్రరీత్యా చాలామంచిది. ఒంటికి హుషారీయిస్తుంది. మనస్సుకి మరవరాని ఆనందము ఉత్సాహము కలిగించును.

నీల—ఇక నీతో వాదించేవాడు లోకంలో లేడు.

బల—వాదములన్నిటికీ శిరోభూషణ మింకోటియున్నది వినుం. త్రాగుడు లోకోపకారము. నావంటివాళ్ళు లోకంలో యెందరో వుండబట్టికదా సారావర్తకులు బాగుపడుచున్నారు. నావంటి వాళ్ళని నమ్ముకునేకదా యిజారాదార్లు పాటపాడుచున్నారు. మావంటివాళ్ళు లేకపోతే వాళ్ళందరు యేమికావలసినది ? ఉపకారమటుండగా త్రాగవద్దనుట గొప్పనేరము. ఏమనగా త్రాగవద్దంటే సర్కారుకి గొప్పనష్టము కలుగజేయడమన్నమాట. నీమాటలువిని అందరు త్రాగకపోతే సర్కారుకి కోట్లకొలది నష్టముకదా ! ఇటువంటి మాటలు చెప్పేవాళ్ళు దుర్మార్గులు. సర్కారుకు నష్టము కోరేవాళ్ళు. నీ మొఖం చూడగూడదు.

నీల—బాబూ, నీతో మాట్లాడినందుకు నాదే బుద్ధితక్కువ. పాపము పుణ్యము లేదన్నవానితోను ప్రతిష్ఠ అప్రతిష్ఠ లేదన్నవానితోను, పైగా మావంటివాళ్ళు సర్కారుకు నష్టము కలుగజేస్తారు అనేవాళ్ళతోను మాట్లాడడము చాలాకష్టము. యుక్తికి యుక్తిచెప్పగలముగాని మొండివాదమునకు జబాబు చెప్పలేము. నీవంటివాళ్ళను నమ్ముకొనిసారాయిజారాదార్లు పాటపాడుచున్నారు. నీవంటివాళ్ళను నమ్ముకొని భోగమువాళ్ళు పడుచుపిల్లలను పెంచుకొనుచున్నారు. నీవంటివాళ్ళను నమ్ముకొని కసాయిదుకాణపువాళ్ళు మాంసపుదుకాణములు పెట్టుచున్నారు. ఇటువంటివాళ్ళందరిని పోషించుటకై మహానుభావుడవు అవతారమెత్తినావు. నీకు వేరేజన్మము లేదు.

బల—నాకు జన్మము లేనిమాట నిశ్చయము. నీ వెన్నివేల పర్యాయములో పుట్టి చచ్చుచుందువు.

నీల—నీకు పిశాచ జన్మమేగాని మనుష్యజన్మ లేదు.

(అని నిష్క్రమింతురు.)

[అప్పుడు రామస్వామి, కృష్ణస్వామి, ప్రవేశించుచున్నారు)

రామ—ఇందులోతప్పు నాకేమి కనుపడదు,

కృష్ణ లంచములు పుచ్చుకొనుట తప్పేకాదా ? అట్లయిన గవర్నమెంటువారిది గొప్ప నేరముగ నెంచి లంచగొండులకు శిక్ష లేల వేయుచున్నారు ?

రామ—గవర్నమెంటువారు తెలివితక్కువ శిక్షలు వేయుచున్నారు. వారికి దీనిలోనున్న పరమార్థము తెలియదు.

కృష్ణ లంచము పుచ్చుకొనుటలో పరమార్థముకూడనున్నదా ?

రామ—ఎంతపరమార్థమున్నదో నీకేమి తెలియును? లంచము పుచ్చుకొనుట అనగా పరోపకారము చేయుట. లంచము పుచ్చుకొనినవాడు పరోపకార మేమిటో జన్మమధ్యమందెరుగడు. ఇద్దరు తగ

పులాడి నేను మేజిస్ట్రేటును గనుక నావద్దకు వస్తారు. వచ్చినప్పుడు ఒకరివద్ద లంచము పుచ్చుకొని వానికుపకారముచేయుచున్నానా! లేదా?

కృష్ణ — ఈలంచమువల్ల రెండవవాని కపకారము చేసినావా లేదా?

రామ — ఓయి పిచ్చివాడా! రెండవవానికి ఎప్పుడుకూడా అపకారము జరిగి తీరుతుంది. ఒకరిమీద నొకరుచార్జియిచ్చినప్పుడు అధికారి ఇద్దరితరఫు తీర్పుచేయలేడుగదా! ఎవడో ఒకడితరఫె తీర్పు చేయును. అందువల్ల ఒకడికుపకారము. ఒకడికపకారము జరుగును. లంచము పుచ్చుకొన్నవాడుకూడ ఆప్రకారమే ఎవడో ఒకరితరఫునే తీర్పుచేయును. ఎవడికో ఒకడికే అపకారము జరుగును.

కృష్ణ — ఓరి! నీ తెలివి తగలబెట్టా. న్యాయమయిన అధికారి తీర్పుచేయునపుడు నేరస్థులకు శిక్షకలుగును. నేరములేనివాడికి గౌరవము జరుగును. లంచగొండులు తీర్పుచేసినపక్షమున నేరస్థుడు శిక్ష లేకుండ తప్పించుకొని పోవును.

రామ — ఇదా నీగొప్ప సందేహము? సరిలే! పిచ్చిపుల్లాయవలె నున్నావు. నేరస్థుడు శిక్షలేకుండ తప్పించుకొనిపోవుట మంచిది కాదనుచున్నావా! నేరస్థుడు పాపము! తెలియక ఏదో అవకతవక పని చేస్తాడు. అందుకువానిని జైలులోనికి పంపితే వానిపెండ్లాము బిడ్డలు గోలుగోలుమని ఏడవరా? వాడు జైలులో మట్టితట్టలు మోసి అవమానముపాలు గాడా? వాడిని వదిలివేయుటవల్ల వాని కవమానము తప్పించి వానికి, వానికుటుంబమునకు, ఎంతో ఉపకారము చేయుట కాదా? వాళ్ళవాళ్ళెంత సంతోషిస్తారు? ఇదంతా పరోపకారముకాదా?

కృష్ణ—ఇదిఅంతా పిరియాదికి అన్యాయము కాదా? పిరియాదికి ఇందువల్ల రెండు అపకారములు జరుగును. మొదట నేరస్థుడు వానినికొట్టియో, తిట్టియో అపకారము చేసినాడు వాడుచేయగా మిగిలిన అపకారము కేసుకొట్టివేయగా మీరుచేస్తారు. ఇక లోకములో న్యాయమే లేదన్నమాట.

రామ—న్యాయము లేదా? ఎవడో ఒకడు కష్టమనుభవించవలసిన దేనా! పిరియాదితరపుతీరుపుచేస్తేముద్దాయికినష్టము. ముద్దాయితరపు తీర్పుచేస్తే పిరియాదికినష్టము. ఎవడికో ఒకడికి నష్టముకలుగుతూనే వుంటుంది. ఇందులో మనకెవరిమీద ఇష్టమో వారికి ఉపకారం చేస్తుంటాము. ఇదికాక ఇంకొకసంగతి చెప్తావిను. పిర్యాది ముద్దాయిల నిద్దరిని విచారించి ఎవరితరపు న్యాయమో వారితరపే తీర్పుచేయ నిశ్చయించుకొని వాడిదగ్గరనుంచే లంచము పుచ్చుకొను నెడల తప్పేముంది? ఇందువల్ల పిర్యాదీకి న్యాయము జరుగును, నేరస్థుడు శిక్షింపబడును. మాకు లంచము దొరుకును. ఇందులో పాపమేమి? తప్పేమి?

కృష్ణ—నీకు పాపము తప్పు తెలియడములేదా! సర్కారు వారు నీకు జీతమిచ్చుచున్న దెందుకు? ఎవరివల్లను లంచము పుచ్చుకోకుండా న్యాయము చేయవలసినదని కాదా?

రామ—సర్కారుపర్వరచడానికేమి లే! ఇన్నిమాట లెందుకు నేను వేదాంతము చెప్తావిను! లంచము చాలమంచిదిగనుకనే దేవతలు కూడా లంచము పుచ్చుకొంటారు. దేవుడికిచేసే సేవలుఉత్సవములు లంచములుకావా? దైవస్తోత్రము లేమిటి! లంచములుకావా! యోగములు నోములు ఏమిటి! దేవతలను మెప్పించుటకు కావా? వెంకటేశ్వర వ్రతములు, సత్యనారాయణ వ్రతములు లంచములుకావా? దేవతలు మనకు జబ్బులుచేయించడము, మనచేత మొక్కులుపుచ్చుకోనడము అప్పుడు జబ్బులుపోగొట్టడము, దేవతలకే దిక్కులేనప్పుడు

ఉప్పు పులుసు తినేనునకా ? పైగా అద్వైతప్రకారము లంచమిచ్చే వాడు లేడు, పుచ్చుకొనేవాడు లేడు. అంతామాయ అంతామిధ్య.

కృష్ణ—నీవేదాంతము మెట్టవేదాంతము. ఇది న్యాయ మార్గంలో వెళ్ళేవాడికి పనికిరాదు.

రామ—న్యాయము న్యాయమని గుంజుకుంటావు. న్యాయ మేమిటి ? లోకములో న్యాయము, అన్యాయము అనునవి లేవు. అవి పిచ్చివాళ్ళు పెట్టిన భేదము. నీకు న్యాయమైనది నాక న్యాయము; నాకు న్యాయమైనది నీక న్యాయము.

కృష్ణ — ఈ మొండివాదములు చేసేవాళ్ళతో మాట్లాడేది కష్టము. అందుచేత నీతో వాదించ తలచుకోలేదు,

రామ—పోనీ యీవిషయమై వాదము కట్టిపెట్టి మరియొక విషయ మడుగుతాను చెప్పు.

కృష్ణ—నీ విషయము లన్నియు విషములవంటివే. చెప్పు టకు వినుటకుగూడ బాధకరములైనవి.

రామ — మమ్ముతిట్టదలచుకొన్న పక్షమున ఏకముగా అన్నిటికి నొక్కసారియె తిట్టవచ్చునుగాని ముందుగా చెప్పేది వినుము.

కృష్ణ —అడిగేదేమిటో త్వరగా అడుగు.

రామ—అబద్ధములాడుటవలన లాభ మున్నదా లేదా ?

కృష్ణ—నీవంటి దుర్మార్గులకు లాభమే. లోకమునకు నష్టము.

రామ — లోకమునకు నష్టములేదు లాభమే.

కృష్ణ—ఒకరికి నష్టము లేకుండ మరియొకరికి లాభ మెట్లు వచ్చును ?

రామ—ఒకరికి నష్టము లేకుండ ప్రపంచములో నెన్నడు నుండదు. కాని యబద్ధమువలన గొప్పయుపకారమున్నది. అవిచెప్పెద వినుము. ''అశ్వద్థామ హతఃకుంజరః'' అని మెల్లగ నొక చిన్న

యబద్ధమాడుటవలన ధర్మరాజున కెంతలాభముకలిగినదో చూడు! ఎందరెందరో మహావీరులకయిన చంపుటకు శక్యముగాని ద్రోణాచార్యులు క్షణములో చచ్చిపోయినాడు. ధర్మరాజునకు నరకమువచ్చి సత్యము సత్యమని మొత్తుకొనే మీయందరకు పుష్పవిమానము లెదురువస్తాయా యేమిటి? ఎన్ని యేడిచినా మీకు నరకకూపాలే గాని మరియొక యేడుపులేదు. చంద్రహాసకథలో విషయయనే పిల్ల తప్పు సృష్టిచేసినందువల్ల చంద్రహాసుడు బ్రతికినాడు. ఆమె యాపని చేయని యెడల చంద్రహాసుడు చచ్చిపోవును గదా?

కృష్ణ—నీకు వాళ్ళచరిత్రలే జ్ఞాపకముకువస్తాయిగాని బలిచక్రవర్తి హరిశ్చంద్రుడు మొదలగువారి చరిత్రలు నీకు జ్ఞాపకము రావుగదా.

రామ— జ్ఞాపకమురాకేమి! తనపట్టినకుందేటికి మూడేకాళ్ళని సత్యము సత్యమని పీకులాడి యెదవన్నరయెదవలయి రాజ్యముపోగొట్టుకొని అడ్డమయినవాళ్ళ కాళ్ళు పట్టుకొని చెడిపోయిన భ్రష్టులు వీళ్లే కదా యని నాకు జ్ఞాపకమువచ్చుచుండును. హరిశ్చంద్రనాటకము విన్నప్పుడు, ఆడినప్పుడు, అది విని చూచిన మన కర్మనిర్భాగ్యులు, ఆ తెలివితక్కువముండాకొడుకులవలె చెడిపోతారేమోయని నా ప్రాణాలు పీచుపీచుమంటూంటాయి. ఇటువంటి పుస్తకాలచ్చువేయకు[illegible]గవర్నమెంటువారు రూలు ప్యాసుచేస్తేబాగుండును. ఎవరైనా కవీశ్వరులు బయలుదేరి శుక్రాచార్యులవారి చరిత్ర నాటకముగాను పురాణముగాను వ్రాస్తే యెంతో బాగుండును. ఈపాడు కవీశ్వరులు పనిలేనిమంగలి పిల్లితల గొరిగినాడన్నటు అవకతవక పుస్తకాలు వ్రాయకపోతే ఆమహానుభావుని చరిత్ర వ్రాయరాదూ? పుణ్యముపురుషార్థముకూడాను. అమ్ముకుంటే గోనిసంచెడు రూపాయలు వస్తాయి అహాహా! ఆ మహానుభావు డెన్ని చెప్పినాడయ్యా! చచ్చి స్వర్గా

నున్నాడు. చల్లనివేళ జ్ఞాపకానికివచ్చినాడు. "వారిజాక్షులందువైవాహికములందు! ప్రాణవిత్తమానభంగములను చకితగోకులాగ్రి జన్మరక్షణములు! బొంకవచ్చు నఘముబొందదధిప॥" అన్నాడు. అహాహా! అక్షరలక్షలుగదా యీమాటల కిమ్మతు.

కృష్ణ—శుక్రుని మెచ్చుకొనుటచే అతని శిష్యులైన రాక్షసులలో పుట్టవలసినవాడవు నీవు.

[రామస్వామి కృష్ణస్వామి ప్రవేశము]

రామ—మేము శుక్రాచార్య శిష్యులైన రాక్షసులలో జేరనివారమంటివి. రాక్షసులైనంత మాత్రమున మాకప్రతిష్ఠ లేదు. రాక్షసులలో నున్నంతప్రజ్ఞావంతులు మరెక్కడ లేరు. మీ దేవతలకంటె ఆరాక్షసులేమంచివారు. రావణాసురుడు మీ దేవేంద్రునికంటె దేనిలో తక్కువ? దేవేంద్రునియొక్క సత్ప్రవర్తనము అహల్యాచరిత్రమువలన తెలియును. బలిచక్రవర్తివంటిదాత మీ దేవతలలోగాని రాజులలోగాని కలడా! రాక్షసులలోనుండే పరాక్రమవంతులు మూడు లోకములలోను లేరు. హిరణ్యాక్ష హిరణ్యకశిపులు తారకాసుర నరకాసురులు వృషపర్వవజ్రనాభులు ఎంతెంత పరాక్రమవంతులో మీ మునిముండాకొడుకులు వ్రాసిన పుస్తకములలోనె తెలియును. రాక్షసులమీద గిట్టక యీగడ్డాలపోతులైన ఋషులు వాళ్ళను గూర్చి యెన్నెన్నో యబద్ధపుగాథల వ్రాసినారు. వాళ్ళు దుర్మార్గులట, స్త్రీఘాతకులట, దొంగలట. యీ దేవతలలోను మునులలో నపాత్రులెందరో గలరు.

కృష్ణ—రాక్షసులే మంచివాళ్లైన పక్షమున రావణాలయము తారకాలయము అనిపేరిడి కొన్నిగుళ్ళుగోపురములు కట్టించు. దానివలన నీకు పుణ్యము పురుషార్థము పేరు ప్రతిష్ఠ వచ్చును.

రామ—నాదగ్గర డబ్బున్న పక్షమున ఇప్పుడున్న రాముల వారు కృష్ణమూర్తి దేవాలయములన్నియు పడగొట్టించి రావణ కుంభకర్ణులకు హిరణ్యాక్ష హిరణ్యకశిపులకు మంచి మంచి యాల యములు కట్టింతును. ఇప్పుడప్పుడనకుండా యెల్లకాలము ఆ దేవాల యములలో భోగము మేళము లాడే టట్టు చేస్తును

కృష్ణ—నీ వెల్లకాలము భోగము ముండలతోనే కాలక్షేపము చేయుచున్నావు గనుక నీకువాళ్ళతోనే స్వర్గము మోక్షము. వాళ్ళ మూలముచేతనే యింతవరకు బాగుపడ్డావు. ఇకముందుగూడ బాగు పడతావు. నీవేగాకుండా దేశములోగల నల్లవాళ్ళనుగూడ బాగు చేయదలచుకొన్నావు.

రామ—భోగము వాళ్ళుండడమువల్ల లోకములకు గలిగే ఉపకారము తెలుగని మూర్ఖుడవు. నీతో నేనేమని వాదించను?

కృష్ణ—ఆయుపకారము నీవే యెఱిఁగి నీవేపొందుము. నా కక్కఱలేదు.

రామ—నీకు గావలసినను రాదు. భోగము వాళ్ళవల్ల ఉప కారములు చెప్తాను విను. ఇప్పుడైనా బాగుపడుదుగాని. వివా హములలో వాళ్ళుంటేనే శోభ. అది లేని పెళ్ళి బోడిపెళ్ళి. పైగా వాళ్ళను రక్షించడంకూడా లోకోపకారమే. వాళ్ళీరోజులలో తగిన ప్రాపకములు లేక అన్నవస్త్రములకు దూరమైయున్నారు. అన్నము లేనివాళ్ళను రక్షించడం పరోపకారము కాదా! ఈధర్మసూక్ష్మములు తెలియక మీరు మూర్ఖులై చెడిపోవుచున్నారు.

కృష్ణ—ఈధర్మ సూక్ష్మములు మాకు తెలియనక్కఱలేదు. నీవే తెలిసికొని బాగుపడుము.

(అని నిష్క్రమించుచున్నారు.)

—*—

పితృదేవతల మహాజరు

మ॥ రా॥ రా॥ శ్రీ విష్ణువర్ధనపురము మునిసిపల్ అధికారుల దివ్యసముఖమునకు—

విష్ణువర్ధనపురమందు కొంతకాలము కాపురముండి అక్కడనే చచ్చిపోయి ప్రస్తుతము పితృదేవతలమైయున్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులయొక్కయు, కంసాలి, కమ్మరి. కంచరి, వడ్రంగి, చాకలి, మంగలి, సాలి. దేంద్ర, జంగము, ఈడిగ, గమళ్ళ యెరుకల, మాలమాదిగ మొదలగు సమస్తవర్ణములవారి యొక్కయు మహాజరర్జీ విన్నపములు.

మాలో స్త్రీపురుషుల మందరము యీమహాజరర్జీలో వ్రాలు చేయుచున్నాము. మాలో మైనర్లుకూడ కొందరున్నందున వారిపక్షమున మాలో పెద్దలమయిన వారందరము సంరక్షకులుగానుండి యీ అర్జీలో వ్రాలు చేయుచున్నాము. కాబట్టి మా యీవజ్జనముల యొక్క అర్జీవిన్నపములు తమరు సావధానముగాచి త్తగించవలయునని యిందుమూలముగా ప్రార్థించుచున్నాము. ఈపట్టణమందు మహానుభావు లయిన గౌతములవారి అనుగ్రహమువల్ల గోదావరినది ప్రవహించుచున్నది. ఆ యేటియొద్దున శ్మశానభూము లేర్పడియున్నవి. చచ్చిపోయినప్పుడు మమ్మందఱిని యిక్కడికి మా బంధువులు మోసి తీసికొనివచ్చుటకయి చాలా శ్రమపడుచున్నారు. ఆ శ్రమకు దోడుగా వారిమనస్సులో బంధువియోగదుఃఖ మొకటి పెల్లుగా పేధించుచున్నది. ఆ రెండు శ్రమలకుదోడుగా మీరుకూడ బ్రతికియున్న మా బంధువులకు అధికశ్రమను గలిగించుచున్నారు. ఏలయనగా మేము చనిపోయినప్పుడు మమ్ము మోసికొనివచ్చిన వారును, మా వెంట వచ్చిన వారును, యిసుక తిప్పలలో యెండ

కాలములో నెత్తిమాడుచు యెండలో నిలిచియుండవలెను. వాన కాలములో హోరున కురియుచున్నవానలో నిలిచియుండవలయును. బ్రతికియున్న ప్రజలు యెన్నివిధముల మొరలు పెట్టుకొనినను, నాలుగుపందిళ్ళు శ్మశానభూములలో మీరు వేయించ లేకపోయినారు. మాపట్టణమువల్ల వచ్చే సొమ్ములోనుంచి ఖర్చుపెట్టి పందిళ్ళు వేయించమని ప్రజలు వేడుకొనుచున్నారు గాని, మీయింటిలోనున్న మీధనముపెట్టి వేయించమని కోరలేదు. ప్రజలు చెప్పుకొన్నను మీరు లక్ష్యముసేయరు. పత్రికలలో వ్రాసినను మీరు శ్రద్ధచేయరు. స్వయముగా మీకు తోచదు. మీకీ మొండితన మెందుచేత కలిగినది. "దూషణభూషణ తిరస్కారంబులు దేహంబునకుగాని పరమాత్మకు గావు." అను సిద్ధాంతము నమ్మిన వేదాంతులామీరు? లేక బుద్ధి గడ్డితిని మిమ్మందఱను అధికారములోకి తీసికొని వచ్చినందుకు ప్రజ లీవిధముగా కష్టము ననుభవించవలసినదేయను సిద్ధాంతములో జేరినవారా! లేక చచ్చినవాళ్ళు అగ్నిహోత్రములో కాలుచుండ బ్రతికినవాళ్ళు యెండలో కాలుచుండవలెనని కోరికా? చచ్చిపోయిన వాళ విషయమైనను యీవిధమయిన సదుపాయము చేయలేని మీరు యెందు కధికారమువహించి యుండవలెను? కుర్చీ లలంకరించుటకా! కుర్చీలను నల్లులాశ్రయించియున్నవి. మీరునుఆశ్రయించి యున్నారు. భేదమేమి? ఈ అర్జీదారులలో మీ బంధువులమనేకుల మున్నాము, బ్రతికియున్న పౌరులు మొరబెట్టుకొన్నప్పుడు మాణిక్యములు వంటి మీహృదయములు కఱుగకపోయినను, మీ మృత బంధువులమైన మేము పితృలోకమునుండి ప్రత్యేకము పనిగట్టుకొని వచ్చి మీకొక అర్జీనిచ్చుకొన్నయెడల బంధువులమను నభిమానముచేనైన మామాటలందు గొంచెము గౌరవ ముంతురేమో యని ఈ అర్జీవ్రాసితిమి. అయినను స్వపక్ష పరపక్ష నిర్ధూమధామము

యిల తమకు మాబంధువులను నభిమాన ముండునని నమ్మకము లేదు. అందులో బ్రతికియున్నవారే అనుదినము మొరలుబెట్టుకొనుచుండగా ఆ మొరలే వినబడని మీ చెవులకు చచ్చినవాళ్ళ మొరలు వినబడు ననుట కలలోనివార్త. అయినను మీయనుగ్రహ మెట్లు వచ్చునో యని యీమహజరీ నిచ్చుకొంటిమి. మా అర్జీ ప్రకారం వెంటనే శ్మశానభూములలో మంచిపందిళ్ళు వేయించిన సరే, అట్లు వేయించకపోయిన పక్షమున మేమందరము గోతులలోనుండి కాష్టములలోనుండి నదులలోనుండి నరకములోనుండి స్వర్గమునుండి ఒక్కపెట్టున వేలకొలది దండెత్తి మీపట్టణము ముట్టడివేసి ఈపని మీచేత చేయించెదము. మా ఆకారములు మేము బ్రతికియున్నప్పు డున్నట్లుండవు. మమ్ములనుచూచిన మాత్రమున మీరు గడగడవడకి పోవుదురు. మీ గుండెలు పగిలిపోగలవు మీ యిండ్లకువచ్చి చూరులు పట్టుకొని వ్రేలాడెదము. దూలములమీద కూర్చుండెదము. తలుపులు వేసినను మేము లోపలికి రాగలము. మీకు నిద్రపట్టనీయము పట్టినను కలలో మేమే కనబడుచుందుము. జాగ్రత్త! జాగ్రత్త!

ఈపైసంగతులన్నియు గవర్నమెంటువారి యుత్తర్వు కాలేదనియు అది యేప్రిలులో అగుననియు మీరు త్తరము చెప్పెదరేమో వర్షకాలము వెళ్ళిపోయినప్పటినుండి అనగా చావులు మానినప్పటినుండి యిక్కడ పందిళ్ళు కావలయును. గవర్నమెంటువారికి వ్రాసి యొకమారే మీరు శాంక్షను చేయింపవచ్చును. గవర్నమెంటువారు శెలవియ్యకపోరు. ఇది మీలోపముగాని గవర్నమెంటువారిలోపము కాదు. ఎలెక్షనురోజులలో మీకున్న చాకచక్యము నడచునట్టి ఓపిక, డబ్బు కర్చుచేయుటలోని చొరవ తర్వాతకూడనున్న పక్షమున ప్రజలకిటువంటి యిబ్బందులు రావుకదా! చచ్చిపోయిమీకంటి కగపడుటను [illegible]

మే యవస్థలో నున్నామో, బ్రతికి యధికారములోనుండి చిన్నయుప కారములు జేయలేక మీరును ఆయవస్థలో నున్నారు. కాబట్టి యికమీఁద మాలో లింగధారులయినవా రందరు గోతులలోనుంచి లేచినట్లె, మీరు గూడ అశ్రద్ధసమాధిలోనుండి, లేచి, ఒక్కసారి శ్మశానభూములలోకిపి కారుగా పగలు10గంట లప్పుడు నొడుగుజోడు లేకుండ దయచేసి, అక్కడ జనులు పాండెడిఅవస్థస్వయంగా తాము తెలిసికొని పందిళ్ళు వేయుటకై యుపక్రమింతురని ప్రార్థించు చున్నాము.

ఇట్లు విన్నవించువిధేయులు,

యిసుకతిప్పనివాసులు, పితృదేవతలు,

రాక్షసనామసంవత్సర, పూర్వాషాఢమాస,

సప్తమి, శనివారం,

విష్ణువర్ధనపురం, మకాం యిసుకతిప్ప.

రెల్లుదుబ్బులపోష్టు.

—౯—

మార్కండేయ స్వామివారి మనవి

రాజమహేంద్రవర పట్టణమందున్న మహాజనులందరు నా మనవి సంపూర్ణముగా శ్రద్ధతో నోపికతో శాంతముతో ప్రారంభము మొదలుకొని చిట్టచివరవరకు నొక్క యక్షరమైన విడిచిపెట్టకుండ చదువుకొని దానికి తగిన ప్రతి క్రియ చేయుదురుగాక!

నేను రాజమహేంద్రవరమునకు పాతకాపును. నా కంటె పూర్వులెవరు ఇక్కడ లేరు. వేణుగోపాలస్వామివారును. సీతారామ

స్వామివారును ఆంజనేయస్వామివారును, నరసింహ స్వామివారును, కోటిలింగేశ్వరస్వామి వారును, చామాలమ్మయు, కోరలమ్మయు, నేను వచ్చిన తర్వాతనే యీ గ్రామము ప్రవేశించినారుకాని, నాకంటె ముందు రాలేదు పట్టణమధ్యమందున్న పక్షమున జనులకు నావల్ల బాధ కలుగునేమో యని సందేహించి మొట్టమొదటనే నేను గోదావరి మహానది యొడ్డున వెలిసినాడను. ఆస్తికబుద్ధికల మహానుభావులు కొందఱు నాకు గుడి గోపురము మంటపము మందిరము కట్టించి నాయందు భక్తిప్రపత్తులు చూపించినారు. నాటినుండి పురజనుల యభిమానముచేత ఇంత విభూతి మేన ధరించి, మారేడుపత్రి నెత్తిన పెట్టుకొని యెవరో కొందఱు భక్తులుచేసిన యభిషేక జలముతో తృప్తినొంది ''తదన్నం తద్రసం'' మన్నట్లుగా నొకరిజోలికి నే బోక నా జోలికొకరిని రానీక నాగుడిలోనే పడియుండి కాలక్షేపము చేయుచున్నాను. నేనిచ్చటికి వచ్చిన వేయి సం॥ములనుండి నాకిదివఱ కేవిధమయిన బాధయు విశేషముగ గలుగ లేదు. ఇప్పుడొక క్రొత్తబాధ నాకగుచున్నది. ఆబాధ యేమనగా చెప్పుకొనుటకు నాకే సిగ్గగుచున్నది. ఇన్నాళ్ళు బ్రతికి యింటివెనుక గచ్చేరా యన్నట్లు, భూమికంటె ముందుపుట్టిన జాంబవంతునివలె నీపట్టణముకంటె ముందుపుట్టిన నేను నిన్న మొన్న పుట్టి కన్నులు దెఱచిన మీవంటివారితో భగవంతుడనై యుండి నాయవస్థ నే జెప్పుకొనవలసి వచ్చెగదా యని నాకెంతో సిగ్గగుచున్నది. సిగ్గేకాదు విచారము గూడ కలుగుచున్నది. నా యాలయమునకు పడమటిప్రైపున నూతనముగా నిర్మింపబడిన గట్టుక్రింద పట్టణాధికారులు మురికికాలువ కొకదాని నేర్పరచినారు. దీనిని నిర్మించుటలో వారియుద్దేశము మంచిదేకాని, నాకు ప్రాణముమీదికి వచ్చినది. ఎన్నో ప్రాకారముల మధ్య వెలుతురు రాని గర్భగుడిలో దాదాపుగా నెల్లప్పుడు తలుపులు వేసికొని మూల కూర్చుండునట్టి నాకే ఆ మురికికాలువకంపువల్ల ఎంతో బాధ కలుగుచుండగా, గోదావరి యొడ్డునకు వెళ్ళి దాని సమీపమున

నడుచుచుండు పురజనులకు యెంత బాధకలుగుచున్నదో నేను చెప్పనక్కరలేదు. అయినను నాగోల నేను చెప్పుకొనవలెనుగాని, పురజనుల గోల నాకెందుకు. నావిగ్రహము రాతివిగ్రహమన్నమాట మీకు తెలుసునుగదా! రాతివిగ్రహమునకు రాతిముక్కలు రాతిపేగులుండునుగదా! ఈ దుర్వ్యాసనకు నా రాతిముక్కలు పగిలిపోవుచున్నవి. నారాతిపేగులు బ్రద్ధలవుచున్నవి. నారాతివెండ్రుకలు మాడిపోవుచున్నవి. నాగర్భగుడిలోనున్న గబ్బిలపు కంపయినను నాకింత బాధలేదు. శ్మశానములలో నే నున్నప్పుడును నాకింత బాధకలుగలేదు. నాబాధ యట్లుండగా నాయాలయములోనికి ననేకకారణముల చేత వచ్చెడు జనసంఖ్య యిదివరకే తగ్గిపోయినది. దీనిజేత మునుపు వచ్చెడు కొద్దిమంది కూడ రారని భయమువేయుచున్నది. మీరు గుళ్ళోకి రాకపోయినను సరే ఈకంపు లేకుండ చేసినపక్షమున, మీరు నాగుళ్లో సాంబ్రాణి, హారతికర్పూరము, ధూపము వేసినంత ఫలము, అగరువత్తులు వెలిగించినంత ఫలము. అత్తరుపన్నీరు చల్లినట్లు సంతోషించెదను. పెద్దముండావాడను, నాకు తల్లి, తండ్రి, బిడ్డ, పాప, అన్న, తమ్ముడు, చుట్టము, పక్కము లేరు. అన్నిటికి మిమ్మే నమ్మికొనియున్నాను. ఈకంపుచేత నాకేరోగము ప్రవేశించునో యని భయము వేయుచున్నది. ఒంటిగాడనగుటచేత నా కుపచారములు చేయువారెవరు లేరు. ఉన్నపూరు గనుక లేచిపోలేక మానమునకు కట్టుబడి యేలాగో ఉన్నాను ఇక నుండ శక్యముకాదు. ఈపట్టున మీరు జాగ్రత్తపడి యీబాధ నివారించకపోయినపక్షమున నాడబ్బా డవాలి తీసుకొని యిక్కడనుండి బిచాణాయెత్తి మఱొకచోటికి బోవ నిశ్చయించుకొన్నాడను.

చిత్తగించవలెను,

ఇట్లు,

మార్కండేయస్వామి.

—*—

జీవన్మృతోపాఖ్యానము

వేగినాటిలో వెఱ్ఱిరాయిపేరు గలగ్రామ మొకటిపూర్వకాలమున నుండెను. ఆగ్రామమీకాలమునగూడ నున్నదేమో చెప్పజాలము. ఆగ్రామమునందు పూర్వము ఒకానొక కాలమునందు విచిత్రమైన మనుష్యులు కాపురముండిరి. కొందరకు వెఱ్ఱి కొందరకు పిచ్చి, కొందఱికి తగని ఛాందసము. కొందరికి బుద్ధిమాంద్యము, కొందరికి మతిస్థైర్యలోపము, కొందరికి మూగ, కొందరికి చెవుడు, కొందరికి గ్రుడ్డితనము, మాటలు నేర్చినవారి కందఱికి నొకవిధమయిన నత్తి, ఈవిధముగానున్న గ్రామములలో నొక కుటుంబముకలదు. ఆకుటుంబయజమాని పేరు వెఱ్ఱివెంగళప్ప, వెఱ్ఱియనునదితల్లిదండ్రులు వానికిచ్చినది కాదు. అది ప్రజ్ఞవలన సంపాదించుకొనిన పౌరుషనామము. ఈపౌరుషనామమీతని కొకనికేకాక తండ్రికిని తాతకును గలదు. మూడునాలుగు పురుషాంతరములనుండి వచ్చిన యీపౌరుషనామము వెంగళప్ప కొకవిధమయిన పిత్రార్జితమని చెప్పవచ్చును. ఆకుటుంబములో కెల్ల నతడే పెద్దవాడును తక్కువ వెఱ్ఱితలవాడునగుటచే నతడింటిపెత్తనము చేయుచుండెను. వెంగళప్ప యొకనాడు విస్తరలు కుట్టుకొనుటకై మఱ్ఱియాకులు కావలసి యూరిబయటనున్న పొలమునకు బోయి అక్కడ మఱ్ఱిచెట్టెక్కి సన్నపాటి యొక కొమ్మమీద గూరుచుండి ఆకులు గోయుచుండెను. అప్పుడా దారిని మేకలు దోలుకొనుచున్న యొక గొల్లవాడు పోవుచు నెండవేడిమి కోర్వక యా చెట్టు నీడ నిలిచి చప్పుడగుచుండుటచే వెదకి జూచి వెంగళప్పను కనుగొనెను. వెంగళప్ప బ్రాహ్మణోత్తముడనియు, వైదికశిఖామణియనియు మీకుజెప్ప నిదివఱకే మఱచితిని. బ్రాహ్మణుల కుపకారము సేయుట పుణ్యమని గొల్లబోయుడు నమ్ముటచే నతడిట్లనియెను——

''ఓ బాపనయ్యో! సిట్టసివర కొమ్మమీద గూకుండున్నావు; కొమ్మగనిరిగిపోతే నేలమడి కాలిఅగ్గొట్టుకొంటావు. పదలంగుండు

బాపనయ్యా'' అనిపలికి గొల్లబోయడు మేకలందోలుకొని సాగిపోయెను అతడు 10 బారలరుగకమునుపే కొమ్మ విరిగినందున వెంగళప్ప గుబాలున క్రిందపడెను. అతనిఅదృష్టమేమోకాని గట్టిదెబ్బయాతనికి తగులలేదు. తల పగులలేదు కాలుసేతులువిరుగ లేదు. మోకాళ్ళమీద చర్మముమాత్రము కొంతకొట్టుకొనిపోయినది. పడినతోడనే వెంగళప్ప పీసమైన భయపడక చప్పుచప్పున మేనుదుల్పుకొనిమడతబడిన కాలొకసారి ఝాడించి గబగబ పరుగెత్తి నడచుచున్న గొల్లబోయని కలిసికొని చేయిపట్టుకొని ఆపి యిట్లనియెను. ''నీవుమహానుభావుడవు. లోకములో నీకు దెలియని యంశములు లేవు జ్యోతిష శాస్త్రములో నీవంటి ప్రజ్ఞకలవాడు లోకములో లేడు. చెట్టుమీద నుండి నేను పడిపోదునని నీవు చెప్పితివి. చెప్పిన 4 నిమిషములకే నేనుపడితిని. నే నెప్పుడు చచ్చిపోదునో చెప్పవలయును'' అనవుడు గొల్లవాడు గొల్లబోయి ''బామ్మనయ్యా నేను సదుముకోలేదు. ఆయుస్సు మూడితే అంతా సత్తారు. నువ్వెప్పుడు సత్తావో నేనెప్పగల్నా. లేతగొమ్మ మీద గూకుంటె పడ్తావని మాటవాసికన్నాను. నే సెప్పలేను. నన్నిడిసిపెట్టు పోవాల'' యని బదులు చెప్పెను. బ్రాహ్మణుడాపలుకులు చెవినిబెట్టక ''తెలిసినవారు తెలిసినదని చెప్పకొందురా? నీవు భగవంతుడవు. నీ కన్నియు దెలుసును. నాకు చెప్పకతప్పదు. లేనిచో నిన్ను విడువ'' నని బలవంతపెట్టెను. అప్పుడు గొల్లవాడు ప్రాణమువిసిగి యెట్లయిన తప్పించుకొని వెళ్ళదలచి యిట్లనియె—''నీ కాలికిందికి నీళ్ళెప్పుడొస్తయో అప్పుడు చచ్చిపోవుదువు'' అని చెప్పగానే వెంగళప్ప బ్రహ్మానందభరితుడై ''మహానుభావా! నాకు నిజమెరిగించితివి. ఇది మొదలుకొని నేను మిక్కిలి జాగ్రత్తగా నుండెదను'' అని వానిని వదలి పెట్టెను. వదలినదే చాలునని గొల్లవాడు తనదారిని బోయెను. బ్రాహ్మణుడును తనలో నాలోచన చేసుకొనుచు నింటికి పోయెను.

ఇంటికివెళ్ళి వెంగళప్ప ఆదినము మొదలుకొని తన కాళ్ళ క్రిందికి నీళ్ళు రాకుండునట్లు జాగ్రత్తగ జూచుచుండెను. చెఱువులో దిగి స్నాన మొనర్చిన పక్షమున కాళ్ళక్రింద నీళ్ళుండును. గనుక తనకు నామే ప్రాణముపోవునని చెఱువులలో నదులలో కాలువలలో దిగుట మానెను. ఇంటివద్ద స్నానముచేయునపు డెత్తైన పీటమీదనిలుచుండి స్నానముచేయుచుండెను. వాన కురిసినప్పుడు ఇల్లు కదలుటమానెను. చేతులు కాళ్ళు కడుగుకొనినప్పుడుకూడ మిక్కిలి యెత్తైనచోట నిలిచి కాలు చెయ్యి దూరముగాజాపి కడుగుచుండును. ఈవిధముగా బహు ప్రయత్నములుచేసి యాత్మసంరక్షణము చేసికొనుచుండగా దైవవశమున నొకనాడొక వైపరీత్యము జరిగెను. వెంగళప్ప నడివీధిలో నొక పెద్దమనుష్యునితో నేదో మాటలాడుచుండెను. ఒకమనుష్యుడు కుండలకావడి వేసికొని చెరువునుండి నీళ్ళుతీసికొని యాదారిని బోవుచుండెను. పోవుచుండగా కావడిమట్లు తెగి కుండలు భల్లున నేల బడి పగిలిపోయెను. వెంగళప్ప యాప్రక్కనె నిలిచియుండుటచేత నీళ్ళు వాని కాలిక్రిందికివచ్చెను. వచ్చినతోడనే వెంగళప్ప నిశ్చేష్టుడైచూపు మొద్దుపార అయ్యో చచ్చితి చచ్చితినని నేలబడెను. ఏమిసంగతి ఏమి సంగతి యని వెంగళప్పను బహువిధముల నడిగిరికాని, వాడొకతడే ప్రత్యుత్తర మియ్యజాలకపోయెను. అప్పుడు పదిమంది చేరి వానినెత్తి యొక బండిమీదవేసి యిల్లుచేర్చిరి. ఇంటికి వెళ్ళగానె వెంగళప్ప భార్యను బిడ్డలను బంధువులను కౌగిలించుకొని నా కాళ్ళక్రిందికి నీళ్ళువచ్చినవి. నేను చచ్చిపోయినాను. చచ్చిపోయినవానితో కలసి గృహమందుండరాదు. అందుచేత మీరిక్కడనుండి లేచిపొండి' అని చెప్పి యేడ్చెను. ఇంటివారందరు వెర్రివాండ్రు గనుక చచ్చినవానితో కాపురముచేయుట మంచిదికాదని యక్కడనుండి లేచిపోవుటకు నిశ్చయించుకొనిరి. గ్రామములో నందఱుకూడ మట్టితల మనుష్యులేగనుక

వారిమాటనే యనుసరించిరి. తెలివితేటలుగల మనుష్యు లొకఁ డిద్దరు వెంగళప్పగారి యింటికివెళ్ళి చచ్చిపోయినవారు మాటలాడరు. కదల లేరు మెదలలేరు కాబట్టి వెంగళప్ప చచ్చిపోలేదు. అని తెలియజెప్ప జూచిరిగాని, సర్వజ్ఞుడైన వెంగళప్ప వారిమాటలనమ్మక కాళ్ళక్రిందికి నీళ్ళువచ్చునప్పుడు చచ్చిపోదునని గొల్లవాఁడు చెప్పెను. వాఁడికంటె నెక్కుడ తెలిసినవారు కలరా! మేకను చంపిన తర్వాత దానితల కొంతసేపు కొట్టుకొనును. ఆవిధముగానే నేను చచ్చిపోయినతర్వాత కొంతసేపు మాట్లాడుతున్నాను. నేను చచ్చితిని, ఇదినిశ్చయము. నా మాట చచ్చినవానిమాట. నానడక చచ్చినవాని నడక, నాబ్రతుకు చచ్చినవానిబ్రతుకు, నాచూపు చచ్చినవానిచూపు. కాబట్టిమీరందరు నన్నువిడిచిపొండియనిపలుమారు నొక్కిచెప్పెను. అట్టివానితో వాదించుటకంటె నిష్ప్రయోజనమైనపని మరియొకటిలేదని వారందఱు తొలఁగిపోయిరి. ఇంటివారందఱు నాటిరాత్రి యిల్లువిడిచి మఱియొక స్థలమున కరిగిరి. చచ్చిపోయినవాఁడుగావున వెంగళప్పమాత్రము ఆగృహమందుండెను, అందరు లేచి వెళ్ళినతర్వాత వెంగళప్ప తలుపులు నాల్గు లోపలబిగించుకొని యొక బోషాణములో పండుకొని తలుపు మూఁతవేసికొనెను. వెంగళప్పగారు మృతినొందిరనియు, వారిచుట్టము లాగృహమునుండి లేచివెళ్ళిరనియు విని యాకస్మికముగా వారువెళ్ళి పోవుటచేత గృహమందు సామానులు మొదలగునవి విడిచివెళ్ళిరనియు లోకమున వాడుకపుట్టుటచే దొంగ లాగృహమున బ్రవేశించినపక్షమున మంచియాస్తి చేయిచిక్కునని అర్ధరాత్రమందు దక్షిణపుగోడకు కన్నముత్రవ్వి ప్రవేశించిరి. తలుపుబిగించుకొని వెంగళప్ప లోపల పండుకొనుటచే వారు తల్పుయొక్క ఉచ్చికలనెత్తి గదిలో ప్రవేశించిరి. వారువచ్చుట యెఱిఁగి వెంగళప్ప కేకలువేయక యూరకుండెను. దొంగలు నలుప్రక్కలఁజూచి బోషాణవద్దకువచ్చి దానినెత్తిచూచిరి

వెంగళప్ప పండుకొనియుంటచే మిక్కిలి బరువుగానుండెను. బరువు జూచి సొమ్మున్నదని దొంగలు దానిని మోసికొనిపోవ నిశ్చయించిరి. దొంగలు బోషాణ మెత్తుచుండగా వెంగళప్ప తనలోనిట్లనుకొనెను: ఆ! చచ్చిపోయినతర్వాత జరుగవలసిన ముచ్చటలన్ని జరుగుచున్నవి. చచ్చినవారు యమలోకమునకు వెళ్ళుదురు ఈవచ్చినవారందరుయమ దూతలు. నన్ను యమధర్మరాజునొద్దకు తీసికొనిపోవుచున్నారు. నేను వద్దని కేకలు వేసిన మానుదురా? యమదూతకు జాలి జంతుకలదా! చచ్చినవాడను గనుక చచ్చినవారు పడవలసిన పాటులన్నిటిని పడవలెను. కేకలువేసినపక్షమున కోపగించి వారుమరింత దండింతురు కాబట్టి యూరకుండుటె యుత్తమపక్షము. ఇదిగో! బోషాణమును వీరు దక్షిణపుదిక్కుగా తీసికొని పోవుచున్నారు యమలోకము దక్షిణపుదిక్కున నున్నదిగదా! అయ్యో! ఆయమధర్మరాజు యెట్లుండునో ఏమనునో? చిత్రగుప్తుడు నామీద నేమివ్రాసెనో! ఏమివ్రాసిన నేమి చేయగలను. అనుభవింపకతప్పదు.’’ ఇట్లనుకొనుచు వెంగళప్ప దొంగలు బోయలుగా, బోషాణము పల్లకిగా. వాహన యోగము కలిగినవారిలో వెళ్ళువానికి గలిగిన కుదుపులు ఉలాకులు మొదలగు వానివలన గలుగు సౌఖ్యములు అనుభవించుచుండెను. లోపలనున్న వెంగళప్ప యిటుట్టు కదలుచుండుటచే దొంగలు మనుష్యుడున్నట్లె అనక బోషాణములోనున్న నగలుపెట్టెలు దొర్లుచున్నవని భ్రమపడి యెప్పుడు త్వరగా నడవికి వెళ్ళుదుమో యెప్పుడు బోషాణము పగులగొట్టి కనులపండువుగా సొమ్ముపెట్టె చూతుమో యెప్పుడు ధనముపంచుకొందుమో యని యూటలూరుచు శ్రమపడి మిక్కిలి వేగముగా బోషాణమును మోసికొని నడచిరి. నాలుగుగడియల తెల్లవారుగట్టున దొంగ లడవి జేరిరి. వారు మొదట బోషాణము తలుపుతాళము వేయబడియున్నదనుకొని గొడ్డళ్ళతో బ్రద్దలుగొట్ట

నారంభించిరి. ఆచప్పుడు వినగానె వెంగళప్పగుండెలుఝల్లుమనెను. యమదూతలు యమలోకమునకు తన్ను తీసికొనివచ్చినారని వెంగళప్ప నిశ్చయించుకొనెను. యమధర్మరాజును ఎట్లుచూతునను భయముతో నాతని శరీరము వడకజొచ్చెను శరీరము చెమటలుబట్టెను దొంగలు తలుపుబద్దలుకొట్టి చెక్కలు తొలగించునప్పటికి వెంగళప్ప బాబో! నాయనో! యని పెద్దకేకలు వేయుచు బోషాణములో దబ్బున లేచి నిలుచుండెను. యమదూతలు కొట్టి చంపుదురనే యాతని భయము. భయముచేతనే కేకలువేసెను. అట్లు కేకలువేయుచు బోషాణములోనుండి గుభాలున లేచిన వెంగళప్పను జూచి దొంగలు నిశ్చేష్టులయి కొంతసేపటికి నిట్లనుకొనిరి: ''ఒరే వెంగళప్ప దయ్యమయినాడు. చంపితినగలడు. రండి రండియని పారిపోయిరి.

అట్లు దొంగలు కొంతదవ్వు పారిపోయి ఒకచోట నిలిచి వెంగళప్పను జూచి వీడు నిజముగా దయ్యమేయని వెంగప్పను రాళ్ళుపుచ్చుకొని కొట్ట నారంభించిరి. రాళ్ళు మీద పడగానె వెంగళప్ప తనలో నిట్లనుకొనియెను; ''నేను చచ్చినవాడను గనుక యమదూతలు చచ్చినవానిని బాధపెట్టుట సహజమేగనుక నామీదరాళ్ళు రువ్వుచున్నారు. ఎట్లైనను నేను వెళ్ళి కొట్టవద్దని బతిమాలుకొనియెదను.'' అని నిశ్చయించుకొని యతఁడు దొంగలవంక పరుగెత్తసాగెను. ఆపరుగు జూచి దొంగలు మరింత భయపడి ఓరీ మనలను పీక్కుతినుటకై వెంగళప్ప వచ్చుచున్నాడు. రండి రండి యనియును పటికంటె వేగమున బరుగెత్తజొచ్చిరి. వెంగళప్ప తనచుట్టునున్న అరణ్యమంతయు యమధర్మరాజు సభయనియు దొంగలు యమదూతలనియు దృఢముగానమ్మెను. దొంగలు, వెంగళప్ప తరుముకొని వచ్చుటచే చుట్టుప్రక్కల నిలువక తిరిగిచూడక యొక్కటే వరుసను పరుగెత్తి యదృశ్యులయిరి. నిర్జనమైన యా మహారణ్యమున కంటికి కనబడుచున్న నేలకంతకు దానిలోని వృక్షములకానేకప్రభువై వెంగ

ళప్పయొక్క డేయుండెను. ఆయరణ్యమంతయు సాయంకాలమువరకు వెంగళప్ప తిరిగి యలసిపోయెను. సహజమైన యాకలి ఆయాసముచే మిక్కుటమయ్యెను. అతడాహారము నిమిత్తము వెదకెనుగాని తగిన వేవియు కానబడలేదు. ఆరాత్రి యతడొక చెట్టుక్రింద పండుకొనియెను. మరునాడు లేచి దొరకినపండ్లు భక్షించెను ఏపూటకాపూట కతడు యమధర్మరాజు యెదుటకు వెళ్ళవలసియుండునని భయపడసాగెను. అడవిలోనున్న పల్లెలలోనికి వెళ్ళగూడదాయని చదువరులు దేసంహాపకవచ్చును. చచ్చిపోయినవాని గృహములోనికి రానియ్యరని మన వెంగళప్ప నిశ్చయముగ యెఱుగును గావున గ్రామములోనికి వెళ్ళసాహసింపలేదు. ఇట్లు కొన్నిమాసములుగడచెను. అంతలో శీతకాలము ప్రాపించెను. అందఱకుగల చలిబాధ తీర్చునట్టి కుంపటులు గూడ చలిబాధచేత మంచములక్రింద దూరవలసివచ్చెను. ఆసమయమున వెంగళప్ప ఒకానొకగ్రామ సమీపముననున్న అరణ్యములో నివసించియుండెను. కప్పుకొనుటకు వస్త్రములు లేకపోవుటచే నతడు చలిబాధ కోర్వలేక ప్రతిదినము రాత్రి జాముప్రొద్దుపోయినతరువాత చాకిరేవుకు వెళ్ళి అక్కడ నొక బానక్రింద వెచ్చగా గూర్చుండ జొచ్చెను. తెల్లవారుజామున బట్టలుదుకుకొనుటకై చాకలివాండ్రు వచ్చి బాన యెత్తునప్పటికి వెంగళప్ప తన్ను దీసికొనిపోవుటకై యమదూతలువచ్చినారనుకొని బాబోయి నాయనోయిఅని కేకలు వేయుచు లేవజొచ్చెను. ఇట్లు జరుగుటచేత నాయూరి చాకలివాండ్రందఱు దయ్యమువచ్చి బానలక్రింద గూర్చుండుచున్నదని భయపడి తెల్లవారుజామున బట్టలుదుకుటకై వచ్చుట మానివేసిరి. నాలుగు గడియల ప్రొద్దెక్కిన తరువాత రేవునకు వచ్చి చాకలివాండ్రు నాలుగు గడియల ప్రొద్దువేళ నె యింటికి బోవజొచ్చిరి. అది కనిపెట్టి వెంగళప్ప మరల బానలక్రింద దూరజొచ్చెను. ఆయూరిలో నొక సాహేబుగా

దుండిరి. ఆయనకు వందలకొలది దుస్తులుండెను. తనబట్ట లుదుకుటకై యాతఁడు ప్రత్యేక మొక చాకలివాని నేర్పరుచుకొనియెను. వాఁడు తెల్లవారుజామున లేచి ప్రతిదినము నాలుగుగడియలప్రొద్దుపోవువరకు పనిచేసినగాని యతనిదుస్తులు పరిశుభ్ర మగుట లేదు. అటులుండగా జాము ప్రొద్దెక్క వెళ్ళి జాముప్రొద్దువేళ యింటికి వచ్చినప్పుడు పనియగునా? అందుచేత సాహేబు చాకలివానిమీఁద మిక్కిలి కోపించెను. చాకలి సాహేబుగారివద్దకు వెళ్ళి దయ్యము బాధమూలమున తన పని యడ్డినదని మనవిచేసికొనియెను. "దయ్యములు లేవు గియ్యములు లేవు నట్టి యబద్ధము" అని సాహేబు వానిని తిట్టెను. ఏలినవారు వచ్చి చూడుడని చాకలి మొఱపెట్టుకొనియెను. "రేపురాత్రి వచ్చెదను తెల్లవారుజామున నన్నువచ్చి లేపు దయ్యమును గుఱ్ఱపుకొరడా పుచ్చుకొని వీపు పగులగొట్టెద" నని సాహేబు చెప్పి చాకలిని యింటికి పంపెను. చాకలి మఱునాడు రాత్రి సాహేబుగారిని లేపి తీసికొని వచ్చెను. ఇద్దఱు చాకిరేవునకు వెళ్ళిరి. ఇదియే నాబానయని చాకలి చూపి వెనుకకు తగ్గెను. సాహేబు దయ్యమేదిరాయని వాని బాన తన్నెను. దైవవశమున వెంగళప్ప ఆ బానక్రిందనె కూర్చుండుటచే యమధర్మరాజో యమదూతలో తననిమిత్తమువచ్చినారనుకొని బావుమని యేడ్చుచు లేచెను. అదివినగానే చాకలి పిక్కబలముజూపెను. సాహేబు గుండెలు జల్లుమనియెను, అనగానే యతఁడు పరుగు లంకించుకొనియెను. వెంగళప్ప బానలోనుండిపైకివచ్చి యమధర్మరాజుగారిని బతిమాలుకొనుటకై నిలువుటంగీ కొంగును గట్టిగా పట్టుకొనెను. దయ్యమువచ్చి తన్నుబట్టుకొనెనని భ్రమించి సాహేబు శరీరము తెలియక వెంగళప్పనుగూడ బరబరలాగికొని పరుగెత్తెను, నేలబడి యీడ్వఁబడుచున్న వెంగళప్ప పట్టువదలలేదు. సాహేబు చాకలి భయముచేత అరవజొచ్చెను. వచ్చినవారందఱు దయ్యమునకు భయ

పడి అరుగులెక్కి చెట్లెక్కి చూడఁజొచ్చిరి. అప్పుడు ధైర్యవంతులు కొందఱువచ్చి మనుష్యుఁడేకాని దయ్యము కాదని వెంగళప్పను పట్టుకొని యీవలకు లాగిరి. అప్పుడు సాహేబు ధైర్యము దెచ్చుకొని నిలువబడెను. చేరినవారందఱు వెంగళప్పనుజూచి వానివృత్తాంత మడిగిరి. అతఁడు తనవృత్తాంతమును పూసగ్రుచ్చినట్లు చెప్పెను. అది విని వారు వాని యమాయకత్వమునకు విస్మితులై "నీవు చచ్చి పోలేదు బ్రతికియే యుంటి" వని యనేకములైన నిదర్శనములఁజూపి తెలియజెప్పి వాని నోడంబరచి యింటికి పంపిరి.

—*—

ఆకాశరామన్నోపాఖ్యానము

ఈ మహానుభావుల చరిత్ర వ్రాయవలయునని చిరకాలము నుండి మాకు కుతూహలము కలదు, కాని అందుకు తగిన యాధారములు మాకెంతప్రయత్నము చేసినను లభించినవి కావు. ఆధారములు దొరకలేదను కారణమున ఇటువంటి మహాపురుషుని చరిత్రము వ్రాయక యూరకుండుటకంటె (ప్రస్తుతముదొరకినన్ని) యాధారములతో నేదోయొక విధముగ నీతని చరిత్రము వ్రాయుట మంచిదని తలంచి సంగ్రహముగా వ్రాయదలచుకొన్నారము. మాశక్త్యైనంత వఱకు మే మిప్పుడు వ్రాసి విడిచితిమా ముందుముందు బహువత్సరములైన యాధారములను సంగ్రహించినవారు వాని చరిత్రమును సవిస్తరముగా వ్రాయగలరు. ఆకాశరామన్నగారు ఏయుగములో ఏశతాబ్దములో జన్మించిరో నిర్ణయించుటకు దగిన యాధారములుదొరికినవి కావు. ఆకాశమువారని యింటిపే రుండుటచేతను, రామన్నయని

పేరుండుటచేతను, ఈయన తెనుగుదేశపువాడని స్పష్టముగా చెప్ప వచ్చును. తెనుగుదేశములో రామన్న సుబ్బన్న, వెంకన్న పుల్లన్న యనునట్టిపేరులు విశేషముగా నుండుటచేత తెనుగుదేశపువాడే యని మే మూహింపవలసి వచ్చినది. రామన్న సింగన్న మొదలైన పేళ్ళు కన్నడదేశస్థులలో కొందఱ కుండునుగాని వారికీ నిధములైన యింటి పేళ్లుండవు. అందుచేత నీతడు తెలుగువాడేయని మేము నిశ్చయించు చున్నాము. ఒకవేళ ముందుముందు బుద్ధిమంతు లెవ్వరైనను బయలు దేరి దేశచారిత్ర మందలి యభిలాషచేత పురాతనములైన తామ్రశిలా శాసనములు, ప్రబంధములు, చీకి తాటియాకుల గ్రంథములు చెదలు పట్టిన అర్జీలు, దస్తావేజులు, శోధించి వెదకి తెలుగువాడు కాడని సత్యము నిర్ధారణ చేసిన పక్షమున మేము మా వాదమును వదలు కొని దిద్దుకొని మార్చుకొని సరిజేసుకొని అట్టివారికి అనేక శిరస్సా ష్టాంగ దండ ప్రణామము లాచరించి శాశ్వత బ్రహ్మకల్పముగాకృత జ్ఞులమై యుందుమని యిందుమూలముగా ప్రమాణ పూర్వకముగా, గాయత్రిసాక్షిగా, వట్టు పెట్టుకొని వాగ్దానము సేయుచున్నాము. ఆకాశరామన్నగారే గ్రామములో యేజవతార మెత్తినారో, ఏకులము వీరిజన్మ కారణముచేత పావనమైనదో ఏజననీజనకులు ఈయనను తమగర్భవాసమున కనిపెంచుటచేత ధన్యాత్ములై విలసిల్లిరో యెంత మాత్రము తెలియకుండుట మిక్కిలి విచారకరమైన సంగతి. ఈవిచా రమును మేము భరింప జాలకున్నాము. దేశ చరిత్రములేని లోప మిప్పుడు కనబడుచున్నది చరిత్రములు వ్రాయునట్టి యాచారము పూర్వకాలమున మన దేశములో నున్నపక్షమున మన పూర్వ కాలపు కవులు ఆకాశరామన్నగారి దివ్యచరిత్రమును చిత్ర విచిత్ర ముగా భారతముకంటె రామాయణముకంటె నెక్కువ గ్రంధ ముగా రచియించి యుందురుకదా! అటువంటి భాగ్యము మనకు

పట్టినదిగాదు. ఇప్పుడు దొఅకినంతవరకీ స్వల్పచరిత్రమును మా చెప్పిడి మాటలతో వినవలసి వచ్చినది. ఇందుకు చదువరులు మమ్ము క్షమింతురుగాక! ఈతప్పు ప్రాచీనకవులదిగానిమాదికాదు. ఇకముందు బయలుదేరబోవుచున్న కవులైనను ప్రాచీనకవులమార్గముద్రొక్క-క మిక్కిలి చిత్రమైనటువంటి మహానుభావులు ఈయన చరిత్రమును తమ రసవంతమైన వాక్కులచేత వర్ణించి తమ కవిత్వమును ధన్యముచేసి కొందురుగాక! ఆకాశరామన్నగారికి సోదరులెవరున్నట్లు కనపడదు కాని, పినతల్లికొడుకు లిద్దఱున్నట్లు కనబడుచున్నది. వారెవరనగా:- నల్లకాటి రామనాథయ్యయు, పిడుగు అగ్నిహోత్రుడును వీరు రామన్నగారికి దశరాత్రములు పురుడు పుణ్యములుగల జ్ఞాతులుకారు. ఇంటిపేరు భేదముగుటచే నీ సంగతి తెలిసికోగలిగితిమి. మూడు దినములు పక్షిణీతో సరిపోవునట్టి దగ్గరిబంధువులు. ఆకాశరామన్నగారు మార్కండేయ మహాముని మొదలగు వారివలె చిరకాల జీవులు, గాలివలె సర్వవ్యాపకులు, యెండవలె తీక్ష్ణమైనవారు. చలివలె మనుష్యులను గడగడ వడకించునట్టి ప్రజ్ఞ కలవారు. ఈయన శ్రీమన్నారాయణమూర్తి వారివలె అనంతకోటి యవతారముల నెత్తియున్నారు. విష్ణుమూర్తివారెత్తిన యవతారములలోరూపభేదమెగాక నామభేదమును గలదు. ఈయన యవతారములలో రూపభేద మున్నదిగాని నామభేదము లేదు. ఏ పట్టణములోనున్నను సరు ఏయూరిలోనున్నను సరె యీాయనపేరు ఆకాశరామన్న యందురు. ఈయన యవతారములు ప్రతిగ్రామములో నున్నవి. ఈయనకొన్నిచోట్ల పడుచువాడుగాను, కొన్నిచోట్ల ముసలివాడుగాను కొన్నిచోట్ల నడివయస్సుకలవాడుగాను, కనుపడుచుండును. ఇప్పటివరకీయన స్త్రీరూపము ధరించినట్లు కనపడదు. విష్ణుమూర్తిగా రొకసారి జగన్మోహనావతారమను పేర స్త్రీ రూపమెత్తినట్లు కనపడుచున్నదిగాని, ఆకాశరామన్నగారు

అప్రతిష్టయనియో, పౌరుషహీనమానియో మఱియేకారణముచేతనో స్త్రీరూప మెత్తలేదు. అందువేతనే యీయన శ్రీమహా విష్ణువుకంటె తానెక్కువ వాడనని తనలో తాను గర్వించి బిరబిగిసి పిరవీగు చుండును. ఈయన కొన్నిచోట్ల వ్రాలువ్రాసి పొడకట్టును. కొన్ని చోట్ల వ్రాతమూల మక్కర లేక తన సంకల్పములన్నియు నోటితో నె వెలిబుచ్చును కొన్నిచోట్లనీయన మఱియొకరివ్రాలు చేయుచుండును. ఈయన కలియుగనారదుడు. కడుపులోకందిగింజయిమడదు. నోటిలో నూవుగింజ నానదు. మనసులోనున్న సంగతి వెలిబుచ్చకపోయిన పక్షమున ఈయనకు కడుపుబ్బును. ఈయనకు తెలియని సంగతులుండవు. జీతము బత్తెము లేకపోయినను శ్రమపడి వ్యవహారములు కనుగొను చుండును. ఈయన గొప్పవాకబుమనిషి. తనకు కావలసినది, అక్కర లేనిది లేదు. పొంచుండి వినుటలో ఈయనది పెట్టినదిపేరు. కొండెములు చెప్పుటలో నీయన నాలుక చికిలిచేసినకత్తి. అర్జీలు పంపుట ఈయన మొట్టమొదటి కృత్యము, ఈ యర్జీలలో నొకప్పుడు సత్యముండును. ఒకప్పుడు సత్యముండదు. అది ఆయన చిద్విలాసము కొలది యుండును. ఈ మహానుభావునకు సత్యమే కావలయునన్న పట్టింపు లేదు సత్యమైనను అసత్యమైనను తనకోపము తీర్చుకొనుటే ప్రధాన కార్యము, ఈయన వ్రాసిన దంతయు నొకప్పుడు సత్యమేయై యుండును. కాని వాలిం జంపిన రామ బాణమువలె దొంగపోటుగా చాటునుండి వచ్చుటచేత సత్యమయినను దీనిని నమ్మరు. కొంద రధికారులకుకూడ ఆకాశ రామన్నగారి వ్రాత వేదాక్షరముల వంటిది. ఆయన యర్జీలలోనున్న దంతయు వారు నమ్ముదురు కొందరు చూడగానే బుట్టదాఖలు చేయుదురు.

ఆకాశ రామన్నయొక్క జాతకము వ్రాయవలయునని గొప్ప గొప్ప జ్యోతిష్కు లనేకులు ప్రయత్నము చేసిరిగాని యీయనజన్మ

కాల నక్షత్రములు సరిగా దొరికినవి కావు. ఈయన చేష్టలను గుణములను బట్టిచూడగా రాక్షస సం॥రమున జన్మించెనని తోచుచున్నది. కొందఱు దుర్మతిలో జన్మించినాడని చెప్పుచున్నారు. కొందఱు ఖరనందనలు వీనికి జన్మస్థానమని వచియించుచున్నారు కొందఱు ప్రమాదిలో నని యభిప్రాయపడుచున్నారు. ఏసంవత్సరమో మొత్తము మీఁద స్థిరపడలేదు. కాని పైనుదహరింపబడిన సంవత్సరములలో నేదోయొకటియై యుండవచ్చును. జన్మనక్షత్రము మూలయని పలువురయభిప్రాయము. ఈయన తెనుగుదేశములో ఆకాశరామన్న పేరుతో ఉన్నాడేగాని యెల్లదేశములలో నానావిధములయిన నామములతో ప్రపంచమంతటను వ్యాపించియున్నాడు. సూర్యుని యెండలేని చోట్లున్నవిగాని యీయన లేనిచోట్లు లేవు. చీకటిలేని చోట్లయిన నున్నవిగాని యీయన దుష్కీర్తి లేనిచోట్లు లేవు. పాములు తేళ్ళు లేనిచోట్లున్నవిగాని యీయన లేనిచోట్లు లేవు. విషము, పాషాణము, నాభి లేనిచోట్లున్నవిగాని యీమహానుభావుడు లేనిచోట్లు లేవు. ఈయన మహాత్మ్యచారిత్ర మెల్లవారు వినవలసినది. విన్నవారికి వీసెడు పుణ్యము. చదివినవారికి సవ్వాసేరు పుణ్యము. చెప్పినప్పుడు విననివారికి శేరు పాపము. మరచిపోయినవారికి మణుగు పాపము. ఆకాశరామన్నగారి పినతల్లికుమారులైన పిడు గగ్నిహోత్రులుగారియొక్కయు వల్లకాటి రామనాథముగారియొక్కయు చరిత్రములనుగూడ సంగ్రహముగా వ్రాయవలయునని సంకల్పించుకొంటిమి గాని ఆచరిత్రములు కూడ యెక్కడను మాకులభించినవి కావు. ఎవరియింటనైన తాటియాకు పుస్తకములలోగాని కొబ్బరియాకు పుస్తకములలోగాని యీతాకు పుస్తకములలోగాని యీచరిత్రములు పద్యరూపకముగాగాని గద్యరూపకముగాగాని యక్షగానరూపకముగా గాని నాటక

రూపకముగా గాని హరికథారూపకముగాగాని సంస్కృతమునగాని తెనుగునిగాని పిశాచి భాషలోగాని మరియే యితర భాషలలో గాని దొఱకినపక్షమున వారది తెచ్చి మాకు సమర్పించిన పక్షమున వారుకోరినంత సొమ్ము వారికి మేమిచ్చెదము. కాబట్టి ప్రతిమనుష్యులును తమతమ యింటనున్న తాళంపత్ర గ్రంథములను ఈరోజు మొదలుకొని వెదకుచుండవలయును.

ఇట్లు విన్నవించు,
ఆకాశరామన్న పక్షపాతి.

—*—

పంప్రెండుపండ్లు

భర్త—(తనలో) నాశరీర మూష్ణించిపోయి కురుపులువేసి మంచముమీదనుండి కదలకుండ జేయుచున్నవి. ఇందువలన నా వ్యవహారములన్ని చెడిపోవుచున్నవి. చక్రకేళీపండ్లు తిన్నయెడల ఉష్ణము తగ్గి కురుపులు త్వరగా నివారణమగునని వైద్యులు చెప్పినందున కష్టపడి పంప్రెండుపండ్లు తెప్పించుకొంటిని. దినమునకొక పండు తినుమని వైద్యుడు చెప్పెను. పండ్లువచ్చి పదిదినములయినవి. అయినను నేటివరకొకపండైన నానోటికి రాలేదు. ఎందుకుపండ్లు నాకుపెట్టలేదని నోఱుజారిఅడిగితినా నాభార్య పెనుభూతమువలెమీఁద పడిచంపును. అడుగకుందమన్న బాధ పడజాల అడుగుదమన్న కలహమునకోర్వజాల వెనుకకువచ్చిన గొయ్యి, ముందరికివచ్చిన నుయ్యి. అదిగో! ఈలాగున వచ్చుచున్నది. వచ్చినప్పుడెల్ల పండు తెచ్చుచున్నదనే నానోట మాటలూరుచుండును.

భార్య—(ప్రవేశించి) ఇదిగో చక్కరకేళిపండు. (అని యిచ్చును.)

భర్త—అమ్మయ్యా! పండెన్నాళ్ళకు కనుపడినది. ఈ పండు తినకుండగానే నాప్రాణము పోవుననుకొంటిని

భార్య—ఏమీ భయము లేదు. ఇంతలోనే పోయేప్రాణము కాదు, తుమ్మితే వూడిపోయేముక్కు దగ్గితే ఏమాత్రముండును. ఇంతమాత్రమునకే పోయేప్రాణ మెంతకాలముండును ?

భర్త—నాప్రాణము పోయినను నాకు సంతోషమే. అది త్వరగాపోదు. అట్లుపోయిన పక్షమున మీబాధ లే నివారణమగును.

భార్య—మీరు నగలూ నాణెములు పెట్టేది లేదు. ఈపసుపు కుంకుమూ లేకుండా చేయకండి.

భర్త—సరేకాని ఈపండిప్పుడు తింటాను. తక్కిన పదకొండు పండ్లూ ముగ్గినవా ?

భార్య—ఇంకా యెక్కడిపండ్లు. పండ్లుమీకోసం ఖర్చున్న వనుకొన్నారా యేమిటి ?

భర్త—ఏమి పండ్లయిపోయినవా ? నేను తినం డెట్లు అయి పోయినవి ?

భార్య—అన్నిపండ్లూ మీకోసరం ఖర్చయి పోయినవి.

భర్త—నాకోసర మెట్లు ఖర్చైనవి ?

భార్య—వినండి చెప్తాను. మీకురుపు నిమిత్తము పిండి వుడి కించుచు నేనెండలో కూర్చుంటిని. అందుచేత నాకెండ దెబ్బ తగిలి తలనొప్పి వచ్చినది. ఆనొప్పి తగ్గుటకై రెండుపండ్లు నేను తినివేసి నాను నీ మూలమున వచ్చిన నొప్పికోసము నేను పండ్లు తిన్నాను. కనుక ఆ పండ్లు మీకోసము ఖర్చయినవె, అవునా కాదా ?

భర్త—(తనలో) కాదంటె బతుకుట లేదుగదా! (పైకి) సందేహమేమి ! నానిమిత్తమే ఖర్చుపడినవి.

భార్య—ఇక పదిపళ్ళు మిగిలినవి. మొన్న రాత్రి మీకు జావ గాచి నేనిక్కడికి పట్టుకొనివచ్చి మీకిచ్చుచుండగా వంటయింటిలో కుక్కదూరి అన్నము తినిపోయినది. నాకు తినుట కన్నమే లేకపోయి నది. ఆకలికాగలేక యందులో నాలుగుపండ్లు తినివేసితిని. మీకు జావయిచ్చుచున్నప్పుడు నా అన్నము కుక్క ముట్టుకొనిపోయినది గనుక ఆనాలుగుపండ్లు మీకోసమే కర్చుపడినవి. అందులో నాతప్పే మున్నది. ఏమంటారు ?

భర్త—నిస్సందేహముగా నీతప్పేమిలేదు.

భార్య—ఆరు పండ్లిక మిగిలినవి మీకు జబ్బుగా యున్నదని నిన్నరాత్రి మాఅమ్మ మిమ్మలిని చూడడానికివచ్చినది. ఆబిడ వచ్చే టప్పటికి చాలాప్రొద్దుపోయినది. అప్పుడు రొట్టెకాల్చుటకు నిప్పు లేకపోయినది. మనయింట్లో అటుకులులేవు. అది నల్లమందు ముండ. కాళ్ళుచేతులు లాక్కపోతున్నాయంటె పెద్దముండాకూతురు శోష వచ్చి చచ్చిపోతుందేమో యని మూడు పండ్లు దానికిచ్చినాను. ఆ ముండ మిమ్మలిని చూడడానికి వచ్చిందిగాని నన్ను చూడడానికి రాలేదుగదా! అందుచేత ఆ మూడు పండ్లు మీక్రింద కర్చుపడ్డట్లే కాని మరొకటికాదు. ఇది మీరొప్పుకుంటారా వొప్పుకోరా ?

భర్త—అయ్యో ! వొప్పుకోకేమి సబబుగాయున్న నేనొప్పు కోక పోతానా ?

భార్య—ఇక మూడుపండ్లుండవలెను. మీకురుపుల నిమిత్తమై అవిసెగింజలు తెమ్మని మన పిల్లవాడినియెంతబతిమాలినా తెచ్చినాడు కాదు. కొట్టినా వెళ్ళినాడుకాదు. అప్పుడొక యరటిపండు వాడి చేతులోపెట్టి బజారుపంపించి గింజలు తెప్పించినాను. ఆ పండు మీ పనినిమిత్తమే ఇచ్చాను గాని నాపని నిమిత్తము గాదుగదా !

భర్త—అవును నాపనినిమిత్తమే, ఇందులో నీలోటేమిలేదు.

భార్య—మిగిలిన రెండుపండ్లలోను ఒకపండు మీామెదాననే బెట్టాగదా! ఇంకొకపండుంది. అది గూట్లోనుంచి తీసేటప్పుడు క్రింద పడి పోయింది. కొంచెము మట్టైనపండు జబ్బుమనుష్యులకు మీాకు

పెట్టడ మెందుకు, యెటుపోయియెటువచ్చునోయని భయపడి కడిగి వేసి నేను నోట్లో వేసికొన్నాను. ఎటువచ్చీ బుద్ధిపూర్వకముగా నే తిన్నదే మొకపండే. అదైనా పతిభక్తిచాత క్రిందపడ్డపండు రోగు లకు పెట్టకూడదని ముందువెనుక లాలోచించే దాననుగనుక ఆటు వంటి పండు తినడంవల్ల వచ్చేనష్టం నాకేవస్తుందని ఆపని చేసినాను. ఇందులో నా దోష మేమిలేదు. అన్నిపండ్లు మీాక్రింద ఖర్చుపడ్డవి. నామీాదపూరక అనుమానపడితే ఆదోషంమీాది. మీావల్లదోష ముంటే మీారెపోతారు. నావల్లదోషముంటే నాపసుపుకుంక మే పోతుంది. దైవమొగం చూచినే నెంతో భక్తితాత్పర్యములతో పనిచేస్తున్నాను.

భర్త—నీవల్ల ఏదోషములేదు. దోషమంతా నా వల్లనే యున్నది. ఎట్లైనా నేనే పోవలెనని నీసంకల్పము. ఇంతలో నేను పోను. భయములేదు. చక్రకేళిపళ్ళు తినకపోయినను నారోగము కుదురుచున్నది.

(ఇద్దఱు నిష్క్రమింతురు)

—*—

ప్రమాదీచ సంవత్సర ఫలము

ఈసంవత్సరఫలము మిక్కిలి చిత్రమైనది. అదృష్టహీనులకోరిక నిష్ఫలము. అదృష్టవంతుల కోరిక సఫలము. వేసవికాలములో చూత ఫలము, రసాలఫలము, మాకందఫలము, వరకాలములోజంబుఫల

ము, శీతకాలములో సీతాఫలము. ఈఫలములు మాత్రము నిశ్చయములు. తక్కిన ఫలములు విఫలములు. ఈసంవత్సరాది పాడ్యమి మొదలుకొని మృగశీర్షా ప్రవేశమువఱకు పగలెండలుమిక్కుటముగా నుండును. జోడులేనివారికాళ్లు గాలును. గొడుగులేనివారి నెత్తిమాడును. ఈ సం॥రము చైత్రవైశాఖ జ్యేష్ఠమాసములలో విసనకఱ్ఱ లెక్కువ కర్చగును. లావుశరీరములవారికి చెమట లెక్కువపోయును వైశాఖమాసములో కొన్ని రాత్రులయందు గాలివీవక జనులు తహతహ పడుదురు. ఈసంవత్సరము 365 దినములలో మాపట్టణము నందున్న దానవాయిగుంట పేటలో రెండు స్తలములన్నర వేలము వేయబడును. తక్కిన స్తలములలో రెండుమూడు ఆనంద సం॥రము లోను తక్కినవి అక్షయ సం॥రము లోపుగాను వేలము వేయబడును. మా పట్టణమందలి మార్కండేయ స్వామివారి ఆలయమునద్ద మునిసిపల్ వారు త్రవ్వించిన మురికినీళ్ళ కుండులవల్ల బయలుదేరుచున్న వాసన పూర్వజన్మవాసనకంటె నెక్కువ బలకరమై అరతికర్పాము, మంచిగంధము, అగరువత్తులు, మల్లెపూలు, అత్తరుపన్నీరు. సెంట్లు మొదలగువాని వాసనను యెంతమాత్రము బయల్పడనీక జేయును. మునిసిపల్ పట్టణములో వోటర్ల జాతకములు ఈ సం॥రము బాగున్నట్లుపకనుపడుచున్నవి. బి. యె. మొదలగు గొప్పపరీక్షలయందు కృతార్థులయిన యుద్యోగస్థులు, ఇంగ్లీషువిద్య విశేషముగా చదువుకొనని యుద్యోగస్థులు సమానముగానే హిరణ్యాశ్రార్థములు స్వీకరించుచుందురు. యజ్ఞము చేయదలచుకొన్నవారికిజనులవలన వసూలగు సొమ్ములో కర్చులుపోగా భార్యకు కంఠి, కాసులపేరు, వడ్డాణము చేయించుటకు సొమ్ము మిగులును. ప్లీడర్లలోదొంగప్లయింట్లువ్రాసిన వారికి డబ్బెక్కువ దొరుకును. న్యాయమార్గస్తుల స్తితియథాప్రకారముండును. ప్రజలిచ్చుకొను మహాజరర్జీల మీద సర్కారువా రిచ్చు

ఉత్తరువులు యథాప్రకారమునకు లోటు లేకుండా యుండును. ధనమే కాక నెయ్యి, ఊరగాయ, మామిడికాయలు, నిమ్మకాయలు, పెరుగు మొదలగునవి కూడ లంచములు పుచ్చుకొనునట్టి యుద్యోగస్థులు కొందరు బయలుదేరుదురు. వివాహపు మేజువాణీలలోను శ్రీరామ నవమి ఉత్సవములలోను వేశ్యాంగనలపై చిమ్మిలిగొట్టములతో వసంతము పన్నీరుకొట్టి ధల్యులమైతిమని సంతోషించు మహారసికులు నిరుటికంటె నూటికి పదిమంది హెచ్చగుదురు.

వైద్యులవృద్ధి	౫౦	పాళ్ళు.
రోగముల వృద్ధి	౯౦	,,
వడ్డీవ్యాపారం చేయువారి దయ	౩	,,
కాఠిన్యము	౯౩	,,
అప్పులు పుచ్చుకొన్నవారికి ఇయ్యవలెనను బుద్ధి	౮౦	,,
ఎగబెట్టవలెనను బుద్ధి	౬౦	,,
కూటసాక్ష్యమువృద్ధి	౯౫	,,
సత్యము	౫	,,
ఉద్యోగస్థులకు ఓపిక	౩౦	,,
తొందర	౨౦	,,
భక్తి	౧౦	,,
నటన	౯౦	,,
జరిగినచర్య కొంచెమయినను వృత్తాంతపత్రికలలో ఎక్కువగా వర్ణించవలెనను నాసక్తి.	౨౦	,,
నిజవర్ణనము	౩౦	,,
చుట్టలుత్రాగని వంటబ్రాహ్మణుల వృద్ధి	౧	,,
శుచిలేనివారి వృద్ధి	౯౯	,,
వరదక్షిణవృద్ధి	౧౦౫	,,

కన్యాశుల్కములవృద్ధి	౩౩	,,
వంటపూటిళ్ళవృద్ధి	౨౦	,,
కాఫీకొట్లవృద్ధి	౪౦	,,
అత్త కోడలు కయ్యములు	౬౦	,,
అల్లుళ్ళ అలకలు	౫౩	,,

—*—

నాగరికతా ప్రహసనము

[ఒక తెనుగు దేశపు బ్రాహ్మణుడు ఒక బంగాళీ బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నారు.]

తె.—నాగరికతకు ముఖ్యలక్షణ మేమని మీ యభిప్రాయము.

బం.—లక్షణముల కేమిగాని మీరు కేవలము మోటవాండ్రు.

తె.—ఎందుచేత ?

బం.—మీరు చేపను ముట్టుకోరు. చేపను తినుటయుఁగా మీకు ప్రాణపోకట వట్టిశాకములు మాత్ర మారగింతురు. చేపను చూచిన భయపడువాడు చేపను తిననివాడు మోటవాడుగాక నాగరికుడా ? అందుకే మీరు వెనుకబడియున్నారు.

[అప్పుడొక శూద్రుడు ప్రవేశించుచున్నాడు]

శూ.—యేంటండీ. మీయిద్దోదాలు సూస్తె శిత్రంగావుంది. చేపను తినకమోతే తెనుగుబ్యామ్మడు మోటోడని బంగాళీ బ్యామ్మడు అంటున్నాడా ? నా యబిప్రాయంచేత మీ రిద్దఱుగూడ మోటోళ్ళె.

బం.—ఎందుచేత ?

శూ—నువ్వుమాంసం తింటావా?

బం—ఛీ. నేను మాంసము తిందునా? అంత గొడ్డు లెఖ్ఖగ కొండ ప్రేలుచున్నావేమి?

శూ—అద్దంమకునే నువ్వు మోటోడువు మాంసంపేరు శెప్పితే ఛీ యని గింజుకునేవోడివి గనుకనే నీవు మోటోడవు. శేప, మాంసము ఈ రెంటిపేర్లు శెప్తె "తూ" అనేవాళ్ళుగనుక ఈ తెనుగు బ్యామ్మడు మోటోడు ఇటువంటి అపాత్రులకు మీకు నాజూకున్యా-డానా?

[అప్పుడొక తురక ప్రవేసించు చున్నాడు]

తుర—అరే! కాఫర్. ఏమ్టివోయి మూాడు మన్సీలు మాట సేస్తావున్నార్. మీ గడ్బిడసూస్తే కొట్కుంటార్ మల్లేవోంది. గడ్బిడ్ ఏమ్టిబోలో ఒక్డికంటే ఒక్డు యెక్వాఅనీ ఒక్డు తక్వాఅని మీలోమీర్ బాత్ సెస్తావుండార్.

శూ—ఏమండో సాహేబుగారూ! ఈ బాపనయ్యలిద్దరు మాంసము పేరుశెపితే కోశెడుదూరం పోతారండి. అందుచేత మోటవోళ్ళంటూ వున్నానండి.

తుర—నీ పేష్టివోయి. నీకి మోటవాడ్వి కావా?

శూ—నే నెందుకయినాను. నేను మాంసము తింటాకాదూ.

తుర—అరే బద్మాష్! నీవు గోడ్డుమాంసం తింటావువోయి.

శూ—(చెవులుమూసికొని) రామ రామ. ఏంమాటలండయి. ఆమాటినగానే నా శెవులో బల్లాలుచ్చుకు మొడిశినట్టుంది.

తుర—అరే. చూ నామర్దామన్సి. అరే! ఆవు నీకి సుట్టం. మేఖ కోడి నీకి సుట్టంకాను. ఆవుతింటే యేమిఖొంప మున్గిందివోయి ఆవు మాంసం కడ్పులో నీకి మంటసేస్తాదా? ఆవుపేడ ఆవుమూత్రం తినేకాఫర్ ఆవుమాంసం తింటే తప్పురా నీకి. మీ మూడు మన్సి మోటగాడ్దెల్వోయి.

తె___(తనలో) శివశివా!

బం___(తనలో) హరిహరి!

తుర___ఏమివోయి, మీరు సచ్చిపోన శపాల్‌లాగా మాటా లేక సూస్తార్ యేమివోయి. గోడ్డుమాంసం అంటే గుల్ గుల్ మంటార్, మీకి మోటనామర్దా మస్సీలువోయి మీరు,

[అప్పు డొక యూరోపియను ప్రవేశించు చున్నాడు]

యూ___ఏమి గందరగోళం చేయుచున్నారు మీరు! ఒక మోటవాడు రెండవవానిని మోటవాడనుచున్నాడు నాబుద్ధిచేత మీరందఱు మోటవారలె సుండీ. మీ రందఱు పశువులవంటివారు. నాగరికత యేమో మీ రెఱుఁగరు. మీకు నేర్చుకొనుటకు సిగ్గు లేదు, ఒకరిని చూచి మీరు నేర్చికొనరు.

తుర___అరె మాకికూడా మోటా?

యూ___ఓ తురక మనుష్యుడుగారూ, మీరు మోటవారు. ఈ బ్రాహ్మలు మోటవారు. ఈ శూద్రులు మోటవారు.

తుర___అరె నాకి బాపస్గాడ్కెకు సమం శేశావు నీకి. అరె యేంమడ్మిబె నోవ్వు. అరే నే న్గొడ్డు తింతాన్ కోడి తింతాన్ మేక తింతాన్. నాకి మోటా? అరే శేపా సూస్తే శిల్లంగి పెట్టిన మల్లె పారిపోతాడ్ యీ బాప్మడు. వాడ్కి మోటనాకి మోటా? నీకి బుద్ధిలేదూ వోయి.

యూ___ముసల్మానుగారూ! కోపము పుచ్చుకోకండీ ముస్మా టికి మీరు మోటవారు ఈ హిందువు లెంత మోటవారో మీ రంత మోటవారు.

తుర___అరే యెందుక్ శేతావోయి?

యూ___మీరు కోపము చేయరుగదా.

తుర_ మాకీ కోపం లేదు, గీపం లేదు. శెప్పుబె.

యూ—మీరు కోపము చేయరుగదా.

తుర—మాకీ కోపం? కోపం లేదు. గీపం లేదు. శెప్పాజే.

యూ—మీరు పందిని భక్షించెదరా?

తుర—తు, తు, తు, తు. తు, తు, అరే ముర్దారు ముర్దార్.

యూ—మురదా రనగా నేమి? దానిభావము సెలవియ్యండి మీరు.

తుర—ముర్దార్ ముర్దార్ ముర్దార్. అరే వీ డెవడురా మాకీ. ముర్దార్ తిన్మంతాడు మాకీ. ముర్దారంతే. అరేబిస్మిల్లా శేసి తిన్యాడదు. మా అల్లా మా రసూల్ శెల్వు యిచ్చినార్. అది బల్ దోసం. ఆమాట నోట్కి రానియ్యకూడ్దు?

యూ—సాహేబులుగారూ! అది పొరబాటు అదితప్పు. మనము కోసుకు తినుటకై దేవుడు కరుణచేత, అన్నిజంతువులు నిచ్చి నాడు. ఆయన మనుష్యులమీద మిక్కిలి దయగలవారు. ఆవును తినుమని పందిని తినవద్దని వారు ఎక్కడ చెప్పియుండ లేదు. ఆవుమాంసము గొంతుకు దిగి, పందిమాంసము గొంతుక దిగదాయేమి? రుచి గల వస్తువులనుతినకుండ విడిచిపెట్టుట పాపము. దోసము. ఈదోసము మీరు చేయుటచేత మీరు తెలివితక్కువవాండ్రు మోటవాండ్రు. అందుచేత మీకు నాగరికత లేదు.

[అప్పుడు చీనాదేశస్థుఁ డొకడు ప్రవేశించుచున్నాడు.]

చీ—చీనాదేశమే దివ్యదేశము చీనాదేశస్థులు దివ్యులు. చీనారాజ్యము దివ్యరాజ్యము. లోకములోనున్న యితరదేశస్థులందఱు మూర్ఖులు, అనాగరికులు, పశువులు. ఎవరి తెలివితక్కువవారికి తెలియదు. ఉన్నమాటన్న ఉలుకెక్కువ. ఈ బ్రాహ్మణులు, తురకలు, యూరోపియనులు, నాగరికతావిషయములో మనమందఱు నిలుచుండుటకయిన అర్హత లేనివారు.

యూ—ఓ చీనా దేశస్థుడా! నాగరికతలో నీగొప్ప యేమిటి?

చీ మీరు తలవెంట్రుకలు కత్తిరించికొందురు. మేము జడలు పెంచుకొందుము. మీరు కుక్కపండ్లవలె పండ్లు తెల్లగా నుంచుకొందురు. మేము పండ్లకు కప్పు వేసికొందుము. మీపనులన్ని అనాగరికపు పనులు గావా!

యూ—జుట్టు కత్తిరించుకొనకపోవుట, పండ్లకు కప్పు వేసికొనుట గొప్ప నాగరికతలా?

చీ—కాకేమి! నాగరికత, మోటతనము చిన్న పనులలోగూడ తెలియుచుండును. దీనికేమి భోజనములో మీరుమిక్కిలిఅనాగరికులు

యూ—ఎందుచేత? మేమన్ని వస్తువులు తినుచున్నామే,

చీ - మీరు కుక్కను తిందురా!

యూ—ఛీ! ఛీ! పాడుకుక్క.

చీ—మీరు పామును తిందురా?

తురక—అరె పామ్కి తింతారువోయి మీకి అరె మొంతా నఖారాఖులంవోయి మీది. తేలూబీ తింతావోయ్. జెఱ్ఱీబీతింతావా?

చీ—మీరు కప్పను తింటారా?

యూ—మేము కప్పలను తినము

చీ—కప్పఊరగాయ తినని నీ నాలు కెందుకు? ఒక పర్యాయం తింటె నీజన్మమధ్యమున మళ్ళా వొదిలిపెడతావా?

యూ—ఛీ! దిక్కుమాలిన ఊరగాయ ఆమాట చెప్పకు. నాకు డోకు వచ్చుచున్నది.

చీ—ఇందుచేతనే మోటవాడవైతివి.

[అప్పుడు అఘోరమతస్థుడు ప్రవేశించుచున్నాడు.]

అఘో—(తనలో) ఈశ్వరునకు పశుపతి నామ మేలవచ్చినదో ఒక్క పండితపశువైన నెఱుగడు. పశువు లనగా బ్రిహ్మ

మొదలుకొని పిపీలికాది పర్యంతము జంతువులు. అందుచేత నీవు పశువు. మనుష్యుడు పశువు. బ్రహ్మ పశువు. దేవతలు పశువులు. అట్టిపశువులన్నియు సమానమై యుండగా జంతువులకు జంతువులకు భేద మేలచేయవలయునో తెలియకున్నది. ఓహో! నా యెదుట మోటజాతివార నేకులు కనబడుచున్నారు. వీరందఱు జ్ఞానశూన్యులే.

యూ—నీ వెవరు? నీ వేషము చాల భయంకరముగా నున్నది.

అఘో—నే నఘోరమతస్థుడను దూరముగా నుండుము! దూరముగా నుండుము! దగ్గరకు రాకుము. నేను మైలపడిపోదును. నీవు జ్ఞానశూన్యుడవు.

యూ—నా కేమి జ్ఞానము తక్కువయినది ?

అఘో—అంతయు తక్కువే! నీకున్న జ్ఞాన మేమిటి ?

యూ—లేదని యెట్లు చెప్పగలవు ?

అఘో—ప్రత్యక్షముగా కనపడుచుండగా వేఱె చెప్పవలయునా! నీవు గొఱ్ఱెలు తిందువు. కోళ్ళను తిందువు. పశువులు తిందువు. పందిని తిందువు, కాని మనుష్యుని తినుట కొప్పుకొనవు.

యూ—(చెవులు మూసికొని, ఆకాశమువంక జూచి) పాపము! పాపము! ఓ ప్రభువా! ఈపాపాత్ములను రక్షింపుము.

తురక—మన్నిని తినేమతమూ యిదా? అరే. పిల్లల్కి. పెద్దల్కి పీక్కుతింటావ్. అరే? సికీ పులీమన్సీ.

అఘో—ఆభేదమే కూడదు. అన్ని జంతువులు సమానము. మనుష్యుడు జంతువే అందుచేత ఏది లభించినప్పుడు దానిని తినవలయును.

యూ—నీవంటి పాపకర్ముడు లేడు.

అఘో—ఎందుచేత?

యూ—ఎందుచేతనా! మనుష్యులీశ్వరపుత్రులు.

అఘో—అన్ని జంతువులు ఈశ్వరునిబిడ్డలే. మనుష్యులదినుట పాపమైన పక్షమున కోళ్ళను తినుట గొఱ్ఱెలదినుట పాపమె పాపము లేని పక్షమున యెవరేమి తిన్నను పాపము లేదు.

యూ—నీసిద్ధాంతములు విపరీతసిద్ధాంతములు. పాపములు, మానవజాతివిరుద్ధములు.

అఘో—మీయందఱ పద్ధతులు మానవజాతి విరోధములు. కాని నావి కావు.

తుర—(యూనోపియనుతో) జీభాయ్, ఈమనిషి నీకీ నాకీ కొరుక్కు తింతాడ్. మస్కు పోదాం రావోయ్.

యూ—భయము లేదు. దేవుడు ఉన్నాడు.

తెలుగుబ్రాహ్మ—మీనాగరికతలన్ని నేను గంటనుండి వినుచున్నాను. మాంసము తినుటయే నాగరికతయైన పక్షమున మీనాగరికతకు మీకు ఒక్క సలాము మీలో మీకే ఐకమత్యము లేదు. ఒకరు తినునట్టివస్తువు మఱియొకరు తినకపోవుటమీలో కూడ గలదు. కొన్నివస్తువులు తినకపోవుట అనాగరికతయైనపక్షమున నాతోపాటు మీరంద అనాగరికులే. అనాగరికుడనైనను సరే, అడవి మృగమైనను సరే, నాకాయగూరలనే సేభుజించి బ్రతికెదనుగాని మీ పాడుపశువులు కుక్కలు పిల్లులు పాములు జెఱ్ఱులు తేళ్ళు తిని నేబ్రదుకజాలను. బ్రతుకకపోయిన పక్షమున చచ్చియైన పోయెద గాని వాటిని స్పృశింపజాలను. అటువంటి నాగరికతకంటె ఇటువంటి నాగరికతయే నాకు తృప్తికరముగా నున్నది.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

—౯—

మహామంత్రకేసరి

[చండినాధశాస్త్రిలుగారును. పురుషోత్తమరావుగారును ప్రవేశించుచున్నారు.]

పురు—ఎవరువారు ? ఏవూరండి మనది.

చండి—మాది గోదావరీతీరము. కోటిపల్లి మహాపుణ్యక్షేత్రము కాపురము.

పురు—తమ రేమిపనిమీాద దయచేశా రిప్పుడు ?

చం—ఏలినవారి దర్శనము నిమిత్తము.

పు—నాదర్శనము నిమిత్తమేనా ! సరే ఆ కుర్చీమీాద దయచేయండి.

చం. చిత్తము. తమ అనుగ్రహమునకు పాత్రులమె. (అని కూర్చుండును.)

పు—నావద్దకు తమ రెందుకు దయచేసినారు ? మీాఅభిప్రాయ మేమిటో సెలవియ్యవలెను ?

చం—చిత్తము. చిత్తము. మనవిచేస్తాను. తమరు సాక్షాత్తు మహానుభావులు. తమముఖముచూస్తె సమస్తపాపములు పోతాయి. తమకీర్తి జగద్విశ్రాంతము. తమ తండ్రిగారు చేసుకొన్న గొప్పతపస్సు చేత తమవంటి సుపుత్రులు జన్మించినారు.

పు—తమరాట్టె స్తవముచేయకండి, నే నెంతుకూ తగను. మీాప నేమిటో సెలవియ్యండి.

చం—తగకపోవడమేమి. తగినవారు తగుచూసుని చెప్పుకుం డారా యేమిటి, "ఏకో గోత్రే ప్రభవతిపుమాన్ యః కుటుంబం బిభర్తి." యనట్లైతె బహుకుటుంబాలు భరిస్తారో అతడే వంశమం

తకూ గొప్పవాడు? అని వెనకటి విక్రమార్క మహారాజులుంగారి సభలో తెనాలి రామలింగంగారు సెలవిచ్చారట!

పు—(నవ్వి) ఇదేమిటండో శాస్త్రిలుగారు! విక్రమార్కుని సభయేమిటి. తెనాలి రామలింగము చెప్పడమేమిటి? అతనికీ యితనికీ వేయి సం॥రముల తేడా ఉన్నది. రామలింగము తెనుగు దేశస్థుడు విక్రమార్కుడు మాళవదేశస్థుడు. మీరీ అసందర్భము లెక్కడ నేర్చుకొన్నారండీ?

చం—ఆలాగాండి. అవునవును. పెద్దముండావాణ్ణి అగుటచేత మరిచిపోయినాను. పొరపాటు, ఇప్పుడు సరిగా జ్ఞాపకము వచ్చినది. వెనక రాయలవారి సభలో కాళిదాసుగారు చెప్పినది.

పు—(నవ్వి) ఏమండోయి శాస్త్రిలవారు, ఒకతప్పు దిద్దుకోబోయి మఱొకతప్పు చేస్తున్నారు. ఎక్కడి రాయలవారు ఎక్కడి కాళిదాసండి. రాయలవారు మొన్న మొన్న తెనుగుదేశము, కన్నడదేశము ఏలినవారు. కాళిదాసుగారు వెయ్యేండ్లక్రిందట ఉజ్జయినిలోనున్నవారు. ఈ గొడవలన్నీ మీకెందుకు, మీకు వచ్చినపని సెలవిస్తురూ!

చం—ఏమో పెద్దకాలపువాడి నగుటచేత ఒకదానికొకటి చెప్పినానేమో పోనీండి. ప్రస్తుతము మనవిచేస్తాను. నేను కాశీలో 24 సం॥రములు సకలవిద్య లభ్యసించినాను. జగత్ప్రసిద్ధులయిన గౌరీప్రసాద ఘట"పాధ్యాయులవారు నాగురువులు తర్కములో బాధాంతమువరకు చదివినాను నాప్రజ్ఞకు సంతోషించి కాశీపండితులందరు సభచేసి తర్కాలంకారచూడామణియని బిరుదిచ్చినారు. వ్యాకరణములో భాష్యాంతమువఱకు క్షుణ్ణముగా చదివినాను. నా యెదుట యెవరు నిలుచుండలేరు. భాష్యములోనున్న కొన్ని లోటుపాటులు సవరించి యింకొకభాష్యము వ్రాయవలెనని ఆలోచించితిని గాని మహానుభావుడయిన పతంజలి గ్రంథము మూల పడిపోవునేమో

యని కొందఱుపండితులు నన్ను వాదించినారు. వేదాంతశాస్త్రములో ప్రస్థానత్రయము శాంతిచేసినాను. మంత్రశాస్త్రములో మహాపాదుకాంత దీక్ష పుచ్చుకొన్నాను. "శాపాదపి శరాదపి" అనునట్లుగా నే నడిగినప్రశ్న కెవ్వడు జవాబు చెప్పలేడు. చచ్చినవాడిని బ్రతికించగలను. బ్రదికిఉన్న వాడిని క్షణములో చంపగలను.

పు—శాస్త్రులవారూ! మీరుసకలశాస్త్రపారంగతులే! ఇప్పుడెవరికైనా తర్క-వ్యాకరణ వేదాంతములు పాఠాలు చెప్తారా?

చం—కాశీనుండి వచ్చినతర్వాత ఆశాస్త్రాల వ్యాసంగమే లేదు. అందుచేత చాలావరకు మరచిపోయినాను. ఏమంటే? చిల్లర పుస్తకములు పాఠములు చెప్పడము నావంటి పండితునికి అవమానకరము. పెద్దగ్రంథములు చదివేవాళ్ళు ఈ దేశములో లేనేలేరు. అందుచేత ఇప్పుడు జ్యోతిశ్శాస్త్రములోను మంత్రశాస్త్రములోను వ్యాసంగ మెక్కువగా చేసినాను. మైసూరురాజుగారి వివాహమునకు ముహూర్తము పెట్టి రు1116లు బహుమానముపొందినాను. బడ్వాడా మహారాజుగారికి చండీమంత్ర ముపదేశముచేసి రత్నకుండలములు. వేయిరూపాయలు విలువగల జరీశాలువలు పుచ్చుకొన్నాను.

పు—శాస్త్రులవారూ, ఆకుండలములు శాలువలు ఒకసారి చూపిస్తురా? అవి చెవులకు పెట్టుకొని వచ్చినారు కారేమి?

చం—నేను పట్టి నిర్భాగ్యుడను నాయనా! అవి చెవులకు పెట్టుకొని వెడుచుండగా దొంగలుకొట్టి దోచుకొన్నారు.

పు—అయితే మీశాలువలయినా ఒకమాటు చూడవలెనని యున్నది. పట్టుకురాగలరా?

చం—పట్టుకొనేవస్తును. తమవంటివారు చూడడంకంటేను రేమున్నది! కాని పాడుతాటాకుకొంపలు, నిరుటి సం॥రం మాగ్రామం కాలిపోయిందండి. అందులో మాయిల్లుకూడా పరశురామప్రీతి

అయింది. అందులో శాలువలు, పాత్రసామగ్రి అన్ని హతమయి పోయినవి.

పు—ఏరోజునుండి మీ యిల్లు తగులబడిపోయినది ?

చం—చైత్ర బహుళ అమావాస్యనాడు.

పు—అమావాస్యనాడా! నేనానాడు కోటిపల్లిలోనున్నాను. తగులబడిపోలేదే!

చం—అసలు కోటిపల్లెగాని ప్రస్తుతం రెండేండ్లనుంచిఅక్కడ ఉండడంలేదు. ద్రాక్షారందగ్గరఉన్న శివలగ్రామంలో ఉంటున్నాను. అక్కడ యిల్లు తగలబడిపోయింది.

పు—సరే సరే తెలిసింది, ఎక్కడైతే నాకెందుకు? తమ రొచ్చినపని సెలవియ్యండి.

చం—నేనువచ్చిన పనియేమో తమకీపాటికి తెలిసియే యుండును. కొంపకాలిపోయినది గనుక మరల దానికి నిర్మించుకొన వలయును. కావున తమరు సహాయము జేయవలయును. అయితే—

పు—శాస్త్రిగారూ, మీరు తర్కములో బాధాంతమయినను సంసారములో బాధాంతమయినదికాదు. వ్యాకరణములో భాష్య శాంతియైనది కాని మనశ్శాంతి మాత్రముకాలేదు వేదాంతములో ప్రస్థానత్రయమైనది కాని యీషణత్రయము వదలలేదు. మంత్ర శాస్త్రముతో బాటు తంత్రశాస్త్రముగూడ తమరునేర్చుకొన్నారు.

చం—మీమాటకడ్డువచ్చినాను. నన్ను క్షమించండి. ఉచిత ముగా నాకు మీరేమి ధనమియ్యవద్దు. నాకిద్దరు ముగ్గురు డిప్టీకలక్టర్లు తహసిలుదార్లు ఉచితముగా ధనమియ్యవస్తే వద్దన్నాను.

పు—ఉచితముగా నియ్యక యెల్లాగిమ్మన్నారు? బదులియ్య మన్నారా యేమిటి.

చం—బదులుకాదు. నావల్లకొంతలాభము పొందియియ్యండి.

పు—మీవల్ల మాకు వచ్చు లాభ మేమిటి ?

చం — నావల్ల మీ రేదైనా విద్యనుప దేశముపొంది నాకు కొంతధన మిప్పించండి. అప్పుడు యాచనచేత జీవించినాన నే దోషము నావద్ద నుండదు.

పు—మీ రేమి విద్య నాకుప దేశింపగలరు ?

చం—మంత్రవిద్య.

పు—ఏమి మంత్రం నడమంత్రమా ? పాముమంత్రమా తేలు మంత్రమా ?

చం—పాముమంత్రము కాదు తేలుమంత్రము కాదు అటువంటి తుచ్ఛమంత్రములు నేర్పువాడను కాను

పు—అట్లయిన నే మహామంత్రము నేర్పుదురు ?

చండి—బాలమంత్ర ముప దేశించెదను.

పు — దాని గొప్ప యేమిటి ?

చండి—తమకు తెలియదు కాని దానిగొప్పయింతా అని నేను వర్ణించ లేను, దానిమహిమ కొంచెము చెపుతాను వినండి. బాలమంత్ర ముప దేశముపొంది తగినట్లు పునశ్చరణచేసి తగిన శాంతులు వగయిరాలు చేసినవాడు, అధికారులను తన జేబులో వేసికొనగలడు. ఎంతెంత చిక్కులు వానికివచ్చినను మంచు విరిసిపోయినట్లు మాయమై పోవును. అతడు పట్టినదంతయు బంగారమగును. పలికినదల్లా వేద వాక్కగుతుంది. అధికారులు చేతిలో కీలుబొమ్మలై పోతారు. ఎక్కడికివెళ్ళినా దిగ్విజయమే. లక్ష్మీసరస్వతులు వారి యింట్లో తాండవమాడుతూంటారు అధికారులే కాదు లోకమంతా వాడికి వశమైపోతుంది.

పు—అబ్బా. అంతమహాత్మ్య ముందండి, అందులోను ?

చం—మహాత్మ్యమని మెల్లిగా అడుగుచున్నారా ? ఇది మంత్రములోకల్లా రాజు. విజయనగరం మహారాజులుంగారికీమంత్రము వల్ల నేకదా రాజ్యము వచ్చినది !

పు—అట్లాగాండి. అయితే-తమకు సంపూర్తిగా పునశ్చరణ అయిందాండి.

చం—తమ దయవల్ల సంపూర్తిగా అయినది.

పు—శాంతులు వగయిరాలు సరిగా జరిగినవా ?

చం—యథావిధిగా జరిగినవి.

పు—అయితే యేవిధమైన లోటూ లేదన్నమాటే. ఉపదేశముకూడా సరిగా జరిగిందా మొట్టమొదట?

చం—ఆహా సరిగా జరుగకేమి ! మా గురువుగారు మంత్రచింతామణి. భరతఖండములో మంత్రశాస్త్రములో అంతవారు లేరు. కాశీమహారాజులుంగా రొకపర్యాయము మాగురువుగారివద్దకు వచ్చి పాదాక్రాంతులై మంత్రశాస్త్రము మహిమ చూపించవలసినదని ప్రార్థించినారు. అప్పుడు నీకేమికావలయునని మాగురువుగారడిగినారు. ప్రవహిస్తూన్న గంగను కట్టివేయవలసినదని రాజుగారడిగినారు. మా గురువుగారు గంగాప్రవాహము నాలుగు గడియలసేపు స్తంభింపజేసినారు. అదిచూచి కాశీజనులు మహారాజుగారు గడగడలాడిపోయినారు.

పు—ఈసంగతి యే పత్రికలోను పడలేదేమండి ?

చం—వెధవపత్రికలు ఇల్లాంటి గొప్పసంగతులు పాడుపత్రికలలో పడతాయా.

పు—సరే దానికేమిగాని, ఇప్పుడు మంత్రముపదేశము చేస్తానంటారూ మీరు ?

చం—చిత్తము. తమకుపదేశము చెయ్యవలెనే సంకల్పము.

పు—అయితే నన్నడుగడ మెందుకు ? చెయ్యండి.

చం—అడక్కుండా యెల్లా గుపదేశం చెయ్యమన్నారు ?

పు—మీకీమంత్రము సరిగా నుపదేశమై పునశ్చరణమైనది గదా! పునశ్చరణ సరిగానైనవారికి లోకమంతా వశమగుతుందికదా

కాబట్టి మీమంత్రశక్తివలన మీకు, నేను వశముకావలసినదే. మీ వద్దకు నాయంతట నేనువచ్చి మీపాదములకు నేను మొక్కి- స్వామీ! బాలమంత్రము నాకుప దేశము చెయ్యండి యని నేను మిమ్ములిని అడిగేటట్టు మీరు చేయవలెను. మీమంత్రములో ప్రభావముంటేఆలాగే కావలెను. అట్లు కానియెడల మంత్రములో ప్రభావము లేదనియైన మేమనుకొనవలెను, లేక పునశ్చరణలో లోటుగలిగినదనియైన ననుకొనవలెను.

చం—ఉపదేశములోలోటులేదు. పునశ్చరణలోలోటులేదు. మంత్రప్రభావములో లోటులేదు.

పు—లోటు లేకపోతే నన్ను మీరెందుకు వశము చేసికొనలేకపోయినారు? ఈమంత్రసిద్ధియైనవారికి లోకమంతా వశమగునని చెప్పినారు కదా మీరు!

చం—చిత్తము అల్లాగే అన్నాను. అదినిజమే ఈ రాత్రి దేవిని మళ్ళీ ఆవాహనజేసి రేపో యెల్లుండో మీరు నన్ను వచ్చి అడిగేటట్టు చేస్తాను. ప్రస్తుతం సెలవిప్పించండి. (అనిలేచి తనలో) వీ డెవడో గడుసుపిండము. వీడు నన్నే బుట్టలో పెట్టినాడు. వీడి దగ్గర నాపాచికపడదు. (అని వెళ్ళును)

పురు—వీడి కిదే సెలవు. వీడు మళ్ళీరాడు వీడు నేను యిసుకతక్కిడ పేడతక్కిడయైనాము? (అని నిష్క్రమించును)

*

అపూర్వయజ్ఞము

మొదటిరంగము

[అప్పుడు పిడిగుద్దుల విస్సయ్యా, మాటకారి మల్లయ్యా
కోతల గోవిందయ్యా ప్రవేశించుచున్నారు]

విస్స—అయితే మీ రిప్పుడు చెప్పవచ్చేమాట యేమిటి,

మల్ల—నేను నాలుగు గడియలనుండి గొంతుక చించుకుంటూంటే నీకు తెలియనేలేదూ. చిన్నప్పుడు కాంతయ్యపంతులుగారు మట్టితల ముండాకొడకాయని నిన్ను పిలిచేవారు. ఆమాట సార్థకము చేశావు.

గోవిం—వాడికి స్పష్టముగా అరటిపండొలిచి చేతిలో పెట్టినట్టు చెప్పితేనేగాని తెలియదు. మీ గడుసుతనము పోకడలు మీ టక్కుటమారాలు వాడిదగ్గిర పెట్టకుమరి.

మల్ల—అయితే నీవు యజ్ఞం చెయ్యవలసినదని మా అభిప్రాయము. దీనివల్ల మనము ముగ్గురముకూడా తేల్తాము.

విస్స— ఓరీ మీ యమ్మకడుపుమాడా. నేనేమిటి యగ్గం చేయడమేమిటి. రాజానగరం సత్త్రములో మొన్నటిదాకా వంట చేస్తిని, అంతకుముందు కత్తిపూడి సత్త్రంలో నిన్నటిదాకా నీళ్ళు మోస్తిని,నాలుగు నెలల్క్రిందటివరకు అమలాపురము తహసీలుదారుగారి దగ్గర గరిటె పుచ్చుకుంటిని. నేను యగ్గముచేస్తే నలుగురూ నవ్వరూ.

మల్ల— ఎవడురా నవ్వేవాడు. ఈ చేసేవాళ్ళందఱు నీకంటె నెక్కువవాళ్ళా యేమిటి, రాజానగరం సత్త్రములోను కత్తిపూడి సత్త్రములోను నీవున్నమాట యెవడికి తెలుసురా? ఎవడూవచ్చి మొగముమీద అడగడు. ఒకవేళవచ్చియెవడైనా మొగముమీద అడిగితే చీచీ నేనుగాదు మాపినతండ్రికొడుకు నాలాగేయుండేవాడు, నేనేమిటి ఆపనిచేయడమేమిటని చుట్టుప్రక్కలనున్నవాళ్ళు నలుగురు హడిలిపోయేటట్టుగా గావు కేకలువేసి చెడతిట్టి పారవెయ్యి. ఆపయన మేమందుకుని జాడించి పారవేస్తాము. దానితో నెవడైనా సరే డంగై పోతాడు.

గోవిం—నిజమేనోయి, బుకాయింపువంటిదిమరియొకటికాదు బుకాయించగలిగితే భూము లేలవచ్చునన్నాడు,ఓరే! విస్సన్నా అన్ని విధాలచేత నీవు యజ్ఞముచేయుటకు తగియున్నావు. నే చేదామంటే

నాభార్య కాపరానికి రాలేదు. పదకొండువందల రూపాయలు వాళ్ళ యెద్దాన్నిపోసి మొన్న మొన్ననే ఆరేండ్ల గుంటముండని కట్టుకున్నా నన్నమాట తెలుసుగదామీకు. పోనీ మల్లిగాడిచేత చేయిద్దామంటే వీడపత్నీకుడు. వీడికెక్కడా సోమిదేవమ్మ కుదరదు.

విస్స—రావువారి కోట్లలో నుందిగా సోమిదేవమ్మ యొకతె?

గోవిం—ఆసోమిదేవమ్మ మన మల్లిగాడికి బహిరంగములోనికి వచ్చేదికాదు. ఆలాటి సోమిదేవమ్మలు నీకూఉన్నారు నాకూఉన్నారు.

విస్స—పోనీ యిప్పుడు యజ్ఞముచేయకపోతే నేమిరా దీనమ్మ కడుపుకాలా?

మల్ల—ఓరీ వెఱ్ఱిముండాకొడకా అల్లాగనకు యిప్పటిరోజులలో డబ్బుసంపాదించడానికి రెండు మూడుపాయాలున్నాయి. దేవాలయము కట్టిస్తానని బయలుదేఱడము ఒకటి. యజ్ఞము చేస్తానని బయలుదేఱడము ఒకటి. వీటిలో రెండవదే మంచిది. యజ్ఞంచేస్తే గోనిసంచెడు రూపాయలు వస్తాయి ఒకడు బియ్యమిస్తాడు ఒకడు పప్పు యిస్తాడు ఒకడు నెయ్యిస్తాడు. ఒకడువి స్తరాకిస్తాడు, ఇల్లాగ తలొక కర్చు తలకొకరు పెట్టుకుంటారు. పైగా కట్నాలక్రింద కానుకలక్రింద బహుమానములక్రింద దొరికే చీరలు రవికెలగుడ్డలు పండ్లు ఫలములుగాక మొదటయితే నేమిచివరయితే నేమిదొరికేరొక్కము నాలుగు వేల రూపాయలకు తక్కువయుండదు. ఇందులో మా యిద్దఱకు చెరియొక వెయ్యి వందలు రూపాయలుఇచ్చి తక్కిన మూడు వేలు నీ వేపుచ్చుకో. పైగా రెండు సం॥ల వఱకు బియ్యం పప్పు ఉప్పు మొదలయిన గ్రాసం మిగులుతుంది. పైగా చీరలు జామారులు కొంచెము తక్కువ ధరలకు అమ్మివేసినామంటే అయిదారు వందల రూపాయలు వస్తాయి. ఏ శుభాశుభములకు యెక్కడికి సంభావనకు వెళ్ళినా తక్కినవాళ్ళకంటె సంభావన నీకు రెట్టింపు ముడుతుంది. పైగా సోమయాజులుగారని

చెప్పి గౌరవముకూడా చేస్తారు. కుండలాలజత యెవరైనా వేస్తే వేస్తారు. లేకపోతే యింతసొమ్ము వస్తూన్నది గనుక రెండు కాసుల బంగారముపెట్టి మనమే చేయించి యే కరణంగారో మునసబుగారో యిచ్చినారని మనమే వేసుకోవచ్చును. నాలుగు మేకలని చంపినా మంచే నాలుగువేలింట్లో వచ్చిపడతాయి. ఇప్పుడు నీపెళ్ళాము నగ నట్రా లేక ప్రత్యక్షము తలవెంట్రుకల వెధవలాగున్నది. యజ్ఞమైన తరువాత కావలసినన్ని నగలు దిగవేయవచ్చును. ఓరే! పైగా అదృష్టము బాగాయుంటే ఒక పుట్టెడుభూమి కొనుక్కోవచ్చునురా.

విస్స—ఒరే అంతాబాగానేయున్నది కాని పొట్టచించి కంచు కాగడా పెట్టి వెదికినా యెక్కడా అక్షరంముక్క లేదునాకు ఇల్లాటి వాడిని యెగ్గెల్లా చేయను? పైగా సంధ్యావందనమైనా రాదురా దీనమ్మకడుపుకాలా!

మల్ల—పాండిత్య మెందుకోయి వెధవపాండిత్యము! ఈచేసే వాళ్ళందఱకు పాండిత్య ముండేడిశింది! యజ్ఞం చెయ్యేదలచుకుంటే మూడుపూటలలో సంధ్యావందనము చెప్పిస్తాను నీకు!

గోవిం—అవునురా, సంధ్యావందనముమాటకుభయము లేదు.

విస్స—అన్నింటికన్నా మరోచిక్కుందిరా నాకు సుఖసంబంధమైన జబ్బుమూలాన్ని తెల్లారేటప్పటికి చిరవాణి యన్నము తింటే కాని యుండలేను. ఆయగ్నం నాలుగు రోజులు ఉపవాసం ఉండడ మెల్లాగు? తరువాతరోజు అగ్నోత్రాలు చేసికోవాలి కాబోలు.

మల్ల—యజ్ఞము నాలుగురోజులు యెల్లాగో కష్టపడి కాలక్షేపము చెయ్యాలి నువ్వు. అప్పుడుకూడా నేను మన గోవిందుగాడు యెల్లాగో ఒకలాగు యే కాఫీకొట్టులోనుండైనా యింత కాఫీ ఉపమా తెచ్చి నీకు పెడుతోనే యుంటాము. తరువాత నీ వగ్నిహోత్రాలు చెయ్యక్కఱలేదు. ఏమి అక్కఱలేదు.

విస్స—సరే! నా పెళ్ళాముతో కూడా ఆలోచించి రేపు ప్రొద్దున్న చెప్తానులే. అదొక బ్రహ్మరాక్షసిముండ. అది తెల్లారేటప్పటికి ఆవకాయి వేసికొని కంచెడన్నము తింటేనే కాని యుండలేదు.

గోవిం—ముందు నువ్వు చెప్పిచూడు వప్పుకుంటుంది అంతగా వప్పుకోకపోతే మేము చెప్పి యెల్లాగో ఒకలాగ బలవంతముగా వప్పిస్తాము.

విస్స—సరే.

(అందఱు నిష్క్రమింతురు)

—◆—

రెండవరంగము

[విస్సయ్యయు భార్యయగు పుల్లమ్మయు ప్రవేశించుచున్నారు]

విస్స—రెండురోజులనుంచి అడగాలనుకుంటూన్నాను.

పుల్ల—అంతాలోచ నెందుకు. అడగదలచుకొన్న దేమిటో అడగరాదూ.

విస్స—ఎప్పటికప్పుడు పనితొందరలో మరచిపోవుచున్నాను. ప్రొద్దున్నే లేచి నా కాల్యకృత్యములు నేను తీర్చుకొని ఆయిల్లుకాస్తా అలికేసేశి ముగ్గువేసి చెంబులు తోముకొని పీటలుకడిగి నీకు కంచములో చలిదన్నము పెట్టి, అప్పుడు నిన్ను నిద్రలేపి మొగము కడిగించి కంచముముందర కూర్చోపెట్టి, అప్పుడు చెరువుకెళ్ళి రెండు కావిళ్ళ నీళ్ళు యింట్లో పారవేసికొని ఆపయిన వంట చేసికొని నేను భోంచేసి విస్తళ్ళు అవ్వీతీసికొనేటప్పటికి మూడుజాములవుతూవున్నది. ఉస్సూ అస్సూమంటూ వంటింట్లోనుంచి చివతలకొచ్చేటప్పటికి కాళ్ళు చేతులు పీక్కుపోతాయి. అందుచేత యేచాపగుడ్డమీదో పడుకొని లేచేటప్పటికి దీపాలవేళవుతుంది. ఆమట్టుకు దీపాలు వెలిగించుకొని

వంట చేసికొని నీకు పెట్టి నే తిని పనిపాటలు చేసికొనేటప్పటికి కళ్ళ మీదికి నిద్ర కూరుకొస్తుంది. ఈరోజున మనయిద్దఱముగూడ పెళ్ళివారింటికి భోజనము గనుక తీరుబడిగానున్నది నీపనిమూలాన్ని నే చస్తూన్నాను.

పుల్ల—నాపనిమూలాన్ని మీరు చస్తూన్నారా? ఆమాటకి పట్టొస్తే నేను చేసినట్టు పనెవరూ చెయ్యడమే లేదు. నాకంచం నేను కడుక్కుంటాను. మీకు కూర తరిగిస్తాను. పోగుపులోకి జీలకఱ్ఱ మెంతులూ యిల్లాటి వందిస్తూంటాను. మీరు నాకేమి విసురుతున్నారా? కాళ్ళు పిసుకుతున్నారా? వెళ్లేస్తున్నారా గోడలు మెత్తుతూన్నారా, అంట్లు తోముతూన్నారా? ఎల్లమ్మ మగడు. ఇంట్లో అన్నిపనులు వంటలు చేసికోనడం కాకుండా, వడ్లు దంపుతాడు అంట్లుతోముతాడు. గోడలు మెత్తి వెళ్లేస్తాడు. ఎల్లవారి పెళ్ళాలు లాగా నేను పని చెయ్యకుండా వుంటే నన్ను మరీఆక్షేపించి చంపుదురు మీరు. ఇల్లా పనిచేస్తూంటేనే పొరాగతం లేకుండావుంది.

విస్స—ఈపనులకే తలెత్తుకోలేకుండా చస్తూన్నాను. ఇంకా అవిగూడా చెయ్యమను.

పుల్ల—ఇప్పు డీమాటల కేమిగాని మీరేదో మాటచెపుతానన్నారు. చెప్పండి.

విస్స—అది చాలా ముఖ్యమైన మాటే. మనకి నాలుగు వేల రూపాయలు కలిసివచ్చే వ్యవహార మొకటున్నది. నీవు వప్పుకుంటే అది కలిసివస్తుంది.

పుల్ల—నాలుగువేలు కలిసివచ్చేటట్టయితే నేను వప్పుకోక పోవడం యేమిటి. నే నెందు కొప్పుకోకపోతాను,

విస్స—నన్ను యెగ్గం చెయ్యమవి మన మల్లయ్య గోవిం ౹ా బలవంతము పెడుతూన్నారు యగ్గం నిమిత్తము

యాచనకు వెళ్ళినామంటే నాలుగైదువేల రూపాయలు రొక్కం దొరుకుతుంది. పైగా బియ్యం పప్పు ఉప్పు మిరపకాయ చింతపండు కూరా గుఱ్ఱ అప్పటి అన్నప్రదానానికి సరిపోగా మిగిలియుంటాయి. పైగా చీరలు జామారులు కావలసినన్ని.

పుల్ల—సరి. ఇదా చెప్పవచ్చినమాట. నాకు యెగ్గాలూవద్దు యాగాలూవద్దు ఇలాగుండనియ్యండి. ఆ నాలుగురోజులు అన్నం లేకుండా యెవళ్ళుంటారు. పైగా చల్దికూడు తినగూడను కాబోలు. ఆపయిన యిష్టి అని అగ్గోత్రం అని ఆచారమని కాల్చుకుతింటారు. అలవాటు లేని అవపోసనం చేస్తే మీసాలన్నీ తెగకాలాయట. మన కెందుకు.

విస్స—ఓసి భ్రష్టాకారిముండా! నాలుగువేల రూపాయలు వస్తాయి, ఆపయిని చల్దికూడు మానక్క-అలేదు. ఇష్టి చెయ్యను నష్టి చెయ్యను. అగ్గోత్రాలు లేవు ఆచారాలు లేవు. ఇది రూపాయలు కోసము కాని నిష్టకోసమా యేమిటి. దీనివల్ల రూపాయలే రావడం కాకుండా మనకు గౌరవము యెక్కువుంచుంది. సోమిదేవమ్మగారు సోముదేవమ్మగా రంచూ ఆడవాళ్ళు మగవాళ్ళు కూడా యెంతోంత యిదిచేసి నిన్ను నెత్తిమీద పెట్టుకుంచారు. ఎల్లాగోల్లాగ వప్పుగో. నాలుగు రోజులు కష్టపడితే నాలుగువేలు వచ్చి యింట్లో పడచాయి.

పుల్ల—మీరిన్నివిధాల చెపుతూన్నారు గనుక యేవిధంగా నాలుగురోజులు చల్దన్నం మానుకొని వప్పుగుంటాను కాని నాముద్దు చెల్లించాలి. నాకొక్క కోరికుంది.

విస్స—యేమిటో ఆకోరిక పెందరాళే చెప్పు. నా చేతనైన దయితే నేను పెందరాళే తీరుస్తాను.

పుల్ల—కోరిక తీరుస్తానంటే చెప్పకేమి. నాకు బంగారపు కంఠి ఒకటి చేయిస్తారా యెగ్గపాకలో కొచ్చి నేను మీసరసని కూర్చుంటాను. ఎగ్గం పూర్తిచేయిస్తాను.

విస్స—ఎగ్గెం అయినతరువాత చేయిస్తాను. కంఠికి ముందుగా డబ్బెక్కడ తేగలను.

పుల్ల—అప్పుచేసైనా సరే నాకు ముందుగా కంఠి చేయించాలి నేను మొగ్గెంపాకలో అడుగుపెట్టాలి. అందు కొప్పుకోకపోతే మీరు నాతో మాటాడక్కఅలేదు.

విస్స—సిరిరా మోకాలొడ్డినట్లు శనైశ్వరపు ముండవు నాలుగువేల రూపాయలు వస్తూంటే నష్టజాతకము గుణించి తగల పెడుతూన్నావు. అభము తెలియదు శుభము తెలియదు.

పుల్ల— అస్తమానం ముండా ముండా అనే నోటికి విధివిరామము లేదుగదా. అనడమేకాని యెన్నడు జరగడం లేదు. ఒక్కమాటు జరిగిపోతే యీ కంఠిలు కాసులు అక్కఅలేదుకదా. ఆదేవుడు తిన్నగా చూడడం లేదు.

విస్స—అంతమాట పుడితే నాచాకిరీయైనా తప్పునని నే నేడుస్తూన్నాను. నీబట్టలుతగలేక అన్నమువండిపెట్టలేక నేనుచస్తూన్నాను.

పుల్ల—నాకు మీరు చెయ్యవద్దు మీకు నేను చెయ్యవద్దు లేచిపొండి. ఎగ్గానికి నేనెందుకు ఆరావువారి కొట్లలోనున్న ఆముంగి ముండని తీసుకెళ్ళరాదూ !

విస్స—సరే నీకింత పొగరుగావుంది కనుక ఆ కంఠి ఏమో దానికే చేయించిపెడతాలే నీవు నంబి కృష్ణమాచార్లుతో చీట్ల పేకాడుతూ కూర్చుందుగాని యిక్కడ.

పుల్ల—అట్టే పేలాపన పేలక యిక్కడినుంచి వెళ్ళండి. మీ మాటలు వెలపరం వస్తూన్నాయి.

విస్స—సరే లేచిపోతాను.

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

మూడవరంగము

[విస్సయ్య మల్లయ్య గోవిందయ్య ప్రవేశించుచున్నారు]

మల్ల—ఓరే విస్సిగా! మీపట్టపుదేవి యజ్ఞంపూట యేమం దేమిటి.

గోవిం—అది వీడికి ముగుడుకాని పెళ్ళాముకాదు. వీడు చెప్పినట్లు వింటుందని తోచదు.

విస్స—మన గోవిందుగాడు చెప్పినట్లే అయిందిరా! ఆముండ ససేమిగా యంటుంది. దాని కెవరు దుర్బోధ చేసినారో కాని తన మెళ్ళోకి కంటె చేయిస్తేనేకాని వప్పుకోదట,

మల్ల—అయితే నీవీవిషయములో నేమి నిశ్చయించినావు?

విస్స—పోనీ మానేదామా అని తోస్తూంది. ఈముండతో వేగ లేను.

గోవిం—నీవుశుద్ధ వెఱ్ఱిముండాకొడుకువన్నమాట. పనికిమాలిన ఆడముండ చెప్పినట్లువినక తెగసాగుతూంటే చేతగాని వెధవ లాగ యజ్ఞంమానేస్తావంటావేమిటి. తాటికమ్మ పుచ్చుకొని నారవచ్చేవరకు వెన్నుబద్దలకొడితే అది దానిని పుట్టించిన జేజెమ్మ కూడా వింటారు. పెళ్ళామును జడిసే వెధవవు నీవేమికాపురము చేయగలవురా?

విస్స—అవిఅనపగుగ్గిళ్ళుకావు ఇనపగుగ్గిళ్ళు అదినూరుమంది మగవాళ్ళను చంపి పుట్టింది. దాన్ని మంచిమాటలతోనే వశపరచుకోవాలి కాని పాకం ముదురుతే మనతరముకాదు.

మల్ల—నిజమేరా బాబూ. దానిసంగతి మొదటినుండి నాకు బాగా తెలుసును. దాని సాంప్రదాయమే యటువంటిది. దానితల్లి అత్తగారిమీద కోపముచేత కొంపకు నిప్పెట్టి పుట్టింటికిలేచిపోయింది. దానితో ఎదురువాద మేస్తే కార్యము లేదు.

గోవిం—అందుకని దాని కాళ్ళకు దండము పెట్టి యజ్ఞము మానుకొంటావా.

మల్ల—మానుకోనక్కఱలేదయ్యా!

విస్స—మానుకోక యేమిచేయమంటావు?

మల్ల—నేను చెప్పినట్లు చేస్తే ఉభయతారకంగా నుంటుంది. ఆ చిన్నదాని కోరికా తీరుతుంది మన పనీ సాగుతుంది.

విస్స—ఏమి టాయుపాయము?

మల్ల—ఎక్కడైనా నాలుగువందల రూపాయలు నోటువ్రాసి బదులు తెచ్చి ముందుగా కంటిచేయించిపెట్టి దాని వప్పుదల పుచ్చుకొని ఆపయిన యజ్ఞంలో దిగితే బాగావుంటుంది.

విస్స—ముందుగా లోటురాసి బదులు తెమ్మంటావూ ఎగ్గాని కల్లా మూలం ఎగ్గెం మండినట్టైవుంది.

మల్ల—ఓరీ వెఱ్ఱిముండాకొడకా బదులు తెస్తేనేమిరా? మూడోనాటికి సొసాయించి పారవేస్తాము కాదురా?

గోవిం—మూడు మాసములలోపుగా, అసలీపాయిదా లిచ్చి వేస్తాముఠా.

విస్స—మనకు బదులిచ్చేవాడెవ డీవూళ్ళో?

మల్ల—నీకోక్కపంవస్తే చెప్పలేను కానిచిలకలంపాటి మాన్యం తనఖాపెడితే యిస్తారు.

విస్స—పెద్దలు సంపాదించిన కొంప్ర. ఉన్నఆధారమే యిది నాకు ఆకాస్తా యీ మెగ్గెంతో ఊడ్చిపెట్టుకుపోయినా యిక కాళ్ళు పారజాపాలి.

మల్ల—అదిగో అదేమాటంటావు. మళ్ళీని రెండుమూడు నెలల లోపారేస్తాముఠా?గోనిసం చెడురూపాయలొస్తాయని చెప్పుతూంటేనూ

గోవిం—వీడికి మనసు నిబ్బరము లేదురా. చచ్చిత్తం ముండా కొడుకు.

విస్స—అప్పంటే భయముఁరా మరి. కాక పోయినా మనకు బదులిచ్చేవాడెవడు ?

మల్ల—రామన్న పంతులుగా రిస్తారురా? ఆయనదగ్గఱ నేను కుదిర్చి పెడతాను.

విస్స—అమ్మబాబూ ఆయనదగ్గఱ తనఖాపెట్టామంటే మన భూమి మనకు దక్కదు. మనమీజన్మానికి తేలము.

మల్ల—తేలడానికి తేలకపోవడానికి యెన్నళ్ళురా? యాగం ఆరంభించకముందే ఋణం తీరుస్తాముకాసూ. మనంముగ్గురము బయలుదేరామంటే కుంచాలకొలది రూపాయలు తేమట్రా.

విస్స—అయితే రామన్నపంతులుగా రిస్తారూ.

మల్ల—ఇవ్వకేమి తనఖా వ్రాస్తాంటేనూ.

విస్స—వడ్డీ రూపాయన్నర గాబోలు.

మల్ల—తనఖామీా దంతకు తక్కువివ్వడు.

గోవిం—వడ్డీ యెంతరా నాలుగువందలు బదులుచ్చుకుంటే నెల కారురూపాయలు. మూడు నెలలకు 18 రూపాయలు.

విస్స—సరే పదండి రామన్న పంతులుగారిదగ్గఱకు వెళదాము.

(అందఱు నిష్క్రమింతురు.)

—♦—

నాలుగవరంగము

[అప్పుడు విస్సయ్య మల్లయ్య గోవిందయ్య ప్రవేశించుచున్నారు.]

మల్ల—నేచెప్ప లేదట్రా. రామన్న పంతు లంతఃకరణ చాలా మంచిది.

గోవిం—నిజమేరా, అడిగితే లేదనడు ముండావాడు.

విస్స—భూమితనఖా పెట్టుకొని బసులియ్యడంకూడ గొప్పేనా యేమిటి. సరే! సొమ్ము దొరికిందికదా. ఇక చెయ్యవలసిన పనేమిటి.

మల్ల—పనేముంది. నేను గోవిందయ్య వెళ్ళి కొంతసొమ్ము నీయజ్ఞంనిమిత్తం యాచనచేసి పట్టుకొని వస్తాము. మాకిద్దఱికి బత్తి కర్చుక్రింద చెరియొక పదిరూపాయలు ఇప్పించు. తరువాత బత్తి కర్చులు దొరికిన సొమ్ములోనుంచి పెట్టుకుంటాము.

విస్స—మీరంటే నాకు నమ్మకమే? ఎలాగో ఒకలాగు కార్యము నెరవేర్చండి. అయితే యేంపేరు పెట్టుకోను నేను.

మల్ల—విశ్వనాథశాస్త్రి బాగావుంటుంది.

గోవిం—శాస్త్రి బాగుండదురా. విసన్నవధానులే బాగావుంటుంది. అవధానులు సోమయాజులు కావడం బాగావుంటుంది.

మల్ల—అవునోరే నీవు చెప్పినదే బాగావుంది. అందుకుచేత విసన్నవధానులుగారే అందాము. పదిమాట్లు అనుకుందాముపట్టు. ఇదివరకు విస్సిగాడు విస్సన్నగాడు అని పిలవడం మనకలవాటు, ఆ యలవాటుచొప్పున పెద్దమనుష్యులదగ్గఱకు వెళ్ళినప్పుడుకూడ ఆ పేరే వస్తుందేమో. అందుకుచేత పదిమాట్లు వర్ణి[illegible]కుందాము.

విస్స—రేపు నేను యింటికివెళ్ళి కంఠిప్రయత్నము చేస్తాను.

(అని వెళ్ళును.)

మల్ల—ఒరే గోవిందుడు. యజ్ఞం మూడునెలలుందిగదా. ఈ మూడునెలలలో మనము దేశాలవెంటదిరిగి సొమ్ము సంపాదించాలి సంపాదించినదంతా వీడియదాన్నే పెడదామంటావా?

గోవిం—వాడికిచ్చేటట్టయితే మనము తిరగడమెందుకురా. రూపాయకర్ధలు వాడికిద్దాము.

మల్ల—ఒకరే రూపాయకు పావలాలు వాడికిస్తే బాగావుంటుం దిరా. ఎందుకంటే రేపు యజ్ఞంలో కట్నాలు కానుకలు వచ్చును. రాకపోవును. మనము ముందుగానే జాగ్రతపడాలి. ఇద్దఱము చెరి యొక వెయ్యిరూపాయలు సంపాదించుకుంటేనేగాని కష్టము గిట్టదు.

గోవిం — నిజమే యీముండాకొడుకు మాన్యముకొంౘఅమ్ము కోవలసినదే. వీడికివచ్చే దేమిటి వీడియదం. ప్రస్తుతం చెరియొక పది రూపాయ లిచ్చాడుగదా. కాని యివియింట్లోయిచ్చి పోదామురా?

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

—*—

అయిదవరంగము

విస్సన్న యిల్లు.

[విస్సన్నయు భార్యయు ప్రవేశించుచున్నారు.]

విస్స—ఒసే! ఏంజేస్తూన్నావు.

భార్య—(గుఱ్ఱుపట్టి నిద్రపోవుచున్నది)

విస్స—ఓసీ నిర్భాగ్యురాలా. లేవవే యెప్పుడూ నీకు నిద్ర యేను.

భార్య—అబ్బా దిక్కుమాలిన కర్మము. ఎవరువారు. చెన్న మల్లయ్యా!

విస్స—నీయమ్మకడుపు కాలా. జంగం చెన్నమల్లయ్య యెందుకు జ్ఞాపకము వచ్చాడే యిప్పుడు.

భార్య—(మేలుకొని) సరి. మీరా? ఏదో నిద్రలో కలవచ్చి పలవరించాను. నిద్దరోతూన్న మనిషి నెందుకూ లేపడం. ఏమంత రాచ కార్యము పడిపోయిందని. మనిషికి కష్టము సుఖము తెలిసుండాలి. ఎప్పుడూ యిల్లాంటి మోటసరసమేకదా. మాపుట్టిల్లు వదిలిపెట్టి యే

నాడు కాపరానికి వచ్చానోకాని యొక్క-నాడైనా కంటికి నిద్రలేదు కదా. మాయలేపడం, ప్రూరికేలేపడమే నిద్దరోతూంటేను.

విస్స— ఓసి నీయిల్లు వల్లకాడుగాను. పనిపాట చెయ్యక వంటా పెట్టూ లేక యెనిమిదిజాములు మంచముమీదే పడుకొని నిద్ర పోతూంటావు. నీకు నిద్ర లేకపోవడ మేమిటే. నీకు పగలు రాత్రి యను భేదము లేదు. బావురుపిల్లులు దెబ్బలాడినట్లు గుఱ్ఱు పడు తూంటావు.

భార్య— వట్టిపడకేగాని ఆద మరచి నిద్రపట్టదు. శ్లేష్మతత్వ మగుటచేతను వాతకొడి మనిషి నగుటచేతను కన్ను మూసేటప్పటికి గొంతుకలో గురగురలాడుతుంది. అందుకుచేత అది నిద్రలా గన బడుతుంది. కాని యెప్పుడూ మెలకువే.

విస్స—ఎప్పుడూ మెలకువైతే యెన్ని పిలిచినా పలకవేమేమరి?

భార్య—ఎప్పుడూ పరధ్యానంగా వుంటాను. నిద్రపట్టినా కోడికునుకు. చీమ చిటుక్కు-మంటే మెలకువ వస్తుంది. దానిమాట కేమిగాని మీరిప్పు డింత తొందరగా లేపటము కారణ మేమిటో చెప్పండి?

విస్స—రామన్నపంతులుగారి దగ్గఱ నాలుగువందలు బదులు చేసి పట్టుకువచ్చాను కంఠి చేయించడంకోసము. ఇది నీలాభముకోసమే కాని నాలాభముకోసముకాదు.

భార్య—ఇదా శుభవార్త నాదగ్గఱకెందుకు రూపాయలు? నెత్తివేసి కొట్టుకుంటానా యేమిటి? కంసాలి నరసింహాన్ని పిలిచి కాసులుకొని యియ్యండి. ఈభాగ్యానికా నిద్రలేపడం?

విస్స—నీమేలుకోసం చెప్పినా నామీదే కోపమా?

భార్య—నాయుపకారంకోసమా కంఠి చేయించడం? మీ యజ్ఞంకోసము చేయిస్తూన్నారు!

విస్స—ఎందుకు చేయిస్తే నేమిగాని యీమాటు సోమిదేవమ్మ వై పక్క-ని కూర్చుంటావా?

భార్య—కూర్చోకేమి? నెత్తిమీద ఒకచిన్న నాగరికూడా చేయించండి. బోడితలతో కూర్చోలేను.

విస్స—నీయిల్లు బంగారంగాను. బోడితల అనకే నాకు వాగా యిత్యంగా వుంది.

భార్య—అంటేనే అవుతుందా యేమిటి! రెండూ చేయించండి.

విస్స—రెండూ చేయించుకు వస్తాను.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

[అప్పుడు విస్సయ్యయు భార్యయు ప్రవేశించుచున్నారు.]

విస్స—ఆ మల్లయ్యగారూ గోవిందయ్యగారూ నాకొంప తీసినారు. యగ్గెమువద్దు మొఱ్ఱో అంటూంటే చెయ్యి చెయ్యి వేలకొలది రూపాయలు వస్తాయని ఆశపెట్టి నన్ను గంగలో దింపినారు.

భార్య—అలవాటులేని అపపోశనచేస్తె మీసాలన్నీ తెగ కాలిపోయినా యన్నట్టుగా నీళ్ళకావిళ్ళు మినపసున్ని సారెకావిళ్ళు మోసుకునేవాళ్ళు యగ్గాలుచేస్తే యిలాగే బెడిశికొట్టి సంసారాలు మాశిపోతాయి. యగ్గెం చెయ్యడమంటే వంటచెయ్యడమూ, నీళ్ళు మొయ్యడమూ. శోడశబ్రాహ్మణార్ధాలు చెయ్యడమనుకున్నారా?

విస్స—ఏదో బుద్ధిగడ్డితిని వెనుక మహేశ్వరచెయినులుగారు రామావధానులుగారు చేశినట్టే నేనుకూడా యగ్గెంచేస్తే రూపాయలకు రూపాయలు వస్తాయి నేనుకూడా గొప్పవాడినవుతాననుకొని బొండలో పడ్డాను.

భార్య—భద్రయ్య పల్లకీయెక్కితే సీతయ్య చెరువుగట్టెక్కాడన్నట్టుగా మహేశ్వరచెయినులుగా రెగ్గెంచేశారని మీరుచేస్తే వప్పుతుందా?

విస్స—అయిందేమిటో అయింది. ఒక్కమాట చెపుతాను విను అప్పులవాళ్ళు మనభూమి అమ్ముకుపోతారు. యజ్ఞేశ్వరుడు చేసిన సహాయము మనకింతే. నీకు మొన్న చేయించిపెట్టిన కంటె మళ్ళీ యిచ్చావంటే అది యెల్లాగైనా అమ్మి—

భార్య—కంటే లేదు గింటీ లేదు, నోరుమూసికొని అవతలకు నడవండి. నా ప్రాణం పోయినా నే కంటి యివ్వను. నా గొంతుక పిసికి చంపి తరువాత పట్టుకొని వెళ్ళండి. మావాళ్ళు డబ్బ కాశపడి దిక్కుమాలాళ్ళు మూడో యేట చేశారు యీ వెధవ పెళ్ళి నాకు. నగా నట్రా పెట్టించుకోలేదు ఎన్నాళ్ళనుంచో కంటిపెట్టుకు తిరగాలని ముచ్చట నాకు. నేటికాలానికి యీ బంగారపుపోచ కాస్త రాయించి మెళ్ళో వేశారు. ఇచ్చిన మొన్నాడే తెమ్మంటూన్నారు.

విస్స—ఓసి వెఱ్ఱిపాడకట్టా! భూమమ్ముకుపోతారే.

భార్య—భూమిఅమ్ముకుపోతే నాకేమి యిల్లమ్ముకుపోతే నాకేమి. మిమ్మలినమ్ముకుపోతేనా కేమి: ఈభూమివల్ల వచ్చే డబ్బునల్ల నాపదిమంది బ్రతుకక పోతారా యేమిటి. అంతగా నామనువర్తికి లేకపోతే నాకంటి చాల్లే. కాదాయనాంటే ఆయింతా మీ ప్రాణము గుటుక్కుమంటే నేను బ్రతుక లేకపోతానా యేమిటి ? ఆ భూమివల్ల వచ్చేవి యిరవయిరూపాయల్లో రానుపోను నాలుగురూపాయలుపోతే తక్కినవి 16 రూపాయ లుంటాయి. అంత యోగంపడితే యీకంఠి అమ్మి వడ్డీకి వేసుకుంటాను.

విస్స—ఓసి! నీబొడ్డుపాకా. మాటకల్లా నన్ను చావమంటావేమిటే.

భార్య—నేను చావమని తిట్టేనామిమ్మలిని. ఎప్పటికైనా అల్లాటిచిక్కొస్తె యిలాచేస్తానని చెప్పేను. కాకపోతేమట్టుకు చావక మెల్ల కాలము పుట్టికట్టుకు వూరేగుతారా యేమిటి ?

విస్స—ఇంతకూ యేమన్నా సరేగాని ఆకంఠిమాత్రము నీ విన్వకతప్పదు. ఒక నెల్లాళ్ళుముచ్చటగా పెట్టుకొన్నావుకదా. ఈపాటికి ముచ్చట తీరుతుంది. లేకపోతే పదిమంది గయ్యాళిముం డంటారు.

భార్య—ఏవర్తాగయ్యాళిముండనేది. మొగంమీద పేడనీళ్ళు కొడతాను వెధవయగ్గెము యల్లాఅవుతేంచేశానని మీదమీదకొచ్చి తిడుతూన్నారు. శుక్రవారముపూటా యీకంఠియిమ్మన్నారని నా కెంతో వాగాయిత్యంగావుంది మొన్న యీకంఠి మెళ్ళోపెట్టుకుని నాగరి నెత్తిమీదేసుకుని మనవాళ్ళంటికి పేరంటానికెడితే నలుగురు ముత్తయిదులు నన్నుచూచి పార్వతీదేవిలాగున్నావే అమ్మాయని యెంతోంత ముచ్చటపడియిచ్చేశారు ఉందుచేత నేనివ్వను. నన్నల్లరి పెట్టి మీరల్లరి పడకండి.

విస్స—(నెత్తి మొత్తుకుని) నీయమ్మకడుపుమాడా నీమూలాన్ని ఆముల్లిగాడు గోవిందుగాడిమూలాన్ని పితురార్జితంపదిపన్నెండు తరాలనుంచివచ్చేభూమిని నిష్కారణంగా హోరున యేడుస్తూ అమ్ముకుంటూన్నాను. ఏభ్రాశిముండా నావుసురుకొట్టి పోతావు.

(అని యేడ్చుచున్నాడు)

భార్య—మీవుసురుకొట్టి నేపోవడమేమి మీకున్నవాళ్ళంతా పోతారు మీఅప్పలు మీచెల్లెళ్ళు మీఅన్నదమ్ములు మీవాళ్ళంతా పోతారు.

విస్స—నావాళ్ళు పోవడమేమి. నీవాళ్ళునీవు దుంపతెగి పోతారు నిర్భాగ్యంముండా.

భార్య—నావల్లలోపముంటే నాపసుపుకుంకమే పోతుంది. మీవల్లలోపముంటే మీరేపోతారు అడుగోమల్లయ్య అల్లావెడుతూన్నాడు. వాడినిపిలిచి ఆలోచనడగండి మొదటయగ్గెం చెయ్యమన్నవాడు వాడేకాదుమరి ఇప్పుడేమిచెపుతాడో పిలవండి.

విస్స—ఒరే ఓరీమల్లయ్యా (అని పిలుచుచున్నాడు.)

భార్య—అతడు పలకడమే లేదు. తలవంచుకొని వెళ్ళిపోతూన్నాడు.

విస్స—దొంగముండాకొడుకు పారిపోతూన్నాడు. అయినకాడికి దొరికింది వాడుచేతిలో వేసికొన్నాడు. నన్ను పశువునుచేసి యగ్గంచేశారు వీళ్ళు.

భార్య—రేపు యిష్టికాబోలు దానిప్రయత్నం చేసికోండి.

విస్స—ఇష్టీ లేదు నీశార్ధం లేదు నోరు మూసికొని యూరుకో. ఇంకా యిష్టేమిటి. రేపుభూమిఅమ్మేసి రామన్నపంతులుగారి కిచ్చి సోమయాజులుగారు మళ్ళీ కావిడబద్ద యెత్తుతారు.

భార్య—సోమిదేవమ్మగా రెప్పటిలాగే పెళ్లిముత్తయిదుకెడతారు.

విస్స—ఎప్పుడు యిల్లాంటి తలమీరిన పనులకెళ్ళకుండా బుద్ధొచ్చింది. ఈజన్మానికి దీనితో చాలు.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

—*—

చాకలిపురాణం

నైమిశారణ్యమునందు శౌనకాదిమహామునులు పండ్రెండు సంవత్సరములు సత్రయాగము జేయుచుండగా నచ్చోటికి సకలపురాణములు సకలేతిహాసములు సకలధర్మములు సకలశాస్త్రములు సకల విద్యలునేర్చిన సూతుడు వచ్చెను. మహామును లాతనిని మిక్కిలి గౌరవించి మంచి పీఠముమీద గూర్చుండబెట్టి "మహానుభావా! ఇదివరకు లోకములో నెన్నడు నెవ్వరువిననిది కననిది క్రొత్తది చెప్పుల

కింపయినది యగు నొక్క యితిహాసమును సెలవిచ్చి మమ్మందరను ధన్యులను జేయవలసినదనివినయపూర్వకముగా బ్రార్థించుచున్నాము'' అని ప్రార్థింపగా సూతుడు వారియందు దయగలవాడై మిక్కిలి యాదరముతో నిట్లనియె. ''మహానుభావులారా ! ఇటువంటి ప్రశ్నమునే పూర్వము శనైశ్చరుడు (శనిగాడు) విఘ్నేశ్వరు నడిగెను. ఆ విఘ్నేశ్వరుడు పొట్టసవరించుకొనుచు శనైశ్చరునితో నొక చిత్రకథ చెప్పెను. ఆ కథయే నేను మీకిప్పుడు చెప్పుచున్నాను. శనైశ్చరుడు విఘ్నేశ్వరు నిట్లడిగెను. అయ్యా! విష్ణుమూర్తి పాముమీద పండుకొనుటకు గారణమేమి ? నూలుబట్టలు గట్టక ఆయన బంగారుబట్టలు కట్టుటకు గారణమేమి ? సాంబమూర్తి దిగంబరుడగుటకు గారణమేమి ? ఏనుగుతోలు పులితోలు కప్పుకొనుటకు గారణమేమి ?'' అనగా విఘ్నేశ్వరు డిట్లు ప్రత్యుత్తరము జెప్పెను. ''ఓయి శనైశ్చరుడా ! నీవడిగిన ప్రశ్నము చాల ప్రశస్తమయినది. ఇప్పటి కాలములో నడుగవలసిన ప్రశ్నయే యిది. విష్ణుమూర్తి లోకులందఱు బండుకొన్నట్లు దూదిపాన్పుమీద పండుకొనక పాముమీద పండుకొనుటకు గొప్పకారణముకలదు. అది యేమనగా చాకలివాళ్ళబాధ పడలేకను పరుపున్న పక్షమున దుప్పట్లుండవలెను. దుప్పట్లు చమటపట్టి మాసిపోవును. మాసిపోవునప్పుడు వాని నుదికించుకోనవలెను. ఉదుకుటకు చాకలివాళ్ళకు వేసిన పక్షమున వాళ్ళు వేళకు తీసికొనిరారు. తెచ్చినపక్షమున చింపి ముక్కలుచేసి తీసికొని వత్తురు ఈ చాకలివాళ్ళతో వేగలేక విష్ణుమూర్తి దుప్పట్లక్కఱలేకుండా, ఉతకనక్కఱ లేకుండా ఉండునట్టి పాముమీద పండుకొనుచున్నాడు. నూలుబట్టలు కట్టుకొన్నపక్షమున నిట్టి బాధలే పడవలసివచ్చునని విష్ణుమూర్తి బంగారపుబట్టలు కట్టుకొనుచున్నాడు ఆయనకు కాంచనచేలుడను పేరిందువలననే గలిగినది. తరువాత మాతంగ్రిగా

రైన సాంబమూర్తిగారియొక్క చరిత్ర జెప్పుచున్నాను వినుము. బట్టలు దికించుకొనుటకు విష్ణుమూర్తిగారివద్ద డబ్బున్నది. ఎందుచేత ననగా ఆయనవద్ద లక్ష్మియున్నది గనుక. సాంబమూర్తిగారికో చిల్లి గవ్వలేదు. ఇల్లు వల్ల కాడుగదా. పుర్రెలో భోజనముగదా. ఈయన బట్టలుదికించుకొనుటకు డబ్బెక్కడనుండి వచ్చును? ఏవో రెండు గుడ్డలతో కాలక్షేపము చేయవలయునన్న పక్షమున చాకలివాళ్ళు త్వరగా నుదకరు: అందుకుచేత సాంబమూర్తిగారు దిగంబరుడై యున్నాడు. ఎవరైనా తమవంటి పెద్ద లాయనదర్శనమునకు వచ్చి నప్పుడు సిగ్గుచేతనో బొత్తిగా బాగుండదను శంక చేతనో, పులితోలు తోనో యేనుగుతోలుతోనో శరీరముకప్పుకొనుచుండును. ఈచాకలి వాళ్ళమీదగల కోపముచేతనే ఆయన నూలుబట్ట వేసికొనననని శప థము చేసినారు ఆయనమీదనుండు యుత్తరీయము పాము యుత్త రీయమే. యజ్ఞోపవీతము పాముల యజ్ఞోపవీతమే. తలపాగ పాముల తలపాగ; ఈ తలపాగలలో నాయన వన్నెవన్నె పాగలు ధరించును. నల్లది దాల్పవలెనన్న నల్లత్రాచును తెల్లది దాల్పవలెనని తోచి నప్పుడు తెల్లత్రాచును, గోధుమవన్నది తాల్పవలెనని తోచినప్పుడు గోధుమత్రాచునుధరించుచుండును. ఈవిధముగ ముద్దినుత్రాచులు నాయన యుపయోగించుచుండును. వారిమాట యటుండగా ప్రాచీన మహామునులందఱు వస్త్రముల దాల్పక నారచీరలు చెట్లబెరడులు అటిటి దొప్పలు మొదలగునవి ధరించుటకుగూడ కారణ మీ చాకలి వాళ్ళతో బాధపడలేకనే. ఆ ప్రాచీనుల సాంప్రదాయము ననుస రించియే యీనాటి మునులుగూడ నట్లుచేయుచున్నారు. ఈ యితి హాసము మిక్కిలి క్రొత్తది. ఇదివఱకెవరును విననిది కననిది. ఇది నాస్తికునకు పాషండునకు వేదబాహ్యులకు జెప్పవద్దు. ఇది పరమ గోప్యముగా నుంచవలసినది. దేవేంద్రాదు లీపురాణమునువినిమిక్కిలి ధన్యులైరి.'' ఇట్లు విఘ్నేశ్వరుడు శనైశ్చరునకు జెప్పిన యీచాకలి పురాణమును సూతుడు శౌనకాది మహామునులకుజెప్పి వారిని సంతు ష్టాంతరంగులం జేసెను.

— —

మారీచస్మృతి

అనేక పురాతన గ్రంథములు దొరకుచున్న యీకాలములో నిటువంటి ప్రాచీనగ్రంథము దొరకుట యాశ్చర్యముకాదు, ఇది రావణాసురుని మిత్రుడు, సేవకుడు, వాని యాస్థాన పండితుడునగు **మారీచు** డను రాక్షసుడు రచించిన గొప్పస్మృతి. ఇదివరకు లోకులు వ్యాస, వశిష్ట, గౌతమ, నారద, పరాశర, యాజ్ఞవల్క్య ప్రముఖులగు మహామునులు రచియించిన స్మృతులే యెరుగుదురుగాని, మహానుభావుడైన మారీచుడు చేసిన యీధర్మశాస్త్రము నెరుగరు. మారీచుడనగా గొప్పప్రజ్ఞావంతుడు: కామరూపి, అనగా యేరూపముధరింపవలెనన్న ఆరూపమును క్షణములో ధరింపగలశక్తిగలవాడు. కుక్క, గావలెనన్న కుక్క, నక్కగావలెనన్న నక్క, పందిగావలెనన్న పంది. చీడపేనుగావలెనన్న చీడపేను కాగలసామర్థ్య మతనివద్ద నున్నది. ఈశక్తియుండుటచేతనే యామహానుభావుడు పూర్వము లేడిరూపము దాల్చి శ్రీరామచంద్రుని చాలదూరము లాగికొనిపోయెను. 'పరోపకారార్థ మిదంశరీర' మనుమాట యీమారీచునియందే సార్థకమైనది. ఎందుచేతననగా రావణాసురుడు సీతాదేవి నపహరింపనలెనని శ్రీరాముని మోసపుచ్చవలెనని సంకల్పించుకొని లేడిరూప మెత్తవలసినదని మారీచుని ప్రార్థింపగా నతడు తనప్రాణముకు భంగము కలుగునని భయముపడక, శంకింపక, ఆలస్యముచేయక, అనుమానించక వెంటనే లేడిరూపము ధరించి స్నేహితుని నిమిత్తము తన యర్థమును ప్రాణమును ధారపోసి స్వార్థత్యాగముచేసి కీర్తిశేషుడై సకలరాక్షసప్రపంచముయొక్క కృతజ్ఞతకు పాత్రుడయ్యెను ఆయుపకార మటుండగా మారీచస్మృతి యనుపేర నొకధర్మశాస్త్రముః రచియించి లోకమున

కీయన చేసిన యుపకారమింతింతయని వర్ణింపరాదు. ఈస్మృతికి అనేక వ్యాఖ్యానములు గలవు. అందులో ముఖ్యమైనవి రెండు. మొదటిది కాలనేమి వ్యాఖ్యానము. కాలనేమి యనగా నెవ్వరో కొందరెరుగరు. కొందరు మరచిపోయి యుందురు. రామరావణ యుద్ధములో లక్ష్మణస్వామి మూర్ఛపోయినపుడు హనుమంతుడు సంజీవిపర్వతము దీసికొనివచ్చుటకు వెళ్ళుచుండగా రావణాసురుడు వాని ప్రయత్నమునకు విఘ్నము చేయదలంచి కాలనేమిని బిలిచి హనుమంతుని ప్రయత్నమునకు విఘ్నము కలిగింపుమని యాజ్ఞాపించెను. అప్పుడు కాలనేమియు తన ప్రభువునాజ్ఞ శిరసావహించి హనుమంతునికి గొన్ని యపకారములు చేసి చివరకన్యాయముగా నతనిచేత చంపబడెను. ఈతడు చావకముందె యీవ్యాఖ్యానమును చేసియుంచెను. రెండవ వ్యాఖ్యానము మాల్యవంతుని వ్యాఖ్యానము. మాల్యవంతు డెవరందురేమో ఈయన రావణాసురునకు పినతాత అనగా తల్లికి పినతండ్రి. ఈయన మహానుభావుడు రాక్షసకులమంతయు నాశనమైనతరువాత-లంకాపట్టణమంతయు పాడైనతరువాత ఈగ్రంథమునకు మాత్రము వ్యాఖ్యానము చేసి తనజన్మను సార్థకముచేసికొని కొంతకాలములో మృతినొందెను. మారీచుడు, కాలనేమి, మాల్యవంతుడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరుల వలె త్రిమూర్తులై ఈస్మృతి రచించుటచేత చచ్చిపోయినను బ్రతికి యున్నవారితో సమానముగ నున్నారు. మారీచునియొక్క జీవచరిత్రము వ్రాయుటకు దగిన యాధారము లేవియు దొరికినవికావు. వాల్మీకిమహాముని రామాయణములో వ్రాసిన తప్పువ్రాతలు తప్ప యితరవిషయము లేమియు తెలియుటలేదు. ఈయనవిషయమై తామ్ర శిలాశాసనము లిప్పటివరకేమియు నింకను దొరకలేదు. సింహళద్వీపవాసులకుగాని మరియెవ్వరికిగాని అట్టిశాసనము లేవైన దొరికిన పక్షమున వానిని మేముప్రకటింప నిశ్చయించుకొన్నారముగానతప్పక

పంపకోరుచున్నాము. ఈమారీచస్మృతి మిక్కిలి ప్రశస్తముగనుండుట చేత దేవతలు దీని నపహరింపవలెనని యాలోచించుకొని కుబేర సేవకుడైన పుష్పదంతునిదానిం దెమ్మనిపంపిరి. అతడు పందికొక్కురూపము ధరించి గోడత్రవ్వి గదిలో ప్రవేశించి ఈపుస్తక మెత్తుకొనిపోవుచుండగా ఆగదిలోనే పండుకొన్న మాల్యవంతుడు వెంటనే మేల్కొని పెద్దవాడగుటచేత ఓపిక లేకపోయినను లేనియోపిక దెచ్చుకొని వెంటనే శునకావతారమెత్తి యామాయపందికొక్కుతో దంతాదంతీ, నఖానఖి బాహాబాహీ ఘోరయుద్ధము చేసి నెత్తురు వరదలు ప్రవహించునట్లు వానిని సంహరించి పూర్వము విష్ణుమూర్తి సోమకాసురునిజంపి వేదములు తెచ్చి బ్రహ్మకిచ్చినట్లు మరల నీగ్రంథమును మారీచునకిచ్చెను తరువాత నీగ్రంథము రావణాసుర గ్రంథభాండాగారములోనుండుచు వచ్చినది. ఆంజనేయులు లంకాదహనము చేయునపుడు కాలనేమి, మాల్యవంతుడు ఈగ్రంథము కాలిపోవునేమో యను భయముచేత అతికాయుని, మహాకాయుని, సర్పరోముని, వృశ్చికరోముని, ఖడ్గరోముని వెంటనేగ్రంథభాండారమునకుపంపి కోటలు, పేటలు, మేడలు, గోడలు కాలిపోయినను, దీనిని మాత్రము దెప్పించి పదిలపరచిరి. ఈమహాగ్రంథము యెక్కడ దొరికినదో చెప్పెదను వినుండు. లంకాద్వీపములో నొక చాకలివాడు పుల్లిపాయలు పాతుకొనుటకు నేల త్రవ్వుచుండగా రెండు కుండపెంకులమధ్య నిది దొరికినది. ఈ పుస్తకము ఈతాటాకులమీద వ్రాయబడినది. వ్రాసినపుడు దీనిమీద తాటికాయంత యక్షరములుండి యుండవచ్చును. ఆ యీతాకులన్నియు చెదపురుగులు తినివేసినవి. కాని యక్షరములు మాత్రము స్పష్టముగ కనిపించుచున్నవి. ఇవి గునపముతో వ్రాసిన యక్షరములుకాని గంటముతో వ్రాసిన యక్షరములుకావు. ఈతాకులమీద తాటికాయంత యక్షరము లెట్లుండునని మీరు సందేహింతురేమో ? అట్లు

సందేహింపవలసిన పనిలేదు. లంకలోని యీతాకు లనగా మన పెద్దరిటాకులంత యుండును. ఈపుస్తకము మిక్కిలి బరువుగానున్నది. రెండు గాడిదలమీద వేసి మోయించినను అవి మోయలేక టకటక లాడిపోయినవి. ఇది మూడుకాండలు కలది. అవి యేవనగా (1) ఆచారకాండ (2) ప్రాయశ్చిత్తకాండ (3) వ్యవహారకాండ. ఈ స్మృతియొక్క యవతారికలో నిట్లున్నది. రావణుడు మొదలగు రాక్షసులందరు మహానుభావుడైన మారీచునియొద్దకు వెళ్ళి "ఓస్వామీ! నీవు సకలధర్మములు నెరిగినవాడవు. అన్ని యుగములకు పనికివచ్చునట్టి స్మృతి నొకటిచేసి దేవ రాక్షస మనుష్యలోకముల ననుగ్రహింపవలసినది. బృహస్పతి స్మృతి, శుక్రస్మృతి సరిగాలేవు. తక్కిన మునుల స్మృతులు బొత్తిగా బాగులేవు. నీవు చేసినపక్షమున నది తక్కిన స్మృతులను చెంపకాయగొట్టిన ట్లుండును. గౌతమాదులైన మహామునులు నీచెప్పులు మోయుటకైన తగరు. వారికి రావలసిన యట్టి కీర్తి వచ్చినదిగాని వారు నిజముగా నీకాలిగోరికైన బోలరు" అని ప్రార్థింపగా మారీచుడు సమస్తలోకముల ననుగ్రహించుటకై యీస్మృతి రచియించెను. ఇక ముందు ముందు యీస్మృతియందలి కాండత్రయమును వరుసగ ప్రకటింతుము.

ఆచారకాండ

1. సూత్రము—

స్నానము ప్రాణాపాయము

కాలనేమి వ్యాఖ్యానము—ఉదయమున లేచి స్నానము చేయవలసినదని మూర్ఖులైన వ్యాస నారదాది ప్రాచీనులు తమ స్మృతుల వ్రాసిరి. అది జగత్తును మోసపుచ్చుటకై వ్రాసినదికాని మంచి యుద్దేశముతో వ్రాసినది కాదు. స్నానమువలన ననేక నష్టములు కలవు. ప్రతిదినము శరీరము తోముకొని స్నానము చేయుటవలన

రోమకూపములు వదులయి శరీరము కృశించి త్వరగా నశించును. నదులలో స్నానముచేసిన పక్షమున నొకప్పుడు కొట్టుకొనిపోయి చనిపోవచ్చును నూతులవద్ద స్నానము చేసినపక్షమున నీళ్ళు తోడు కొనలేక జబ్బలు నొప్పిపట్టును. ఒకప్పుడు నూతులలోపడి చచ్చిపో వచ్చును. కొన్ని గ్రామములలో చెఱువులు లేకపోవచ్చును. నూతు లలో నీళ్ళు త్రాగుటకే చాలకపోవచ్చును. స్నానముకూడ చేసిన పక్షమున త్రాగుటకులేక మనుష్యులు పశువులు చచ్చిపోవుట తట స్థించును. అందుచేత సర్వవిధములచేత మనుష్యుడు స్నానము పరిత్య జింపవలెను.

మాల్యవంత వ్యాఖ్యానము—తల్లి దండ్రులు చనిపోయినప్పుడు తప్ప యితర సమయములందు స్నానము చేయగూడదు.

2. సూత్రము—ఆలస్యముగా రాత్రినిద్రింపవలెను. ప్రొద్దెక్కి లేవవలెను.

కా—వ్యా—పెందలకడ నిద్రపోవుట సర్వవిధములచేత నష్ట ప్రదము అట్టిదురభ్యాసములవారైన పక్షమున జూదమాడుకొనువారికి దొంగతనములు చేయువారికి సరసులకు వినోదముగా కాలము పుచ్చు టకు వీలుండదు. పెద్దవాళ్ళు ఈ యలవాటువలన చెడిపోయినను పిల్లలు సూత్రము పెందలకడ నిద్రపోవుట కలవాటు పడకుండజాగ్రత్త పెట్టవలెను ఉదయమున జాముప్రొద్దులోపుగ నెప్పుడు లేవగూడదు.

మాల్యవంతుడు పై విధముగానె వ్యాఖ్యానము చెప్పెను.

3. సూత్రము—దంతధావనము చేయనక్కఱలేదు.

కా—వ్యా—ప్రతిదినము దంత ధావనము చేసినపక్షమున పండ్లరిగిపోయి విరిగిపోయి యూడిపోవును పుప్పిపండ్ల రోగము ప్రపంచములో బయలుదేఱుటకు ముఖ్యకారణము దంతధావనమే. దీనిక్రింద వినియోగించునట్టి కాలము గూడ వ్యర్థము పుప్పిపం

బయలుదేరినమెడ జంతువులను పీక్కుతినుటకు మాంస భక్షణము జేయుటకు వీలుండదు. నిద్రమంచమునుండి లేవగానె తరవాణియో, కాఫీనీళ్లో, టేనీళ్లో ముందు రెండు గ్రుక్కలు నోటిలో పోసికొని తరువాత గండూషణము చేసికొనవలెను. గండూషణ మనగా పుక్కిలించి యుమ్మివేయుట. ఇది చేసిన పక్షమున దంతధావనము చేసినంత ఫలము.

మాల్యవంత వ్యాఖ్యానము—పర్వదినములయందును పితృకార్యదినములయందును బొత్తిగా గండూషణముగూడ జేయగూడదు. ఆ దినములయం దట్లు చేసినపక్షమున నిటు పదితరములవరకు నటు పదితరములవరకు నరకకూపమున పడిపోవుదురు.

4. సూత్రం—పగటి నిద్ర ప్రశస్తము.

కా—వ్యా-ప్రాచీనులైన రాక్షసమహానుభావు లందఱుగూడ ఈ సూత్రమునే యవలంబించిరి. దీనివలన ననేక ప్రయోజనము లు కలవు. పగలు నిద్రపోయినపక్షమున శ్రమపడి మేనువంచి పనిపాటలు చేయనక్కఱలేదు. రాత్రులు స్వేచ్ఛగా విహారములుచేసి యనుభవించవలసిన సకలసౌఖ్యములు ననుభవించవచ్చును, రాత్రులు చేయు సంచారములో నిద్రయు కునికిపాట్లు వచ్చిన పక్షమున కార్యములు చెడిపోవచ్చును, పగలు నిద్రించినపక్షమున నట్టి కునికిపాట్లు మొదలయినవి రావు గావున కార్యములు నిర్విఘ్నములుగా కొనసాగవచ్చును.

మాల్యవంతుడుగూడ పైవిధముగ వ్రాసెను. కావున నతని వ్యాఖ్యానము వ్రాయనక్కఱలేదు.

5. సూత్రం—కల్లు సారాలు త్రాగవలసినది.

కా—వ్యా-దేవతలు త్రాగిరి. మహర్షులు త్రాగిరి. మనుష్యులు త్రాగిరి. త్రాగనివారు లేరు. త్రాగని జంతువులు లేవు. ఏదొయొకటి త్రాగకుండ నెవ్వరు నుండ లేదు. మంచినీళ్ళు త్రాగుచున్నారా లేదా?

ఆ విధముగానె కల్లు త్రాగవచ్చును. సారా త్రాగవచ్చును. ఇది చెట్లులోనుండి వచ్చినది కాని వేరొకచోటనుండి వచ్చినది కాదు. తాటిచెట్టు యీతచెట్టు యిప్పచెట్టు భూలోక కల్పవృక్షములు. వాటిని మనుష్యులు పూజింపవలయును. కల్లు త్రాగుటకు ధనము లేనివాడు. ఆ కుండనైన వాసనజూడవలెను. అదియు లభింపనప్పుడు త్రాటిచెట్టుక్రింద నొకజాము కూర్చుండి వెళ్ళిపోవలెను. మద్యపానము జేయనివాడు మనుష్యుడుగాడు. కల్లు తాగనివాడు గాడిదెకన్న నధముడు. మన దేశపు కల్లుసారాలకంటె విదేశమునుండి వచ్చిన బ్రాంది మొదలయినవి ప్రశస్తములు. కల్లు నిందించినవారు మహాపాతకులై నరకమునకు పోవుదురు.

మా-వ్యా—చిన్నబిడ్డల కేవగింపు లేకుండ నుగ్గుతోపాటు అలవాటుచేయవలెను. అవి దొరకనప్పుడు నల్లమందు గంజాయి మాజుము మొదలయిన పదార్థములు భక్షింపవచ్చును. ఇవి అభావమందు విధించుచున్నాము కాని నిత్యకృత్యమున సారాయము లే త్రాగవలెను. ఈ దుకాణములు వీధి వీధికి సరిపడినన్ని యుండునట్లు రాజు లేర్పాటు చేయవలెను. ప్రతిమనుష్యుడు తనదొడ్డిలో నాలుగు త్రాటిచెట్లు నాలు గీతచెట్లు వేసికొనవలెను.

6 సూత్రం—ఆడపిల్లల నమ్ముకొనుట శ్రేయస్కరము.

కా-వ్యా—దీనివలన పేదవాడు ధనవంతుడగును. ధనవంతుడు మరింత ధనవంతుడగును. మనయింటిలో పుట్టిన ఆవుదూడలను గేదెదూడలను కుక్కపిల్లలను పెంచి పెద్దవాటిని జేసి తగిన బేరము వచ్చినపు డేప్రకారముగా నమ్ముకొందుమో అట్లే మనకడుపున పుట్టిన ఆడుపిల్లలనుకూడ అమ్ముకొనుటవలన దోషము లేదు. ధాన్యాదులమ్ముకొనుట యెట్లు తప్పుకాదో ఇదియు నట్లు తప్పుగాదు.

మా-వ్యా—కుంటివారికి గ్రుడ్డివారికి కుష్టువారికి అమ్మినను
దోషము లేదు.

7. సత్యమవాచ్యం.

కాలనేమివ్యాఖ్యానము—సత్యమెప్పుడు పలకకూడనిది. సత్య
మువలననే కొంపలు మునిగిపోవుచున్నవి. సత్యమువలననే లోకము
నకు హానిజరుగుచున్నది కొందరుమూర్ఖులు సత్యమే పలుకవలసినది.
సత్యమే పలుకవలసినదని బోధించిజనులను గంగలో దింపుచున్నారు.
సత్యము బలికి హరిశ్చంద్రుడు రాజ్యముకోలుపోయి పెండ్లామునమ్ము
కొని మాలవానిని గొలిచినాడు. సత్యముపలికి బలిచక్రవర్తి సమస్త
రాజ్యము గోలుపోయి చివరకు వామనమూర్తిచేత అడుగంట
దొక్కబడినాడు. అసత్యముపలికి ధర్మరాజు బాగుపడినాడు.
అసత్యముపలికి శ్రీకృష్ణుడు శత్రువులను గెలిచినాడు. భగవంతుడైన
శ్రీకృష్ణుడే యబద్ధములాడి లాభములు పొందునప్పుడు మనమేల
పొందగూడదు? మహానుభావుడైన శుక్రాచార్యుడు తన నీతిశాస్త్ర
మునందు ప్రాణహానివచ్చునపుడు మానహానివచ్చునప్పుడు ధనము
పోవునపుడు గోబ్రాహ్మణులకు విపత్తువచ్చునప్పుడు, అబద్ధము లాడ
వచ్చునని చెప్పినాడు. 'సత్యమేవజయతే' అనునట్టి వేదవాక్యము
కేవల మర్థవాదము. అర్థవాదమనగా నమ్మగూడనిదియని భావము.

మాల్యవంతవ్యాఖ్యానము—సత్యమెల్ల కాలము బలుకుట
యసాధ్యము. ఒకడు జబ్బుగానుండి వైద్యునిగాని బంధువునిగానిపిలిచి
నేను బ్రతుకుదునాయనియడుగును. అతడుబ్రతకడని వారికి తెలుసును
తెలిసినను బ్రతుకడని చెప్పినపక్షమున నతడు బెంగగొని చచ్చిపోవు
నని నీవుబ్రతకవని యెవ్వరుజెప్పరు. నీకుకుదురుతుంది భయము లేదని
చెప్పుదురు. దీనింబట్టి యసత్యమే యెక్కువయుపయోగమని తెలిసి
కొనవలెను. సత్యము మేడిపండు. అసత్యమంటుమామిడిపండుసత్యము

గంజినీళ్ళు అసత్యమూ పుపాలు. సత్యము గుల్లముత్యము అసత్యము మాణిక్యము, సత్యము త్రాటియాకుదడి. అసత్యము రాతికోట సత్యము నూలుగుడ్డచొక్కా అసత్యము వజ్రకవచము. అసత్యము వర్తకమునకుగావలెను. న్యాయవాదులకు కావలెను. వేశ్యలకు కావలెను. జారులకు కావలెను. చోరులకు గావలెను. సంసారులకు గావలెను. సన్యాసులకు గావలెను. సత్యము ప్రియము. అసత్యము చవుక చవుక, వస్తువు వదిలిపెట్టి ప్రియము వస్తువు నెవడుకోరును? అసత్యము పెరటిలో కల్పవృక్షము. కొంగు బంగారము. పెట్టిలోని సగ. సత్యము గ్రుడ్డిగవ్వ. అసత్యము మొహరి. సత్యము సవతితల్లి అసత్యము కన్నతల్లి. అసత్యము సొమ్మిచ్చును. సుఖమిచ్చును. కాబట్టి అసత్యమందరకు సేవ్యము. వేదాంతశాస్త్రరీత్యా చూచి నప్పటికి జగత్తంతా అసత్యమే అంతా మాయయే. కాబట్టి మాయ, అసత్యము, సేవింపదగినవి.

8. పాపాత్ముల పంక్తిని భోజనము చేయగూడదు.

కా-వ్యా—పాపాత్ములెవ్వరనగా ఎల్లప్పుడు సత్యము బలుకు వారు. పరకాంతల తల్లులని భావించువారు. దొంగతనము చేయనివారు చేయగూడదనువారు. ఉదయమున లేచి స్నానము చేయువారు. సత్రములు వేయించువారు నూతులు త్రవ్వించువారు దానములు చేయువారు స్వార్థత్యాగము చేయువారు. త్రాగనివారు, దానిని నిషేధించువారు. జూదమాడనివారు ఈ పంద్రెండుగురు పంక్తిబాహ్యులు వీరి పంక్తిని భోజనము చేసిన వారిని కులమువారు తప్పక వెలివేయవలెను. అంతతో బోక నదియొడ్డుననో చెరువుగట్టుననో కూర్చుండబెట్టి తాటికాయంత గోమయము తినిపించి కుంచెడు గోమూత్రం త్రాగించి బ్రాహ్మణు లకు సువర్ణ దానము చేయించి ప్రాయశ్చిత్తము చేయించవలెను

మా-వ్యా—ఆ దేశములో స్నానములవారున్న పక్షమున ఆయ నకు పాదపూజగా నూరు రూపాయలిచ్చి ఆయన పాదతీర్థము పూటకు శేరు చొప్పున పుచ్చుకొనవలెను.

9. అవాచ్యములు పలుకకూడదు.

కా-వ్యా—అవాచ్యములనగానేవి ? దొంగవానిని దొంగవాడనుట. వ్యభిచారము చేసినవానిని వ్యభిచారియనుట అబద్ధములాడువానిని అబద్ధీకుడనుట. వేయేల, ఉన్నది యున్నట్లనుట. అట్టివానిని యూరిలోనుండి వెళ్ళగొట్టవలెను. అట్టివాడు గ్రామశత్రువు.

మాల్యవంతుడుగూడ కాలనేమితో నేకీభవించి వేరేవ్యాఖ్యానము వ్రాయలేదు.

ప్రాయశ్చిత్తకాండము

1. రసికదూషకులు భోగచాంద్రాయణ వ్రతము చేయవలెను.

కాలనేమివ్యాఖ్యానము—రసికులనగా భోగమువాండ్రనుంచుకొన్నవారు. చాంద్రాయణవ్రతమనగా భూమిచుట్టు ప్రదక్షిణము చేసి వచ్చుట. రసికులను దూషించినవారు మూడు సం॥లు భూప్రదక్షిణముచేసి తాను వెళ్ళిన ప్రతిపట్టణమందును, ప్రతి పల్లెయందును కాపురమున్న వేశ్యలగృహములకుబోయి వారిని దర్శించి వారితో సరసములాడి మూడు సం॥లు ముగిసిన తరువాత మరల నింటికివచ్చి తాను మునుపు దూషించిన రసికులకు మొకకుబట్టచుట్టుకొని సాష్టాంగ నమస్కారము జేయవలెను, దీనిపేరే భోగచాంద్రాయణ వ్రతమందురు. ఈవ్రతము శ్రద్ధాభక్తులతో జేసినవారికి రసికులను దూషించిన మహాపాతకము క్షణములో బోవును.

మాల్యవంతవ్యాఖ్యానము—భోగ చాంద్రాయణ వ్రతము చేయుటకు శరీరదార్ఢ్యము లేనివాడు మూడు సంవత్సరముల పరిమితిగల కాలము భోగముదాని నొకర్తు నుంచుకోవలయును. అట్లుంచుకొనుటకుధనము లేనివాడు రసికులను, వేశ్యలనుస్తోత్రము చేయుచున్న పక్షమున నా పాతకము పోవును.

2. వేశ్యాదూషకులకు ప్రాయశ్చిత్తమే లేదు.

కా-వ్యా—పై సూత్రములో రసికులను దూషించినవారికి ప్రాయశ్చిత్తము విధించితిమి. ఈసూత్రములో వేశ్యలనుదూషించిన వారివిషయమై చెప్పబడుచున్నది. వేశ్యలు అప్సరసలఅంశమునందు బుట్టినవారు. పూర్వకాలమున దేవతలు రాక్షసులు పాలసముద్రము మథించినప్పు డప్సరసలు కల్పవృక్షములు అమృతము నైరావతము మొదలగు గొప్పపదార్థములన్నియు నాసముద్రములోనుండిపుట్టినవి. కాబట్టి యప్సరసలు దేవతాస్త్రీలు. దేవతాస్త్రీల యంశమునందు బుట్టినవారందఱు దేవతాస్త్రీలే. దేవతలను దూషించినవారికిప్రాయశ్చిత్తమే లేదు.అందుచేత వేశ్యలనుదూషించినవారికి ప్రాయశ్చిత్తము లేదు.

మా-వ్యా — ఒక వేళ ప్రాయశ్చిత్తము చేసికొనవలెనని వేశ్యాదూషకులకు గట్టిగా మనస్సులో సంకల్పము కలిగినపక్షమునవాలుక కోయించుకోవలెను. ఇందువలన వేశ్యలను మరల దూషించుట కవకాశము కలుగదు. ఇది చేసికొనుట చాలకష్టము గనుక మహానుభావులైన సూత్రకారులు మారీచ స్వాములవారు ప్రాయశ్చిత్తమే లేదనివిధించిరి.

3. సురదూషకునకు తద్విక్రయమే ప్రాయశ్చిత్తము.

కా-వ్యా—కల్లు త్రాగగూడదని నిందించినవారికి స్వల్పప్రాయశ్చిత్తము విధించినారు అది యేమనగా కల్లుకుకాణములో గూర్చుండి కొంతకాలము కల్లమ్ముట. ఈకల్లువాసన తగులునప్పటి కా దూషించినపాపము పోవును. ఇది యెంతకాలము సేయవలయునని ధర్మశాస్త్రకర్తలనేకులు మీమాంసచేసిరి. మూడు సం॥లవరకుకల్లమ్మవలసినదని సూత్రకారుల మతము. ఈమాట సూత్రములో లేను గదామీరెట్లు తెలిసికొనగలిగితిరని యందురేమొ? మేము సాక్షాత్తు సూత్రకారుల పాదసేవచేసి వారినోటనుండివచ్చే యీమాటవిన్నాము

అతిప్రాచీనులైన జ్వాలాజిహ్వాస్మృతిలోను హిరణ్యాక్షస్మృతిలో
నముచిస్మృతిలోను శతబాహుస్మృతిలోను పదిసం॥లు సురదూషక
కల్లమ్మవలసినదని యున్నది.

మా-వ్యా—అట్టి పరమపాతకునిచేత యావజ్జీవము కల్లః
వలసినదని మాయభిప్రాయము. అందుకు వాడిష్టపడకపోయిన
వాని సొత్తుసర్వము హరించి గ్రామమందుగల త్రాగుబోతులంద
పంచుకోవలెను.

4. సురాపానదూషకులకు బలాత్కారపానమే కర్తవ్యము

కా-వ్యా—సురాపానము చేసినవారిని త్రాగుబోతు
నిందించినవానిని గ్రామములోనున్న పదిమంది జేరి బలవంతము
బట్టుకొని పటకారులతో వానినోరు బ్రద్దలుచేసి కల్లు వానినోటిని
బోయవలెను. మ్రింగకపోయినచో ముక్కు మూయవలెను.

మా-వ్యా—వాడొకవేళ కల్లు మ్రింగకనే యేకారణముచే
నైన చచ్చిపోయినపక్షమున వానిశరీరము కల్లుతోస్నానముచేయిం
తరువాత దహనముచేయవలెను.

5. సురాదానము రోగనివారణోపాయము.

కా-వ్యా—కల్లు త్రాగుటవలన కొన్నిరోగములు ప
వచ్చును అట్టిరోగములు మందువలన నివారణ కాకపోవచ్చు
కానియెడల గ్రామములో త్రాగుటకై మిక్కిలి ప్రసిద్ధికెక్కిన సత్
రుషులను పదిమందిని తీసికొనివచ్చి వారికాళ్ళుకడిగి ప్రదక్షిణముచే
ఒక్కొక్కరికి ఒక్కొక్క తాటిచెట్టుదక్షిణయిచ్చి మూడుకల్లుకుండ
దానమియ్యవలెను. ఈదానముచేత ఆరోగము పోవును.

మా-వ్యా—రోగము పోవుటయేగాక యీజన్మమున
పుట్టుటచేత నింకొకజన్మమున కావలసినంతకల్లు వానికి సమృద్ధి
లభించును.

6. వృక్షనాశకులు తాళవన ప్రతిష్ట చేయవలెను.

కా-వ్యా—ఏ చెట్టునైనను దూలములనిమిత్తముకాని వాసముల నిమిత్తముకాని మఱియొక కారణము చేతగాని చంపవలసివచ్చినపుడు ఆ మహాపాతకము పోవుటకై తాటితోటలు వేయించవలెను తాటి చెట్లు భూలోకకల్పవృక్షములని మహానుభావులైన ప్రాచీన మహర్షుల యభిప్రాయము, ఆ తాటి చెట్లు ఆ చెట్లవల్ల పుట్టిన చెట్లు వాటివలనపుట్టిన చెట్లు భూలోకమందెంత కాలముండునో అంత కాలము అతఁడు అతని బంధువులు అతని స్నేహితులుగూడ మరణానంతరము కలిలోకమున మహానందపదవి ననుభవించుచుందురు.

మా-వ్యా - తాటి చెట్లు వేయుటకు సమకూడనిపక్షమున ఈత చెట్లు ఇప్ప చెట్లు ద్రాక్ష చెట్లు మొదలయిన కల్లుచేయుటకు వీలైన చెట్లు నాటవచ్చును, అధమపక్ష మట్టి చెట్టు నొక్కటైన నాటనివానికి నరకమే ప్రాప్తమగును.

మారీచస్మృతి—ప్రాయశ్చిత్తకాండము.

సోదరులకు భాగము పంచిపెట్టకూడదు.

కాలనేమి వ్యాఖ్యానము—అన్నదమ్ములలో బలవంతు డెవ్వడో వాడే తక్కిన సోదరుల నెత్తికొట్టి పిత్రార్జితమైన యావదాస్తియు స్వాధీనము చేసికొనవలసినది. దీనికి రెండుకారణములు గలవు, బలహీనుని చేతిలో స్థిరాస్తిగాని చరాస్తిగాని యుండుట యపాయకరము. ఎందుకనగా వారు దుర్బలులగుటచేత నెవరో వారినద్ద లాగికొని పుచ్చుకొందురు. అందుచేత బలవంతుని చేతిలోనున్న పక్షమున నిట్టి యాస్తి కుటుంబములోనుండి యావలకుపోదు. ఆస్తి ముక్కముక్కలుచేసి పుచ్చుకొన్న పక్షమున కొంతకాలమునగునప్పటికి ఎవరికి నేమియుదక్కదు. రాజ్యము వీరపురుషులనుభవింపవలసినది. ఆవిధముగానె భూములుగూట బలవంతులనుభవించవలసినది.

మాల్యవంత వ్యాఖ్యానము—"తన కలిమి యింద్రభోగము, తన లేమి లోకదరిద్రము" అన్నట్టుగా ఎవడిచుట్టుకువాడు తన భాగ్యము చూచుకొన వలసినదే కాని యన్నదమ్ములు బాధపడిపోవుదురేమో యని వారినిమిత్తము తనసుఖములు పోగొట్టుకొనగూడదు. పరులకై తన సుఖమును భోగొట్టుకొని కష్టపడెడువాడు ఆత్మహత్యా మహాపాతకుడు పోయిన దుర్గతికిబోవును. ఒక గడ్డిమోపు చూచినప్పుడు ఒక యావు కడుపునబుట్టిన దూడలు నాలుగు దానిదగ్గరకుజేరి ఆ గడ్డినిమిత్తమై యొకదాని నొకటి కుమ్ముకొని బలముగలది తినును. అట్లె ఒక తల్లిదండ్రులకు బుట్టిన బిడ్డలలో గూడ బలముగలవాడే యనుభవింపవలసినది.

2. లంచము గ్రహించదగినది.

కా. వ్యా—లోకమంతయులంచముతోనేయున్నది. దేవతలు లంచము గోరెదరు. నైవేద్యములే లంచములు. పరమేశ్వరుడు లంచము గోరును. ప్రార్థనలు భజనలు కీర్తనలు స్మరణలు ధ్యానములు పూజలు పరమేశ్వరునకు లంచములు. గురువు లంచముగోరును. వినయము శుశ్రూష వానికి లంచములు. తలిదండ్రులు లంచములు గోరుదురు. ఈ లంచములకే పితృభక్తియందురు. ఉపకారముచేసి లంచము పుచ్చుకొనుట తప్పుగాదు. లంచము నిన్నటిది నేటిది కాదు. పృథివి పుట్టినప్పటినుండి యున్నది అపకారము చేయకుండుటకై గూడ లంచము పుచ్చుకొనవచ్చును.

మా. వ్యా. లంచములుపుచ్చుకొననని చెప్పువారందరు అప్రయోజకులు, వీరునిర్భాగ్యులనవలెనుగానిసీతిమంతులనుటకువీలు లేదు. అశక్తులుగాని ప్రజ్ఞావంతులుగారు. వారిది అశక్తదుర్జనత్వముగాని యోగ్యతగాదు. లంచములో మహాలక్ష్మియున్నది. అదిపుచ్చుకొన్న వారిఇల్లుకలకలలాడుచునిత్యకల్యాణముపచ్చతోరణమువలెనుండును. మహాలక్ష్మి అందెలు గజ్జెలు ఘల్లు ఘల్లుమనునట్లుగా వారి యిల్లంత

యుదిరుగుచుండును. లంచములు పుచ్చుకోజాలని తెలివితక్కువవాని యిల్లు శ్మశానమువలె యమంగళమై యసహ్యమైయుండును. కావున సర్వవిధములచేత దానిని గ్రహింపవలసినది.

3. వ్యాపారంబులలో వడ్డీశ్రేష్టము.

కా. వ్యా—గౌతముడు, మనువు మొదలయిన ప్రాచీన ఋషులు వడ్డీవ్యాపారము సేయువారు పంక్తి బాహ్యులని తమతమ స్మృతులలో వ్రాసిపెట్టిరి. కాని వారితో నే మేకీభవింపజాలము. నూటికి నెలకు అయిదు రూపాయలవంతున ఇచ్చుట ధర్మవడ్డీ. వాయిదా దాటిన తరువాత నూటికి నెలకు పదిరూపాయల వంతున పుచ్చుకొనుట ధర్మము. ఇదితనఖాలమీద నిచ్చుపద్ధతి. విడిబదుళ్ళు ప్రాణావసరము వచ్చినప్పుడైనను ఇయ్యగూడదు. ఇచ్చెదు పక్షమున దీనికి రెట్టింపువడ్డీయుండవలెను. బంగారము తాకట్టుమీద నూటికి యేడున్నర వడ్డీకి తక్కువ యియ్యగూడదు. ఆయిచ్చునదియైనను నూరురూపాయల విలువగలదానిమీద పదిరూపాయలియ్యవలెను. వెండి మొదలగు వాటిమీద తాకట్టు ఇయ్యనేగూడదు.

మా-వ్యా—ఏమనుష్యునకైనను ప్రాణముమీదకువచ్చినప్పుడతడుగాని అతని బంధువులుగాని వైద్యము నిమిత్తముగాని ఉత్తర క్రియల నిమిత్తముగాని సొమ్మడిగినపక్షమున నూటికి యిరుపది రూపాయల చొప్పున వడ్డీకి తనఖామీద ఆస్తికిమ్మతులో ముప్పదవవంతియ్యవలెను. తోడి మనుష్యుల కాపదసమయములలో అట్టియుపకారముచేయుట ధర్మము. చిన్నవాళ్ళు చోరులు జూదరులు త్రాగుబోతులు బదులు నిమిత్తము వచ్చినప్పుడు అయిదు వందలు వారు కోరిన పక్షమున అంతసొమ్మునకు దస్తావేజువ్రాయించి అందులో అయిదవవంతు సొమ్మిచ్చి పంపించవలెను. కొన్నిసమయములయందు దస్తావేజులు వ్రాయించుకొని సొమ్మియ్యక పోయినను దోసము లేదని

దేవాంతక నరాంతకులను ప్రాచీన మహర్షుల మతము. అసలువ
పుచ్చుకొనకయు, తక్కువవడ్డీకి బదులిచ్చునట్టియు దుర్మార్గులులో
శత్రువులగుటచేత వారియాస్తి దోచుకొని దేశమునుంచి వెళ్ళగొ
వలెను. అటువంటి వారున్న పక్షమున పట్టణములోనివారికి చాలధ
నష్టముగలుగును. ప్రాణనష్టమునకైనను యోర్వవచ్చునుగాని ధ
నష్టమునకు యోర్వరాదు. ఎంతఅవసరముమీద బదులునకువచ్చు
అట్టివానికి అంతయెక్కువ వడ్డీమీద బదులిచ్చుట ధర్మము.

వ్యవహారకాండము

1. దొంగలను దండింపగూడదు.

కా. వ్యా. ఈసూత్రము జనులకు విరుద్ధముగా కనపడవచ
నుకాని శాంతముతో నాలోచించినపక్షమున నిందు విరుద్ధమేమిం
లేదు. గృహయజమానులు తమతమ గృహములను చక్కగా గ
కొన్నపక్షమున దొంగవాడు కన్నము వేయుటకు వీలుండదుగ
ఇండ్లు జాగ్రత్తగా గట్టుకొనక దొంగలకు కన్నము వేయుట కవకా
మిచ్చి తరువాత వారిని శిక్షించమని చెప్పుట యేటిన్యాయమ
దొంగలు పశువులవంటివారు. పంట కాపులు తమ చేలు సరిగాసంర
జేసికొనక నచ్చిమేసిపోయినవని పశువులను గొట్టిన నేమిలాభ
ఆవిధముగానె తగినజాగ్రత్త పుచ్చుకొనక యిండ్లుచోరులుదోచుక
పోయినారనుట కేవలమన్యాయము. బెల్లము జాగ్రత్తగా నొకచో
బెట్టి చీమలను చేరవద్దని చెప్పినచో నవి మానునా? మాంస
ముక్కబయటపెట్టి గ్రద్దలను రావలదన్నచో నవి మానునా? ఎ
మిఠాయిపెట్టి పిల్లవానిని దరికిరావలదన్నచో నూరకుండునా? ఆవిధ
గానె దొంగలకు లోపల ప్రవేశించుటకు వీలుకలుగజేసి వస్తువు
పోయినవని ఏడ్చిన నేమిలాభము! అందుచేత జనులందఱు తమ

యిండ్లు రాతిగోడలతో గట్టుకొనవలయును. మఱియు గృహములలో నున్నవారు జాముకొక్కొక్కరుచొ॥ తెల్లవార్లు మేలుకొనవలయును.

మా-వ్యా- దొంగతన మేయింట్లో జరుగునో ఆయింటి యజమానుని తగినజాగ్రత్త పుచ్చుకోనందుకుదండింపవలయును. అంతియగాక గోడలుసరిగా పెట్టనందుకు యిల్లుకట్టించిన మేస్త్రీని కూలీలనుగూడ పిలిపించి దండింపవలయును. ఈవిధముగా చేయనిపక్షమున ప్రపంచములో న్యాయము దొరకదు కేవలము దొంగలను దండింపదలచుట అక్రమము అధర్మము అన్యాయము.

2. దొంగలను బహుమానము లీయవలెను.

కా-వ్యా—దొంగతనములు మిక్కిలి చమత్కారముతో చేసినట్టివారికి. కన్నము నేర్పుతో వేసినవారికి, మంచియుక్తులుపన్ని అపాయము తప్పించుకొని పారిపోయినవారికి బహుమానము లిచ్చుట ధర్మము. ఏవిద్యలోనైనను సంపూర్ణమైన ప్రజ్ఞసంపాదించినవారిని మెచ్చి పారితోషికము లిచ్చుట లోకధర్మము దొంగతనముగూడ ప్రశస్తమైన విద్యలలో నొకటిగనుక అందులోగూడ అసాధారణ ప్రజ్ఞగలవారికిబహుమానముచేయుట తప్పుగాదు. లోకమునకు బాధకరమైన దొంగతనము గొప్పవిద్యలలో నొకటియందువాయనిమీారు శంకింతురేమొ. అట్లు శంకింపగూడదు. వేట జీవజంతువులకు బాధకరమైనను అదియొక గొప్పవిద్యగా జనులు మెచ్చుచున్నారు. ఆవిధముగానె చౌర్యముగూడ కొందఱికి బాధకరముగా నున్నను మెచ్చదగిన విద్యలలో నొకటి.

మా-వ్యా—దొంగతనమును గురించి మహానుభావుడైన వృశ్చికరోముడు వ్రాసిన గ్రంథము పాఠముగా బెట్టి చదివించి అందులో పరీక్షించి కడతేరినవారికి బంగారుపతకములు మొదలయిన విచ్చుట యుచితముగానుండును.

3. జారత్వముగూడ దండింపదగిన నేరముకాదు.

కా-వ్యా. స్త్రీపురుషులు పరస్పరానురాగములు గలిగి మనస్సులు కలుపుకొని కలియుదురుగావున నటువంటి యనురాగములను మనము వృద్ధిచేయవలసిన దేగాని దండించి క్షీణింపజేయగూడదు. కాని పరపురుషుని భార్యతో గలియుట న్యాయమాయని యందు రేమొ. పరపురుషుడు పరస్త్రీయనుభేదము లెన్నడు నుండగూడదు. మనస్సులో అనురాగములు పుట్టి యెవరు కలియుదురో వారే దంపతులు. తలిదండ్రులు చేసిన వివాహములు వివాహములుకావు. పరునిభార్యయైననుసరే ఆమె కేపురుషునిమీద యనురాగము కుదురునో ఆపురుషుని దీసికొనివచ్చి అట్టివారిద్దరికిని క్రొత్తగావివాహము చేయవలెను. పాత వివాహము దానితో రద్దు.

మా-వ్యా—అసలు వివాహము లే యుండగూడదు. పశువులలో వివాహము లున్న వా? పక్షులలో వివాహము లున్న వా? జలజంతువులలో వివాహము లున్న వా ? ఈ వివాహముల మూలముననే జారత్వమనునది లోకమునగలుగుచున్న ది.అసలు వివాహములు లేనిచో జారత్వమన్న మాటే పుట్టదు.

1. అప్పు లెగబెట్టుట తప్పుగాదు,

కా-వ్యా—అప్పులిచ్చువాడు వడ్డికాశపడి యిచ్చిపుచ్చుకొన్న వాడు సొమ్మిచ్చుకో లేనప్పుడు వానియిల్లువాకిలి పొలము వస్తువులు వాహనములు అమ్మించి సొమ్ముపుచ్చుకోవలెనని దురుద్దేశము గలిగియుండును. అందుచేత అప్పుపుచ్చుకొన్న వాడియ్యకపోయినను దోషము లేదు. దొరికినంతకాల మప్పుపుచ్చుకొని తలమునిగి తాడిప్రమాణమైనప్పుడు న్యాయస్థానములలోనికి వెళ్ళి దివాలాఅర్జీయొకటి యిచ్చినపక్షమున ఆబాధ తీరిపోవును.

మా-వ్యా—కావలసినప్పుడుసొమ్మిచ్చి అవసరముగడిపినాడు గదా యని విశ్వాసముచేత కొందరు మూర్ఖులు తెచ్చుకొన్న అప్పు

మరలసీయవలయునని దుర్బోధలు చేయుచుందురు. అట్టిదుర్బోధలువిని మనుష్యులు చెడిపోగూడదు. "ఋణంకృత్వా ఘృతంపిబేత్" అని చార్వాక మహాముని లోకోపకారార్థమై యొకసూత్రం వ్రాసినారు. అప్పుచేసి నేయికొనుక్కొని త్రాగవలెనని దీనియర్థము. ఈసూత్రము మనస్సులో లోకులందరు నిలుపుకొని సుఖపడవలయును. లోకుల యొక్క సుఖమునిమిత్తమే మేమీ స్మృతి వ్రాయుచున్నాము గనుక మాయొక్క మంచియుద్దేశము నుగ్రహించిలోకులుసుఖపడవలయును.

2. న్యాయాధిపతులు వాది ప్రతివాదులిద్దరికిగూడ శిక్ష వేయవలెను

కా. వ్యా—శిక్ష వేయుటయనగా ఇద్దరివద్దను చెరికొంత లంచము బుచ్చుకొని వచ్చిన యభియోగము తనయిష్టము వచ్చినట్లు తగలబెట్టుట ఇదియొక విధమైన శిక్ష. ఇంతకంటె రెండవది యిద్దరిని ఖైదు చేయుట గాని యిద్దరికి జరిమానా వేయుటగానియైయున్నది. ఇట్లు చేసినపక్షమున నేకారణమునకు మనుష్యులు తగవులాడరు. ఇట్లుగాక నేరము కనుగొని నేరము చేసినవానినే శిక్షించినపక్షమున గెలిచిన వాడు గర్వపడి కక్ష్యమునకు మరింత కాలుదువ్వుచుండును. కాబట్టి యిద్దరిని శిక్షించిన మిక్కిలి లాభముండును.

మా. వ్యా—దీనివల్ల న్యాయాధిపతికి నష్టముండదు. సాక్ష్యములు విచారణచేసి యెవ్వరు నేరస్థుడో కనుగొనుట విసుగుపుట్టించును.

3 న్యాయాధిపతులు ఎయముచెప్పి రప్పించినపక్షమున అభియోగములుండవు.

కా. వ్యా—వచ్చిన యభియోగముల విచారణచేయుటకు ఓపికలేని న్యాయాధిపతులు అభియోగములు దెచ్చిన మనుష్యులను త్రిప్పి త్రిప్పి విసిగించినపక్షమున నుభయులు బుద్ధితెచ్చుకొని వారంతట వారే రాజీనామా పడుదురు. న్యాయాధిపతియెంతో సుళువు. అభియోగము తెచ్చినవారికి బుద్ధివచ్చును. అందుచేత న్యాయాధిపతులందరీయుపాయమునే ప్రయోగించుచుండవలెను.

—o—

వి నా య క వి షా ద ము

[అప్పుడు వినాయకుడు నందికేశుడు ప్రవేశించుచున్నారు.]

నంది—వినాయకా ! ఎందుచేత మాటలాడవు. ఎన్ని పిలిచి నను పలుకవేమి ? నీ మనస్సులో ఏదో గట్టివిచార మున్నట్లు కన బడుచున్నదే.

వినా—(తలవంచుకొని విచారించుచు ఊరకుండును.)

నంది—మిత్రుడా! విఘ్నేశ్వరుడా! నేను నీకుచిరకాల మిత్రు డనుగదా. అట్టి స్థితిలో నీవిచారమేమో నాకు తెలియజెప్పరాదా ? నీ విచారముజూడగా నాకును విచారము కలుగుచున్నది.

వినా—(నిట్టూర్పువిడిచి) అబ్బబ్బా యేమి దుష్కాలము సంభవించినది. నేనేమని నీతో జెప్పుదును. చెప్పుటకైన నాకు నోరు రాకున్నయది.

నంది – ఏలాగో యొకలాగు ధైర్యము దెచ్చుకొని నీ మనో వ్యాధి యేమో మర్మములేక నాకు దెలియజెప్పుము. దాని కేదేని ప్రతిక్రియ యున్నయెడల చెప్పెదను.

వినా—ప్రతిక్రియ నీవు చేయ[illegible]న్ను పుట్టించిన జేజెమ్మ చెయ్యలేదు. లేనప

నంది—నాన్చి నాన్చి చంపక చెప్పవయ్యా బాబూ! ఇతరులకు చెప్పక లో లోపల దిగమింగిన పక్షమున విచారము మఱింత యెక్కువగును.

వినా—ఏమిచెప్పను అప్రతిష్ఠపాలై పోయినాను. అప్రతిష్ఠ పడుటకంటె మరణము మేలు గదా. మనము దేవతల మగుటచే మర్ణముురాదు. అందుచేత ననుభవించ వలసినదే.

నంది—అప్రతిష్టా! నీ మీదనా? అంతటి యప్రతిష్ట యేమి చ్చినదయ్యా చెప్పు చెప్పు.

వినా—ఏమియప్రతిష్టా! నీవు యెరగని నంగనాచివలె మాట డుదువేమి? నేను లోకములో గొప్పతిండిపోతునని యప్రతిష్ట దా. నీ వనుదినము వినుచు నెఱగనివానివలె బలికెదవేమి భాద్ర ద శుద్ధ చవితినాడు ప్రతి సంవత్సరము ప్రజలునన్ను పూజించి కుండ్రములు పెట్టుదురు. పెట్టినవన్నియునేను తినుటచేత నేనుతిండి తునని నిందించుచున్నారు. ఈనింద నేను భరింపజాలను. (అని న్నీరు విడుచుచున్నాడు.)

నంది—ఆ యొక్కదినముననేనా జనులు నీకు విందులు యుట. ఏకార్యము దలపెట్టుకొన్నను ముందు విఘ్నేశ్వరపూజ సి నైవేద్యము బెట్టరా?

వినా—అదియెంతయ్యా! కొంచెము బెల్లముక్క పెట్టుదురు. ది ఆకలితీరునా వల్లకాడా నల్లమందు మాత్రలాగున గుటుక్కున ంగివేయుదును.

నంది—ఏమైనప్పటికి లోకులునిజమేపలికిరి. నీవుతిండిపోతు వే

వినా—అయ్యయ్యో, నీవుగూడ నిట్లన్నపక్షమున నింకగతి దు. ఈ నింద మిక్కిలి యన్యాయము. నన్ను మించిన మహాను వు లెందరో యుండగా నన్నొక్కనినే తిండిపోతనుట యన్యా ముగాదా.

నంది—నిన్ను మించిన మహానుభావులు లోకములో లరా? ఇది యసంభవము.

వినా—అసంభవమా! నీవుగూడ నన్యాయమునకు వడిగట్టు నుచున్నావు. నే చెప్పెడిది విని మాట్లాడుము. సంవత్సరమున

కొకసారి చవితినా డుండ్రంముక్కలు తినినందుకు నేనే తిండిపో
నైనపక్షమున ప్రతిదినము రెండుపూటల భోజనముచేసి మరిరెం
పూటలు కాఫీకొట్లలోదూరి గొంతులో వ్రేలుపెట్టిన పక్షము
నందునట్లు కడుపుపూరాన మెఱుగకుండ ఇడ్డెనలు పులిపిండితో జేసి
దోసెలు మొదలయిన అడ్డమయినగడ్డి తినునట్టివారు తిండిపోతు
గారా. మీ యందరివి నాలుకలా తాటిపట్టెలా నిజమాడ రెం
చేత వెఱ్ఱిసాంబమూర్తికి పిచ్చిపార్వతికి ముద్దుబిడ్డనని లోకువామీ
లోకులు కాకులన్నమాట నిజముకాదా. నన్నన్నవాళ్ళందఱు
కొక యింతపాపము మూట కట్టుకొనుచున్నారు.

నంది—సీమాట నాకిప్పుడు నచ్చినది. కాఫీ కొట్లలో
నట్టివారిముందర నీ వెందుకు పనికిరావు. నీ ప్రారబ్ధకర్మముచేత
యప్రతిష్ట వచ్చినదిగాని మఱియొకటికాదు. విచారించకుము.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నా

—*—

అపూర్వ వేదాంతము

(అప్పుడు రమానాథరావుగారు దేవదాసుగారు
ప్రవేశించుచున్నారు.)

రమా—మీ రెందుకు వచ్చినారో చెప్పరేమి?

దేవ—నేను చందానిమిత్తం వచ్చినాను.

రమా—ఏమిచందా మీకు పనిపాటలు లేవాయేమిటి.

దేవ—మాకుపనిపాటలున్నవి. ఈచందామూనిమిత్తముగా

రమా—(కోపముతో) ఎవరినిమిత్తమో త్వరగా చెప్ప

చంపక.

దేవ—చిత్తము ఆగ్రహించకండి మనవిచేయుచున్నాను. దక్షిణాఫ్రికాలోనున్న మనహిందూదేశస్థులు ఆదేశమందలి తెల్లవారిచేత నానాబాధలు పడుచున్నారు. వారు ప్రస్తుతము చెఱసాలలో బడినారు. వారి దారపుత్రాదులపోషణనిమిత్తమై మనదేశమునుండి చందాలు వసూలుచేసి పంపుచున్నారు. మీరుగూడ నేమైన చందాలు యిప్పించవలెను.

రమా—ఇదా పని నీకు దేశముదాటి మాలదేశములలోనికి వెళ్ళి వర్ణభ్రష్టులైన నిర్భాగ్యులకు సహాయము చేయవలయుననియా నీవు చెప్పునది. దేశమువిడచి వెళ్ళినవాళ్ళతో మనకేమిసంబంధము. వాళ్ళు మతభ్రష్టులు వర్ణభ్రష్టులు దేశద్రోహులు. అటువంటివాళ్ళకు నే నొక్కదమ్మిడి యివ్వను. వాళ్ళు మలమల మాడినాసరే. చచ్చినాసరే.

దేవ—తమరంత కోపగించినపక్షమున నేనేమి మనవిచేయగలను. అక్కడికి వెళ్ళినప్పటికి వారు హిందూమతములోనె యున్నారు. తురకలు తురకమతములోనెయున్నారు. అక్కడనుంచి మనవారిని వెళ్ళిపొమ్మని ఆదేశస్థులు బాధపెట్టుటచే ప్రస్తుత మీ చిక్కులు సంభవించినవి.

రమా—వాళ్ళదేశములోనుంచి వాళ్ళు వెళ్లిపొమ్మని బాధపెడుతూంటే అక్కడనుంచి లేచిరాక సిగ్గులేక అక్కడనేయుండి వాళ్ళతో దెబ్బలాడుచుండుట యెందుకు.

దేవ—వీళ్ళ తాతలుచిరకాలముక్రిందటఆదేశము వెళ్ళినారు. వీళ్ళందరు అక్కడనేపుట్టి అక్కడనే పెరిగి అక్కడనే చదువుకొని అక్కడనే యిల్లువాకిలి పొలము సంపాదించుకొని కుటుంబములతో కాపురమున్నారు.

రమా—పరాయవాళ్లు దేశములోనికి వెళ్ళినప్పుడు వాళి ష్టము వచ్చినన్నాళ్లుండవచ్చును వాళ్ళు పొమ్మన్నప్పుడు పోవద్దా ఏమిసబబయ్యా యిది. మీయిష్టముమీద మీయింట్లో నెన్నాళ్ యినా కాపురముండవచ్చును. మీరు పొమ్మన్నప్పుడు పోక కా పట్టుకొని లాగితే చూరుపట్టుకొని వేళ్ళాడుట న్యాయమేనా?

దేవ—అయ్యా! నాకొక్కమాటకు జవాబుచెప్పండి మొద మీ దీగ్రామమేనా కాపురము.

రమా—మా దీగ్రామముకాదు. మాది దక్షిణాది,

దేవ—సరే మీరిక్కడకువచ్చి యిల్లువాకిలి కట్టుకొని ఆ సంపాదించుకొని కాపురమున్నారుకదా. మీరిప్పుడు మీ దేశ వెళ్ళిపోవలసినదని మేమందరము అంటే మీరేమిచేస్తారు.

రమా—నేని దేశస్థుడనేమైపోయినాను. ఇదేనాస్వస్థలమ నేనిక్కడనుంచి కదలను.

దేవ—మీలాగే వాళ్లుగూడ అక్కడనుండి కదలమంటా అది న్యాయమేకదా.

రమా—వాళ్ళదెంతమాత్రము న్యాయముకాదు అన్యా ముగా నితరులదేశములోనికి వెళ్ళియుండి వాళ్ళను బాధపెట్టి తా బాధపడుచుండు మొండివాళ్ళకు నేనొక్క దమ్మిడీనైన నిచ్చే డను కాను. పైగా నాకింకొక్క సందేహముగూడ నున్నది. సొమ్ము మీరు వసూలుచేసి యేమిచేయుదురో మాకు తెలియదు

దేవ—అన్నన్నా యెంతమాటన్నారండి. ఈచందాసొ మేమందరము హరింతుమా.

రమా—హరింతురోధరింతురో నేనేమిచెప్పగలను.దక్షిణ కాకు మీరుపంపినట్లు నిదర్శనమేమున్నది.

దేవ—చెన్నపట్టణములో గొప్పవారందరు కమిటీచేసినారు. ఈసొమ్ము మేమాకమిటీవారిదగ్గరకు పంపుతాము.

రమా—ఆ కమిటీ యున్నదో లేదో యెవడెరుగును ఉంటే ఆ కమిటీవారు మీరుగూడ కలిసి హరించగూడదా.

దేవ—ఇందులో మహానుభావులైన గోపాలకృష్ణగోక్లెగారు మదనమోహన మాళవ్యాగారును సురేంద్రనాథ బెనర్జీగారు నిందులో పనిచేయుచున్నారు. వారందరు మనసొమ్ము హరించేవారేనా!

రమా—గోక్లెగారైన నాకు నమ్మకంలేదు, బెనర్జీగారైనా నాకు నమ్మకం లేదు. వారుమాత్ర మాకాశముమీదినుంచి యూడి పడ్డారా యేమిటి. వారికిమాత్రము డబ్బుతీపిలేదా. మాతాపుత్ర విరోధాయహిరణ్యాయ నమోనమః అనగా వినలేదా నీవు.

దేవ—చీ! చీ! చీ! యిటువంటిమాటలన్న తరువాత మీయెదుట నేనుండగూడదు. ఆ మహానుభావుల నామస్మరణ చేసినపక్షమున మీ జన్మ పావనమగును. డబ్బు కర్చుపెట్టుట కిష్టములేక బుద్ధికుశలత కొలది మీరిన్ని క్రొత్తవాదములు వాదించుచున్నారు. మీ లోభత్వమే యీ వాదమునకు కారణముకాని మరియొకటి గాదు.

రమా—నిరర్థకమైన వ్యాపారముల నిమిత్తమై చందాలివ్వని వారిని మీరు లోభులనక యేమంటారు. నీవంటివానితో నేనింతసేపు మాటలాడి నాకాలము వ్యర్థముచేసికొనుట నాదె బుద్ధితక్కువ.

దేవ—మీ వేషముజూచి మీపటాటోపముజూచి మీ రేమో సత్కార్యములకు దానములిస్తారని వచ్చినందుకు నాదే బుద్ధితక్కువ. సెల విప్పించండి పోతున్నాను.

రమా—వెళ్ళు ఇటువంటి అపాత్రులను రానియ్యకుండా ముందుముందు గుమ్మంలో బంట్రోతులను పెడతాను.

(అని నిష్క్రమించును.)

—౦—

నారదవిలాపము

[తుంబురుఁడు నారదుఁడు ప్రవేశించుచున్నారు.]

నార—తుంబురా ! నాయిచ్చవచ్చినంతసేపు నేను విలపించె దను. ఎందుకు విలపించుచున్నానని ప్రశ్నలడిగియడిగి నన్ను చంప బోకు.

తుంబు—నారదా అప్పుడైన వార మున్నారముగనుక నడుగు చున్నాము. మేము లేనిచో నిన్నడుగువా రెవ్వరు ? అవసరము లేని మొండితనము చేయక నీ విలాపకారణము జెప్పుము.

నార—ఆర్చువారా తీర్చువారా మీరు? ఇతరుల దుఃఖములు విన వేడుక.

తుంబు—నాదుఃఖము నీది నీదుఃఖము నాది అందుచేత నిన్న డుగుచున్నాను. చప్పున చెప్పు.

నార—కారణము నేను చెప్పవలయునా? మొగముజూడగనే మీగాళ్ళవాపు తెలియునన్నట్టు చిక్కిచిక్కి బక్కగొడ్డువలెనున్న నన్నుజూచి నాదుఃఖకారణము నీ వెఱుగ లేవా ?

తుం బు—అవును పాపము ఎందుచేతనోగాని నీవుమిక్కిలిచిక్కి యున్నావు నీకు త్రిప్పుటయెక్కువ. త్రిపాదగంగలాగున నెల్లచోట్లు దిరుగుచుందువు.

నార—కడుపునిండ పట్టెడన్నము లేనివాఁడు చిక్కిపోక యేమి చేయును. నేను కృశించుటకు త్రిప్పుటకారణముకాదు. దారిద్ర్యమే కారణము.

తుంబు—అయ్యో నీవు కలహభోజనుడవుకావా. అన్నము లేకేమి. కలహమే నీకన్నము. కలహమే నీకు పిండివంట. కావలసినం తన్నముండగా నీవు లేదనియెద వేమి ?

నార—అయ్యో వెట్టివాడా! జరుగుచున్నకథ నీవెఱుగనే
ఱుగవు కాబోలు. లోకములో నన్నివృత్తులలో నెట్లుపోటీలు
చ్చినవో నావృత్తిలో గూడ నన్ని పోటీలు వచ్చినవి. ఏమిచెప్పు
ను నాయవస్థ!

తుంబు—ఏమేమి పోటీలు వచ్చినవా? ఎట్టెట్టు చెప్పు
ప్పు.

నార—చెప్పుచున్నాను విను. పూర్వకాలమున నే నొక్క
నే కలహప్రియుడను. నేనొక్కడనే కలహభోజనుడను. ఇప్పు
మూర యింటనింట నెంతమందో కలహప్రియులు కలహభోజనులు
యలు దేటినారు. అన్నకు తమ్మునకు విరోధములు పెట్టుచున్నారు.
లిమగనికివిడియాకులిప్పించుచున్నారు. తండ్రికిబిడ్డకు తగులాటములు
ల్పించుచున్నారు. ఇక్కడమాట లక్కడచెప్పి అక్కడమాట
క్కడ చెప్పి లేనిపోని పుల్లింగములు చెప్పి నాకూటిలో మట్టిపోసి
రు. నా నోటిముందర అన్నము పడగొట్టినారు. వృత్తియొక్క
రవమంతయు పాడుచేసినారు. అందుచే వేళపట్టున కింత యన్నము
క అన్నమో రామచంద్రాయని నే నడలుచున్నాను. మునుపటి
ల నావృత్తిలో మంచి కసవున్నపక్షమున నే నేనుగంత మనిషిని
నా! ఈలాగు బక్కచిక్కి యుందునా?

తుంబు—అయ్యయ్యో. అదియా కారణము నేను వినలేదు.
పుచాల విచారముగనున్నది. దీని కేమిప్రతివిధానము!

నార—ప్రతిక్రియ యేమున్నది. కర్మ మనుభవించవలసినదే.
దపద వెళ్ళుదాము.

(అని నిష్క్రమింతురు)

బ్రహ్మదేవుని యజ్ఞానము

[అతికాయుడు మహాకాయుడు ప్రవేశించుచున్నారు]

అతి — అన్నయ్యా మహాకాయా! నీవు చెప్పినమాట నిజమే. బ్రహ్మదేవునివలన చాల లోపము లున్నవి. అతనికి తెలివి తేటలు బొత్తిగా లేవు.

మహా — నేను మొదటనుంచిఅనేమాటే అది. దురభిమానము చేత నారదుడు మొదలైన మహర్షులు బ్రహ్మదేవుడంతవాడు లేడని భట్టుగాండ్రవలె పొగడుచుందురు. కాని ఆమాటలు విన్నప్పుడు నాకు తలనొప్పి వచ్చును. గంపెడులోపములు కనబడుచుంటే వానిని నూరికే స్తవంచేస్తారెందుకు వీళ్ళు.

అతి — అవునురా ఈమునిముండాకొడుకులతోటి నా కప్పుడప్పుడు వాదములు వస్తూవుంటవి. వాళ్ళనో శ్ఛణచటంకోసం నాకు రెండు యుక్తులుచెప్పు. అనగా బ్రహ్మదేవుని దగ్గరనున్న లోపములు కొన్ని చెప్పు. ఈపరియాయము వాళ్ళు కనబడినప్పుడు నీవు చెప్పిన నాలుగు యుక్తులు గబగబ యేకరపెట్టి వాళ్ళ పీకి డమాయిం చేస్తాను.

మహా — అయితే చెప్తా వినరా. బ్రహ్మదేవునివద్ద కనబడుచున్న పెద్దలోప మొకటి ముందు చెపుతాను. కాలసృష్టిలో అతడు చేసిన లోపము యింతా అంతా కాదు. దినము పగలు రాత్రియని రెండు భాగములు చేసినాడు. సరే బాగున్నది. కాని పగలు నాలుగు జాములు రాత్రి నాలుగుజాములు చెయ్యడం యెంతమాత్రము బాగా లేదు. హాయిగా నిద్రపోవుటకు పగటిలో రెండుజాములు తగ్గించి రాత్రిలో రెండుజాములు హెచ్చించి రాత్రికారుజాములు పగటి రెండ జాములుచేస్తే వహవా యెంత బాగుండును! నిద్రకు బొత్తిగాకాలము

చాలడము లేదుకదా. భోజనముచేసి పండుకొనేటప్పటికి జాముగాత్రి అవుతుంది. తక్కిన మూడుజాములా నిద్రపోవడం ఈమాయకాకులు వాటిసొమ్మంతా పడిపోయినట్లు తెల్లవారకముందే కావుకావుకావు మని పెద్దపెట్టున యేడుస్తూ నిద్రపోయేవాళ్ళని లేపుతాయి. ఈ సూర్యుడొకడు. వాడి పుట్టి మునిగిపోయినట్లు ప్రొద్దున్న వస్తాడు. పగటి కింత వెధవప్రొద్దెందుకు? రెండుజాముల కాలము చాలదా. అన్నము వండుకొనితినడం వ్యవహారము చేసికొనడము దీనికి రెండు జాముల కాలము చాలదా.

అత్రి—నిజమే నీవు చెప్పినదంతా నిజమే. కాని నీవిందులో ఒక చిన్నపొరబాటు పడ్డావు. అదేమిటంటే పగటికి రెండుజాముల కాలము కావాలని నీవు చెపుతూన్నావు. ఎందుకు రెండు జాముల కాలము. పగలొక్క జాము రాత్రి యేడుజాములు వుంటే చాలా బాగుంటుంది. ఏడుజాములైనా నిద్రపోకపోతే యేమితృప్తితీరుతుంది. ఉన్నదానిలోనే సర్దుకోవాలి గనుక ఈ యేడుజాములు ఎలాగో ఒక లాగ సరిపోతాయని నే నంటూన్నాను. కాని సుఖముగా తనివిగా నిద్రపోవాలంటే యిది మాత్రము చాలుతుందా. ఒక్క గుఱ్ఱుకొట్టి ఒక కల గనేటప్పటికి ఏడుజాములు ఏడుచిటికెలలో ఎగిరిపోతాయి ఇప్పుడు బొత్తిగా కాలము చాలక కంటిమీద కునుకే లేదనినమ్మ. గూట దీపాలు పెట్టకముందే భోజనముచేసి నేను పడుకుంటాను. బాగా తెల్లవారిన తరువాత లేస్తాను. ఈలాగున చేసినప్పటికి నిద్ర తృప్తిగా పోవడంలేదు. ఇది బొత్తిగా అన్యాయముగా నున్నది. తెల్లవారేటప్పటికి నాకళ్ళు లక్కముద్దర వేసి అంటించినట్లు గట్టిగా అంటుకొనిపోవును. ఎంతో ప్రయత్నమునగాని తెరవలేను. నాకు సరియయిన నిద్రేయుంటే రెట్టింపుమనిషి నగుదును.

మహా—అవునురా బాబూ నీవు చెప్పినట్లు పగ లొక్కజామే చాలును. కాని మన ఆలోచన వినేవాడెవడు యీసదుపాయం చేసే వాడెవడు. బ్రహ్మదేవుడు తెలియని ముండాకొడుకు తెలియనట్లూరుకోడు. ఒకరి నడుగడు. సర్వజ్ఞత్వ మెక్కువ. మనంటివాళ్ళను శాస్త్రి పెద్దను పిన్నను పిలిచి యిందులో యేలాగు చెయ్యమన్నావని అడగడు. అడిగితే పరువుతక్కువ కాబోలు. వీడి పరువు తగలెయ్య. ముంజి కాయల్లాగ నాలుగు తలకాయ లున్నాయి. ఎందుకు తెలివా తేటా. మట్టితలలు. నాలుగురోజులు సృష్టి మనచేతి కిచ్చి మనలను చెయ్యమంటే. ఓ దివ్యసుందరంగా ఏలాచేసుందుము. అక్కడ దిక్కడబెట్టి ఇక్కడ దక్కడపెట్టి గగ్గోలుచేసి పారెయ్యమన్రా.

అతి—సరే బ్రహ్మదేవుడు చేసిన లోపము ఒకటి చెప్పినావు గదా యింకోటికూడా చెప్పు.

మహా—సరే చెప్తున్నాను విను. మనుష్యుల భోజనపు యేర్పాటులోగూడ బ్రహ్మదేవుడు పెద్దలోపము చేసినాడు. ఒక్కనోరు ఒక్క జీర్ణకోశము పెట్టినాడు. బాగా తినవలెనంటే ఒక్కనోరేమిచాలుతుంది ఒక్కజీర్ణకోశము పెట్టడమువల్ల విశేషము తినడానికి వీలులేకపోతూంది. ఎక్కువతింటేఅజీర్ణము చేస్తూంది. ఇదియెంతో బాధగా నున్నది. బ్రహ్మదేవుడు చేయవలసిన దేమిటంటే మనుష్యునకు రెండుమూడునోళ్లు పెట్టవలసినది. ఆనోళ్ళలో ముద్దలుచేసి వేస్కొనుటకై దారు చేతు లియ్యవలసినది, ఇప్పుడు గర్భకోశములో ఒక్క జీర్ణకోశము పెట్టినాడు. ఆలాగు గాకుండా కాళ్ళలోను చేతులలోను వీపులోను మెడలోను తలలోను మొగములోను వేళ్ళలోను గోళ్ళలోను శరీరమంతటను జీర్ణకోశములు పెట్టివేయవలసినది. ఎంత తిన్నప్పటికి అరక్కపోవడమంటూవుండగూడదు. అటువంటి యేర్పాటుంటే చాలా సదుపాయము.

మహా—ఇవేగాదు ఇంకను బ్రహ్మదేవునియొద్ద అనేకలోపము లున్నవి. చెప్పదలచితిమా యిసుకపాతరవలె బయలుదేరును.

అతి—నీకు దెలిసిన లోపములలో నొకటిచెప్పు చెవులారా వింటాను.

మహా—వెనుక మనము చెప్పుకొన్న లోపములకంటె ఎక్కువ లోపము లున్నవి. అవి నీవు నేనూ లోకమందరూ వప్పుకొనక తప్పనివి.

అతి—త్వరగా చెప్పు. త్వరగా చెప్పు.

మహా—భూలోకములో భోగమువాళ్ళ జాతియొకటి బ్రహ్మదేవుడు సృష్టించినాడన్నమాట నీ వెరుగుదువా?

అతి—సరి సరి బాగున్నది. యెరుగుదువాయని యడుగుచున్నావా? ఈప్రశ్న నాకెంతో యవమానముగానున్నది. భోగమువాళ్ళజాతియేకాదు మనపట్టణములో యెన్నిభోగముకొంపలున్నవో ఏయేవీధులలో ఆకొంపలున్నవో, దేనిపేరేదో దేనితల్లి పేరేదో దేని అమ్మమ్మపేరేదో, దేనిని యెవరెవరు యెంతెంతకాల ముంచుకొన్నారో దేనిదగ్గర యెంతెంత డబ్బున్నదో అన్నిసంగతులు నాకు బాగా తెలుసును. ఈమాత్రం తెలియకపోతే నావెథవబ్రతుకెందుకు? ఈసంగతే తెలియకపోతే మీవంటి పదిమంది పెద్దమనుష్యులలో నేను తలయెత్తుకొని యేలాబతుకను?

మహా—వహ్వా వహ్వా. నాపరువుకుతగ్గ స్నేహితుడవు దొరికేవు. ఈమాత్రపు పెద్దమనుష్యుడవని యెన్నడూ యెరుగను. భోగమువాళ్ళజాతి యెరుగుదువు గనుక చెపుతా విను.

అతి—భోగమువాళ్ళ జాతిని సృష్టించుటలో భగవంతుడు మంచివాడు కాడంటావా యేమిటి? ఆమాటమాత్రం నేనొప్పుకోను. అటువంటిమాటలు వినను. భోగముజాతి చేయుటలో భగవంతుడు

చాలా తెలివైనపని చేసినాడు. అందుకు వానికి మన మనేక నమస్కారములు చేయనలసియున్నది. అంత వుపయోగమైన జాతి లోకములో లేదు.

మహా—వోరి వెర్రిపాడుగట్టా! ఆమాట నే నెరుగనా యేమిటి నీవు వేరేనాకు చెప్పవలెనా? అంత వెధవక్రింద గట్టేవు నన్ను. నా మాన్యాలు, మళ్ళూ, తోటలూ, దొడ్లూ, యిళ్ళూ వాకిళ్ళూ, సమస్తమూకూడా భోగమువాళ్ళకోసం అమ్మేసిన ముండాకొడుకుని నేను భోగముజాతి మంచిది కాదంటానా? అది సృష్టించడములో భగవంతుడు మంచిపనే చేసినాడు. అందులో లోటేం లేదు. నే చెప్పబోయే లోపమది కాదు.

అతి—అది కాకపోతే శాంతముగా వింటాను. శాంతముగా చెప్పు. వాళ్ళనుతిడతావేమో అనుకొని నామనస్సు చిర్రుమన్నది.

మహా—అటువంటి పాడుపని నేనెప్పుడును చేసేవాడనుకాను సంగతి చెపుతాను విను. భోగమువాళ్ళకు తల్లిముండలను సృష్టించుటలో బ్రహ్మదేవుడెంతైనా లోపం చేసినాడు. ఆముండలు కొరివి దయ్యములవలె గుమ్మములో కూర్చుండి డబ్బుతక్కువైన విటులను వేధించి చంపుదురు. వీడి పుట్టి యేమి మునిగిపోయింది. అటువంటి సృష్టి సృజించకపోతే, పెద్దపులి కోరకాళ్లైనా దినవచ్చునుగాని ఆ తల్లిముండలనే సూటిపోటుమాటలు చెప్పుడుమాటలు ఎత్తిపొడుపులు పడడం చాలకష్టము. ఆముండల మూలమున పడుచుభోగము వాళ్ళు పొగరెక్కి పోతున్నారు. లేకపోతే బంగారుతీగలవలె వాళ్ళు చెప్పినట్టు వస్తురు. "విటులపాలిటి యమదూత వేశ్యమాత" అన్నట్టి మాట అక్షరాలా నిజము. యెంతమందికైనా చావున్నదిగాని ఆ ముండల కెన్నటికీ చావే లేదు. కాకపోయినా బ్రహ్మదేవుడికెంతో పక్షపాతం దేవతలంటే వాడి కభిమాన మెక్కువ. స్వర్గంలోకూడా

రంభ, ఊర్వసి, తిలోత్తమ మొదలైన వేశ్యలున్నారుకదా? దేవతా వేశ్యకాంతలకు తల్లులను సృష్టింపక మనుష్య వేశ్యకాంతలకు తల్లిముండలను సృష్టింపుమని యీ బ్రహ్మదేవుడి కెవడు చెప్పినాడు. సృష్టి శక్తి నా చేతిలో నున్నదిగదాయని యిష్టము వచ్చినట్లు చేస్తాడా! కంటికి కనపడడుగాని కనబడితే పదిమంది పెద్దమనుష్యులలో బెట్టి యీడిపిస్తును. తల్లిముండలు లేకపోబట్టి స్వర్గములో వేశ్యకాంతలు హాయిగా తినవచ్చు తిరుగవచ్చు వుండవచ్చు. భూలోకములో వేశ్యలు తల్లిముండల మూలమున కదలలేరు మెదలలేరు.

అతి—నీవు చెప్పినమాటనాకు నసాళ్ళాని కంటెంది. నీమాటలు వేదాక్షరములే. ఆతల్లి ముండలవల్ల యీ విటులు పడేబాధలు యిన్నీ అన్నీ కావు. నీతోనే వేరే చెప్పేదేమిటి. కనుక యిదిగాక మరియొక లోపం నేను చెప్తాను విను. కల్లు సారా మొదలైన పదార్థములకు వాసన కల్పించి బ్రహ్మదేవుడు లోకముల కెంతో అపకారము చేసినాడు ఈ వాసన లేకపోతే గూనలో బోసినట్లు యెన్నికుంచముల సారాయైనా కడుపులో పోసుకోకపోదునా. దీనికడుపుగాల యీవాసనంటూ యొకటిపుట్టబట్టి యిది పుచ్చుకొని యేపెద్ద మనుష్యుల దగ్గరకూ వెళ్ళడానికి వల్లకాదు. నిషా మాత్రం వుండి మంచినీళ్ళవలె వాసన లేకుండా వుంటేనా? తాగి తాగి మరీతాగి యింకా తాగి చెడతాగి, దొర్లి దొర్లి భూలోకంలో స్వర్గసుఖము, వైకుంఠసుఖము, కైలాససుఖము అనుభవించనా? మతిమాలిన ముండాకొడు కాబ్రహ్మదేవుడు గొప్పలోపం చేసేడు,

మహా—నిజమేరా బాబూ, వీడి లోపాలు యెన్నని చెప్పుకోం చెప్పుకుంటే కావలసినన్ని వున్నవి. ప్రొద్దుపోయినది. వెళుదాము. రా. (అని యిద్దరు నిష్క్రమించుచున్నారు.)

—*—

లో భి పి. శా చ ము

[అప్పుడు నాగభట్టను బ్రాహ్మణుని భార్యయగు కామమ్మయు కూతురున్ను ప్రవేశించుచున్నారు]

కామ—(తనలో) ఏమోకాని నాతల తిరుగుచున్నది. ఈపూట నేను వంటచెయ్యవలెను. పడుకుంటేనేకాని నాకుతోచడం లేదు. (ప్రకాశముగా) అమ్మాయీ, యిలారావే. ఈపూట మీ నాన్నకు అత్తిసరు వెయ్యమ్మా. నాకేమో వొళ్ళంతా భారముగా నున్నది.

అమ్మాయి—ఈమాట యిందాకానే చెప్పలేకపోయినావు. పెందలకడ మడిగట్టుకొందును. ఈవేళ కంచి సుదర్శనుడుగారు పోయిన పన్నెండోరోజు. నాన్నక్కడికి వెళ్ళినాడు. పాపము ప్రొద్దోయివస్తాడు. వచ్చేటప్పటికి వంట సిద్ధంగా వుండాలి.

కామ—ప్రొద్దోయిరానీ పెందలకడరానీ నేను చెయ్యలేను వంట. నీవుచేసుకుంటే చేసుకో లేకపోతే మాటలాడక వూరుకో.

అమ్మాయి—అంతవిసుగెందుకేఅమ్మా. పోనీ నీవు చెయ్యక పోతే నేను చేస్తానులే.

[అప్పుడు దానమిచ్చిన గోవును మెడకుపలుపుగట్టి తీసికొని నాగభట్టు ప్రవేశించుచున్నాడు.]

నాగ—ఓసీ, ఏమిచేస్తున్నావు. సుదర్శనుడుగారికొడుకు గోదానమిచ్చినాడు.రా. చూడు మహామంచిగోవే. దీనిసంగ్రహంచాలా మంచిది. పాతికరూపాయిలు పెట్టికొన్నాడు. పూటకు రెండు శేర్ల ంది. మనముబాగా మేపుకున్నామంటే యింకొక్క శేరు తప్ప స్తుంది. ఆవుచూస్తే చాలాచిన్నది. మేతతక్కువతింటుంది.

పోటూ తన్నూ లేవు. చిన్నపిల్లవాడెళ్ళి పాలు పితుకున్నాయిస్తుంది. రా. లేచి కాస్త చిట్టుపెట్టు పాపందీనికి.

అమ్మాయి—అమ్మ బద్ధకంగా పడుకుందినాన్నా.

నాగ—(ఆవును వదలి) ఏమిటి పడుకుందా. ఏమి చెపుమా (అని దగ్గఱకు పోవును.)

కామ—(గుడ్లెఱ్ఱజేసి పెనిమిటిని చూచి పండ్లు పటపట కొఱుకును.)

నాగ—ఇదేమిటి పండ్లు కొఱుకుతున్నావు. మాట్లాడవేమి. కండ్లు చింతనిప్పుల్లాగున్నాయేమి? ఏమైనా జబ్బుగా నున్నదా యేమిటి చెప్పు.

కామ—(అమాంతముగా లేచి కూర్చుండి తల విరియబోసి కొని ముందుకు వెనుకకు ఊగులాడును.)

నాగ—ఇదేమిటే నీకు పిచ్చెత్తిందా దయ్యముపట్టినదా?

కామ—హుం. ఏమిటీ ఓసేయేమిటీ అంటావు. నేను నీపెళ్ళా ననుకున్నావా యేమిటి.

నాగ—అయితే నీవెవరవు?

కామ—ఎవరినో యెరుగవు తొందరపడకు తెలుస్తుందిలే.

అమ్మాయి—నాన్నోయి నాకు భయమేస్తోంది. నేను వెంకట శాస్త్రిలుగారియింటికి పరుగెత్తుతాను (అని పోవును.)

నాగ—నీవెవరవో నీకేమికావాలో చెప్పు. లేకపోతే ముంతపొగ పెట్టించి మంత్రగాడిని పిలిపించి మారణహోమము చేయిస్తా.

కామ—ఓరి దొంగ బ్రాహ్మడా! నీవట్రా నన్ను మారణ హోమము చేయించేవాడవు. నేనెవరినో తెలుసునా? నాపేరు కంచి సుదర్శనుడు.

నాగ—ఓరి నువ్వా! ఒక మూలింకా సాపిండమైనా తిన్నగా కాలేదు. అప్పుడే దయ్యమైనావు నీకు గతులు లేవురా.

కామ—నాకు గతులులేవూ. నీకున్నాయీ గతులు? నా తమాషా చూపిస్తాను. చూచుకో. నాకొడుకు కుష్ఠుముండాకొడుకు కదా యని వాడిని బెల్లించి నాదినవారాలకి ఖర్చెక్కువ చేయించి నాసొమ్మంతా పాడుచేయిస్తావా? పైగా పాతికరూపాయలు పెట్టి గోవును కొనిపించి ఆదానము నీవు పుచ్చుకుంటావా? ఈగోవు నీకు దక్కనిస్తానా. నీవు నీపెండ్లామూ నీబిడ్డలూ యీపాలు తాగుతారా? నెత్తురుచుక్కలు పడనిస్తానుకాని పొదుగులోనుంచి పాలు పడనిస్తానా నీగొంతుక్కి అడ్డంపడతానుకాని పాలొక్కచుక్క దిగనిస్తానా. సుదర్శనుడు చచ్చిపోయినాడుగదా, కొంపలో కుక్కలా దూరి యిష్టమువచ్చినట్లు తిందామనుకున్నావా? పీకి నులిమివేస్తా. దుంప తెంపివేస్తా. మచ్చు మూపివేస్తా. రాత్రి రెండుజాములవేళ కొంప తగలేస్తా. (గుండె బాదుకొని) అమ్మయ్యో! పాతికరూపాయలగోవే పాతికరూపాయల గోవే. పాతిక రూపాయలగోవే నాజన్మమెత్తి నేనెప్పుడూ కొనలేదు, నాకు జబ్బుగానున్నపుడు వైద్యుడు పాలపథ్యము చెపితే సయితం ఆవును కొనక కూతురత్తవారింట్లోను కొడుకత్తవారింట్లోను పాలు తెప్పించుకొని కాలక్షేపము చేశాను యెరుగవూ? దొంగ ముండాకొడకా! డొక్కలో నిద్రపోతాను జాగ్రత్తా. నాకొడుక్కి నెలకు అర్ధరూపాయి వడ్డీ పోగెడతావా. నీదానంమండా. నీమంత్రాలమీద నిప్పులొయ్యా, మంచావు మంచావు, అంటూ కులుకుతూవచ్చావా. నీకులుకు కనపరుస్తానుండు.

నాగ—అల్లాగనకు నీకు గతులుండవు. దానితోకట్టుకుంటే నీకు గతుంది.

కామ—నాకు గతులొద్దురోయి. నాపాతికరూపాయలు నాకు కావాలిరోయి. ఆగోవుతోక నేను పట్టుకోలేదు. ఇకముందు పట్టుకోను. నేను వైతరణినదిలో యీది వెడతాను కాని యీగోవుతోక పట్టుకోను.

నాగ—అయితే యేమంటావు ? ఈగోవును మీఅబ్బాయికి యిచ్చివేతునా?

కామ... గోవు మాఅబ్బాయికెందుకు. వాడికిస్తే నాపాతికరూపాయలు పెట్టెలో పడతాయా? నాఅర్ధరూపాయవడ్డీ వస్తుందా?

నాగ—అయితే యేమి చెయ్యమంటావుమరి.

కామ—చెపుతావిను. దీనికి ఖరీదుపాతికరూపాయలు, కొన్న రోజుమొదలుకొని అయినవడ్డీ కొన్నప్పటినుంచీ పెట్టిన మేతఖరీదు, ఆమేతఖరీదుకైన వడ్డీ, దూడకన్నెఖరీదు పలువుఖరీదు దానికైనవడ్డీ నాకొడుక్కి నీవిచ్చి యీయావును నీదగ్గరే వుంచుకో. లేదా నీవంశ నాశనము చేశాననినమ్ము.

నాగ—నీదానంమండా యెరక్కపోయి పుచ్చుకొన్నాను ప్రాణంమీాది కొచ్చిందినాకు. అలాగేయిస్తాను కాని నీకొడుకు పుచ్చుకోడేమో?

కాను—పుచ్చుకోకపోతే వాడిదుంప తెంపెయ్యనూ. తప్పకుండా పుచ్చుకుంటాడు, ఇయ్యి. నీవు రూపాయలు చేతో పట్టుకోగానే నే వదిలిపోతాను.

నాగ—(పెట్టెతీసి ముప్పదిరూపాయలు చేతితోపట్టుకొని) ఇదిగో పట్టుకువెడుతున్నాను. వదిలిపెట్టు.

కామమ్మ—(దయ్యమువదలిపోగాలేచి) అమ్మయ్యా, నేనింత సేపూ నిద్రపోయినాను కాబోలు తెండిమీాకు ప్రొద్దుపోయినది మడి గట్టుకోండి.

నాగ—సరి నీ విప్పుడే స్నానముచెయ్యి. నేనింతలోకే పని మీాద వెళ్ళివస్తాను.

(అని నిష్క్రమింతురు.)

ప్రశ్నలు

1. ఒకానొక మనుష్యుడు కలడు. ఆయనగారి నోటనువుగింజ నానదు. ఎంత రహస్యమైనసంగతి విన్నను వెంటనే యెవరి చెవిలోనైనను ఊదితీరవలెను. లేకపోయినచో ఆయనకడు పుబ్బునట. ఈ విపరీతజాడ్యమునకు యేదైన మంచియవుషధమున్న పక్షమున ఆయన కదియిప్పించవలెనని యున్నది. అది యునానిమందుగాని, యింగ్లీషు మందుగాని, తెలుగుమందుగాని, గ్రామస్థులందరు చందావేసికొని యెంతఖరీదైననుసరే కొని ఆయన కిప్పించవలచుకొన్నారు. కాబట్టి ప్రపంచమందలి ఘనవైద్యులందరు, యిదివరకీజాడ్యమునకేదైన మందున్నపక్షమున దానిపేరు చెప్పవలసినదనికోరుచున్నాను. ఇదివరకేమందు లేకపోయినపక్షమున క్రొత్తగప్రకృతిశాస్త్రసహాయముతో నేదైనకనిపెట్టి ఆగ్రామస్థులకు మహోపకారము చేయవలెనని కోరుచున్నాము.

2. ఇరువది సం॥ముల వయస్సుగల పిల్లవాడున్నాడు. అతనికజీర్ణరోగము పట్టినది. పాపమత నెంతో జాగ్రతగాను, పథ్యముగాను ఉంటాడు. అయినప్పటికి పాడువ్యాధి పట్టుకొని అతనిని బాధించుచున్నది. ఉదయమున లేచి యతడు కాఫీకొట్టుకువెళ్ళి ఒకడజనుయిడ్డెనలను చులకనగాలాగి, పావలాఉపమా నిమ్మకాయ ప్రమాణముగల మాత్రలుచేసి, కంచెంబుడు వెచ్చనికాఫీయనుపానముతో దిగమ్రింగి, అంతలో పైత్యించకుండా ఒక అరడజను పెసరట్లుచప్పరించి యింటికి వెళ్ళేటప్పుడు దారిలో ౘ చుట్టలుకాల్చి మూడుకారాకిల్లీలు నమిలి మెల్లగాయిల్లు చేరునప్పటికి 9 గంటలగును. అప్పటికి వంట తయారైయుండుట చూడగనే నీరసమువచ్చి చప్పున నాలుగు చెంబులు

నీళ్ళు పోసికొనియో, పోసికొనకయో, పట్టుపంచ చుట్టబెట్టుకొని విస్తరిముందు కూర్చుండి పప్పు, రెండు కూరలు, రెండుపచ్చళ్ళు, పులుసు కమ్మని పెరుగు పీటితో సుష్టుకృత్తుగాభోజనము చేసి, 4 చుట్టలు కాల్చి తరువాత తాంబూలము వేసికొని కొంచెము సేపు పక్కమీద దొర్లేటప్పటికి రెండుగంటలై పోతుంది. లేవడంతోనే ఫలహారం తయారై యుండును గనుక దానిని త్రోసివేయజాలక ఒకతవ్వెడు వేపుడుటుకులు తవ్వెడు కారపుబూంది తిని మరల శేరుగిన్నెతో గిన్నెడు తేయాకునీళ్ళు త్రాగితిరిగి చుట్టలుకాల్చి, కారాకిల్లీలు నములి చీట్లపేక దగ్గర కూర్చుండి క్రొత్తగావచ్చిన అణాకాసులు జేస్తులుపెట్టి కొంతసే పాడునప్పటికి నీరసపెట్టగా సత్తుగిన్నెడు మజ్జిగ తేట త్రాగి, నాలుగు బొంతరిటిపండ్లు తిని కొంచెముసేపు కబుర్లాడునప్పటికి రాత్రి వంట యగును. మరల యీభోజనపు బాధ తప్పించుకొనలేక, కడుపు మొర్రో వద్దని యేడూస్తూంటే, అతడు బలవంతముగ మొగమోటపడి పప్పు పులుసు, కందిపచ్చడి, అప్పడములు, వడియములతో తలచినదాని కంటె యెక్కువ తిని, భోజనమైన తరువాత నిద్రించుటకు పండుకొని తెల్లవార్లు నిద్రపట్టక కొంతసేపు కలవరించుచు, కొంతసేపుమిడిగుడ్లతో కండ్లు తెరచి చూచుచు, మొత్తముమీద రాత్రి యంతయు ఆపశోపములుబడుచు నెట్లెటోగడపి వేసి కాకులు కావుకావుమనునప్పటి 'కాఫీ కాఫీ' యనుచు లేచి మరల సూర్యోదయము చూడగలుగును ఈతడు ముద్ద నోట్లో వేయగనే అది టపాపెట్టెలో వేయు ఉత్తరమల్లే కడుపులోనికి జారునేకాని అతడు పండ్లతో నములుపద్ధతి యెన్నడు లేదు. పాపమీయనకు పుళ్య మళ్య కడుపుబ్బరము మొదలగు అజీర్ణలక్షణములు కనపడుచుండునట. ఈయనకు కాఫీ యనుపానముతో కాని మజ్జిగ తేటయనుపానముతోగాని మందిచ్చిన పరమసంతోషము. సత్యనారాయణ ప్రసాదముతో కాని, బాదంహల్వాతో కాని

మాటుపెట్టి యిచ్చినయెడల మందుపుచ్చుకొనుట కాయన కేయాటంకము లేదు. అతడు అరఖులుగాని, కషాయములుగాని, వాముగసము మొదలగు రసములుకాని యెప్పుడు మింగడు. మందు తియ్యగా లేనిపక్షమున వైద్యుని మొగముమీాద వేసి కొట్టును. ఈయన నిత్యము చేయుచున్న పథ్యము తప్పించకుండ యెవరైన మూడుపూటలలో రోగము కుదిరే మందియ్యగలరా ? ఇవ్వగలిగినపక్షమున తక్షణం తిండిపోతు తిరుపతయ్యగారికి, యిడ్డెనల వీధి, కాఫీపురము అని వ్రాయవలెను.

౩. ఒకనికి గ్రహబాధ కలిగినది. తక్కిన గ్రహములవంటిది కాదు ఈగ్రహము నేరుగ్రహము. ఈగ్రహము పూనినప్పుడాయనకు వళ్ళు తెలియదు. ఈగ్రహబాధ నివారింపగల మంత్రవేత్త లెవరైనా యున్నపక్షమున వారికి గొప్పబహుమాన మీాయబడును. అట్టివారు కోపాల గుండయ్యగారికి వ్రాయవలెను.

—*—

దశమగ్రహము

[ఇంద్రుడు నారదుడు ప్రవేశించుచున్నారు.]

ఇంద్రు—నారదమునీంద్రా! మీారిప్పు డేలోకమునుండి దయచేయుచున్నారు ?

నార—నే నిప్పుడు భూలోకమునుండి వచ్చుచున్నాను.

ఇంద్రు—అక్కడ విశేషము లేమి? వింతలు మాచెవిని బడకపోవు.

నార—అనంతమై విశాలమైన భూమియుండగా వింతలు పుట్టకుండునా? ఎప్పటికప్పుడేదో వింత బయలు దేఱుచునే యుండును.

ఇంద్రు—అట్టి వింత లేవో విన వేడుకపడుచున్నాను.

నార—అట్లైన చెప్పెద వినుండు. భూలోకములో జనులు క్రొత్తగ్రహము నొకదానిని కనిపెట్టినారు

ఇంద్రు—ఏమేమీ! ఇదివరకున్న నవగ్రహములు గాక క్రొత్త గ్రహము బయలు దేఱినదా?

నార. ఆహా బయలుదేఱినది. ఈ గ్రహము ఇదివరకున్న నవగ్రహములకంటె విలక్షణమైనది.

ఇంద్రు —ఆ గ్రహముయొక్క లక్షణము లేవో సెల వియ్యవలయును. వినుటకు నాకెంతో ఆత్రముగ నున్నది.

నార—చెప్పుటకు గూడ నాకెంతో యాత్రముగ నున్నది. ఇంతమాత్ర మడిగినవారు లేరని నేను విచారించు చున్నాను. సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి, అంగారకుడు, బుధుడు మొదలగు గ్రహము లాకాశమున సంచరించు చుండును. క్రొత్తగా కనిపెట్టిన యీదశమగ్రహము భూమిమీదనే సంచరించుచుండును.

ఇంద్రు — గ్రహములు రాసులలో సంచరించునుగదా! రాసులన్నియు నాకాశముమీదనే యున్నవిగదా! భూమిమీద తిరుగునట్టి గ్రహము ఆకాశముమీది రాసులలో నెట్లు సంచరించగలదు?

నార—ఆరాసు లన్నియు గాకపోయిన మానె కొన్ని రాసులైన భూమిమీద గలవు. ఈగ్రహ మన్ని రాసులలోను దిరుగదు. కొన్ని రాసులయందు మాత్రమె సంచరించును.

ఇంద్రు—ఆరాసు లేవి?

నార—ఈగ్రహము మొదట కన్యారాశిలో నుండును. తరువాత నిరంతరము మిథున రాశిలోను కుంభ రాశిలోను దృష్టి గలిగి యుండును.

ఇంద్రు—ఇది క్రూరగ్రహమా? శాంతగ్రహమా?

నార — ఇది యెల్లపుడు వక్రగ్రహము. ఎల్లపుడు క్రూర గ్రహము.

ఇంద్రు — ఈ గ్రహ మెవరికి కీడు గలుగ జేయును? ఎవరికి మేలు కలుగ జేయును?

నార — ఈగ్రహము జన్మస్థానమునకు మేలు కలుగ జేయుచు ఆడపిల్లలుగల తలిదండ్రులకు సదా కీడు చేయుచుండును.

ఇంద్రు — వారి కేవిధమైన కీడు చేయుచుండును?

నార — వారి యిండ్లు భూములు నమ్మించును. యావజ్జీవము మనస్సునకు బెంగ కలిగించును.

ఇంద్రు — ఈగ్రహమునకు శాంతి యెట్లు?

నార — ఆడపిల్లలు గలవారు నిరంతరము హిరణ్యాదానము చేయుచున్నపక్షమున ఈ గ్రహముయొక్క క్రూరత్వము కొంత శమించును. అప్పటికి శాశ్వతముగ శమింపదు. తాత్కాలికముగ శమించును.

ఇంద్రు — ఈ గ్రహమునకును శనిగ్రహమునకును భేద మేమి?

నార - ఈగ్రహముకంటె శనిగ్రహ మేచాలమంచిది. ఎందుచేత ననగా శనిగాడు యేడు సంవత్సరములు మాత్రమే మనుష్యు నాశ్ర యించి బాధపెట్టును. ఏలినాటి శనిగూడ దీనివలె క్రూరముగా నుం డదు. ఈగ్రహము ఆశ్రయించినవారిని యావజ్జీవము బాధపెట్టును. ఇంకొక విశేషముగూడ కలదు. మందపల్లి వెళ్ళి నూనెతో అభిషే కము చేసినపక్షమున శనిగాడు శాంతించును. కనకాభిషేకము చేసిన గాని యీగ్రహము శాంతింపదు. శనిగాడు తిలదానముతో శాం తించును. ఈగ్రహమునకు అన్నదానమువస్త్రదానము భూదానము హిరణ్యదానము మొదలయిన వెన్ని చేసినను శాంతింపదు. వెయ్యేల ఇంత పాడుగ్రహము లేదు. ఈగ్రహమువలన బాధపడనివారు లేరు.

ఇంద్రు — ఆగ్రహము పేరేదో చెప్పి నన్ను సంతోషపెట్టు.

నార——ఇది జామాతృగ్రహము. అనగా అల్లుడు గ్రహము.

ఇంద్రు——(నవ్వి) ఇదటయ్యా! నీవు చెప్పిన గ్రహము సరే! యిప్పుడు తెలిసినది. కుంభరాశి అనగా అన్నపురాశి, మిథునరాశి అనగా దంపతులరాశి. మిక్కిలి చమత్కారముగ చెప్పినావే. పరమేశ్వరానుగ్రహముచేత నీపదియవగ్రహబాధ మన స్వర్గలోకము నకు లేదు నయమే. ఇంతక్రూరగ్రహమైనపక్షమున పాపము భూలోకజను లేవిధముగ బాధపడుచున్నారోగదా!

నార——బాధోగీధో నేనెరుగనుస్వామీ! చదువుకొన్నవాడని లేదు. చదువుకోనివాడని లేదు ఆస్తికలవాడని లేదు, లేనివాడని లేదు. గుడ్డిగవ్వ చెయ్యనివాడు గడ్డిపరక చేయనివాడుగూడ అల్లుడుకావలె నంటే వేలకొలది కట్నములు కానుకలు తెమ్మని ఆడుపిల్లలతండ్రి సంసారము దిబ్బచేయును. ఈకట్నముల యాశలోపడి పిల్లయొక్క వంశము చూచుటలేదు. పరువులేదు. ప్రతిష్ఠ లేదు. మరియాదలేదు. లోకాపవాదభీతిలేదు ఆడపిల్లలగన్న తండ్రియనగా నె వాడొక బానిస వాడని అల్లునియొక్కయు, అల్లుని బంధువులయొక్కయు అభిప్రాయము. ఈదురవస్థకు పారములేకయున్నది.

ఇంద్రు——ఈదశమగ్రహమునకు దగినశాంతి యెట్లు చేయవలెనో నేను బృహస్పతితోడ నాలోచించెదను. రండి వెళ్ళుదము.

(అని యిద్దఱు నిష్క్రమింతురు)

—*—

కటుకుల గంగయ్య

ఒక దేశమున తెలివితక్కువరాజు పరిపాలించుచుండెను. అతని రాజధానిలో గంగయ్య యను బ్రాహ్మణుడుండెను. ఆబ్రాహ్మణుడు

తన కేవృత్తియు లేకపోవుటచేసి తన జీవనోపాయమునకై రాజుగారి నాశ్రయించెను. రాజు వానిపై దయ దలంచి ఇట్లని యానతిచ్చెను. "బ్రాహ్మణుడా! ఈయూరిలో చనిపోయెడు బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య, శూద్రుల, శవములనుమోసుకొనిపోవుటకై వెదుళ్ళతో నీవు కటుకులుకట్టి యిచ్చుచుండుము. ఎవరియింటనైనను మరణము సంభవించిన పక్షమున గృహయజమానులు నీ కాసంగతి తెలియ జేయుదురు. నీవు వెంటనే యొక కటుకు కట్టి వారియింటికి పంపించవలెను. ఇందుకునీకు రెండుపుట్లభూమి మాన్య మిచ్చెదము. దానికి కటుకుల మాన్యమని పేరు" అని రాజుగారు సెలవియ్యగానె బ్రాహ్మణుడు మిక్కిలి సంతోషించి మాన్యము స్వాధీనము చేసుకొని గ్రామములో చనిపోయినవారందరికి కటుకులుకట్టి యిచ్చుచుండెను. ఇట్లుండగా గంగయ్యకు బంధువులను చూచుటకై గ్రామాంతరము వెళ్ళవలసిన పని సంభవించెను. వెళ్ళినతరువాత వెంటనే వచ్చుటకు వీలులేక పోయెను. పదిదినములాలస్యమయ్యెను. ఆదినములలో గ్రామస్థులలో నొకడు మృతినొందెను. ఆయింటి యజమానుడు గంగయ్యగ్రామాంతరము వెళ్ళినమాట యెరుగక కటుకు కట్టుకొనిరమ్మనివర్తమానము చేసెను. భర్త గ్రామాంతరము వెళ్ళెనని భార్య మరల వర్తమానమంపెను. అమాటవిని మృతినొందినవారి కుమారుడు గంగయ్య యింటికి వెళ్ళి భార్యను బిలిచి యామెతోకలహమాడి భర్తనునిందించెను. అంతతో తృప్తిపొందక యతడు గంగయ్య సరిగాపనిచేయుట లేదని రాజుగారితో ఫిర్యాదుచేసెను. గంగయ్య గ్రామాంతరము నుండి వచ్చినతరువాత జరిగిన వృత్తాంత మంతయు భార్య అతనితో చెప్పెను. ఆసంగతివిని యాతడెంతో భయపడుచుండగా రాజుగారు వానిని తనయెదుటకు రమ్మని యాజ్ఞాపించిరి. అతడు భయముచే గడగడ వణకుచు రాజుగారి సన్నిధికరిగి యొక స్తంభమును జేరబడి నిలు

చుండెను. రాజు వానినిజూచి కోపముతో మండిపడి యిట్లనియె :
''సోమరిపోతా? గ్రామములో వారికి కావలసివచ్చినపుడు పనిచేయక నీ యిష్టమువచ్చినప్పుడు పొరుగూళ్ళు పోయెదవా? కటుకులు గట్టుటకు నీతాత యెవడైనా వున్నాడా! కమ్మగా మాన్య మనుభవించుటకు నీవును కటుకులుగట్టుటకు మరియొకరునా? నీకింతపొగరెక్కినదా మంచిది సిపాగ రణగించెదను లే నీ మాన్యము తీసివేసెదను.''
ఆ పలుకులు వినగానే గంగయ్య మరింత భయపడి రాజుగారి పాదములవద్ద కూలబడి రెండుకాళ్ళు బట్టుకొని యిట్లు వేడుకొనెను—

''ఏలినవారు రక్షించవలెను. మీరు రక్షించకపోతే నాకు దిక్కెవరు? మీదయవల్ల నేనూ నాబిడ్డలు యింతన్నముదిని బ్రతుకుచున్నాము. ఏలినవారు మాన్యము తీసుకుంటే నేనూ నాబిడ్డలు గంగపాలై పోవలసినదే. ఇకముందు నేనిట్టితప్పుచేయను. ఇకమీదట నా వల్ల యిటువంటిలోపము వచ్చినపక్షమున నామాన్యము లాగుకొని ఏలినవారు నన్నుప్పుపాతర వేయించండి. ఇప్పటికి నన్నుక్షమించండి నాపనిలో నికనెన్నడు లోటులేకుండ చేసికొందును.'' అని పలికి మరియు బహువిధముల ప్రార్థించుటచేత రాజుగారి కాయనయందు మరల యనుగ్రహము కలిగెను. గంగయ్య బ్రతుకుజీవుడా యని యింటికి వెళ్ళి తానుగ్రామాంతరము పనిమీదవెళ్ళినను తనవల్ల గ్రామస్థుల కిబ్బంది లేకుండుటకై యెన్నో యుపాయము లాలోచించెను. చిట్టచివర కతనికొక గొప్పయుపాయము తోచెను. ఆ యుపాయముప్రకార మతడు వెయ్యి వెదుళ్ళుకొని నాలుగువందల కటుకు లొకసారియే కట్టెను. అందులో కొన్ని పొడుగుపాటివి కొన్ని పొట్టివి, కొన్ని వెడల్పువి. కొన్ని సన్నవి. కొన్ని పెద్దవి. కొన్ని చిన్నవి. కొన్ని లావు వెదుళ్ళతో గట్టినవి. కొన్నిసన్నవు వెదుళ్ళతో గట్టినవి. ఇట్లు పదిహేనురోజులు రాత్రి పగలు కష్టపడి తాను

పెండ్లాము బిడ్డలుకలిసి నాలుగువందల కటుసులుకట్టి వాటినన్నిటిని బండ్లమీాద వేయించుకొని యింటింటికి వెళ్ళి బండ్లాపుజేసి యొక పెద్ద కటుకు యొక చిన్నకటుకుతీసి వారి యరుగుమీాద బెట్టించి యింటివారితో ఇట్లని చెప్ప మొదలుపెట్టెను—"అయ్యా, నాకప్పు డప్పుడు గ్రామాంతరము వెళ్ళవలసిన పనియుండును. అప్పుడు మీా యింటిలో నెవరైన చనిపోవచ్చును. పోయినప్పుడు కటుకులు లేక మీారిబ్బంది పడవచ్చును. అందుచేత నా మాన్యము పోవచ్చును. గంగయ్యామూలమున మేమిబ్బందిపడినామని మీారనుకోకుండ ముందే కటుసులుకట్టి తీసుకొని వస్తిని. ఒక పెద్దకటుకు యొకచిన్నకటుకు మీాయింట్లో నుంచుకొండి. పెద్దవాడు పోయినపుడు పెద్దదుపయోగించుకోవచ్చును. చిన్నవాడు పోయినపుడు చిన్నదుపయోగించుకోవచ్చును." ఆమాటలువిని ఇంటియజమానులు స్త్రీలు "ఛీ, ఛీ, దుర్మార్గుడా, పాపాత్ముడా, ఎంతమాటన్నావు. నీకిదేమి హాయ్యేకాలమురా" యని దూషింప మొదలుపెట్టిరి. కొందరు గట్టిగా తిట్టిరి. కొందరు చంపకాయలు కొట్టిరి. కొందరు వీసెగుద్దులు రుచి చూపిరి. కొందరు కర్రలుపుచ్చుకొనిమీాదికివచ్చిరి. గంగయ్యాభయపడికటుకుల బండి వదలి పెట్టి పిక్కబలమే శరణ్యమని లేడిలాగుపరుగెత్తిపోయెను అప్పటికిప్పటికి తిరిగి యిల్లు జేరలేదు. వారిల్లు గ్రామము చిన్నబోయి నదిగనుక యీాచదువరులలో నెవరికైన గనిపించినపక్షమున వాని నింటికి పంపించి పుణ్యము గట్టుకొందురుగాక!

—♦—

కలిగీత

ఈ లోకములో ధర్మోపదేశములు చేయునట్టి గ్రంథము భగవద్గీతయొక్కటేయని మనవారు తలచుచున్నారు. భగవద్గీత కంటె నెక్కువగ మహాధర్మములను బోధించునట్టి మహాగ్రంథము మరియొకటికలదు దానిపేరు కలిగీత. ఇది మహాత్ముండైన కలిపురుషుడు తనప్రియశిష్యుడైన అహంకారున కుపదేశించిన వేదాంత శాస్త్రము. ఈశాస్త్రమే ప్రస్తుతము లోకమునందన్ని ఖండములలో నెల్లదేశములలో నెల్లజాతులలో చాలవ్యాపించియున్నది. ఈశాస్త్రమే యిందు ప్రకటింపబడును. దీనిపూర్వవృత్తాంత మీలాగుననున్నది.

కాలపురుషుడను నొకరాజునకు జ్ఞానదేవి మాయాదేవి యను నిద్దరు భార్యలుకలరు. జ్ఞానదేవికి వివేకుడు సత్యుడు ధర్ముడు కృపుడు శౌచుడు అనునైదుగురు కుమారులుగలిగిరి. మాయాదేవికి అవివేకుడు క్రూరుడు దంభుడు లోభుడు అహంకారుడు కాముడు క్రోధుడు మోహుడు మదుడు మత్సరుడు మొదలగు నూరుగురు కొమరులు గలిగిరి. లోకపరిపాలన విషయములో వీరికిరువురకును వివాదములు పుట్టెను. అవివేకుడు అహంకారుడు మొదలగు మాయాదేవి పుత్రులు బహువిధకపటోపాయములచేత సవతితల్లిబిడ్డలను పట్టణములనుండి పల్లెలనుండి పారదోలి మహారణ్యములలో మునిపల్లెలయందు మాత్ర ముండునట్లుచేసిరి. వివేకుడు మొదలగు జ్ఞానదేవి పుత్రులు, అప్పుడప్పుడు చాటుచాటున నరణ్యములనుండి పట్టణములకు పల్లెలకు వచ్చి యెక్కడో మూలమూలలనున్న యొకానొక సత్పురుషుని యింటబసచేసి, బహురహస్యముగ దేశము వెంట తిరుగుచుందురు. జనులలోననేకులకు వివేకుడు మొదలగువారిపై నిష్టమున్నదిగాని బలవంతులు పరాక్రమవంతులు నైన అహం-

కారుడు క్రోధుడు మొదలగు వారికి జడిసి బహిరంగముగ వివేకాదులతో మాట్లాడరు. అవివేకుడు అహంకారుడు మొదలగువారికి మొదటినుండియు కలిపురుషుడు దైవము. ఆతని సహాయముచేతనే వీరందరు జయింపగలమని నమ్ముకొనియుండిరి. కలిపురుషుడును వారినందరిని తనపుత్రులవలె భావించి వారికి సకలవిధముల సహాయము జేయుచు వారిరాజ్యసంపాదనము తనరాజ్యసంపాదనముగ వారివైభవము తనవైభముగ నెంచి సంతోషించుచుండును. ఇట్లుండగా వివేకుడు మొదలగువారు దేశములో చాటుచాటున దిరుగలేక అరణ్యములోనుండి బాధపడలేక దేశములలోనున్న ప్రజలందరు అవివేకుడు మొదలగువారిచేతబడి పాడైపోవుచున్నారని జాలినొంది బహిరంగముగ వెలుపలకువచ్చి అవివేకుడు మొదలగువారితో యుద్ధము చేయనిశ్చయించుకొనిరి.

ఈయుద్ధము పుణ్యక్షేత్రమైన (మనస్సు) అనుక్షేత్రమునజరిగెను. కాలపురుషునకు మాయాదేవిపుత్రులయందే అభిమాన మతిశయముగ నుండుటచే వారిగెలుపునే కోరుచు ఆయుద్ధమే ప్రకారముగ జరిగినదో వినవలయునని తనసేవకుడైన మారుతుడనువానిని పిలిపించి అడిగెను. మారుతునకు జ్ఞానదేవతా ప్రభావమువల్ల యుద్ధములో జరిగిన సంగతులెల్ల కండ్లకుగట్టినట్లు కనబడుచువచ్చెను. అందుచేతనతడు జరిగినదంతయు రాజపురుషునకు పూసగ్రుచ్చినట్లు తూచా తప్పకుండ సమస్తమును వివరించెను. ఆసందర్భములో కలిపురుషుడు, అహంకారున కుపదేశించిన గీతాశాస్త్రమును కాలపురుషునకు నీక్రిందివిధముగ నుపదేశించెను :—

కాలపురుషోవాచా – కాలపురుషుడడుగుచున్నాడు.

''ఓ మారుతుడాధర్మక్షేత్రమైనమనసును క్షేత్రమునందు నాప్రథమభార్యాపుత్రుడగు వివేకుడు మొదలగువారును రెండవభార్య

బిడ్డలైన యవివేకుడు. అహంకారుడు మొదలగువారును, యెట్లు యుద్ధము చేసిరో తెలియజేయుము.

మారుతోవాచా-మారుతుడు పలుకుచున్నాడు.

"దేవా చిత్తగింపుము అట్లు వివేకుడు మొదలగు నీ మొదటి భార్యబిడ్డలు తమకు ధర్ముడను వానిని సేనాధిపతిగ చేసికొనియుద్ధమునకు వెళ్ళిరి. అంతకుముందే యవివేకుడు మొదలగువారు తమకు అహంకారుని సేనాధిపతిగ జేసికొని యుద్ధసన్నద్ధులైవచ్చిరి. అహంకారునకు కలిపురుషుడు సారథియై యుద్ధరంగమునకు వచ్చెను. అతడు రథమును తోలుటకే ఒప్పుకొనెనుగాని యుద్ధముచేయుటకు ఒప్పుకొనలేదు. ఆతడు తమపక్షమున నున్నంతమాత్రము చేతనే జయము గలుగునని యహంకారుడు మొదలగువారు కలిపురుషునియొక్క ఇచ్ఛాప్రకారమే నడచిరి. ఉభయసేనలు యుద్ధరంగమున జేరిన తరువాత మహావీరులందరు శంఖధ్వనులు చేసిరి. అంతట అహంకారుడు కలిపురుషునిజూచి "మహాత్మా! నారథము ఉభయసేనల మధ్యను నిలుపుము. నేనెవరితో యుద్ధము చేయవలయునో యట్టి సైనికుల నందర నొక్కసారి చూడవలయు"నని బలికెను. అప్పుడు కలిపురుషుడు సరేయని రథము నుభయసేనల మధ్యమునను నిలిపెను. నిలుపగానే యహంకారుడు తన శత్రుసైన్యమువంక నొక్కమారు పారజూచి వివేకుడు మొదలగువారిని కనుగొని చేతిలోనున్న విల్లునమ్ములు క్రిందపారవైచి రథముమీద చతికిలబడి విషాదముతో కలిపురుషునకిట్లనియె. "భగవానుడా కలిపురుషుడా! నీవు సర్వవ్యాపివి. సర్వజ్ఞుండవు సర్వశక్తుండవు. నీకు తెలియని రహస్యములు లేవు. అయినను నామనోనిశ్చయము నీకు చెప్పెద వినుము వివేకుడు మొదలగువారును మేమును ఒక తండ్రిబిడ్డలము అన్నదమ్ముల వధియించుట యుక్తముకాదు. మరియును వారందరు మిక్కిలి మంచి

వారు. అట్టి మంచివారిని సంహరించి యీలోకమంతయు నాక్రమించి పాపపుభోగముల ననుభవించుటకంటె మేమే యరణ్యములలోనికి బోవుట యుత్తమమని తోచుచున్నది: మంచివారిని నాశనము చేయుట పాపము. వారిదివరకే మేము పెట్టినబాధలవల్ల చిక్కిశల్యములై యున్నారు. మే మిప్పుడు కొట్టక యూరకుండినను తల దాచుకొనుటకు స్థలములేక తినుట కన్నములేక వారంతటవారే నశింతురు. చేతులార మేము చంపనక్కరలేదు. ఇట్లు జరుగునా యని నీవు సంశయపడనక్కరలేదు. వారు నిలుచుటకై గోష్పాదమంత భూమియైనను మే మియ్యమని ఇదివరకే వర్తమాన మంపినాము. ఎన్నివిధములచేత చూచినను వారువృద్ధి పొందరు. అవివేకమహారాజు వంకజూడుము ఏకు౹ ౹ క్కవలె తెల్లగ పాలిపోయి బక్కచిక్కి యెట్లున్నవాడో! సగము చచ్చినవారిని మనమిప్పుడు చంపనేల? అదిగాక నేనెంత రాతిగుండె కలవాడనైనను వివేకాదులను నిర్మూలించుటకు నాచిత్తమే ఒప్పకున్నది. కావున నారథ మనతలకు తోలుకొనిపోయి నన్నొక యరణ్యమున జేర్పుము.

ఇది అహంకారుని విషాదయోగమను

ప్రథమాధ్యాయము.

—०—

రెండవ అధ్యాయము

అహంకారుడట్లు మహావిషాదముచే రథముమీద కూలబడి యుద్ధముచేయుట కిష్టములేక యరణ్యవాసమును గోరుచుండగా, మహాత్ముడైన కలిపురుషుడు వాని వీపుమీద చేయివైచి తట్టి భయము తీర్చుటకై గాఢాలింగనము చేసికొని తలనిమిరి వాని ప్రక్కనే గూర్చుండి మంచుపలుకులవంటి చల్లని పలుకులతో వాని కీక్రిందివిధముగా తత్త్వోపదేశము చేసెను.

కలిపురుషో వాచా - కలి పలుకుచున్నాడు.

ఓ వెఱ్ఱివాడా ! అహంకారుడా ! నీధనస్సుయొక్క టంకారము చూచి నీ ఝాంకారముచూచి, నీవెంతో ధైర్యవంతుడవుగం భీరుడవు ననుకొంటినిగాని యినుమువలె నుండవలసిన నీహృదయము నవనీతమువలె నున్నదని యెన్నడును నేనెరుగకపోతిని. ఇంత మెత్తని వాడవన్నమాట నాకిప్పుడు తెలిసినది. మనకు సహజముగా విరోధు లైన వివేకుడు మొదలయినవారిని మనము జంపకపోతిమా లోకమంతయు వారే యాక్రమింతురు. నీవు నాశిష్యుడవై యుండి యీలాటి మెత్తదనము కనబరచుట నాకప్రతిష్టగాదా. ఇది క్రూరత్వమని నీ వనుకొనుచున్నావు క్రూరత్వమని లోకములో నొకటి లేదు. క్రూరత్వమే శూరత్వము. శూరత్వమే క్రూరత్వము, భగవంతుడు కలడనియు దయాసముద్రుడనియు నందురుగానిఅతడున్న పక్షమునకూడ క్రూరుడే. సృష్టింపబడిన సమస్తజంతువులలో బలమైనది, బలము లేని దానిని చంపుచున్నది. కుక్క పిల్లిని చంపును. పిల్లి యెలుకను చంపును లోకమరియాద యీవిధముగానే యున్నది. ఆవిధముగానే మనము బలవంతులమైనపుడు మనకంటె బలహీనుల జంపవలసినది. మంచివారు మంచివారనడమేకాని వారు మనమార్గములో ముళ్ళ వంటివారు, ఆముండ్లు మనము పెల్లగించవలసినది. పెల్లగించకపోయిన పక్షమున మనకు రాజ్యము లేలాగున దక్కును ? ధన మేలాగున వచ్చును ? సుఖ మేలాగున దక్కును ? కాబట్టి సజ్జనులని గిజ్జనులని యాలోచింపక మనము శత్రుసంహారము చేయవలెను. వివేకుడు మొదలయినవారు మహామునుల యాశ్రమములలోను అక్కడక్కడ కొందరు సజ్జనుల యిండ్లలోను మాత్రమే చిక్కిచిక్కి యున్నారని నీ వనుచున్నావు. ఈవేళ చిక్కినవారు రేపు బలియుదురు. నే డడవులలో నున్నవారు రేపుపట్టణములలోనుందురు. కాబట్టి వారు చిక్కియుండ

గానే అడవులలో నుండగానే నాశనముచేయవలయును. పాపమని నీవు జంకనక్కఱలేదు. లోకములో పాపమన్నది లేదు. గొంతులు కోసియైనను సరే, మోసముచేసియైనను సరే, కొంపలు కాల్చియైనను సరే, ద్రోపుడు సలిపియైననుసరే, విషములు పెట్టియైననుసరే శత్రువుల నాశనముచేసి గొప్పవాడైనవాడే ప్రయోజకుడు. వానినే లోకులందరు గౌరవింతురు. వానికే యెల్లవారును జడియుదురు. అతనినే పుణ్యాత్ముడని యాచకులు స్తోత్రము చేయుదురు. వాడొక్కడబ్బు యెవనికీ ఇయ్యకపోయినను అందరు వానినేయాశ్రయింతురు. సజ్జనుడు సజ్జనుడని చెప్పుకొనుటయే కాని ధనము కానియధికారముగాని బలము కాని లేకపోయిన-చో సజ్జనుని మొగ మెవ్వరుజూడరు. పరకాంత మొగముచూడనివారు పరధనము ముట్టుకోనివారు, నిరంతరము ప్రార్థనలు చేయు భక్తులు ముక్కుమూసికొని కూర్చుండు తపశ్శాలులు, బూడిద పూసికొను బ్రాహ్మణులును మహామునులు యోగులు సన్యాసులు మొదలగువారందఱు అప్రయోజికులలో మొట్టమొదటి రకంవారు వీళ్ళనుచూచి కూర్చుండిన గుడ్డిముండ లేవదు. వీళ్ళకు పొట్టగడవదు. క్రూరకర్మచేత నీచకర్మచేత భాగ్యవంతులైనవారిని యధికారులైనవారిని పైన చెప్పినవారందరు లోలోపల నిందించి యాక్షేపింతురే కాని డబ్బుకావలసివచ్చినప్పుడు వారిదగ్గరకే వెళ్ళి నోరు తెఱచి చెయిజాచి యడుగుదురు. కాబట్టి ధనమూల మిదంజగత్తు, అధికారమూల మిదంజగత్తు. కాబట్టి ధనము అధికారము తప్పక సర్వవిధములచేత సంపాదింపవలయును. ఈతత్వము పరమరహస్యమైనది. నీవు ప్రియశిష్యుడవును నాయంతవాడవుకనుక నీకు నేను నిర్హేతుకజాయమాన కటాక్షము చేత తెలియజేయుచున్నాను ఏకార్యమైనను నెగ్గించగలిగితే పాపము లేదు. నెగ్గించలేకపోతె పాపాత్ముడు అప్రయోజకుడు అందురు. గొప్పతనమునకంతకు నిదియే రహస్యము. ఇదియే తాళము

చెవివంటిది. కాబట్టి వివేకుడు మొదలయిన వారిని నీవుసంహరింపుము. నీకు దీనివలన కీర్తివచ్చును. ఐశ్వర్యమువచ్చును. నిగురుగప్పిననిప్పు వలె నుండి నీబలము నీవెఱుగకున్నావు అగ్నిహోత్రునకు వాయువులోడైనట్లు నీకు నేను తోడగుచున్నాను గనుక నీవు అవలీలగ శత్రువులను జయింపగలవు. నన్ను నేను కొనియాడుకొనగూడదు. నామహాత్మ్యమును నీవు తిన్నగా యెఱుగవు. కాబట్టి నామాటవిని విలునమ్ములు పుచ్చుకొని లేచి రథముమీదగూర్చుండి ధైర్యము తెచ్చుకొని వివేకాదులను సంహరింపుము.

ఇది లోకాయిత యోగంబను
రెండవ అధ్యాయము

—o—

మూడవ అధ్యాయము

అహంకారోవాచా, అహంకారుడు పలుకుచున్నాడు

మహాత్మా మీరు సెలవిచ్చినది బాగున్నది కాని భగవంతుడున్నాడనియు క్రూరకర్మముచేసిన పక్షముల నతడు నాయాత్మను శిక్షించుననియు నాకు భయముగలుగుచున్నది. అందుచేతవివేకాదులను సంహరించుటకు నాకు చేతులు రాకున్నవి.

కలిపుణోవాచా: కలి పలుకుచున్నాడు.

అనవుడు కలిపురుషుడు వికవికనవ్వి ''ఎంతపిచ్చివాడవు! పరలోక మొకటియున్నదా. ఆత్మయొకటికలదా. భగవంతుడున్నాడా. ఆత్మయెక్కడది. దాని కాకారమున్నదా. పరలోకములో సుఖదుఃఖములనుభవించువారెవరు చచ్చిపోయిన తరువాత శరీరము కాలిపోవుచున్నది. ఇకఆత్మను చూచినవారెవరు లేరు. వేదవ్యాసులు శంకరాచార్యులు మొదలయినవారందఱు ఆత్మయున్నదని పాడు

పుస్తకములు వ్రాసినారు. వారందొంగలు వారివ్రాత లబద్ధములు, ఆత్మ లేకపోయినచో శరీర మింతకాల మెట్లు బ్రతికినదని నీవడుగుదు వేమో. బ్రతుకుటకు ప్రాణము లాధారములు. జబ్బుచేసి ప్రాణములుపోయిన తరువాత నేమియులేదు. సుఖము దుఃఖము ననుభవించుట యిక్కడనే కాని పైన యేమియులేదు భగవంతుడు లేడు, ఉన్నపక్షమున కనబడడేమి ? అతడీ లోకములన్నీ సృష్టిచేసినాడట. అతని నెవరు సృష్టించినారు? అతడు స్వయముగా పుట్టగలిగినపక్షమున నీలోకమే స్వయముగా పుట్టినదని యెందుకనుకొనగూడదు? ఈశ్వరుని చూచినామని చెప్పుకట్టి భక్తులందరుగూడ మోసగాండ్రు. వారిమాటలు నమ్మగూడదు. శరీరము యంత్రమువంటిది యంత్రము లోనున్న మర లన్నీ కూర్చినప్పుడు యంత్రము శక్తిగలిగి పనిచేసినట్లే శరీరములో అవయవములన్నీ బాగున్నపు డది పనిచేయును. యంత్రములు కాత్మ లేనట్లే శరీరమున కాత్మలేదు. భగవంతుడంతకన్న లేడు. నేనే భగవంతుడను. పాప మసలేలేదు. పుణ్యము మొదలే లేదు. పరలోకము కలలోనైన లేదు. కాబట్టి నీవు జడియవలసిన పనిలేదు.

ఇది నాస్తిక యోగంబను
మూడవ యధ్యాయము.

నాలుగవ అధ్యాయము
కలిపురుషుని విశ్వరూప ప్రదర్శనము

అహంకారో వాచా_అహంకారుడు పలుకుచున్నాడు.

మహానుభావా! కలిపురుషా పరమేశ్వరుడు వేరే లేడనియు నీవే లోకేశ్వరుండనియు క్షణకాలము క్రిందట మీరే చెప్పియున్నారు. అజ్ఞానముచేత నావరింపఁ బడిన మనస్సుగలవాడనగుటచే మీ

మాట నేను నమ్మజాలను. మీరేవిధముగా లోకేశ్వరులయిరి. మీ మహిమ యెట్టిదో తెలియజేసి మీనిజమూర్తిని నాకు జూపినకాని నాకు నమ్మిక కుదరదు. కాబట్టి యీవిధముగా జేయ ప్రార్థించుచున్నాను.

కలిపురుషోవాచా—కలిపురుషుడు చెప్పుచున్నాడు.

ఓయి మూర్ఖుడా అహంకారుడా! నీవు నాప్రియభక్తులలో నొకడవయినను దురాత్మురాలైన జ్ఞానదేవత మధ్యమధ్య నిన్నావహించి పాడుచేయుచుండుటచేత నీవు నామాటలను విశ్వసింపకపోవు చున్నావు. దీనింబట్టి నీచిత్తమింకను స్థిరముగా లేదని తలంపవలసి యున్నది. ఈదెబ్బతో నీకును జ్ఞానదేవతకును కోటియోజనములదూర ముండునట్లు నామహిమను నీకు బోధించెదను. సావధానుడవై వినుము క్షణకాలము నీవు వివేకుడు నీకు చుట్టము కాడని తలంచుకొనుము. జ్ఞానదేవత నీదగ్గరకు రాకుండ పూర్వకాలమున నీకుపదేశించిన మోహమంత్రమును జపియింపుము. నాశిష్యులును నీకుమిత్రులును నైన కామక్రోధాదుల రూపమును నీవు మనస్సులో భావించుకొనుము. అప్పుడు నాబోధలు నీకు సమగ్రముగా తలకెక్కును.

అహం—దేవా అట్లే చేయుచున్నాను. సావధానుడనై యున్నాను. మీమహిమ సెలవిమ్ము.

కలి—ఇదిగో వినుము. నేను లోకేశ్వరుడను సర్వశక్తుడను, సర్వవ్యాపకుడను. సర్వనియామకుడను, సర్వజ్ఞుడను, లోకమునందు ప్రతిమనుష్యుడును సాధారణముగా నాయొక్క యవతారమే. నా యవతారమనుటకు తార్కాణమేమనగా స్వల్పముగానో యధికముగానో నాగుణములు లేని మనుష్యుడుగాని జంతువుకాని లోకములో లేదు. కొందరు మూర్ఖులు మాయచేత భ్రమపడి వివేకమనునది మనుష్యులలో కలదని యందురుకాని యది ప్రమాదము. నాసంబం

ధమైన జ్ఞానము కలుగగానే నీటిలో వేసిన యుప్పువలెనే యీ తెలివి తక్కువ కరగిపోవును. నన్ను నమ్ముకున్న పరమభక్తులకు జీవన్ముక్తి వారికి ప్రసాదించెదను. అనగా బ్రతికియుండగానే సకలసౌఖ్యములను బ్రహ్మానందమును గూర్చెదను. "త్వమేవశరణం అన్యథాశరణంనాస్తి అని నన్ను మనస్ఫూర్తిగా నమ్ముకొన్నవారిమీద నాదయారసము వరదవలె ప్రవహించును. నాభక్తులు బంగారపు తూగుటుయ్యాలలో నెక్కి యూగుదురు. వారియిండ్లు సకలైశ్వర్యములతో తులతూగు చుండును. నాశిష్యుల భార్యలు నగలబరువు మోయలేక యుందురు. నాశిష్యులే తరచుగా మేడలు మిద్దెలు కట్టగలుగుదురు. వారికచ్చేరీ చావడులు వేశ్యాంగనల మేజువాణులతోను గానవినోదములతోను ప్రతిధ్వనులిచ్చుచుండును. లక్ష్మీదేవి నావశవర్తినియైయున్నది. గనుక అట్టివారి యిండ్లలో నివసింపుమని యామెనుపంపి మరేదురాత్ముల చేతను ఆమె తీసికొనిపోబడకుండ కాళ్ళకు సంకెళ్లు వేయబడును. అందుచేత మహాలక్ష్మి నాశిష్యులయిండ్లలోఘల్లుఘల్లుమనిసంచరించు చుండును. వీనులవిందుగా రూపాయల చప్పుడు ఖంగుఖంగుమని వారి యిండ్లలో వినబడుచుండును. వేయేల! సకలసౌఖ్యములు వారివే. సకలభోగములు వారివే. సకలవైభవములు వారివే. సకలసంపదలు వారివే. పలుకుబడివారిదే. అధికారము వారిదే. మాటచెల్లుబడి వారిదే. సత్యము నాశిష్యుల యెదుటకురాలేక గడగడవడంకి మూల మూలలనొదిగిపోవును. ధర్మముకంచుకాగడాను వెదకిననుగనబడదు. జ్ఞానదేవత నాశిష్యులున్న దేశములోనైన అడుగిడుటకు వెరచును. నాశిష్యులకే అంతప్రతాపమున్నపుడు గురువునైన నాపేరు చెప్పిన మాత్రమున సత్యము మొదలయినవి గుండెబ్రద్దలయి చచ్చిపోవును.

ఇక నన్నాశ్రయించని నిర్భాగ్యులగతి చెప్పెదవినుము. వారికి పూటకు టికాణా యుండదు. నావిరోధికోటిలో గొందతికి తలదాచు

కొనుటకు కొంపైన నుండదు. ఉండినను యొక గుడిసెయో లేక కొంప యని పిలుచుటను తగనిదొకకొంపయో యుండును అనిర్భాగ్యులు బూడిదలు పూసికొని కాషాయ వస్త్రములు గట్టుకొని గోచి పాతల ధరించి యుపవాసములజేసి మాడి చిక్కి నశింతురు. అయితే నాశిష్యులలోగూడ కొందఱు బూడిదపూసికొని కాషాయవస్త్రములు గట్టుకొనియుందురు కాని వారు వేషమెట్లు వేసినను లోపలమాత్రము నన్ను నమ్మియుండి నాకు యిష్టములైన కార్యములు చేయుచుందురు. వేయేల! నాకు శిష్యులు కానివా రెల్లపుడు పేదలు. ఎల్లపుడు ఋణగ్రస్థులు. అప్రయోజకులు. పలుకుబడి మాట చెల్లుబడి లేనివారు వారిని చూచినప్పుడు కూర్చున్న గుడ్డిచుండ లేవదు. ఏ చెట్టుక్రిందనో గూర్చుండి ముక్కు మూసికొని ఆకు అలము తిని బ్రతకవలసినవారే కాని యట్టివారు నలుగురిలోనికి రాదగినవారు కారు. ఇన్ని మాట లెందుకు? వాళ్ళు కాళ్ళు చేతులు ముక్కు చెవులుగలిగియుండి మాటలాడుచున్నను వాళ్ళు మనుష్యులే కారు. మనుష్యులన్నప్పుడు నా శిష్యులే మనుష్యులు.

అహం—మహాత్మా! నీవు చెప్పినది నాకు తెలిసినది. నీవేయే స్థలములలో నుందువు? నిన్నెట్టి మహానీయులు తెలిసికొనగలరు? నీ యవతారంబు లెక్కడెక్కడ నున్నవి? యనుశంక బాధించుచున్నది గావున నాకు శంకానివృత్తి చేయవలయునని వేడుచున్నాను.

కలి—వత్సా! అయుష్మంతుడవు గమ్ము. ప్రపంచమున్నంత కాలము జీవింపుము. నీభక్తికి మెచ్చితిని. నీకు సనుస్తము కరతలామలకముగా నెఱిగించి నిన్ను నాయంతవానిగా జేసెదను నీవు నా పాదములనే నమ్ముకొని యెల్లకాల మిట్లే యుండుము. ఇంక నీకు శంకానివృత్తి చేసెద వినుము. పూర్వకాలమునందు పుణ్యక్షేత్రములు దేవాలయములు తీర్థములు తులసివనములు మొదలగుచోటు

లకు నేను వెళ్ళజాలక వెరచుచుంటిని గాని యిప్పుడా ధర్మకర్తలు
మొదలయినవారు నాతోరాజీపడినాశిష్యులైననునమ్మకొని యున్నం
దున యిప్పుడాస్థలములకు తరుచుగా వెళ్ళుచున్నాను. కాని సహజ
ముగాఆస్థలములపేరుదలచినప్పుడు నాకురోత. అక్కడఅడుగు పెట్టుటకే
నాకిష్టముండదు. ధర్మకర్తలుమొదలగువారు శిష్యులైనారని యభిమా
నముచేత అక్కడకు వెళ్ళుచున్నానే కాని నాకు మనస్సులో ఆస్థ
ములమీద నిజమైన యభిమానము లేదు. ఏలయన ఇప్పటికిని నాక
గర్భశత్రులైన విష్ణుభక్తులు యోగులు శుద్ధులైనవారుకొందఱక్క
డక్కడ నుండుచున్నారు. సంతోషపూర్వకముగా నేనుండునట్టి స్థ
ములు చెప్పెద వినుము. వేశ్యాంగనాగృహములు నాకు పరమప్రీతి
కరములైన యాలయములు. మరియు సారా దుకాణములు జూదపు
పాకలు కోడిపందెములతావులు నరహంతకుల హృదయములు అబద్ధి
కుల నాలుకలు నాకు కొలువుకూటములు. ఈత తోటలు, తాటి
తోటలు, గంజాయివనములు నాకు విహారభూములు. చీకటిచోట్ల
లం జూచినప్పుడు నాకు పంచప్రాణములు లేచివచ్చును. మరియు
వస్తువులు తూచునట్టి తక్కెళ్ళలోను త్రాసులలోను కుంచము మొద
లగు కొలతపాత్రలలోను, సమస్తాయుధములలోను, అన్నిరూపాయల
కాసులుడబ్బులు మొదలగునాణెములలోను నేనుతరుచుగా నుందును
పూర్వము విద్య యనునట్టి రాక్షసి నాతో చిరకాలము విరోధపడి
నన్ను విద్యావంతులసమీపమునకు రానిచ్చినది కాదు కాని, ఇప్పు
డామె నాశిష్యులచేనోడింపబడియుండుటచేవిద్యావంతులు చాలమంది
నాకు వశవర్తులైయున్నారు. నారోజులుమిక్కిలిబాగున్నవి. దేవత
ర్చన గదులలోను పెట్టెలలోను నేనే ప్రవేశించి యున్నాను. నేన
అనంతకోటి యవతారములనెత్తినాను. పూర్వకాలము రావణకుంభ
కర్ణాదులునాఅవతారమూర్తులే. శిశుపాలదంతవక్త్రులు, దుర్యోధనుడు

దుశ్శాసనుడు శకుని మొదలగువారుగూడ నాయవతారమూర్తులే. నాయందలి ద్వేషముచేత వాల్మీకియు వేదవ్యాసుడును రావణాదులు వైకుంఠమునందలి జయవిజయుల యంశమునందు బుట్టినారని వ్రాసినారు. అదినిజముకాదు. వారు నాయంశముననే బుట్టిరి. నా యవతారంబుల నింకను జెప్పెద వినుము. వృక్షములలో గంజాయిమొక్కను నేను. నాభిచెట్టును నేను. నల్లమందు మొక్కను నేను. జంతువులలో పెద్దపులిని నేను. చిరుతపులిని నేను. ప్రాకెడి పురుగులలో పామును నేను. తేలును నేను. పశువులలో పాలియ్యని పోట్లగొడ్డును నేను. పుస్తకములలో కొక్కోకము నేను వీధులలో రాజమహేంద్రవరపు అనప్పిండివారి వీధిని నేను. మనుష్యులలో హంతకుడను నేను. లంచగొండి యధికారిని నేను. లంచము నేను. లంచముయిచ్చిన సొమ్ము నేను. లంచము దెచ్చిన రాయబారిని నేను. వ్రాసిన తప్పువ్రాత నేను. దొంగసాక్ష్యము నేను. సాక్షిని నేను. అబద్ధమాడునట్టి మనుష్యుడను నేను. నాలుకను నేను. అబద్ధమును నేను. నదులలో సుడిగుండము నేను. గృహమందలిదోమలు నేను. నల్లులు నేను. సారా నేను. గూన నేను. పుచ్చుకొనునట్టి పాత్ర నేను. తెచ్చునట్టిసీసా నేను సారాదుకాణము నేను. బట్టీ నేను. తప్పుతూనిక నేను. దొంగబేరము నేను. వేయేల సమస్తమును నేను.

ఇది కలిప్రభావయోగమను

నాలుగవ యధ్యాయము.

---*---

విశ్వరూప ప్రదర్శనము

అయిదవ అధ్యాయము.

అహంకారుడు పలుకుచున్నాడు—

దేవా! నేనడిగిన ప్రశ్నలలో మొదట రెంటికిని మీ రిచ్చిన ప్రత్యుత్తరము మిక్కిలి తృప్తికరముగా నున్నది. తక్కిన మూడు ప్రశ్నలకును సత్వరముగా బ్రత్యుత్తరమిచ్చి నన్ను ధన్యుని జేయ గోరుచున్నాను.

కలి—వత్సా, నీకు నాయందు కుదిరిన భక్తికి నేను మిక్కిలి సంతసించుచున్నాను. నీవు చాలమట్టుకు బాగుపడినావనియు నీ పేరు సార్థకము చేసికొన్నావనియు నేనిప్పుడు ధృఢముగా చెప్పగలను నీవు మీదచేయివేసి ఆదరపూర్వకముగా తట్టుచున్న వారెవరనిఅడిగినావు చెప్పుచున్నాను వినుము. వీరందఱు నాప్రియశిష్యులు కాని నాప్రియ శిష్యులవలె ప్రత్యక్షముగాలోకములోగానబడక ధర్మదేవతనుసేవించు వారివలె నటించుచుందురు. చూడగానే వీరు నాశిష్యులవలె కనబడరు. నిదానముమీద బుద్ధిమంతులు చూచినపక్షమున వారునావారేకాని తదన్యులు కారనివిస్పష్టముగా తెలిసికొనవచ్చును. లౌకికసంబంధము లైనకొన్ని కొన్ని బాధలు వారికుండుటచేత వారు ప్రత్యక్షముగా నా ధర్మముల ననుష్టింపలేక పైకిమారు వేషముల వేసికొని సంచరించుచు గాలక్షేపము సేయుచున్నారు. కాని నాసేవలో నెంతమాత్రము వీరు తక్కినవారికి తీసిపోరు. వీరు రెండువిధములుగనున్నారు. ఉభయులకు నుద్దేశ మొకటె. అనగా ధనమార్జించుటే. ఇందు మొదటివారు న్యాయవాదులను పేరున వ్యవహరింపబడుచున్న కొందర న్యాయ వాదులు, వీరిలోగూడ నందఱు నా శిష్యులుగారు. కొందఱు

మాత్రమే నా ప్రియశిష్యులు. అట్లు వీరిలో నన్ను సేవింపనివారు గూడ సర్వవిధముల సుఖపడుచున్నారు. కాని మొత్తముమీాద నీ జాతిలో చాలమంది నాశిష్యులే, వారుశరీరమునధరించునట్టి గౌనులు అపవాదమునుండి వారిని తప్పించునట్టి కవచములు. వారునిశ్శబ్దముగ గోల లేకుండ చేయుచున్నపని ఇంత యంత యని వర్ణించుటకు వీలు లేదు. వీరును వీరికి సేనాపతులై కుడిభుజములై పనిచేయుచున్న యేజంట్లును, నామనస్సుకు నచ్చునట్లు ఖుతిలేని పనిచేయుచున్నారు. సకల కలహములకు వీరలే కారకులు. అందుచేత వీరు శ్లాఘ్యముగా జీవనము చేయుచు నన్ను నమ్ముకొనియున్నందుకు నేను వారి వీపుపై చేయివైచి తట్టుచున్నాను. నా కోరలసందునబడి గానుగలలోబడిన చెఱుకుగడలవలె నలిగిపోవుచున్నవారెవరో చెప్పెదవినుము; మొదటివాడు వివేకుడు, సత్యుడు, ధర్ముడు మొదలగువా రందరును వానిమార్గమునే యనుసరించి నశించుచున్నారు. ప్రస్తుతము కొన్ని కారణములచేత వారు లోకములో అక్కడక్కడనున్నట్లు కనబడుచున్నను క్రమక్రమముగా నా కోరలసందునబడి తప్పక నశియింప గలరు. ఇప్పుడే నశియించిపోవుచున్నారు. నా శరీరములోనుండు రక్తము కొందరి శరీరములలో ప్రవహించుచున్నది. అనగా వారిశరీరములోని రక్తము, నారక్తము నొక్కటే. వారిలో గొందఱు మతాధిపతులు కొందరు మంత్రులు. ఈ మతాధిపతులుగూడ నాకు ప్రత్యక్షవిరోధులవలె నుండి లోపల నా పనియే చేయుచున్నారు వీరి వలననే కోట్లకొలది మనుష్యులుమూర్ఖులై నా పాదసేవ జేయుచున్నారు. వీరుండబట్టియే జ్ఞానులెవరైన బయలుదేరి ప్రజలనుబాగుచేయ సంకల్పించుకొన్నను వారియాట లెంతమాత్రమునుసాగుచుండుట లేదు. మంత్రులుండబట్టియే రాజనీతి యనుపేర నాపని కావలసినంతజరుగుచున్నది.

అహం—మహాత్మా! నీ విశ్వరూప ప్రదర్శనముచేత నేనును నా పెద్దలును తరింపగలిగితిమి. నేను నిశ్చయముగ బాగుపడినానని చెప్పగలను.

కలి—నీవు పరమభక్తుడవు కాబట్టి, అతిగోప్యమై అతి చిత్రమైన నా విశ్వరూపమును నీకు జూపితిని. నీవంటి ధన్యుడు ప్రపంచమున మరియొకడు లేడు. ఈ విశ్వరూప మెంతవానికి కనబడును. ఇది బ్రహ్మరుద్రాది దేవతలకు దుర్లభము. వశిష్ట వామదేవాది మహర్షులకు దుర్లభము. అరుంధతి సీత మున్నగు మహా పతివ్రతలకు దుర్లభము. నీ పూర్వజన్మ పుణ్యముచేత నీ కొక్కడికే కనబడినది.

ఇది విశ్వరూప ప్రదర్శనయోగ మనెడు
అయిదవ అధ్యాయము.

—*—

ఆనంద యోగము

అహంకారుడు పలుకుచున్నాడు.

మహాత్మా కలిపురుషా బ్రహ్మరుద్రాదులకైన తరముగాని నీ దివ్యరూపమును కన్నుల పండువుగా నాకు చూపించి యనుగ్రహించితివి. మనస్సు తెలుచుకొనుటకును నోరు వచించుటకును కన్నులు చూచుటకును దరముగాని నీ యసాధారణ విశ్వరూపమును జూడగలుగుటచే జరాచరభూతకోటిలో నే నొక్కడనే ధన్యుడను. నావంటి ధన్యులు లోకమున మరియొకరు లేరు. కాని యింకొక్క కోరిక నాకు గలదు. ఇట్టిచరాచరాత్మకుడవైన నిన్ను ఏయోగము చేత ధ్యానించి శాశ్వతసుఖమునుబడయవలయునో తెలియజేయవలయు నని ప్రార్థించుచున్నాను. ఆయోగము తెలిసినప్పుడె మీరిదివరకుప దేశించిన సమస్తయోగములయొక్కయు ఫలితార్థము కరతలామల

కమై యుండును. కావున దీనుడైన యీ శిష్యునియం, దనుగ్రహించి యట్టియోగము నానతీయవలయు.

కలిపురుషుఁడు చెప్పుచున్నాఁడు.

వత్సా! ప్రపంచ మున్నంతకాలము నీవు దీర్ఘాయుష్మంతుడవై వర్థిల్లుము. ఇదివరకు చాలమంది శిష్యులకు నేను ధర్మముల నుపదేశించితినిగాని నా ధర్మోపదేశములు చట్రాతినేలపై బడిన విత్తనములవలెనే వారియందు వ్యర్థములై నిష్ఫలములయ్యెను. ఇంక నీమనస్సో నా యుపదేశబీజములకు సారవంతమై పదునుగలిగినమంచి నేలవలె యున్నది. కావున నీమూలముగ నా మతము జగద్వ్యాప్తముకాగలదు. వినయము విధేయతగలిగి చెప్పినదానిలో లేనిపోని వంకలు కల్పింపక గ్రహించునట్టి శిష్యుడు దొరకుట గురువుయొక్క పూర్వపుణ్యవిశేషము. అందుచేత మంచిశిష్యుడవైన నీవు కోరిన వన్నియు నే నుపదేశించెదను. ఇప్పు డుపదేశింపుమని నీవు కోరిన యోగము, ఆనందయోగము. ఈయోగమును మించినది మరియొక యోగములేదు. తక్కిన యోగములన్నియు నిందులోని యంతర్భాగములనియె చెప్పవలెను. నేనే యీ ఆనంద స్వరూపుడను. ఈ ఆనందము నెవరు సంపూర్ణముగ ననుభవింతురో, వారు నాలో నైక్యమగుదురు. అప్పుడు నేనే వారు వారే నేను. ఈ యానందము గలవారు నాతో సాయుజ్యముక్తి ననుభవింతురు. ఇట్టిది నీ పూర్వపుణ్యవిశేషముచేత వినగలిగిన భాగ్య మబ్బినది. ఇదిగో చెప్పుచున్నాను. వినుము.

అహం—సావధానుడనై యున్నాను. మహాప్రసాదము.

కలి—ఆయుష్మంతుడా! ఈ యానందయోగము రెండు విధములు కలదు. అందు మొదటి దమృతానందయోగము రెండవది భోగానందయోగము. మొదట, అమృతానందయోగసిద్ధియైనవానికి భోగానందయోగసిద్ధి క్షణములో నగును.

అహం—స్వామీ! యీయమృత మెక్కడ దొరకును. ఈ యోగమునందు ప్రవేశించుటకు నామనసు తత్తరపడుచున్నది గనుక త్వరగా జెప్పవలెను

కలి—వినుటకు నీమనసెంత తొందర పడుచున్నదో చెప్పుటకు నామనసు నంత తత్తరపడుచున్నది. ఆయోగము తలచుకొన్నంత మాత్రముననె నానోరూరుచున్నది. ఈయమృతము ప్రతిష్ఠలమునను దొరకును. భూలోక కల్పవృక్షములైన తాడిచెట్లు ఈ యమృతము పుట్టదగినట్టి ముఖ్యస్థానములు ఇవిగాక యిప్పచెట్లు ద్రాక్షచెట్లు కొబ్బరిచెట్లు జీలుగుచెట్లు మొదలగు వాటిలోనుండికూడ నీయమృతము పుట్టును. మరియు నన్నమునుండి బెల్లమునుండికూడ ఈయమృతము సంభవించును. అహహా! ఆ యమృతమువంటి యమృతము లేదు. అది యొకలోట్టెడు కడుపులో పడినప్పుడు కలుగునట్టి యానందమును, ఆ వాల్మీకిగాడు కాని ఆ వ్యాసులుగాడు గాని వర్ణింప గలరా? అది స్మరణకు వచ్చినమాత్రముచేతనే అది నానోటిలో బడినట్లే నా శరీరము పులకరించుచున్నది. అది పచ్చిదే పుచ్చుకొనవచ్చును. అట్లుగాక ఒకవంట రెండువంటలుచేసి పుచ్చుకొన్నపక్షమున దాని మహిమ చెప్ప నలవిగాదు. రెండువంటలదే ప్రశస్తము అది లభించనినాడు ఒకవంటదైన మంచిది. అదీ చేకూరనివాడుపచ్చికల్లు సేవింపదగినది. అదీ దొరకనప్పుడు నల్లమందు మద్దతుమంచిది అదీ చిక్కనప్పుడొక డబ్బు గంజాయి శ్రేష్టము. ఖరీదునకుకొనియైన ఎరువు తెచ్చుకొనియైన యాచించియైన దొంగిలించియైన ఈయమృతమును కడుపులో బడవేసికొన్నవాడే ధన్యుడు వానిదేజన్మము ఇది రహస్యముగా బుచ్చుకొన్నవాడు నా కాప్తుడు. త్రాగి త్రాగి తప్పత్రాగి ఒడలెఱుగక దొరల్లి దొల్లి నడవలేక తూలితూలి పడి అడ్డము వచ్చినవారిని తిట్టితిట్టినవ్వి యేడ్చి సుఖ మనుభవించి

వాడు నాకు పరమాప్తుడు. జోడు సీసాలు చెరియొక చంకలో బెట్టుకొని వీధివెంట నిర్భయముగ వెళ్ళునట్టి విద్యావంతు లంతకంటె పరమాప్తులు. ఒకరు చూచుచున్నారని సందేహము. ఒక రనుకొనుచున్నారను భయములేక సిగ్గు బిడియము విడిచిపెట్టి నడివీధులలో కొలువుకూటములలో నీయానంద మనుభవించువాడు నా రెండవ ప్రాణము. ఈ యానందయోగము నిందించినవారికి ఒక గుక్కెడైనను జన్మమధ్యమందు బుచ్చుకొనని వారికి మహానరకములు గలుగును, ఈ యోగము సిద్ధించిన పక్షమున నరహత్య సులభము. చౌర్యము సులభము. ఆత్మహత్య సులభము. జీవహింస సులభము నింద సులభము వెయ్యేల యిదియే సర్వయోగములలో బ్రశస్తమయినది. ఇంక రెండవదియైన భోగానందయోగమును జెప్పుచున్నాను వినుము. పర భార్యనుగాని వేశ్యాంగననుగాని యుంచుకొని యానందము నొందుట భోగానందయోగము. భార్యనువిడిచి యింటివారి కన్నము పెట్టక గుఱ్ఱపుబండి యెక్కిగాని పల్లకి యెక్కిగాని జోడు కాగడాలు వేయించుకొని యుంచుకొన్నదాని యింటికి వెళ్ళినవాడు నాకు పరమభక్తుడు. అందునిమిత్తము భూము లమ్ముకొని పకీరైనవాడు నాకు పరమశిష్యుడు. ఈ సుఖసంబంధములైన వ్యాపారములలో జిక్కి త్వరగా శరీరము విడిచినవాడు పైకి చచ్చిపోయిన ట్లగుపడినను నిజముగా నాలో నైక్యమైనాడని తెలిసికొనవలెను. అతనికి పునర్జన్మములేదు. తార్పుకత్తెలు తార్పుకాండ్రు లోకములో గొంత నిందపడుచున్నను మరణానంతరమున మోక్షమున కర్హులై నాసమీపమున నుండి సాలోక్యముక్తి నందగలరు. ఈపైన చెప్పబడిన మహనీయులు చచ్చిపోయినప్పుడు వారి శవముల మోసిన వారికిగూడ కోటియజ్ఞఫలములు లభించును. అబుకారీ యిజారాదారుల నందరిని మరణానంతరమున నాశిష్యులు పూల

విమానములపై నెక్కించుకొని తీసికొనిపోనురు. వెయ్యేల కల్లు సారాయి గంజాయి మొదలయిన వ్యాపారములలో నెంతపని జేసినను ముక్తిదొరకును. దుకాణములమీద కూర్చుని కల్లు సారా గంజాయి మొదలయినవి అమ్మువారు ముందు జన్మములో మహారాజులకు కొడుకులు కూతుళ్లునై పుట్టి బంగారు తూగు టుయ్యాలలో ఊగు చుందురు.

ఇది కలిగీతా మహాశాస్త్రమందలి ఆనందయోగమను
ఆరవ అధ్యాయము

ధనయోగము

అహంకారుడు పలుకుచున్నాడు.

దేవా! మీరానతిచ్చిన యానందయోగము నామనస్సునకు మిక్కిలి నచ్చినది. ఇట్టియానందమును గలిగించుకొనుటకు ధనము ముఖ్యసాధనము. ధనమూల మిదం జగత్తని పెద్దలు చెప్పగా విను చుందును. అట్టి ధనము సంపాదింపబడినకాని ఆనందయోగము సిద్ధింపదు. ఆనందయోగము సిద్ధింపనిచో మీ యుపదేశములు సిద్ధింపవు. కాబట్టి ధనసంపాదనము ప్రధానమని నాబుద్ధికి దోచుచున్నది. కాబట్టి అది యెట్లు సంపాదింపవలయునో యానతీయవలయును.

కలిపురుషుడు చెప్పుచున్నాడు:—

వత్సా! నీవు నిజము బలికితివి. ఆనందధనయోగములు కవల పిల్లలవంటివి. ఒక కావిడిబింకెలవంటివి. ఒక కాడియెడ్లవంటివి ఒక తిరుగలిలోని రాళ్ళవంటివి. కాబట్టి ధనయోగము లేకుండ ఆనంద యోగముండుటకు వీలులేదు. వేదవ్యాసులు మొదలయిన లోకవంచ కులు కొందరు ధనాదులు లేకయే జ్ఞానమువల్ల నానందము కలుగునని

చెప్పుదురుకాని యది కేవలము దొంగమాట ఏలననగా ధనము చేతినిండ నున్నప్పుడే స్త్రీగాని కల్లు సారా మొదలయిన భోగ్య వస్తువులు గాని చేత జిక్కును. డబ్బులేనివాడు పరస్త్రీవర్జితుడని లోకములో నొకసామెత కలదు. ధనము లేకున్నచో నేభోగమును జరుగదు. భోగము లేనిచో నానందమే లేదు. వైరాగ్యమువల్ల శరీర మునకు మనస్సునకు బాధయేగాని యానంద మెప్పుడును గలుగ నేరదు. ఆనందమునకు మూలము ధనము. కావున దానివిషయమై చెప్పుచున్నాను వినుము.

అహం సావధానుడనై యున్నాను సెలవిండు.

కలి — ఆయుష్మంతుడా ! ఆకర్ణింపుము. ధనసంపాదనమున కనేకోపాయములు కలవు అవి వేయినోళ్ళుగల శేషుడైనను వ్రాయు చ్చుటకు దరముగాదు. శ్రమపడి సంపాదించువారు కొందరు శ్రమపడ కుండ సంపాదించువారు కొందరు. శరీరకష్టములబడి న్యాయముగ ధనము సంపాదింపవలయునని బాధలు పడునటువంటి నిర్భాగ్యుల బ్రతుకెప్పుడును కష్టపుబ్రతుకే. సాధారణముగ ఎక్కడనో వేయి కొక్కడు గాని వృద్ధిపొందడు. దారులుగొట్టి రాత్రులు ప్రాణములకు తెగించి కన్నమువేసి శ్రమపడి ధనము సంపాదింపవచ్చును. ఇది అపాయముతోగూడిన యుపాయము. ఇది సుకుమారులకు పనికిరాదు. సుకుమారులైనవారు, ఇటువంటి మోటవారితో స్నేహముచేసి వారి కుపాయముచెప్పి కన్నములు వేయించి దారులుకొట్టించి వారు తెచ్చినధనమంతయు దాము పుచ్చుకొని వాళ్ళకు త్రాగుటకు నుదర పోషణమునకు గావలసిన డబ్బిచ్చి వాళ్ళ కపాయము వచ్చినప్పుడు తామే డబ్బు కర్చుపెట్టి కాపాడి ధనము సంపాదించుట యుత్తమ మైన మార్గము అట్టివారు మేడలు మిద్దెలు కట్టుకొని మురుగులు మురిడీగొలుసులు పెట్టుకొని తెల్లదుస్తుల ధరించి పెద్దమనుష్యులవలె

నుందురు గనుక వారిమీద నెవ్వరు ననుమానపడరు. ఇది శ్రమపడకుండ సంపాదించు విధములలో నొకటి. శ్రమ లేకుండ సంపాదించు విధములు మరికొన్ని గలవు. అందు జూదమాడుట మొదటిది. ఇందులో శ్రమయే లేదు కాని పందె మొడ్డుటకు సొమ్ము లేనప్పుడు కొంచెము దొంగతనముమాత్ర మప్పుడప్పుడు చేయవలెను. అది యొక్కటియే కష్టమైనది ఇందులో బాగుపడిన నాశిష్యు లనేకులు కలరు. ఇంతకంటె పెద్దమనిషితరహా జూద మింకొకటి యున్నది. పెద్దమనుషులు మేడలమీద కూర్చుండి తలుపులు బిగించి చీట్లపేక తెప్పించి రూపాయలు కాసులు పందెముల పెట్టి ఒక్కొకరాత్రి వందలకొలది రూపాల సంపాదింపవచ్చును. తెల్లవారినతరువాత వారందరు పెద్దమనుష్యులవలె నుందురు. కావున రాజభటులు వారిని పట్టుకొనజాలరు. పట్టుకోదలచినను, ఇతరోపాయములచేత నా బాధ వారు నివారించుకొందురు. ఇదిగాక ఉద్యోగములో నున్నవారు లంచములు పుచ్చుకొనుట మరియొక యుపాయము. ఇందులో తెలివిగా పనిచేసికొన్నపక్షమున ఉద్యోగము కల్పవృక్షము కామధేనువు వెయ్యేల లంచము తెలివిగా పుచ్చుకొనన నేర్చినవారికి. ఉద్యోగమ రూపాయల చెట్టు. లంచములుపుచ్చుకొనువారికిమధ్యవర్తిగానుండి, అ దులో రుసుములు కొట్టుట మరియొక విధము. దొంగ భీమాకంపెనీలు, ప్రావిడెంటుకంపెనీలు పెట్టి యింటిలో గోనెసంచెడు రూపాయలు వేసికొనుట యుత్తమపక్షము. వర్తకములుచేసి నేతిలో అరటిపళ్ళు కొవ్వు; కిరసనాయలులో నీళ్లుకలిపి బస్తాలకు చిల్లులు పొడిచి కొంతసరకు తీసికొని తప్పుతూనికలు తూచి తప్పుకొలతలు కొలిచి దొంగపద్దువ్రాసి చెడ్డసరుకులు మంచిసరకులని చెప్పి యిచ్చి ధనము సంపాదించి పిమ్మట విరివిగా వ్యాపారములుచేసి అప్పులు తెచ్చి, ఆస్తి భార్యపేర బావమరదులపేర వ్రాయించి నగలుదిట్టముగా చేయించి తుదకు కాళ్లు చాపుకొని దివాలాతీయుట మరియొక

మంచిపద్ధతి ఇదిగాక గుళ్ళు గోపురములు కట్టింతుమని సత్రములు వేయింతుమని వివాహములు వడుగులు చేసుకొందుమని యాచనవల్ల ధనము సంపాదించుట శ్రమలేని యుపాయములలో మొట్టమొదటిది. లకోటా ప్రశ్నలు చెప్పుట కేరళవిద్య ప్రయోగించుట. భూతవైద్యము నేర్చికొనుట, సోదె చెప్పుట, మంత్రపువిభూతి పెట్టుట, మొదలయినవి కూడ నాప్రియశిష్యు లాచరించవలసిన ధనార్జనోపాయము లే. చెల్లుబడి యున్నపక్షమున నిరుగుపొరుగుననున్నవారి యిల్లు భూమి క్రమక్రమముగ కలుపుకొనుట మంచిది. ఆడపిల్లల నమ్ముకొని మగపిల్లల నమ్ముకొని ధనము చేర్చుట శ్రేష్ఠమైన పనులలో నొకటి. సొమ్ము వడ్డీకిచ్చి వడ్డీలకు వడ్డీకట్టి ఋణస్థుని తేలనియ్యకుండా చేసి కొంపలు గోడలు నమ్మించి ధనమార్జించుట మిక్కిలి సౌఖ్యమైన యుపాయము. సన్యసించి పీఠము లెక్కి శుద్ధపత్రికలు కొన్ని అశుద్ధపత్రికలు కొన్ని తనపక్కనుంచుకొని కారణము లేకున్నను మనుష్యులను వెలివేసి వందలకొలది ధనము వారివద్దనుండిలాగి పూర్వాశ్రమమందలి కొడుకులకు మేడలు కట్టించి భూములు కొని బాగుచేయుట శిష్టాచారసమ్మతమైన పని. దీనివంటిది మరియొకటి లేదు. ఏదైనను కష్టపడకుండ సంపాదించుట నాకు మిక్కిలి యిష్టము. ధనార్జనమునకు నింక ననేకోపాయములు కలవుగాని యవి నీవే యూహించుకొనవచ్చును.

అహం—దేవా! ఈయుపాయములన్నియు మిక్కిలి ప్రశస్తములైనవి. ఈప్రకారము నడచుకొని జనులు బాగుపడిపరమగురులైన మీకు భక్తులై యుందురని నమ్ముచున్నాను.

ఇది కలిగీతాశాస్త్రమునందు ధనయోగమను
ఏడవయధ్యాయము.

శ్రార్ధ యోగము.

అహంకారుడు పలుకుచున్నాడు.

స్వామీ మీరుపదేశించిన ధనయోగము నామనస్సునకు మహానందమును గలిగించినది. మీరుచెప్పిన యుపాయము లన్నియుమిక్కిలి మంచివి. ధనార్జనమునకుసాధనమైనవి. ఈయుపాయముల నెఱిగినవారికి ధనమునకు లోపముండదు. ఇటీవల కర్మకాండలనుగురించి నాకు గల సందేహములను దీర్చవలయును చిరకాలమునుండి నాకుకలియుగములో మనుష్యులు శ్రాద్ధాదికర్మలేవిధముగ నెరపవలయునో ఆ విధానమునుగూర్చి నాకు మనస్సులో సందేహములుగలవు. ఆశంకానివృత్తిమీవలన గావలయును.

కలిపురుషుడు — వత్సా నీవు చక్కగా నడిగితివి. శ్రాద్ధయోగమునుగురించి నీకువివరముగా జెప్పవలయునని నామనసులో కుతూహలముగలదు. దానికితోడుగ నీకునువినవలెనను కుతూహలముకలిగినది. ఇదిగో ఉపన్యసించుచున్నాడను. సావధానుడవై వినుము.

అహం — మనస్సు భక్తిశ్రద్ధలతో గూడియున్నది సెలవిండు.

కలి — వత్సా ఈయోగము మిక్కిలి ప్రధానమైనది. ఏలయన ప్రపంచమంతయు శ్రాద్ధములతో సేయున్నది. శ్రద్ధగా చేయబడినది శ్రాద్ధము. లోకములో ప్రస్తుతము పితృదేవతలకు చేయునదియే శ్రార్ధమని చెప్పుకొనుచున్నారు అదిసరిగాదు. దేవతలు పితృదేవతలు గ్రామదేవతలుగాక కలియుగములో మరియొకరకము దేవతలున్నారు. వారెవ్వరనగా అధికారి దేవతలు. వీరిశక్తి వీరిప్రభావము మిగతా దేవతల ప్రభావముకంటెను చాలగొప్పది. శ్రాద్ధముపెట్టకపోయినచో పితృదేవతలుమనజోలికి సాధారణముగారారు గ్రామదేవ

తలు గూడ నీదినములలో ప్రజలజోలికి వచ్చుటలేదు. కాని అధికారి దేవతలు సరిగా శ్రాద్ధమును తమకు మనుష్యులు పెట్టనిపక్షమున వారిపైబడి వారిని నాశనము చేయుదురు అందుచేత జనులయొక్క క్షేమమునకు శ్రాద్ధయోగము మిక్కిలి ముఖ్యమైనదని చెప్పినాను. అందుచేత నావిధానమంతయు నిక్కడ చెప్పుచున్నాను. సావధానుడవై వినుము. పితృదేవతల శ్రాద్ధములను పుత్రుడుగాని జ్ఞాతులుగాని బంధువులు గాని జేయవలయును. అధికారిదేవతలకు అట్టిబంధువులు శ్రాద్ధములు చేయనక్కరలేదు ఈ శ్రాద్ధములు పైయుద్యోగస్థునకు క్రింద యుద్యోగస్థుడు చేయుచుండవలెను. క్రింది యుద్యోగస్థుడు మారిపోయినను చచ్చిపోయినను అతని అధికారము వహించి యా స్థలము నాక్రమించుకొనువానియందీకర్తవ్యము సంక్రమించును. కాబట్టి ఇందులో కర్త నష్టము లేదు. పైయధికారులకు గూడ వారు మారిపోయినప్పుడు చనిపోయినప్పుడు వారి స్థాన మాయుద్యోగము లాక్రమించికొనిన వారియందు సంక్రమించును గనుక పిండచ్ఛేద మెప్పుడునుండదు. ఈ శ్రాద్ధములలో దర్భలుతిలగింజలుతడిబియ్యము అక్కరలేదు ఈ శ్రాద్ధములు మూడు విధములు. హిరణ్యశ్రాద్ధము, అన్నశ్రాద్ధము, ఆమశ్రాద్ధము పితృదేవతల కిచ్చునట్టి శ్రాద్ధములు గూడ నిట్లే మూడువిధములుగ నున్నవి. కాని యవి యిట్టివి కావు. ఒక యధికారికి వానికి లోబడిన క్రింది యుద్యోగస్థుడు గాని, అతని వలన నుపకారము నపేక్షించువారుకాని అతనివలన నపకారము రాకుండ జేసికొనువారుకాని ఆయన యనుగ్రహామునిమిత్తము ధన-రూపకముగ చేయు శ్రాద్ధము హిరణ్యశ్రాద్ధమనబడును. పితృదేవతా శ్రాద్ధములు పగలే జరుపవలయును. ఈ శ్రాద్ధము రాత్రిజరుగవలెను. పితృదేవతల హిరణ్య శ్రాద్ధములు సాధారణముగ పుష్కరములు మొదలగు పర్వదినములలో నదులయొడ్డున జరుగుచునే యుండ వచ్చును. పితృదేవతా శ్రాద్ధములలో పితృదేవతలు వచ్చి స్వయముగా శ్రాద్ధముల గ్రహింపరు. ఈ శ్రాద్ధములో అధికారి దేవతలు వచ్చి స్వయముగా హిరణ్య శ్రాద్ధములను గ్రహి

త్రము లక్కర లేదు. ఈ దేవతలకు శ్రాద్ధములు స్వయముగా జేయవచ్చును. ఒకప్పుడు రాయబారులమూలముగా జేయవచ్చును. పితృదేవతా శ్రాద్ధములలో నింటికి బ్రాహ్మణులను పిలిచి పెట్టునది, అన్నశ్రాద్ధ మనబడును. అధికారి దేవతలకు గూడ అన్నశ్రాద్ధవిధానము కలదు. హిరణ్య శ్రాద్ధమువల్ల కొంతవరకు తృప్తిచేసి అధికారులు గ్రామముమీద తనిఖీకి బయలుదేరునప్పుడు తాబేదారులు వారికి గారెలు, అరెసలు, అప్పములు, క్షీరాన్నము మొదలైన పిండివంటలతో, అన్నశ్రాద్ధముచేసి వారిని తృప్తులుగ జేయవలెను. ఇందువల్ల అధికారి దేవతలు సంపూర్ణముగా తృప్తినొంది ప్రసన్నులగుదురు. ఈ శ్రాద్ధములు వారు దర్శన మిచ్చినపుడెల్ల జరుపుచుండవలయును. ఇదియే అన్నశ్రాద్ధవిధానము. ఇక ఆమశ్రాద్ధ విధానమును గురించి చెప్పెద వినుము. అన్నశ్రాద్ధమును చేయుటకు వీలులేనప్పుడు పితృదేవతలకు సయితము ఆమశ్రాద్ధము చేయుచుందురు. అనగా బియ్యము పప్పు ఉప్పు మొదలైన సరకులతో నిండిన పాత్రలు బ్రాహ్మణులు కాపులు గూడ నిచ్చెదరు. అధికారి దేవతలకు గూడ నీవిధముగానే ఆమశ్రాద్ధము చేయవలసియుండును ఈ శ్రాద్ధములు హిందువులకేగాక అధికారము వహించిన యితరమతస్థులలో గూడ కొందరికి చేయవలసియుండును. అనగా అధికారి తమ గ్రామమునకు వచ్చినప్పుడా గ్రామవాసులు వారికి గావలసిన బియ్యము పప్పు, ఉప్పు. నెయ్యి, పాలు, పెరుగు మేకలు కోళ్ళు మొదలైన సమస్తవస్తువులు పంపవలయును. ఈపాత్రల్లు వారు స్వయముగానే గ్రహించి శ్రాద్ధములచేసినవారిపైన గ్రహింతురు. ఈవిధముగా కలియుగములో నధికారి దేవతా శ్రాద్ధమును కాలాతీతము గాకుండ సమయానుక్రమణికగ చేసిన మనుష్యుడు, ఐశ్వర్యము గలిగి తానే చెడ్డపని చేసిన చెల్లుబడి కలిగి పన్నులు తక్కువ కట్టించుకొని ఇతరులను యిష్టమువచ్చినట్లు బాధపెట్టి హాయిగా సుఖింపవచ్చును.

ఇది కలిగీతాశాస్త్రమునందు శ్రాద్ధయోగమను

ఎనిమిదవ అధ్యాయము.

వర్ణాశ్రమ ధర్మ యోగము

అహంకారుడు—స్వామీ! మీ యనుగ్రహమువలన నేను అనగత శ్రాద్ధమోగుడనయితిని. అయినను నాకింతటితో తృప్తిలేదు సర్వజ్ఞతగల మీచేత మరికొన్ని యితరధర్మములను శ్రవణానందకరముగ వినగోరుచున్నాడను. బహుశంకలచేత బాధపడుచున్న యీ దీనునియం దనుగ్రహించి అధర్మములనుగూడ దెలుపవేడెదను.

కలిపురుషుడు—ఆయుష్మంతుడా శంకలచేత పీడింపఁబడెడు నాశిష్యకోటికిని శంకానివృత్తులవలన నుద్ధరించుటకే నేనవతారమెత్తితిని, కాబట్టి నీవుసందేహింపక నీశంకలనెల్ల నివారించుకొనుము. మీ శంకానివారణమే నాకు పరమానందముకదా.

అహం - అట్లయిన దేవా! ఇదిగోఅడుగుచున్నాను. వినుము వర్ణభేదముండవలసినదా? వర్ణములెన్ని అవి యెవరుచేసిరి?

కలి—ఉండవలసినదే. ఈవర్ణభేదమును నేనేకల్పించితిని. అవి మొదట నాలుగు ఇప్పుడు నాలుగులక్షలున్నవి.

అహం—నీవా! యీభేధములు జేసినవాడవు. బ్రహ్మచేసెనని లోకులు చెప్పుచున్నారే.

కలి—బ్రహ్మగాదు. వర్ణభేధము పెట్టినవాడను నేనే. వర్ణభేధము వలనగాని యైకమత్యము చెడిపోదు. ఐకమత్యము చెడనియెడల నేను తలచుకొన్నపనిగాదు.

అహం—అట్లయిన మొదట నాలుగువర్ణముల జేసితివిగదా. అంతతో తృప్తిపొందక నాలుగులక్షలవర్ణము లేలచేయవలెను?

కలి—మొదట నాలిగింటితోనే నేనుచేయదలచుకొన్న నా ఘనకార్యము సంపూర్ణమగునని తలంచుకొంటినిగాని యంతత్వరగా

నాతలంపు నెఱవేఱునందున ఒక్కొక్క వర్ణములలోనుండి వందల కొలది వేలకొలది శాఖలను బుట్టించితిని. కొందరు కొందరు మూర్ఖులలో నేను ప్రవేశించి వారిచేత జగల నిన్ని తెగలుగ విడతీయించితిని. దేశముచేతను భాషచేతను ఆచారవ్యవహారముల చేతను మతము చేతను, శాఖలచేతను తెగలచేతను ఇప్పుడు జనులు యెన్ని విధములుగా విభాగింపబడి నాశిష్యులైయున్నారో చూడుము.

అహం—ఇంతటితో జాలునా, ఇంకను భేదముచేయదలచు కొన్నావా?

కలి—ప్రస్తుతమిదిచాలును. నాపనిదీనితో మిక్కిలి ప్రశస్తముగ జరుగుచున్నది. అవసరమైనపక్షమున నింకను ముందుముందు బహుశాఖలను సృష్టింపదలచుకొని యున్నాడను, చూడు. నాసంకల్పము. ఎంతత్వ స్త్వకరముగ నెరవేఱుచున్నదో. బ్రాహ్మణులలో వైదికి గొప్పయుద్యోగములోనున్న పక్షమున తక్కిన బ్రాహ్మణులను, అనగా మధ్వవైష్ణవనియోగులను శూద్రాదులనతలగ ద్రొక్కటకు ప్రయత్నముచేసి వారికొంపదీయును. నియోగి ఆ పదవిలోనికివచ్చిన పక్షమున వైదికులు మొదలగువారి పని నేలరాచును. మధ్వుడువచ్చిన పక్షమున తక్కిన బ్రాహ్మణులను మూలద్రోచును. వైష్ణవుడు వచ్చినపక్షమున తదితర విప్రులనుపట్టి పల్లార్చును. శూద్రుడు ఆస్థానమున ప్రవేశించినపక్షమున బ్రాహ్మణులకందరకు పరిహాసకారము చేయును. తురక ఆ పదవిని పొందినపక్షమున హిందువులనందర ముంపతెంపును. ఈవిధముగా వర్ణభేదము మనుస్మృతిలో లేదు. ఇండ్లలో లేదు. గ్రామములలో లేదు. కాని కచేరీలలోమాత్రమున్నది. పాపము వర్ణభేదమును దేవత చాలకాలమునుండి మతసంస్కర్తలు సంఘసంస్కర్తలు దేశమునుండి తరుముటకై ప్రయత్నించుటచేత వారిదెబ్బలు తినలేక భయపడి, ఆయుధపాణులైన భటులెప్పుడుకాచుకొని యుండురు

గదాయని తలచి కచేరీలలో కాలూది నిలిచి హాయిగ గుండెమీద చేయివైచికొని సుఖించుచున్నది. ఆనాటికానాడు దానికిదగిన యాదరణముగూడ జరుగుచున్నది. ఈదేవత యీ కచేరీలలో శాశ్వతముగ వర్ధిల్లుగాక సురక్షితముగ నుండుగాక! నాప్రజ్ఞావిశేషముచేత వర్ణభేద మింతమాత్రముతో సమాప్తము నందలేదు. ఇది ఖండాంతరములయందు గూడ వ్యాపించియున్నది మనుష్యులలో నల్లవారికి పచ్చవారికి, నల్లవారికి, తెల్లవారికి తెల్లవారికీ, పచ్చవారికి, వర్ణభేదముల చేత బహువిధములైనయంతః కలహములు గలుగుచున్నవి ఇదియంతయు వర్ణభేదముయొక్క మహాత్మ్యమే. ఇదియెప్పుడు నాకు కనులు పండువుగానుండునో చెప్పెదవినుము. జనులందరు ఇంకను పలు తెగలుక్రింద భాగింపబడి ఒకరిమొగమొకరు చూచుకొనకుండా ఒకరిచేతియన్న మొకరు తినక ఒకరిచేతినీళ్ళొకరు స్పృశియింపక ఒకరునడిచిన దారిని మరియొకరు నడువక నడుమనడుమ కఠినములైన వాగ్వాదము జేసికొనుచు తరువాత బుఱ్ఱలుపగుల గొట్టుకొనుచు కొంపలు తగులబెట్టుకొనుచు హత్యలు చేసికొనుచు నున్నపక్షమున నేనపరిమితానందభరితుడనై యుండును. జనులిట్లు కావలయుననియే నేను సకల ప్రయత్నముల జేయుచున్నాడను. కొంతవరకీ ప్రయత్నముకూడ ఫలించినది. ఏలననగా పలుతావులలో తురకలు హిందువులు నేను పైనజెప్పినట్లు నడచుకొనుచున్నారు. తెనుగుదేశమందలి బ్రాహ్మణులలోగూడ నవీనముగ నిట్టికక్షలు బయలుదేరుచున్నవి. ఇదినాకు సంక్రాంతిపండుగ. ఈపద్ధతులు నాకిష్టము. ఈపద్ధతులు వేయేండ్లువర్ధిల్లుగాక!

ఇది కలిగీతాశాస్త్రమునందు

తొమ్మిదవయధ్యాయము

—o—

పిశాచయోగము

అహంకారుడు—దేవా! మహానుభావా! పర్జాశ్రమధర్మ యోగము అమృతమువలె నాకు శ్రవణానందము గలుగజేసినది. చాలవరకు నాకు గలసందేహములు తీరినవి. ఇంక స్వల్పవిషయములలో మాత్రమే నాకు సందేహములున్నవి. దేవరవారివంటి పరమగురువులు నాకు ఈ జన్మమునందు దొరకరు సరేగదా ఇకముందు సహస్రజన్మములకైనను లభింపరు కాబట్టి దీపముండగానే యిల్లు చక్కబెట్టుకొనవలెనన్న పెద్దలమాటలనుబట్టి మీవంటిపెద్దలు సాక్షాత్కరించి యున్నపుడె ధర్మసందేహములన్నియు దీర్చికొనవలెను. తరుణముదాటిపోయిన తరువాత విచారించిన కార్యమేముండును. కాబట్టి నేనొకచిన్నసందేహము నడుగుచున్నాను. అనుగ్రహించి చెప్పవలయును.

కలి—వత్సా నావంటి గురువు దొరకుట నీ కెంతదుర్లభమో వినయ విధేయతాది సద్గుణములుగల నీవంటి యుత్తమ శిష్యుడు నాకు దొరకుటయు నంతిదుర్లభమే. కాబట్టి మనమిద్దరము పూర్వజన్మమందు జేసికొన్న పుణ్యమునుబట్టియే మన మిట్లు గురుశిష్యులమైతిమి. కాబట్టి నీ సందేహములదీర్చుటకు సిద్ధముగ నున్నాను. అడుగ దలచిన వేమియో యడుగుము.

అహం—స్వామీ! మహాప్రసాదము ఇదిగో మనవి చేయుచున్నాను వినుండు. పూర్వకాలమునందు ప్రతి గ్రామమందును ప్రతి గృహమునందును పిశాచములు విశేషముగ గనబడుచు వచ్చినవని మన పెద్దలవలనను గొన్ని పుస్తకములవలనను వినుచుందుము. అదియేమొకాని యీదినములలో ఆపిశాచములు బొత్తిగా గనబడుటయే లేదు. ఆపిశాచములేమైనవి? ముక్తిపొందినవా? నాశనమైనవా? జన్మాంతరమ నందినవా? ఈ సందేహము తీర్పవలయు.

కలి—వత్సా! ఎంత వెఱ్ఱివాడవు. పిశాచములకు ముక్తి యెన్నడును లేదు. నాశన మంతకన్నను లేదు. అవి జన్మాంతరమును బొందబట్టి మీకు విశేషముగ గనపడుట లేదు.

అహం—ఏమి? జన్మాంతరమందినవా? అట్లయిన నిప్పు డేరూపముతో భూలోకములో నున్నవో చెప్పవలయును. ఈసంగతి వినుటకు నామనస్సు మిక్కిలి తత్తరపడుచున్నది.

కలి—ఇదిగో జెప్పుచున్నాను. మన దేశములో ఈ మధ్య రమారమి నూరు సంవత్సరములనుండి హూణసరస్వతియని యొకా నొక దేవత యిక్కడ ప్రవేశించి తిరుగుచున్నది ఆమెవద్ద గొప్ప గొప్ప మంత్రశక్తులున్నవి. ఆ మంత్ర ప్రభావముచేత పిశాచము లన్నియు నా దేవతకు జంకి మన దేశములో వెనుకటి రూపములతో నిలువలేక ఆత్మహత్య జేసికొని జన్మాంతరమునొంది మారు వేషములతో లోకములో తిరుగుచున్నది. ఈ మారువేషముతో నుండుటబట్టి యవి వెనుకటి పిశాచములేయని యానవాలు పట్టుట గ్రహించుట మిక్కిలి కష్టముగానున్నది. జన్మాంతరమెత్తిన యీ పిశాచములకంటె అసలు పిశాచములే మిక్కిలి మంచివని తోచుచున్నది. ఏలయనగా అసలు పిశాచములు మంత్రవేత్తలకు భయపడుచువచ్చినవి. ఈపిశాచములకట్టిభయము లేదు. పాతపిశాచములు కొంత కుంభముపెట్టి దిగతుడుపు పెట్టిన పక్షమున తృప్తి పొంది వదిలిపెట్టి వెళ్ళిపోవుచుండెడివి. ఇప్పటి దయ్యముల కెన్నడు తృప్తియే లేదు. వెనుకటి దయ్యములు ముంతపొగ మొదలయినవాటికి మంత్రవిభూతికి బెదిరిపోయెడివి. ఇప్పటివాటికి బెదురు లేదు. అప్పటి పిశాచములు మనుష్యుని త్వరగా జంపుకొనిపోయెడివి. ఇప్పటివి మనుష్యుల చావనియ్యవు. సరిగా బ్రతుకనియ్యవు. పూర్వపు పిశాచములు వల్లకాళ్ళలోను మందబయళ్ళలోను పాడుకొంపలలోను దొడ్ల

లోను చెట్లమీదను వాసము చేయుచువచ్చినవి. ఈ నాటి పిశాచములు చక్కగా కొంపలుగట్టుకొని కాపురములు సేయుచున్నవి. పూర్వపుదయ్యములకు నోళ్ళుచిన్నవి. కడుపులు పెద్దవి ఇప్పటివాటికి కడుపులు పెద్దవే. నోళ్లూపెద్దవే. ఆ పిశాచములకు మడిమలు ముందుకు పాదములు వెనుకకు నుండుననియు నందు చేత వంకర నడకలు నడచుననియు జెప్పుదురు. ఇప్పటివాటికి పాదములు సరిగానే యుండునుగాని యెందుచేతనో తప్పునడకలు వంకరనడకలువాటికంటె నెక్కుడుగనున్నవి. ఆపిశాచములకు సంతానవృద్ధి లేదు. ఈపిశాచములకు సంతానవృద్ధిగూడగలదు. ఆ పిశాచములు మనుష్యుడు ఒంటిగా వెళ్ళినపుడె బాధపెట్టును. ఈ పిశాచములో మనుష్యుడు నూరు మందిలో కలిసియున్నను పీక్కుతిని బాధపెట్టును. వాటిని మారణహోమము చేయవచ్చును వీటినిట్లు చేయుటకు వీలులేదు. కాబట్టి క్రొత్తయుపతాంరములెత్తిన యీనాటి పిశాచములు పైకి మామూలు మనుష్యులవలె సాధువులుగ గనబడుచున్నను, వెనుకటి వాటికంటె లోకమున కెక్కుడు బాధకరములై యున్నవి. ఈ నాటి యీపిశాచములు నాలుగు విధములు. ఇందు మొదటివి గురుపిశాచములు. ఇవి గురువులమని పేరుపెట్టుకొని తలలు గొరిగించుకొని కాషాయ వస్త్రములను గట్టుకొని పీఠములెక్కి శిష్యులైన మందభాగ్యులలో నేరను లేనివారిని వెలివేసి నేరములున్నవారిని హిరణ్యశ్రాద్ధములు పుచ్చుకొని వదలివేసి పాదపూజలని పేరుపెట్టి భిక్షలని పేరుపెట్టి వందల కొలది ధనములాగి సంసారములను దిబ్బచేసి మనుష్యులను పీక్కుతినుచున్నవి. రెండవవి అధికార పిశాచములు. ఈ పిశాచములబాధనుభవించుచున్నారు. గనుక నీకు విస్తరించి చెప్పనక్కరలేదు. మూడవవి యాచక పిశాచములు ఈ పిశాచములసంగతి చెప్పుటకనేక సంవత్సరములు పట్టును. వ్రాసినచో భారత రామాయణముల

వంటి పెద్దగ్రంథములగును. ఈపిశాచములు నిజముగా మనుష్యులను నిలువబెట్టి రక్తమును పీల్చివేయుచున్నవి. ఈపిశాచములు ఆవహించిన పక్షమున మనుష్యునకు మాటతోచదు పనితోచదు. మనసు మనసులో నుండదు. అన్నివృత్తులలో యాచకవృత్తియే యుత్తమోత్తమని యీపిశాచములు నానాటికి వృద్ధియగుచున్నవి. ఈ పిశాచములతాలూకు దగ్గరచుట్టమొకటిగలదు. దానిపేరు మొగమాటము. అదివచ్చిముందుగా మనుష్యుల నావహించును. ఆ తరువాత యాచకపిశాచములువచ్చి మనుష్యులను పీకనారంభించును. వాటి తాలూకు చుట్టము ముందుగావచ్చి యావహించుటచేత మనుష్యుడు వెంటనే యీపిశాచములకు లోబడిపోవును. గుళ్ళు గోపురములు కట్టింతుమని ధ్వజస్తంభము లెత్తింతుమని సత్రములు వేయించుచున్నామని దేవుళ్ళకు మ్రొక్కుచున్నామని వంకలుపెట్టి యీపిశాచములు బయలుదేరును. వీటికి కుంభములతో తృప్తిలేదు. దిగదుడుపులలో తనివిలేదు. ఇచ్చినను తంటా ఇవ్వకున్నను తంటా. పిశాచములను వదల్చుకొనుటకు కొత్తమంత్రగాళ్లు కావలెను. నాలుగవవి అల్లుడు పిశాచములు ఇవికట్నములపేరుపెట్టి అత్తవారికొంపలు గుల్లచేసి వివాహములైనతరువాత గాదిక్రింద పందికొక్కులవలెచేరి అత్తవారియింట చెడతిని అత్తమామలను యావజ్జీవముపీల్చి పిప్పిచేసిబాధపెట్టుచుండును. ఈపిశాచములన్నిటికి మునుపటిమంతపొగలు మొదలయినవి పనికిరావు. అహంకారుడా? ఈపిశాచములన్నియు మన శిష్యకోటిలో జేరినవిగనుక వీటికి మరియొక హాని చేయకూడదు.

అహం—చిత్తము దేవా. ఈయోగము చాలాబాగున్నది

ఇది కలిగీతా మహాశాస్త్రమునందు

పిశాచయోగమను

పదవ యధ్యాయము

—♦—

సాయుజ్య యోగము

అహంకారుడు — భగవంతుడా! ఈవరకు బహుయోగములు తమముఖమున విని జంగమస్థావర రూపకములగు సకలభూతకోటిలో నేనగ్రగణ్యుడనైతిని జన్మఫలించె. ఇప్పుడు మనసునకొక క్రొత్త సంశయము పుట్టినది. మీరు మహానుభావులరు మీమహిమ నపారము. ఈతోలుకన్నులతో మిమ్ము నెవ్వరును జూడలేరు. మీరుతల వెంట్రుకకంటెను సన్నముగాను చోడిగింజకంటెను సూక్ష్మముగాను రూపములు ధరించి సకలజంతుకోటి హృదయములలోను నివాసము చేయుదురు. మీరు వాచామగోచరులు. వెయ్యేల మీమహిమ చెప్పరానిది. మీరు చెప్పరానివారు. ఇందుచేత మీరందరి కన్నులకు గనబడరు. కాబట్టి యేరూపకముగా మిమ్ములను లోకులు పూజసేయవలెనో మాకు దెలియజేయవలయును. పూజావిధానము తెలియకపోయినచో మాభక్తియంతయు వ్యర్థమైనదగును.

కలి — ఆయుష్మంతుడా! అహంకారుడా! ఈప్రశ్న నడిగి నీవు తెలివిగల పనిచేసితివి. భక్తియంతయు చేయునట్టి యర్చనములో నేయున్నది. కాబట్టి ప్రతిమనుష్యుడు పూజావిధానములో జాగరూకుడై యుండవలెను. ఈవిషయమై నీకు నేను పరమోపదేశము చేసెదను. అన్నియోగములలో నిది మిక్కిలి యుత్తమోత్తమమైన యోగము. ముక్తి వచ్చినను రాకపోయినను దీనివలననే గనుక యీ విషయమై నీవు మిగుల సావధానుడనై యుండవలెను.

అహం — ఆవిధముగానే యున్నాను. ఇప్పుడు మనస్సులో రెండవతలంపు లేదు. మీయుపదేశము నీసమయములో జేసినపక్షమున అచ్చుపడినట్లు నామనస్సులో బడిపోవును. కాబట్టి సత్వరము జెప్పవలయును.

కలి—ఇదిగో చెప్పుచున్నాను ఆకర్ణింపుము.

అహం—దైవ మొక్కడా? అనేకులా?

కలి—దైవ మొక్కడే. ఆదైవమును నేనే.

అహం—ఇతర దేవత లున్నారా లేరా?

కలి—ఉన్నారు.

అహం—వారిని పూజించవలసినదా లేదా?

కలి—కొందరిని పూజింపవచ్చును. కొందరిని పూజింపగూడదు.

అహం—ఎవరిని పూజింపవచ్చును. ఎవరిని పూజింపగూడదు. ఆసంగతి చెప్పవలెను?

కలి—అదే నేనును జెప్పదలచుకొన్నాడను. వినుము. ఈ మనుష్యులు పూజ సేయునట్టి దేవతలు చాలవరకు నాకు లోబడిన దేవతలే. కాబట్టి వారికి జేసిన పూజలన్నియు నాకే ముట్టుచుండును. ప్రతిగ్రామమందు ప్రతిపట్టణమందు ఊరుబైట వెలసియుండునట్టి గ్రామదేవతను నేనే. నేను నామాయచేత స్త్రీజన్మము పురుష జన్మముగూడ, ఎత్తగలను. అమ్మవారలని పేరుపడియున్న యీ గ్రామదేవత లన్నియు నా యవతారములే. వాటికి జరుగునట్టి పూజలు జాతరులు, ఉత్సవములు నాకు మిక్కిలి యిష్టములు. ఆ దేవతలకు బలినిమిత్తమై మేకలను దెచ్చి కట్టిపెట్టినపుడు నాసంతోషము జెప్ప నలవిగాదు. అవి మరణభీతిచేత, అరచుచున్న ధ్వని నా చెవులకు పండుగగా నుండును. ఆ మేకల జంపిన రక్తము భూమిమీద ప్రవహించినప్పుడు భూదేవిమీద వసంతము గొట్టినట్లు నామనస్సు సంతోషించును. జాతరలలో బండి వశికఱ్ఱలకు బ్రతికియున్న పంది పిల్లల గ్రుచ్చి అమ్మవారి నూరేగించునపుడు, ఆ పందిపిల్లలు మొఱ్ఱోయని బాధపడలేక యేడ్చిన యేడ్పులు నాచెవులకు వీణాగానములై వినబడుచుండును. ఆయుత్సవములో దిరుగు ప్రతిమనుష్యునకప్పుడు నేనే పూనియుందును. అహాహా! పూర్వము మనుష్యబలి

యిచ్చి మనుష్యులను పీడియాడించి నా కెంతో తృప్తి కలిగించెడు వారు. కటకటా ఆ మేలుదినము లన్నియు బోయినవి. ఇప్పుడు పాడు దినములు వచ్చి కూర్చున్నవి. ఈ దుష్టదినములలో గొఱ్ఱెలు మేకలు మొదలగువాటితోనే తృప్తి పొందుచున్నాను. ఆ గ్రామదేవతలకు మనుష్యబలులు మొదలయినవి మునుపటివలె యియ్యక పోవుటచేత నే దేశములో యీకఱవులు ఈ యకాలమృత్యువులు, ఈబొబ్బలమ్మలు బయలుదేరినవి. ఇదిగాక గ్రామమధ్యమందుండు పోతురాజును నేనే. మరియు కాళీమహాశక్తిని నేనే. ఆమెకు చేయు మాంసపు నైవేద్యములు కల్లునైవేద్యమును చాటుచాటున నిప్పటికిని యిచ్చు నరబలులు అన్నియు నాకే ముట్టుచుండును. వత్సా! అహంకారుడా! ఈపాడుకాల మేమిటికాని పూర్వము కాళికాపూజ సర్వోత్కృష్టముగా వెలసియున్నపుడు నామనోరథము సంపూర్ణసిద్ధి యగుచు వచ్చినది. అయినను యిప్పుడుగూడ యేచాటునో మాటునో నరబలులు తరుచుగా జంతువుల బలులు జరుగుచున్నవి కాబట్టి నేను బ్రతికియుండి మీవంటిశిష్యుల కుపదేశము చేయుచు, అధికారము చేయగలిగితిని. ఈవిధముగానే యజ్ఞములు గూడ నేనే. అందులో నాశిష్యులైన బ్రాహ్మణులు కొందరు కటికవాళ్ళకంటె బాగా ఒక్కొక్కడు నూరేసి మేకలు కోసినవాళ్ళు వచ్చి నాకు కొంతవరకు కనుపండువు సేయుదురు. కాని వైష్ణవులు మాధ్వులు నిజపశువులను చంపరుగనుక వారుచేయు యజ్ఞములు నాకిష్టము లేదు. ఇవియేగాక యింక లోకములో జరుగునట్టి వికృతములైన యారాధనలలో నే నెప్పుడు బ్రత్యక్షమైయుందును. ఇది నన్ను పూజించుటలో సగుణోపాసనము. ఇక నిర్గుణోపాసనమును గురించి సంగ్రహముగా జెప్పెద వినుము. నిజమైన దైవభక్తుల కపకారములు చేయుట, సత్ప్రవర్తన గలవారిని బాధించుట. అసత్యమునే యెల్లపుడు నాలుక

మీదనుంచుకొనుట నోరు మాటలాడుచున్న నొసలు వెక్కిరించునట్లు సంభాషించుట, పైకొకమాట లోపల నొకమాట చెప్పుట బుద్ధివక్రముగా ప్రసరింపజేయుట జనులకన్నులలో దుమ్ముగొట్టుట, జారత్వము, చోరత్వము, మొదలగువానియందు ప్రజ్ఞగలిగియుండుట మొదలయినవి నా విషయమైన నిర్గుణోపాసనములు. ఇవి వేయివిధములుగ నున్నవి. తప్పుసృష్టులు చేయుట మొదలయినవింక నేను చెప్పలేదు. బుద్ధికుశలతగలవారవియన్నియు నూహించుకొని ఆవిధముగ నన్ను నుపాసనజేసి, ముక్తులు కావచ్చును. ఇది నీకు సంగ్రహముగ జెప్పితిని. ఈప్రకారము సగుణనిర్గుణోపాసనములచేసి నన్ను మెప్పించిన వారు నాలో నైక్యముగుదురు అదియే సాయుజ్యముక్తి.

ఇది కలిగీతాశాస్త్రమునందు సాయుజ్యయోగ మను పదునొకండవ యధ్యాయము.

సదసద్వివేకయోగము

అహంకారుడు పలుకుచున్నాడు—దేవా! నా యోగము బాగుండుటచేత బహుయోగములు మీవలన వినియున్నాను. ఇంక మీద యెవరితో సహవాసము చేయవచ్చునో యెవరితో జేయగూడదో యేగ్రంథములు చదువవలయునో యేవిచదువగూడదో యెక్కడికి పోవచ్చునో యెక్కడికి పోగూడదో అనువిషయము నాకుపదేశింపవలయును.

కలి—వత్సా! అందుకు సందేహమేమి? ఇదియే సదసద్వివేకయోగ మనబడును. అన్నియోగములు చెప్పి యిది చెప్పకపోవుట

సకలాభరణములుబెట్టి శిరస్సునకు కిరీటము పెట్టక బోడిగా నుంచుట వంటిది. ఇదిగూడ ముఖ్యమైన యోగములలో నొకటి. అతిముఖ్యమనికూడ చెప్పవచ్చును. కాబట్టి నేర్చికొనవలెనని యాసక్తితో నిండియున్న నీమనఃక్షేత్రమునందు నా యుపదేశబీజములను విరివిగా జల్లెదను. ఇవి త్వరలోనే ఫలించి వర్ధిల్లుగావుత.

అహం.—మహనీయులగు మీదర్శనమనియెడు మేఘోదయముచేత యిదివరకు బీడువడిన నామానసక్షేత్రము చక్కగా పదును కెక్కియున్నది. మీయుపదేశబీజములు చక్కగా నాటుకొనుచున్నవని నేను సంతోషించుచున్నాను. కష్టపడి చల్లిన మీవిత్తనములు వ్యర్థమైపోవుటకు రాతినేలగాదు, చవుటిపఱ్ఱయుకాదు కాబట్టి యనుగ్రహింపవలయునని కోరుచున్నాను.

కలి—వత్సా! సావధానుడవై వినుము. ముందుగా సహవాసవిషయమై చెప్పుచున్నాను. మనస్సులో నిజమైన వైరాగ్యము గల సన్యాసులతో నెప్పుడు సహవాసము చేయవద్దు. వెధవకు దండము పెట్టగా తన్నుబోలి బ్రతుకుమని దీవించునట. అట్లే విరాగులతో స్నేహము చేసినవాడు విరాగియై పాడైపోవును. ఈవిధముగానే తృప్తిగలవారితో స్నేహము చేయగూడదు. తృప్తికోరికలను మొలవకుండ నాశనము చేయు వేఱుపురుగు. అది అభివృద్ధిని గానియ్యదు. మిక్కిలి చెడ్డది. దానిదరికి వెళ్ళగూడదు. ఈవిధముగానే వేదాంతులునీతిమంతులు మొదలయిన వారినిదూరముగ బరిహరించవలెను. అధికారుల యిండ్లవద్దను ధనవంతుల యిండ్లను ఎప్పుడు దాస్యము చేయుచునుండవలయును. ఆత్మగౌరవము గలవారమని విఱ్ఱవీగునట్టిపొగరుబోతుల మొగమైనజూడగూడదు. అంటుజాడ్యమువలె వారి పొగరుబోతుతనము దరికి వెళ్ళినవారి కంటగలదు. ఉపన్యాసము లెప్పుడు వినగూడదు. సభలలోనికి వెళ్ళగూడదు. సరక

మునకైన బోవచ్చునుకాని యాస్థలములకు వెళ్ళగూడదు. వృత్తాంత పత్రికలు ముట్టగూడదు. చదువగూడదు. వినగూడదు. అవి త్రాచు బాములవంటివి. పుస్తకములలో కావ్యములు మంచివి. ఉపనిషత్తులు ఊసుపోనికూతలు. వేదాంతము వెధవముండల ప్రసంగము. భారతము బొంకు. రామాయణము రంకు. భాగవతము పనిలేనిపాట. ప్రహ్లాదచరిత్ర కలలోను జదువకూడదు. కృష్ణలీలలుమట్టుకు కొంచెము కంఠతాఃపట్టు. తెనుగుపుస్తకములలో కవిచోడప్ప శతకము, రాధికాసాంత్వనము, తారాశశాంకము, చంద్రరేఖావిలాపము, కొక్కోకము యీయైదు ప్రతిమనుష్యునకు పంచప్రాణములై యుండవలెను. వీటిలోనె రసమున్నది. వీటిలోనె యానందమున్నది. వీటిలోనె ముక్తియున్నది. నేనా యైదుపుస్తకములలో అక్షరరూపుడనై యున్నాను. కలి బ్రహ్మవాదులైన మహానుభావు లీవిషయము నెఱుగుదురు. వేశ్యాగృహములు జూదపుపాకలు కల్లుదుకాణములు గంజాయికొట్లు మద్దతు ఖానాలు వెళ్ళదగిన స్థలములు. నోటికి రుచించిన వస్తువులన్నియు దినవచ్చును. ఇష్టమైనదెల్ల త్రాగవచ్చును. మనోజ్ఞమైన ప్రతివస్తువు జూడవచ్చును. శ్రావ్యములైనవన్నియు వినవచ్చును. అట్టివి కూడదనువారు మూర్ఖులు అరసికులు ద్విపాద పశువులు, ఏలననగా పశువులు సంగీతము వినలేవు. సరసము గ్రహింపలేవు. ఇదియే సుఖసాధనము.

ఇది కలిగీతా శాస్త్రమునందు
సదసద్వివేక యోగమను
పంద్రెండవ
యధ్యాయము.

—*—

విశ్వరూపప్రదర్శనము

అహంకారుడు పలుకుచున్నాడు.

అహం—మహాత్మా! కలిపురుషా! ఇదివరలో మీరు మీ ప్రభావమంతయు సెలవిచ్చినారు కాని నాకోరిక ప్రకారముగా మీ యొక్క నిజమూర్తిని చూపలేదు. విశ్వవ్యాపకమై మహాద్భుతమై లోకతంత్రమును నిర్వహించుచున్న మీదివ్యమూర్తిని కన్నులార చూచి సంతోషింపవలెనని చిరకాలమునుండి యున్నది. ఆమూర్తిని చూచినగాని నాసందేహములు వీడవు కావున దీనుడైన యీశిష్యుని కరుణించి మీదివ్యమూర్తిని జూపప్రార్థించెదను.

కలిపురుషుడు పలుకుచున్నాడు.

కలి—వత్సా! అహంకారుడా! నేను లోకమంతా వ్యాపించిన పురుషుడనేయని యింతకుమున్నే దెలిపియుంటిని. అయినను మందబుద్ధివైన నీకది సంపూర్ణముగా గ్రాహ్యమైనట్లు కనిపించదు. కావున నీయిష్టానుసారము నావిశ్వరూపమునుగనబరచి నిన్నుధన్యుని చేసెదను. కాని పిరికిగుండెగల నీవు భయపడుదువేమో యని సందేహము గలుగుచున్నది. అదియునుగాక యీతోలుకన్నులతో నీవు నావిశ్వరూపమును చూడజాలవు. నీకేగాదు. నావిశ్వరూపమును జూచుటకు రుద్రాది దేవతలకు మహిషాసురమర్దని మొదలగు దేవతలకుగూడ సాధ్యముకాదు. వేయికన్నులున్న యింద్రుడు, రెండువేల కన్నులున్న శేషుడుగూడ నావిశ్వరూపమును చూడజాలడని భక్తులెల్లపుడు ఘోషించుచుండ నీవొక లెక్కగాదు. అందుచేత నీవు యీరూపమును సమగ్రముగా జూచి యానందించుకొరకు నీకు పిశాచదృష్టి నొసంగుచున్నాను. ఇదిగో సావధానుడవై యుండుము.

అహం—దేవా! సావధానుడనై యున్నానుగాని ఎందుచేతనో నాతల తిరుగుచున్నది. కండ్లు మిఱుమిట్లు గమ్ముచున్నవి. మనస్సు మారిపోవుచున్నది. మునుపు కనుపించినవస్తువులు కనిపించుట లేదు. నేను భూమిమీద నిలిచియున్నట్లు తోచుట లేదు. ఆకాశముమీదికి నేనెగిరిపోవుచున్నాను.

కలి—వత్సా! అదియే పిశాచదృష్టి. దానితో నన్ను నీవు చూడగలవు. ధైర్యము తెచ్చుకొని చూడుము.

అహం—స్వామీ! చూచుచున్నాను. ఆహాహా! నీవే బ్రహ్మాండనాయకుడవు. నీవే సకలభూతములయొక్క లోపలను వెలుపలను నిండియున్నవాడవు. అఖండుడవు. అనంతుడవు. ఈభూతము లన్నియు నీవలన పెరుగుచున్నవి కోరికల కన్నిటికి నీవే యాధారుడవు. ఆహాహా! నీమూర్తి లోకాతీతమై, అసాధారణమై, బ్రహ్మాండవ్యాప్తమై యద్భుతమై భయంకరమైయున్నది. అసూయయు, మత్సరంబును నీకు నేత్రంబులై చింతనిప్పులవలె దేదీప్యమాన ప్రభలతో వెలుగుచున్నవి. పంచ మహాపాతకంబులు నీకు జడలు. నీకు చెవులందు కొండెంబులును, మనస్సునందు కామ, క్రోధ, లోభములును, నాలుకయం దసత్యంబు బూతులును, కొండనాలుకయందు లంచములును, హృదయంబున దంభుడును, కంఠంబునం దాశాదేవియు, లలాటంబున మాయయు, భుజంబులందు కావిడిబద్దలు దుడ్డుకఱ్ఱలును, వీపున నిందాదేవతయు, వక్షస్థలంబున నాస్తికమహాదేవియు, కుడిహస్తమున హింసాచౌర్యదేవతలును, నెడమహస్తమున కత్తులు, తుపాకులు, ఫిరంగులు, నాభి, పాషాణము మున్నగు హింసా సాధనములును, రోమకూపములందు పాములు, తేళ్ళు, మండ్రగబ్బలు, జెఱ్ఱెలు. కండచీమలును, ఉదరంబున పెద్ద పులులును, తోడేళ్ళు, సింహంబులును, నాభియందు పాడునూతులు, గుహలును, పాదంబులయందు జూదపుపాకలు వేశ్యాంగనాగృహంబులు, కల్లుదుకాణము

లును, నాకు గనబడుచున్నవి. మరియు నీకు బద్ధకంబు నడుము, అతినిద్రలు నీకు తెప్పలు, కొడవళ్లు, చాకులు, కత్తిపీటలు, గరిగమ్మలు నీకు గోళ్ళు అధర్మంబును, అజ్ఞానంబును నీకు కోరలై యున్నవి. కరువు, వ్యాధి, విసూచి, మశూచి, బొబ్బలమ్మ నీప్రియ పుత్రికలై నీయొడిలో గూర్చుండి వేలకొలది శవముల చెరుకుగడలవలె విరుచుకొని తినుచు నీ శరీరముపై బాకి యాడుకొను చున్నారు. దుర్గంధములు నీయుచ్ఛ్వాసనిశ్వాసంబులై యుండుట నేనావాసనకు భరింపజాలక దరికి రాజాలకున్నాను. లోకమును మాడ్చివేయుటకు తక్కిన నీశక్తులన్నియు నొకయెత్తు, ఈయుచ్ఛ్వాసనిశ్వాసంబు లొకయెత్తుగ నున్నవి. మురికినీరు నీచెమ్మటలై కాలువలుగ బ్రవహించుచున్నది. ఇందులో నీ పరమ భక్తులు నిన్ను స్థవము జేయుచు ఓహోహో! యెట్లు తనివిదీర స్నానము జేయుచున్నారు? ఏమి వారి పుణ్యము? ఏమి వారిభాగ్యము? వారికి అరచేత మోక్షము కనిపించుచున్నది. ఆహాహా! నీజీర్ణకోశ మెంత యద్భుతముగ నున్నది? దానియందు వేలకొలది కసాయి దుకాణములు రక్తప్రవాహములతో, ఎముకల గుట్టలతో, మాంసపు కండలతో, చర్మముల కొండలతో భీభత్సముగ నున్నది. యజ్ఞాది క్రతువులు చేసిన సోమయాజులు, వారికి తోడ్పడిన మహానీయులు, జంతువులనుపట్టినకుమ్మరులు, మొదలగువారు చర్మపుకొండలదరిని నాకు కనిపించు చున్నారు. మహానుభావా! మీయుభయపార్శ్వములందు నిలిచియుండి చేతులు జోడించి మిక్కిలి నమ్రులై మీకు స్థవము జేయుచున్న వారెవ్వరు? మీతల మీద నేదో యెత్తుగ బుట్టవలె నున్నది. అది యేమి? మీరు చేతులతో నెవరినో ప్రేమచేత వీపుపై తట్టుచున్నారు. అంతగా మీకు ప్రియులైన ఆశిష్యులెవ్వరు? మీకోతలసందున బడి గానుగలో బడిన చెరుకుగడలవలె తుత్తునియలై నలిగిపోవుచున్న వీరెవ్వరు? మీశరీర

ములోనుండి ప్రవహించుచున్న యీ రక్తము యెక్కడకు పోవు చున్నది?

కలిపురుషుడు పలుకుచున్నాడు.

కలి—వత్సా! ఇప్పుడు నీకన్నులు ధన్యమైనవిగదా! నీవు భయపడకుము. నీవు విరికివాడవనియే నాస్వరూపమున నూఱవవంతైన నీకు జూపలేదు. నీకుగల సందేహముల నెల్ల నేనిప్పుడు నివారించె దను. నాప్రక్క నిలిచి నన్ను స్తోత్రముచేయుచున్న వాడు చార్వా కుడు మొదలగు మహర్షులు. వారే నాధర్మములను లోకోపకారా ర్థమై లోకమున ప్రకటించి లోకులను బాగుచేయుచున్న మహాను భావులు. వారి వాక్కులే వేదములు. దేవుడు లేడు, కలిపురుషుడే భగవంతుడని వారిసిద్ధాంతము. ఈమహర్షి నాయొక్క సంపూర్ణమైన యవతారము. లోకములో నూటికి తొంబదితొమ్మండుగురు యీయన శిష్యులే. ఇంతయొందుకు? ఈయనయే నామంత్రి. నాకుడిచేయి నా బహిఃప్రాణము, నాతలపై బుట్టవలెనున్నది అప్రమాణము. అది బుట్ట కాదు నాకిరీటము. ఆకిరీటముపై మాణిక్యమువలె వెలుగొందుచున్న దానిని చూడుము! అది నాజెండా. అదియే యప్రతిష్టయను వెలలేని రత్నము. వెనుక నొకమాఱు మాకు పరమశత్రువైన లజ్జాదేవిని జయించినపుడు, అమూల్యమైన యీరత్నము ఆమె ఖజానాలో మాకు లభించినది. దీనికాంతు లెల్లప్పుడు ప్రపంచమంతట వ్యాపించు చుండును. ఇది వెలుతురులోను చీకటిలోనుగూడ నొక్కతీరున ప్రకాశింపగలదు.

ఇది కలిగీతా శాస్త్రమునందు విశ్వరూపప్రదర్శనమను
పదమూడవ అధ్యాయము.

*

జన్మాంతర యోగము

అహం——దేవ దేవా ? దేవర వారిదివరకుప దేశించిన ధర్మములను వినినతరువాత నామనస్సు పదమూడు కళలతో నిండిన చంద్రమండలమువలె నిర్మలమై ధగద్ధగాయమానమై వెలయుచున్నది. నాకుగల తక్కిన సందేహములుగూడ బాపినపక్షమున నామనస్సు షోడశకళాపరిపూర్ణమైన చంద్రమండలమువలె జ్ఞానామృతమునకు నిలయమై భాసిల్లుచుండును. కావున నట్టిసందేహముల బాపవలయు.

కలి——వత్సా నీకుగల సందేహముల బాపుటయెగదా నాసకల ప్రయత్నము ! కావున నీవు నిర్భయముగా నడుగవచ్చును.

అహం——మహాత్మా జన్మాంతరమున్నదా లేదా? అట్టి జన్మాంతరమున్న పక్షమున నీభక్తులెట్టి జన్మము లెత్తుదురో నిన్ను ద్వేషించిన వారెట్టిజన్మము లెత్తుదురో నేను తెలిసికొనవలయును ఈవిషయము తెలిసికొనకపోయినపక్షమున నా జ్ఞానమసంపూర్ణమై యుండును, కాబట్టి దీనిని మీరానతీయవలయు.

కలి —ఇదిగో తప్పక యానతిచ్చుచున్నాను. జన్మాంతరములున్నవి. లేవనివాదించువారు నట్టిమూర్ఖులు. కల్లుకు సారా జన్మాంతరము. పేడకు పిడకలు, పిడకకు కచ్చికలు జన్మాంతరము. వంటచెరుకునకు బొగ్గులు జన్మాంతరము. ఈవిధముగా అన్ని వస్తువులు అన్ని జంతువులుజన్మాంతరము లెత్తుచుండును. మనుష్యాది జంతువులు చేసికొన్న పాపపుణ్యములనుబట్టి అధమజన్మములనో ఉన్నతజన్మములనో యెత్తుచుండును. నాభక్తులందరు నాలో నైక్యమునుబొంది శాశ్వతసుఖము ననుభవింతురు. నాభక్తులు కాని వారుసకలనరకముల ననుభవింతురు. ఈలోకములో వేశ్యనుగాని మరియొక ముండనుగాని యుంచుకొని

సుఖించినవాడు నాలోకములో రంభా మేనక మొదలగు నచ్చరలతో నాలుగువేల సంవత్సరములు సుఖించును తాను స్వయముగా ఉంచుకొనలేనివాడు ముండలనుంచుకొన్నవారికి సహాయము జేసినపక్షము నను తార్చినపక్షమునను, రంభయింటిలోను మేనకయింటిలోను నున్న వంటకత్తెలను దాసీలను చేపట్టి యైదువందల సంవత్సరములు సుఖించును. భార్యను బిడ్డలను తల్లిదండ్రులను వదిలివేసి ముండయే స్వర్గము మోక్షమునని యెంచుకొని దానియింటనే కూడుతిని, తిట్లు తిని, దెబ్బలుతిని, నిర్ధనుడై దానియరుగుమీదనే ప్రాణములు విడిచినవాడు కోటిసంవత్సరములు, అఖండసౌఖ్య మనుభవించును. వేశ్యాంగనలను, ఉంపుడుకత్తెలను, ఉంచుకొన్నవాని కన్నులార జూచి సంతోషించి మెచ్చినవారు వేశ్యాంగనలయొక్క లంగాలై, పైటలై, చీరలై, రవికలగుడ్డలై, తలకురాసుకొను చమురై పుట్టుదురు భోగమువాండ్రను నిందించిన మహాపాతకులు వేయిజన్మములకైనను వాళ్ళకు విరోధులై పుట్టి యరసికులై వేదజడులై సన్యాసులై పుట్టుదురు. వైరాగ్యమును బోధించెడి నిర్భాగ్యులందరు కామలోకములో అడుగైనను బెట్టుటకు వీలులేక పాడుపడియుండు బ్రహ్మలోకములో ఖారెజేసి గడ్డములు పెంచుకొన్న మునిముచ్చులతో గలిసి నానాకష్టముల బడుచుందురు.

జన్మమెత్తినతరువాత యెవరికిని దమ్మిడీ గవ్వలైన దానము చేయని మహానుభావుడు, అన్నిటికంటె, ఊర్ధ్వలోకమైన కలిలోకములో మొహరీల పరుపుమీద వెండితలగడాలమీద పండుకొనును. అట్టి పుణ్యాత్ముడు బంగారురసమును నిరంతరము త్రాగుచుండును. దానముచేసిన యపాత్రులందరు తిరిగి తిరిగి భూలోకములోబుట్టి జనన మరణబాధలు పొందుచుందురు. కల్లుదాహమిచ్చినవాడు నాలోకములోనున్న మద్యనదులలో హాయిగ యీదులాడుచుండును.

సారాయిజారాలు చేసినవారు యింకొక జన్మమున త్రాటిచె పుట్టుదురు. ఇది బహుసుకృతము చేత గాని లభింపదు, లోయిజా దారులు లొట్టెలగుదురు. వెయ్యేల కల్లు సంబంధములోను సా సంబంధములోను పనిజేసినవారందరు కీతకత్తులై నిచ్చెనలై బల్ల సారాగూనలై జన్మింతురు. త్రాగుబోతుతనము మంచిదని మె కొనువాండ్రందరు, ఈడిగవాండ్రై) పుట్టుదురు. దానిని నిందిం వాండ్రు తాటిచెట్టుయొక్క సౌఖ్యమెరుగక యుందురు. అట్టిక తాటియాకు యిండ్లలో గూడ కాపురముచేయుటకు దగినవారుకా వారుచేసినపాపముచేత పెంకుటిండ్లలోను మిద్దెలలోను వారుక రము సేయుదురు. అన్నిదానములలో నుత్తమదానము, స దానము, వేశ్యాదానము, ఆరెండు సంపాదించుటకై యుపాదా జన్మాంతరమును గురించి చెప్పవలసిన సంగతులు చాలగను గాని తక్కినవి నీవే యూహించుకొనగలవని స్థాలీపులాకనా ముగ నీకు చెప్పితిని.

ఇది కలిగీతాశాస్త్రమునందు జన్మాంతరయోగమను
ప దు నా లు గ వ య ధ్యా య ము

—౯—

చ ర మా ధ్యా య ము

అహం—దేవాదిదేవా? మీ యనుగ్రహముచేత తత సమస్తము గ్రహించితిని. జీవన్ముక్తుడనైతిని. ఇంకను బోధింపవ దేదియైన నున్నపక్షమున నయ్యది నాకుపదేశించి ధన్యుని వలయు. మీ నామస్మరణము నిమిత్త మేమహామంత్రము జపిం వలయునో యదిగూడ అనతీయవలయును.

కలి—వత్సా! చిరంజీవిగమ్ము, ఇకమీాద నుపదేశింపవలసిన యంశములు విశేషముగలేవు. పరమతారకములైన విషయము లొకటిరెండు మాత్రమున్నవి. అవి యుపదేశించెద వినుము.

అహం—స్వాతివానలకు ముత్తెపు చిప్పలవలె నాచెవులు మీా మాటలకై యెదురుచూచుచున్నవి. మిక్కిలి త్వరలో నానతీయవలయు.

కలి—ఇదిగో జెప్పుచున్నాను. సర్వధర్మములనుబరిత్యజించి నన్నే శరణుజొచ్చియుండుము. అందువలన నీకు సకల సౌఖ్యములు గలుగును. విచారమనునది నీచెంతకురాదు. ఇదియే పరమధర్మము.

అహం—దేవా! పరిత్యజింపవలసిన ధర్మములేవో ముందు తెలియజేయవలయును. అప్పుడుగాని యీా పరమార్థము మనస్సునకుబోధపడదు.

కలి—సర్వధర్మములను పరిత్యజించుట యనగా సత్యమును బరిత్యజింపవలయును. త్యాగమును పరిత్యజింపవలయును. శౌచమును పరిత్యజింపవలయును. దయను పరిత్యజింపవలయును జ్ఞానమును బరిత్యజింపవలయును. నీతిని పరిత్యజింప వలయును. ఎవని నోటనుండి సత్యము వెడలగొట్టబడునో, యతడు సర్వసౌఖ్యములను బొందును. ఎవడు సత్యమే పలుకవలయునని పీకులాడునో వాడు సకలబాధలు పడును. సత్యమును పరిపాలించి హరిశ్చంద్రు డెన్ని యిడుమల గుడిచెనో నీ వెరుగుదువుకదా. సత్యమాడి బలిచక్రవర్తి పడిన భంగములు తెలియని వా రెవరు! సత్యమాడి దశరథమహారాజు ప్రాణముల బోగొట్టుకొనెను. సత్యమేవజయతే యని పలుకులు మునిముచ్చులు వ్రాసిన తప్పుమాటలు జ్ఞానమువలన మోక్షము గలుగుననుట యబద్ధము. త్యాగ మెన్నడును జేయగూడనిపని. పుణ్యమువచ్చునని కీర్తిగలుగునని లోకవంచకులగు మునులుకొందరు పురాణములలో వ్రాసియుండుటచే అమాటలు తెలివితక్కువవాండ్రు

నమ్మి తమ ద్రవ్యముల నుచితముగ నితరులకిచ్చుచున్నారు. మోస పోవద్దు. మోసపోవద్దు. ధనము చిక్కబట్టండి. వడ్డీకివ్వండి. దయ యనునది మనోదౌర్బల్యముగాని సద్గుణముగాదు. దయావంతుడు భ్రష్టుడగును. హృదయము వజ్రమువలె కఠినముగా నుండవలయును నీతి యనునది కొందరప్రయోజకులు కల్పించిన పదము. నీతిగా నుండుట యనగా శరీరమును కష్టపెట్టుకొనుట. శరీరమాద్యంఖలు ధర్మసాధనం. అన్నట్లు శరీరమే మనకు ప్రధానము ఆత్మ గీత్మ లేదు. యంత్రములలో నద్భుతమైన శక్తిపుట్టినట్లె శరీరములలో పంచ భూతసంపర్కమువలన నీయద్భుతమైన శక్తిపుట్టుచున్నది ప్రజలు నాశిష్యులను నాస్తికులందురుగాక. నిందలు సేయుదురుగాక. దూషణ భూషణ తిరస్కారములతో వారికిపనిలేదు. స్వలాభము చూచుకొని పనిచేయవలయును. నన్నుస్మరియింపదలచుకొన్నవారు ''కలిపురుషా యనమః'' యనునట్టి అష్టాక్షరీమహామంత్రము జపింపవలయును. దీని వలన సకలమనోరథములు సిద్ధించును.

అహం—దేవా! లోకములో మీ కాలయములు కట్టించి పూజసేయుదుమా?

కలి—ఓయి పిచ్చివాడా! నాకాలయములతో ప్రయోజన మేమి? ఆలయముగట్టి ప్రతిష్ఠించినపక్షమున నొక్కచోటనే యుండ వలసివచ్చును ఆలయములోనున్నవా రాలయములోనే యుందురు గాని పైకిరారు. సర్వవ్యాపకుడనగు నాకు గుళ్ళతో గోపురములతో పనిలేదు. ఇప్పుడు లోకములోనున్న శివాలయములు, విష్ణుదేవుని యాలయములు నావే. పేరునకుమాత్రము వాటిలో వారి విగ్రహ ములు ప్రతిష్ఠింపబడియున్నవి కాని నిజముగా నేనే యందుప్రతిష్ఠింప బడి నిరాఘాటముగా జరించుచున్నాను. అక్కడకువచ్చు తైర్థికులు, అర్చనలుసేయు పూజారులు చాలమట్టుకు నాశిష్యులే. అదియును

గాక శివకేశవాది దేవతలవలె విగ్రహరూపకముగ నర్చింపబడుట నాకిష్టము లేదు. మనుష్యుల హృదయములే నా దేవాలయములు, ప్రతి మనుష్యుడు నాకర్చకుడు. హింస, అశుచి, మొదలగునవి నాకు భోగములు, నైవేద్యములు. ఆశ, హింస మొదలగునవి యే హృదయములో నుండునో అక్కడ నేను ప్రత్యక్షమైయుందునని నమ్మవలసినదే. కాబట్టి నాకు వేరుగా నాలయములు విగ్రహములు నక్కర లేదు కాముడు. క్రోధుడు, మోహుడు, లోభుడు మొదలగు నా సేనానాయకు లెంతకాలము అకుంఠిత ప్రతాపులై దిగ్విజయము సేయుచుందురో, అంతకాలము కలిదేవుడు జగజ్జేగీయమానుడై వెలయుచుండును ఎంతకాలము సూర్యమండల ముండునో యంతకాలము నా ధర్మము లుండును. ఎంతకాలము చంద్రమండల ముండునో యంతకాలము నా యధికారముండును. పరమతత్త్వబోధకములైన యీ కలిగీతలు చదివినవారికి విన్నవారికి వ్రాసినవారికి అచ్చువేసినవారికి అమ్మినవారికి కొన్నవారికి చూచినవారికి చేతితో తాకినవారికి యింటిలో దాచుకొన్నవారికి అక్షయసౌఖ్యములు కలిసాయుజ్యము కలుగును.

అహం — ధన్యోస్మి! ధన్యోస్మి! ఎప్పటికి మీ పాదారవిందములే శరణములు. అనంతకోటి జన్మములెత్తినను నేను కలిశిష్యుడనే గావలెను. కలిదేవునే నమ్మవలెను, కలిగీతనే పఠించవలెను.

ఇది కలిగీతాశాస్త్రమునందు పదునైదవదియగు

చరమాధ్యాయము సర్వంబును

సంపూర్ణము.

—*—

అద్భుత కవిత్వము

(గురువుగారు రంగన్న గంగన్న యను శిష్యులును ప్రవేశించుచున్నారు.)

రంగ—అయ్యవారూ! మామనవి యేమిచేసినారు.

గురు—ఏమిచేయుట కేమున్నదిరా. నేను నిన్న చెప్పలేదా.

గంగ—మాకిద్దరికి కవిత్వం చెప్తారా లేదా?

గురు—మీకిద్దరికి కవిత్వం చెప్పడమేమిటి.

రంగ—కాదండి వాడిమాట సరిగాలేదు. కవిత్వం చెప్పడం నాకు నేర్పవలెను.

గురు—కవిత్వం చెప్పడం యొవడు నేర్పగలడురా. ముందుగా మనిషికి గొప్పపాండిత్య ముండవలెను. వ్యాకరణము రావలెను. ఛందస్సు రావలెను. అలంకారశాస్త్రము రావలెను.

రంగ-ఎందుకండలంకారశాస్త్రాలు వ్యాకరణశాస్త్రాలున్నూ ఏవో రెండుమూడుగ్రంథాలు చదువుకొన్నాముగదా మేము. ఉన్నంతపాండిత్యమున్నది.

గురు—ఓరి మీపాండిత్యంతగులబెట్టా యేమిపాండిత్యమున్నదిరా మీకు. భాస్కరశతకం, సుమతీశతకము, వేమనశతకము నాదగ్గర చెప్పుకొన్నారుమీరు. అందులోగూడ కఠినమైన స్థలములలో మీకర్థము రానేరాదు. ఈమాత్రానికే పాండిత్యమున్నదని చెప్పుకుంటూన్నారా. దాశరథిశతకము చెప్పుకోమంటే నాలుగుపద్యములు చదివిమానివేసినారు. అందులో కొన్నికష్టములైన పదములు సమాసములు నున్నవి. అదిచదువుకుంటే కొంతపాండిత్యము కుదురుతుంది అందులో రంగధరాదిభంగ యను పద్యముదగ్గరకు వచ్చేటప్పటికర్థ

ము తెలియక మీకుముచ్చెమటలు పోసిపోయినాయి. ఈవరస చదువు వాళ్ళు మీరు కవిత్వాలు చెపుతారా? భాష పాడుచేయడము కాని మీకు కవిత్వ మబ్బుతుందీ!

రంగ—ఈరోజుల్లో సనూసా లెవరికిగావాలి కష్టపడా లెవరికి గావాలండీ!

గురు—అయితే యిదివరకు మీకు ఛందస్సు చెప్పివేసినాను కదా కవిత్వం చెప్పండి.

రంగ—కొంచెం కొంచెం చెపుతున్నామండి. మేము చెప్పిన పద్యాలు మీరుదిద్ది బాగుచేస్తే మేము బాగుపడి మంచిమంచి పుస్తకాలు వ్రాస్తాము. లోకానికుపకారం చేస్తాము.

గురు—మీరు పుస్తకాలు వ్రాసి లోకాని కుపకారం చేయ నక్కఱలేదు. మహానుభావులు పూర్వము భారతము భాగవతము రామాయణము వ్రాసి మనుచరిత్ర వసుచరిత్ర వ్రాసి లోకమునకు కావలసినంత యుపకారము చేసిపోయారు. ఆగ్రంథాలు మీరు చదువుకొని అర్థంచేసుకుంటే చాలు కవిత్వము చెప్పినంతపుణ్యము.

రంగ—ఆమనుచరిత్ర వసుచరిత్ర కవిత్వా లేమికవిత్వాలండీ? చూస్తే హోరున రొమ్ముపోస్తుంది. పాడుకవిత్వం అవకతవకకవిత్వం. చచ్చుకవిత్వం. తెలివితేటలు లేని కవిత్వం ఎవడికైనా తెలియనా యేడవనా. అవిపద్యాలుకావు పాషాణాలుకాని. ఇనుపగుగ్గిళ్ళుకాని మాటలాయవి. అదంతా గచ్చకాయపాకం శిలాపాకం. పుస్తకాలున్నాయని లెక్కపెట్టుకుందుకేకాని చదువుకుందుకు పనికిరావు. ఈ కాలానికి బొత్తిగా పనికేరావవి. కవిత్వమంటే అన్నికాలములకుబనికి వచ్చేదిగా నుండవలెను. రసముండవలెను. సులభముగా వుండవలెను, ద్రాక్షాపాకముగా నుండవలె. పూర్వకవిత్వం నానెన్నుగానుంది. చూడండి యింగ్లీషు పోయిట్రీ యెంత యెక్సలెంటుగా వుంటుందో.

మేమీలాగునంటే మీకు కోపమువస్తుంది. ముక్కు—మూ రెడు మూతి జానెడుచేసి మండిపడతారు. ఇంగ్లీషుచదువుకొన్నవాళ్ళంతా పోగరుబోతులంటారు మీరు ఈ నన్నయభట్టు తిక్కన్న అల్లసానిపెద్దన్న యిల్లాటివాళ్ళు పుట్టకపోతే మన భాషెంతో బాగుపడును.

గురు—ఆరి నీ మొండితనం బ్రద్దలుగాను. ఇదేమిరా! మహాకవీశ్వరులను పట్టుకొని చడామడాతిడుతూన్నావు. చేతైతే నీవుమంచి కవిత్వము చెప్పరాదో యెవడూ వద్దన లేదు. వాళ్ళనుమాత్రం తిట్టకు. ఇటువంటివి వింటే నాకుగూడా మహాపాతకము వస్తుంది. పొండవతలకు పొండి.

గంగ—శాస్త్రిగారూ! తమరు కోపపడకూడదు. టాలరేష నుండాలి.

గురు—టాలరేష నేమిటి. ఆమాట కర్థము తెలియు లేదు ముందుగాను.

గంగ—టాలరేషనంటే యితరాభిప్రాయములను సహించే స్వభావము.

గురు—అభిప్రాయమంటే బూతులు తిట్టడమా.

గంగ—మేము తిట్టినామా?

రంగ—పోనియ్యండి. మేముతిట్టినామనితోస్తే మీరు క్షమించండి. మేమిద్దరము చెరియొకపద్యము వ్రాసికొనివచ్చినాము. అవివిని దోషాలుంటే చెప్పండి.

గురు—ఏదీ ఆపద్య మేదో చదువు నాచేతనైతే దిద్దుతాను.

రంగ—ఇదిగో చదువుచున్నాను వినండి—

గీ॥ తోటకూరతెచ్చి దొడ్డిలోనతరిగి
కుండలోనబెట్టి కుదురుగాను

క్రింద మంటబెట్ట వుడక కేంజేస్తుంది?
దానికడుపు కాల ధరణిలోన.

గురు — (నవ్వి) ఓసి నీకవిత్వంమండా యిదేమి కవిత్వంరా ప్రపంచములోనున్న కవీశ్వరుల నందరిని తిట్టిన మహానుభావుల కవిత్వమా యిది! మిక్కిలి చక్కగానున్నది. తిక్కన సోమయాజి చచ్చిపోయిన లోటుతీరింది ప్రపంచానికి. నన్నయభట్టు లేడన్న వెలితి లేదు.

రంగ — గురువుగారూ! మీకు కోపమునస్తే వచ్చిందికాని మమ్మలని వాళ్ళతో పోల్చకండి. వాళ్ళు తెలుగు కవీశ్వరులని చెప్పుకుంటే మాకు సిగ్గేస్తూంది.

గురు — అవునవును! నిజమే నేను చెప్పినది పొరబాటు. పోనీ! కాళిదాసు భవభూతి వాళ్ళతో పోలుస్తునా?

రంగ — ఏమో మాకు సంస్కృతం రాదు. వాళ్ళ కవిత్వాలెల్లాగేడిశాయో. మమ్మలని వాళ్ళతోటీ పోల్చవద్దు. వీళ్ళతోటీ పోల్చవద్దు. మేము మోడరన్ పోయిట్లుము.

గురు — ఆమాట కర్థమేమిట్రా? నాకు తెలియలేదు.

రంగ — ఇంగ్లీషు రానివాళ్ళకి మీవంటివాళ్ళకి యీ క్రొత్త అయిడియాను చెప్పడం కష్టమండి. అదిగాక యీ వెధవ తెనుగు భాషలో మోడరన్ అనేపదమునకు అర్థమే లేదు. ఏమని చెప్పము మీతోటి?

గురు — తెలుగెంత పాడుభాషైనా, ఇందులో మాటలే లేవా? నీ మోడర్న్ అనేమాటకు తగినమాటలు లేకపోయెనా. దాని భావమేమిటో చెప్పు.

రంగ — భావము చెప్పినా మీకు తెలియదు. అయినా చెపుతాను. మోడరన్ పొయెట్సు అంటే మేము యీనాటి కవులమన్న మాట.

గురు — ఈనాడు బ్రతికున్నవాళ్ళు యీనాటి కవులుగాక పూర్వపుకవు లెట్లగుతారూ.

రంగ — ఈనాటి కవులంటే యిప్పటిభాషలో కవిత్వముచెప్పే వాళ్ళమన్నమాట.

గురు — ఇప్పటిభాషంటే యీ చచ్చుపుచ్చు మాటలతో చెప్పే కవిత్వమూ.

రంగ — చచ్చుపుచ్చు మాటలాయివి. మీకు సెన్సులేకుండా మాటాడుతూన్నారు. శాస్త్రుల్లవారికి సెన్సెప్పుడైనా యున్నాదా. గురువైనాసరే అన్యాయముగా ప్రవర్తించినప్పుడు ధిక్కరించవలసినదే కనుక మేమిప్పుడు మిమ్ము ధిక్కరిస్తూన్నాము. ఈ శాస్త్రుల్ల వారి మూలాన్నే కొంపలు మునిగాయి. భాగోతంలో కృష్ణవేషగాణ్ణి కూచోబెట్టినట్లు యిస్కూలుభాగోతంలో శాస్త్రుల్లవారిని కృష్ణవేషగాళ్ళక్రింద కూచోబెడుతూన్నారు శాస్త్రుల్లవారంటే ఒకవిధమైన జంతువులు. వాళ్ళకి కామన్సెన్సు లేదు వాళ్ళచేత పాఠాలు చెప్పించినన్నాళ్ళు పిల్లలకు చదువులురావు. తెనుగూరాదు. సంస్కృతమూరాదు. పిల్లలంతా వృత్తివెధవలవుతారు ఈపిల్లలవుసురు కొట్టి యీశాస్త్రులవారంతా యెప్పుడు మాశిపోతారో స్కూళ్ళలోనుంచి అప్పుడే పిల్లలు బాగుపడతారు. అకారమట. ఇకారమట. ఉకారమట. సంధట వీళ్ళశ్రాద్ధమట. శాస్త్రుల్లవారికి వ్యాకరణము వ్రాసిన వాళ్ళకి సంధించింది. అంతికంటె వేరే సంధిలేదు. అయినా శాస్త్రుల్ల వారందరికి పొయ్యేకాలమూ వచ్చిందిలే. మీ యాటలికసాగవు. ఇక ముందు మీ ఆవాహనవిసర్జనా వుండదు ఇదివరకు భాషను పిల్లలను మీ యిష్టము వచ్చినట్టు పాడుచేశారు ఇక శాస్త్రుల్లవారినోట్లో మట్టే. మా అదృష్టము బాగుండి మాపూర్వజన్మపుణ్యమువల్ల కల్పవృక్షము లాగు కామధేనువులాగు చింతామణిలాగు మోడరన్ స్టైలు నవీన తెనుగు కన్నులపండువుగా వచ్చింది. అది పూర్తిగా రాకుండా ఈ

పూర్వ తెనుగును పట్టుకుని వేళ్ళాడే పిశాచాలుకొన్ని పీక్కుతింటూన్నాయి. ఆపిశాచాలని కొద్దిరోజులలోనే మారణహోమం చేశేస్తాము. వాళ్ళకడుపుచల్లగా అధికార్లు మాపట్లవుండబట్టిగాని లేకపోతే మమ్మలిని వీళ్ళు బయటికి రానిస్తురా. మామోడరన్ స్టైలు వాళ్ళు వాదం చేస్తూంటే, ఎంతసబబు. ఎంతయుక్తి, ఎంతచమత్కారం. ఈ గ్రాంధికపక్షిగాడూ యీశాస్త్రిగాడూ వాళ్ళముందర నోరెత్తగలరా? మావాడు పీకిడబాయించేస్తాడు. మావాదాలువింటే సభలో వాళ్ళంతా గుమ్మైపోతారు. పాత తెలుగువాళ్ళని డొక్కచీరి రాళ్ళుకొట్టిస్తా. పాతభాష తవ్విపాతరేయిస్తా. మీభారతాల్ గీరతాల్ మీ ప్రబంధాల్ గింబంధాల్ అన్నీకూడా దీపావళిమా వాళ్ళకి తూటాల్ మతాబాల్ పువ్వొత్తుల్ పేకజువ్వాల్ కట్టిస్తా.

గురు — అబ్బాశాస్త్రుల్లవారి నింత సేపు తిడుతూవున్నావు. నీకింతకోప మెందుకురా. చిన్నప్పుడు నీకు తెనుగు పాఠం రాకపోతే వెనకటిశాస్త్రుల్లుగారు చేంతాడు మడతబెట్టి నిన్నుకొట్టేవారట. అదాకోపము. మొద్దువెధవలుంటే కొట్టకమానుతారా. మమ్మలిని తిడితే తిట్టావు. పోనీ భారతభాగవతాలు ఎందుకుతగలెయ్యాలని అంటావురా.

రంగ — ఎందుకుతగలెయ్యాలని చూస్తోన్నావా. మీపూర్వపుగ్రంథా లన్నింటిలోనూకూడా కలిసి యిప్పటిమానూతన్ తెనుగులో ఒక్కపుటలో ఒకపంక్తిలో ఒక్కఅక్షరములో ఉన్నంత జ్ఞానంలేదు. అట్లాంటప్పుడా పాతపుస్తకాలెందుకు? మనుష్యులను పాడుచెయ్యడానికి కాకపోతే?

గంగ — ఒరేశాస్త్రుల్లవారికి కోపమువస్తుంది ఆట్టేతిట్టకురా.

రంగ — కోపమువస్తే నాకేమిరా నే నిండిపెండెంటుమేనుని. ఒకరిలక్ష్యము నాకులేదు. ఒరే! యీగవర్నమెంటువారు సరిగా ఆలోచించలేదుకాని, ఆలోచించి ఒక్క ఘంటసేపు గవర్నరు

జనరల్ పనేనా గవర్నరుపనేనా యిస్తే ఆఘుంటలో తెలుగుసంస్కృతము శాస్త్రిల్లవారి నందరినీ అండమానుదీవులకు డిపోర్టు చేయవలసిన దనిన్నీ పాత్తెన్గుపుస్తకా లెక్కడ కనబడితే అక్కడ చలిమంట వేశెయ్యవలసిన దనిన్ని ఆర్డరు వేస్తునురా. భగవంతుడు నానోబుల్ అయిడియాసుకి తగిన అధికారం నాకిచ్చాడుకాడురా. ఇంతింత దేశాభిమానం భాషాభిమానం వున్నవాడికి భగవంతు డీవిధంగా చిన్నచూపు చూడ్డం న్యాయంగా లేదు.

గురు—ఇంతింతబుద్ధు లుండబట్టి భగవంతుడు నిన్ను రెండు కళ్ళా చూచి తిన్నగా పరిపాలించి పోట్ట చించినా అక్షరం లేకుండా చేసి నీచేత నేమీ అధికారం లేకుండా చేశాడు. నీకు చదువు అధికారంవుంటే నీవు క్రిందామీదావుంటావా నాయనా. నీకధికారమే వుంటే యీపాటికి మేమంతా అన్యాయంగా యీపాటికి బంకోల్లులో వుందుముకదా.

రంగా—అన్యాయంగానా. మిమ్మల్ని పోర్టుచేయడంమెంతో న్యాయము. ఎందుకంటె దేశమునకు అపకారం చేశేవాళ్ళని గవర్నమెంటువాళ్ళు డిపోర్టుచేస్తూన్నారా లేదా. అలాగే భాష కపకారం చేశేవాళ్ళని యెందుకు డిపోర్టు చేయగూడదు గవర్నరుజనరల్‌గారి లెజిస్లేటీవుకమిటీలోవున్న మెంబర్లపేర శాస్త్రిల్లవాండందర్ని డిపోర్టు చేయుట కేదైనా చట్టము పెట్టించవలసినదని రాస్తాను. పట్టిమాటలు చెప్పకూడదు. క్రియచేసి చూపించాలి.

గురు—సరే వ్రాసిచూడు. నీవంటిమహానుభావుడే అక్కడుంటే ఆయన చట్టము ప్రవేశపెడతాడు.

రంగ—నావంటివాళ్ళు చట్టనిర్మాణసభలో లేకపోబట్టే దేశమీలాగుంది. నావంటివాళ్లుండి మంచిమంచి చట్టాలు ప్రవేశపెడితే వహ్వా దేశమీపాటి కెల్లాగుండును.

గురు—నిప్పు కర్ర లేకుండా తగులబడుచుండును.

గంగ—అది మీశాస్త్రిల్లగారి మూలాన్నే తగులడుతూంట

రంగ—ఈ మాట కేమిగాని నా కవిత్వములో ఉండేరసం. గ్రహించకుండా మనము అప్రస్తుత ప్రశంశ చేస్తూన్నాము.

గురు—నీ కవిత్వములోనున్న రస మేమిటి నాయనా నీరసము తప్ప.

రంగ—గ్రహించ లేని వాళ్ళకి నీరసం గ్రహించే వాళ్ళకిసరసము ఉంది.

గురు—ఆసరస మేమిటో ఒకమాటు సెలవిస్తూ వింటాను. ప్రపంచంలో, వర్ణించడాని కిన్ని వేలవస్తువులుంటే నీకు తోటకూర దొరికిందా వర్ణించేటందుకు.

రంగ—నేచురులుగా కవిత్వము చెప్పమంటే మీ కేమిటో తెలియదు. నేచరువర్ణనే వర్ణన.

గురు—నేచ రేమిటి.

గంగ—నేచరంటే స్వభావమండి ప్రకృతికూడాను.

గురు – అయితే తోటకూర స్వభావవర్ణ నంటావూ.

రంగ—నా పద్యంలోనుండే తోటకూర స్వభావవర్ణన గాక పోతే అవకతవక ప్రబంధాల్లో వుండేవర్ణనలన్నీ స్వభావములా ? సూర్యుడు రథమెక్కి ఒకపట్టణములోన్నుంచి వెడుతూంటే ఆవూళ్ళో వుండే కొబ్బరిచెట్ల కాయలకు సూర్యుడి గుఱ్ఱాల డెక్కలుతగిలి అవి పగిలితే వాటిలోనుంచి వచ్చేనీళ్ళు వూరంతా ప్రవహిస్తూన్నాయట. చంద్రుడొకవూళ్ళో మేడల్లోనుంచి సంచారము చేస్తూంటే ఆడవాళ్ళు మేడల తలుపులువేసి చంద్రుణ్ణి ఖైదులో పెట్టారట. తన మొగుడైన చంద్రుడు కనబడక రోహిణీదేవి మొగుణ్ణి వెతుక్కుంటూ వెళ్ళిందట. కాని ఆవూళ్ళో ఆడవాళ్ళ మొగాలకి చంద్రుడికి భేదము లేకపోబట్టి యేది చంద్రుడో యేది మొగమో తెలిసికోన లేక గిజగిజ తన్నుకు

చచ్చిందట. ఇవిటయ్యా వర్ణనలంటేను, కోతివర్ణనలు, కొండముచ్చు వర్ణనలు ? వర్ణనలంటే యెంత పేచురలుగా వుండాలి. వెనుకటికి మా తాత రుమాలు ఆకాశమంతవుందని ఒకడన్నాడట. వెంటనే రెండవవాడు వాడికంటె యెక్కువకోతలుకొయ్యాలని ఒరే మా తాత రుమాలు కొంచెముచిరిగితే మీ తాత రుమాలు అతుకువేయుటకు పనికొచ్చిందన్నాడట. ఆలాగుంది తెనుగుకవులయొక్క సంగతి. ఒకరిని మించవలెనని యొకరు అప్సర్డు వర్ణనలుచేసికొన్నారు.

గురు—అప్సర్డంటే యేమిటో యీ ఇంగ్లీషు ప్రయోగాలతో చంపేశేస్తూన్నావు ?

రంగ—ఏం చెప్పుమన్నారు ? ఈచచ్చుభాషలో దానికి తగిన మాటే లేదు.

గురు—నీకు తెలుగారాక తగినమాట లేదంటావేమి ?

గంగ—ఆమాటకు అసంభవము, అసాధ్యమని అర్థమండీ.

గురు—ఆలాగా అవన్నీ అసాధ్యపు వర్ణనలా మీవి మంచి వర్ణనలా ?

రంగ—మంచివర్ణనలా అని అడుగుతారేమి యింకాను! నా పద్యంలో కల్పనెంతమంచిది! మాట లెంతరసవంతముగానున్నాయి. ఉల్లిపాయ పకోడీల్లాగున్నాయి శబ్దాలు. ఒకొకటే చూడండీ అర్థమెంతత్వరగా అవుతూవుందో చూడండి. గపుచిపు మిఠాయిలాగ నోట్లోవేసుకుంటే కరిగిపోతున్నాయి. నన్ను నేను పొగడుకో గూడదు కాని యింత రసవంతమైనపద్యము తెనుగుభాషలో ఇదివరకెన్నడూ చేయలేదు. ఈ పద్యము చెప్పినప్పటినుంచీ నా స్నేహితులంతా నన్ను కాగలించుకొని "ఒరే ఆదికవి వాల్మీకి నోటంటవచ్చిన "మా నిషాద" అనే మొదటి శ్లోకంలాగేవుందిరా నీ పద్యం. వాల్మీకిలాగే

నీవుకూడా యేదైనా కావ్యము చేయరా నాయనా'' యని నన్ను పీక్కు-తింటున్నారు.

గురు—(నవ్వి) అలాగైతే యేదైనా మహాకావ్య మారంభించీపాటికి.

రంగ—ఆరంభిస్తాను. సబ్జెట్టు వెతుక్కు-ంటూన్నాను. సబ్జెట్టంటే విషయము. మళ్ళీ మీారర్థమడుగుతారని ముందేచెప్పాను.

గురు—సరే ప్రపంచానికి మంచికావ్యాల్లోటుండదు. భగవంతుడు తెనుగు దేశానికి నిన్ను చూపించాడిప్పుడు.

రంగ—నన్నే చూపించడ మేమిటిమీారాలా స్తోత్రం చేస్తూంటే నేనొప్పుకుంటానా నా కంటే మిక్కి-లి రసవంతమైన పద్యాలు చెప్పిన వాళ్ళుపూర్వ కవుల్లో కొందరున్నారు. ఆ సింపిలు స్టైలు పైకిరాని య్యాక మీారు తొక్కి- పెట్టేరు. మీారుఅంటే మీారుకారు - కొండ ముచ్చుపండితులు.

గురు—ప్రాచీనులలో ఇల్లాంటి వాళ్ళున్నారూ ఏదీ ఒకపద్యము చెప్పు యిల్లాంటిది

రంగ—చూడండి చదువుతాను. అల్లాంటి మంచిపద్యము. అందులో రసాలొలుకుతూంటాయి. అందులో సంస్కృతం తెలుగు మిళాఖత్తుచేసి బ్యూటిఫులుగా వుంటుంది.

గురు—అందులో యేమి మిళాఖత్తోగాని యిప్పుడు నీవు మాట్లాడినమాటలో నాలుగు భాషలు మిళాఖతైనాయి.

రంగ—ఇదిగో శ్లోకం వినండి.

శ్లో॥ తండులాలు గృహమందు నసంతి
తిండికైతె బహుమంది వసంతి
వట్టికుండలు గృహేషులుఠంతి
రండనాకొడుకులెల్ల హసంతి

చూడండి. దీర్ఘోరసంచూడండి మఱి. వేలుమడిచి యిందులో తప్పు చూపెట్టండి మఱి.

గురు — అహాహా! ఏమిపద్యమయ్యా. వరహాలకెత్తు కెత్తైన పద్యం. ఏదీ మరియొకసారి చదవండి.

రంగ — ఓ. మీకు కావలసినన్ని మాట్లు చదువుతాను. తండులాలు గృహమందునసంతి.

(అనుపద్యమును చదువుచున్నాడు)

గురు — (నవి) వహావా! ఇది తెలుగుకాదు సంస్కృతము కాదు శ్లోకముకాదు పద్యముకాదు.

రంగ — మీకు శ్లోక మేమిటో పద్య మేమిటోతిన్నగా తెలిస్తేనా. ఇందులోవున్న స్వారస్యం గ్రహించేటందుకు యెంతవాడు కావాలి. ఇల్లాటిపద్యాలే జనసామాన్యం తలకెక్కేది.

గురు — ఇల్లాటి వింకేమైనా వచ్చునా నాయనా మీకు?

రంగ — కావలసినన్ని వచ్చును ఓరే గంగన్నా నీకొచ్చు కాదంట్రా? ఒకశ్లోకం ఏదీ చదువు.

గంగ — ఆశ్లోకమా, చదువుతాను. అది భేషైన శ్లోకము ఎంతచీకినా రుచితీరని మునగకాడలాగ యెన్నిమాట్లుచదువుకొన్నా యీశ్లోకం తనివితీరదు.

గురు — స్తోత్రాలకేమి పద్యము చదువు బాబూ

గంగ —

శ్లో॥ అన్నాతురాణాం నవుడికి ర్నవుడకః
నిద్రాతురాణాం నమెట్టన్ నపల్లః
అర్థతురాణాం నచెల్లి ర్నచెల్లః
కామాతురాణాం నముసిలి ర్నపిల్లః

గురు — (నవ్వి) ఓరి నీశ్లోకం బంగారుగాను ఒకదాన్ని మించి ఒకటొస్తాందిరా నాయనా. ఇంకేదైనా వచ్చు నాయనా నీకు.

రంగ—వీటి రెండిటికన్నా సొగసైన శ్లోకమువచ్చునాకు.

గురు—అదేదిబాబూ. చెవులు తుప్పొదలించెయ్యి దీనితోటి! ఇదివరకు కాళిదాసు భారవి భవభూతి మల్హణశ్లోకములు చదువుకొని నాచెవి బెరడుకట్టియున్నది. ఏదీత్వరగా వినుపించుబాబూ.

రంగ—చదువుతున్నాను వినండి. మీకుపంచప్రాణాలు లేచివస్తాయి శ్లోకము వింటేను.

శ్లో॥ అప్పంబొట్టో యెల్లపో జ్యేష్ఠబిడ్డః
సంకట్యాశః చక్కగా తన్నె బాబున్
బంకమ్మట్టే అంటుకొన్ వంటినిండన్
శంకర్పట్టీ వచ్చెన్ ఆగముంగాన్.

గురు—(కడుపుపట్టుకొని వికవికనవ్వి) ఓరినాయనా యిదేమి శ్లోకమురా బాబూ. జన్మమధ్యమందిదివరకు వినలేదు. ఇకముందు వినబోనురా బాబూ. దీనర్థమేమిటి చెప్పుబాబూ. పతంజలిభాష్యం మనోరమాతత్వబోధిని మొదలయిన వ్యాఖ్యానాలు చదువుకొన్నా గాని నాకేమి యర్థంకాలేదు. నీభాష్యంవింటేగాని యిందులోఒక్కముక్కయినాఅర్థమయ్యేటట్టులేదు.

రంగ-క్రొత్తతెలుగులో చదువుకోవలసింది నేర్చుకోవలసింది ఏముంటుందని యిదివర కంటున్నారుకదా. మీయంటివారికి గూడా తెలియనివి క్రొత్తతెలుగులో వున్నాయికదా. చూడండర్థము చెపుతాను.

ఎల్లపోజ్యేష్ఠబిడః=అనగా యెల్లప్పగారి పెద్దకొడుకు. అప్పంబొట్టనేవాడు, సంకట్యాశః=సంకటముకుదిరేటట్టుగా, బాబున్=తండ్రిని, తన్నె.కొట్టాడు. అప్పుడుబంకమట్టి వంటినిండా అంటుకొన్నది శంకర్పట్టి=అనగా శంకరప్పగారి కుమారుడు. ఆగముంగా=అడ్డుకోగా, వచ్చెన్=వచ్చినాడు ఇది దీనిభావము.

గురు—వాచామగోచరంగావుందిరా నాయనా దీనిభావము. అహాహా రసమేమిటి, పాకమేమిటి, భావమేమిటి యతులేమిటి ప్రాస

లేమిటి శబ్దసౌష్టవమెంత. వేయినాలుకలున్న శేషుడే రావలెను? దీన్ని వర్ణించేటందుకు, చాలుగాబాబూ మొగం మొత్తిపోయిం కవిత్వం. ఇకకవిత్వమంటే అరోచకం పుడుతోందిరానాయనా.

రంగ—మీవంటివాళ్ళకిటువంటి రసవంతమైనకవిత్వంసాకు తుందా. మీకీకవిత్వాలువినిపించడం చెవిటివాడిముందర శంఖమూ దడం గ్రుడ్డివాడికి రవివర్మపిక్చర్లుచూపించడం.

గురు—నిజమేబాబూ. మావంటిమూర్ఖులదగ్గర యిటువం మహారసవంతమైన శ్లోకాలు చదువకూడదు. వాటికిదిష్టికొడుతుం

రంగ—నిజమే చదవనేకూడదు. నేను పొరపాటుచేశాను

గురు—మీక్రొత్తపుంతపద్యాలు నాకుకూడా కొన్ని వచ్చు సుమా.

రంగ—మీకివికూడావస్తాయా. మీకల్లా అర్థంకాని నళ్ళ ళ్లంటిఆదిక్కుమాలినశ్లోకాలేకానియీలాటిచక్కనిపద్యాలొస్తాయి

గంగ—ఏదీ నిజంగావస్తే ఒకటిచదవండి. ఇందాకా మీ చెప్పినట్లు పాతశ్లోకాలు చదవడంవల్ల బెరడు కట్టిపోయిన మీనో రుచొస్తుంది.

గురు—రాకేమయా! మంచిశ్లోకాలురావడం కష్టము? యివిరావడానికేమి. చదువుతానువినండి. అనవేమారాజుగారివి అవకతవక పండితుడొకడు చెప్పాడట యీశ్లోకం.

శ్లో॥ అనవేమమహీపాలా
చూపులుం గడులెస్సలు
యుద్ధమందు మహావీర్లు
శాబాసునా భళాముండా
ధీయోయోనః ప్రబోదయాత్.

రంగ—చాలాబాగా వుందిశ్లోకం రెండవ పాదంలో ఆయన అందం వర్ణించాడు. కాని తక్కిన పాదాలు అర్థమైనాయికావు.

గురు — దానికి వ్యాఖ్యాన ముండాలి మరి చెపుతాను విను. మొదటి మూడు పాదాలు కష్టపడి చేశాడు. నాలుగో పాదం తోచింది కాదాయనకి. పెళ్ళాముని సలహా అడిగినాడు. ఆమె సంధ్యావందనంలో ముక్కొకటి పారవెయ్యమని చెప్పింది. అందుచేత ధీయోయనః ప్రబోదయాత్తని వేశాడు.

రంగ—అయితే శభాసునా బళాముండా యేమి.

గురు—అటువంటి గొప్పయభిప్రాయము చెప్పినందుకు సంతోషిస్తూ వేశాడు.

రంగ—దివ్యంగావుంది. తేగముక్కల్లాగున్నాయి ముక్కలు శాస్త్రుల్లుగారూ! ఇటువంటి రసవంతమైన ముక్కలొదిలిపెట్టి ఆపాడు పుస్తకాలెందుకు చదువుతారయ్యా మీరు ?

గురు—కవిత్వాలు యిల్లాగే ఉండవలసి వచ్చినట్టయితే ఇక రఘువంశము కుమారసంభవము భారతము భాగవతము మనుచరిత్ర యిల్లాటివన్నీ కట్టకట్టి మూలపారవేసి గరుడాచలనాటకాలు,గంగాగౌరీసంవాదాలు, తందానపదాలు, గొల్లసుద్దులు చదువుకోవడం చాలా మంచిది.

రంగ—భేషుగ్గా చెప్పేరు శాస్త్రుల్లుగారూ! క్వాయిట్రయిట్. మిమ్మల్ని నేనిప్పుడు కన్విన్సు చేశానన్నమాట.

గంగ కన్విన్సు అంటే ఆయనకు చెప్పు. శాస్త్రుల్లుగారితో మాటాడితే వచ్చే బాధే యిది.

రంగ—ఏంజెప్పను నాతలకాయి. తగినమాటలావల్ల కాడా యీభాషలో కన్విన్సంటే వాదబలంచేత మిమ్మల్ని నా పక్కకు త్రిప్పుకున్నా నన్నమాట.

గంగ—మీకు నచ్చేటట్టు చెప్పాడన్నమాట.

గురు—అలాగా. సరే మీ యిష్టమువచ్చిన ట్లనకొండి.

రంగ—శాస్త్రుల్లుగారూ! మా వాదము వింటే యెంత భీష్మించుకున్న శాస్త్రుల్లుగారైనా ఒక్క గడియలో పడిపోరటండీ, మా వాదానికి యెదురు జవాబె చెప్పడానికి వీలా. కొమ్ములు తిరిగినవాడు మా యెదుట మాట్లాడలేడు. ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళతో మాట్లాడడమంటే మజాఖా అనుకున్నారూ.

గంగ—శాస్త్రుల్లుగారూ! యీ వాదాలతో నేను వచ్చినపని మరిచిపోయినాను.

గురు—ఏమిటి నీవు వచ్చిన పని ?

గంగ—మన రంగన్నలాగే నేను కూడా ఒక చిన్న పద్యమల్లినాను. అందులో యింకా నాలుగో పాదం కుదరలేదు. మూడు పాదాలే కుదిరాయి. నాలుగోపాదం నాలుగు రోజులనుం చాలోచిస్తూన్నాను.

గురు—అయితే యిప్పుడు నీపద్యం మూడు పాదాలే కుదరడంచేత త్రేతాయుగంలో ధర్మదేవతలాగుంది.

రంగ—అదేమిటండి. ఏదో చాదస్తం పురాణగాథ చెపుతూన్నారు.

గురు – మేమూ మీరూ మాటలాడుతూన్నంత కాలము మా చాదస్తం మీరు వినకతప్పదు వినండి. కృతయుగంలో ధర్మదేవత గోరూపమెత్తి నాలుగుపాదాలా నడిచిందట. త్రేతాయుగంలో ఒక పాదం ధర్మం తరిగిపోవడంచేత ధర్మదేవత మూడు పాదాలతోటే నడిచింది. మీ పద్యం కూడా మూడు పాదాలు కలదే కనుక కృతయుగంలో ధర్మదేవతవలె నుందని చెప్పినాను.

రంగ—శాస్త్రుల్లుగారూ! ఏమియుపమానమండిది. ఉపమా లంకారమంటే యిల్లాగా వుండవలసింది. ఉపమ అంటే దామోదర హోటల్లో చేసే ఉపమాలా వుండాలి. ఉపమా కాళిదాసస్య అని పూర్వముండేదట. అది శుద్ధతప్పు. ఉపమా దామోదరస్య అంటే చాలా బాగావుంటుంది. దామోదరుని ఉపమాలాగ కాళిదాసు చెప్పలేక పుండడు.

గురు—నారాయణ నారాయణా! ఎటువంటి దుర్భాషలు వినవలసివచ్చినదిరా నాయనా. మహానుభావుడైన కాళిదాసుగారి యుపమ దామోదరుని ఉపమాకు తీసిపోయినదీ. అనగా ఉప్పు పిండికి తీసిపోయినదన్నమాటా. మాణిక్యాలు గాజుపూసలు, గాజు పూసలు మాణిక్యాలూ అయ్యేరోజులు వచ్చాయి. మిమ్మల్ని వనవల సిన దేమీ లేదు. ఈలోపమంతా మాదే.

రంగ—ఈ వాదంతోనే కాలక్షేపము చేయక నాపద్యము వినండి శాస్త్రుల్లుగారూ!

గురు—నాకూ వినడం కష్టముగానే వుంది. బాబూ త్వరగా నీపద్యమేదో చెప్పూ.

రంగ—పీడి పద్యంకూడా చాలా బాగుంటుందండి. నేను విన్నాను.

గురు—ఊటలూరించి చంపక త్వరగా చదవండి.

రంగ—ఇదిగో చదువుతూన్నాను వినండి. శ్రద్ధగా వినాలి. మనస్సు మరోచోట పెట్టుకొనివింటే వల్లకాదు అల్లాటప్పా కవిత్వా ల్లాగ మీరశ్రద్ధగావింటే పనికిరాదు.

గురు—శ్రద్ధగానే వింటున్నానోయీ బాబూ చదువు.

రంగ—కోప్పడకండి. చదువుతూన్నాను.

పొలములో నక్కలు కూసెగా
మనసులో భయ మెంతో వేసెగా

పాలేరు యిట్లట్లె చూసెగా
యింతే తక్కినపాదం కుదిరిందికాదు.

గురు—అహహా! ఇదా పద్యం.

గంగ—మొన్న రాత్రి నేను పొలములో పడుకోవలసివచ్చింది అప్పుడు నక్కలు కూస్తే భయమేసింది. దానిమీద నే చురుసుగా చెప్పాను.

గురు—(నవ్వుచు) ఇందులో గణమూ లేదు యతి లేదు. ఇది యేమి వృత్తం?

గంగ—ఈవృత్తాల ఫక్కీని మేము వెళ్ళలేదు. అందుచేతనే మాకు యతులు గణాలు అక్కరలేదు. ఇంగ్లీషుఫక్కీగా మేము రైముపెట్టాము. రైమంటే చివరప్రాస. కూసెగా వేసెగా చేసెగా అని వేశాను చూశారా? అదే రయిమంటే.

రంగ—అహహా! ఆరైమెంతబాగుందండీ.

గురు—(నవ్వుచు) అల్లాగైతే నాలుగోపాదం నేను పూర్తి చేస్తాను భోజరాజు మొగంచూస్తే సామాన్యమనుష్యులకు కవిత్వం పుట్టినట్లు మహాకవులైన మీమొగంచూస్తె నాకుకూడా కవిత్వం పుట్టుకొస్తోంది.

రంగ—చూచారా మామహత్యం మరి ఏదీ పూర్తి చెయ్యండీ

గురు—ఇదిగో పూర్తిచేస్తున్నాను వినండి ముందు మీ మూడుపాదాలు చదువుతాను తరువాత నాపాదం వేస్తాను.

పొలములో నక్కలు కూసెగా
మనసులో భయ మొ:తొ వేసెగా
పాలేరు యిట్లట్లె చూసెగా
గంగన్న నీముండ మోసెగా

గంగ—(కోపముతో) ఏమిటండీ శాస్త్రుల్లుగారూ! యీలాంటి అధిక ప్రసంగంలో దిగారేమిటి మీరు.

రంగ—జాగ్రత్త శాస్త్రుల్లుగారూ డిఫరు మేషనుచార్జీయిస్తాం ఇలాంటి అధిక ప్రసంగాలు చేశారంటే.

గురు—మీపద్య మెల్లాగుందో నాపూర్తి అల్లాగుంది మీ యిష్టమువచ్చినట్టు చేసుకోండి.

గంగ—ఛీ! రారా ఈయన మాట్లాడవలసిన మనిషిగాడు రాపోదాము.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

సమాప్తము.

—*—

రాక్షససంవత్సర పంచాంగము

ఆనందసంవత్సర మంతరించినది. ఆనందం అంతరించకముందే లోకమున కానంద మంతరించినది. అందరి ఆనందముగోవిందమైనది. రాక్షసప్రవేశించినది. రాక్షస ప్రవేశింపకమునుపే జర్మనీరాక్షసులు, ఆస్ట్రియారాక్షసులు, ఫ్రాన్సుబెల్జియంమీద ప్రవేశించినారు. ఈ రాక్షససంవత్సరములో మహాద్భుతము లనేకములుజరుగును. చంద్రుడు శుక్లపక్షములో పాడ్యమినాడు కనుపడక విదియనాడు కొంచెముగా కనుపడి క్రమక్రమముగా వృద్ధిబొంది పున్నమనాటికి సంపూర్ణుడగును. అమావాస్యనాడు కన్ను పొడుచుకొన్నప్పటికి కనపడనంత కాఱుచీకటి కమ్మును. యుద్ధమునకు వెళ్ళిన సైనికులలో చాలమంది తుపాకిగుండ్లు పిరంగిగుండ్లు తగిలి కిక్కురుమనకుండ చచ్చిపోదురు.

ఈసంవత్సరము సంగీతసభలలోకి వెళ్లిన మనుష్యులు తమ యింటి గొడవలు, కచ్చేరీగొడవలు, లోకాభిరామాయణములు, పుక్కిటి పురాణములు, యిష్టాగోష్టులు, పిచ్చిపాటి, మాటామంతి, చెప్పు కొనుట యెక్కువగానుండును. పాటవినుట తక్కువగా నుండును. ఈసంవత్సరము జరిగినసభలలో చందాలపట్టిక బయలు దేరువరకు జనులు నిండుగా నుందురు. అది బయలుదేరగానే క్రమక్రమంగా సభ సన్నగించును.

ఈసంవత్సరము మామిడికాయలు పుల్లనగానుండును. మిరప కాయలు కారముగానుండును. పొట్టిమిరపకాయే మరంత కారముగా నుండును. గాలిదుమారమునకు మామిడికాయ రాలిపోవును. ఈసంవ త్సరము పన్నులు లేనివారికి శనగలునములుట చక్కిలము లు, జంతికలు తినుట, పచ్చటిబద్దలుకొఱుకుట కష్టముగానుండును. ఈ యేడు వేసవి కాలములో చమటలు శరీరముమీద ప్రవాహముగాకారును. చదువు సంధ్యలులేని త్రాగుబోతులు బహిరంగముగా సారాదుకాణములకు, కల్లుదుకాణములకు పోయి త్రాగివత్తురు. విద్యావంతులైన త్రాగు బోతులు ముసుగులు వేసికొని రాత్రి 8 గంటలైనతరువాత నాలుగు పక్కలు చూచి బ్రాందుపాపులలో దూరుదురు. లేక షికారునంక పెట్టుకొని రైలుస్టేషనుకు, మరికొన్ని యితరస్థలములకు వెళ్ళి కావల సినచుక్కలు నోటిలోపోసికొని వత్తురు. ఒకప్పుడుబుడ్లు తెప్పించుకొని బీరువాలోనె పెట్టుకొని ఔషధమనే వంక పెట్టి సేవించుచుందురు.

రాక్షససంవత్సరములో నల్లులు రాక్షసులవలెపీకును. దోమలు రాక్షసులవలె ధ్వనిచేయును. పిల్లులు రాక్షసులవలె సంచరించును. రాక్షసచుంచులు, రాక్షసయెలుకలు రాక్షసకుక్కలు విజృంభించును. బడిపంతులళ్ళు పిల్లలమీద బెత్తప్రయోగములు యెక్కువగా జేయు దురు. ఈసంవత్సరము చైత్రమాసము మొదలుకొని ఆషాఢమాసాం తమువరకు యెండలు మెండుగాకాయును. చెప్పులులేకుండా నడుచు

వారికాళ్లు కాలును. బి, యేలు ప్యాసయిన తహాశీలుదార్లు మేజ స్ట్రీట్లలో కొందఱు హిరణ్యశ్రాద్ధములు గ్రహించి తృప్తిపొందు చుందురు.

జాయింటువర్తకములో కలహములు హెచ్చు. జాయింటు వ్యవహారములలో ఐకమత్యము శూన్యము.

ఉద్యోగస్థులలో అతిమాత్రము చేత రాచపుండ్ల చేత కొందరు చనిపోవుదురు. వకాల్తనామాలులేని ప్లీడర్లు లేరని విచారించు చుండగా వున్నవారు వచ్చినవారిని తీరుబడిలేదని కసరుచుందురు, రాజమహేంద్రవరములో శ్రీరామనవమి భోగమువాండ్ల మొగము మీద పాటను.

ఈ సంవత్సరము శీతకాలములో బట్టలు లేనివారికి చలి వేయును. రైలు వేఖుద్యోగస్థులలో కొందరికి గర్వము మునుపటివలెనే 100 డిగ్రీలుండును. వైద్యులెక్కువైనకొద్దీ రోగము లెక్కువగు చుండును. డబ్బు తగ్గినకొద్ది వేష మెక్కువగుచుండును. ముసలితనము వచ్చినకొద్ది పటుత్వము చూపవలెనను ఆసక్తి హెచ్చుచుండును. పంట పండునుగాని దారిద్ర్యమెప్పటివలె నుండును. చదువు హెచ్చు పెరుగునుకాని బుద్ధి యథాప్రకారముండును కోర్టులలో వాక్కొక్క వ్యాజ్యమునకు 30, 40 హీరింగులు పడుచుండును. మునుపటివలెనే పార్టీల క్షేమము చూచే ప్లీడర్లుగాని, గుమాస్తాలుగాని అధికారులు గాని వుండరు.

ఈసంవత్సరము రెండేగ్రహణములు పట్టును. ధనగ్రహణము కాంతాగ్రహణము. ఒకటిపగలు ఒకటిరాత్రి పట్టుచుండును. అప్పు డప్పుడు పేదబ్రాహ్మణులకు దానగ్రహణము సంభవించుచుండును, అందుచేత గ్రహణములు మూడని చెప్పవచ్చును. కొన్ని పాణి గ్రహణములుకూడ జరుగునుగాన 4 గ్రహణములు పట్టునని కొందరు సిద్ధాన్తుల అభిప్రాయము.

— వృద్ధిక్షయలు —

సత్యవృద్ధి 1 పాలు.
నాశనము 99
మంచికవిత్వము ½
తుక్కుపుస్తకములవృద్ధి 98½
మాయవృద్ధి 100
నాశనము సున్న
ధనాశ 100
నాశనం సున్న
ఉపకారవృద్ధి ½
అపకారబుద్ధి 99½
నల్లులవృద్ధి 89
తన్నాశనం 11
దోమలవృద్ధి 99
తన్నాశనం 11
నిజమైనదాతృత్వం 1
డాబులదాతృత్వం 99
బిరుదులదాతృత్వము 76
మొగమాటదాతృత్వం 24
కూటసాక్ష్యములవృద్ధి 79
నిజమైన సాక్ష్యము 21
తప్పుసృష్టి 50
తప్పుసలహా 75
న్యాయసలహా 25
అనుపత్రులలోఆదరణ 15

నిరాదరణ 85
డబ్బుకొరకాదరణ 95
అత్తకోడంద్రపోరు వృద్ధి 86
పొందు 14
అసూయ 85 తన్నాశనం 15
ఉపన్యాసములు 97 ఆచరణ 3
పాఠశాలలవృద్ధి 75 విద్యావృద్ధి 25
లంచములవృద్ధి 99 తన్నాశనం 5
పట్టుదల వృద్ధి 90 తన్నాశనం 4
అజీర్ణ వృద్ధి 10 ఆరోగ్యవృద్ధి 30.

పడకగది ముచ్చటలు

హాయ—నేనూళ్ళో లేనప్పుడు జాబు లేమైన వచ్చినవా?

రుక్మి—ఏవో నాలుగు మూడుజాబులు వచ్చినవి అని బీరువాలో జాగ్రత పెట్టినాను.

హాయ—నాకేమైనా మనియార్డర్లు వచ్చినవా.

రుక్మి—మణిహార్డ్లేమి రాలేదు.

హాయ—వెల్లభూములు తాలూకు శిస్తు రయితు మనియార్డరు పంపుతానన్నాడు పంపలేదా.

రుక్మి—రయితు శిస్తు స్వయంగానే తీసికొనివచ్చినాడు.

హాయ—అయితే రూపాయలు నాచేతి కిచ్చినావు కావేమి?

రుక్మి—నాదగ్గరవుంటే నే నివ్వనేయిస్తును.

హాయ—ఏమిటి నీమాటలుచిత్రముగానున్నవి. ఉండ కేమైపో యినవి రూపాయలు? దొంగ లెత్తుకొనిపోయినారా యేమిటి?

రుక్మి—దొంగ లెత్తుకుపో లేదు (అని నవ్వుచున్నది.)

హాయ — (కోపముతో) ఏమిటికిలిస్తావేమిటి పదహారురుపయ్యా బయలుపడేటట్టు రూపాయ లేమైనా యో సంగతి చెప్పు.

రుక్మి—రూపాయ లెక్కడికిపోతాయి. పో లేదని చెప్పినాను.

హాయ—పోకపోతే యిల్లాగియ్యి రూపాయలు.

రుక్మి—నాదగ్గర లేవు. ష రాబు వెంకటరత్నము చేతి కిచ్చాను.

హాయ—(మహాకోపముతో) డేం-ఫూల్ నిన్నెవడిమ్మన్నాడు వెంకటరత్నంచేతికి.

రుక్మి — మీరే యిమ్మన్నారు.

హాయ — (పండ్లుకొరుకుచు)స్టుపిడ్డు-రోగ్. నేనియ్యమన్నానా నిన్ను. ఎప్పుడిమ్మన్నాను ఎందుకిమ్మన్నాను. అబద్దాలు చెపుతావు. నీకు బొత్తిగా ప్రిన్సిపల్సు లేవు నాకు పేము తెస్తున్నావునీవు.

రుక్మి—మీమాటల కర్థమేమిటో నాకు తెలియదు. అనుకుంటే, ఆవాచా దోషాలన్నీ మీకే. వెనక వెంకటరత్నం మనయింటికివచ్చి దుద్దులజోళ్ళుకట్టే మంచికంసాలివచ్చాడు. అమ్మగారికికూడా ఒకటి కట్టించండని మీతో చెప్పినప్పుడు ఈమాటు శివరాత్రికి భూములు మీద శిస్తువచ్చాక, ఆశిస్తు పెట్టి కట్టిస్తానని చెప్పేరా లేదా.

హాయ — అవును మాటవరసకు చెప్పానప్పుడు.

రుక్మి—సరే. అప్పుడు మాటవరసకు చెప్పారు. ఇప్పుడు మాటవరసకు యిచ్చానునేను.

హాయ—ఎప్పుడో యేపరధ్యానంగావున్న పుడో నేనుమాటంటే మళ్ళీనాతో చెప్పకుండా యింట్లో యేమికర్చందో చూడకుండా

రూపాయలు చేతికివచ్చిందేనందని యిష్టమునచ్చిన నగలు చేయించుకొని కులుకుతావా? నేనిప్పుడు భీమాకంపెనీనికి నూటయాభై రూపాయలు పంపించాలి. ఎక్కడనుంచి సొమ్ము తెమ్మన్నావు.

రుక్మి—ఏమో భీమాకంపెనీ కివ్వాలో గీమాకంపెనీకివ్వాలో నాకు తెలియదు. వెనక మీరిమ్మన్నా రుకనుక నేనిచ్చాను. భీమాకెక్కడైనా అప్పుచేసి యిచ్చుకోండి ముందు నెలజీతంలో తీర్చుకోవచ్చు.

హాయ—అప్పుచేస్తే యెవడు తీరుస్తాడు నీతాత.

రుక్మి—నాతాతతీర్చడు మీతాతతీర్చడు మీరేతీరుస్తారు. ఎన్నాళ్ళనుంచో మనసుపడి దుద్దులు చేయించుకుంటూంటే అంత మండిపడతారెందుకూ. ఎల్లకాలము మాసివాయనము ముత్తయిదులాగ చెవులపోగులైనా లేకుండా వుండమంటారా యేమిటి ఇప్పటికి వంటిమీదికి నలభై యేళ్ళొచ్చాయి మనమల నెత్తాను ఒక దక్షిణాది చీరెరగను, ఒక కొర్నాడుచీరెరగను. చేతికి మురుగుపోచలైనా రాయించలేకపోయినారు పుష్యరాగాలతో గట్టిన దుద్దులంటే నాకెంతో మనసు వెనకెప్పుడో వైక్రాంతాలుతో గట్టించుకొన్నాను. అవి నీరుదిగి పాడైపోయినవి. ఇంతా చేస్తే నూరురూపాయలు కిశమిశి పండుగులలో దొర్లకు పట్టిగెళ్ళే పళ్ళు పంచదారచిలకలు అంత విలువుండదు.

హాయ—దొరగారి గొడవ క్రిష్టమసుపండుగ గొడవా నీకెందుకూ. నీవధికప్రసంగము చేస్తూన్నావు నీరోగము నేకుదురుస్తానుండు వెధవపెత్తనంబోడిపెత్తనం చెయ్యకుండా ఆడపెత్తనమున్న కొంపెప్పుడూ ముందరకురాదు. షరాబు వెంకటరత్నానికి గూడ బుద్ధి చెప్పిస్తానుండు ఒకసారి! రాస్కేల్! వాడు ఆడవాళ్ళకి నగలు చేయిస్తానని చెప్పి యీలా డబ్బెత్తుకుపోతూంటాడు ఈపర్యాయం యింట్లోకి రానియ్య గాడ్దెని కొరడాపుచ్చుకొని కొడ్తాను.

రుక్మి—షరాబు వెంకటరత్నాన్ని కొరడాపుచ్చుకొని కొట్టడ మెందుకు. ఆకొట్టదలచినకొరడాదెబ్బ లేవో నన్నే కొట్టండి. ఇందులో లోపమంతా నాదేకాని వెంకటరత్నానిది కాదు. మీరింత కష్ట పడిస్తారన్నమాట యెరక్క పాతికేళ్ళనుంచి కాపరం చేస్తూన్నాను కదా యింతమాత్రము చనువుకూడదాయని స్వతంత్రించి షరాబును పిలిపించి నేనే సొమ్ము స్వయంగా యిచ్చాను. వెంకటరత్నము చేసిన లోప మేమీ లేదు.

హాయ—వెంకటరత్నము లోప మున్నదో లేదో యీమాట వాకట్లోకి రాసీ కనుపరుస్తాను. నాకు మొదటినుంచి నగలంటే తల నొప్పి నగలుచేశేవాళ్ళనీ చేయించేవాళ్ళని చూస్తే అరికాలుమంట నెత్తికివస్తుంది,

రుక్మి—అంత తలనొప్పి అంత మంటా యెందుకు. నగలు చేయించుకోవడం హానికాదు. అపకీర్తికాదు. కానిపనికాదు నలుగురు లోకి వెళ్ళినపుడు తలయెత్తుకోవడానికి వీలు లేని పనికాదు.

హాయ—హాని అపకీర్తి లేకపోతే సరా. నగలు చేయించడం సొమ్మంతా పాడుచేయడం దీనివల్ల యెన్నో నష్టము లున్నవి.

రుక్మి—ఏవీ ఆనష్టాలన్నీ ఒక్కమాటు సెలవియ్యండి. ప్రపంచ మంతటకీ లేనినష్టా లేమిటో ఒక్కమాటు చూస్తాను.

హాయ—ఒకటా రెండా నష్టాలు. లెక్కలేనన్ని యున్నాయి ముందుగా దొంగలభయం.

రుక్మి—నగలు చేయించుకోకుండా సొమ్ముదాచుకుంటే దొంగలభయ ముండదాయేమిటి. అప్పులిస్తే అప్పులవాళ్ళగబెడతారు. యింట్లో వుంచుకుంటే దొంగలెత్తుకుపోతారు దొంగలకు నగలైనా రొక్కమైనా యొకటే.

హాయ— నామాట పూర్తిగా వినకుండా వాదం చేయడాని కారంభిస్తావేమిటి నీవు.

రుక్మి—సరే సరే చెప్పండి పూర్తిగా వింటాను.

హాయ—సొమ్ము వడ్డీ లేకుండా పడియుండడము ఒకటి

రుక్మి—వడ్డీ:—

హాయ—అదిగో మళ్ళీ నోరెత్తుతున్నావు నామాటలు వినకుండా, మీ ఆడవాళ్ళంతా ఫూల్సు.

రుక్మి—సరే. మరిచిపోయినాను. చెప్పండి చెప్పండి మేము ఫూల్సుము కాబట్టే మీ ఆటలన్నీ సాగివస్తూన్నాయి.

హాయ—నగలు పెట్టుకొనుటవల్ల అందము చెడిపోవడము ఒకటి.

రుక్మి—(నవ్వుచు) అందం చెడిపోతుందా?

హాయ—చెడిపోతుందా మరీచెడిపోతుంది భాగవంతుడిచ్చిన సహజసౌందర్య ముండవలెగాని నగలతో అందమొస్తుందా. విద్య లేకపోవడంచేత మూర్ఖులై మీరందరూ నగలో నగలో అని మగవాళ్ళను పీకిపిండిపెట్టి సొమ్మంతాపాడుచేసి మళాగత్తుక్రింద తరుగుక్రింద కొంతపాడుచేసి సొమ్మంతా ధ్వంసముచేస్తారు నగలే మనదేశాన్ని కొంపలు తీస్తున్నాయి. నగ లెప్పుడు చేయించుకోవడంమానతారో అప్పుడు మనదేశము బాగుపడుతుంది. నగలు చేయించుకొన్నంత కాలము మనదేశ మీ దరిద్రస్థితిలోనే యుంటుంది.

రుక్మి—మీరు మగవాళ్ళు మీమాట చెల్లుతుంది. మామాట చెల్లదు అయినాయేవో రెండు తెలివితక్కువమాటలు నేనుకూడ చెపుతాను వినండి. నగలుచేయించుకోడంవల్ల వడ్డీలేకుండా సొమ్ముపడి యుంటుందని మీరు చెప్పినారు. నిజమే వడ్డీపోతుంది. అన్నింటిమీద మనకు వడ్డీ వస్తుందా? కట్టుకునేబట్టలకు నాలుకు మూడువందల

రూపాయిలు మనకవుతోంది. తిండికింద సాలుకు మనకు రెండువేల రూపాయ లవుతున్నాయి. వాటిమీద మనకు వడ్డీవస్తూందా. పదివేల రూపాయలుపెట్టి మీరు కాపరముండేటందుకు మేడకట్టించారు. దాని మీదేమైనా వడ్డీవస్తూందా మీకు. అల్లాగే నగలమీదకూడా వడ్డీ రాకపోయినప్పటికి నష్టము లేదు.

హాయ—నా న్నెన్ను. కట్టుకునేబట్టా, తినే తిండి, ఉండేయిల్లూ మోస్తరా నగలు.

రుక్మి—ఇందాకామీమాటకు నేనడ్డమువచ్చినప్పుడుచీవాట్లు పెట్టారుగదా యిప్పుడు నామాటకు మీరడ్డమురావచ్చునా. నామాటంతా అయినతరువాత మీరు జవాబుచెప్పండి.

హాయ—ఓహో! నన్ను దెప్పుతున్నావా యేమిటి.

రుక్మి—బియ్యేలు యమ్మేలు ప్యాసయిన మీవంటి చదువుకొన్నవారికి పనికిమాలిన ఆడదాన్ని నే నెంత చెప్పగలను కాని నా మాట కడతేరా వినండి. అందం చెడిపోతుందన్నారు మీరు దేవుడిచ్చిన అందముండాలికాని నగలవల్ల అందమొస్తుందాఅని మీరు సెలవిచ్చారు. దేవుడిచ్చిన అందముండవలసిన దేకాని వీటివల్లకూడా కొంత అందమువస్తుందని నేననుకుంటాను. ఎల్లాగంటె యింటికందం రావాలంటె సెల్ల వేస్తారు. తోరణాలు కడతారు. అరటిస్తంభాలు గుమ్మాలముందర కడతారు. స్తంభాలకి పచ్చని కొబ్బరిమట్ట లల్లుతారు. పువ్వులదండలు కడతారు. చాండనీలు కడతారు. గ్లోబులు వాలుషేడ్లు మంచిమంచి లాంపులు యెరువుతెచ్చైనా పెడతారు. ఇంటికి సహజసౌందర్య ముండాలికాని యీ తెచ్చిపెట్టిన అలంకారాలెందుకు, మీటింగులైనప్పుడు టౌనుహాలులోను అక్కడాకూడా యిల్లాటిఅలంకారాలే చేస్తారు. ఆకులవల్లా పువ్వులవల్లావస్తుందా యేమిటిఅలంకారము. మీరే అల్లాటివిమెందుకుకట్టిస్తారక్కడ. ఆకుల

వల్లా పూవులవల్లా మొంతో అందము గోడలకు గొంతెలకు వస్తూంటే సెండ్లివల్ల బంగారమువల్ల వజ్రాలవల్ల గత్తాలవల్లా మనిషి కందం రాదా యేమిటి. కాలి కంటెపోచైనా ముక్కో పట్టెడపోచైనా చెవికి బావిలీమైనా లేకుండామూసి చాయనంచు త్తైమవులాగుంటేపునిస్త్రీ అందంగా వుంటుందా యేమిటి నేను మోటమూ టన్నానని మీరు కోపపడవద్దు. ఊరకే సంగతి చెప్పాను.

హాయు—నగలవల్ల అందము మనఆడవాళ్ళకేనా లోకంలో తక్కిన ఆడవాళ్ళకుకూడా వుంటుందా?

రుక్మి—లోకంలో అందరాడవాళ్ళకు నగలవల్ల అందము వస్తుంది. ఆడపుట్టుకపుట్టిందల్లా నగలు పెట్టుకోవాలని యుబలాటము పడుతుంది.

హాయు—అయితే దొరసానులుకూడాఆడవాళ్ళేనా? వాళ్ళెందుకు నగలకోస ముఃబలాటపడరు.

రుక్మి—నగలవల్ల అందం వాళ్ళు గ్రహించలేదేమో కాని లేకపోతే పెట్టుకోరా. అప్పటికి కొందఱుదొరసానులు వజ్రాలుచెక్కిన యుంగరాలు పెట్టుకుంటారు వాచీలా అవేమిటో అంటారు జేబు గడియారాలు. కెంపులు వజ్రపురాళ్ళు చెక్కిన బంగారపు డిప్పలూ వున్న జేబుగడియారాలు వేసుకుంటారు. మంచిమంచి రాళ్ళు చెక్కిన బంగారపుగొలుసులు వాటికివేస్తారు. అవన్నీ అలంకారాలు నగలు కావాయేమిటి? ఎన్నిగంటలైనదో చూచుకొందుకు పట్టిగడియారము చాలదాయేమిటి? బంగారపు డిప్పలువున్న దేకావాలా, బంగారపు గొలుసున్నదే కావాలా, కెంపులు చెక్కినదే కావాలా? అవన్నీ నగలు కావాయేమిటి? కంఠి కాసులపేరూ మాత్రమేనా నగలంటేను ఇవన్నీ నగలే. అన్నట్టు మరచిపోయినాను నీటికేమి నీములోవుండే మన రాజుగారిభార్య రాణిగారు పట్టాభిషేకమప్పుడు ఎన్నోనగలు

పెట్టుకుందని పత్రికలలో చదువుకున్నాము. అప్పుడు మంగమ్మ పిన్ని నేనుకూడా అనుకున్నాము. దొరసానులుకూడానగలు పెట్టుకుంటారా చూచావా అని.

హాయ—దొరసానులలో నూటనాటయెక్కడో ఒకావిడ పెట్టుకొంటుందిగాని దరహాంమీద మనకిమల్లే నగలోనగలో అనిపలవరించి మగవాడిని పీకిపిండిపెట్టి నెత్తురుపీల్చి అప్పోసప్పో చేయించి నగలు పెట్టుకోరు.

రుక్మి—పీకిపిండిపెట్టి నెత్తురుపీల్చి నగలుపెట్టుకోవడం యెవరూ వప్పుకోరు. ఇంట్లో బువ్వాగడవడమే కష్టముగానున్నపుడు నగలు తెమ్మని బాధపెట్టేపెళ్ళాము బ్రహ్మరాక్షసిగాని పెళ్ళామవుతుందా యేమిటి? అటువంటివాళ్ళు యెక్కడనో వెయ్యికొక్కర్తె యుంటుందిగాని సాధారణముగా నుండరు. మగవాడు బాగా సంపాదిస్తూన్నపుడు నాలుగుడబ్బులు వెనకపడుతూన్నపుడు ఆడది కొంచెము పట్టుపట్టినా నగలు చేయించుకొన్నా అందము చందము వుంటుంది కాని భూములు తాకట్టుపెట్టి అప్పులుచేసి నగలు చేయించుకోవడం బాగుంటుందా యేమిటి?

హాయ—ఎల్లాగైనా దొరసానుల మోస్తరుగా మనవాళ్ళు కేవలం మంచిదుస్తులు వేసికొని నగలులేకుండావుంటే చాలా బాగా వుంటుంది.

రుక్మి—దొరసానులులాగు అన్నింటిలోనూ వుంటే బాగాఉంటుంది. ఒక్క నగలలోనేకాదు. దొరసానులులాగు గుఱ్ఱపుబళ్ళు కట్టించుకొని మనవాళ్ళుకూడా ఒక్కళ్లు షికారువెడితే బాగావుంటుంది. పైమగవాళ్ళెవరువచ్చినా నసురు బెదురు లేకుండా వాళ్ళతో మాట్లాడి షికారుకొడితే బాగావుంటుంది. వాళ్ళలా మేముకూడా పెద్దవాళ్ళమయినదాకా పెళ్ళిచేసుకోకుండా కాలేజీలకువెళ్ళి

చదువుకుంటే బాగావుంటుంది. అన్నింటిలో వాళ్ళలాగ మమ్మలిని కూడా తయారుచేసినతరువాత నగలలోకూడా వాళ్ళంతవాళ్ళు కమ్మని చెపితే బాగావుంటుంది.

హా—మన పెద్దవాళ్ళు మూర్ఖులై వప్పుకోరుగాని వాళ్ళ పద్ధతులన్నీ బాగానే వున్నాయి. చదువుకుంటే తప్పా? షికారు వెడితేతప్పా? అవన్నీ మనవాళ్ళు వప్పుకోకపోతేమట్టుకు నగల విషయములో మనము మార్పుచేసికోగూడదా? ఒకవేళ అందంగావుంటే వుంటుందనుకో! ఉపయోగ మేమైనా వుందా?

రుక్మి—అదిగో అల్లాసబబు గారండి. చెపుతాను. ఉపయోగ ముందో లేదో చూతురుగాని. నగలవల్ల యెంతైనా ప్రయోజన మున్నది.

హాయ—ఏమిటా ప్రయోజనం? అన్ని శాస్త్రాలు చదువుకొన్న వాడిని నాకు తెలియని ప్రయోజనాలు నీకేమి తెలిశాయో చెప్పు.

రుక్మి—ఈమాత్రము తెలిసికోనేటందుకు శాస్త్రాలు చదువుకోనక్కరలేదు. బియ్యేలుప్యాసు కానక్కఅలేదు. ఆడదాని వంటిమీద నగలంటూ వుంటే మగవాడికి యేఅవసరము వచ్చినప్పటికి అవి అక్కరకువస్తాయి. తాకట్టు పెట్టుకోవచ్చు. అమ్ముకోవచ్చు. ప్రాణావసర మేదివచ్చినప్పటికి నగలే తల కాస్తాయి. ఎన్నిభూములున్నా సమయానికి అక్కరకురావు. రొక్కము పెట్టెలో వుంటే తప్ప ఒకళ్ళకి బదులిచ్చినప్పటికి సమయానికి అక్కరకు రాదు. సమయానికి అక్కరకువచ్చేవి పెళ్ళాము వంటిమీద నగలే. భూములు తాకట్టుపెట్టి తెచ్చుకోవాలంటే పదిరోజులో పదిహేనురోజులో అవుతుంది. పైగా రాతలు కోతలు అవడంచేత నలుగురికి తెలుస్తుంది. నగలయితే ఒకగంటలో తాకట్టుపెట్టి తెచ్చుకోవచ్చును. సొమ్ము వెంటనే చేతిలో పడుతుంది. తాకట్టు పట్టినవాడికి మనకూతప్ప

యిక నెవ్వరికి తెలియదు. నగలలో యింత ప్రయోజనమున్నది ప్రయోజనం లేదనుకోవడం వట్టి పొరబాటు.

హాయ—అబ్బో! కోతలు చాలానేర్చావు. ఆడదాని వంటి మీద నగపెట్టినతరువాత అవి మళ్ళీ మగవాడికవసరాని కక్కరకు వస్తాయా? అర్చిచచ్చినా, నాలుకపీక్కున్నా ఆడది మళ్ళీ తాకట్టు నిమిత్తం మగవాడికి వస్తువులిస్తుందా? మగవాడిని బుట్టలోపెట్టి నగలుచేయించి వంటినిండా దిగవేసుకుంటుకు మాటవరుసకు యిస్తా నంటుందేకాని, అబ్బో యెన్నిగడబిడలు చేస్తుంది నగలిమ్మంటే. అడగ్గానే కావలసినంత కోపము, తాపము, పరాకు, చిరాకు, మొగము మటమట, నొసలు చిటచిట, కండ్లనీరు, అడిగినమాటకు జవాబు రాదు. అమ్మలక్కలతో నేరాలుచెప్పకొని యేడవడం. అబ్బో! నేనెఱుగనాయేమిటి. ఆమధ్య చంద్రయ్య యేదో వారంటువచ్చి పెండ్లామును కంఠియిమ్మని అడిగితే కొంపలో చిచ్చుపెట్టిందావిడ. చిట్టచివరకు వీధిలో వాళ్ళందరూ చేరి తగవుపెట్టినతరువాత మూడుప వాసాలుచేసి అందరూ చీచీయన్నతరువాత కంఠికొక్కటి విసిరి మీద పారవేసింది. అవసరంవచ్చినదాకా నేకాని వస్తే అందరికి చంద్రయ్య అవస్తే పడుతుంది.

రుక్మి — అందరూ అల్లాంటి గయ్యాళివాళ్ళుండరు. మంచి పెళ్లాలుకూడా లోకంలోవుంటారు మగవాడికవసరంవస్తే యివ్వనిది బ్రహ్మరాక్షసికాని పెళ్ళాంకాదు.

హాయ — సరే యీవాదమంతా యెందుకు? అయిపోయినదే మిటో అయిపోయినది. సొమ్ము మించాయిచ్చావుగనుక యీ దుద్దులు చేయించుకో. ఇకముందు నాతో చెప్పకుండా యేనగలు చేయించుకో వద్దు. ఎప్పుడూ ముందు సొమ్మియ్యవద్దు.

(అని యిద్దరు నిష్క్రమింతురు)

(వాసుదేవరావుగారు కామాక్షమ్మ ప్రవేశించు చున్నారు)

కామా— ఈలాగున మీరూరకుంటే యేలాగు? అయిన సంబంధాలన్నీ దాటిపోతున్నాయి. మన పెద్దమ్మాయికి పెండ్లయ్యే దారి కనబడదు. మీకు చీమ కుట్టినట్టయినా లేదు. పెండ్లీయీడొచ్చిన కూతురు యింట్లో వుంటే మీరు కన్న మేలా వంటపడుతూందో కంటికి నిద్ర యేలా వస్తుందో నాకు తెలియదు. నాకెనిమిదో యేడు రాగానే మా బాబయ్య ఒంటిమీద చీమలు జెర్రెలు పాకినట్లు బాధపడి మెన్నోవూళ్ళు తిరిగి నానావస్థ పడ్డారు. మాచిరాజువారి సంబంధము దాటబెట్టారు. ఇలపర్తివారి సంబంధ మిట్టే మెరిపోయింది కదా. మనవాళ్ళలో మగపిల్లవాడు కనబడితే మెవరో యొకరు తీసికొనిపోయి ముడిపెడతారు కాని వదిలిపెడతారా? మన పిల్ల బొద్దు కూడాను. నాకెంతో అంత బెంగగా వుంటుంది.

వాసు—అయితే మనపిల్ల కెన్నో యేడు?

కామా—యేండ్లకు వైశాఖశుద్ధ పూర్ణిమనాటికి పదేండ్లు వెడతాయి.

వాసు—సరే ఇది యింకా మాఘమాసమే కదా. పదోయేడు వెళ్ళలేదన్నమాట. ఇంకా తొందర లేదు.

కామా—తొందర లేదంటారేమిటి. కావలసినవాళ్ళు పలుగురు మిమ్మల్ని చూచి నవ్వుతున్నారు. నా నోట్లో గడ్డెడుతున్నారు. మొన్న మాపింతల్లికూతురు పలివెలనుంచి వచ్చి ఎంతో అంతతప్పు పట్టినది. మన యింటి ఆడపడుచులు పదకొండో యేటే కాపరానికి వెడతారు. ఇదేమిటే అమ్మా నీపింకా పెళ్ళి చేయనని నన్ను తెలవాచేటట్టు చీవాట్లుపెట్టినది. మీపిల్లని సానిని చేస్తారటే పెళ్ళి చేయకుండాను అని మామేనత్తకూతు రడిగింది.

వాసు మీచుట్టాలందఱు నిన్ను దెప్పనీ తిట్టనీ నవ్వనీ యేడ్వనీ పన్నెండేళ్లొస్తే కాని నేను పెళ్ళి చేయను. ఈరోజులలో పన్నెండేళ్ళొస్తే కాని యెవరు చేయడము లేదు. చిన్నపిల్లకు చేస్తే నా కాక్షేపణగా ఉంటుంది. పైగా నీవు పదకొండేళ్ళకు కాపరానికి రాలేదు. నీ చెల్లెలు పదకొండేళ్ళకు కాపరానికి వెళ్ళలేదు. పదమూడేళ్లొస్తేనే కాని మీరెవరు పెద్దవాళ్ళు కానేలేదు.

కామా—పన్నెండేళ్లొచ్చేదాకా చెయ్యరూ! ఇదేమి సోద్దెమమ్మా. ఇంటా వంటాలేని పను లొచ్చాయి. ఇక మన మంతా గంగాప్రవేశము కావలసినదే. అప్రదిష్టపడ లేకుండా వున్నాను. కాకులు పొడిచినట్లు పదిమందీ పొడుస్తారు. ఈకాలపువాళ్ళంతా పన్నెండేళ్ళకే పెళ్ళిళ్ళు చేస్తున్నారా? ఎవరు చేస్తున్నారు అలాగ? మనంత వెఱ్ఱిముండావాళ్లు కారు వాళ్లు. సుబ్రహ్మణ్యము పంతులుగారిన్ని కబుర్లు చెప్పి తొమ్మిదేళ్ళపిల్లకు పెళ్ళిచేసియూరకొన్నారు. రంగారావుపంతులుగారేడేళ్ళపిల్లకే చేశాడు. భీమరాజుగారుకూతురుకి మూడోయేటనే పెళ్ళిచేశారు. జ్ఞాపకము లేదూ? కన్యాదానపువేళ నిద్రపోతూ తల్లిబట్టమీద యేదో చేసిందని చెప్పుకున్నారు. పైగా సభలో వున్నప్పుడు పాలిమ్మని చంపిందట తల్లిని.

వాసు—వాళ్ళు కక్కుర్తిపడితే మనము గూడా కక్కుర్తిపడాలనియున్నదా యేమిటి? పాలుతాగేయీడున పిల్లకుకూడా పెళ్ళి చేయలేదని నీకు విచారముగా నున్నదా యేమిటి? కావలిస్తే యీమాటు పిల్ల పుట్టినప్పుడాముచ్చట తీర్చుకొందుగాని.

కామా—(తల వంచి) చాల్లెండి. ఇల్లాంటి కొంటెమాటలకేమి. అలాటి చంటిపిల్లలకు పెళ్ళి చేయాలని నాకు ముచ్చట లేదు. బియ్యేలు బియల్లులు ప్యాసయిన పెద్దపెద్దలంతా అల్లా చేస్తున్నారని చెప్పినాను. అల్లాటి అన్యాయపు పెళ్ళి చేయమన లేదు. లోకంతో పాటుగా పదేళ్ళు వచ్చిన పిల్ల గనుక తగిన సంబంధము వెతికి పెళ్ళి

చెయ్యమంటూన్నాను. అయిన సంబంధాలు దాటిపోతే తరువాత మనకు దొరకుతాయా? పస్తాయించిన కార్య ముంటుందా? అదిగాక మా అమ్మ పెద్దనుండాకూతురు గదా. కాటికి కాళ్ళు చాపుకొని యున్నది. అమ్మాయీ నేను బ్రతికియుండగానే పిల్లకు పెళ్లి చెయ్యవే, ఈ ముచ్చట చూచుకొని పోతానని చెవినిల్లుకట్టుకొని పోరుతూంది. మొన్న మా తమ్ముడొచ్చేటప్పుడు వర్తమాన మంపింది. చైత్ర మాసంలోమాఘమి వైశాఖమాసములో ఎంకలు, అందుచేత యీ మాఘఫాల్గుణ మాసములలో ఎక్కడో అక్కడ మంచి సంబంధము చూచి చెయ్యమన్నది. ఏమో పెద్దది. బతికినన్నాళ్ళు బ్రతకదు కదా. దాని ముచ్చటతీరుద్దామని నా మనస్సులో నున్నది. ఇంత కంటె నేను దానికి చేసే దేమున్నది. పెట్టనా పొయ్యనా? ఎప్పుడైనా చేశేపెళ్ళే కదా. ఆవిడుండగానే చేస్తే తీరిపోతుంది. ఆవిడ ముద్దు చెల్లించినవాళ్ళ మవుతాము. ఇదంతా ఆవిడ కడుపుచలవే కాదూ?

వాసు—సరిసరి. ఇదా దానిరహస్యం. పెళ్లితొందర కారణం తెలిసింది నాకు. మీ యమ్మ ముచ్చట తీర్చనలెనా! మీ యమ్మ ముచ్చటకోసం నేను పెళ్ళిచేశేవాడను కాను.

కామా—అవును! మా అమ్మముచ్చటకోసం మీరు చేస్తారా యేమిటి? నేనుబుద్ధిగడ్డితిని అలాఅడిగాను కాని, మా అమ్మ యెవర్తె అడిగేటందుకు? మా అమ్మకోసం మీరు చెయ్యనక్కర లేదు. ఊరు కొన్నదాన్ని ఊరుకోక యేదో ఒకటి తెచ్చిపెడతాను నేనే. దాని పెళ్ళిగొడవ నా కెందుకు నిద్రపోక. (అని నిదురించును.)

(ఇద్దఱు నిద్రపోవుదురు)

—*—

(వాసుదేవరావు కామాక్షమ్మ ప్రవేశించుచున్నారు.)

కామా—ఎల్లకాలముఒక చేపట్టా. ఎప్పుడై నావిడుపున్నదా.

వాసు—దేనికి విడు పుండవలెనంటావు.

కామా—పట్టిన సంతానికి.

వాసు—విడు పుండవలసినచోట తప్పకుండా ఉండితీరుతుంది. ఉండకూడనిచోట ఉండనే యుండదు.

కామా—పిల్లదాని పెళ్ళిమాట స్థిరంగా చెప్పండి మీయభిప్రాయ మేమిటోను?

వాసు—ఇన్నిమాట్లు చెప్పేదేమిటి ఒకపరియాయమే చెప్పివేశాను. ఇప్పుడు చెయ్యనని.

కామా—సరే యిప్పుడు చెయ్యకపోతే చెయ్యకపోయినారుకాని సంబంధ మేదైనా యిప్పుడు స్థిరపరచి యుంచుకుందాము. దానికైనా అంగీకరించండి. మంచి సంబంధాలు దాటిపోతే దొరకవని మీకుగూడ తెలుసునుగదా.

వాసు—మంచి సంబంధాలంటూకొన్ని యున్నాయా యేమిటి! ఎప్పుడు కావలిస్తే అప్పుడే వుంటాయి మంచిసంబంధాలు చెడ్డసంబంధాలున్నూ.

కామా—అమాట నేను వప్పుకోను.

వాసు—ఒప్పుకోకపోతే మంచిసంబంధ మేదో చెప్పు. వీలుగానుంటే కుదర్చి యుంచుకుందాము.

కామా—నిడదవోలు సంబంధము చాలామంచిది.

వాసు వా రింటిపేరెవరు ?

కామా—కొచ్చర్లకోటవారు.

వాసు—పిల్ల వాడి కెంతవయస్సున్నది ?

కామా—పదియారు సంవత్సరము లుంటాయి.

వాసు—ఏమి చదువుకొన్నాడు?

కామా—తెనుగుబళ్లో చదువుకున్నాడు. ఇంగ్లీషు చదవడం లేదు.

వాసు—అయితే చదువు సంధ్యలు రాని శుద్ధ మొద్దు స్వరూపాని కిమ్మంటావా?

కామా—మరీ చోద్యాలూ శుద్ధ మొద్దు స్వరూపమా? వ్రాలు చేయలేడనుకొన్నారా! నిశానీప ద్దనుకొన్నారా. లెక్కా డొక్కా సొంతముగా చూచుకుంటాడు సాలుకు నాలుగువేల రూపాయలు వస్తాయి. ఏభై వేల రూపాయల రొక్కము వడ్డీకి తిరుగుతూంది.

వాసు-అయితే ఆసొమ్ము చాలంటావూ చదువు లేకపోయినా.

కామా—చదువెందుకు సొమ్ము సంపాదించడానికే గాదు. ఆసొమ్ము కావలసినంత యింట్లోవున్నప్పుడు చదువెందుకేమిటి. శుభ్రంగా పెళ్ళికూతురుకు వంటినిండా నాలుగైదువేల రూపాయల నగలు పెడతారు. ముద్దినిసు చీర ముద్దినిసు రవిక యిస్తారు. అన్ని ముచ్చట్లు జరుగుతాయి అత్తామామా యున్నారు. ఒక్కడే పిల్లాడు.

వాసు—అయితే కూతురుకి వంటినిండా నగలొస్తాయనా యీ సంబంధము చెయ్యమనడం.

కామా—ఒక్క నగలేనా యేమిటి. పిల్ల సుఖపడుతుందని చెయ్యమన్నాను.

వాసు-బియ్యే ప్యాసయినవాడికిస్తే పిల్ల సుఖపడదా యేమిటి.

కామా—బియ్యే ప్యాసయినవాడికిస్తే సుఖపడేకన్న నేను చెప్పిన సంబంధమువాడికిస్తే యెక్కువ సుఖపడుతుంది. పిల్లవాడు బియ్యే ప్యాసయి యేంజేస్తాడు? ఏ కచేరీలోనో పదిహేను రూపాయలగుమాస్తాగా ప్రవేశించడమే కామా! ఆ పదిహేను రూపాయలు మొగుడూ పెళ్ళానికి బువ్వకైనా చాలవు. ఇంటద్దెలకు. కట్టుకొనే

బట్టలకు, రోగాలొస్తే మందులకు అన్నింటికి తద్దినముదగ్గరనుంచి దేవతార్చనముదాకా మనమే. పంపుతూండాలి డబ్బు పెళ్ళికొడుక్కి పూటకు టికాణా యుండదు. నా అన్నవస్తు వెక్కడా యుండదు. ఏభైరూపాయ లుద్యోగ మయ్యేటప్పటికి పదిపద్దాలు గేళ్లు పడుతుంది. పేరు గొప్పా ఊరు దిబ్బా అన్నట్టేగాని యేమిసుఖ ముంటుంది బిడ్డకి? మనుసొచ్చిన రవికెలగుడ్డ కొనుక్కుందామంటే ఒక్కపావలా డబ్బులుంచవు పిల్లదగ్గిర అమ్మాయికి పుట్టింటివారిస్తే కలదు, లేక పోతే లేదు.

వాసు—భూమీ పుట్రా లేకపోయినా యిల్లూవాకిలీ లేక పోయినా బియ్యే ప్యాసయినట్టయితే పేరూ ప్రతిష్ఠా వుంటుంది. క్రమంగా గొప్ప వుద్యోగ మవుతుంది. పూటకు టికాణా లేని బియ్యేలు ఇప్పుడు డిప్యూటీ కలక్టరులు చేస్తూన్నారు. సబుజడ్జీపనులు చేస్తూన్నారు వాళ్ళత్తవారు వాళ్ళ చదువులుచూసే పిల్లనిచ్చారు కాని వాళ్ళ ఆస్తి చూచికాదు. చదువులేని శుద్ధమొద్దుకు పిల్లనిచ్చి ఇత డెవరండీయని పెద్దమనుష్యు లడిగినప్పుడు నా అల్లుడని చెప్పు కుంటే నాకెంతో సిగ్గుగా వుంటుంది.

కామా—నెత్తిమీద గుడ్డిగవ్వ పెడితే గుడ్డిగవ్వ చెయ్యని వాడికి పిల్లనిస్తే సిగ్గుగా నుండదుగాబోలు మీకు.

వాసు - చదువుకొన్నవాడికిస్తే సిగ్గుపడవలసిన అవసరము లేదు. మనపిల్ల ఘట్టుఘోరములో చదువుదూందికదా. దానిమాత్ర మైనా చదువురాని నిర్భాగ్యుని కెల్లా యిమ్మన్నావు పిల్లని. ఉత్త రమువస్తే పెళ్ళాము చదివిపెట్టాలి. టెలిగ్రాఫువస్తే ఊరమ్మట పరుగెత్తాలి చదివించుకుందుకు.

కామా—విచిత్రపు కబుర్లూ విడ్డూరపు మాటలూ. నాకెందుకు ఓయిష్టమువచ్చినట్లియ్యండి. మీపిల్ల మీకు స్వతంత్రం.

నాకేమి స్వతంత్రముంది? ఊళ్ళో పిల్లలందరు కంటెలు కాసులు పెట్టుకొనియుంటే నా మొగుడు బియ్యేఅని చెప్పుకుంటూ మెళ్ళో బొందూ అదీ మూసి వాయనము పేరంటాలులాగ నుంచుంటేమిాకు సంతోషముగా నుంటుంది.

[అని దుప్పటి ముసుగు వేసికొని పండుకొనును]

వాసు—నీవు నూరు చెప్పు వేయి చెప్పు. నేను బియ్యే ప్యాసయినవానికేగాని యియ్యను.

(అని నిద్రపోవుచున్నాడు)

—♦

[పార్థసారథిరావుగారుభార్యమీనాక్షమ్మగారుప్రవేశించుచున్నారు]

పార్థ—కట్నమువిషయమై నీకు సంతుష్టికలిగినదికదా?

మీనా—యుక్తులు పన్నడంలో మీరందివేసిన చెయ్యి. ఉపాయాలు చెప్పడానికిమీరంటే నాకు సంతుష్టి కలుగకపోతుందా యేమిటి.

పార్థ—నీవంటి పెళ్ళాముంటే యెన్నియుపాయాలయినా చెప్పవలసివస్తుంది ఇంకానీకేమిసంగతులుకావాలో అడుగు. యిప్పుడే మన మిద్దరము పరిష్కారము చేసికుంటేమంచిది.

మీనా—అలాగైతే చెపుతా వినండి. మంచిభోగము మేళము పిలిపించాలి.

పార్థ—బ్రహ్మ దిగివచ్చినా సరే. అందుకు నేను వప్పుకొనను

మీనా—ఎందుకు వప్పుకోరు ?

పార్థ—వివాహములలో భోగము మేళము పిలువగూడదని మేము ప్రతిజ్ఞ చేసికొన్నాము. చిన్నప్పుడు కాలేజీలో చదివేటప్పుడే నేను కాగితములో సంతకం చేసినాను భోగము మేళము లేనిదే పెళ్ళి జరగదా యేమిటి?

మీనా—(కోపముతో) భోగము మేళము లేకపోయినా పెళ్ళి జరుగుతుంది. బాజాభజంత్రీలు లేకపోయినా జరుగుతుంది. పెళ్లి కూతురు పెళ్లికొడుకు వుంటేసరి. పెళ్లి జరగడానికేమీ అభ్యంతరము లేదు.

పార్థ—అభ్యంతరము లేనప్పుడింక భోగము మేళ మెందుకు?

మీనా—మేళమే కాదు భజంత్రీలు పల్లకీకూడా మానిపించండి మనకు కాలసినంత సొమ్ము కూడివస్తుందిగా.

పార్థ—ఇదేమికర్మము ప్రతివిషయములోను కత్తివెయ్యనా బద్దవెయ్యనాయని నాతో నెపరువాదము లంకించుకుంటున్నావు. ఒక సంగతిలోనైనా నామాట వినవద్దానీవు.

మీనా—ఇప్పుడు వినక మీమాటలు కేమి యెదిరించాను. కాకపోతే పిల్లవాడి పెళ్లి శోభగా చెయ్యమన్నాను. ఇంతేకాదూ నావల్ల వచ్చినతప్పు. ఇంతమాత్రము మాట చెప్పకుండా మూగిమూంశా నమ్మలాగ నోట్లో గుడ్డలు కుక్కుకొని యింట్లో కూర్చోలేను మరి. లేక లేక యీయొక్క గుంట పెధవ బ్రతికాడు. వాడి పెళ్లి ముచ్చటగా అచ్చటగా చేసుకుందామని యేలూరులో భోగము మేళము పిలిపింతామని నాకెంతో అంత యిదిగా వుండేది. అందులో యొకర్తె భామవేషము కడుతుందట. దాని చేత భామవేషము కట్టించి వినాలని మన వీధిలో ఆడవాళ్ళు మన చుట్టాలు అంతా ముచ్చటపడుతూ వున్నారు. అబ్బాయి పెళ్ళినాడు కట్టిస్తానని నేను వాళ్ళతో చెపుతూ వుండేదాన్ని. నావెఱ్ఱేకాని కట్టించేటందుకు నే వర్తిని? మీ యింట్లో దాసీదీ యుంది నేనూ వున్నాను. చాకిరీ చేస్తే దానికీ యింత అన్నం పెడుతున్నారు. నాకూ యింత అన్నం పెడుతున్నారు.

పార్థ — అబ్బో! కోరికలు చాలాదూరమున్నాయి. ఏలూరు మేళమూ, భామ వేషమూనా? అంతకంటె హరికథలు చెప్పించుకోరాదూ. పుణ్యాము మోక్షమూ వస్తుంది. ఆబూతుకూతలజావళీలే వినాలి. రామా కృష్ణా అనేమాటలు చెవిని పడగూడదా.

మీనా — మాకు హరికథలు గిరికథలు అక్కరలేదు. మేమంత వేదాంతులము కాము. ఇది కైలాసాగా తిరిగే పెళ్ళి కాని బైరాగుల సూతంగాడు హరికథలు చెప్పించేటందుకు. ఏకాదశీవ్రతము చేసేటప్పుడో సత్యనారాయణవ్రతము చేసేటప్పుడో హరికథలు చెప్పించవచ్చును. పిడుగుకు బియ్యానికి ఒకే మంత్రమున్నట్టుగా ఎప్పుడు పడితే అప్పుడే హరికథలు. వేందాంతులు వచ్చారు చెంబు మంతా జాగ్రత్తచేసుకోమన్నట్టు మీరు క్రొత్త వేందాంతులు బయలుదేరారు. భోగము వాళ్ళు శోభన దేవతలు. వాళ్ళు లేకపోతే యేం పెళ్ళి వెధవ పెళ్ళి. వాళ్ళు వచ్చారంటే యిల్లు కిలకిలలాడుతూవుంటుంది నాలుగురోజులునూ. వాళ్ళు లేకపోతే పెళ్ళి నిద్రపోతూన్నట్టుంటుంది. అందుచేత లేనిపోని భేషజాలను పోక నా మాటవిని భోగము మేళము పెట్టండి.

పార్థ — భోగము మేళము పెడితే వచ్చే నష్టాలు నీకు చెపుతా విను. పెడితే మంచి మేళము పెట్టాలికదా. మంచి మేళము యీలగ్గసరి రోజులలో రెండువందలరూపాయలకు తక్కువ రాదు. ఏలూరు మేళము కావాలనికోరి వేడి మనము పిలిచామంటే వాళ్ళు మరీ చెట్టెక్కి బిఱ్ఱబిగుస్తారు. మేళము లేకపోతే రెండువందలు కలిసొస్తాయిగదా. పైగా నేను చేసిన ప్రతిజ్ఞ నిలుపుకొన్నవాడ నగుదునుకదా. పైగా భోగము మేళాలవల్ల కుఱ్ఱవాళ్ళంతా చెడిపోతారు.

మీనా — అసలు పెళ్ళే చెయ్యకపోతే వెయ్యిరూపాయలు కలిసొస్తాయి. తిరపతిలో చేసికొంటే ఏబదిరూపాయలతో పెళ్ళవుతుంది. తొమ్మిదివందలయేభై కలిసొస్తాయి. మీ ప్రతిజ్ఞమాట కేమిటిలెండి.

భోగము మేళ మాడుతూంటే మీరు వీధిలోనికి వెళ్ళి కూర్చోవచ్చును. భోగము మేళాలవల్ల పిల్లలుపాడగు తారంటే నేనువప్పుకోను. పాడైన వాళ్ళంతా వివాహములలో పాడైనారాయేమిటి? మీ పెళ్ళికి మీనాయనగారు భోగము మేళము పెట్టేరుగదా! మీరుపాడైనారాయేమిటి? మనస్సు నిబ్బరంలేని దౌర్భాగ్యులెప్పుడూ పాడౌతారు.

పార్థ—నీతల్లక్రిందులవాదానికంతం లేదు. నాకునిద్రవస్తూంది. నేనుమాటాడలేను పడుకో.

(మీనాక్షి పార్థసారథి ప్రవేశించుచున్నారు.)

మీనా—నిన్నరాత్రి నిద్రవస్తున్నదని దొంగవేషము వేసి ఆమాట మరపించి పండుకొన్నారు. భోగము మేళముమాట యేమిటో తేల్చండి. పెట్టడమా పెట్టకపోవడమా.

పార్థ—నీకు భోగము మేళముపిచ్చి పట్టుకున్న దేమి. ఈపిచ్చి కేమిమందు లేదా యేమిటి

మీనా—వద్దన్న వెఱ్ఱి మీకు. గావాలన్న వెఱ్ఱినాకు. ఈరెండు వెఱ్ఱులకుగూడ మందులు లేవు.

పార్థ—ఈవిషయములో నీయభిప్రాయముకంటె నాయభిప్రాయముకంటె కుఱ్ఱవాడభిప్రాయము పుచ్చుకోవలసి వుంటుంది. వాడేలాగు చెపితే అలాగు చేదాము.

మీనా—ఊరుపీడ వీరిశెట్టిని కొట్టుకొనిపోయినదన్నట్టు మీరూ నేను పట్లింపులుపట్టుకొని అక్షంతగింజ కుఱ్ఱవాడినెత్తిని వేయడమా! బాగానేయున్నది.

పార్థ—అక్షంతలుగింజ లేయడ మేమిటి! వాడు కావలెనంటె తప్పకుండా పెడతాను. వాడువద్దంటే మానివేస్తాను. ఇది వాడిపెళ్ళి గనుక వాడి కుండవలసిన సరదా. వాడికి సరదా వుంటే తప్పక పెట్టి తీరవలె. సరదా లేకపోతే మానవలెను.

మీనా—వాళ్ళ సరదా జోలి మన కెందుకూ. ఈ కట్నాలు య్యపురాలు లాంచనాలు అన్నీని వాళ్ళ సరదా కేనా యేమిటి ుచ్చుకోవడం మనం ?

పార్థ—వియ్యపురాలు లాంచనాలు కట్నాలునీసరదాకోసం.

మీనా—అలాగయితే బోగము మేళముకూడా నా సరదా ోసమే పెట్టాలి. వాడిమాటెందుకు.

పార్థ—అయినా కట్టువాడిని పిలుస్తానుండు ఓరె అబ్బాయీ ామచంద్రము (అని పిలుచుచున్నాడు.)

(అప్పుడు రామచంద్రుడు ప్రవేశించుచున్నాడు)

రామ—ఏమండి నాన్నగారూ యెందుకు పిలిచారు ?

పార్థ—నీపెళ్ళికి బోగముమేళము గావలెనా వద్దా ? మీ మ్మ కావలెనంటూన్నది, నేను వద్దంటూన్నాను. నీయిష్ట మిటో చెప్పు ?

మీనా—ఒరే! తెలివి తక్కువ మాటలు మాటాడక జాగ్ర త్తగా చెప్పు. వెఱ్ఱి మొఱ్ఱి గబురులు మాటాడకు.

రామ—బోగముమేళమువద్దు గీగము మేళమువద్దు. ఈకాల ంలో బోగముమేళా లెవరుపెడుతున్నారు? మా కాలేజీ పిల్లలలో మధ్య పదిమందికి పెళ్ళయినది. అందులో ఒకరిపెళ్ళికిగూడ ోగము మేళము పెట్టలేదు. నాపెళ్ళికి పాతికమంది స్టూడెంట్లు ందరు ప్రిఫిసర్లు రావలనునుకుంటున్నారు. ఈ డేం నాన్నెన్ను ోగముమేళముంటే వాళ్ళెవరు రారు. బోగము మేళము పెట్టా ంటే నేను పెళ్ళికి రానేరాను. ఎవరికి పెళ్ళిచేస్తారో చేసుకోండి. స్టూడెంట్లందరు నన్ను కాకిని పొడిచినట్లు పొడుస్తారు. ఆ గోలంతా మెవరు పడగలరు? అందుచేత అమ్మ చెప్పినాసరే యెవరు చెప్పినా ంరే మీరు బోగము మేళము పెట్టవద్దు.

మీనా—ఆరి నీ పొగరు పాడిచెయ్య! యెంతవాడవైనావురా. నీ చదువు చట్టుపంష లైనట్లైయున్నది. ఊరఊరనుంచి వచ్చిన నిర్భాగ్యపు వెధవలలో గలిసిపోయి పూర్తిగా పాడైపోయినావు. భోగము మేళము లేనిదే పెళ్ళేమిటిరా నీనెత్తికాయి. ఎవళ్ళో చెప్పారని నీవు మానుతావా. ఈ బుద్ధులు నీకు పుట్టినవి కావు. మీ నాన్నగారు ముందుగా చెప్పి పెట్టారేమో పద్దెనిమిదేళ్ళొచ్చాయి. ఇవ్వటికి జ్ఞానం లేదు. నిన్ను ఎవళ్ళేకూతకుయ్యమంటే ఆ కూత కూస్తావా? కాకపోయినా యీనాటి కుఱ్ఱ వెధవలకు స్వతంత్రా లెక్కువ. కాకపోయినా వాడి నడగడ మేమిటి. మీ కిష్టము లేదన్నమాట వాడికి తెలుసును గనుక మీరు పిలిచి అడగగానే భయముచేత మీమాటే ఆడాడు, మీ రెదట లేకుండా వున్నట్టయితే వాడు కావాలనే చెప్పును.

పార్థ—ఏమిరా అబ్బాయీ నీవు భయపడి చెప్పావా యేమిటి? భయములేదు నీ మనస్సులోనున్న సంగతి నిజం చెప్పు.

రామ—నేను భయపడి చెప్పలేదు. నా బుద్ధిపూర్వకముగానే చెప్పినాను.

మీనా—భయపడకపోతే అలా యెందుకు చెపుతాడూ? కాకపోయినా యీనాటి కుఱ్ఱవెధవలు మైరావణ వెధవలు. వీళ్ళని కింద పెడితే పంటలులేవు పైన పెడితే వానలులేవు. వేలెడున్నాడో లేడో వీడికింతంత బుద్ధు లేమిటి చిన్నప్పటినుంచీ? ఈ మగవాళ్ళే పాడుచేస్తున్నారు కుఱ్ఱవెధవలిని. ఈలాటి అవకతవక పేలాపన ప్రేలినపుడు బుగ్గలు సాగతీసి రెండు మొట్టికాయలు వేసి కూర్చోపెడితే బుద్ధివచ్చును.

పార్థ—నీపక్షము మాటలాడినాడు కాడని కుఱ్ఱవాడినిపట్టుకు తిటకొట్టు వాడికి తోచిన ముక్కేమో వాడు చెప్పాడు. ముందుగా

వెళ్ళి వాడితోను నేను చెప్పలో యేమీ చెప్పలేదుగదా, మన మడుగబట్టి వాడికితోచిన ముక్కేమో వాడు చెప్పాడు.

మీనా — తిట్టడానికి నాకేమిపట్టినది. తండ్రీ కొడుకూ ఒకటైనారు, నామాటంటే మీకెంతలక్ష్యమో వాడికీ అంతేలక్ష్యము. పెద్దవాళ్ళకు లేకపోయిన తరువాత చిన్నవాళ్ళకు వస్తుందా యేమిటి గౌరవము. నన్నుచూస్తే మీ అందరికి ఒకటే దయ. పెద్దవాళ్ళు నా మాట విననేవినరు కుఱ్ఱవెధవైనా వింటాడేమో అంటే వీడికికూడా చేటుకాలము వచ్చినది.

(అని యేడ్చుచు లోపలికిపోవుచున్నది)

పార్థ — శుభకార్యములు బెట్టుకొని కంటనీళ్ళు పెట్టుకుంటావెందుకు రారా వెళ్ళకు.

రామ — ఏడవనియ్యండి కాశ్శేపు పైత్యపునీళ్ళు కారిపోతాయి ఊరుకుంటుంది, భోగముమేళముమాత్రము పెట్టవద్దు. నేను చదువుకుందుకు వెడతాను.

(అని నిష్క్రమించుచున్నాడు)

—౯—

పార్థ — సరే నేను కచ్చేరీకి వెళ్ళుచున్నాను.

(అని నిష్క్రమించుచున్నాడు)

[పార్థసారధిరావుగారు భార్య మీనాక్షమ్మగారు
ప్రవేశించు చున్నారు.]

పార్థ — ఉడుకుబోతుతనమెందుకు; రారా వెళ్ళవద్దు, మాటకు మాట చెప్పవలెగాని బొల్లిబొల్లి యేడ్పులెందుకు (అని చేయిబట్టుకొని లాగుచున్నాడు.)

మీనా — నేనెందుకు? నా యాలోచనెందుకు? నన్ను వెళ్ళనియ్యండి మీ యిష్టమువచ్చినట్లు పిల్లవాడికి పెళ్ళిచేసికొనవచ్చును.

పార్థ—అలా గనకు వచ్చి కూర్చుండు నాకప్రతిష్ట లేకుండా యుండుటకు నీవు కోరినకట్నము వచ్చుటకు మంచి యుపాయము చెపుతాను.

మీనా—కట్నా లక్కఱలేనివారు మీ రుపాయాలు చెపుతారా ? ఆ మాట నేను నమ్మను.

పార్థ—తప్పకుండా చెపుతాను. నా మాట నమ్మి డబ్బు వస్తూంటే నాకుమాత్రము చేదా యేమిటి. పొరబాటుచేత కాగితంలో దస్కతు చేసినానుకదా యని పస్తాయిస్తూన్నానుకాని వీ లయినంత వరకు వియ్యాలవారిదగ్గరనుంచి డబ్బు గుంజవలసినదనే నా యభిప్రాయముకూడాను!

మీనా—ఇది నాలుక చివరమాటా మనసులో మాటా ?

పార్థ—మనసులోమాటే కాని ఆడవాళ్ళనోట్లో నువ్వుగింజ దాగదన్నారు నేనిల్లాగన్నానని యెక్కడా చెప్పవద్దు. చెప్పినావంటే నన్ను కాకులుపొడిచినట్లు పొడుస్తారు. నా తలమీద వెంట్రుకలుండ నియ్యరు.

మీనా—నే నెక్కడా చెప్పనుకాని ఆ యుపాయ మేమిటో త్వరగా చెప్పండి. తెలివితక్కువ వ్రాతలు వ్రాసుకొన్న వాళ్ళందరూ కూడా యిల్లాగే యిరుకున బడిపోయి నానాబాధలు పడుతుంటారు. అడుసు త్రొక్కనేల కాలు కడగనేల ?

పార్థ—తెలివితక్కువ పనులు చేసుకున్నాము కనుకనే పనికి మాలిన ఆడదాని చేతకూడా చీవాట్లు తినవలసి వచ్చింది.

మీనా—నాచీవాట్లు మీరుకాగా భరిస్తూన్నారు ఈమాటల కేమికాని ఆ యుపాయ మేమిటో చెప్పండి.

పార్థ—చెపుతూన్నానువినుతిన్నగా పెళ్ళికి తరలివెళ్ళుదాము విడిదిలో స్నాతకము చేసికొందాము. పెండ్లి రాత్రిగదా స్నాతకము

అయినతరువాత నేను గ్రామములోనున్న పెద్ద మనుష్యులను పిలవ డానికి వెళ్ళినట్లు వెడతాను. ఆ సమయములో నీ వొక్కపని చెయ్యి. రెండువేల రూపాయల కట్నము వియ్యపరాలు లాంచనాలు వెండి పళ్ళెము వెండిచెంబులు పట్టుపంచలు ఇస్తేనేకాని మేముతరలిరామని కబురంపించు. నీవు ముందుగా రెండువేలరూపాయలు సాయంకాల మైదుగంటలలోగానె మావిడిదిలోనికి చేరవలసినదని గట్టిగా కబు రంపు దానితో రూపాయలవర్షము గల్లున కురిసిపోతుంది.

మీనా — సరే బాగానేయున్నది మీరు వచ్చిన తరువాత మీతో చెపితే పెప్పెప్పె మెమ్మెమ్మె యంటారేమొ అంతా అభా సౌతుంది. మీరు మరియొక మాటంటే.

పార్థ—సర్లే వ్యవహారము చెడగొడతానా యేమిటి ఇంతయుపా యము చెప్పినవాడిని? నేనసలు రాత్రి యెనిమిదిగంటలదాకా యిం టికి రానేరాను వచ్చినతరువాత వాళ్ళొకవేళ నాతో చెప్పినా నే నీలా అంటాను "బొత్తిగా పెంకిమనిషి నేను చెప్పినాకాని వినదు ఏలాగో ఒకలాగ సామాను చేయించండి లేకపోతే యిప్పుడు వివా హానికి అడ్డుపస్తుంది. చెపితే వినేమనిషిగాదు వాళ్ళది మోటసామాజి కం" అని యేమేమో అంటాను ఆమాటలుమాత్రము నీవు తప్పు పట్టుకోవద్దు.

మీనా — మీరేమన్నాసరే నా నెత్తిమీదనలుగురు అక్షంతల గింజలు వేసినాసరే నా రెండువేలరూపాయలు నాలాంచనాలూ నా వాళ్ళొప్పడితేసరి ఆతరువాత ఊళ్ళోవాళ్ళు పెళ్ళివాళ్ళు నన్నాడిపోసి కొని కట్టకట్టుకొని గంగలో దిగమనండి.

పార్థ—నీకు పిల్లనిచ్చి నీతోవియ్యమందినందుకు వాళ్ళను గంగలో దిగమంటున్నావూ?

మీనా—నేను వాళ్ళనన్నానా యేమిటి? నన్నాడిపోసికొనే వాళ్ళనందరిని అన్నాను.

పార్థ—ఈయుపాయం నీకు నచ్చినదా లేదా?

మీనా—ఉపాయ మేమిటి చాలా బాగాయున్నదిగాని చివర దాకా మీరు నిలబడతారో నిలబడరోఅని నాకు భయము వేస్తున్నది మీకు చేటు మొగమాటముకూడాను.

పార్థ—ఆలాటి మొగమాటములో పడేవాడినికాను భార మంతా నీమీదే తోసివేస్తానుకాదూ!

మీనా—అయితే భార్యచేతిలో కీలుబొమ్మని మిమ్మల్ని నలుగురు అంటారు.

పార్థ—కొందరు నన్ను కీలుబొమ్మంటారు కొందరు నిన్ను గయ్యాళి గంపంటారు ఎవరేమంటేమి రెండువేలరూపాయలు గల్లున చేతిలో పడతాయా లేదా!

మీనా—సరే యీయుపాయము అసమానమైనది. ఈప్రకారము కానిద్దాము.

(అని యిద్దఱు నిష్క్రమించిరి.)

శ్రీ కొండపల్లి ముద్రాశాల, రాజమండ్రి.